RNI No. APTEL/2003/12253

Reffered Journal & Peer Reviewed Journals

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 22 Issue No. 09 Monthly September 2025 ISSN No. 2456-4702 Rs. : 15/-



భారతరత్న

## డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్

## SPLTO & K.V.R. Jaya Lakshmi Educational Trust
## Dr. Sarvepalli Radhakrishnan National Prathibha Awards, 2025




ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న
డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న డా॥. మరపతి మాంతయ్య.




ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న
డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న డా॥. కె. సోమరాజు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(MONTHLY MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఆగష్టు - 2025** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

*Founder :*
Kolla Sri Krishnarao (Late)

*E-mail :*
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 22 - Issue. 09 - September 2025 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**

**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Former Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.

2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD, Dept. of Telugu
Sri A.S.N.M. Govt. Degree College,
Palakollu, West Godavari Dist., A.P.

7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002, Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# భారతీయ తత్త్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

(జననం : 05 సెప్టెంబర్ 1988 - మరణం : 17 ఏప్రిల్ 1975)

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారతీయ తత్వవేత్త, రాజకీయ రాజనేతజ్ఞుడు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతి. అంతేకాక వారు ఉపాధ్యాయులు. కావున ఉపాధ్యాయుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో అత్యున్నత పదవైన రాష్ట్రపతి పదవిని చేపట్టిన మొదటి ఉపాధ్యాయుడు. కావున వారి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఉపాధ్యాయులందరికీ గర్వకారణం.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ 1888 సెప్టెంబర్ 5వ తారీఖున మద్రాసులో తిరుత్తణి జన్మించాడు. తండ్రి సర్వేపల్లి వీరాస్వామి, తల్లి సీతమ్మ. తండ్రి జమిందార్ వద్ద తహసిల్దార్‌గా పనిచేశారు. సర్వేపల్లి రాధాకృష్ణకు 16వ యేట 1993 మే లో ఆయనకు వెంకాయమ్మతో వివాహం జరిగింది. వారి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ఐదుగురు ఆడపిల్లలు ఒక మగ పిల్లల. పద్మావతి, రుక్మిణి, సుశీల, సుందరి, శకుంతల ఐదుగురు కుమార్తెలు, గోపాల్ అనే కుమారుడు. వీరి మనవడు మనవరాలు ప్రపంచంలో వివిధ దేశాలలో ఉన్నత పదవుల్లో స్థిరపడ్డారు. భారతదేశ మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ రాధాకృష్ణ మేనల్లుడు కావటం విశేషం.

సర్వేపల్లి రాధాకృష్ణ బాల్యం, విద్యాభ్యాసం తిరుత్తణి, తిరుపతిలో జరిగింది. మీరు ఉన్నత విద్యాధికుడు. 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో భారతదేశానికి రెండవ రాయబారిగా పనిచేశాడు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంకి నాలుగవ ఉపకులపతిగా, 1931 నుండి 36 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండో కులపతి గాను పనిచేశారు. వీరు ప్రపంచ తత్వశాస్త్రంలో విశిష్టమైన పండితులలో ఒకరిగా కీర్తించబడ్డాడు. వీరు కలకత్తా విశ్వవిద్యాలయంలో కొంతకాలం పనిచేశారు. 1936 నుండి 1952 ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని స్పాల్టింగ్ చైర్ ఆఫ్ మెంటల్ అండ్ ఈస్టర్న్ రిలీజియన్ అండ్ ఎథిక్స్‌కు తన సేవలు అందించాడు.

భారతీయ తత్వశాస్త్రంలో పాశ్చాత్య తత్యం మేళం పెట్టేసిన ఘనుడు. సర్వేపల్లి రాధాకృష్ణ బాల్యం నుంచి అసాధారణమైన తెలివితేటలు కల విద్యార్థి. సర్వేపల్లి రాధాకృష్ణ 1931 వ సంవత్సరంలో నైట్ హుడ్, 1954లో భారతరత్న, 1963లో బ్రిటిష్ రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ గౌరవ పుస్కారాన్ని పొందాను. ఉపాధ్యాయునిగా ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తారీఖు పుట్టిన రోజు ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని మన దేశ సంప్రదాయం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యారంగానికి తాను చేసిన సేవలకు ప్రతిఫలంగా ప్రపంచంలో అనేక దేశాలు నుంచి గౌరవ పురస్కారాలను అందుకున్నారు. మీరు 1975 ఏప్రిల్ 17వ తేదీ మరణించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారత దేశంలో విద్యారంగానికి వారు చేసిన సేవలకు భారతీయులు రుణపడి ఉంటారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | 'చేదుపాట' - AI అనువాదం - సమర్థత | - ఆచార్య కొలకలూరి మధు జ్యోతి<br>- డా॥. కె. రేవతి | 8 |
| 2. | శ్రీమదాంధ్ర మహాభారతము-శాంతిపర్వంలోని ధర్మసూత్రాలు | - డా॥. యువశ్రీ<br>- డా॥. జి. ఇందిరా ప్రియదర్శిని<br>- డా॥. పి.డి. సెల్వి | 19 |
| 3. | అనువాదం ఆవశ్యకత - స్వరూప స్వభావాలు - రకాలు | - డా॥. డి. జ్యోతి | 23 |
| 4. | తెలంగాణ సంస్కృతికి ప్రతీక - బతుకమ్మ పండుగ | - డా॥. గడ్డం వెంకన్న | 28 |
| 5. | తెలంగాణా జలియన్ వాలాబాగ్ "పరకాల" - చారిత్రక పరిశీలన | - డా॥. ముసుగు శ్రీనివాసరావు | 34 |
| 6. | సినారె గజల్స్‌లో - "తాత్త్వికత" | - డా॥. మామిడి లింగయ్య | 43 |
| 7. | జాతీయోద్యమం - ముస్లిం కవుల, రచయితల సాహిత్యం | - డా॥. కోయి కోటేశ్వరరావు | 46 |
| 8. | కోట్ల వనజాత కథలు - వస్తు సమకాలీనత, స్త్రీ పాత్రల విలక్షణత | - డా॥. జె. నీరజ | 51 |
| 9. | ప్రబంధయుగానంతర తెలుగు సాహిత్యం | - డా॥. మఠపతి మాంతయ్య | 55 |
| 10. | పోతన భాగవతం - ఉపమాలంకార సౌందర్యము | - డా॥. జి. శ్రీనివాసరావు | 60 |
| 11. | భారతీయ సంస్కృతిలో పక్షులు - చారిత్రక వైభవం | - డా॥. ఎన్. అంబర్ సింగ్ | 68 |
| 12. | "నీలి మేఘాలు" పుట్టుక తెలుగు స్త్రీవాద కవిత్వ విప్లవంపై మూల కారణ విశ్లేషణ | - డా॥. కె. ఈశ్వరమ్మ | 74 |
| 13. | స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి - జాషువ బాపూజీ | - డా॥. సి. నర్సింహులు | 80 |
| 14. | జానపద విజ్ఞానంలో అద్భుత కళల ప్రదర్శన | - డా॥. గజ్జెల ప్రమీల | 85 |
| 15. | పాలమూరి ఓల్గా - డిండి నది | - చల్లా మాలతీదేవి | 89 |
| 16. | ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి మాతంగి దివిటి - స్త్రీ దృక్కోణం | - డా॥. బి. తేజోవాణి | 92 |
| 17. | అనువాద సాహిత్యం - సామాజిక చిత్రణ | - డా॥. ఇండ్ల సంధ్య | 95 |
| 18. | ఆచార్య విస్తాలి శంకరరావు 'తడి ఆరని బ్రతుకులు' కథానిక సామాజిక జీవన చిత్రణ | - డా॥. కె. వి. పద్మావతి దేవి | 100 |

| | | |
|---|---|---|
| 19. సినారె సినిమా పాటలు - సామాజిక స్పృహ | - డా॥. సైదులు ఖేతావత్ | 106 |
| 20. దిలావర్ కథల్లో స్త్రీ పాత్రల చిత్రణ | - డా॥. ఎన్. విద్యాప్రవీణ | 109 |
| 21. భారతదేశంలో గురుకులాల విద్య ఆవిర్భావం | - సింగపంగ ప్రభాకర్ | 114 |
| 22. తెలంగాణ భాషా సంస్కృతి విశిష్టత | - అష్రఫ్ జాని షేక్ | 118 |
| 23. గూడ అంజయ్య రాసిన బీరుపూరి కథ సామాజిక విశ్లేషణ | - పి. మృదుల | 124 |
| 24. తిరుపతి కథలు - జలవనరుల పరిచయం | - పి. నాగరాజు<br>- ఆచార్య జర్రా అప్పారావు | 129 |
| 25. తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి కథలు-కుటుంబ జీవన చిత్రణ | - పల్లపు పవన్ కుమార్ | 134 |
| 26. తెలుగు భాషా శాస్త్ర వికాసానికి ఆచార్య నాయని కృష్ణకుమారి సేవలు | - గౌడిపేరు సురేష్<br>- డా॥. ఈశ్వరమ్మ | 139 |
| 27. వాడ్రేవు చినవీరభద్రుడు మొదటి పని గంట వేళ కథలో సామాజిక జీవన చిత్రణ | - కొత్తకోట శ్రీనివాసరావు<br>- డా॥. రమావత్ కుసుమకుమారి | 144 |
| 28. సామాజిక సమస్యలపై సమర శంఖారావం - అలిశెట్టి ప్రభాకర్ | - చీరబోయిన తిరుపతి | 149 |
| 29. దివ్యాంగ స్త్రీల కథలు - చైతన్యం | - పుప్పాల రూపులు<br>- ఆచార్య జర్రా అప్పారావు | 155 |
| 30. మానస బాంధవ్యం - విచ్ఛిన్న వివాహాలు | - రాధమ్మ బురుసు | 160 |
| 31. డి. కె. చదువులబాబు గారి బాలల కథలు - సామాజికత | - యం. శైలజ<br>- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి | 165 |
| 32. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు - స్త్రీ పురుష సంబంధాలు - వర్గ వైరుధ్యాలు | - గోలె పుష్ప | 169 |
| 33. తెలుగు సాహితీ కెరటం సురవరం | - గౌరెడ్డి పవిత్ర | 172 |
| 34. గ్రామదేవతలు - విశిష్టతలు | కె. రంగనాయకులు<br>- ఆచార్య ఎం. రామనాథం నాయుడు | 176 |
| 35. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం - కార్యదర్శుల కృషి | - బి. లింగరాజు | 181 |
| 36. సంఘ సంస్కరణలో వేగుచుక్క వీరేశలింగం | - డా॥. ఎన్. ఎం. తారకేశ్వర్ | 190 |
| 37. Political Ideas of Kautilya | - Govinda Raju K | 194 |

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# 'చేదుపాట' - AI అనువాదం - సమర్థత



- ఆచార్య కొలకలూరి మధు జ్యోతి

(పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం) శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి.

- డా॥. కె. రేవతి

అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంగ్ల అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి.

I. ఆధునిక యుగం సాంకేతికతతో ముందుకు సాగుతూ ఉంది. సాంకేతిక విప్లవంగా AI (కృత్రిమ మేధ) నిలుస్తూ అన్ని రంగాలకు విస్తరించింది. AI లో భాగమే Machine Translation(MT). నేడు యంత్ర అనువాదం చాలా సమర్థవంతంగా ఉంటూ ప్రపంచ మారుమూల ప్రాంతాల వరకు ఏ విషయమైనా చేరటానికి దోహదం అవుతూ ఉంది. వ్యాపారరంగం, విద్యారంగం విషయాల అనువాదం బాగా జరుగుతూ ఉంది. కాని సాహిత్య అనువాదాల విషయానికి వచ్చినప్పుడు కృత్రిమ మేధ పరిధి పెరగవలసిన అవసరం ఎంతో ఉంది అన్నది స్పష్టం. కొంతమేర యంత్రానువాదం బాగానే ఉంది అనిపించినా ఇంకా ఎంతో మెరుగుపడవలసిన అవసరం ఉంది.

'చేదుపాట' శ్రీ శ్రీ రాసిన కవిత్వం. మహాప్రస్థానం లోనిది. ఇది లయాత్మకంగా, Rhetoric శైలితో ఉన్న కవిత. అభ్యుదయ కవి మార్క్స్ సిద్ధాంతాలు ఇచ్చిన చైతన్యంతో రాసిన కవిత. వచన కవిత. తెలుగులో వచన కవిత ఒక ఉద్యమంగా తలెత్తి కవిత్వ మార్గాన్ని నిర్ణయించింది. తెలుగులో కవిత్వం వచనంగా అనుభూతి గాఢంగా అభివ్యక్తి సాంద్రంగా ఉండటం పరిపాటి. 'లయాత్మకమైన ఛందస్సూ శబ్దాలంకారం, ఉన్నా లేకున్నా కవిత్వానికి భావంలయ తప్పనిసరిగా ఉండాలి. లేకుంటే కవిత్వానికీ, వచనానికీ తేడా తెలియదు. కవిత్వంలో సముచిత సంక్షిప్తతా, అర్థసాంద్రతా ఉండాలి కాని, అసంక్షిప్తతా, అస్పష్టతా అదనంగా సమకూడి బరువు కాకూడదు. శబ్దాలంకారమూ అంతే. భావోచితమైన అంత్యానుప్రాస నిర్ణయాత్మక భావస్ఫూర్తిని కలిగిస్తుంది. పద చిత్రాలు, భావ చిత్రాలు, ప్రతీకల సంవిధానం ఆలోచనాత్మకంగా ఉంటుంది. కానీ వీటిని తగు మాత్రంగా ఉపయోగించి భావాన్ని ప్రతీతం చేయాల్సి ఉంటుంది. ముమ్మరంగా ప్రయోగించి అస్పష్టతకు తావివ్వకూడదు. వచన కవితకి ఇవి లక్షణాలు అని నిర్దిష్టంగా ఏవీ లేవు ఉండవు. కారణం కవి కవికీ, కవిత కవితకీ ఇవి మారుతూ ఉండటమే. కానీ ఆంగ్లంలో కొన్ని నిర్దేశనాలు ఉన్నాయి.

## II. కవితాత్మక సౌందర్యం :

కవి తన భావాన్ని వ్యక్తం చేయటంలో, అనుసరించే మార్గాలలో కవిత్వ సౌందర్యం ఉంటుంది. అందులో ఒకటి శ్లేష. దానిని ఆంగ్లంలో 'అల్లోగరీ' అంటారు.

### Allegory :

ఇది ద్వంద్వార్థ రచన. కనిపించని ఆలోచనలను భావాలను వ్యక్తం చేయటంగా చెప్తారు. కొంత అధిక్షేప ధోరణి ఉంటుంది. తెలుగులోని శ్లేషకు దగ్గరగా ఉంది. దీనిని తెలుగులో కవిత్వ పంక్తుల లయబద్ధమైన

నిర్మాణంగా పేర్కొనవచ్చు. ఒక లయను ఇస్తుంది. నిర్దిష్ట రూపాన్ని ఇస్తుంది. కవి హృదయాన్ని తెలియజేస్తుంది. శ్లేషలో భిన్నార్థ స్ఫురణలో ఉంటుంది.

| | |
|---|---|
| 'ఔను నిజం ఔను నిజం | 'Yes it is true Yes it is true |
| ఔను నిజం నీవన్నది | Yes it is true Yours is |
| నీవన్నది నీవన్నది | Yours is Yours is |
| నీవన్నది నిజం నిజం' | Yours is true true' |

అన్న మొదటి చరణం నిజాన్ని నొక్కి చెబుతూ ఉంది. ఇందులో ఉన్న 'నీవన్నది' అనే పదం 'నీవు అన్నది' అనే పదాల కలయిక. ఇక్కడ ధ్వని ఉంది. నీవు చెప్పున్నది అనీ, నీ (ఒకడు ఉన్నావు) అస్తిత్వం అన్న విషయం అనే రెండర్థాల ధ్వని ఉంది. ఈ వ్యంగ్యం ఆంగ్లంలోనికి యంత్రానువాదం ద్వారా రాలేకపోయింది.

'Yes it is true Yes it is true
Yes it is true Yours is
Yours is Yours is
Yours is true true'. 'నీవన్నది నిజం' అనే పదం నాలుగు సార్లు ఉపయుక్తమయితే 'yours is' అనే పదం అన్నిసార్లూ అనువాదం అయింది. కాని, కవితాత్మక వ్యక్తీకరణలోని సౌందర్యాన్ని యంత్రానువాదం పొందలేక పోయింది.

'మనమంతా బానిసలం
గానుగులం పీనుగులం!'

'we are all slaves
we are slaves
we are slaves
we are slaves'

ప్రతి చోటా ఇలా భావాన్ని తనకు తెలిసిన పద జాలంతో అనువాదం చేసింది యంత్రం. మొదటి పాదానికి MT సరిపోతుంది. రెండో పాదానికి అదే అనువాదం సబబు కాదు. 'We are slaves' అదనంగా రెండుసార్లు వచ్చింది. పాద నియతి పాటించలేదు. ఈ క్రమంలో శ్రమ దోపిడీకి నిదర్శనంగా వాడిన 'గానుగులం పీనుగులం' పదాలకు సమాంతర పదజాలం ఆ యంత్రపు dataలో లేకపోవడం వల్ల అనువాదం సంపూర్ణ భావాన్ని అందించలేకపోయింది.

'వెనుక దగా, ముందు దగా!
కుడియెడమల దగా!' అనే పాదాలు

'we are behind we are in front
we are right and left we are wrong'

అన్న వాక్యాలుగా అనువాదం అయ్యాయి. జరిగిన అనువాదంలో 'దగా' ఒక్కసారి మాత్రమే ఉంది. అది కూడా 'wrong' అని అనువాదం అయింది. కవితలోనిమోసం అనే భావం యంత్రానువాదం అందు కోలేకపోయింది.

'బతుకు ఛాయ చదువు మాయ
కవిత కరక్కాయ సుమీ' అనే వాక్యాలు

'life is a shadow education is illusion
poetry is a bitter poison'గా అనువాదం అయ్యాయి. మొదటి వాక్యం కొంత అంగీకారయోగ్యంగా ఉన్నా రెండో వాక్యం పూర్తిగా విభిన్నార్థ బోధకమయ్యింది. కవితలో లేనిది అనువాదంలో- 'poison'-వచ్చి చేరింది. కరక్కాయ చేదుగా ఉండదు. కొంత వగరుగా ఉంటుంది. ఆ పదానికి 'bitter, poison' రెంటిని కలిపి Machine Translation ఇచ్చింది. ఈ ప్రాంతాలలో దొరికే ఒక వైద్య సంబంధమైన కాయ ఇది.

'లేదు సుఖం లేదు రసం
చేదు విషం జీవఫలం
జీవఫలం చేదు విషం
చేదు విషం చేదు విషం' అనే కవితా భాగం

'No happiness, no juice
The fruit of life is bitter poison
The fruit of life is bitter poison
Bitter poison bitter poison' గా యంత్రానువాదం జరిగింది.

జీవితంలో 'లేదు రసం'. అంటే రస హీనంగా నవరస హీనంగా భావోద్వేగాలకు అతీతంగా ఉండటం. అనువాదంలో అది 'no juice' గా నిల్చింది. చేదుమయంగా మిగిలింది జీవితం, జీవితపు ఫలమంతా చేదు విషయమే. ఈ రెండూ వాక్యాలు రెండు విభిన్న భావాల లోతులు.

ఈ వైవిధ్యం అనువాదంలో చోటు చేసుకోలేక పోయింది. ఇలా మూల కవితలోని భావనాత్మక సౌందర్యం Machine Translation ద్వారా రాలేక పోయింది,

III. 'చేదుపాట' కవిత చాలా లయాత్మకంగా సరళంగా సాగిపోతూ, లోతైన సమాజ వాస్తవ స్థితిని చిత్రించింది. ఈ క్రమంలో శ్రీశ్రీ ఎన్నో అలంకారాలను ప్రయోగించాడు. అర్థాలంకారాలు శబ్దాలంకారాలు ఉన్నాయి. అలంకారిక భాష figurative language బాగా వినియోగింపబడింది.

**a. అర్థాలంకారాలు :**

కొన్ని అర్థాలంకారాలు శ్రీశ్రీ ప్రయోగించాడు. ఆంగ్లంలో అవి నిలవటం యంత్రానువాద ప్రతీకలే.

**1. Metaphor (రూపకాలంకారం) :**

Metaphor is a direct comparison, when two unlike objects are compared by without the use of 'like' or 'as'. Unlike simile, in metaphors comparisons are made without showing any difference. 'చేదు పాట' పేరులోనే ఈ అలంకారాన్ని ఇమిడ్చాడు కవి. ఉపమాన ఉపమేయాలకు అభేదాన్ని తెల్పడమే రూపకాలంకారం. చేదు పాటలో పాట ఉప మేయము చేదు ఉపమానం. ఈ రెండింటికి అభేద కల్పన చేస్తూ 'చేదుపాట' నిలిచింది. 'కవిత కరక్కాయ' (ఇటు వంటి ప్రయోగమే). ఇది అనువాదంలో 'Bitter song' అయింది. Metaphor సరిపోయింది. కాని 'కవిత కరక్కాయ సుMT »Poetry is bitter poison' గా అనువాదం అయ్యింది. సముచితంగా రూపు దాల్చలేదు. తెలుగు భాషాలంకార సౌందర్యం పాక్షికంగా మాత్రమే మీ సాధించింది.

**2. Simile (ఉపమాలంకారం):**

Simile is more prominently using literary figure in the literature chiefly in the poetry. A direct comparison of unlike objects using the words 'like' or 'as'.

ఉపమానానికి ఉపమేయానికి సామ్యమైన సాదృశ్యం ఉంటే అది ఉపమాలంకారం. దానిని ఆంగ్లంలో simile అంటారు.

'మనదీ ఒక బ్రదుకేనా?
కుక్కల వలె నక్కల వలె!
మనదీ ఒక బ్రదుకేనా?
సందులలో పందుల వలె!' ఇది

'Do we also have one life?
Like dogs, like jackals
Do we also have one life
Like pigs in alleysµ .

ఇందులో బ్రతుకును కుక్కలతో నక్కలతో సందుల్లో పందులతో కవి పోలుస్తున్నాడు. MTలో భావానువాదం సంతృప్తికరం కాకపోయినా Simileని అందుకొంది. 'Like dogs Like jackels and Like pigs in alleys' అని అనువాదం అయ్యింది. ఇది అంగీకారయుక్తంగా ఉంది.

**3. Hyperbole (అతిశయోక్తి) :**

కవితలో అతిశయోక్తి అలంకారాన్ని కవి ఎక్కడా ప్రయోగించలేదు. కానీ యంత్ర అనువాదంలో అది కనిపిస్తుంది. 'కవిత ఒక కరక్కాయ' అనే వాక్యం 'poetry is a bitter poison' అని అనువాదం అయింది. కరక్కాయ పదానికి యంత్రానువాదం 'bitter poison' అని రెండు పదాలు వాడింది. చేదు పాటను bitter song అని అనువాదం చేసిన యంత్రం కరక్కాయను 'bitter poison' అని అనువాదం చేసింది. 'bitter'నే కాక అధికంగా 'poison' అనే పదాన్నీ వాడింది.

ఉన్నదానికంటే అధికంగా వర్ణించడమే ఇది. అతిశయోక్తి Hyperbole అంటే exaggeration for emphasis. ఇక్కడ అదే జరిగింది.

**B. శబ్దాలంకారాలు :**

అక్షర విన్యాసంతో ఉండేవి శబ్ద ప్రాధాన్యంతో నిలిచేవి శబ్దాలంకారాలు. వీటిలో వర్ణాలు పదాలు వెంట వెంటనే ప్రయోగించటం జరుగుతుంది. ఇవి ఆహ్లాదాన్ని అందాన్ని ఆనందాన్ని ఇస్తాయి.

**1. వృత్యానుప్రాస అలంకారం :**

తెలుగులో మొదటి నాలుగు వాక్యాలు 'ఔను నిజం

ఔను నిజం/ అవును నిజం నీవన్నది/ నీవన్నది నీవన్నది/ నీవు అన్నది నిజం నిజం' ఇందులో వృత్యానుప్రాస అలంకారం ఉంది. ఔను నిజం నీవన్నది పదేపదే ఆవృత్తం అయ్యాయి. ఒక హల్లుగానీ అంతకంటే ఎక్కువ హల్లులు గాని ఆవృత్తమైతే అక్కడ వృత్యానుప్రాస సౌందర్యం ప్రదర్శితం. ఈ సౌందర్యం ఆంగ్లంలో అను వాదం కాలేకపోయింది.

**2. ముక్తపదగ్రస్తాలంకారం :**

ముక్తపదగ్రస్తాలంకారం ఉంది. రెండవ పాదం చివర 'నీవన్నది' ఉంది. దానిని స్వీకరించి మూడో పాదం ఆరంభం అయ్యింది. అలాగే 'చేదు విషం జీవఫలం/ జీవఫలం చేదు విషం'లోనూ ఉంది. ఆంగ్లానువాదంలో 'Yes yours is'తో రెండో వాక్యం ముగిసింది. తిరిగి మూడో వాక్యం దానితో ఆరంభం అయింది. అలాగే మూడవ వాక్యం 'bitter poison'తో ముగిసి నాలుగో వాక్యం ఆరంభం అయింది. దీనికి ఆంగ్లంలో ప్రత్యేక గుర్తింపు లేకపోయినా తెలుగు అలంకార సంప్రదాయం, ఆంగ్లంలో యంత్రానువాదం ద్వారా చేరింది.

3. అంత్యనుప్రాసాలంకారంలో, ఒక పదం లేదా వాక్యం చివర ప్రాసను కొనసాగించటాన్ని అంత్యను ప్రాసాలంకారం అంటారు.

'Life is in vain, education is in vain
poetry is in vain, waste waste'

'వెనుక దగా ముందు <u>దగా</u>
కుడి యెడమల <u>దగా</u>'

'we are behind, we are infront
we are right and left we are wrong'

'నిజం సుమీ నిజం <u>సుమీ</u>
నీవన్నది నిజం <u>సుమీ</u>'

'You are the truth you are the <u>truth</u>
you are the <u>truth</u>'

'జీవ ఫలం <u>చేదు విషం</u>
చేదు విషం <u>చేదు విషం</u>'

'The fruit of life is <u>bitter poison</u>
Bitter poison, <u>bitter poison</u>'

ఈ తెలుగు పదాల అంత్యానుప్రాస సౌందర్యం రెండు సందర్భాల్లో తప్ప అనువాదంలోకి రాలేదు. కవిత్వార్థం భావం సౌందర్యం ఏది యంత్రానువాదంలో - ఆంగ్లంలో - నికి తరుజమా కాలేదు.

**4. ఇతరాలు :**

తెలుగు అలంకారాలుగా కాకపోయినా ఆంగ్ల సాహిత్య సంప్రదాయాలు అనువాదంలో చోటుచేసుకొన్నాయి.

**1. Parallelism (వాక్య నిర్మాణ పునరుక్తి) :**

The use of symmetrical repetition of similar grammatical structures is parallelism. It can be used within a sentence or passage to create either an effect or a more telling comparison. It is often used for emphasis or to draw connection between the objects. శ్రీశ్రీ కవితలో వాక్యాల పునరుక్తులు ఉన్నాయి. 'ఔను నీవు అన్నది నిజం (2,26) నీవన్నది నీవన్నది (3,27) నిజం నిజం (4,28) మనదీ ఒక బ్రతుకేనా (13,15) ఇలా ఉపయోగించినవే. యంత్రాను వాదంలో - ఆంగ్లంలో వీటిని కొంత సమాంతర వ్యక్తీ కరణంగా చెప్పవచ్చు. ఇది పునరుక్తి సౌందర్య ద్యోతకంగా ఉంది. కొంత మార్పు ఉన్నా పునరుక్తి ఆంగ్లానుదంలో కూడా గుర్తించవచ్చు. తెలుగులో కనిపిస్తున్న వాక్య పునరుక్తి యంత్రానువాదంలో 4,28లో మాత్రమే కనిపిస్తూ ఉంది. కొన్నిచోట్ల పాద నియతి కూడా లోపించింది.

**2. Alliteration (అనుకరణ) :**

Alliteration is repetition of similar sounds at the beginning of the words or phrases.Alliteration is the organising device of the verse line.each line is divided in two half-lines of two stresses by a decisive pause, or caesura and atleast one, and usually both, of the two stressed words in the first half line alliterates with the first stressed word of the half line. శబ్దానుకరణ తీరుతో ఉన్న పునరుక్తిని alliteration అంటారు.

కవితలోని

'ఔను నిజం ఔను నిజం'

'yes it true yes its true' పునరుక్తి అయిన సమాన పదాలు.

'లేదు సుఖం లేదు సుఖం
లేదు సుఖం జగత్తులో'

'no happiness, no happiness
no happinees in the world' తెలుగు కవితతో కొంత సారూప్యత యంత్రానువాదంలో కనిపిస్తూ ఉంది. ఇది అనుకరణ తీరులో శబ్ద సౌందర్యం ఆంగ్లంలో కూడా ఉండటం యంత్రానువాద ప్రయత్న సామర్థ్యమే.

**3. consonance (అనుగుణ్యత) :**

Consonance is repetition of consonantal sounds or letters in the words or sentences. It is an introduction and expressing the strongly declaration about something. పునరావృత్తమయ్యే హల్లులు. వాక్యం చివర ముఖ్యంగా వాక్యాలలోని చివరి పదాల హల్లుల పునరుక్తిని consonance అంటారు. ఒక విషయాన్ని కవి ఆంతర్యాన్ని బలంగా వ్యక్తం చేయడానికి ఇది ఉపయుక్తం అవుతుంది.'నీవన్నది నీవన్నది'/ నీవన్నది నిజం నిజం' యంత్రానువాదంలో 'yours is yours is yours is true, true'. 'నీవన్నది'లోని వ్యంగ్యతను/ శ్లేషను అలా ఉంచితే అనువాదం అయినది అంత అర్థవంతంగా లేదు. నీవన్నది అంటే 'what you said's అని ఒక అర్థం. కానీ యంత్రానువాదం 'yours is' అని అనువాదాన్ని అందించింది.

'లేదు సుఖం లేదు సుఖం
'no happiness, no happiness'
లేదు సుఖం జగత్తులో'
'no happinees in the world'
'జీవఫలం చేదు విషం'
'The fruit of life is bitter poison
'చేదు విషం చేదు విషం'
'bitter poison bitter poison'

చేదు విషం చేదు విషం 'Bitter poison bitter poison' ఇక్కడ మూల కవితలో అనువాద కవితలో రెండింటిలో పద పునరావృత్తి గుర్తించవచ్చు. అర్థాన్ని యంత్రానువాదం అందుకోలేదు.

**4. Rhyme scheme and Rhyming (ప్రాసక్రమం):**

Rhyme is repeated sounds that ends the final syllables of words. In poetry(ST) these repeated sounds occur in two ways. When the sounds end at the end of the lines is called end rhyme. Where sounds ends within lines, is called internal rhyme. ఇది శబ్ద సౌందర్యం. పాదంలోని చివర వర్ణం లేదా అక్షర పునరుక్తిని Rhyme అంటారు. వచన కవిత్వంలో ఏ కవితా సాధారణంగా ఒకే ప్రాసకు లొంగి ఉండదు. కవిని బట్టి, కవితా సందర్భాన్ని బట్టి, కవి మానసిక స్థితిని బట్టి, కవితని ఎంచుకున్న వస్తువును బట్టి ప్రాస ఉంటుంది. వాక్యం/ పాదం చివర గాని చరణాంతంలో కాని ప్రాస ఉంటుంది. వాక్యానికి చరణానికి కూడా ఉండవచ్చు. ఆంగ్లంలో దీనిని గుర్తించడానికి ఓ పద్ధతి ఉంది. AB AB rhyme scheme. తెలుగుకు వర్తింపజేసిన rhyme schemeకి ఆంగ్లానువాదానికి భేదం ఉంది. ప్రాస సౌందర్యం ఆంగ్లంలోకి యంత్రానువాదం వల్ల విభిన్నంగా రూపుదిద్దుకొంది.

| | |
|---|---|
| 'ఔను నిజం | 'Yes it is true |
| ఔను నిజం | Yes it is true |
| ఔను నిజం నీవన్నది | Yes it is true Yours is |
| నీవన్నది నీవన్నది | Yours is Yours is |
| నీవన్నది నిజం నిజం' | Yours is true true' |
| లేదు సుఖం, | No happiness, |
| లేదు సుఖం, | no happiness, |
| లేదు సుఖం జగత్తులో! | No happiness<br>in the world! |
| బ్రతుకు వృథా, | Life is in vain, |
| చదువు వృథా, | study is invain, |
| కవిత వృథా! వృథా,వృథా! | Poetry is in vain!<br>Waste,waste!' |
| ఔను నిజం,ఔను సుమా! | 'Yes, it is true,<br>yes, Suma! |
| ఔను నిజం నీవన్నది! | Yes, it is true,<br>it is yours! |

నీవన్నది, నీవన్నది, Yours, yours, నీవన్నది నిజం, నిజం! Yours is true, true!’

**Target TextRhyme**

| Target Text | Schme | Source Text (ST) | Rhyme Scheme |
|---|---|---|---|
| 1. ఔను నిజం ఔను నిజం | A | Yes it is true Yes it is true | A |
| 2. ఔను నిజం నీవన్నది | B | Yes it is true Yours is | B |
| 3. నీవన్నది నీవన్నది | B | Yours is Yours is | C |
| 4. నీవన్నది నిజం నిజం! | A | Yours is true true! | D |
| 5. లేదు సుఖం, లేదు సుఖం | A | No happiness, no happiness | A |
| 6. లేదు సుఖం జగత్తులో! | C | No happiness in the world! | D |
| 7. బ్రతుకు వృథా,చదువు వృథా | D | Life is in vain, study is invai | E |
| 8. కవిత వృథా! వృథా, వృథా! | D | Poetry is in vain! Waste, waste! | F |
| 9. మనమంతా బానిసలం | A | we are all slaves | A |
| 10. గానుగులం పీనుగులం! | A | We are slaves, we are slaves! | A |
| 11. ‘వెనుక దగా, ముందు దగా | D | We are behind, we are in front, | F |
| 12. కుడియెడమల దగా!’ | D | We are right and left,we are wrong! | G |
| 13. ‘మనదీ ఒక బ్రదుకేనా? | D | Do we also have one life? | H |
| 14. కుక్కల వలె నక్కల వలె! | E | Like dogs, like jackals! | A |
| 15. మనదీ ఒక బ్రదుకేనా! | D | Do we also have one life! | H |
| 16. సందులలో పందుల వలె!’ | E | Like pigs in alleys! | A |
| 17. నిజం సుమీ నిజం సుమీ! | F | You are the truth, you are the truth! | I |
| 18. నీవన్నది నిజం సుమీ! | F | You are the truth! | I |
| 19. బ్రతుకు ఛాయ, చదువు మాయ | G | Life is a shadow, study is an illusion, | E |
| 20. కవిత కరక్కాయ సుమీ! | F | Poetry is a bitter poison | E |
| 21. లేదు సుఖం, లేదు రసం | A | No happiness, no juice, | A |
| 22. చేదు విషం జీవఫలం! | A | The fruit of life is bitter poison! | E |
| 23. జీవఫలం చేదు విషం, | A | The fruit of life is bitter poison | E |
| 24. చేదు విషం, చేదు విషం! | A | Bitter poison, bitter poison | E |
| 25. ఔను నిజం, ఔను సుమా! | D | Yes, it is true, yes, Suma! | J |
| 26. ఔను నిజం నీవన్నది! | B | Yes, it is true, it is yours! | A |
| 27. నీవన్నది, నీవన్నది | B | Yours, yours | A |
| 28. నీవన్నది నిజం, నిజం! | A | Yours is true, true! | C |

మొదటి చరణం ఏడవ చరణంలో 2,3 తిరిగి 26,27 పాదాలకు ప్రాస మూలంలో ఉంది.

7,8 పాదాలు ప్రాస యుక్తకంగా ఉండగా ఆంగ్లంలో అది మారింది.

9,10 పాదాలు ఒక విధమైన ప్రాసతో ఉండగా 11, 12 మరో విధమైన ప్రాసతో ఉన్నాయి. తెలుగు కవితలో ఉంటే ఆంగ్ల అనువాదంలో అది చేరలేక పోయింది.

13, 15 పాదాలు తెలుగు ఆంగ్ల రూపాలలో Rhymingతో ఉంది.

13, 15; 14, 16 భిన్న ప్రాసలతో తెలుగులో ఆంగ్లంలో ఉన్నాయి.

తెలుగులో 17, 20 పాదాల చివరి ఉన్న ప్రాస, ఆంగ్లంలోనికి అనువాదం కాలేదు.

అనుస్వారయుక్తంగా -21,22,23,24- నాలుగు పాదాలు ఉండగా, ఆంగ్లంలో అనువాదంలో అది సాధ్యం కాలేదు.

రూపరీత్యా కొంత మార్పు ఉన్నా, తెలుగు కవిత ఆంగ్లానువాదాలు రెండూ Rhyme schemeని కలిగి ఉన్నాయి.

**5. Meter : (పద్య లయ/ పద్య పంక్తుల లయ/ ఛందస్సు) :**

Meter is a recurrence of a prominent feature in the sequence of speech sounds of a language. It refers to arrangement of speech sounds in a verse line. మాట్లాడే భాషలో ఒక లయ ఉంటుంది దానినే నియమబద్ధ చేస్తే అది మీటర్ లేదా ఛందస్సు. చేదు పాట (bitter song) చతుష్పది (quantrain). 7 చరణాలు (stanza) ల కవిత. పాద నియతి పాటించ కుండా మారింది. మొత్తం 28 పాదాలతో కూడినది. ఇది యంత్రానువాదంలో చతుష్పాదాలుగా, షట్పదాలుగా రూపం సంతరించుకొంది. మూలాన్ని యథాతథ రూపంగా ఉంచకుండా అనువాద రూపం మారింది.

**6. Oxymoron :**

Oxymoron is a literary devise which used as descriptive phrase that combines two opposite or contradictory terms to creates a totally fresh image or ideas to readers. Oxymoron can be used side by side by giving a pause.Oxymoron అంటే విరుద్ధమైన లేదా అసంగతమైన పదాల కలయిక. వ్యతిరేకార్థాలతో కూడిన పదబంధాలను oxymoron అంటారు. మూడో చరణంలో 'వెనుకదగా ముందు దగా/ కుడియెడమల దగా దగా' ఈ పదాలలో కుడి ఎడమ వ్యతిరేక పదాలు ఒకచోట వాడటాన, ఇది oxymoron. యంత్రానువాదంలో అది వెంట వెంటనే రాలేదు. we are right and left అన్నచోట right left అని వెంట వెంటనే అనువాదం జరగలేదు.

**7. Anaphora (పద లేదా పదబంధ ఆవృత్తి) :**

Anaphora is a repetition of a word or a phrase at the beginning of a series of stanzas. Usually, it creates a rhythmic effect. పునరావృత్తం లేదా పద లేదా పదబంధ పునరుక్తిని అనఫోర అంటారు. ఇది శ్రీశ్రీలో అధికం.

**Stanza 1**

| | |
|---|---|
| ఔనునిజం, ఔనునిజం, | Yes, it is true, yes, |
| ఔనునిజం, నీవన్నది, | it is true, yours is, |
| నీవన్నది, నీవన్నది, | yours is, yours is, |
| నీవన్నదినిజం, నిజం! | yours is,true,true! |

**Stanza 2**

| | |
|---|---|
| లేదు సుఖం, | No happiness, |
| లేదు సుఖం, | no happiness, |
| లేదు సుఖం జగత్తులో! | No happiness |
| | in the world! |
| బ్రతుకు వృథా, | Life is in vain, |
| చదువు వృథా, | study is invain, |
| కవిత వృథా! వృథా, | poetry is in vain! |
| వృథా! | Waste,waste! |

**Stanza 7**

| | |
|---|---|
| ఔను నిజం, | Yes, it is true, |
| ఔను సుమా! | yes, Suma! |
| ఔను నిజం నీవన్నది! | Yes, it is true, it is yours! |
| నీవన్నది, నీవన్నది, | Yours, yours, |
| నీవన్నది నిజం, నిజం! | Yours is true, true! |

ఈ కవితలోని నిరాశమయ (gloomy tone) కంఠ స్వరం కవి ఆంతర్యాన్ని వ్యక్తం చేస్తుంది. రెండో చరణం లోని వృధా ఐదుసార్లు పేర్కొన్నాడు కవి. ఆంగ్లంలో అది in vain అని మూడు సార్లు waste అని రెండు సార్లు రెండు రకాలుగా అనువాదం అయింది.

**8. Symbols (ప్రతీకలు) :**

Symbols are another literary figure which are used to get perspective of a person, object, or an action and they stand for something else. Usually, symbols are used to give an abstract idea. Moreover, it represents or evokes something else, particularly a concrete object meant to represent an intangible idea ప్రతీకలు కవిత్వ భావాన్ని పాఠకుడి మనసుపై ముద్రిస్తాయి. 'మనమంతా బానిసలం/ గానుగులం పినుగులం' ఇందులో ఉన్నవి అన్నీ ప్రతీకలు. మనిషి ఎలా శ్రమిస్తున్నాడో ఎంత శ్రమకు గురి చేస్తున్నారో చెప్పే పాదాలు. యంత్రానువాదంలో 'we are all slaves/ we are all slaves/ we are all slaves/ we are all slaves' అని ఉంది. తెలుగు భాషలోని ప్రతీకలు ఆంగ్లంలో వ్యక్తం కాలేదు. ప్రతీకత్వాన్ని యంత్రం అనువాదంలో అందుకోలేదు. పైగా we are all slaves అనే పాదం అదనంగా వచ్చి నిలిచింది.

**9. Imagery (భావచిత్రం) :**

Imagery is another descriptive or figurative language in literature. A picture or sensory impression creates by a poet's adept choice of words. When we read those words in the poetry, we get a picture pertaining to that word.Henceit gives an attempt to evoke mental image by appealing to the reader's senses of smell, sight, sound, taste and texture. కవితలోని పాదాలు పాఠకుడికి శ్రోతకు ఒక చిత్రాన్ని ఒక రూపాన్ని అందిస్తాయి. భావ చిత్రాలు కవితల ఆంతర్యాన్ని అందుకొని ఆనందించేలా ఆలోచించేలా చేస్తాయి. కవి చిత్రణ పంచేంద్రియాలలో ఒక్క దానికైన అనుభూతిని అందించాలి. ఆ స్పందనే కవికి కవితకి గుర్తింపు. 'బానిసలం గానుగులం పీనుగులం/ కుక్కల వలె నక్కలవలె సందులలో పందులవలె' అనే పదజాలం కవి ఉద్దేశాన్ని రూపు కట్టిస్తూ ఉంది. 'బానిసలం గానుగులం పీనుగులం' అనే పదాలకు గాను 'we are all slaves' అన్న వాక్యం నాలుగు సార్లు అనువాదం అయ్యింది, ఈ యంత్రానువాదం తెలుగు కవితలోని భావాన్ని కవి ఆంతర్యాన్ని అందివ్వలేకపోయింది. కానీ, 'కుక్కల వలె నక్కలవలె సందులలో పందుల వలె' అన్నదానికి 'like dogs like jackles like pigs in the alley' సమర్థనీయ అనువాదంగా నిలిచింది.

**10. Sarcasm (వ్యంగ్యోక్తి) :**

It is the use of invectives or harsh terms to indicate weakness or fault of something or somebody. It can be critical and cynical and sometimes may be displayed by a different action as well as by words. In the present poem the tone of the poet is sarcasm. దీనినే వ్యంగ్యోక్తి లేదా పరుషోక్తిగా చెప్పవచ్చు కవితా శీర్షికే వ్యంగ్యతను, పరుషతను సూచిస్తూ ఉంది. పాట చేదుగా ఉండటం. జీవిత పాట అది. మీలో 'bitter song' గా అయింది.

'మనదీ ఒక బ్రదుకేనా!' ఆ బ్రతుకు కుక్కల్లా నక్కల్లా సందుల్లో పందుల్లా ఉంది. సంపూర్ణ భావద్యోతక అనువాదానికి రాలేదు

'Do we also have one life
like dogs like jackals
Do we also have one life
like pigs, in the alleys'

అనే యంత్రానువాద రూపంలో పరుషోక్తి లోపించింది. భావమూ మారిపోయింది. మనదీ ఒక బ్రదుకేనా?

అన్నదానికి 'Do we also have one life?' సంపూర్ణ భావద్యోతకంగా అనువాదం కాలేదు.

**Interjections (ఆశ్చర్యార్థకాలు) :**

An interjections is a word or phrase used to express a sudden or strong emotion. ఇవి తెలుగులో ఆశ్చర్యార్థకాలు రకరకాల భావాలు భావోద్వే గాలు తెలపటానికి వాడుతారు. వాటి తర్వాత ఆశ్చర్యా ర్థక(!) గుర్తు వాడటమూ పరిపాటి. యంత్రానువాదంలో ఆశ్చర్యార్థక గుర్తును 17,18 లలో వాడినా పదాన్ని అనువదించలేదు.

'నిజం సుమీ నిజం సుమీ (17)
నీవన్నది నిజం సుమీ'(18)

'You are the truths you are the truths
You are the truth'

25 వ పాదంలో 'సుమా!' అనువాదంలో లిప్యంతరీ కరణం పొంది 'suma' గా నిల్చింది.

'ఔను ఔను సుమా'(25) 'Yes, it is true, yes suma'

'సుమా సుమీ'లు తెలుగులో స్నేహపూర్వక వ్యక్తీ కరణగా విషయ నివేదన తీరుగా చెప్తున్నా దాని పట్ల ఒక ఒప్పుదల అంగీకారం ఒత్తి చెప్పడం వంటివి కూడుకొని ఉంటాయి, వ్యక్తీకరిస్తాయి. ఆంగ్లంలోనికి యంత్రాను వాదంలో అవి 17,18 పాదాలలో లోపించాయి. 25వ పాదంలో లిప్యంతీకరణ జరిగి 'suma!'గా నిలిచింది.

**V. సాంస్కృతికాంశాలు :**

అనువాద సమస్యలలో ప్రధాన అంశం సాంస్కృతి కాంశాలు. ఒక ప్రాంత భాషా వ్యవహారం, నుడికారం, ఆహార విశేషాలు, ఆహార్య వివరాలు, సంగీత నృత్యాదులు వంటివెన్నో అనువదించేటప్పుడు అను వాదకులకు పెద్ద పరీక్ష. Machine translationకి అది మరింత కష్టాన్ని ఇస్తుంది.

1. తెలుగు కవితలో 'గానుగులం పీనుగులం' అని అన్న చోట వ్యవస్థ మనుషులను స్వేచ్ఛ రహితమైన బానిసలుగా చేస్తుంది. బానిసలకు ఏ హక్కులు ఆనందాలు ఉండవు. వారు జీవచ్ఛవాలలా పనిచేస్తూ ఉంటారు. 'గానుగు'లో నూనె ఆడిస్తారు. ఒకే పని నిరం తరంగా జరుగుతుంటుంది. ఇది ఇక్కడి సాంస్కృతిక కోణం. గానుగులాగా మనుషులూ శ్రమిస్తారు. శ్రమించేలా చేస్తారు. ఇది శ్రమదోపిడి. మనిషి శ్రమను దోచుకోవటాన్ని ప్రతీకాత్మకంగా కవి పేర్కొన్న 'బానిసలం గానుగులం పీనుగులం' పదాలు ఒక దానిని ఇంకొకటి బలోపేతం (intensity) చేస్తున్నాయి. బానిసలు కావడాన గొడ్డు(పశు వుల్లా) చాకిరి చేస్తున్నారు. ఈ క్రమంలో పీనుగులవు తున్నారు. ఈ సాంస్కృతిక లోతులు machine translation అందుకోలేకపోయింది.

2. 'బతుకు ఛాయ చదువు మాయ
కవిత కరక్కాయ సుమి!' అనే వాక్యాలు

'life is a shadow education is illusion
poetry is a bitter poison'గా అనువాదం అయ్యాయి. మొదటి వాక్యం కొంత అంగీకారయోగ్యంగా ఉన్నా రెండో వాక్యం పూర్తిగా విభినార్థ బోధకమయ్యింది. కవితలో లేని పదం 'poison' వచ్చి చేరింది. కరక్కాయ చేదుగా ఉండదు. 'కవిత కరక్కాయ సుమీ' అన్నారు కవి. కరక్కాయ పేరు తెలుగు ప్రాంతాలది. ఈ కాయ అన్నిచోట్ల ఉండవచ్చు. ఇక్కడ పేరు అది. దీనిని వైద్యానికి వాడతారు. కొంత వగరుగా ఉంటుంది. మేలు చేస్తుంది. ఆ పదానికి 'bitter, poison' రెంటిని కలిపి Machine Translation ఇచ్చింది. ఈ ప్రాంతాలలో దొరికే ఒక వైద్య సంబంధమైన కాయ ఇది. సాంస్కృతికమైన కోణాన్ని అందించే పదం ఇది. బ్రతుకు ఛాయగా చదువు మాయగా ఉన్న బ్రతుకులకు కవిత కరక్కాయలాగా మేలు చేస్తుంది. ఊపిరి పోస్తుంది. ఈ కోణం ఈ పదంపర భాషానువాదకులకు కష్టం. ఇక యంత్రానికి అసలే పరిచయం లేనిది అయ్యింది. ఇది machine translation లో poetry is 'bitter poison' అని అనువాదం అయింది. కరక్కాయ చేదు కాదు. పరమ చేదు అంత కంటే కాదు. అదనపు విశేషణంతో పరమ చేదుగా (bitter poison) అనువాదం అయింది. తెలుగు ప్రాంతం, భాష, భావం వాడకం, వస్తువు యంత్రాను వాదంలో రాలేకపోయాయి.

3. 'లేదు సుఖం లేదు రసం' అనే తెలుగు కవితలోని 'రసం' అనే పదం విశేషార్థ ప్రతిపాదకం. రసం భిన్నార్థక ప్రతిపాదకం. అది కాయల నుంచి తీసే సారం కావచ్చు, ఒకానొక వంటకం కావచ్చు, నవరసాలలోని ఒకానొక రసం కావచ్చు. జీవితంలో అనుభవించే ఒక లోతైన సారం/ రంగు/రుచి సందర్భానుగుణంగా పదానికి అర్థాన్ని తెలుగు భాషా వేత్త తీసుకొంటాడు. ఇక్కడ వాడిన 'లేదు, రసం' అనే పదాలకి అర్థం, జీవితంలో ఆసక్తీ/ రుచి లేదు అని. ఒక నిరాశామయ స్థితికి నిదర్శనం. Machine translationలో అది 'no juice' అని అయింది. తెలుగు దనపు సాంద్రత ఇసుమంతైన machine translationలో చోటు చేసుకోలేకపోయింది.

**VI. యంత్రానువాద సమర్థతాసమర్థతలు :**

తెలుగు కవిత్వంలోని ఆర్ద్రత, కవితా హృదయం, యంత్రానువాదంలో 'bitter song'లో లోపించాయి. ఉపమ రూపకాలంకారాలు భావచిత్రాలు యంత్రాను వాదంలో సజావుగా నిలిచినా శ్లేషాలంకారం కవితాత్మక సౌందర్యం యంత్రానువాదంలో సాధ్యం కాలేదు. సరళంగా సూటిగా ఉన్న వాక్యాలూ భావాలు machine translationలో సమర్థవంతంగా ఉంటున్నాయి కానీ సంక్లిష్టతను (complexity) machine translation అర్థం చేసుకోవడంలో అనువదించటంలో విఫలమవుతూ ఉండటం స్పష్టం.

పదాల అర్థాలను వాటికి ఉన్న అర్థ విస్తృతిని machine translation అందుకోలేకపోతూ ఉంది. వృధా, దగా, రసం వంటి పదాలక అర్థాలను మీ గ్రహించలేదు. ప్రతీకలు కవి ఆంతర్యాన్ని అందిస్తాయి. కానీ machine translationలో అవి అంతగా అభివ్యక్తం కాలేదు.

మానవుడిని కుంగదీస్తున్న తీరును, మానవుడను భవించే అధిక శ్రమని, కవి వ్యంగ్యాత్మకంగా వ్యక్తం చేయగా, machine translationలో ఆ విమర్శనాత్మక వ్యంగ్య ధోరణి చేరలేదు.

parallellism, oxymoron, anaphora, alliteration, consonance మీలో సమర్థవంతంగా వచ్చి చేరాయి. రూప సంబంధంగా ఇది విజయవంతమే కానీ, అర్థాన్ని పొందుపరచుకోవడంలో మీ సామర్థ్యం పరీక్షకు నిలిచింది. హల్లుల నిర్మాణం విషయంలో మూల భాషకు అనువాదం లోని భాషకు భిన్నత ఉంది. కానీ రెండింటిలోనూ (తెలుగు, ఆంగ్లం) మూల కవిత అనువాద కవితలో శబ్దాల పునరుక్తి గుర్తించదగ్గది. Rhyme scheme and rhyming ఆంగ్ల నియమాల ప్రకారం రెంటిలో భిన్నంగా ఉన్నా, ఒక పద్ధతిలో ఉంది. ప్రాస ప్రాధాన్యం తెలుగులో కవితకి జవజీవాన్ని ఇచ్చింది. అది ఆంగ్లంలో పాక్షికమే.

**ముగింపు :**

Google Translate ద్వారా చేసిన యంత్రాను వాదంలో ఎన్నో పరిమితులు ఉన్నట్టు స్పష్టం అవుతూ ఉంది. ప్రాంతీయ భాషా వైశాల్యాన్ని విస్తీర్ణాన్ని, లోతుని, భావర్థాల విస్తృతిని google translate అందుకోలేక పోతున్నది. ఇన్ని విధాల భాషా సాహిత్యభివ్యక్తుల ద్వారా ఈ ప్రాంతీయ భాషకు ఉన్నాయని ఆ యంత్రం గుర్తించ లేకపోతూ ఉంది. ఆ యంత్రానికి ఈ అంశాలను గుర్తించే శిక్షణ ఇవ్వాలి. ఒక పదం ఎన్ని రకాల భావార్థాలను ఇస్తుందో పదవాక్యం ఉపరితల నిర్మాణానికి (surface structure) అంతర్గత నిర్మాణానికి (deep structure) ఉన్న వైవిధ్యమేమిటో, ఏ సందర్భానికి ఏ అర్థఛాయను ఎంపిక చేసుకోవచ్చో, తగిన ఎంపిక ఎలా చేసుకోవాలో శిక్షణను ఇవ్వాలి. ఏ సందర్భానికి ఏ పదం ఎలా వాడాలో తెలిపే శిక్షణను ఇవ్వాలి. దానికి తగిన మార్గం ఒకటే తగిన data ను corpus ను అందించాలి. అంటే అనంత సాహిత్యాన్ని, పైన చెప్పిన అన్నింటితో కలిపి యంత్రానికి అందుబాటులో ఉంచాలి. అప్పుడే కొంతైనా మెరుగైన అనువాదం సాధ్యమవుతుంది. ఇప్పటి సందర్భంలో తెలుగు కవితకు యంత్రానువాదం కంటే మానవ ప్రయత్నమే ఫలవంతం. పైశిక్షణతో బహుశా భవిషత్తులో మానవ సహాయం యంత్రానువాదానికి పరిమితం కావచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. A glossary of literary terms-M A Abrams, 1991, Mac million india ltd, Madras.
2. శైలీ శిల్పం వెయ్యేళ్ల తెలుగు కవిత్వం
3. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, ఎస్.ఎస్ నళిని, రమేష్ పబ్లికేషన్లు హైదరాబాదు, 1999.
4. కవిత్వం - డిక్షన్, బిక్కీ కృష్ణ, మల్లెతీగ ప్రచురణాలు, విజయవాడ, 2018.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# శ్రీమదాంధ్ర మహాభారతము - శాంతిపర్వంలోని ధర్మసూత్రాలు





డా॥. యువశ్రీ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
తిరుపతి.

డా॥. జి. ఇందిరా ప్రియదర్శిని
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
తిరుపతి.

డా॥. పి.డి. సెల్వి
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
తిరుపతి.

కవిత్రయం రాసిన శ్రీమదాంధ్ర మహాభారతం భారతీయ సంస్కృతి-సంప్రదాయాలకు, తత్వ - న్యాయ శాస్త్రాలకు ఆధారమైన మహాగ్రంథం. దీనిలోని 'శాంతి పర్వం' అత్యంత విశాలమైంది. విజ్ఞానదాయకమైంది. కురుక్షేత్ర యుద్ధం అనంతరం ధర్మరాజు విషాదంలో ఉన్నప్పుడు శ్రీకృష్ణుడు భీష్ముడి దగ్గరికి అతణ్ణి తీసుకెళ్తాడు. అంపశయ్య మీద ఉన్న భీష్ముడు ఆయనకు ధర్మ విషయకమైన బోధన చేస్తాడు. వైయక్తిక జీవన విధానం నుండి యుద్ధ నియమాల వరకు విస్తృత ధర్మ సూత్రాలను వివరిస్తాడు.

## ధర్మం నిర్వచనం :

ధర్మాన్ని నిర్వచించటం సర్వసాధారణమైన పనికాదు. ఇది అత్యంత కష్టసాధ్యమైనది. మన భారతీయ ధర్మం వేదాల ఆధారంగా నిల్చి ఉంది. "వేదోధర్మ మూలమ్" అని చెప్పటంలో ఉద్దేశమిదే. ఏది ధర్మమనే ప్రశ్నకు సమాధానం చెప్పటం చాలా కష్టం. భూతదయ ధర్మం. 'ఆత్మవత్ సర్వభూతాని' అని తలచడం ధర్మం. మనిషి తనాన్ని, మంచి తనాన్ని కల్గి ఉండడం మానవధర్మం. ఇతరులను కూడా తనలాగా భావించి, తనకేది ఇతరుల వలన బాధకలుగుతుందో అది తాను ఇతరులకు చేయకపోవడం ఉత్తమం. న్యాయం ఆధారంగా నడుచుకోవడం, దయ కలిగి ఉండడం, దానం చేయడం మొదలైనవన్నీ ధర్మాంతర్భూతాలే.

ధర్మాన్ని ఆచరించండం కత్తిమీద సాము లాంటిది. ధర్మాన్ని తెలుసుకోవడం సులభం కాదు. కొన్ని ధర్మాలు అధర్మాల్లాగా కనిపిస్తాయి. సూక్ష్మదృష్టితో పరిశీలించి

మానవుడు ధర్మాధర్మ నిర్ణయం చేయాలి. ఆంధ్రమహాభారతంలోని శాంతిపర్వంలో ధర్మానికి సంబంధించిన సూక్తులు అనేకం ఉన్నాయి. అందులో గృహస్థ ధర్మం, లోకధర్మం, రాజధర్మం, యుద్ధ ధర్మాలను రేఖామాత్రంగా పాఠకుల ముందుంచడమే ఈ నా వ్యాసోద్దేశం.

## గృహస్థ ధర్మం :

గృహస్థ ధర్మాలు కొన్ని ఉన్నాయి. కుటుంబం ధర్మానికి మూలాధారం. జననీ-జనకులు, భార్యా-భర్తలు, పుత్ర - పుత్రికలు గృహస్థ జీవితంలో ప్రధానులు. వీరు ఆచరించవలసిన విధులనే ధర్మాలుగా పరిగణించవచ్చు. ఒకరి పట్ల ఒకరు కొన్ని సామాన్య ధర్మాలను పాటించాలి.

త్రాసులో ఒకవైపు బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమాలు మూడింటిని, మరొకవైపు గృహస్థాశ్రమ ధర్మాన్నీ ఉంచితే ఆ మూడింటితో ఇది ఒక్కటి సమంగా తూగిందని పండితులంటారు. దీన్ని నకులుడు ధర్మరాజుకు చెబుతాడు.

కంII. "తక్కిన మూఁడాశ్రమములు
నొక్కదెస గృహస్థ ధర్మమొకదెసఁదులయం
దెక్కింప వానితో న
య్యొక్కటి సరిదూఁగె నందు రుర్వీశ! బుధుల్"
(శాంతిపర్వము, ప్రథమాశ్వాసము, పద్యం : 76, పుట: 34)

మహాభారతం గృహస్థాశ్రమధర్మ ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించడానికే పుట్టిందని ఇటువంటి సూక్తుల వల్ల మనకు బోధపడుతుంది.

శ్లోII. "ఉపాధ్యాయాన్ దశాచార్యః । ఆచార్యాణాం శతం పితా ।
సహస్రం తు పిత్పాన్ మాతా । గౌరవే ణాతిరిచ్యతే॥
(శాంతి పర్వము, పంచమాశ్వాసము, పుట : 765)

అని మన్వాది ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అంటే పదిమంది ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు, నూరుమంది ఆచార్యుల కంటే ఒక తండ్రి, వెయ్యి మంది తండ్రుల కంటే ఒక తల్లి గౌరవంలో అధికులని అభిప్రాయం. అందుకే వేదం కూడా 'మాతృదేవోభవ' అని తల్లినే మొదటి దైవంగా భావించమని బోధించింది.

ఎవడికి తల్లితో ఎప్పుడు వియోగం కలుగుతుందో, వాడు అప్పుడే అన్ని విధాలా అశక్తుడవుతాడు. అప్పుడే దుఃఖం పొందినవాడౌతాడు. అతడికి లోకమంతా శూన్యమై తోస్తుంది. అప్పుడు వాడు చలించిపోతాడు. వాడు ధనవంతుడు కావచ్చు లేదా పేదవాడు కావచ్చు. బలవంతుడు కావచ్చు. మూర్ఖుడు కావచ్చు లేదా బుద్ధిమంతుడు కావచ్చు. వీటితో నిమిత్తం లేదు. ఎవరికైనా సరే తల్లి జీవించి ఉండటమే సుఖప్రదం అనే విషయాన్ని భీష్ముడు ధర్మరాజుకు తెలియపరుస్తాడు.

కంII. "కలవాఁడు లేనివాఁడు స
బలుఁడబలుఁడు మూఢబుద్ధి డనఁగా
వల; దెవ్వరికైన జనని
కలిమియ యత్యంత సౌఖ్యకరమై యుండున్"
(శాంతిపర్వము, పంచమాశ్వాసము,
పద్యం : 278, పుట : 766)

ఈ విషయాన్నే "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని వాల్మీకి రామాయణం ఉద్బోధించింది. జననీ (తల్లి), జన్మభూమి స్వర్గం కంటే కూడా గొప్పవి అని అర్థం.

తండ్రి ప్రత్యక్ష దైవం. తపస్సు, ధర్మం, విద్య, శ్రేష్ఠమైన దైవం - ఇవన్నీ తండ్రియే. అందువల్ల తండ్రికి ప్రీతి కలిగించే పని చేస్తే దేవతలందరూ సంతోషపడతారని భీష్ముడు ధర్మరాజుకు తండ్రి గొప్పదనాన్ని తెలియజేశాడు.

కంII. "జనకుఁడు దపమును ధర్మం
బును విద్యయుఁ బరమదైవమును గావున నా
తనికిఁ బ్రియంబగు పని సే
సిన దేవత లెల్లఁ బ్రీతిఁజెందుట గల్లుగన్"
(శాంతిపర్వము, పంచమాశ్వాసము,
పద్యం : 271, పుట : 764)

"ఆత్మావై పుత్రనామాసి" అనే శ్రుతిననుసరించి తండ్రే కుమారుడై జన్మిస్తాడనే విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి.

**లోకధర్మం :**

ఈ లోకంలో జీవిస్తున్న మనుషులకు కొన్ని సామాన్య ధర్మాలుంటాయి. మనకు మేలు చేసిన వారికి మేలు చేయకపోయినా ఫర్లేదుగానీ కీడు మాత్రం చేయకూడదు. "తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టకూడద"నేది గ్రామీణుల సూక్తి. సత్యమే లోకధర్మానికి మూలం. అహింస, దానం, క్షమ, దయ మొదలైనవి లోకధర్మ సూత్రాలు. సమాజ జీవనానికి కావలసింది ధర్మం. ప్రతి వ్యక్తి స్వధర్మాన్ని అనుసరించాలి. లోకక్షేమంలోనే వైయక్తిక క్షేమం కూడా అణగి ఉంటుంది. శాంతిపర్వంలో ధర్మం అనేది లోక సంక్షేమం కోసం ఉండాలి అని స్పష్టంగా చెప్పబడింది.

కన్న కొడుకు చిన్న వయస్సులో ఉన్నా, యుక్తవయస్సు కలవాడైనా, వృద్ధుడైనా తల్లికి వాడిమీద ప్రేమ, అతడిని రక్షించే బాధ్యత ఒకే విధంగా ఉంటాయి. నీచ ప్రాణుల కైనా, ఉత్తమ ప్రాణులకైనా ఏవిధంగా ఆలోచించి చూసినా తల్లి అవసరం ఒకే విధంగానే ఉంటుంది. తల్లి వంటి సత్పదార్థం ఉన్నచోట సుఖంగా ఉండగలం. అది లేనిచోట శాంతితో జీవించడం సాధ్యమా? తల్లే ఈ లోకాని కంతటికీ మూల కారణం అని భీష్ముడు ధర్మరాజుకు లోకధర్మాన్ని ఉపదేశించాడు.

**ఆట॥.** "క్షుద్ర జంతువులకు గురులకు నెమ్మెయిఁ
దలఁప నొక్కరూప తల్లి వలయు
నూఱఁడిల్లఁ గలదె యెుండు సోటుల సువ
స్తువు నివాసమైన చోటఁగాక!"

(శాంతిపర్వము, పంచమాశ్వాసము,
పద్యం : 276, పుట : 766)

**రాజధర్మం :**

ఆంధ్రమహాభారతం రాజధర్మాలకు గని వంటిది. రాజు కేవలం భూపాలకుడు మాత్రమే కాదు, ధర్మ సంరక్ష కుడు కూడా. ప్రజారక్షణ, న్యాయపాలన, దండనీతిని అమలుపరచడం, పన్నులు సక్రమంగా విధించడం, శాంతి భద్రతల సంరక్షణ రాజధర్మంలోని ప్రధానాంశాలు. శాంతిపర్వంలోని రాజధర్మం నేటి రాజ్యాంగం, న్యాయ వ్యవస్థలకు కూడా పునాదిగా పరిగణింపబడుతూ ఉంది. భీష్ముడు శాంతిపర్వంలో రాజును ధర్మ స్వరూపుడుగా చిత్రించాడు.

రాజు మొట్టమొదట తనను తాను జయించాలి. అంటే ఇంద్రియ నిగ్రహాన్ని సాధించవలసిన అవసరం ఉంది. రాజు తనను తాను జయించిన తర్వాత శత్రువులను జయించాలి. ముందుగా తనను తాను జయించని రాజుకు శత్రువులను జయించటం సాధ్యం కాదు అని భీష్ముడు ధర్మరాజుకు తెలియజేశాడు.

**కం॥.** "తనుఁధాన తొలుత గెలువన్
మనుజపతికి వలయుఁ; బిదప మార్తుర గెలువన్
మనమునఁదలంచునది; మును
దను తెలువని పతికిఁ గెలువఁదరమే పగఱన్"

(శాంతిపర్వము, ద్వితీయాశ్వాసము,
పద్యం : 276, పుట : 276)

తనను తాను జయించటమంటే తనలోని శత్రువులైన అరిషడ్వర్గాలను జయించటమని అర్థం. అరిషడ్వర్గమంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.

రాజశ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా! ప్రజలు రాజుకు శరీరం వంటివారు. రాజు ప్రజలకు ఆత్మవంటి వాడు. కాబట్టి రాజు ప్రజలను సంరక్షించటంలోనూ, ప్రజలు రాజును సేవించటంలోనూ పరస్పరం ప్రకాశిస్తూ ధర్మాలను నెరవేరుస్తూ వర్ధిల్లాలని భీష్ముడు బోధించాడు.

**కం॥.** "రాజునకుఁబ్రజ శరీరము
రాజు ప్రజలకునాత్మ; కాన రాజుం బ్రజయున్
రాజోత్తమ! యన్యోన్య వి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్"

(శాంతిపర్వము, ద్వితీయాశ్వాసము,
పద్యం : 274, పుట : 276)

రాజు ప్రజల ఆదాయం నుండి ఆరవభాగం పన్నుగా తీసుకోవాలి. ప్రజలను కన్న తండ్రిలాగా దయతో కాపాడాలి. పక్షపాతం లేని వర్తనంతో పరిపాలన సాగించాలి. అది మోక్ష హేతువు కూడా అవుతుంది. నీ మనసులో ఉండే భయాన్ని, అనుమానాన్ని, సందేహాన్ని వదిలిపెట్టు అని వ్యాసుడు ధర్మరాజుకు ఉద్బోధించాడు.

కం॥. "అరి యాఱవపాలు గొనుచు,
గరుణ గలిగి ప్రజలఁదండ్రిగతి మధ్యస్థా
చరణంబునఁబాలించుట
పరమ పదముఁజేర్చు విడువు భయసంశయ
ముల్"

(శాంతిపర్వము, ప్రథమాశ్వాసము,
పద్యం : 176, పుట : 69)

వేదాధ్యయనం, దానం, యజ్ఞం మొదలైన కర్మాచరణ బ్రాహ్మణులకు ఏవిధంగా సహజమో అదేవిధంగా రాజులకు యుద్ధం సహజం. దుర్మార్గులు, పాపాత్ములైన తండ్రులు, పుత్రులు, మనుమలు, గురువులు ఎవరినైనా యుద్ధంలో చంపటం రాజధర్మం. నీతి మార్గాన్ని వదలి అత్యాశతో అన్యాయమార్గంలో నడుచుకొనే వారిని ఎవరినైనా యుద్ధరంగంలో వధించటం పుణ్యకార్యమే అని భీష్ముడు శ్రీకృష్ణుడితో చెబుతాడు.

సీ॥. "విపుల కధ్యయన ప్రదానాధ్వారా ! ద్యములగు
కర్మములట్లరాజు
.................................................
.................................................
..................... బొరివుచ్చఁగలిగినఁబుణ్య కృతి"
(శాంతిపర్వము, ద్వితీయాశ్వాసము, పద్యం : 155, పుట : 230)

ఈ విధంగా మహాభారతంలో రాజధర్మాలు కోకొల్లలుగా మనకు కనిపిస్తాయి.

## యుద్ధ ధర్మం :

యుద్ధంలో పాల్గొనే వీరులు కొన్ని యుద్ధ ధర్మాలను పాటించాలి. యుద్ధం కొన్ని నైతిక నియమాలకు కట్టుబడి ఉండాలి. రాత్రిపూట యుద్ధం చేయరాదు. నిరాయుధుణ్ణి హతమార్చరాదు. శరణు పొందినవారిని కాపాడాలి. గురువు, వృద్ధుడు, స్త్రీ, బాలకుడు వీరిని హింసించరాదు. యుద్ధానికి కారణం ధర్మరక్షనే కావాలి గానీ స్వార్థం కాదు. ధర్మయుద్ధం లక్ష్యం శాంతిస్థాపన. యుద్ధానికి కూడా నియమాలు ఉన్నాయని శాంతిపర్వం చెబుతుంది.

ఓ ధర్మరాజా! జాగ్రత్తగా విను అని భీష్ముడు ఈ విధంగా చెప్పాడు - "యుద్ధంలో మోసం పనికిరాదు. అగ్రభాగంలో ములికిని ఉంచి తయారు చేసిన ఆయుధాన్ని, లేదా విషం పూసిన ఆయుధాన్ని ఎట్లాంటి శత్రువుపైనైనా ప్రయోగించకూడదు. ఒకవేళ ప్రయోగిస్తే రాజు నరకాన్ని పొందుతాడు. ఇది యుద్ధనీతిలో భాగం".

కం॥. "విను చిల్లయిదిన మాయుధ
మును విషలిప్తమగు శస్త్రమును నెట్టియ మి
త్రునిపై నైనఁబ్రయోగిం
చిన నరపతి నరకమున వసించు నృపాలా!"

(శాంతిపర్వము, ద్వితీయాశ్వాసము,
పద్యం : 421, పుట : 327)

నాయనా! ధర్మరాజా! యుద్ధంలో ఆయుధాన్ని చేత బట్టి తనను చంపటానికి వస్తున్నవాడు ఉపనిషత్తుల పరమార్థం తెలిసిన పండితుడయినా సరే చంపితే పాపం రాదు అని వేదవ్యాసుడు తెలిపరచాడు.

కం॥. "దురమునఁగైదువుఁగొని తనుఁ
బొరిగొన నేతెంచునట్టి పురుషుని వేదాం
త రహస్యవేది నయినను
బొరిగొనినను గిల్బిషంబు వొందరు వత్సా!"

(శాంతిపర్వము, ప్రథమాశ్వాసము,
పద్యం : 295, పుట : 120)

ఈనాడు యుద్ధధర్మం వేరు. యుద్ధంలో ధర్మం కంటే శత్రువుని చంపడమే ప్రధానం. ఈనాటి వీరులకు యుద్ధ ఫలితం ఉత్తమలోక ప్రాప్తి అనే విశ్వాసమే లేదు.

ధర్మశాస్త్ర గ్రంథమైన మహాభారతంలో ధర్మ సంబంధమైన సూక్తులకు కొదువలేదు. శాంతిపర్వంలో వ్యక్తిగత జీవనం నుండి యుద్ధ నియమాల వరకు అన్ని విధాలా ధర్మసూత్రాలు సమగ్రంగా వివరించబడ్డాయి. ఇది నేటి సమాజ సముఇత సన్మార్గదర్శి అంటే సత్యదూరం కాదు. మానవ జీవితానికి దిశానిర్దేశం చేస్తున్న శాశ్వత విలువల ప్రతిబింబంగా మనం మహాభారతాన్ని భావించవచ్చు.

## ఆధార గ్రంథం :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తి.తి.దే., తిరుపతి.

★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# అనువాదం ఆవశ్యకత – స్వరూప స్వభావాలు – రకాలు



– డా॥. డి. జ్యోతి

సహాయ ఆచార్యులు, ప్రసారంగ (పబ్లికేషన్స్), ద్రవిడియన్ యూనివర్శిటీ, కుప్పం.

## పరిచయం :

ప్రపంచంలో చాలా భాషలున్నాయి. మనిషి తాను పుట్టి పెరిగిన సమాజంలోని భాషనే కాకుండా, మరికొన్ని భాషలను కూడా నేర్చుకోవలసిన అవసరం నేడు ఏర్పడింది. అనువాదంతో ఒక భాషలోని ఆలోచనలను, భావాలను మరొక భాషలో వెల్లడించగల నేర్పు మనిషికి సాధ్యమౌతుంది. అనువాదం సాంస్కృతిక, వైజ్ఞానిక వినిమయ సాధనం. తెలుగు సాహిత్యం కూడా అనువాదంతోనే మొదలైందని చెప్పవచ్చును. కవిత్రయం మొదలుకొని శ్రీనాధుడు, పోతన మొదలైనవారు సంస్కృత కావ్యాలను ఆంధ్రీకరించారు.

## అనువాదం - నిర్వచనం :

ఒక భాషలోని సమాచారాన్ని మరొక భాషలో ప్రకటించే పద్ధతినే అనువాదమని తర్జుమా అని అంటారు. ఏ భాషలోని భావాలను అనువాదం చెయ్యాలనుకుంటున్నామో ఆ భాషని మూలభాష అంటారు. ఏ భాషలోకి అనువాదం చెయ్యాలనుకుంటున్నామో అది లక్ష్య భాష అంటారు. అనువాదమంటే మూలభాషలోని సమాచారాన్ని లక్ష్య భాషలో వెల్లడించడమన్న మాట.

'వద్' అను ధాతువునకు 'అను' అనే ఉపసర్గ చేరడం 'మరలా చెప్పడం' అని అర్థం. తెలుగు నిఘంటువులు అనువాదం అను పదానికి 'ఒకరు చెప్పిన దానిని మరల చెప్పుట' అనే అర్థాన్నిచ్చాయి. ఆంగ్లంలో దీనిని Translation అంటారు.

"జె.సి. క్యాట్‌ఫర్డ్" మాటల్లో అనువాదమంటే "The replacement of Textual material in one language (SL) by the equivalent of textual in another language" (ఒక భాషలో ఉన్న విషయ పాఠాన్ని మరో భాషలోకి సమానార్థక పాఠంగా మార్చే ప్రక్రియ).

## అనువాద స్వరూప స్వభావాలు :

తెలుగు సాహిత్యంలో అనువాదం ఈనాటిది కాదు. వాస్తవంగా చెప్పాలంటే తెలుగు లిఖిత సాహిత్యంలో మహాభారతానువాదం మనం గమనించవచ్చు. వైదికమత వైశిష్ట్యాన్ని తెలుగు ప్రజలకు తెలపడానికి నన్నయ, తిక్కన, ఎర్రనాదులు మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులోనికి అనువదించారు. ఒక భాషలోని సంస్కృతి, శాస్త్ర విజ్ఞానమును వేరొక భాషలోకి అందించడానికి ఏకైక సాధనం అనువాదం మాత్రమే. అనువాదంలో మనం దుబాసి అనే మాటను వింటుంటాము.

దుబాసి అనే మాట సంస్కృత భాష నుంచి వచ్చింది.

దీని మూలరూపం ద్విభాషి. ద్విభాషి అంటే రెండు భాషలు మాట్లాడగలిగేవాడని అర్థం. ఉదాహరణకు ఇంగ్లీషు మాత్రమే తెలిసిన వ్యక్తి తెలుగు మాత్రమే తెలిసిన వ్యక్తితో మాట్లాడాలనుకుంటే వారిరువురి మధ్య రెండు భాషలూ తెలిసిన వ్యక్తి అవసరం వుంది. ఆ వ్యక్తి రెండు భాషల్లోనూ అటూ ఇటూ సమాచార వినిమయానికి తోడ్పడతాడు. ఈ విధానాన్ని దుబాసించడం అని, ఆ వ్యక్తిని దుబాసి అని అంటారు.

**అనువాదం - ఆవశ్యకత :**

ఆది నుండి అనువాదాలుండటాన్ని బట్టి అనువాదాల ప్రాముఖ్యతను గుర్తించవచ్చు. ప్రపంచంలోని భిన్న జాతుల సంస్కృతుల్ని, శాస్త్ర విషయాల్ని తెలుసుకోవటానికి అనువాదం తప్పనిసరైంది. ప్రజలు తమ సాహిత్యాన్ని, శాస్త్రాల్ని తమ భాషల్లోనే రాసుకోవటం, ప్రపంచంలో అనేక భాషలుండటం వలన ప్రపంచంలోని వివిధ రకాల భాషా సమాజాల మధ్య విజ్ఞాన ప్రసార అవరోధాలు యేర్పడ్డాయి. దీనికి పరిస్కారంగా అనువాదానికి ప్రాముఖ్యం ఏర్పడింది. ఏ భాష పరిపుష్టిని కలిగి ఉండదు. ఏ సంస్కృతి, సాహిత్యం గొప్పది కాదు. కాబట్టి ఇతర భాషలపై ఆధారపడక తప్పదు. ఒక భాష నుండి మరో భాషలోకి విజ్ఞానం రావాలంటే అనువాదం తప్పని సరి. భాష సంపూర్ణతను పొందటానికి అనువాదాలు ఖచ్చితంగా ఉండాల్సిందే.

సంస్కృతం నుండి ఇన్ని కావ్యాలు, శాస్త్రాలు తెలుగులోకి అనువదించకుండా ఉండి ఉంటే తెలుగు సాహిత్యం ఇంతగా అభివృద్ధి చెందేది కాదు. అదేవిధంగా ఈ రోజు ఆంగ్లం నుండి శాస్త్రాలు గణితాది విషయాలు అనువదించకుండా ఉండి ఉంటే మనం ఎంతో వెనుకబడి ఉండేవాళ్ళం. ప్రపంచ భాషగా చెప్పబడే ఆంగ్లంలోకి ఎన్ని గ్రీకు, లాటిన్ సంస్కృతులకి, సాహిత్యాలకి సంబంధించిన గ్రంథాలు అనువదించబడ్డాయో లెక్క తేలడం లేదు. సంస్కృతం నుండి తెలుగులోకి ఎన్ని గ్రంథాలు అనువదించబడ్డాయో అదే సంఖ్యలో ఆంగ్లంలోకి వెళ్ళాయి. ఇదంతా అనువాదానికుండే ప్రాముఖ్యతను తెలుపుతుంది.

తెలుగులో ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్య విప్లవాలకి కారణం అనువాదాలే. భావ కవితా రూపం, నవల, నాటిక మొదలైనవి ఆంగ్ల భాషా ప్రభావం వల్లే వచ్చాయనటం నిర్వివాదం. ప్రతి దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందే అవకాశం లేదు. కేవలం అభివృద్ధి చెందిన దేశాలే శాస్త్రాభివృద్ధిని పొంది ఉంటాయి. అటువంటప్పుడు బడుగు దేశాలు సాంకేతిక విషయాల్ని తెలుసుకోవాల్సిన అవసరముంది. కాబట్టి అనువాదం అవసరమైంది.

ఏ భాషలో ఎక్కువగా శాస్త్రాలు, సాహిత్యం అభివృద్ధి చెందుతాయో ఆ భాషను మిగిలిన ప్రజలు నేర్చుకొంటే ఈ అనువాదం బెడద తప్పిపోతుందని అనువాదాన్ని దూషించిన పండితోత్తములు లేకపోలేదు. అలా చేస్తే తీరిపోతుంది. కాని, అలా చేయటానికి ఏ భాసలో ఎప్పుడు శాస్త్రాలు, సాహిత్యం అభివృద్ధి చెందుతుందని నిక్కచ్చిగా చెప్పగలం? ఒకప్పుడు సంస్కృత సాహిత్యం గొప్పదని అందరూ ఆ భాషని నేర్చుకున్నారు. ఇప్పుడు ఆంగ్లం గొప్పదై పోయింది. మళ్ళీ ఇప్పుడు ఆంగ్లాన్ని నేర్చుకోవాల్సి వస్తోంది. రేపు మరో భాష గొప్పదేతే? మరో విషమేమిటంటే ఇతర భాషల్లో ఉండే విషయాల్ని తెలుసుకోవాలంటే అందరూ ఆ భాషల్ని నేర్చుకోవాలి. అంటే ప్రపంచంలో అందరికీ అన్ని భాషలు రావాలి. ప్రపంచంలో అందరూ చదువుకున్న వారు కాదు కదా! అటువంటప్పుడు అందరూ అన్ని భాషల్ని నేర్చుకోవడమనేది కల్లోని మాట. ఎవరో కొందరు అన్ని భాషల్ని నేర్చుకొని ఆ భాషల్లోని శాస్త్ర సాహిత్యాల్ని అనువదిస్తే మిగిలిన ప్రజలు దాన్ని తెలుసుకోటానికి వీలవుతుంది. కాబట్టే అనువాదానికి అంత ప్రాముఖ్యం ఏర్పడింది.

ఇప్పుడు అనువాదం ఎంత ఉన్నత స్థాయిలో ఉందో చెప్పడానికి ఒక ఉదాహరణ.. రష్యన్ భాషలోని సాహిత్యం, శాస్త్ర విషయాల్ని ఆంగ్లంలోకి, దాన్నుంచి ప్రపంచంలోని అన్ని భాషల్లోకి అనువదిస్తున్నారు. అదే విధంగా అన్ని భాషల్లోని విషయాల్ని రష్యన్‌లోకి అనువదించడం జరుగుతోంది. అనువాదం అనేది ఒక విప్లవంగా తయారైంది. అందువల్లనే ఆధునిక యుగం అనువాద యుగం అనే సందేహం పండితుల్లో కలుగుతోంది.

అనువాదం నియమాలు :

అనువాద ప్రక్రియ పట్ల ఆసక్తి ఉన్నవారు తప్పకుండా కొన్ని నియమాలను అనువాదం చేసేటప్పుడు పాటించాలి. అవి :

1. అనువాదం చేయాలనుకునే వ్యక్తికి మూలభాషలోని, లక్ష్య భాషలోనూ, భాషకు సంబంధించి, వ్యాకరణంకు సంబంధించి, సామెతలు, జాతీయాలు, నుడికారాలకు సంబంధించిన పూర్తి పరిజ్ఞానం ఉండాలి.
2. అనువాదం చేసేటప్పుడు మూలభాషలోని కొన్ని దోషాలు గమనిస్తే వాటిని యధాతథంగా కాకుండా సరైన వాటిని లక్ష్య భాషలోకి తీసుకురావాలి.
3. మూలభాషలో వున్న పదాలకు అర్థాలను కాకుండా విషయార్థాన్ని గ్రహించి అనువాదం చెయ్యాలి.
4. సాంకేతిక పదాలను అనువాదం చేసేటప్పుడు వాటిని యధాతథంగా అనువాదం చెయ్యవచ్చు. ఉదాహరణకు రేడియో, టెలివిజన్, సినిమా వంటి పదాలను యధాతథంగా అనువాదం చెయ్యవచ్చు.
5. మూలభాషలో విషయం ఎంత సరళంగా చెప్పబడిందో లక్ష్య భాషలోకి అంతే సరళంగా అనువాదం చెయ్యాలి. అనువాదం పాఠకులకు విషయ అవగాహన కొరకు మాత్రమే కాని, అనువాదకుల పాండిత్య ప్రదర్శనకు కాదని గ్రహించాలి.
6. మూలభాషలోని శైలి విధానాన్ని, రచనా విధానాన్ని యథాతధంగా లక్ష్య భాషలోకి తీసుకురావడానికి అనువాదకుడు ప్రయత్నం చెయ్యాలి.
7. ఒక్కొక్కసారి మూలభాషలోని కొన్ని పదాలు లక్ష్య భాషలలో దొరకకపోవచ్చు. అటువంటి భావానికి భంగం వాటిల్లకుండా సమానార్థక పదాలను ఉపయోగించి అనువాదం చెయ్యాలి.
8. అనువాదకుడు మూలగ్రంథం రచించిన సమయం నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే విషయాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని, సమర్థవంతమైన అనువాదం చెయ్యగలరు.

**అనువాద రకాలు :**

మూలభాషలోని అంశాన్ని లక్ష్య భాషలోకి అనువదించే కొన్ని విధానాలను గురించి పరిచయం చేసుకుందాం.

1. మూలవిధేయానువాదం
2. స్వేచ్ఛానువాదం
3. నుడికారపు అనువాదం
4. యాంత్రిక అనువాదం

**1. మూలవిధేయానువాదం :**

మూలానికి కట్టుబడి చేసే అనువాదాన్ని మూలవిధేయానువాదం అంటారు. అంటే మూల భాషలోని ప్రతి అంశాన్ని వున్నది ఉన్నట్టు అనువదించడం. ఈ అనువాదంలో అనువాదకుడికి స్వేచ్ఛ ఉండదు. మూల విధేయానువాదంలో ముఖ్యంగా క్రింది లక్షణాలుండాలి.

1. అనువాదం చదివినా చదివినట్లే ఉండాలి : అనువాదకుడు స్వతంత్ర రచయిత కాదు. మూలాన్ని అనువాదం చేస్తున్నాడు. కావున సాధ్యమైనంత వరకు మూల రచయిత భావాలనే అనువాదం చెయ్యాలి.
2. మూలం లోని రచనా విధానమే కనిపించాలి : మూల రచయిత వాడిన శైలి విధానాన్నే అనుసరించి అనువాదం చెయ్యాలి.

ఉదా : Hand work is essential thing. We all need in life. It is impossible to achieve greatness without workig hard. In other words, an idle person cannot gain anything if they wish to sit and wait for something else, on the other hand one who keeps working hard Constantly will definitely gain success in life. (మనందరి జీవితంలో కష్టపడి పనిచేయడమనేది అత్యంత ముఖ్యమైనది. కష్టపడి పని చేయకుండా గొప్ప స్థానాన్ని సాధించడం అసాధ్యం. వేరొక దాని గురించి ఎదురుచూస్తూ ఈ నిమిషం ఖాళీగా కూరు&ంటే అతను ఏదీ సాధించలేడు. అలా కాకుండా నిరంతరం శ్రమిస్తూ నిలకడగా కష్టపడే వ్యక్తి విజయం తప్పకుండా వరిస్తుంది)

పై అనువాదమును గమనించినట్లయితే మూలంలోని భావం, అర్థం మారకుండా అనువాదం చేయబడింది.

**2. స్వేచ్ఛానువాదం :**

మూలభాషలోని భావాలను లక్ష్య భాషలో స్వతంత్రంగా అనువదించే విధానాన్నిస్వేచ్ఛానువాదం అంటారు. ఈ అనువాద విధానంలో అనువాదకుడు మూలంలోని భావం చెడకుండా తనదైన శైలిలో అను వాదం చేయవచ్చు. కనుకనే ఈ అనువాద రచన స్వతంత్ర రచనలా అనిపిస్తుంది.

అ) మూలభాషలోని భావాలను లక్ష్య భాషలోకి తీసుకు వచ్చేటప్పుడు మక్కికి మక్కి అనువాదం చేయన వసరం లేదు. లక్ష్య భాషలో తగిన పదబంధాలను సందర్భానుసారం అందించవచ్చు.

ఆ) లక్ష్య భాష నుడికారానికి సహజమైన రీతిలో చెప్పే స్వేచ్ఛ ఈ అనువాదంలో వుంటుంది.

ఇ) అనువాదకుడు లక్ష్య భాషకు అనుగుణమైన శైలిలో అనువాదం చేయవచ్చు.

ఈ) మూలం ఏ కాలానికి చెందినదో ఆ కాలం నాటి రచనలాగానే అనువాదం రచన వుండాలి.

ఉ) లక్ష్య భాషకు అనుగుణంగా పాత్రల పేర్లు, ఊర్ల పేర్లు, నుడికారాలు మార్చవచ్చు.

**ఉదా :**

అ) నన్నయ ఆంధ్రమహాభారత ఆంధ్రీకరణ విధానం చాలా వరకూ స్వేచ్ఛానువాదమే.

ఆ) రష్యన్ నాటక రచయిత 'చెహూవ్' నాటకం ఇంగ్లీషు అనువాదం The cherry orchardను 'శ్రీశ్రీ' తెలుగులోనికి అనువదించాడు. ఈ నాటకానికి శ్రీశ్రీ 'సంపెంగ తోట' అని పేరు మార్చారు. ఇంగ్లీషు మూలంలోని రష్యన్ పేర్లను తెలుగు పేర్లుగా మార్చారు.

**3. నుడికారపు అనువాదం :**

ఒక భాషలో ఉన్న సామెతలు, జాతీయాలు, నుడి కారాలు ఆ భాషకు మాత్రమే ప్రత్యేకమైనవి. వాటిని వేరొక భాషలోకి అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు లక్ష్యభాషలో వాటికి సమానార్థకాలైన జాతీయాలను, సామెతలను, నుడికారాలను వాడాలి.

**ఉదా :** English : Trust not a broken Staff.

తెలుగు : కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్లుంది

పై అనువాదాలను పరిశీలించినట్లయితే ఇక్కడ పదాల అర్థాల అనువాదం కనిపించదు. మూలభాషలో వాడిన జాతీయాలు, సామెతలు లక్ష్య భాషలో ఏ జాతీయాలలో సరిపోతాయో పోల్చుకొని చేసే అనువాదం పాఠకులని ఆకర్షిస్తుంది.

**4. యాంత్రిక అనువాదం :**

ప్రస్తుత కాలంలో యాంత్రిక అనువాదం లేదా కంప్యూ టరీకరణ అనువాదం అందుబాటులోకి వచ్చింది. కంప్యూ టర్ సహాయంతో ఒక భాషలోని విషయాన్ని వేరొక భాషలోకి అనువాదం చెయ్యడం. ఈ పద్ధతి ద్వారా ఎక్కువ పరిమాణంలో ఉన్న విషయాన్ని తక్కువ సమయంలో అనువాదం చేయడం సులభం. కానీ మనిషికి ఉండే స్వాభావిక శక్తి ఉండదు. దానిని కూడా కృత్రిమ మేధస్సు ద్వారా యంత్రాలలో పెంపొందించే ప్రయత్నం జరుగుతుంది. స్థానిక భాషల స్వభావానికి అనుకూలంగా అనువాదం జరిగే అవకాశాలు భవిష్యత్‌లో చూడ గలుగుతాం.

ఉదా : Google Transalator etc.,

వ్యాసం పరిమితి దృష్ట్యా కొన్ని అనువాద రకాలనే పరిచయం చేశాను. వీటితోపాటుగా అనేక రకాలైన అనువాద రకాలు ఉన్నాయి.

**ముగింపు :**

ఈ సృష్టిలో మానవున్ని ఇతర జంతువుల నుంచి వేరు చేసే గొప్ప లక్షణం మాట్లాడటం. ఒక మనిషి తన మనస్సులోని భావాలను ఎదుటి వ్యక్తికి అర్థమయ్యేలా వివరించడానికి ఉపకరించు సాధనం భాష. ప్రపంచంలో వున్న భాషలన్నీ నేర్చుకోగలగడం ఎవరికీ సాధ్యమయ్యే పనికాదు. మరి ప్రపంచ జ్ఞానం పొందడం ఎలాగా? అంటే

దానికి సమాధానం అనువాదమే. ఒక భాషలో పుట్టిన గొప్ప సాహిత్యం ఇతర భాషల వారికి అందాలన్నా అలాగే మన భాషలో ఉన్న సాహిత్యం ఇతర భాషలకు చెందిన వారు చదివి ఆస్వాదించాలన్నా అవసరమయ్యే సాధనం అనువాదం. అంతటి ప్రాధాన్యత కలిగిన అనువాద ప్రక్రియ పట్ల మరింత పరిశోధన చేసి, అనువాద ప్రక్రియా సరళతకు, విస్తృతికి సరైన మార్గాలను అన్వేషణ చెయ్య వలసిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధార గ్రంథాలు :**


1. అనువాద శాస్త్రం - భీమ్ సేన్ నిర్మల్, తెలుగు అకాడమి.
2. అనువాద సిద్ధాంతాలు - డా॥. అక్కిరెడ్డి, పి. నిర్మలాదేవి, జి. నళినీ.
3. తెలుగు భాషా చరిత్ర - డా॥. వి. సిమ్మన్న.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక - బతుకమ్మ పండుగ



- డా॥. గడ్డం వెంకన్న
అసోసియేట్ ప్రొఫెసర్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, ఓరుగల్లు ప్రాంగణం, వరంగల్లు.

**ఉపోద్ఘాతం :**

మానవ జీవితంలో మమేకమైన పండుగలు జాతి చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. తెలుగువారు జరుపుకునే పండుగలు, నోములు, వ్రతాలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు తరతరాలుగా సమాజంలోని వివిధ వర్గాల వ్యక్తుల్ని ఒకచోటకు చేరుస్తున్నాయి. ఎక్కువ మంది పాల్గొనపోతే పండుగలకు గాని, ఉత్సవాలకు గాని, ఇలాంటి మరే సాంఘికాచారాలకు గాని కళా కాంతులు రావు. సామాజిక జీవన సరళిని పండుగలు ఆవిష్కరింప చేస్తాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉత్సవ సాంప్రదాయాలను గురించిన ఉల్లేఖనాలు తెలుగు కావ్యాలలో పెక్కుచోట్ల కనిపిస్తాయి. కాలానికి, పండుగకు అవినాభావ సంబంధం ఉంటుంది. ఏ కాలంలో ఏ పండుగ జరుపుకోవాలనే విషయం మన పూర్వీకులకు ఎప్పుడో అవగతమైంది. ఇదే విషయమై శివరాత్రి మహాత్మ్యంలో వివిధ ఋతువులల్లో వచ్చే పండుగలను గూర్చి చెప్పబడింది.

"చలి ప్రవేశించు నాగుల చవితినాడు
మెతియు వేసవి రథసప్తమి దినమున
అచ్చసీతం ప్రవేశించు పెచ్చు పెరిగి
మార్గశిర పౌషమాసాల మధ్యవేళ
ఇండ్ల మొదలను నీరెండ నీడికలను
అనుగుదమ్ముడు నన్నయ నాటలాడు
అత్తయును కోడలును గుమ్మలాడు కుమ్ము
గాచు చోటికి మకర సంక్రాంతి వేళ "

(ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీయస్. సుందరం - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం -2004, పుట. 295)

అని కనిపిస్తుంది. తెలంగాణలో నేటికి పున్నమికి, అమావాస్యకు చేసే పూజలు, పండుగలు అనేకం ఉన్నాయి. ప్రతి పున్నమి, ప్రతి అమావాస్య ఒక పండుగే. సంప్రదాయాలు లేకుండా ప్రయోగాలు లేవు. ఆదిలో లేనిది అంత్యంలో లేదు. అదే విధంగా తరతరాలుగా జనసమూహంలో నిలిచి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు క్రియారూపాన్ని దాల్చగా పండుగలేర్పడ్డాయి.

జానపద విజ్ఞానవేత్త 'బాగ్స్' ప్రకారం పండుగ అంటే "మొదట ప్రకృత్యారాధనగా ప్రారంభమై వ్యవసాయ సంస్కృతి కాలంలో స్పష్టరూపాన్ని పొంది, తర్వాతి

కాలంలో ఇంకా క్లిష్ట స్వరూపం సంపాదించి, చివర ప్రాచీన ఆచారాల సూచ్యగణాన్ని మాత్రం కలిగి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవిగా పండుగలు రూపొందాయి. సాంఘిక, సంక్షేమం కోసం విశేష సందర్భాలలో జానపద విశేషాలు, సంప్రదాయాల కలబోతగా ఆచరించే సంక్లిష్ట మైన అంశమే పండుగ " అని (ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీయస్. సుందరం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం , 2004, పుట - 296) నిర్వచించాడు.

ప్రకృతి మాత ఒడిలో పుట్టి పెరిగి జానపదుల ఆచారాలు, సంప్రదాయాలు ప్రతిబింబించే పండుగ 'బతుకమ్మ'. సాధారణంగా పండుగలన్నీ ఏదో ఒక పౌరాణిక గాథ నుండి, మత గ్రంథాల నుండి వచ్చినవే. కాని బతుకమ్మ పండుగ ఏ పౌరాణిక గాథ నుండి ఆవిర్భ వించక పోయినప్పటికీ, ఈ పండుగకు సంబంధించిన పాటలన్నీ శివపార్వతులకు సంబంధించినవేనని చెప్ప వచ్చు. పండుగలన్ని దాదాపు స్త్రీ, పరుషులు కలిసి జరుపు కునేవే అయినా బతుకమ్మ పండుగ మాత్రం స్త్రీలు మాత్రమే జరుపుకునే పండుగ. ప్రకృతిలో లభ్యమయ్యే వివిధ రకాల పువ్వులతో బతుకమ్మను ఆరాధించబడటం విశేశం.

రాష్ట్రంలో మరే ఇతర ప్రాంతాల్లో కనపడని బతుకమ్మ పండుగను తెలంగాణలోనే జరుపుకుంటారు. పడుతులు తొమ్మిది రోజులు అత్యంత భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజించడం ఆచారం. పెళ్ళికాని యువతులు మంచి భర్త రావాలనీ, పెళ్లి అయిన స్త్రీలు మంచి సంతానం కలగాలనీ మొక్కుకుంటూ బతుకమ్మ పండుగను వేడుకగా జరుపుకుంటారు. అందుకే ఈ పండుగ తెలం గాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచింది. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగకు ముందు ఆడ పిల్లలు బొడ్డెమ్మ పండుగను జరుపుకుంటారు.

**బొడ్డెమ్మ పండుగ :**

భాద్రపద బహుళ పంచమి నుండి మహాలయ అమావాస్య వరకు తొమ్మిదిరోజుల పాటు ఆడపిల్లలు బొడ్డెమ్మ పండగను నియమనిష్టలతో జరుపుకుంటారు. బొడ్డ అనే పదానికి అత్తిచెట్టు అనే అర్థం ఉన్నది. ఈ చెట్టుకే మేడిచెట్టు అని, ఉదుంబర చెట్టు అని పేరు కూడా ఉంది. పెండ్లికి మరియు సంతానానికి ఉదుం బరాన్ని పూజిస్తారు.. అందుకే ఉదుంబర లేదా మేడిపూజనే బొడ్డపూజగా, బొడ్డెమ్మగా మారిందని అంటారు. ఆయా ప్రాంతాలను బట్టి పీట బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, పందిరి బొడ్డెమ్మ, బాయి బొడ్డెమ్మ, అని రకరకాలుగా బొడ్డెమ్మను తయారు చేస్తారు.

**బొడ్డెమ్మ చరిత్ర :**

గౌరమ్మ బిడ్డ బొడ్డెమ్మ. ఒకరోజు బొడ్డెమ్మ తన తల్లి గౌరమ్మతో అమ్మా! నీ కన్నా ముందు, నాకు పండుగ జరిపించుమని వేడుకోగా, దీనికి బతుకమ్మ సరేనంటుంది. అదేవిధంగా నిన్ను పూజించిన తరువాతనే నన్ను పూజిస్తా రనే వరం కూడా ఇస్తుంది. బొడ్డెమ్మ పండుగ నాడు స్త్రీలు పుట్ట దగ్గరకు వెళ్ళి పుట్టపై నీళ్ల చల్లి పసుపు, కుంకుమ, పూలతో పుట్టను అలంకరించి భక్తితో పూజిస్తారు. ఆ తరువాత పుట్టమన్ను తవ్వుతారు. ఆ మట్టితో ఇంటి ఆవరణలో ఒక చెక్కపీటపై మెట్లుమెట్లుగా త్రిభుజాకారంలో బొడ్డెమ్మను తయారు చేస్తారు. ఎర్ర మన్నుతో అలికి పసుపు, బియ్యపు పిండి, కుంకుమతో బొట్లు పెడతారు. రుద్రాక్ష, కాకర, కట్ల బీర, మల్లె, జాజి పూలతో బొడ్డెమ్మను అందంగా అలంకరిస్తారు. అగ్ర భాగంలో బియ్యం నింపిన చిన్న కలశం పెట్టుతారు. కలశంలో రవిక, ముడుపు, బియ్యం, ఖర్జూర, పోకలు, పైసలు పెడతారు. పైన కొబ్బరి కుడుక పెట్టి ముగ్గులు వేసి ఆ ప్రదేశంలో బొడ్డెమ్మ చుట్టు పిల్లలు తిరుగుతూ పాటలు పాడుతూ ఆడుకుంటారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మ వలలో
బిడ్డా లెందారే వలలో
నీబిడ్డ నీలగౌరు వలలో
నిత్యమల్లె చెట్టేసే వలలో
నిత్యమల్లె చెట్టుకు వలలో
నిత్యనీల్లు పోసి వలలో

అంటూ వివిధ రకాల పాటలు పాడతారు.

రాత్రి పొద్దుపోయే వరకు పాటలు పాడి చివరగా
అందరూ వర్తులాకారంగా కూర్చొని బొడ్డెమ్మపై
చేతులు ఉంచి బొడ్డెమ్మను నిద్రపుచ్చుతారు.
నిద్రపుచ్చుతూ కూడా పాటలు పాడుతారు.
నిద్రపో బొడ్డెమ్మ నిద్రపోవమ్మా
నిద్రకు నూరేండ్లు నీకు వేయేండ్లు
పాలిచ్చే తల్లికి బ్రహ్మవేయేండ్లు
నినుగన్న తల్లికి నిండ నూరేండ్ల జోజో....జోజో..

అంటూ పాట పాడుతూ బొడ్డెమ్మను నిద్రపుచ్చుతారు. అనంతరం బొడ్డెమ్మను ఇంట్లోని దేవుని వద్ద పెడతారు. ఆ తరువాత అందరు పప్పు ఫలహారాలు పంచు కుంటారు. తొమ్మిది రోజులు వరుసగా ఆడి చివరి రోజున బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం చేసే రోజు ఆడపిల్లలు బొడ్డెమ్మ పీటను నెత్తి మీద పెట్టుకొని ఊరి బయట బావి వద్దకు గాని, చెరువు వద్దకు గాని తీసుకు పోయి నిమజ్జనం చేస్తారు. పెళ్ళికాని అమ్మాయి ఎవరైతే ఉన్నారో వారు బొడ్డెమ్మను ఎత్తుకుంటే వారికి ఆ సంవత్సరం తప్పకుండా పెళ్ళి జరుగుతుందనే నమ్మకం ఉంది. బావిలోని నీళ్ళను కొన్ని బొడ్డెమ్మపై చల్లి బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నిద్రపుచ్చి బొడ్డెమ్మపై ఉన్న చెంబు, గౌరమ్మను తీసి అయిదు అంతరాలున్న బొడ్డెమ్మను మాత్రమే నిమజ్జనం చేస్తారు. బావిలో నీటిని కొంచెం చెంబులో పోసుకొని ఇంటికి వచ్చిన తరువాత నీళ్ళను చల్లుకుంటారు. పండుగలో పాల్గొనేది పిల్లలే అయినా కొందరు పిల్లలు లేని స్త్రీలు పిల్లలు పుడితే బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటామని మొక్కుకుంటారు. ఈ విధంగా తమ కోరిక నెరవేరితే మొక్కుకున్న వాళ్ళు సహితం బొడ్డెమ్మ పండుగను ఆడుకోవడం విశేషం.

**బతుకమ్మ పండుగ :**

బొడ్డెమ్మను బావిలో నిమజ్జనం చేసిన తెల్లారి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. ఈ రోజును పెత్రమాస అని, పితృఅమావాస్య అని వ్యవహరిస్తారు. ఆశ్వయుజ అమావాస్య మొదలుకొని అష్టమి వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలు గురించి జాన పదుల్లో అనేక కథలు వ్యాప్తిలో ఉన్నాయి.

1. చోళ దేశాన్ని 'ధర్మాంగ మహారాజు' పరిపాలిస్తుం టాడు. ధర్మాంగరాజు భార్య సత్యవతి నూరు నోములు నోముకోవడం వలన నూరుగురు సంతానం కలిగారు. వీరు గొప్పవీరులై శత్రువులతో జరిగిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోతారు. రాజు తన పుత్రులు మరణించిన దు:ఖంలో ఉన్నప్పుడు దాయాదులు తన రాజ్యాన్ని, ధనాన్ని కాజేస్తారు. అప్పుడు లక్ష్మీదేవి ప్రత్యక్షమై ఇతని భార్య కడుపున పుడుతానని రాజుకు వరం ఇస్తుంది. దేవత వరం వలన సత్యవతికి 'శ్రీలక్ష్మీ' జన్మిస్తుంది. ఈమె అడవిలోనే పుట్టి పెరుగుతుంది. మునులు, కపిల, గోవుల మధ్య ఆడుకుంటూ ఉంటుంది. పాప అందాన్ని చూసిన మునులు 'బ్రతుకమ్మ' అని పేరు పెడతారు. శ్రీలక్ష్మీదేవి మహిమ వలన ధర్మాంగరాజు తన రాజ్యాన్ని తిరిగి ఏలుకుంటాడు. శ్రీ మహావిష్ణువు చక్రాంగధుడిగా అవతరించి బ్రతుకమ్మను వివాహమాడుతాడు. వీరిద్దరు అతి సుందరులు. తరువాత కాలంలో ధర్మాంగధుడు, సత్యవతి మరణిస్తారు. బతుకమ్మ జగమంతా దేవతయై వెలిసింది. బతుకమ్మను కొలవడం వల్ల శశీదేవి, శ్రీ మహా విష్ణువును కొలవడం వల్ల కుంతీదేవి, కొడుకులను కని దమయంతి సుఖాన్ని పొందిందని చెబుతుంటారు. అదే విధంగా ఈ కథను వినడం వల్ల విప్రులు వేదాలను వర్ణిం చడం, రాజులు రాజ్యాన్ని, పశుసంపదను పొంది పాపాల నుండి విముక్తులైనారని జానపదుల నమ్మకం.

2. పూర్వం కాపు దంపతులకు ఆరుగురు పిల్లలు పుట్టి పురిటిలోనే మరణిస్తారు. చివరకు ఏడవ కాన్పుకు అమ్మాయి పుట్టింది. ఆమెకు బతుకమ్మ అని పేరు పెడతారు. తరువాత ఆ దంపతులకు ఒక అబ్బాయి కూడా పుడతాడు. కొంత కాలానికి బతుకమ్మ పెండ్లి చేస్తారు. బతుకమ్మ అత్తవారింటికి వెళ్ళిపోతుంది. ఆమె సోదరునికి పెండ్లి జరుగుతుంది. తన సోదరుని చూడటానికి ఒకసారి బతుకమ్మ పుట్టింటికి వస్తుంది. బతుకమ్మ తన మరదులు ఇద్దరు కలిసి స్నానానికి చెరువు గట్టుకు పోతారు. గట్టు ఒడ్డున బట్టలు పెట్టి చెరువులోకి

దిగి స్నానం చేస్తారు. వాళ్ళు స్నానం చేసి ఒడ్డుకు వచ్చే సరికి గాలికి బట్టలన్ని కలుస్తాయి. పొరపాటున ఒకరి చీర మరొకరు కట్టుకుంటారు. బతుకమ్మ తాను ఆడ పడుచునని తన చీరను ఎలా కట్టుకుంటావని మరదలిని కోప్పడుతుంది. మరదలు ఆవేశంతో బతుకమ్మ గొంతు నులిమి చంపి పాతిపెట్టి ఇంటికి పోతుంది. చనిపోయిన బతుకమ్మ అదే రాత్రి భర్త కలలో వచ్చి తనను తీసుక పొమ్మని వేడుకుంటుంది. తెల్లారి భర్త ఆమె ఉన్న ఊరికి బయలు దేరుతాడు. బతుకమ్మ స్నానం చేసిన చెరువు గట్టుకు చేరుకుంటాడు. అక్కడ అంతకు ముందు తానెప్పుడు చూడని విరబూసిన తంగేడు పూలను చూసి ఆశ్చర్యపడి తెంపబోతుండగా 'పాపిష్టి మరదలు నన్నిక్కడ చంపి పాతిపెట్టింది' అని జరిగిన కథ అంతా వివరించి చెబుతుంది. ప్రతి ఏడు తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి పైన గౌరమ్మను నిలిపి పూజ చేసి చెరువు గట్టున ఆడి నీటిలో విడిచి పెట్టాలని భర్తను కోరుతుంది. ఆమె కోర్కెలన్నింటిని ముత్తైదువల ద్వారా అతను తీర్చుతాడు. తరువాత ఆమె తమ్ముని కుటుంబం నాశనమవుతుంది. ఈ విధంగా బతుకమ్మ ఆడపడుచు ఈర్ష్యాసూయలకు బలై పేరంటాలుగా మారింది. అప్పటి నుండి జానపదులు బతుకమ్మను దేవతగా ఆరాధిస్తున్నారు. ఈ విధంగా మరికొన్ని కథలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి...

## బతుకమ్మ పండుగ జరుపుకునే విధానం :

తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగ వచ్చిం దంటే ఇల్లంతా సందడే. వేకువజామునే లేచి పువ్వుల కొరకు స్త్రీలు, పురుషులు, పిల్లలు అడవికి బయలు దేరుతారు. ప్రతి ఒక్కరు ఇంటిని అలికి ముగ్గులు వేసు కుంటారు. ఆడవారు తెల్లవారు జామునే లేచి తలంటు స్నానాలు చేస్తారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వేడుకగా పండుగను జరుపుకుంటారు. మొదటి రోజు పండుగను 'ఎంగిలిపువ్వు' అని, పెత్రమాస అని అంటారు. ఎంగిలిపూవు అంటే బతుకమ్మకు, లేదా బొడ్డెమ్మకు ఉపయోగించే రుద్రాక్ష వంటి పూలను ఒకరోజు ముందే తీసుకవచ్చి నీళ్ళలో వేసి, లేక నోటితో ఊది వికసించిన మరునాడు పూలను ఉపయోగించడం మూలంగా అవి ఎంగిలి అవుతున్నందున 'ఎంగిలిపూవు'గా భావించవచ్చు అదేవిధంగా ఈ రోజు పితృదేవతలకు బియ్యం ఇచ్చి పూజించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పితృ దేవతలకు బియ్యం ఇచ్చిపూజించిన తరువాత భోజ నాలు (ఎంగిలి పడిన) చేసిన అనంతరం బతుకమ్మ పేర్చడం వల్ల కూడా ఎంగిలిపూల బతుకమ్మగా పేర్కోన వచ్చు.

## బతుకమ్మ పేర్లు :

నిజానికి బతుకమ్మకు ఏ విధమైన పేర్లు ఉండేవి కావు. ఐతే జానపదులు మాత్రం మొదటిరోజు ఆడే బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మ అని, చివరిరోజు అనగా తొమ్మిదోరోజు ఆడే బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని మాత్రమే అనేవారు. కాని ఇటీవల పట్టణీ కరణ నేపథ్యంలో సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల పుణ్యమా అని ఒక్కొక్క రోజు ఆడే బతుకమ్మకు ఒక్కొక్క పేరు పెట్టడం, ఆ రోజు ఒక ప్రత్యేకమైన ప్రసాదాన్ని తయారుచేసి ఆ ప్రసాదం పేరురే బతుకమ్మ పేరుగా ప్రస్తావించి పిలుస్తున్నారు. దీనితో దినపత్రికలు, న్యూస్ ఛానళ్లలో కూడా ఆవే పేర్లు ప్రాచుర్యంలోకి వచ్చాయి ఈ క్రమంలోనే బతుకమ్మ పండుగ చేసుకునే తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో పిలుస్తున్నారు. 1. ఎంగిలిపూల బతుకమ్మ, 2. అటుకుల బతుకమ్మ, 3. ముద్దపప్పు బతుకమ్మ, 4. నానబియ్యం బతుకమ్మ, 5. అట్ల బతుకమ్మ, 6. అర్రెం, 7. వేపకాయల బతుకమ్మ, 8. వెన్నముద్ద బతుకమ్మ, 9. సద్దుల బతుకమ్మ.

## పేర్చే విధానం :

బతుకమ్మను వెదురు సిబ్బిలో గాని, ఇత్తడి పళ్ళెంలో గాని పేరుస్తారు. వాటిలో గుమ్మడి ఆకులను పరుస్తారు. వీటి మధ్య గుమ్మడి పూల రెక్కలు విడదీసి పరుస్తారు. మొదటి వరుస గుండ్రంగా తంగేడు పూలతోను, ఆ తరువాత గునుగుపూలతో ఒక వరుస పేరుస్తారు. మధ్యలో ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో తంగేడు ఆకులు, మొగ్గలు నింపుతారు.మరికొందరు గునుగుపూలకే రంగులు అద్ది వరుస క్రమంలో అందంగా పేరుస్తారు. పోను పోను ఆ వరుసలను గోపురాకారంగా తీర్చుతారు.

ఆ తరువాత గన్నేరు, రుద్రాక్ష, కట్ల, బంతి, చేమంతి, సీతజడ, బీర, కాకర మొదలైన రకరకాల పూలతో అనేక వరుసలుగా బతుకమ్మను పేర్చుతారు. ఎత్తుగా పేర్చిన బతుకమ్మ శిఖరాన పసుపు ముద్దను గౌరమ్మలా ఉంచుతారు. ఎవరైన ఒకే బతుకమ్మను పేర్చరు. పెద్ద బతుకమ్మకు తోడుగా మరొక పళ్ళెంలో చిన్న బతుకమ్మను పేరుస్తారు. చిన్న బతుకమ్మపైభాగాన గుమ్మడి పువ్వును గౌరమ్మగా ఉంచుతారు. దీన్ని పిల్ల బతుకమ్మ అని పిలుస్తారు. దేవుని గదిలో ఎర్రమన్నుతో అలికి ముగ్గు వేసిన ప్రదేశంలో పేర్చిన బతుకమ్మలను పెడుతారు. తులసి ఆకులు, పోక చెక్కలు, నైవేధ్యంగా పెట్టి దేవుని వద్ద దీపం ముట్టించి బతుకమ్మకు ఊదుబత్తులు అంటిస్తారు. సాయంకాలం కాగానే ఆడపడుచులందరు వారి వారి స్తోమతను బట్టి కొత్తబట్టలు, నగలు, పువ్వులు, ధరించి గుంపుగా బతుకమ్మలను చెరువు గట్టు వద్దకు తీసుకువెళ్తారు. గట్టు వద్ద వెంపలి కొమ్మను ముత్తయిదువ నాటగా దాని చుట్టూ బతుకమ్మలు దింపుతారు. ఆ తరువాత తమతో తెచ్చుకున్న విడిపువ్వులను ఒక్కొక్కటి వేస్తూ

ఒక్కొక్క పూవేసి చందమామ...
ఒక్క జాము ఆయే చందమామ...
రెండేసి పూవేసి చందమామ...
రెండు జాములాయే చందమామ...
మూడేసి పూవేసి చందమామ...
మూడు జాములాయే చందమామ...

అంటూ పాడుతూ బతుకమ్మపై ఒక్కొక్క పూవు వేసుకుంటూ శివుడిని ప్రార్థిస్తారు. ఆ తరువాత వివిధ రకాల బతుకమ్మ పాటలను పాడుకుంటారు. పాటలన్ని దాదాపు ఊయాలో..., కోల్...., వలలో..., చందమామ..., నేరియాలో..., దచ్చన్న దారి పూలవయ్యారి...... వంటి మకుటాలతో కొనసాగుతాయి. ఆడటం అయినంకా బతుకమ్మను నీళ్లలో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత బతుకమ్మను పేర్చిన పళ్లెంలో చెరువు నీళ్లు తెచ్చి చెట్టు మొదట్లో పోస్తారు. గౌరమ్మగా చేసిన పసుపు ముద్దను అందరు వాయనంగా స్వీకరిస్తారు. పసుపును ఒకరికొకరు పుస్తెలకు రాసుకొని " ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటానమ్మ వాయనం " అంటారు. మొదటి రోజు, చివరిరోజు బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. మిగతా రోజుల్లో మామూలుగా పేర్చుకుంటారు. చివరి రోజు మాత్రం పోటీలు పడి పేర్చుతారు.

### బతుకమ్మ ఫలహారాలు :

జానపదులు బతుకమ్మను ఆడుకునే తొమ్మిదిరోజులు వివిధ రకాల ఫలహారాలు నైవేద్యంగా సమర్పిస్తారు. దీనిలో భాగంగా మొదటి రోజు వాయినంగా వక్కలు, తులసి ఆకులు, సత్తుపిండి, రెండవ రోజు పప్పుబెల్లం మూడవ రోజు బెల్లం వేసి ఉడికించిన శనగపప్పు, నాలుగవ రోజు నానబియ్యం, అయిదవ రోజు అట్లు పోసి ప్రసాదంగా చేసుకుంటారు. ఆరవరోజు 'అర్రెం' అని బతుకమ్మను పేర్చడం గాని, ఆడడం గాని చేయరు. ఎందుకంటే ఆ రోజు బతుకమ్మ అలిగిందని నమ్మకం. ఏడవ రోజు ప్రసాదంగా పప్పుబెల్లం, ఎనిమిదవ రోజు నువ్వుల 'బెల్లం కలిపిన ముద్దలు ప్రసాదంగా తయారు చేసుకుంటారు. చివరిరోజు అంటే తొమ్మిదవ రోజు నాటి బతుకమ్మను సద్దుల బతుకమ్మ అంటారు. ఆ రోజు తొమ్మిది రకాల చద్దులను తయారు చేస్తారు. చద్దులుగా సజ్జ ముద్దలు, పులిహోర, దద్దోజనం, సత్తుపిండి, మలీదముద్దలు, పెసర ముద్దలు, నువ్వుల ముద్దలు, పల్లీల పొడి, కొబ్బరిపొడి తదితర తొమ్మిది రకాల పిండి వంటలను తయారు చేస్తారు. వీటన్నింటిని దేవుని గదిలో ఉంచిన బతుకమ్మ ముందు ఉంచి నివేదన చేస్తారు. ఆ రోజు బతుకమ్మ ఆడే మహిళలు ఫలహారం కూడా తీసుకవెళ్ళి చెరువు దగ్గర పంచుతారు. ఒకరి ఫలహారాన్ని మరొకరు వాయినంగా ఇచ్చుకుంటారు. ఈ విధంగా తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగను తెలంగాణ మహిళలు ఘనంగా జరుపుకుంటారు.

### ముగింపు :

తెలంగాణ పల్లె ప్రజల్లో బ్రతుకుల్లో బతుకమ్మ సజీవ స్మృతి చిహ్నంగా మారిపోయింది. బతుకమ్మ పండుగ ద్వారా తెలంగాణ ప్రజల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంస్కృతీ వైభవానికి ప్రతీక. పండుగలో

ప్రకృతిలోని పువ్వులనే దైవంగా భావించి ఆరాధించే విధానం ప్రత్యకంగా ఉంటుంది. స్త్రీలు తమ కుటుంబం బాగుండాలని సుఖసంతోషాలు కలగాలని గౌరమ్మను కొలిచే విధానంలో కూడా గౌరమ్మకు ప్రతీకగా గుమ్మడి పువ్వునే పెట్టడం ఇది ప్రకృతిని ఆరాధించే పండుగేనని స్పష్టంగా చెప్పవచ్చు. ఈ పండుగ సందర్భంగా పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు తమ వైవాహిక జీవితంలోని ఆటుపోట్ల నుండి ఉపశమనం పొందడానికి, ఒక కొత్త సంతోషాన్ని తమ ఆత్మీయుల చెంత పొందడానికి దోహదం చేస్తుందనడంలో పండుగ ఔచిత్యం కల్పిస్తుం దనడంలో సందేహం లేదు. ఇంకా ఈ పండుగ స్త్రీమూర్తు లకు మానసికానందాన్ని కలిగించడమేగాక బంధుత్వాలను బలపరచడానికి, ఆత్మీయతలను పెంచుకోవడానికి, కుటుంబవ్యవస్థను బలపర్చడానికి, పండుగ జరిగే విధానం కలిగిస్తుంది. బతుకమ్మ పండుగ బతుకునిచ్చే పండుగ తెలంగాణ సమాజంలో భక్తి భావాన్ని, ఆరాధనా విధానాన్ని సంస్కృతీ పరంపరను స్థిరీకరించడమేగాక, ఇక్కడ సమాజంలో అస్తిత్వపు పోరాటాలకు, ఉద్యమాలకు సాంస్కృతిక నేపధ్యాన్ని, భూమికను పోషించింది. అంతటి విశిష్టమైన బతుకమ్మ పండుగ తెలంగాణా సంస్కృతీ వైభవానికి, ప్రకృతి ఆరాధనకు, స్త్రీలకు ప్రత్యేకమైన పండుగగా వెలుగొందుతున్నది.

**ఆధార గ్రంథాలు :**


1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా. ఆర్వీయస్. సుందరం -1992.
2. జానపద గేయాలు-సాంఘిక చరిత్ర - సంపాదకులు డా. బి.రామరాజు, డా. నాయని కృష్ణకుమారి-1974.
3. తెలుగు జానపద గేయ సాహిత్యం- డా. బిరుదురాజు రామరాజు-2015.
4. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి- సాహిత్యం, ప్రధాన సంపాదకలు ఆచార్య నాయని కృష్ణకుమారి
5. తెలుగు జానపద సాహిత్యం పురాణగాథలు డా. రావి ప్రేమలత - 2017.
6. బతుకమ్మ పండుగ పాటలు (సంస్కృతి సంప్రదాయాలు), తాటికొండ విష్ణుమూర్తి- 1990.
7. బతుకమ్మ పాటలలో స్త్రీల మనోభావాలు పాటల పరిణామక్రమం - తిరునగరి దేవకిదేవి-2018.
8. మన పల్లెటూళ్ల పాటలు అమ్మాపురం- సంపాదకులు ఆచార్య యన్. భక్తవత్సలరెడ్డి.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలంగాణా జలియన్ వాలాబాగ్ "పరకాల" - చారిత్రక పరిశీలన



- డా॥. ముసుగు శ్రీనివాసరావు

పీఠాధిపతి, చరిత్ర, సంస్కృతి & పురావస్తు, వాస్తు శాస్త్ర పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీశైలం ప్రాంగణం.

బ్రిటీష్ పరిపాలనను, అధికారాన్ని అంతమొందించి స్వరాజ్యమును స్థాపించుటకై భారతీయులు సాధించిన మహోద్యమమే భారతీయ స్వాతంత్ర్య సంగ్రామం. క్రీ.శ. 1885 సంవత్సరం నుండి 1947వ సంవత్సరం వరకు నిరంతరాయంగా మూడు దశలలో కొనసాగింది. 1885 - 1905 వరకు మితవాదులు, 1905-1991 వరకు అతి వాదులు, 1919 నుండి మహాత్మగాంధీ నాయకత్వమున స్వాతంత్ర్యోద్యమం తీవ్రరూపం ధరించి, క్రీ.శ. 1947 ఆగష్టు 15వ స్వాతంత్ర సమపార్జనతో ముగిసింది. 1947 ఆగష్ట్ 15న భారత్, పాకిస్తాన్ దేశాలు స్వతంత్ర దేశాలుగా అవతరించడంతో హైదరాబాద్ నిజాం నవాబు తన సంస్థానం కూడా స్వతంత్రదేశంగా అవతరించడంతో హైదరాబాద్ నిజాం నవాబు తన సంస్థానం కూడా స్వతంత్ర దేశంగా ఉంటుందని, భారతదేవంలో గానీ, పాకిస్థాన్తో గానీ చేరే ప్రసక్తే లేదని ప్రకటించినాడు. ఈ స్వాతంత్ర సంగ్రామంలో పరకాల గ్రామ ప్రజలు ఎంతోమంది పాల్గొన్నారు.

పరకాల గ్రామం వరంగల్ జిల్లాలో వరంగల్ పట్టణానికి 30 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ గ్రామమును పరకాల, పర్కాల్ మరియు పరైకాల్వ అని వివిధ పేర్లతో పిలుస్తు న్నారు. హన్మకొండ ప్రాంతం ఉండి బద్రి కాల్వ ప్రవహిం చడం వలన దీని పేరు మీదనే 'పరైకాల్వ' అని పేరు వచ్చింది. వరంగల్ జిల్లాలో పరకాల మేజర్ పంచాయితీ గాను, ఇరుగుపొరుగు గ్రామాలకు వాణిజ్య కేంద్రంగాను, నేడు మేజర్ పంచాయితీ పట్టణంగాను రూపుదిద్దు కుంటుంది. పరకాల $18^{0}12'$ ఉత్తర అక్షాంశ రేఖ నుండి $79^{0}40'$ తూర్పు రేఖాంశాల మధ్య యున్నది. గ్రామము నకు తూర్పున దామరంపల్లె, పడమర నర్సక్కపల్లె, ఉ త్తరమున కనపర్తి మరియు దక్షిణమున కామిరెడ్డి పల్లె సరిహద్దులుగా ఉన్నాయి. పరకాల మండలం 1953 అక్టోబరు 1కి ముందు 'అంబాల' ఆధ్వర్యంలో, కరీంనగర్ జిల్లాలో ఉంది. వరంగల్ జిల్లాలో మహబూబాబాద్, పాఖాల్, ఎల్లంపాడు, పాల్వంచ, ఖమ్మంమెట్ట, మధిర, చెర్యాల, వర్ధన్నపేట, పరకాల, వరంగల్ మొదలగు తాలుకాలు, 268 గ్రామాలుండేవి.

ప్రథమ దశాబ్దంలో తాలూకాల పునర్విభజన చేసి నప్పుడు, కొన్ని తాలుకాలు నల్గొండ కరీంనగర్ జిల్లాలకు బదిలీ చేయడం జరిగింది. పరకాల గ్రామం కరీంనగర్ జిల్లాలో ఉండేది. తరువాత 1953లో తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ ప్రభావం మొదలైంది. మధ్య తరగతి,

అట్టడుగు వర్గాలలోని యువకులను ఈ పార్టీ ఆకర్షించగలిగింది. భూస్వామ్య వ్యవస్థను అంత మొందింప జేయడానికి ప్రభుత్వపు పోలీసు దళాలను ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని సాగించింది. ఈ ప్రభావం పరకాల గ్రామంపై కూడా చూపింది.

నైజాం ప్రభుత్వ అండదండలతో రజాకార్ల మూక సాగిస్తున్న దురంతాలను సాయుధులై ప్రతిఘటించడం తప్ప మరో మార్గం లేదన్న నిర్ణయానికి వచ్చిన ఆంధ్ర మహాసభ శ్రీ రావి నారాయణరెడ్డి నాయకత్వంలో సాయుధులైన గెరిల్లా దళాలను తయారు చేసింది.

రజాకార్ల సంస్థ దళిత వర్గాల ప్రజలను "ఆకర్షించ డానికి ప్రయత్నించింది. తమది కేవలం ముస్లిం మత సంస్థ కాదనియు, న్యాయం కోసం, దీన జనోద్ధరణ కోసం పాటు పడుతున్నామని రజాకార్లు అబద్ధ ప్రచారం చేశారు. ఆ ప్రచారానికి మోసపోయి దళిత వర్గాల వారు బీదర్‌లో గలాటాలు సృష్టించారు.

గ్రామాలలో ప్రజల వద్ద బలవంతంగా రజాకార్లు విరాళాలు వసూలు చేసినమాట, రజాకార్లు తమకు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపే వినతి పత్రాలపైన హిందువుల చేత బలవంతాన సంతకాలు చేయించిన మాట నిజమేనని అలీయవార్జింగ్ రచించిన "హైదరాబాద్ ఇన్ రిట్రాస్పెక్ట్" అను గ్రంథంలో వివరించారు.

నైజాం సంస్థానంలో కల్లోల పరిస్థితులు ఉన్న సమయంలో హైదరాబాద్ నందు భారత ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేసిన శ్రీ కె.యం. మున్షీ రచించిన "ఒక శకం సమాప్తం" అను గ్రంథంలో పొందుపర్చిన విశ్లేషణ గమనార్హమైనది.

"స్టేట్ కాంగ్రెస్ సాగించిన సత్యాగ్రహం నిజానికి గాంధీ వాదంను గుణమైనది కాదు. రజాకారు మాటలు అమానుషంగా ప్రవర్తిస్తున్నపుడు, హైదరాబాద్‌లో గాంధీ దార్లో సత్యాగ్రహానికి ఎంత మాత్రం తావు ఉండజాలదు. రజాకార్ల దురంతాల బారి నుండి గ్రామాలలోని ప్రజలకు కాపాడటానికి ఒక శక్తి అవసరమైంది. ప్రాణాలు కోల్పోయి, అమరత్వ ఆనందం పొందుదామన్న భావం ప్రజలకు ఉండదు. అలాంటి దశలో (కాంగ్రెస్-కమ్యూనిస్టు) ఐక్య సంఘటనలో భాగస్వాములుగా కమ్యూనిస్టులు నైజాం పోలీసులూ రజాకార్లకు వ్యతిరేకంగా వాలంటీర్లు సాగిస్తున్న హింసాత్మక పోరాటానికి నాయకత్వం వహించి, ప్రజల మన్ననలను పొందారు. రజాకార్ల దురంతాలు పెరిగేకొద్దీ గ్రామ ప్రజలు కమ్యూనిస్టులను ఆహ్వానించి, వారి వద్ద నుండి ఆయుధాలను పొందారు. అలా ఏర్పడిన గ్రామ రక్షణ దళాలు ప్రతిఘటనా కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. నైజాం ప్రభుత్వ బలగంతోనూ, రజాకార్లతోనూ హెూరాహెూరీ పోరాటాలు సాగించారు.

## పరకాల గ్రామంలో జరిగిన రజాకార్ల ఉద్యమం

హైదరాబాదు రాష్ట్రంలో ముస్లింలు కొద్దికాలంగా అనుభవిస్తున్న ప్రత్యేక ప్రతిపత్తి నిలబెట్టడం కోసం 1927లో నవాబు బహదూర్ యార్ జింగ్ అధ్యక్షతన "ఇత్తెహాదుల్ ముస్లిమిన్" అనే సంస్థ అవతరించింది. ఈ సంస్థ 1927లో స్థాపించబడినా, 1938 వరకు దీనికి అంత ప్రాముఖ్యం చేకూరలేదు. 1938లో ఈ సంస్థకు ఉస్మానియా యూనివర్సిటీ, ప్రొఫెసర్ మౌల్వీ అబ్దుల్ సిద్దీక్ అధ్యక్షుడైన తరువాత మతపరమైన రాజకీయశక్తిగా రూపాంతరం చెందింది. అప్పటి నుండి హైదరాబాద్ సంస్థానంలో ప్రజాతంత్ర హక్కుల కోసం జరిగిన అన్ని ఉద్యమాలను ఇత్తేహదుల్ - ముస్లిమాన్ సంస్థ ప్రతిఘటించ సాగింది. 1940లో నవాబు బహదూర్ యార్జింగ్ అధ్యక్షతన ఈ సంస్థ నిజాం రాష్ట్రం అంతటా శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. ఈ దశల్లోనే ఖాకీ యూనిఫాంతోను, నల్లని టోపీలతో కూడిన సుశిక్షితులైన వాలెంటరీ దళాన్ని సమకూర్చింది. నిజాం రాష్ట్రంలోని ముస్లింల ప్రత్యేక ప్రతిపత్తిని నిలబెట్టడం, మొఘల్ సామ్రాజ్య వారసులుగా ముస్లింలను తీర్చిదిద్దడం అనే లక్ష్యాలతో, ఈ సంస్థ తన కార్యకలాపాలను నిర్వహిం చింది. హైదరాబాద్‌లోని ముస్లింలందరూ పాలకులే అనీ, ముస్లింలు లేకపోతే నైజాం లేదని, ఈ సంస్థ నిజాం రాష్ట్ర ముస్లింలలో పాక్షికంగా విద్వేషపూరితమైన భావాలను రెచ్చగొట్టింది. ఈ సంకుచిత దృక్పథంతోనే ఈ సంస్థ రాజ్యాంగ సంస్కరణల కోసం నిజాం రాష్ట్రంలో సాగిన

ఉద్యమాలను తీవ్రంగా ప్రతిఘటించింది. 1946లో ఖాసిం రిజ్వీ "మజ్లిస్ ఏ ఇ త్తెహాదుల్ ముస్లిమిన్" సంస్థకు అధ్యక్షుడైన తర్వాత ఈ సంస్థ కార్యకలాపాలు వికృత రూపం ధరించాయి. ఖాసిం రజ్వీ మతోన్మాది అసఫ్జాహి జెండాను ఎర్రకోటపై ఎగురవేస్తానని ప్రగల్భాలు పలికిన పరమ మూర్ఖుడు. కొన్ని నెలలోనే తన మాటకారి తనంతో హైదరాబాద్ రాష్ట్రంలోని ముస్లింలను మతోన్మాదులను చేయడంలో సఫలీకృతుడైనాడు. వేలకొలది ముస్లింలు రజాకార్లుగా చేరి, దక్కన్ ముస్లిం ఆధిపత్యాన్ని నిలుపు తామని ప్రతిజ్ఞ చేశారు. ఖాసీం రజ్వీ నాయకత్వంలో సాయుధులు సుశిక్షుతులు యాభై వేల మందితో వాలెంటరీ దళం ఏర్పడింది. వారినే 'రజాకార్లు' అంటారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాజ్యంలో పెల్లుబికిన ఉద్యమాన్ని అణిచివేయటానికి రజాకార్లు అనేక దురాగతాలకు, పాశవిక చర్యలకు పాల్ప డ్డారు. వారు సృష్టించిన భీతవాహ వాతావరణంలో తెలం గాణా ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దినదిన గండంగా మనుగడ సాగించవలసి వచ్చింది. గ్రామాలలో ఏర్పడిన రక్షక దళాలు, కమ్యూనిస్టు నేతృత్వంలోని గెరిల్లా దళాలు రజాకార్ల దుండగులను ప్రతిఘటించటంతో తెలం గాణా ప్రాంతం అగ్నిగుండంగా మారింది. రజాకార్ల కిరాతక చర్యలను ఖండిస్తూ ప్రజలలో నైతిక బలాన్ని కలిగించ టానికి 'సారధి', 'హైదరాబాద్ ఇమేజ్' వంటి పత్రికలు కృషి చేశాయి. మానవత్వానికి కళంకం ఆపాదించిన రజాకార్ల దురాగతాలను నిరశించిన ఇమేజ్ పత్రిక సంపాద కుడు జాతీయ వాదియైన షాయిబుల్లాఖాన్ క్రీ.శ. 1948లో ఆగష్టు 21వ తేదీన రజాకార్లు హైదరాబాదు నడివీధిలో హత్య చేశారు. 1947, ఆగష్టు 15వ తేదీన భారతీయుల దాస్యశృంఖలాలు తెగిపోయాయి'. కానీ, నిజాం సంస్థాన ప్రజలు దాస్య శృంఖలాలు బిగుసుకు న్నాయి. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కాలేదు. అంతేకాక, తను ఒక స్వతంత్ర్య ప్రభువు హోదాను వహించెనని తెలుపుతూ నిజాం 1947 ఆగష్టు 17వ తేదీన ఫర్మాన జారీ చేసినాడు. ఇదే సమయంలో మౌంట్ బాటన్తో చర్చించేందుకు వాల్టేరు, మాంక్టన్, చతరి, నవాబు సుల్తాన్ అహ్మద్లతో కూడిన ప్రతినిధి వర్గాన్ని ఢిల్లీకి పంపాడు. ఇతర సంస్థానాదీశుల వలె, తన సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేయనని నైజాం స్పష్టం చేశాడు. సెప్టెంబరు చివరి వరకు చర్చలు కొనసాగినాయి. హైదరా బాద్ ప్రతినిధి వర్గం యధాస్థితి, ఒడంబడిక ముసాయిద ప్రతిని తెలుసుకొని నిజాం సంతకం కోసం హైదరాబాద్ తిరిగి వచ్చింది. తన కార్యనిర్వాహక సమితులతో సుదీర్ఘంగా చర్చించిన తరువాత నిజాం, 1947 అక్టోబర్ 27న యధాస్థితి ఒడంబడికపై సంతకం చేసేందుకు ఒప్పుకున్నాడు. ఈ వార్త విన్న రజాకార్లు కోపోద్రిక్తులై ప్రతినిధివర్గ సభ్యుల ఇళ్ళను చుట్టుముట్టినారు. నైజాం సంతకంతో కూడిన యధాస్థితి ఒడంబడికను ఢిల్లీకి తీసుకొని పోతామని వారు వాగ్దానం చేసిన తరువాత రాజాకార్లు వెళ్లిపోయారు. ఈ సంఘటన తర్వాత ఖాసిం రజ్వీ నైజాంను కలుసుకొని ప్రతినిధి వర్గాన్ని రద్దు చేయించాడు

## యధాస్థితి ఒడంబడిక (1947 నవంబర్ 29)

నైజాం మరలా చర్చలు ప్రారంభించేందుకు ఆమోదిం చిన కొత్త ప్రతినిధి వర్గాన్ని ఢిల్లీకి పంపాడు. ఢిల్లీ చర్చలు విఫలమయ్యే పక్షంలో తాను పాకిస్తాన్లో విలీనం అవుతా యని బెదిరించాడు. క్రీ.శ. 1947 నవంబరు 29న నైజాం భారత ప్రభుత్వంతో యధాస్థితి ఒడంబడిక చేసుకున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు మాత్రము భారత ప్రభుత్వం ఆధీనంలో ఉంటాయి. ఒప్పందం కుదిరిన తరువాత నైజాం, ఖాసిం రిజ్వీకి సన్నిహితుడైన మీర్ యిక్ ఆలిని ప్రధానమంత్రిగా చేశాడు. దీనితో ఖాసిం రిజ్వీపై ముస్లింలకు విపరీతమైన గురి ఏర్పడింది.

## నైజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం

నైజాం సంస్థానమునకు గల ప్రధానమైన ఆదాయపు వనరులలో కల్లు దుకాణాలు ప్రధానమైనవి. ఆ ఆదాయం నైజాం ప్రభుత్వానికి దక్కకుండా చేయాలనే ఉద్దేశ్యంతో మధ్య నిషేదమని తన స్వంత చాదస్తం వలన కల్లునిచ్చు తాటిచెట్లు మరియు ఈతచెట్ల గెలలు కోసి వేయ వలసిందిగా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. అనేక రోజులపాటు

తాటి, ఈత చెట్లను పెద్ద ఎత్తున వన ధ్వంసం చేయడం, కల్లు గీయకుండా గీత కార్మికులను ఆటంక పరచడం చేసినారు. కల్లు గీత పనివారిలో అత్యధిక సంఖ్యాకులు గ్రామీణ పేదలు. ఈ కార్యక్రమం వలన వారు తమ వృత్తిని, జీవనోపాధిని కోల్పోయినారు. అందువల్ల వారు కార్యక్రమానికి వ్యతిరేకంగా ఉండుటతోపాటు, తాటిచెట్ల నరికివేతకు వ్యతిరేకంగా పోరాడినారు. దీనితో నైజాం పాలన పునాదులు కదిలిపోయినవి. పెద్దఎత్తున బీభత్స కాండకు నైజాం పూనుకున్నాడు. మజ్లిస్ - ఇత్తెహద్ - ఉల్ ముస్లిం మీన్కు చెందిన ఖాసిం రజ్వి నాయకత్వాన రజాకార్ల దళాలను ఏర్పాడు చేసుకొని, సైన్యం అండ దండలతో గ్రామాలపైకి పంపాడు తరువాత రజాకార్లు తరిమి కొట్టడానికి పూనుకొనవలసి వచ్చింది.

## పరకాల గ్రామంలో జరిగిన సంఘటన

హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణ నాడు 9 జిల్లాలో మట్వాడా, కన్నెండింగా ప్రాంతాలతోపాటు, నిజాం రాజరిక, నిరంకుశ పాలనలో మగ్గిపోతుండేది. సామాన్య జనం వెట్టిచాకిరికి క్రింద నలిగిపోతుండేవారు. పైగా, జాగీరుదార్లు ఇజాదార్లు, ముక్తేదారులు, ఇనాందార్లు, దేశ్‌ముఖ్ రకాల రకాల పేర్లతో దొరలు వేల, లక్షల ఎకరాలు కలిగి ఉండేవారు. వీరికి పన్నులు వేసేందుకు పన్నులు వసూలు చేసేందుకు అధికారం ఉండేది. దేశముఖ్ ఇష్టానుసారంగా, దుర్మార్గంగా కొల్లకొడుతుండే వారు. భూస్వాములు పొలాలు సాగయ్యేంత వరకు రైతులు నీరు పెట్టేవారు. వ్యవసాయ కార్మికులు వీరి పొలాలలో నాట్లు వేయాలి. పచ్చి బాలింతలయినా సరే పాలుపిండి చూపెడితే తప్ప పని నుండి మధ్యాహ్నం చంటిపిల్లలకు పాలివ్వడానికి వెళ్లనిచ్చేవారు కాదు. చాకలి బట్టలు ఉతకడంతో పాటు, దొరగడి యందు ప్రతిరోజు నూరు బిందెలతో కళ్ళాపు చల్లాలి. మంగలివారు క్షవరాలు చేయాలి, కచ్చడాలను ప్రత్యుత్తరాల కోసం ఊరిలోకి వెళ్ళాలి, యాదవులు గొర్రెలను, కోళ్లను ఇవ్వాలి. గీత కార్మికులు ఉచితంగా కల్లు సరఫరా చేయాలి. చిన్న వ్యాపారులు ఉచితంగా సరుకులు సరఫరా చేయాలి. ఇవన్నీ చేసినా, దొరలు ఎప్పటికప్పుడు ఏవో జరిమానాలు వసూలు చేసేవారు. కన్ను పడిన ఏ స్త్రీనైనను గదులలోకి లేదా బంగళాలోనికి తీసుకొనివెళ్ళేవారు. అధికారులు వారికి నజరానాగా సమర్పిస్తారు. దాసీల శ్రమను, శరీరాలను కొల్లగొట్టేవారు. ఈ అమానుష, నిరంకుశ పీడ కొన్ని సంవత్సరాలపాటు సాగింది. భాషపరంగాను, మతపరం గాను నిజాం నిరంకుశత్వము వల్ల కడు ఇబ్బందులకు గురైనారు. అత్యధికులు తెలుగు వారుండగా, పాలకులు ఉర్దూను అధికారభాషగా బోధన భాషగా చేసినారు. అత్యధికులుగా హిందువులయినా, నిజాం మతమైన, ఇస్లాంను రుద్దినారు. బ్రిటీష్ పాలనా ప్రభావం వలన స్వతంత్ర్య ఉద్యమం ఫలితంగా అనేక మార్పులు వచ్చినా, కొన్ని ప్రజాస్వామిక హక్కులు లభించినా, నిజాం సంస్థానంలో ఆ వూసేలేదు. సభలు జరుపుకోవడానికి, సంఘాలు పెట్టుకోవడానికి, చివరికి గ్రంథాలయం స్థాపించుకోవడానికి సైతం అనుమతి ఉండేదికాదు.

## దాడిచేయించడానికి గల కారణాలు

ప్రజలను ముస్లింలు బానిసలుగా చూచెడివారు, మరియు ముస్లింలు చెప్పినట్లు నడుచుకోవాలి. అయ్యా నీబాన్చన్, కాళ్లుమొక్కుతా దొర అంటూ ఉండాలి. ఉర్దే చదవాలి, తెలుగు మాట్లాడవద్దు మరియు కుమ్మరి వారు ఉచితంగా కుండలివ్వాలి, చాకలివారు బట్టలు ఉచితంగా ఉతకాలి. దళితులు బానిసలుగా బ్రతకాలి, మంగలివారు ముస్లింల గడ్డాలు ఉచితంగా తీసివేయాలి. కల్లుగీత కార్మికులు కల్లు ఉచితంగా ఇవ్వాలి, సాలెవారు బట్టలు ఉచితంగా ఇవ్వాలి, కోమటివారు వస్తువులు ఉచితంగా యివ్వాలి. రైతులు బండ్లు ఉచితంగా కట్టాలి. ఇలా పన్నులు కట్టవలెనని రజాకార్లు ప్రజలను చిత్రహింసలకు గురిచేసినారు. అందుకే హిందువులు ఈ బానిస విముక్తి కోసమని పరకాల గ్రామ ప్రజలకేగాక, చుట్టుప్రక్కల గ్రామాలైన రంగాపురం, ఇసిపేట, కనపర్తి, జూకల్, కౌకొండ, కామారెడ్డిపల్లి, శాయంపేట, కోడపాక, దమ్మన్నపేట మరియు బాకిద్దిపేట చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు ముస్లింలకు భయపడుతూ చట్టూ బతుకుతూ, జీవనం కొనసాగించారు. దీనితో ఈ ముస్లిం పాలన మనకొద్దు అనీ, హిందువులందరూ తిరుగుబాటు

చేసినారు. పరిస్థితులన్నీ గమనించిన కేశవరెడ్డి ఉద్యమానికి పిలుపునిచ్చినాడు. 100 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. చిన్నాపెద్దా అనే బేధం లేకుండా అందరు ఉద్యమంలో పాల్గొన్నారు.

## రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్న ముస్లింల మీద తిరగబడ్డ హిందువులు

రజాకార్ల ఉద్యమం ముందుగా బానిస విముక్తి కోసం హిందువులు చేసినారు. మొదట భాష పరంగా ఘర్షణలు జరిగినాయి. ఉర్దూ భాష వద్దు, తెలుగుభాష వద్దు, తెలుగు భాష కావాలని హిందువులు ముస్లింలపై తిరగ బడినారు. కానీ, నైజాం పరిపాలన కాలంలో ముస్లింల ఆధిక్యత ఎక్కువగా ఉండేది. ముస్లింలు తెలుగు చదువవద్దు, వ్రాయవద్దు అని అంటే, హిందువులకు తెలుగు తప్ప ఉర్దూ భాష వచ్చేది కాదు. అప్పటి కాలంలోనే పరకాల గ్రామ ప్రజలకు ఉర్దూ వస్తే గొప్ప. పరకాల గ్రామ ప్రజలు ఏదైనా అప్లికేషన్ పెట్టుకోవాలంటే ఉర్దూ వచ్చి ఉండాలి. ఉర్దూలేనో వ్రాసి ఇవ్వాలి. తెలుగులో అప్లికేషన్ వ్రాసి యిస్తే తీసుకునేవారు కాదు, సరికాదు చింపివేసేవారు. ఇలా భాషపరంగా రజాకార్లకు, హిందువుకు విపరీతమైన ఘర్షనలు జరిగినవి. చాలా మంది ప్రాణాలు కోల్పోయినారు. తెలుగుభాష మాట్లాడ వద్దు, ఉర్దూ చదవాలని ముస్లింలు, తెలుగు తప్ప ఉర్దూ రాదని, మేము ఉర్దూ మాట్లాడము, చదవము అని హిందువులు తెగేసి చెప్పినారు. అంతేగాక తెలుగు పాఠశాలకు వెళ్ళి, ఐదవ తరగతి చదివిన వారు ఉర్దూ పాఠశాలలో అయితే మూడవ తరగతి చదవాలి. ఇలా రెండు సంవత్సరాలు వృధా అయ్యేది. అందుకే మేము ఉర్దూ చదవము, తెలుగు భాషను చదువుతామని హిందూ ప్రజలందరూ ముక్తకంఠంతో చెప్పినారు. కానీ, ముస్లింల పరిపాలనలో హిందువుల అజమాయిషీ చెల్లేది కాదు. ముస్లింలు అధికసంఖ్యలో ఉన్నారు. వారి వద్ద తుపాకులు మరియు వివిధ రకాలైన ఆయుధాలుండేవి. హిందువులకు కర్రసాము తిప్పడం తప్ప ఏమీరాదు. అందులో ఉన్నత చదువులు చదవడానికి అగ్రకులాల వారు మాత్రమే తిరుగుబాట చేసినారు. అదే పేదవారిని తిరుగుబాటు చెయ్యమంటే, పిడికెడు అన్నం, గోసెడు గుడ్డ ఉంటే చాలు ఈ తిరుగుబాట్లు మాకెందుకని, ఈ చదువులు మాకెందుకయ్యా, నీ బాన్చన్! నీ కాళ్లు మొక్కుతా అని అనేవారు. ఇలా పేదవారు పెద్దపెద్ద ఆసాముల వద్ద, దేశముఖ్ వద్ద పనిచేస్తుండేవారు. కానీ, వీరందరూ కలసి రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్నారు. ఎందుకంటే ముస్లింల క్రింద, రజాకార్ల క్రింద గుత్తేదార్ల క్రింద, పేదవారు పనిచేసేవారు. ఈ పేదవారి విముక్తి కోసం ఉద్యమం చేసినారు. పరకాలలో ఈ ఉద్యమానికి అధ్యక్షత వహించింది కటంగురు కేశవరెడ్డి. వీరి ఆధ్వర్యంలో కుంకుమేశ్వరాలయంలో పాటలు పాడుచూ, భజనలు చేస్తూ ఉండగా కొంతమంది ముస్లింలు వీరి మీద విరుచుకుపడి, ఇక్కడ భజనలు చేయవద్దు అని పెద్దపెట్టున గొడవలు చేసినారు. దీనితో అందరూ పారిపోయారు. కటంగురు కేశవరెడ్డి కొంతమందిని తీసుకొని ముస్లింలకు ఎదురుగా వెళ్ళి మేము భజనలు చేసుకుంటాము, మా ఇష్టానుసారంగా మొదలుతామని తెలుపగా, ముస్లింఉఖల వీరందరిపై కేసు పెట్టి కేశవరెడ్డిని కరీంనగర్ జైలుకు పంపినారు. తరువాత కేశవరెడ్డి ఉద్యమం చేసినారు.

## రంగాపురం చరిత్ర

పరకాలలో తిరుగుబాటు జరుగుతుండగా కేశవరెడ్డి అధ్యక్షతన రజాకార్లను ఎదుర్కొనుటకు సరైనవారు లేకపోవుట వల్ల, కేశవరెడ్డి రంగాపురంకు వెళ్ళి ఆ గ్రామ ప్రజలను ఆశ్రయించినాడు. కేశవరెడ్డికి బుచ్చి రంగారావు అనునతడు బాసటగా నిల్చిరి. రజాకార్లను తిప్పికొట్ట డానికి, బానిస విముక్తి కోసం పాటుపడాలని కొంతమంది యువ నాయకులు కావాలని రంగారావుకు తెల్పగా, రంగారావు కొంతమంది యువకులను 'చాందా'కు ట్రైనింగ్ కొరకు తీసుకెళ్ళినారు. వీరు చాందాలో ట్రైనింగ్ తీసుకుంటుండగా, పరకాల గ్రామంలో అలజడి ఎక్కువైంది. విముక్తికోసం, ఉర్దూ వద్దు అని, తెలుగు భాష కోసం పోరాటం చేసినారు. ఇలా పేద ప్రజల శ్రమను దోచుకుంటున్నారు. పేద రైతులు తమ పొలం పనులు చేసుకుంటున్నప్పుడు ముస్లింలు గాని, దేశముఖ్ గాని

పొలం దగ్గరకు వెళ్ళి ఎడ్ల బండి కట్టమనేవారు. వీరు కట్టమనేవారు. వీరు కట్టకపోతే కఠినంగా శిక్షలు ఉండేవి. ఇలా పేద ప్రజల శ్రమను దోచుకునేవారు. పరకాల గ్రామంలో ఇలా జరుగుతున్న సమయంలో రంగాపురంకు ముస్లింలు వస్తున్నారంటే ఊరిలో ప్రజలు భయపడేవారు. ఎందుకనగా ఈ గ్రామానికి అమిరుద్దీన్ అనే ముస్లిం పన్నులు వసూలు చేసేవాడు. మరియు ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసేవాడు. స్త్రీలను, పచ్చి బాలింతలను కూడా అమిరుద్దీన్ నచ్చితే గడీలు (కొట్టాల) లోని తీసుకెళ్ళి, శారీరకంగా హింసించేవాడు. అమిరుద్దీన్ అరాచ కాలు ఎక్కువైనాయి. రంగాపురం పరిస్థితులన్నీ 'చాందా'లో ట్రైనింగ్ తీసుకుంటున్న బుచ్చి రంగారావు వారికి తెలియ జేసినారు. వెంటనే బుచ్చిరంగారావు మరియు వారి స్నేహితులు కలిసి కాలినడకన గోదావరి మీదుగా వచ్చి, ఒక పడవలో రంగాపురం చేరినారు. ఇదే సమయంలో గోదావరి నది ఒడ్డున నైజాం పోలీసులు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఒక క్యాంపు వేసి కాపలా కాసినారు. అయినా రంగాపురం వాసులు బుచ్చి రంగారావు మరియు ఇసిపేట యువకులు తప్పించుకొని రంగాపురం చేరినారు. రంగాపురం గ్రామ ప్రజలు బుచ్చి రంగారావుకు అమి రుద్దీన్ అరాచకాలు అంతయూ పూసగుచ్చిట్లు చెప్పినారు. వెంటనే బుచ్చి రంగారావు తన అనుచరులతో వెళ్ళి అమి రుద్దీన్‌ను కాల్చి వేసినాడు. వెంటనే అమిరుద్దీన్ చనిపోయి నాడు. బుచ్చి రంగారావు ఆ శవం ప్రక్కన ఒక చీటి వ్రాసి పెట్టి అమిరుద్దీన్ గ్రామస్తులు కాదు చంపింది బుచ్చి రంగారావు అని వ్రాశారట". బుచ్చి రంగారావు వెంటనే గ్రామ ప్రజలకు మీరు ఈ గ్రామంలో ఉండవద్దు, వేరే గ్రామలో ఉండి తలదాచుకోండి అని చెప్పగా, ఆ గ్రామ ప్రజలు వాగులవెంట, పొలాల వెంట తలదాచుకున్నారు. అమిరుద్దీన్ కాల్చి చంపిన విషయం నైజాం ప్రభులకు తెలిసింది. ముస్లింలు పెద్ద ఎత్తున ఎగిసిపడినారు. బుచ్చి రంగారావును పట్టుకోవడం కోసం ముస్లింలు ఈ గ్రామ ప్రజలందరిని చిత్రహింసలకు గురిచేసేవారు. అంతేగాక బుచ్చి రంగారావు, ఇండ్లను, గడ్డి వాములను, ఎడ్ల కొట్టాలను తగులబెట్టినారు. ఇసిపేట గ్రామ ప్రజలను మరియు లక్ష్మీపురం గ్రామ ప్రజలను చిత్రహింసలకు గురిచేసినారు. బుచ్చి రంగారావు అనుచరులు మాత్రము ధర్మారం, కంటాత్మకూరుకు పారిపోయి తలదాచు కున్నారు. వీరికోసం ముస్లింలు, రజాకార్లు గాలించడం మొదలుపెట్టినాడు. అసలు ఈ గొడవ జరగడానికి కారణమేమిటని మాలిక్ పటేల్ ఆరా తీయగా, అమి రుద్దీన్ విషయాలు తెలిసినవి. అమిరుద్దీన్‌ను చంపడానికి గల కారణాలు 1. అరాచకాలు, 2. పన్నులు ఎక్కువగా వసూలు చేయడం, 3. స్త్రీలను బలత్కరించడం, 4. తాటి చెట్టుకు పన్నులు వసూలు చేయడం, 5. అమిరుద్దీన్‌కు వేళకు భోజనం చేసిపెట్టాలని, కోడిమాంసం, గొర్రెమాంసం కావాలనీ, అమిరుద్దీన్ గ్రామ ప్రజలను చిత్రహింసలకు గురిచేయడం మొదలగు కారణాల వలన బుచ్చి రంగా రావు అమిరుద్దీన్‌ను చంపివేసినట్లు తెల్సింది. వరదేలి వీరయ్య, ఆకుతోట మల్లయ్య, రాజమహమ్మద్ వీరు ముగ్గురు కలిసి బుచ్చి రంగారావుకు సహకరించారని తెలిసి మాలిక్ పటేల్ ముగ్గురిని (రంగారావు వాసులైన వరదేలి వీరయ్యను, ఆకుతోట మల్లయ్యను, రాజ మహమ్మద్‌ను) చెట్టుకు కట్టి కాల్చి వేసినాడు. రాజ మహ్మద్ ముస్లిం వాడైనప్పటికీ రంగాపురం ప్రజలకు సహకరిస్తున్నాడని కాల్చి వేసినాడు. బుచ్చి రంగారావు గారు ఈ మధ్యకాలంలో అమరుడైనారు.

## స్వతంత్ర్య పోరాటంలో పరకాల పాత్ర

హైదరాబాద్ సంస్థానంలో తొలిసారిగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1938లో స్టేట్ కాంగ్రెస్ ద్వారా జరుపబడి సత్యాగ్రహ ఉద్యమంలో మొదటిగా హయగ్రీవచార్యులు, శ్రీ ఇటికాల మధుసూదన్ రావు, పొట్లపల్లి రామారావు మొదలగు వారు పాల్గొని జైలుకు వెళ్ళినారు. ఆ తరువాత పరకాల నుండి అనేకమంది జట్లుజట్లుగా సత్యాగ్రహ ఉద్యమంలో మొదటిగా హయగ్రీవాచార్యులు, శ్రీ ఇటీవల మధుసూదన్ రావు, పొట్లపల్లి రామారావు మొదలగు వారు పాల్గొని జైలుకు వెళ్ళినారు. ఆ తరువాత పరకాల నుండి అనేకమంది జట్లుజట్లుగా సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని, కారాగార శిక్షను అనుభవించినారు. పరకాల ప్రాంతంలో ప్రకాశ్‌రెడ్డి, నరసింహారెడ్డి, కేశవరెడ్డి మొదలగువారు కూడా పాల్గొన్నారు. కాగా మహమ్మద్

ఖాసిం, మహమ్మద్ రజ్వీలు బలగాలను తీసుకుని వచ్చి, చిత్రహింసలకు గురిచేసి హిందువులపై ముస్లింలతో దాడి చేయించినాడు.

ఒకవైపు అధికారుల నిరంకుశ పాలన, వేరొకవైపు దుర్భర, పీడిత ప్రజల నిస్సహాయ ఆక్రందనలు, మంచి తనాన్ని దోచుకునే ముష్కరత్వం, నిజాం నవాబు పరిపాలనలో ఏర్పరచుకున్న పాక్షికత, అన్యాయపు పెను చీకటి, కర్కషత్వం జరిగి నేటికీ సరిగ్గా 71 సంవత్సరాలు. హైదరాబాదు రాష్ట్రాన్ని భారతదేశంలో ఒక స్వతంత్ర్య రాజ్యంగా నెలకొల్పవలసి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్‌ది. 13-09-1948 - 17-09-1948 తేదీలలో (నాటి హెూంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయిపటేల్) జరిపిన 'పోలీసు చర్య'తో నిజాం శరణుగతి నొందినట్లు చేసిన సంఘటన, భారతదేశ సమగ్రతను కాపాడుకొనుటకు గాను స్వాతంత్ర్య ప్రభుత్వపు రెండవ సైనికచర్యగా చరిత్రలో నిలిచి పోతుంది. నిజాం ప్రభుత్వ పతనానికి పరకాల ప్రజల పోరాటం కూడా ముఖ్యమైనది.

## రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్నప్పుడు వారి జీవన విధానం

**ఆహారం** : ఈ ఉద్యమం చేస్తున్నప్పుడు వీరు తిండి ఏమీ తినేవారు కారు. ఎడ్లు మేసే 'బలపటాలు' అంటే పశువులు మేసేవారిని వీరు ఆహారంగా తీసుకునేవారు. 1947 ప్రాంతంలో పంటలు సరిగా పండేవికావు. తెల్ల జొన్నలు, పచ్చజొన్నలు, మొక్కజొన్నలు, పెసలు, బెబ్బర్లు, కందులు, వేరుశనగలు ఇవి ముఖ్యమైనవి పంటలుగా చెప్పవచ్చును. ఇవి కూడా ఆహారంగా భుజించి ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమ సభలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగేవి. ఈ సభలను 6 నెలల పాటు జరిపినారు. ఎంతోమంది జైలుపాలైనారు. చాలామంది అనారోగ్యానికి గురైనారు. అయినను రజాకార్లు ప్రజల నుంచి పన్నులు ఎక్కువగా కట్టించుకునేవారు. మరియు భూమి పన్నులు, పేదవాని భూములు భూస్వాములు గుంజుకునేవారు. రైతుల వద్ద ఒక ఎకరం, రెండు ఎకరాలు ఉంటే దేశ్‌ముఖ్ తీసుకునే వారు అడిగితే చిత్రహింసలకు గురిచేసినట్లుగా స్థానికుడైన నరసింహరావు మూర్తి గారు తెలియజేసినారు. దొరలు ముస్లింల క్రింద పనిచేసేవారు. వీరికి ముస్లింలు పట్వారి హెూదాను యిచ్చేవారు. అందులో ముఖ్యమైన వారు గంగాధరరావు పట్వారి, వీరగోపాల్ రావు పట్వారి. వీరందరు కలిసి ప్రజలను పన్నులు కట్టాలని పీడించేవారు. ముఖ్యంగా వీరికి పన్నులు చెల్లించడం ఇష్టంలేని హిందువులు తాటిచెట్లను నరికినారు. దీనితో ముస్లింలు, హిందువులను తీవ్రంగా కొట్టి పన్నులు వసూలు చేసినారు. అవి ప్రభుత్వం చెట్లు అని, ముస్లింవారు హిందువులను తాళ్లతో కట్టివేసి చెట్లకు వేలాడదీసినారు. ఇలా చేయడం వలన పంజనామా చెప్పించినారు. పంజనామా అంటే ఐదుగిరితో సంతకం పెట్టడం, రాయపర్తి బ్రాహ్మణుడైన ఇతడు కాగితాలు తీసుకొని పరకాలకు వస్తుంటే, కాంగ్రిస్ (కాంగ్రెస్) వచ్చింది, కాంగ్రిస్ (కాంగ్రెస్) వచ్చింది అని గుంపులు గుంపులుగా ఏర్పాటు అయినారు.

ప్రజలందరు పరకాలకు రావడానికి మనోహరరావు అనునతడు (ఆర్యసమాజం కోసం పాటుపడిన వ్యక్తి) సహకరించినాడు. ఇతడే ప్రతి గ్రామంలోకి వెళ్ళి కమిటీలు వేసి, కరపత్రాలు పంచినాడు. దీనితో ప్రతి గ్రామంలోని వారు పెద్ద పెద్ద నినాదాలు చేసుకుంటూ పరకాలలో సమావేశమైనారు.

## పరకాలలో జలియన్ వాలాబాగ్ లాంటి ఉదంతం

ఖాసిం రజ్వి సైనిక అధిపతి. ఇతరు ప్రైవేట్ సైన్యం తయారుచేసి, హిందువుల మీదికి ఉసిగొల్పినాడు. పరకాల గ్రామ ప్రజలు రాత్రి 10 గంటల నుండి 12 గంటల మధ్యకాలంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకునేవారు. ప్రకాశ్‌రెడ్డితో పాటు బ్రాహ్మణులైన పిడిసిల్ల నరసింహారెడ్డి, వాడ వాసురెడ్డి, పిడిసిల్ల రామ్మోహనరావు (బ్రాహ్మణుడు), వీరగోపాల్రావు (వెలమ), జనార్ధన్‌రెడ్డి జోగిరెడ్డి వీరు వీరు ఎక్కువగా చాటింపు చేసుకుంటూ రాత్రికి రాత్రికి సమావేశాలు జరుపుకునేవారు. వీరికి ముఖ్య అధ్యక్షుడు కేశవరెడ్డి. ఈ సమావేశాలలో ముస్లింలు డౌన్‌డౌన్ అంటూ బుర్ర కథలు చెప్పుకుంటూ ఉండేవారు. ఆముదపు చిన్న వీరన్న (రంగాపురం), లాడి భుజంగరావు, చాడ వాసుదేవరెడ్డి, చంద్రరావు వీరందరూ అజ్ఞాతంలో

ఉండి (అండర్‌గ్రౌండ్) పనిచేసేవారు. భూస్వాముల పరిపాలనలో అజమాయిషి ఎక్కువగా ఉండేది. తహశీల్దారు నరసింహారెడ్డి, నైజాం రాజు లకడిక మాస్టర్ వరంగల్ జిల్లాలో ఉండేవాడు. ఇక్కడ మహమ్మద్ ఖాసిం ఉండేవాడు. హజాంగిరి గోర్కొత్తపల్లి, మహ్మద్ అక్బర్ ఉస్మాన్ భాష ముక్తేదారులు. వీరు పరకాలను గడగడలాడించినవారు. కేశవరెడ్డి కరీంనగర్ జైలు నుండి పరకాలలోని చాపలబండ దగ్గరకు వస్తున్నాడని ప్రజలకు తెలియడంతో చుట్టుప్రక్కల గ్రామ ప్రజలందరూ ఇక్కడకు వచ్చినారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రజలందరూ కేశవరెడ్డి జై అని అనుకుంటూ కాంగ్రిస్ (కాంగ్రెస్) జిందాబాద్ అని చాపలబండ దగ్గరకు వచ్చినారు. అయితే, రజాకార్లు మహమ్మద్ ఖాసిం రజ్వి మిలటరీ దళాలను, రజాకార్లను పంపించినాడు. కేశవరెడ్డి పరకాలకు వచ్చినాడని కరపత్రాలను బాకిద్దిపేట, రాయపర్తి, లక్ష్మీపురం, రంగాపురం, ఇసిపేట మొదలగు గ్రామాల ప్రజలందరు కరపత్రాలు పట్టుకొని వేణుగోపాలరావు, రంగాచారి వస్తూ వుంటే నర్సక్కపల్లె చందరరావు, జూకోల్ ఆనందరావు కనపర్తి గ్రామం నుండి 20 మంది పరకాల గ్రామానికి వచ్చినారు. చాలపబండ వద్దకు మూడు వందల మంది రాగా, మిలటరి దళాలు 1947 సెప్టెంబర్ 2వ తేదీన (మంగళవారం) లారీలలో పరకాలకు చేరినవి.

పరకాల గ్రామంలో తహశీల్దార్ కార్యాలయంలో అందరికి బియ్యం ఇస్తున్నారని, చుట్టపక్కల గ్రామ ప్రజలు నినాదాలు చేసుకుంటూ మరియు కాంగ్రిస్ వచ్చిందని కేకలు పెడ్తూ వచ్చి, చాపలబండ దగ్గర అందరూ కూర్చొని ఉండగా, పరకాల గ్రామంలోనికి లారీలలో మిలటరీ దళాలు వచ్చి చుట్టుముట్టాయి. మిలటరీ వారి దగ్గర రైఫిల్స్ మరియు మారణాయుధాలున్నాయి. మన హిందువుల దగ్గర కర్రలు తప్ప ఏ మారణాయుధాలు లేవు. ధర్మాత్ముల్లాంటి పరకాల గ్రామ ప్రజలను మిలటరీ దళాలవారు విచక్షణారహితంగా కాల్చి చంపినారు. ఈ కాల్పులు సెప్టెంబరు 2వ తేది 1947 మంగళవారం రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కాల్పులు జరిగినవి. ఈ సంఘటన చాపలబండ దగ్గర జరిగింది. దీనిని నేడు అమర వీరుల మైదానం అంటున్నారు. మిలటరీ దళాలు కాల్పుల్లో అక్కడికక్కడే ఏడుగురు చనిపోగా, మిగతా వారందరూ చెల్లాచెదురై పరుగులు తీసినారు. తరువాత అమరులైనవారు మొత్తం కలిపి 70 మంది. ప్రాణాలు కాపాడుకోవటానికి చాలామంది తప్పించుకొని పారిపోయినారు. కానీ కొన్ని వందల మంది గాయాలపాలైనారు. కొందరి కాలు చేతులు తెగి ఎక్కడపడితే అక్కడ పడ్డాయి. కడుపులో పొడిస్తే ప్రేగులు బయటపడి ఇళ్ళకు వెళ్ళిపోయి ప్రాణాలు విడిచినారు. చాలామంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయినాయి. ఈ సంఘటన నైజాం ముష్కరుల పాలన నుండి తెలంగాణ విముక్తికై ప్రాణాలర్పించిన ప్రజల చరిత్ర తెలంగాణా రాష్ట్ర చరిత్రలో పరకాల ఉదంతం జెలియన్వాలాబాగ్ సంఘటనగా వర్ణించవచ్చును. ఈ పరకాల గ్రామంలోని ప్రజలు కాల్పులు తాళలేక కొంతమంది బావిలో పడి చనిపోయినారు. అందుకే రజాకార్ల ఉద్యమంలో అశువులు బాసిన త్యాగమూర్తులు ఎందరో చిరస్మరణీయులైనారు. ఇది పరకాల గ్రామంలో జరుగుట విశేషం. అజ్ఞాతంలో (అండర్ గ్రౌండ్) ఉన్న ప్రకాశ్ రెడ్డిని హిందువులే పట్టించగా, అతనిని ముస్లింలు చావుదెబ్బలు కొట్టగా కొన్ని రోజుల తర్వాత చనిపోయినాడని బుచ్చి రంగారావు గారు తెలియజేసినారు. పరకాల గ్రామంలో కమ్యూనిస్టు కార్యాలయంలో ప్రకాష్‌రెడ్డి శిలావిగ్రహాన్ని నిలబెట్టినారు. మరియు ఇతని పేరు మీద ఒక భవనం కట్టించి, ఇక్కడ కమ్యూనిస్ట్ కార్యాలయమును ప్రారంభించినారు.

## అమరదామం ప్రత్యేకత

ఈ ఉద్యమంలో అశువులు బాసినవారికి గుర్తుగా పరకాలలో అమరవీరుల అమరదామమును అతి సుందరంగా నిర్మించి, సమరయోధుల శిల్పాలు చెక్కించినారు. ఇవి నేటికీ చెక్కుచెదరకుండా వున్నాయి. ఈ శిల్పాల నిర్మాణం 1992-2004 మధ్యకాలంలో జరిగింది. పరకాల గ్రామం నేడు పట్టణంగా మారింది. పర్యాటక రంగంలో మొదటగా చూడవలసినది అమరవీరుల

స్మారక మందిరం. ఎంతోమంది త్యాగం చేసినవారు, బానిస విముక్తికోసం ప్రాణాలు బలిచ్చిన స్వాతంత్ర్య సమరయోధులు పరకాల గ్రామ ప్రజలు. వీరి చరిత్ర స్థిరంగా నిలిచిపోయింది.

**అధో జ్ఞాపికలు :**


1. హ్యాండ్ బుక్ ఆఫ్ వరంగల్ స్టాటిస్టిక్స్ : వరంగల్, 2007-08, పుట. 37.
2. కృష్ణారావు వై.వి. & బలరామమూర్తి ఎ., ఆంధ్రప్రదేశ్ దర్శిని, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1976, పుట. 938.
3. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, కృష్ణా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, విజయవాడ, 1984, పుట. 128.
6. హ్యాండ్ బుక్ ఆప్ ద స్టాటిస్టిక్, కంప్లీటెడ్ పబ్లిష్డ్ బై చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, వరంగల్, 2007-08, పుట. 37.
7. జగదీశ్వరరావు కె., వరంగల్ దర్శిని, 1986, సుమతి పబ్లికేషన్స్, వరంగల్, 1981, పుట. 95.
8. రవి తెలకపల్లి, వీర తెలంగాణ మాది, 120 మంది పోరాటయోధుల స్వయం కథనాలు, ప్రజాశక్తి, హైదరాబాద్, 2006.
9. రంగారావు బుచ్చి, క్షేత్ర పర్యటనలో ముఖాముఖి సంభాషణ, పరకాల తేది, 07-01-2010.
10. జగదీశ్వరరావు కె., ఆఫ్‌సెట్, పుట. 87.
11. రంగారావు బుచ్చి, క్షేత్ర పర్యటనలో ముఖాముఖి సంభాషణ, పరకాల, తేది 07-01-2010.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# సినారె గజల్స్‌లో - "తాత్త్వికత"



- డా॥. మామిడి లింగయ్య

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖధ్యక్షులు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

గజల్ అనగానే రాగచ్ఛాయలతో కూడి, పల్లవి, చరణాల సమ్మేళనంగా కొనసాగుతూ, అద్భుతమైన ఆనందాన్ని కలిగించంతోపాటు, సమాజంలోని వ్యక్తులకు అనేక కొత్త విషయాలను తెలుపుతుంది. గజల్స్‌లోని తాత్త్వికతను గ్రహించిన మనుషులు తమ ప్రవర్తనలో మార్పు తీసుకొని ఆనందాన్ని పొందుతారు. మనుషుల ప్రవర్తనలలో మార్పుతో కూడిన హితాన్ని కోరేదే 'గజల్'గా మనం భావించవచ్చు. సరసభావనలు, సుస్వరపదాలు, చమత్కారంతో కూడిన తాత్త్విక భావనలు, మార్పు, కృషి, పట్టుదల బాధ్యతలను గుర్తు చేయడం గజల్స్ యొక్క ముఖ్య లక్షణములు. 'గజల్'లో నాలుగు లేదా అయిదు పాదాలుంటాయి. ఇందులో పల్లవిని 'మత్లా' అని, చివరి చరణాన్ని 'మక్తా" అని కవినామముద్రతో కూడిన పాదాన్ని 'తఖల్లస్' అని కూడా అంటారు. పల్లవిలోని చివర ఉన్న పదం, ప్రతి చరణం చివరన, అంత్యప్రాసను రూపొం దిస్తుంది. ఇందులో అంత:ప్రాసకూడ ఉంటుంది. ప్రాసతో కూడిన పదాలు, శబ్ద చమత్కారాన్ని కలిగిస్తూ ఆలోచన రేకెత్తిస్తుంది. గేయఫణితిలోగల ఈ గజల్స్‌కి అద్భుతమైన గాత్రం తోడవుతే, శ్రోతల ఆనందం రెట్టింపవుతుంది. 'గజల్' అనేది ఉర్దూమూల ప్రక్రియ అయినా, తెలుగు కవుల మూలాన, తెలుగు పాఠక, శ్రోతకలోకాన్ని మరింత ఆకట్టుకుంది. ఇటువంటి గొప్ప ప్రక్రియలో అనేక గజల్స్‌రాసి, తమదైన శైలిలో అద్భుతమైన గానామృతంతో ఆకట్టుకున్న ఆచార్య సి.నారాయణరెడ్డి గారి 'గజల్స్'లో తాత్త్వికతను గురించి చెప్పడమే ఈ వ్యాసం యొక్క ప్రధానోద్దేశ్యం.

**గజల్ 1 :**

కాకులు పెట్టిన సభలో కోకిల ఏం పాడుతుందీ కత్తులు నాటిన గుడిలో భక్తి ఎలా పండుతుంది? అంతా భద్రం అంటూ ఎంతకాలమీసూక్తులు, వంచన దూరిన ఇంట్లో మంచి ఎలా బతుకుతుంది.

పై గజల్‌ను పాడుకున్న తర్వాత గాయకుడు లేదా శ్రోత, చదువుకున్న పాఠకుడు ఎంతో అనుభూతికి లోనవుతూ, అర్థం కోసం, అందులోని భావం కోసం వెతుక్కుంటాడు కాని అందులో దాగి, నిగూఢంగా ఉన్న తాత్త్వికతను పరిశీలిస్తే మనకు అనేక కొత్త విషయాలు తెలుస్తాయి. సభలు, సమావేశాలు అందరూ నిర్వహిస్తుంటారు. కాని అలాంటి సభానిర్వాహణ సజావుగా సాగకుండా, గందరగోళంగా మారగూడదు. కేవలం అరవడానికే సబలు పెట్టగూడదు. కాకిగోల కోసం

సభపెట్టి, సభలోని సభ్యుల మనస్సు రంజింపజేయడం మానివేసి, అరుస్తూవుంటే, అందులో మంచిగా మాట్లాడే వక్త, ఏం మాట్లాగలడు, సభానిర్వాహకులు మంచి వారవుతే, సభ యొక్క ముఖ్య ఉద్దేశ్యం నెరవేరేలాగా, వక్త యొక్క వ్యక్తవ్యాంశం సభికుల్ని రంజింపజేసే వీలుంటుంది. అలాకాక ఎవరంటే వారు, సభావేదికల మీద తమకు తోచిన గోలను మాట్లాడేవారున్నప్పుడు, మంచివక్త కూడ ఏమీ మాట్లాడలేడు. ఆ వక్త, ఇంకోమారు సభకు పిలిచినారాడు. అలాగే గుడిలోపల మంచిశాంతి, ప్రశాంత వాతావరణం ఉండాలి. అప్పుడే భక్తులు తృప్తిగా దైవంపైన తమ మనస్సును లఘ్నం చేయగలరు. అంతేకాని భక్తి కలిగి ఉండాల్సిన చోట్లల్లో భయంకరమైన పరిస్థితులు ఉండకూడదు. అలాగే దేవుని పేరుతో కొట్లాటలు పనికిరానివి. మనం చాలా ప్రశాంతంగా దైవాన్ని కొలుచుకోవాలి. అప్పుడే భక్తిరసం పండుతుంది. దేవునిపట్ల భక్తునికి, భక్తునిపట్ల దేవునికి పరస్పర ఆమోదయోగ్యభక్తి నిండి ఫలితం అందుతుంది. అలాగే అంతటా శాంతిగానే ఉంది అంటూ సూక్తులు పలకటం కాదు. శాంతి కోసం నిత్యం కృషి చేస్తూ ఉండాలి. అంతే కాకుండా కుటుంబంలోని వ్యక్తులు ఒకరినొకరు వంచన చేసుకోకంఉడా బతకాలి వంచనతో, అబద్దాలు చెప్తూ బతికే ఇంటికి న్యాయం జరగదు. ఇంట్లోనివారే అబద్దాలు, మోసాలు, ద్వేషాలు చేసుకుంటూ బతికితే న్యాయందొరకుతుందా? నోటినిండా విసయం పెట్టుకున్న వాడిలాగా, ఇతరులను, ఇంట్లోని వారిని వంచించడం మంచిది కానేకాదు. మనిషి జీవితంలో న్యాయం దొరకాలంటే వంచన చేస్తూ బతికే గుణాన్ని వదులుకోవాల్సి ఉంటుంది.

### గజల్ 2 :

చేతగాని తనముంటే జాతకాన్ని నిందించకు, నమ్మ లేని సరుకుంటే అమ్మకాన్ని నిందించు ఎందుకైన మేలు లోపమెక్కడుందో తెలుసుకుంటే, చేయిజారిపోతుంటే జీవితాన్ని నిందించకు కలం రాయలేకుంటే కాగితాన్ని నిదించకు.

మనకు చేతగాకపోతే మన జాతకాన్ని మనమే నిందించుకోవడం తగింది కాదు. ఆత్మస్థైర్యంతో ముంద డుగు వేయడానికి, లోపం ఎక్కడుందో తెలుసుకొని జీవితగమనాన్ని దిద్దుకోవాలి. అంతా అయిపోయిన తర్వాత జీవితాన్ని నిందించిన లాభం లేదు. మనం ముందే మేల్కొని, ఏది మంచి, ఏది చెడు, అనే నిశ్చితాభిప్రాయ నిర్ణయాలు తీసుకొని, జీవితం సాఫీగా జరుగడానికి కావాల్సిన మంచి తుది నిర్ణయాలతో ముందడుగులు వేయాలి. అలాగే ఏ విషయాన్ని గురించైనా రాయడానికి ముందు పదునైన మెదడులోని ఆలోచనలు కావాలి కాని, నాకు రాయడం చేత కాలేదని కాగితాన్ని, కలాన్ని నిందించడం తగింది కాదు. రాయలేక పోతే కలం తప్పో, కాగితం తప్పో కానేకాదు. ఏది ఏమైనా మన జీవితం మన చేతుల్లోనే ఉంది. అది మంచికోసం ఉపయోగించే నిర్ణయం తీసుకుంటే మంచి జరుగుతుంది. కాని ఏ ప్రయత్నం చేయకుండా జీవితాన్ని జాతకాన్ని నిందించుకోవడం మంచిదికాదు. ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దుకొని ముందడుగులు వేసుకోవాలి.

### గజల్ 3 :

గాలిలోన ఎగిరిపడే గడ్డి పరక ఉపిరెంత, ఏటిలో నామళిపడేనీటి బుడగ ఉనికి ఎంత? అబ్బో దశపట్టిందని ఉబ్బిపోతె ఏం లాభం, కడలిలోన మిడిసిపడే కప్ప పిల్ల పాకుడెంత. నడమంత్రపు సిరినేర్పిన దుడుకుబుద్ధి దూకుడెంత?

ఈ గజల్ వలన మనిషిలోని అహంకారం, పొగరు, గర్వం అనేవి వెంటనే తొలగిపోతాయి. అహంకారంతో ఉండేవారు, తమ అభివృద్ధిని తామే నిరోదించినట్లు అవుతుంది. చాలా గొప్ప ఉదాహరణలో మనిషి గర్వాన్ని పోగొట్టుకోవాలని కవి చెప్తారు. పొగరు, గర్వం అనేవి ఎంత మాత్రం పనికిరానివనే మనిషి గ్రహించాలి. కొంత అందం, మరింత సంపాదన, సంపద ఉండగానే గర్వపడి పోవడం అస్సలు మంచిదికాదు. కొంత పాండిత్యం సంపాదించగానే గర్వపడిపోతూ, అహంకారం కలిగి ఉండడం మనిషికి అసలే మంచిది కాదనేకాదు. గాలిలో తలెత్తుకొని ఎగిసిపడే గడ్డిపరక, నీటిలోని నీటి బుడగ కడలిలో మిడిసిపడే కప్ప పిల్ల పాకుడెంత అంటూ మనిషి

పొగరు తనాన్ని అణచివేస్తారు కవి. గాలి, మేరు, కడలి వంటివి చాలా గొప్పవి, అలాంటి వాటినే చిన్నవి అంటూ తలపోసే వాటి కాలం ఎంత? బతుకు ఎంత అని ప్రశ్నించడం ద్వారా, అసలు విషయం తెలిసిపోతుంది. అలాంటి పొరపాటు ఆలోచనలతో నడమంత్రపు సిరితో అబ్బనాకింకా పర్వాలేదు అని ఉబ్బిపోవడం లాంటివి ఈ మనుషులకి అసలే పనికిరానివి. లోకానికి వచ్చినపుడు, పోయేటప్పుడు లేని 'నడమంత్రపు సిరిన'' చూసి మురవడం అసలే మంచిదికాదు.

## గజల్ 4 :

పరులకోసం పాడుపడని నరుని బతుకుదేనికని, మూగనేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని? జల్లుకు నిలవని ఎండకు ఆగని చిల్లుల గొడుగు దేనికని, పదపదమంటూ పదములేగాని కదలని అడుగుదేనికని?

ప్రశ్నించడం వలన ఆలోచనలు పెరగడం, ఆలోచనల వల్ల నిజం గ్రహించం, అనేది ఉంటుంది. గజల్స్‌లో ప్రశ్నలుంటాయి. అందులోనే జవాబులుంటాయి. ప్రశ్నించే వారే, జవాబులు చెప్పడం అనేది గొప్ప విషయం. మనుషుల లేదా నరులు ఇతరుల కోసం పాటుపడాలి. ఇతరులకోసం అందరూ ఉపకరించాలి. అలా ఉప యోగపడని నరుల యొక్క బ్రతుకే వ్యర్ధమైంది, అంటూ మనిషిలోని స్వార్ధచింతనను తొలగిస్తూ ఇతరుల కోసం బతికే విశాల హృదయాన్నీ కలిగి ఉండాలని చెప్పే ఉద్బోధక విషయం ఇందులో ఉంది. ఒకవేళ ఎవరైనా మనిషి స్వార్ధపూరితంగా వ్యవహరించే వారుంటే, వారి బ్రతుకు వ్యర్ధమని గ్రహించి, వెంటనే పరుల కోసం పాడుపడే నిర్ణయాలను తీసుకుంటారు. ఎందుకంటే వారు ఎండకూ, వానకూ పనికిరాని గొడుగు లాంటివారుగా మిగిలిపోరాదని భావిస్తారు. స్వార్ధపూరిత స్థితిని వదిలి వారి అడుగులు ఇతరుల అభివృద్ధివైపునకు పరుగులు తీస్తుంటాయి. స్వార్ధపూరిత మనస్థత్వం చిల్లులతో కూడిన గొడుగు లాంటిదిగా భావించాల్సి ఉంటుంది.

## గజల్ 5 :

నింగిలోతును చూడగోరితె నీటి చుక్కను కలుసుకో రత్నతత్త్వం చూడగోరితె రాతిముక్కను కలుసుకో అణువు నడిగితె తెలియదా బ్రహ్మాండమంటే ఏమిటో మౌన శిల్పం చూడగోరితె మంచుగడ్డను కలుసుకో మనిషి మూలం చూడగోరితె మట్టి పెడ్డను కలుసుకో మనిషి దేనికోసం అన్వేషించాలనుకుంటారో, పరిశోధనల్లోకి వెళ్ళాలను కుంటారో, వారు ముందుగా వాటి మూలాల్లోకి వెళ్ళాలి.

ఏదైనా విషయాన్ని గూర్చిన పూర్తి సమాచారం కావాలంటే వాటి మూలాల్లోకి వెళ్ళి పరిశోధించి విషయ సాధన చేయాలి. అంతేకాని పై విషయాలు చూసి మన అభిప్రాయం చెప్పడం కాకుండా, నింగి, నేల, రత్నం, బ్రహ్మాండం, మనిషిలాంటి అనేక విషయాలను, అన్వేషణ కోసం, ఎక్కడికో వెళ్ళాలో చెప్తారు. మనిషి మూల మంతా మట్టిపెడ్డలో ఉందంటారు. నిజానికి మట్టిపెడ్డలో నుంచే అన్నీ పుడుతున్నాయి. అక్కడ పుట్టింది, చివరికి అక్కడికే చేరుతుంది. కావున మట్టిపెడ్డను కలుసుకుంటే మనిషి మూలం పూర్తిగా తెలుస్తుంది.

## గజల్ 6 :

ఎంతటి ఎత్తులకెదిగినా ఉంటుందీ పరీక్ష, హిమగిరి శిరసెమండితే అది మేరవుతుంది. బిరుదుల పొందే వ్యాప్తికీ విలువేమి 'సినారె'', చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుంది.

ఎవ్వరు ఎంతటి స్థాయిలోకి వెళ్ళినా అక్కడా రకరకాల పరీక్షలతో జీవితంలో అనేక ఆటంకాలు ఎదురవుతూ ఉంటాయి కాని, పేరు కోసం కాకుండా గొప్పత్యాగం చేస్తే, చరిత్రలో కూడ మన పేరే నిలిచిపోతుంది.

## సంప్రదించిన గ్రంథం :


1. సినారె సమగ్ర సాహిత్యం - ఆరవ సంపుటి
2. సినారె ప్రపంచపదులు
3. 'విమర్శిని'


★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జాతీయోద్యమం - ముస్లిం కవుల, రచయితల సాహిత్యం

– డా॥. కోయి కోటేశ్వరరావు

తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్.

**సంక్షిప్త పరిచయం :**

భారతదేశంలో సుదీర్ఘమైన ,స్ఫూర్తిదాయకమైన ఉద్యమం జాతీయోద్యమం. ప్రపంచ చరిత్రలో ఈ ఉద్యమానికి ప్రత్యేక స్థానం ఉంది.కొత్త పోరాట రూపాలను ,విలక్షణ నిరసన విధానాలను ఈ ఉద్యమం ముందుకుతీసుకు వచ్చింది . ఈ ఉద్యమ ప్రభావంతో గొప్ప సాహిత్యం వెలువడింది. జాతీయోద్యమ సాహిత్యంలో ముస్లిం కవులు ,రచయితలు సమున్నత పాత్ర నిర్వహించారు. ముస్లిం కవులు,రచయితల సాహిత్యం ,జాతీయోద్యమానికి ఎలా దోహదపడిందో విశ్లేషించడమే. ఈ వ్యాస ఉద్దేశ్యం

**కీలక పదాలు :**

జాతీయోద్యమం, హరిజనోద్యమం, దేశభక్తి, ఆస్తిత్వ ఉద్యమాలు, ముస్లిం సాహిత్యం వలసపాలన, సూఫీ వేదాంత తత్త్వం. సాంస్కృతిక ఆరాధన, జాతీయస్ఫూర్తి, బ్రిటీష్ సామ్రాజ్యవాదం

ఓసి జాతీయతా, నీ బలోజ్జ్వలత్వ
మెంత? నీ శక్తి సామర్థ్యమెంత ? నీదు
శంఖరవమున గల యింద్రజాల మెంత ?
ఆస్థి పంజరములు సైత మాడు నౌర !

(దువ్వూరి రామిరెడ్డి)

ఫలాలు భక్షించటమే కాదు అందుకు కారణమైన మూలాల ఎరుక కూడా సమాజానికుండాలి. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలు దేశమంతా ఘనంగాజరుపుకున్న శుభతరుణంలోఈ స్వాతంత్ర్య సముపార్జనకు తమ జీవితలను ధారబోసిన త్యాగ ధనుల పాదముద్రలను తడిమి స్ఫూర్తి పొందాలి. మరణంలేని వారి మహా ఆశయాలను మన కార్యాచరణలోకి బట్వాడా చేసు కోవాల్సిన అవసరమెంతైనా ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో సంపన్న దేశాలసాంస్కృతిక ప్రభంజనంలో చిక్కుకున్న మన దేశీయతను భద్రంగా కాపాడుకోవాలి. అస్వతంత్రతానియతమైన జాతి జీవనాడులలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ప్రవహింప జేసిన సాహిత్య సంస్కారాన్ని అందిపుచ్చుకోవాలి. నా దేశం, నా సంస్కృతి,నా భాష అనే అహంకార దర్పనం, ఆత్మగౌరవ విశ్వాసం ప్రతి మనిషికి ప్రాణవాయువు అంత అవసరం. సమున్నతమైన ఈ విశ్వాసమే మౌలికంగా జాతిపురోగతికి బాటలు వేస్తుంది. ఇదే దేశభక్తి జాతీయత. కుల,మత,వర్గప్రాంతాలకతీతంగా జాతీయ భావన ప్రజలందరిలోనూ ఉంటుంది. ఆయా సామాజిక రాజకీయ పరిస్థితులను అనుసరించి నాయకులు, కవులు, రచయితలు ఈ భావనను ప్రజ్వలింపజేసి మహెూన్నత ఉద్యమాన్నినిర్మిస్తారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తుదముట్టించి, స్వతంత్ర భారతాన్ని నిర్మించడానికి తమ ప్రాణాలను తృణప్రాయంగా ధారపోసిన నాయకులే నిజమైన

ఇలవేల్పులని డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య అమరవీరులకు నీరాజనాలు పలికాడు.

ప్రపంచ పోరాటాల్లో భారత జాతీయోద్యమం కీలక మైనది. జాతీయోద్యమ నేపథ్యంలోనే ఆధునిక తెలుగు సాహిత్యం బలోపేతమై ప్రజాసమూహాలకు చేరవయింది. జాతీయత ఆధునికత పరస్పర పరిపోషకాలని చెప్పవచ్చు. ఆధునిక తెలుగు సాహిత్యంపై జాతీద్యమ ప్రభావాన్ని మద్దూరి సుబ్బారెడ్డి తన సిద్ధాంతగ్రంథంలో విపులంగా చర్చించాడు. ఎనభయ్యో దశకంలో లింగ, కుల,మత, ప్రాంత వివక్షలకువ్యతిరేకంగా ఆవిర్భవించిన అస్తిత్వ ఉ ద్యమాలు వర్తమాన తెలుగు సాహిత్యాన్ని ప్రధానంగా నిర్దేశిస్తున్నాయి. దళిత, స్త్రీవాద, ముస్లింవాద సృజన కారులు సమకాలీన సాహిత్యానికి సరికొత్త జవజీవాలను అందించారు. ముస్లింకవులు, రచయితలు, రచయిత్రులు తెలుగులో విస్తారమైన సాహిత్యాన్ని సృష్టించారు. గత 2 దశాబ్దాల్లో తెలుగులో వెలువడినంత ముస్లిం సాహిత్యం మరే ఇతర భారతీయ భాషల్లో రాలేదు. ముస్లింల దేశభక్తి, జాతీయత ఇలాంటిఅంశాలగురించిరాజకీయాల్లో చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో జాతీయోద్యమంలో ముస్లిం కవుల, రచయితల పాత్ర గురించి సమీక్షించు కోవడం ఎంతో అవసారం. సికిందర్ మోహిసిన్ అన్నట్లు మన జాతీయోద్యమ చరిత్ర ఎన్నో నదులు, ఉపనదులు ఎన్నో ప్రవాహాలు కలిసి రూపొందిన మహాసాగరం లాంటిది. అన్నీ మతాలు, అందరూ వ్యక్తులు దీనికి తమ వంతు శక్తిని ధారపోసి అమరులయ్యారు.''మన దేశ స్వాతంత్ర్యం ఏ ఒక్క మతమో ,వర్గమో ,సంపాదించి పెట్టిందనే భావం ఎవరికైనా ఉంటే అటువంటి వ్యక్తి యొక్క చరిత్ర పరిజ్ఞానాన్ని, దృక్పథాన్ని మనం తప్పక శంకించవలసి వస్తుంది. దేశ స్వాతంత్ర్యం కోసం హిందువు లతో పాటు మహమ్మదీయ సోదరులు కూడా వీరోచిత మైన పాత్రను నిర్వహించారు '(స్వాతంత్ర్య సమరంలో ముస్లిం యోధులు) హీరాలాల్ మోరియా అన్న మాట అక్షరాల నిజం. సయ్యద్ నశీర్ అహమ్మద్ ఈ దిశగా అత్యంత విలువైన పరిశోధన చేశాడు.' '1857 ముస్లింలు', 'భారతస్వాతంత్ర్యోద్యమం ముస్లింలు', 'భారత స్వాతంత్ర్యోద్యమం ముస్లిం మహిళలు', 'భారత స్వాతంత్ర్యోద్యమం ప్రజా పోరాటాలు', 'ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూముస్లింల ఐక్యత'వంటి 20 గ్రంథాలను రచించి, స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై కొత్త వెలుగులు ప్రసరించాడు. సయ్యద్రహంతుల్లా (వర్తమాన తరంగిణి), మీర్జాఫర్ ఆలీఖాన్ (విద్వన్మనో హారిణి), బజులుల్లా సాహెబ్ (సత్యాన్వేషిణి) షేక్ అహమ్మద్ సాహెబ్ (ఆరోగ్య ప్రదాయిని), మహబూబ్ ఆలీఖాన్ (ది ఆజాద్) లాంటి తొలితరం ముస్లిం రచయితలు, పాత్రికేయులు, సంపాదకులు స్వాభిమానాన్ని, స్వాతంత్ర్య సమర ఆశయాలను, లక్ష్యాలను. ఉద్యమ విశేషాలను తమ పత్రికల ద్వారా ప్రచారం చేశారు. భారతిమాసపత్రికలో కొంతమంది తొలితరం ముస్లిం రచయితల వివరాలు లభ్యమవు తున్నాయి. షేక్ మిశ్కన్ సాహెబ్, షేక్ ఫరీదుసాహెబ్, షేక్ దౌలా మహమ్మద్, షేక్ దావూద్ షాహెబ్ (ఆజాద్ చరిత్ర, సూఫీ సూక్తులు) అహమ్మద్ఆలీ ఖాదర్ సాహెబ్ (ఓరుగల్లు చరిత్ర) మొదలగు కవుల గురించి కొంత సమాచారం తెలుస్తుంది. షేక్ ఖాసిం సాహెబ్ (దేశమంటే, వీరభద్ర విజయం), జైనుల్ మహమ్మద్, బడే సాహెబ్, యస్. యమ్.మహబూబ్, షేక్ మహమ్మద్ హుస్సేన్, షేక్ మీరా జాన్, యార్ మహమ్మద్ లాంటి కవుల రచయితల గురించి డాక్టర్ షేక్ మస్తాన్ తన గ్రంథంలో ప్రస్తావించాడు.

జాతీయోద్యమ స్ఫూర్తిని దశదిశలా ప్రసరింప జేయడంలో హిందువులతోపాటు ముస్లింలు కూడా ముందు నిలిచారు. భారత దేశ విముక్తి పోరాటంలో ప్రజల గొంతుల్లో ప్రతిధ్వనించిన ప్రఖ్యాత నినాదాలు ఇచ్చిన వారు, గేయాలను రాసినవారిలో అనేకమంది ముస్లింలు కావడం ఎంతో విశేషంగా భావించవచ్చు. 'సర్ఫ్ ఫరోషికీ తమన్నా అబ్ హమారే దిల్ మేం హై' అనే దేశభక్తి గేయాన్ని బిస్మిల్ అజిమా బాదీ రాశాడు. భారతీయుల్లో దేశభక్తి పరంగా గొప్ప భావోద్వేగాన్ని కలిగించిన నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాద మిచ్చిన దేశభక్తుడు మౌలానా హస్రత్ మోహాని సుభాష్ చంద్రబోస్ సైన్యంలో మేజర్ గాపనిచేసిన అబిద్ హుస్సేన్ సఫ్రాని జైహింద్ నినాదాన్ని ఇచ్చి భారతీయుల్లో ఆత్మగౌరవ చైతన్యాన్ని

రగిలించాడు . 'మాదరేవతన్ భారత్ కీ జై' అనే నినాదంతో అజీముల్లా ఖాన్, సైమన్ గో బ్యాక్ నినాదంతో యూసెఫ్ మెహర్ ఆలీ లాంటి వారు వలసపాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు. నైజాం రాజ్యానికి చెందిన తుర్రే బాజీ ఖాన్ బ్రిటీష్ రెసిడెన్సీ మీద దాడిజేసి సైనికుల చేతుల్లో హతుడయ్యాడు.

'ఈ దేశంలో వలసవాద పాలనను ఎదిరించి పోరాడిన వారిలో ముస్లింలు కూడా అగ్రభాగాన ఉన్నారు. భారత సమాజ బహుళత్వానికి ఎన్నో విలువైన భాషా సాహిత్య సాంస్కృతిక జీవన వ్యవహారాల సంప్రదాయాలను అందించినది ముస్లింలు. ఈ దేశానికి పాలకులుగా వచ్చినప్పటికీ, ఆ పాలక వర్గం లోని ఒక చిన్న శిష్ట బృందం సమాజం మీద మిగిలిన పాలక వర్గాలన్నిటి లాగే ప్రవర్తించినప్పటికీ, అసంఖ్యాక ప్రజలు ఇతరమత విశ్వాసులతో సమానంగా, స్నేహ పూర్వకంగా కలిసి పోయారు'' (మఖ్దూం వ్యక్తిత్వానికిదర్పణం -'షాయరే తెలంగాణ మఖ్దూం మొహియుద్దీన్ జీవితం -కవిత్వం' పుస్తకానికి ముందు మాట) అని యన్ వేణుగోపాల్ విశ్లేషించాడు. రాజకీయ పరమైన ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఒక ఐక్య స్ఫూర్తి జాతీయోద్యమ సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. దేశాభిమానం, సాంస్కృ తిక ఆరాధన, నాయకస్తుతి, వీరుల ప్రశంస,జాతి ,మత భాషా వివక్షల తదితర అంశాలతో జాతీయోద్యమ సాహిత్యం పాయలు పాయలుగా విస్తరించంది. ముస్లిం మతానికి చెందిన కవులు రచయితలు ఈ అంశాలను తమ సాహిత్యంలో ఆమోదయోగ్యంగా మాతృదేశ ప్రేమైక దృష్టితో చిత్రించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఉమర్ ఆలీషా విశిష్టమైన కవి. నాటకం, ప్రబంధం, నవల, ఖండకావ్యం, జీవిత చరిత్ర, వేదాంత కీర్తనలు, విమర్శ, అనువాదం తదితర ప్రక్రియల్లో 50 పైగా గ్రంథాలు రచించాడు. వైవిధ్య భరితమైన ఉమర్ ఆలీషా సాహిత్య ఉద్యానవనం సూఫీ వేదాంతతత్త్వ సుమాలతో పరిమళిస్తుంది. సాహితీ వేత్తగానే కాకుండా రాజకీయ నాయకుడుగా ఆయన బ్రిటీష్ పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. తెలుగులో జాతీయోద్యమ సాహిత్యంలో ఉమర్ ఆలీష రచనలు విలక్షణమైనవి. 'తెలుగులో జాతీయోద్యమ కవిత్వం', 'తెలుగు సాహిత్యం ముస్లింల సేవ' లాంటి సిద్ధాంత గ్రంథాల్లో ఉమర్ ఆలీషా దేశభక్తి గురించి జాతీయ భావన గురించి మద్దూరి సుబ్బారెడ్డి, షేక్ మస్తాన్ లు విపులంగా చర్చించారు.

'తెలుగు మాతృభాష కాకపోయినా స్వస్థాన వేష భాషా ప్రియులైన ఉమర్ ఆలీషా జాతీయతను ఉద్బోధిస్తూ దేశభక్తి స్ఫోరకాలైన అనేక కావ్య ఖండికలను వెల యించారు. వీరి దేశ భక్తి ఖండికలలో భారత దేశ వైభవోన్నతులు, భారతీయుల శక్తి సామర్థ్యాలు ,ధైర్య స్థైర్యాలను శ్లాఘిస్తూ భారత జాతి గత వైభవ స్మృతులను మస్తిష్కంలో తటిల్లతలా మెదిలే విధంగా చిత్రించారని'' (తెలుగు సాహిత్యం ముస్లింల సేవ సిద్ధాంత గ్రంథం) షేక్ మస్తాన్ ఉమర్ ఆలీషా సాహిత్యంలో జాతీయ స్ఫూర్తిని దేశభక్తి తత్వాన్ని సముచితంగావిశ్లేషించాడు. ఉమర్ ఆలీషా తన రచనల ద్వారా జాతీయోద్యమ భావధారను కోటిగొంతుకలతో గానం చేశాడు . '' జననియు జన్మ భూమియును స్వర్గముకన్న గరీయమైనది 'అన్న మాట మాత్రమే తన వీనులకు హాయి గూర్చు తుందని చెప్పాడు. జాతీయోద్యమంలోని అనేక మలుపులను, సంఘటనలను వాటి పూర్వాపరాలను తన పద్యాల్లో వర్ణించి ప్రజల్లో జాతీయ ఆలోచనలను ప్రచారం చేశాడు. 'ధర్మమొక్కటి, మరియున్ జననియగు జన్మభూమికి ననుకూలండగుట యిడుముల వడుచున్నన్' ధర్మాచారణ, జన్మభూమి విధేయత ఈ రెండుపనులను మనిషి తప్పకుండా చేయాలని ఉమర్ ఆలీష ఉద్బోధించాడు.

'వాఙ్మయమునకిది తొల్లి వాస భూమి
తత్త్వగానంబునకు నిది తల్లి వేరు
పూత చరితలు సాధ్వుల పుట్టినిల్లు
కవులకును వీరులకు నిది కాణ యాచి
ఇదియె నా జన్మభూమి నాకిదియె తల్లి' (ఖండ కావ్యాలు) 'భారతదేశ ఔన్నత్యాన్ని కొనియాడాడు కవి. అఖిల జగాలకు ఏది జ్ఞానాభిక్ష పెట్టిందో, సమస్త విశ్వానికి ఏది అన్నం పెట్టిందో, అన్నీ జాతులకు ఏది ఉపాధిగా

నిలిచిందో, ఎక్కడ పాడి పంటలు పరిమితి లేక పండు చుండునో ఆ పవిత్రభూమి నా జన్మ భూమి అని ఉమర్ అలీషా ఆత్మగౌరవ శంఖారావంపూరించాడు. జాతీయోద్యమ కాలధర్మ నిబద్ధుడై ఆయన రచనలు చేశాడు. జన్మభూమి, జాతీయ సమైక్యత, జాతీయ గీతం, జాతీయ విద్య, ఎవరు తల్లి, జల్యనువాలాబాగు లాంటి అనేక ఖండికల ద్వారా జాతీయతను, దేశభక్తిని ఉమర్ ఆలీషా చాటిచెప్పాడు. దేశ ఆత్మగౌరవానికి పవిత్ర చిహ్నమైన భారత మాతను ప్రస్తుతించడం జాతీయోద్యమ సాహిత్యంలో ప్రధాన అంశం. భరతమాత కేంద్రంగా ఉమర్ ఆలీషా భారత దేశ పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రాభవాలను కీర్తించాడు. ఈ కవి రాసిన 'దేశమాత దండకం' ఇందుకు నిదర్శనంగా కనిపిస్తుంది 'శ్రీ మన్మహా భారతాంబా ప్రపూర్ణ ప్రభా భాసురోదీర్ణసౌవర్ణ/ వర్ణావలంబానిరాలంబ దంచాద్యానంత ప్రలంబాలసత్ చారు శృంగార /సంపత్కదంబా భవచ్చిత్ర చారిత్ర్యముల్ స్తోత్ర పాత్రంబులై, మిత్రసంప/త్సదారామచైత్రంబులై లోక కళ్యాణ సూత్రంబులై, జన్మ జన్మాంత /రాదర్శ పాత్రంబులై, యెన్నవెన్నంబవిత్ర ప్రధానంబులై క్షేత్రమున్/ క్షాత్రమున్ గల్గి వెల్గొందు, నీరూపు, నీయోజ, నీశక్తి, నీకీర్తి యెవ్వారు/వర్ణింప శక్యంబు తల్లీ ! జగత్కల్పవల్లీ'' అంటూ ప్రౌఢబంధురమైన దండకంతో భరతమాతను అద్భుతంగా కీర్తించాడు. 'వంగ, కళింగంబు, కాశ్మీర, సౌవీర, సౌరాష్ట్ర, కేరళ, పాంచాల, కర్ణాట ఛప్పన్నదేశాలతో, వీరారులన్ జీల్చి చెండాడు, నుద్దండ కోదండ పాండిత్యముల్ గల్గు శూరులతో, మహావీరులతో, బౌద్ధ చార్వాక, కాపాలికానీక శాక్తేయ సిద్దేశ్వరాద్వైత మతాలతో అలరారుతున్న దేశమాత బహుముఖీన కీర్తి ప్రతిష్టలను ఉమర్ ఆలీషా అభివర్ణించాడు. జాతీయోద్యమంలోని హింసాత్మక మైన ఘట్టాలను, వీరోచితమైన సంఘటన లను, నాయలుల ధైర్య సాహసాలను ఆనాటి కవులు ప్రభావశీలంగా తమ రచనల్లో ప్రస్తావించారు.

'జలియనుబాగులోజనుల జంపిన రక్తము వర్ష పాతముం
బలెప్రవహించెబీమొండెములన్ బ్రాణములుండిన వారి యార్తిసం
కలితరవంబు గర్జనము కైవడిమ్రోసేదిగంత భూములన్' (జల్యనువాలా బాగ్ )

అంటూ ఉమర్ ఆలీషా బ్రిటీష్ పాలకుల క్రూరమైన హింసా ప్రవృత్తిని ఎండగట్టాడు. శత్రువులు రగిలించిన యుద్ధ జ్వాలల్లో ఆహుతి కావడానికి సిద్ధపడతారు కానీ వెన్ను చూపి పారిపోవటం తెలియని భారత స్వతంత్ర సమరవీరుల ధీరత్వానికి ఈ కవి జేజేలు పలికాడు. ప్రళయ పయోధరములాంటిఫిరంగిగుండ్లతో శరీరమంతా నెత్తురు జల్లెడ వలె మారిపోయినా శత్రువు చేతికి చిక్కకుండా తప్పించుకొనే ధీరయోధులకు అక్షర ప్రణామాలు సమర్పించాడు ఈకవి. మహాత్మాగాంధీ నేతృత్వంలో సాగిన హరిజనోద్యమం కూడా జాతీ యోద్యమంలో అంతర్భాగంగా సాగింది. సవర్ణులతో పాటు దళితులను కూడా సమానంగా ఆదరించాలని ఉమర్ ఆలీషా పిలుపునిచ్చాడు.

'స్వపచ బ్రాహ్మణ భేదముల్ సలిపి మనుజ
కోటియను మేటి సౌధంబు కూల గొట్టి
నిప్పుపెట్టిరి, దానిచే నేటిదాక
మండు చున్నది గాని యే పండితుండు
నడుముగట్టి ఆ చిచ్చార్ప గడగ లేదు'
(నిమ్న జాత్యుద్ధరణ)

అంటూ అంటరాని సమస్య తీవ్రతను ఈ సమస్యను రూపుమాపడంలో సంఘసంస్కర్తల పరిమితులను ఎత్తి చూపాడు. దేశవిముక్తి సాధనలో దళిత విముక్తి కూడా ముఖ్యమని, సర్వమత సమానత్వాన్ని, జాతీయ సమైక్యత ఆవశ్యకతను ఉమర్ ఆలీషా తన కవిత్వంలో ప్రముఖంగా పేర్కొన్నాడు.'' ఈ దేశ ప్రజయాడు జాతిని మహాహేయంబుగా జూచునో' ఆ దేశం పతనమవు తుందని దావూద్ కవి హెచ్చరించాడు. దళితుల ,స్త్రీల సంస్కరణలతోనే భారత దేశ అభివృద్ధి వేగవంతమవు తుందనే భావనతో ముస్లిం కవులు రచనలు చేశారు .

'హిందూమూసలిమానులొక్కటయి ఈ హిందూ మహారాజ్యమం
దెందున్ వైరి పిశాచమండలము రానీకుండగా జేసి ని
స్సందేహంబుగ రాజ్యలక్ష్మిని ప్రతిష్టానంబు గావించి, యా

నందంబీయగజాలు'' (రాటము) అంటూ ఉమర్ ఆలీషా హిందూ ముస్లింల ఐక్యతను తెలియజేశాడు . ఈ సమైక్యతతోనే శత్రువులను ధిక్కరించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించవచ్చునని ఈ కవి ప్రబోధించాడు. ఆంధ్రదేశమనే ఓడలో అన్నీ మతాల వారు ప్రయాణం చేస్తున్నారని, విద్వేషభావంతో ఓడ కు ఎవరు రంధ్రం చేయాలని ప్రయత్నించినా అందరికీ ప్రమాదం సంభవిస్తుందని ఈ కవి హెచ్చరించాడు. బ్రిటీష్ ముష్కరుల దోపిడీ తత్త్వాన్ని, వారు సాగించిన దమన కాండను ధిక్కరిస్తూ భారతీయ నాయకుల త్యాగాలను ప్రస్తుతిస్తూ కవిత్వం రాసిన ఉమర్ అలీషా బ్రిటీష్ దొర పంచమ జార్జిని కీర్తిస్తూ పద్యాలు రాయడం ఒక వైరుధ్యంగా భావించవచ్చు.

గత వైభవ స్మరణంతో వర్తమాన చైతన్యానికి తగినంత ప్రేరణ కలిగించటానికిఈ రచయితలు పౌరాణిక, చారిత్రక నాటకాలు రాశారు. జాతీయోద్యమంలో ఈ విధమైన సాహిత్యం విస్తృతంగా వచ్చింది. మాతృదేశాభిమానాన్ని ప్రజల్లో పెంపొందింపజేయులనే సంకల్పంతో ఉమర్ ఆలీషా చంద్రగుప్త అనే చారిత్రక నాటకం రాశాడు. దేశవాసులందరూ దేశసమైక్యత కోసం పాటుపడాలనే సందేశాన్ని కవి ఈ నాటకం ద్వారా తెలియజేశాడు. భారతదేశాన్ని కొల్లగొట్టాలని వచ్చిన సెల్యూకస్ పాత్రద్వారా భారతదేశఔన్నత్యాన్ని చెప్పిస్తాడు నాటక రచయిత. గ్రహాలలో సూర్యుడు, దేశాలలో భారత దేశం అత్యంత శక్తివంతమైనవని రచయిత ప్రబోధించాడు. తక్కలపల్లి పాపాసాహెబ్ (రాణీ సంయుక్త), షేక్ దరియా హుస్సేన్ ('పురుషోత్తముడు), గఫూర్ బేగ్ (గ్రీష్మంలో వసంతం) తదితర ముస్లిం రచయితలు నాటకాల ద్వారా దేశభక్తిని చాటి చెప్పారు.

షేక్ దావూద్ (దాసీపన్నా) మహమ్మద్ గఫూర్ బేగ్ (జాతీయ సమైక్యత) షేక్ ఖాసింసాహెబ్, జైనుల్ మహమ్మద్, షేక్ దరియా హుస్సేన్ లాంటి కవులు జాతీయోద్యమ భావజాలాన్ని తమ సాహిత్యం ద్వారా ప్రచారం చేశారు. మౌలానా మహమ్మద్ ఆలీ, ఫరీదుద్దీన్, దస్తగిరి లాంటి కవులు గాంధీ మొదలగు దేశనాయకుల గురించి స్మృతి కావ్యాలు రచించారు.

ప్రఖ్యాత కవి మఖ్దూం మొహియుద్దీన్ భారతదేశ విముక్తిని ఆకాంక్షిస్తూ కవిత్వం రాశాడు.భారత దేశ ఘన కీర్తిని కొనియాడాడు.

'రక్తంతో పండించిన రంగు రంగుల పూదోటపై ఒట్టు
రైతుల రక్తం పై ఒట్టు అమరుల రక్తం పై ఒట్టు
ప్రపంచంలో సముద్రాలు ఎండిపోవచ్చు
నదులు ప్రవహిస్తూ అలసి పోవచ్చు
విద్యుత్ ప్రవాహాల వేగం స్తంభించవచ్చు
కానీ పవిత్రమైన ఈ భూమి
అపవిత్రుల భారాన్నిక మోయలేదు
దేశ స్వాతంత్ర్య దీపం ఎన్నటికీ కొడి గట్టదు'' (షాయరే తెలంగాణ మఖ్దూమ్ మొహియుద్దీన్ జీవితం కవిత్వం - వాహెద్) మఖ్దూం గొప్ప ఆశాభావాన్ని దేశ భక్తిని చాటి చెప్పాడు.

'కార్మిక రాజ్యం రానపుడు ఈ స్వాతంత్ర్యం ఏం స్వాతంత్ర్యం' అని స్వరాజ్య భారతం కార్మిక రాజ్యంగా విలసిల్లాలని మిగతా జాతీయోద్యమ కవుల కంటే భిన్నంగా ఉదాత్తంగా మఖ్దూం ప్రశ్నించాడు. 'ఒక సంస్కృతికి చెందిన కవులు, రచయితలు, ఆ సంస్కృతికి వాహకమైన భాషలో రచనలు చేయడం సర్వ సామాన్యమైన విషయం. పరభాషను అభ్యసించి ఆ భాషా ముఖంగా తమ సంస్కృతిని, పరభాషా పరమైన సంస్కృతిని సహనంతో సరసంగా ప్రకటించడం అరుదైన అంశం '(తెలుగు సాహిత్యం ముస్లింల సేవ) ఈ అరుదైన అంశాన్ని తెలుగు ముస్లిం కవులు సమర్ధంగా సమరసంగా పోషించారని షేక్ మస్తాన్ వివరించాడు ఈ విధంగా జాతీయోద్యమంలో ముస్లిం కవులు సమున్నతమైన సాహిత్యాన్నిసృష్టించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగుసాహిత్యం : ముస్లింల సేవ (సిద్ధాంతగ్రంథం)- డాక్టర్ షేక్ మస్తాన్
2. స్వాతంత్ర్య సమరంలో ముస్లిం యోధులు - హీరాలాల్ మోరియా
3. ఆధునిక తెలుగు కవిత్వం పై జాతీయోద్యమ ప్రభావం - డాక్టర్ మద్దూరి సుబ్బారెడ్డి

★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# కోట్ల వనజాత కథలు – వస్తు సమకాలీనత, స్త్రీ పాత్రల విలక్షణత

– డా॥. జె. నీరజ

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ సిటీ కాలేజి (స్వయం ప్రతిపత్తి), హైదరాబాద్.

**వ్యాస సంగ్రహణం :**

కోట్ల వనజాత కథలు సమకాలీన తెలంగాణ సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తూ మానవ జీవితంలోని సంఘర్షణలు, పేదరికం, వలసలు, అవినీతి, మహిళల అణచివేత వంటి సమస్యలను లోతుగా ఆవిష్కరిస్తాయి. ఆమె రెండు కథా సంపుటాలు ఇత్తు, మైదాకు వసంతంలో గ్రామీణ జీవితం, కార్పొరేట్ మోసాలు, వలస కార్మికుల వేదన, కుటుంబ విలువల మార్పులు, ప్రకృతి-మానవ సంబంధాలపై సున్నితమైన చిత్రణ కనిపిస్తుంది. ముఖ్యంగా స్త్రీ పాత్రలు బాధితులుగానే కాకుండా ధైర్యవంతులుగా, పోరాట యోధులుగా, పునర్నిర్మాణ శక్తిగలవారిగా కనబడతాయి. వనజాత కథలు పాఠకులకు కొత్త దృక్పథాన్ని అందిస్తూ ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించాయి. కోట్ల వనజాత కథలలోని వస్తు సమకాలీనతను, ఆమె కథల్లోని స్త్రీ పాత్రల విలక్షణతను విశ్లేషించడం ఈ వ్యాసం ఉద్దేశం.

మానవ జీవన వైవిధ్యాన్ని, సమాజ హృదయ స్పందనలను, సామాజిక సంక్లిష్టతలను ఆవిష్కరించే శక్తివంతమైన మాధ్యమం కథ. తొలి కథ రచించిన భండారు అచ్చమాంబ నుండి నేటి ఆధునిక తరం వరకు ఎందరో రచయిత్రులు వైయక్తిక, కౌటుంబిక బంధాలు, అనుబంధాలు, కలహాల కాపురాలు, ప్రేమలు - పెళ్లిళ్లు వస్తువులుగా కథలు రాశారు. వర్తమాన రచయిత్రులు వ్యక్తిగత పరిధులను దాటి స్త్రీ చైతన్యాన్ని, సాధికారతను, సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలను ఇతివృత్తాలుగా కథనీకరిస్తున్నారు. ఈ వరుసలో తెలంగాణ నేలమీద సామాజిక దృష్టికోణంతో కథలు రాస్తున్న వైవిధ్య కలం కోట్ల వనజాత. వెలువరించింది రెండు కథా సంపుటాలే అయినా భిన్నమైన వస్తువులతో, ఆసక్తికర కథనంతో పాఠకుల, విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్న రచయిత్రి వనజాత. వనజాత కథలలోని వస్తు సమకాలీనతను, వారి కథలలోని స్త్రీ పాత్రల విలక్షణతని ఇక్కడ పరామర్శించుకుందాం.

వనజాత వెలువరించిన తొలి కథ సంపుటి 'ఇత్తు'. రాష్ట్ర ఆవిర్భావం తరువాత తెలంగాణ నుండి వినబడిన సామాజిక ఆర్ద్ర కథాస్వరం. 'తెలుగు జనజీవనాన్ని, వర్తమాన కాలపరిస్థితుల్నీ, తెలుగు వాళ్ళ ఆశానిరాశల్నీ వ్యక్తిత్వ వికాసాలకు కలుగుతున్న అవరోధాల్నీ, అన్ని రంగాల్లో జరుగుతున్న దోపిడీల్నీ, అన్యాయాల్నీ చిత్రించే సహజమైన కథలు రావాలని' ప్రఖ్యాత విమర్శకులు, భాషావేత్త పోరంకి దక్షిణామూర్తి గారు ఆశించినట్లు, వనజాత ఈ నేలమీద జీవన వైవిధ్యాన్ని, మానవ జీవన సంఘర్షణను తన కథలలో ఆవిష్కరించారు. 'సముద్రం' కథలో అప్పులు, వలస, పేదరికం, ప్రభుత్వ నిర్ణయాల వల్ల నలిగిపోయే జీవితాలలోని విషాదాన్ని ఒక నేతన్న

కుటుంబ నేపథ్యంలో చిత్రించింది రచయిత్రి. బొంబాయికి వలస వెళ్ళిన మహేశ్ చనిపోయిన భార్యకి దహన సంస్కారాలు చేయడానికి కూడా చిల్లిగవ్వలేక ఆమె మృతదేహాన్ని సముద్రంలో వదిలేస్తాడు. ఇది కేవలం ఒక కుటుంబ గాథ కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూలి పోవడం, ప్రభుత్వాల నిర్లక్ష్యం, కార్మిక వలసల వాస్తవాన్ని శక్తివంతంగా ఆవిష్కరించే దస్తావేజుగా చెప్పవచ్చు. సెజ్‌ల పేరుతో ప్రజలు భూములు కోల్పోవడం, గ్రామాలు ఖాళీకావడం, నిరుద్యోగం, వలసలు వంటి అంశాలు 'చివరి గుడిసెలో గాజు కళ్లు' కథలోని రమేశ్ జీవితంలో కనబడుతుంది.

ప్రభుత్వ విధానాల వల్ల గ్రామాలు ఉపాధి కరువై ఎలా అంతరించిపోతున్నాయో, పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చిన వారి దీనస్థితి ఎలా ఉంటుందో, నగరం లోని మురికివాడల దుస్థితిని, తెలంగాణ ఆకాంక్షలను రచయిత్రి పదునుగా వ్యాఖ్యానించారు. గిరిజన నేపథ్యం నుండి వచ్చిన చిన్నారి చాంది (లక్ష్మి) జీవితంలోని దుర్భర పరిస్థితులను, బాలల హక్కులు, శ్రమ దోపిడీ, సమాజం లోని అసమానతలు, అధికార దుర్వినియోగాన్ని విమర్శిస్తూ సాగిన కథ 'తార్ నామ్ కాయి చోరీ'. 'రాజన్న' కథ తరతరాలుగా సాగిన వివక్షకు బలైన తమ బిడ్డల వలన కలిగిన దుఃఖాన్ని అధిగమిస్తూ ప్రత్యేక రాష్ట్రసాకారం కోసం ఎదురుచూసిన తెలంగాణ తల్లుల ఆత్మశక్తిని చిత్రిస్తుంది. 1976 నాటి గ్రామీణ జీవన చిత్రం, 2011 తెలంగాణ ఉద్యమం కలిపి తల్లుల గర్భశోకాన్ని, నిరాశలోనూ ఆశను వీడని వారి పట్టుదలను చిత్రిస్తుంది. 'బహుముఖం' కథ ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక రూపాలలో, అనేక స్థాయిలలో విస్తరించిన అవినీతి ముఖచిత్రానికి అద్దం పడుతుంది.

ప్రభుత్వ ఉన్నతోద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రచయిత్రి తాను అతి దగ్గరగా చూస్తున్న ఉద్యోగ జీవితాల లోని విభిన్న పార్శ్వాలను, నైతిక విలువలకై నిలిచే వ్యక్తుల పోరాటాన్ని హృద్యంగా వివరించారు. 'మార్కెట్' కథలో ఒక పేద మహిళ జీవనపోరాటాన్ని, కుటుంబ వ్యవస్థలో మహిళ స్థితిని, ఆర్థిక, లైంగిక అణచివేతను చిత్రించారు. ఇక్కడ కూరగాయలే కాదు, మహిళల శరీరాలూ, గౌరవాలూ కూడా అమ్ముడవుతాయి. మార్కెట్ అంటే వస్తు వ్యాపారం మాత్రమే కాదు, మానవ విలువల విక్రయానికి కూడా చోటని ఈ కథ చెబుతుంది. 'స్వర్ణ కోసం' కథ సంప్రదాయ పెళ్లిళ్లలో చూపే ఆర్భాటపు ఖర్చులను ప్రశ్నిస్తూ, ఆడపిల్లల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన, వారి ఆస్తి హక్కుల గురించి చర్చిస్తుంది. జీవితంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సమస్యలపై స్త్రీలు ఎలా ధీటుగా నిలబడగలరో, వాటి పరిష్కారానికి కుటుంబం ఎలా మద్దతుగా ఉండాలో ఈ కథ ద్వారా సూచించారు రచయిత్రి.

'ఇత్తు' కథలో గ్రామీణ వ్యవసాయ జీవనాన్ని, ఆర్థిక విధానాల్లో మార్పులను, వాటి ప్రభావాలను ఒక మధ్య తరగతి కుటుంబ దృష్టికోణంలో చిత్రించారు రచయిత్రి. కరువు, పెట్టుబడుల కొరత, విత్తనాల కంపెనీల మోసాల వల్ల అన్నదాత అయిన అరుణ జీవితం నాశనమవుతుంది. వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకున్న రైతు జీవితానికి కార్పొరేట్ వ్యవస్థలు చేస్తున్న మోసాలు, అందరి కడుపులు నింపే రైతు చివరికి ఎక్కడికి, ఎలా చేరుతున్నాడో భావోద్వేగపూరిత కథనంతో అందించిన కథ ఇది. 'బతుకు సంత' కథ కుటుంబ పోషణ కోసం శ్రమించే గ్రామీణ స్త్రీల దైన్య జీవితాన్ని ఆవిష్కరిస్తుంది. 'నల్లతేళ్లు' కథ పల్లెల్లో ఆధిపత్య వర్గాల అణచివేత, లైంగిక వేధింపులపై ఒక సామాన్య మహిళ ఎలా తిరుగుబాటు చేసిందో, చీకటి చరిత్రలు ఎంత కాలానికైనా ఎలా వెలుగు చూస్తాయో చెప్తుంది. రాములమ్మ ఓ స్త్రీగా కాదు- ఒక సామాజిక మార్పుకి చైతన్యంగా నిలుస్తుంది.

ఈ కథా సంపుటికి ముందుమాటలో డా.ఎస్.రఘు అన్నట్లు, 'రచయితలు తమ చుట్టూ జరిగే పరిణామాలకు మౌన సాక్షులుగా ఉండక, సమస్యలకు మూల కారణాలను అన్వేషిస్తారు, పాఠకుల ముందుంచుతారు, ఆలోచనలు రేకెత్తిస్తారు'. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత వెలువడిన వనజాత తొలి కథాసంపుటి ఇందుకు బలమైన ఉదాహరణ. తొలి సంపుటిలోనే రచయిత్రిగా తన దృక్పథాన్ని స్పష్టంగా ప్రకటించారు.

వనజాత మలి కథాసంపుటి 'మైదాకు వసంతం'లోని కథలు మానవ జీవితంలోని సంఘర్షణను, జీవన

సంక్లిష్టతలను, బహుముఖీనమైన స్త్రీల పోరాట చైతన్యాన్ని ఆవిష్కరిస్తాయి.

'మైదాకు వసంతం' కథలో ప్రకృతి, మానవ ఆశయాల మధ్య సంబంధాన్ని చిత్రీకరిస్తూ, ఒక వ్యక్తి తన జీవిత భాగస్వామి కలను నెరవేర్చేందుకు చేసే ప్రయత్నం ద్వారా ప్రకృతి పట్ల ప్రేమను, వ్యవసాయంతో ఏర్పడే స్వావ లంబనను ఉన్నతీకరిస్తుంది. ప్రకృతిని ఒక సజీవ పాత్రగా చిత్రీకరిస్తూ, మైదాకు చెట్టును వసంత జ్ఞాపకంతో సంకేతాత్మకంగా అనుసంధానం చేయడం శిల్ప విశిష్టతకు నిదర్శనం. ఈ కథ ద్వారా రచయిత్రి రైతు జీవితం కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాదని, అది భావోద్వేగా లతో, జ్ఞాపకాలతో ముడిపడి ఉంటుందని స్పష్టం చేస్తారు. 'మైసమ్మ బండ' కథ భర్త త్యజించిన తరువాత ఒంటరిగా పిల్లలను పోషిస్తూ, సమాజపు అవమానాలు, అన్యాయా లకు ఎదురుగా ధైర్యంగా నిలబడిన సరోజ సాహసాన్ని చిత్రిస్తుంది. ఆమె నిర్భయ జీవనానికి, ఆత్మగౌరవానికి సంకేతంగా, 'మైసమ్మ బండ' ప్రతీకగా రచయిత్రి చేసిన సజీవ చిత్రణ కథను భావోద్వేగపూరితంగా మలచింది. 'కాళిక' కథ మోతుబరులకు ప్రభుత్వ స్కీముల మళ్లింపుతో సన్నకారు రైతుల వెతలు, ఎన్నికల సమయంలో ఏరులైపారే మద్యం రక్కసికి బలయ్యే కుటుంబాల నేపథ్యంలో కాళికగా మారిన రంగత్త జీవితం. సహజమైన సంభాషణలతో జీవన వాస్తవికతను ఆవిష్క రించిన కథ. 'నాలుకతో హత్య' కథలో 'నాలుక'ను ఒక హత్యాయుద్ధంగా సంకేతీకరించడం ద్వారా, మాటల శక్తిని, మానవ సంబంధాలలో వాటి ప్రభావాన్ని లోతుగా విశ్లే షిస్తుంది. 'కార్పొరేట్ కాకి' కథలో కాకిని ఒక రూపకంగా ఉపయోగించి, కార్పొరేట్ జీవనంలో మానవత్వ క్షీణతను వ్యంగ్యాత్మకంగా చిత్రీకరిస్తుంది. 'రెక్కల న్యాయం' కథ తరాల మధ్య పెరుగుతున్న దూరాలు, మారిన కుటుంబ విలువలపై సాగిన వాస్తవిక వ్యాఖ్యానం. ప్రత్యక్ష జీవిత దృశ్యాల ద్వారా, సంభాషణల శైలిలో మానవ సంబంధాల సంక్లిష్టతను నిగూఢంగా వెలికితీస్తుంది.

'వె(మ)ర్రి ప్రేమ' కథలో చెట్టు ఒక మౌన సాక్షిగా, స్త్రీ జీవిత బాధలను ప్రతిబింబిస్తూ, కథకు లోతైన తాత్వికతను జోడిస్తుంది. స్త్రీ జీవితం మొత్తం త్యాగానికి, బాధలకు, ప్రేమ కోసం ఎదురుచూపులకు అంకితమైన చోట ప్రేమకు అర్హత లేని ప్రపంచాన్ని చెట్టు ప్రశ్నించటం ఒక వినూత్న శిల్ప ప్రయోగం. 'గోధుమరంగు పిల్లి' కథ సామాజిక అన్యాయాలు, కుటుంబ సంబంధాలలోని వైరుధ్యాలు, మానవ జీవితంలోని నిస్సహాయతను చిత్రిస్తుంది. రాజవ్వ, పద్మ, చంద్రప్ప వంటి పాత్రల ద్వారా సంక్లిష్ట భావోద్వేగాలను, సమాజంలోని దురాచారాలను ఆవిష్కరిస్తుంది. "గోధుమరంగు పిల్లి" పురుషాధిపత్యానికి ప్రతీక. ఈ సామాజిక సంకేతాన్ని సాధనంగా సమాజంలోని హింస, దుర్మార్గాలను విమర్శిస్తూ, కథన శైలికి ఒక విభిన్న కోణాన్ని అందిస్తుంది. 'జరామరణ దుఃఖేనా?' కథ కరోనా లాక్‌డౌన్ సమయంలో దేశపు దేహంపై నిస్సహాయంగా నడక సాగించిన వలస కార్మికుల వేదనను కళ్ళముందుం చుతుంది.

సమాజంలోని అసమానతలు, వలస జీవితంలోని సంఘర్షణ, ఆర్థిక అనిశ్చితితో పాటు ప్రకృతి శక్తులు కూడా పేదవాడికి మరణాన్ని, దుఃఖాన్నే మిగుల్చుతున్న విషాదం పాఠకుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. 'రాలిపోతున్న అక్షరాలు' జర్నలిజం ప్రపంచంలో నైతిక విలువల క్షీణతను, నిజాయితీతో జీవించే ఒక వ్యక్తి ఎదుర్కొనే సవాళ్లను చిత్రిస్తుంది. 'వెంకట రమణీయం', 'బావా! ఎప్పుడు పోయెదవీవూ' కథలు హాస్య, వ్యంగ్య చిత్రణ ద్వారా సామాజిక, వ్యక్తిగత లోపాలను ఆవిష్కరిస్తాయి. 'నూర్జ హాన్నీరజ'లో మోసపోయిన యువతి, తిరిగి తన జీవితాన్ని పునర్నిర్మించుకుని శక్తివంతమైన మహిళగా ఆవిష్కృత మవ్వటమే కాక, తనలాగా తప్పటడుగు వేయబోయే వారికి ఒక పాఠంగా, ప్రేరణగా ఎదుగుతుంది. 'పునరాగమనం' కథ ప్రకృతికి, మనిషి జీవితానికి మధ్య సంబంధాన్ని తాత్విక దృక్పథంతో, నెమ్మదైన కథన శైలితో చిత్రీ కరిస్తుంది. ఈ కథలో గుట్ట, చెట్లు, నీటి మడుగులు వంటి సంకేతాలు పల్లె జీవన సౌందర్యాన్ని, తరాల మధ్య అనుబంధాన్ని సమర్థవంతంగా ఆవిష్కరిస్తాయి.

వనజాత కథలలోని స్త్రీ పాత్రలను చిత్రించిన తీరులో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ప్రతి కథలో స్త్రీలు జీవన సవాళ్లను ఎదుర్కొంటూ, ఆపదలను భరించి, కొన్నిసార్లు విరిగిపడుతూ, మరికొన్నిసార్లు ధైర్యంగా ముందడుగు

వేస్తూ కనిపిస్తారు. మైసమ్మ బండలో సరోజ ఒక ధైర్యవంతురాలిగా, సామాజిక నియమాలను, అవమానాలను ఎదిరించే శక్తిగా నిలుస్తుంది. ఆమె జీవితం బూడిదగా మారినా, ఆమెలోని అగ్ని మంట సమాజానికి ఒక సందేశంగా నిలుస్తుంది. కాళికలో రంగత్త ఒక సాధారణ ఇల్లాలు అయినప్పటికీ, ఆమె ఆగ్రహం, ప్రతిఘటన 'కాళిక' రూపంలో వ్యక్తమవడం ద్వారా స్త్రీ శక్తిని శక్తివంతంగా చిత్రీకరిస్తుంది. 'గోధుమరంగు పిల్లి'లో రాజవ్వ తన మేనకూతురిని రక్షించేందుకు చేసే త్యాగం, స్త్రీలపై జరిగే లైంగిక వేధింపులను ఎదిరించే ధైర్యం స్త్రీ పాత్రలలోని నిస్వార్థ శక్తిని చాటుతుంది.

పునరాగమనంలో శాంతి, అన్నపూర్ణమ్మ పాత్రలు తరాల మధ్య అనుబంధాన్ని, ప్రకృతి పట్ల ప్రేమను, జీవన విలువలను సమన్వయం చేస్తాయి. 'కుక్కను కొడితే'లో కథానాయిక ఒక నిజాయితీగల అధికారిణిగా, తల్లిగా, నానమ్మగా విభిన్న పాత్రలను సమతుల్యం చేస్తూ, సమాజంలోని అవినీతిని ఎదిరించే ధైర్యాన్ని ప్రదర్శిస్తుంది. 'కార్పొరేట్ కాకి' కథలో విలాసవంతమైన జీవనశైలికి అలవాటుపడి కుటుంబాన్ని ఆర్థిక సంక్షోభంలో పడేస్తున్న గృహిణిగా రాధిక, కుటుంబాన్ని చైతన్యపరచే శక్తిగా ఆమె అత్తగారి పాత్రలను రచయిత్రి సమర్ధవంతంగా చిత్రించారు. 'నూర్జహాన్నీరజ' కథలో జీవితంలో మోస పోయిన స్త్రీ కూడా ప్రేరణ, సహకారం అందితే స్వీయ సంకల్పం ద్వారా కొత్త జీవితాన్ని నిర్మించుకునే శక్తిగా, ఇతరులకు ప్రేరణగా నిలిచేటట్లు ప్రతిబింబించింది. రచయిత్రి స్త్రీలను కేవలం అణచివేతకు గురైనవారిగానే కాక, ధైర్యం, సహనం, పునర్నిర్మాణ శక్తి కలిగినవారిగానూ చిత్రించారు. ఈ విధంగా ఆమె స్త్రీ పాత్రలు సమాజంలోని వాస్తవిక జీవితాలను ప్రతిబింబిస్తూ, పాఠకుల వ్యక్తిత్వ నిర్మాణాన్ని తీర్చిదిద్దేలా నిలుస్తాయి. 'ఇత్తు' సంపుటిలోని కథల్లో స్త్రీలు బాధితురాలు (అరుణక్క, అంజమ్మ), ధైర్యవంతురాలు (రాములమ్మ), పోరాట యోధులు (స్వర్ణ, వసుధ), నిస్సహాయురాలు (మార్కెట్ కథానాయిక, సముద్రం స్త్రీలు) గా అనేక రూపాల్లో చిత్రితమయ్యారు. రచయిత్రి స్త్రీని కేవలం వర్తమాన సమాజంలో హింసకు గురవుతున్న, జీవన ఒత్తిడిలో నలిగిపోతున్న నిస్సహాయ దీనగానే కాకుండా సమాజాన్ని ఎదిరించగల, మార్చగల ధీరగా కూడా చిత్రించారు.

కోట్ల వనజాత కథలు సమకాలీన సమాజంలోని సంక్లిష్టతలను, మానవ జీవితంలోని వైవిధ్యమైన అనుభవాలను వాస్తవికంగా ఆవిష్కరిస్తాయి. ఆమె కథలు ఒకే దృక్కోణంతో మూసగా సాగక, విభిన్న జీవన సందర్భాలను, భావోద్వేగాలను సమన్వయంతో చిత్రిస్తాయి. సామాజిక, ఆర్థిక సంబంధాలు మనిషి జీవితంపై చూపే ప్రభావాన్ని సునిశితంగా పరిశీలించి చిత్రించడంలో వనజాత నైపుణ్యం స్పష్టమవుతుంది. ఆమె కథల్లోని పాత్రలు మూస ధోరణిలో కాకుండా, విభిన్న సంఘర్షణలు, ఆలోచనల మధ్య సంచరిస్తూ, జీవితంలోని అనిశ్చితిని, బహుముఖతను ప్రతిబింబిస్తాయి. ఈ కథలు సామాజిక వాస్తవికతను నిశితంగా పరిశీలిస్తూ, మానవ స్వభావంలోని సంక్లిష్టతను ఒడిసిపట్టే సృజనాత్మక వాహికగా నిలుస్తాయి.

కథాంశంతో సంబంధంలేని ప్రకృతి వర్ణనలు, పాత్రల ఉన్నత భావాలు, రచయిత ఆదర్శాలను వర్ణించాలనే చాపల్యం వనజాతలో కనబడదు. ఆమె కథలు పాఠకులను తమ అనుభవ పరిధిని విస్తరించుకునేలా ప్రేరేపిస్తాయి, సమాజంలోని వైరుధ్యాలను, వైవిధ్యాలను అర్థం చేసుకునేందుకు కొత్త దృష్టిని అందిస్తాయి. ఈ విధంగా, వనజాత రచనలు ఆధునిక కథాసాహిత్యంలో విలక్షణమైన స్థానాన్ని పొందాయి, పాఠకులను తార్కిక ఆలోచనలోకి, ఆత్మపరిశీలనలోకి నడిపిస్తూ, జీవిత సత్యాలను అన్వేషించే అవకాశాన్ని కల్పిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**


1. కథానికా వాఙ్మయము, డా.పోరంకి దక్షిణామూర్తి, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ, 1975
2. కథా శిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1995
3. సమన్వయ (సాహిత్య వ్యాసాలు), డా.ఎస్.రఘు, మనస్వి ప్రచురణలు, 2017


★★★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ప్రబంధయుగానంతర తెలుగు సాహిత్యం



– డా॥. మరపతి మాంతయ్య

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, తారా ప్రభుత్వ కళాశాల (అటానమస్), సంగారెడ్డి.

**ఉపోద్ఘాతం :**

తెలుగు సాహిత్యం శ్రీకృష్ణదేవరాయల కాలంలో మహోన్నత వైభవాన్ని పొందింది. రాయల సుకృత విశేష ఫలమేమో, అతని కాలంలో తెలుగు సాహిత్యం సుసంపన్నమైంది. విక్రమార్కుని ఆస్థానంలో నవరత్నాలు ఉన్న విధంగా శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులు మిక్కిలి ప్రసిద్ధి చెందారు. వీరు మహా ప్రబంధాలను రచించి, కీర్తి గడించారు.

ప్రబంధాలలో అష్టావదశ వర్ణనలుంటాయి. పురాణాల నుండి ఇతివృత్తాన్ని స్వీకరించి, దానిని వర్ణనలతో విస్తృత పరచి, ధీరోదాత్త నాయక గుణగణాలను, శృంగార రస ప్రధానంగా వర్ణిస్తూ, ఆలంకారిక శైలిలో రచించబడినవే ప్రబంధాలు.

ప్రబంధాలలో ఐదు లేదా ఆరు అశ్వాసాలుంటాయి. ప్రకృష్టమైన బంధం కలిగినవి ప్రబంధాలు. వీటిలో ఋతువర్ణన, పురవర్ణన మొదలగు వర్ణనలుంటాయి.

“దేశ భాషలందు తెలుగు లెస్స” అని నోరారా చాటి చెప్పిన సాహితీ సమరాంగణ సార్వభౌమ చక్రవర్తియైన శ్రీకృష్ణదేవరాయల కాలం ప్రబంధాలకు పరాకాష్ట.

ప్రబంధములు వెలువడిన కాలము 16వ శతాబ్దము. అంతకు పూర్వమే తెలంగాణ ప్రాంతంలో మిక్కిలి ప్రతిభావంతులైన కవివరేణ్యులు కలరు. 12వ శతాబ్దములోనే పాల్కురికి సోమనాథ మహాకవి దేశీయ ఛందస్సులో పెక్కు రచనలు చేశాడు.

సీ॥ బసవపురాణంబు, పండితారాధ్యుల
చరితంబు, ననుభవసారమును, జ
తుర్వేసారసూక్తులు, సోమనాథ భా
ష్యంబును, రుద్రభాష్యంబు, బసవ
రగడ, గంగోత్పత్తిరగడ, శ్రీబసవాద్య
రగడయు, సద్గురురగడ, చెన్న
మలుసీసములు, నమస్కారగద్య, వృ
షాధిప శతకంబు నక్షరాంక

తే॥గీ॥ గద్యపద్యముల్, పంచప్రకారపద్య
అష్టకము, పంచకము, నుదాహరణ, యుగము
నాదియగు కృతుల్ భక్తహితార్థ బుద్ధి
జెప్పినవి భక్త సభలలో జెల్లుచుండు

పై పద్యములో పేర్కొనబడిన రచనలే కాకుండా మరికొన్ని కృతులు కూడా పాల్కురికి సోమనాథుడు రచించినాడు. ఇన్నాళ్ళు కొనసాగిన సమైక్య పాలనలో

తెలంగాణ ప్రాంత మహాకవియైన పాల్కురికి సోమనాథు నకు రావలసిన కీర్తి ప్రతిష్టలు రాలేదు.

భక్తిరసభరితమైన మహాభాగవతమును తెలుగులో రచించిన భక్త కవి పోతనామాత్యుడు తెలంగాణ ప్రాంతమునకు చెందిన మహాకవి. ప్రబంధయుగమునకు పూర్వము తెలంగాణ ప్రాంత కవులు తెలుగు సాహిత్యములో సంపూర్ణ శతక లక్షణములతో వెలువడిన "వృషాధిపశతకము" తెలంగాణ మహాకవి పాల్కుర్కి సోమనాథ విరచితమైనదే.

## ప్రబంధయుగానంతర తెలంగాణ సాహిత్యం

ప్రబంధయుగానంతరం తెలంగాణలో విస్తృతమైన కావ్యాలు వెలువడ్డాయి. కులీకుతుబ్‌షాహీ రాజుల కాలంలో కూడా కావ్య రచన విస్తృతంగా జరిగింది. గోలకొండ రాజధానిగా సుమారు రెండు శతాబ్దాలు పరి పాలించిన కుతుబ్‌షాహీలు ప్రజల భాష అయిన తెలుగునూ, తెలుగు సంస్కృతిని సహజీవన భావముతో ఆదరించారు.

"హరిభట్టు" అనే కవి వరాహ పురాణము, మత్స్య పురాణము, నారసింహ పురాణములను రచించాడు. వీటిలో 'ఖమ్మం'కు చెందిన కొలిపాక ఎఱ్ఱయకు వరాహ పురాణమును అంకితమిచ్చాడు. ఆశ్వాసాంతగద్యలో తండ్రియైన రాఘవార్యుని "చంద్రనామాంకరామ విద్వన్మణి"గా పేర్కొన్నాడు.

పాలమూరు జిల్లా కల్వకుర్తి ప్రాంతానికి చెందిన మరొక తెలంగాణ కవి చరికొండ ధర్మన "చిత్రభారత మును"ను రచించి, కరీంనగర్ జిల్లాకు చెందిన ఎనుముల పెదనామాత్యునకు అంకితమిచ్చాడు. చరికొండ ధర్మన "శతలేఖిన్యవధాన పద్య రచనా సంధాన సురత్రాణ బిరు దాంకితుడు. సకల విద్యాపారీణుడు. శతఘంట సురత్రాణుడు, అనగా గంటలోపు నూరు పద్యములను ఆశువుగా చెప్పగల్గినవాడు. కావున 'అవధాన' శబ్దాన్ని తెలుగు కావ్యాలలో ప్రప్రథమంగా ప్రయోగించిన కవి ధర్మనయే కావచ్చును. రాయలకాలంలోని తొలి ప్రబంధ మైన మాదయగారి మల్లన రచించిన 'రాజశేఖర చరిత్రము' కంటే ముందే విరచితమైంది చిత్రభారతం.

సూరన రచించిన 'ధనాభిరామం' కూడా స్వతంత్ర మైన కావ్యమే. సుమారు ఏభై సంవత్సరాలు ముందే ఈ కావ్యాలు వెలువడ్డాయి. పింగళి సూరన "కళాపూర్ణో దయము" కంటే ముందే వెలువడినవి 'చిత్రభారతం', 'ధనాభిరామం'.

## కందుకూరు రుద్రకవి :

కందుకూరు రుద్రకవి గోలకొండ నవాబు ఇబ్రహీం కుతుబ్ షా కాలమునకు చెందినవాడు. ఇతడు శ్రీకృష్ణదేవ రాయల ఆస్థాన కవి అనే ఒక ప్రచారము ఉన్నది. కాని చింతలపాళెం దానశాసనం వలన అది అసత్యమని తెలుస్తుంది. "నిరంకుశోపాఖ్యానము, సుగ్రీవ విజయము, జనార్ధనాష్టకము" అనునవి రుద్రకవి ప్రసిద్ధ రచనలు.

నిరంకుశోపాఖ్యానములో అన్యాపదేశంగా రక్కసి తంగడి యుద్ధం ప్రస్తావన వచ్చింది. దీని ఆధారంగా ఈతని కాలం 1550-1570 అని తెలుస్తుంది.

కందుకూరు వాస్తవ్యుడైన రుద్రకవి "కందుకూరి జనార్ధనా" అనే మకుటంతో రచించిన ఎన్నో పద్యములు తీయని తెలుగులో శృంగారభరితంగా ఉన్నాయి. కందు కూరు, చింతలపాళెం గ్రామములు నల్లగొండ జిల్లాలో ఉండడం వలన రుద్రకవి ఈ ప్రాంతం వాడేనని ప్రముఖ చారిత్రక పరిశోధకులు బి.ఎన్. శాస్త్రి గారు నిరూపించారు. కందుకూరి రుద్రకవి రచించిన "సుగ్రీవ విజయం" తొలి తెలుగు యక్షగానం. "సుగ్రీవ విజయం"లోని త్రిపుటలోని రెండు పాదాలు ఆధునికమైన 'ముత్యాలసరం' ఛందస్సుకు మొదటి ఉదాహరణగా పేర్కొనవచ్చును.

"అయ్యమీరల రాజసుతులో
యతులో తెలియగరాదు సందియ
మయ్యె ముని వేషములు నృప చి
హ్నాముల్ గలుగన్"

చివరికి నాలుగు మాత్రలు చేర్చితే ఇది ముత్యాల సరం అవుతుంది.

## అద్దంకి గంగాధర కవి :

గోలకొండను పరిపాలించిన ఇబ్రహీం కుతుబ్‌షాకు

అంకితంగా గంగాధర కవి 'తపతీ సంవరణోపాఖ్యాం' రచించాడు. మహమ్మదీయ ప్రభువులకు తెలుగులో రచించి కావ్యమునందించిన మొట్టమొదటి అర్ధంకి గంగాధరుడు.

తపతీ సంవరణోపాఖ్యానంలో తెలుగువారి ఆచార వ్యవహారములతో కూడిన వివాహ వ్యవస్థ ప్రతిబింబిస్తుంది. నిత్య కళ్యాణం - పచ్చతోరణం, కొంగుబంగారం, పిలువని పేరంటం, పూసగుచ్చినరీతి, చిలుకలకొలికి వంటి జాతీయాలు కవితాశైలిలోని తెలుగుదనాన్ని చాటుతాయి.

## పొన్నగంటి తెలగన్న :

పటాన్ చెరువు వాస్తవ్యుడు పొన్నగంటి తెలగనార్యుడు "యయాతి చరిత్ర"ను రచించాడు. ఇది తెలుగులో ప్రప్రథమ అచ్చ తెనుగు కావ్యం. 'యయాతి చరిత్ర'ను ఇబ్రహీం కుతుబ్‌షా సర్దారుగా పనిచేసిన అమీన్‌ఖాన్‌కు అంకితమిచ్చాడు.

"మున్నెవ్వరునొడువని యీతెన్నిడి కడుమీరి
యచ్చతెనుగుం గబ్బం
బెన్నిక మీఱక జెప్పిన నిన్నుంబొగడంగగలడె
నెలతాల్పుయినన్"

అనే పొగడ్తలందుకొనిన అచ్చతెనుగు కావ్యం "యయాతి చరిత్ర"

సంస్కృత సమపదాలు కాకుండా అచ్చ తెనుగు శబ్ద ప్రయోగం తెలగన్న విశిష్టత. ఉదాహరణకు చాతక పక్షులు (చిన్కుంగూటి పక్షులు) సంభోగం (వలచరాచ పని) వానరములు (కొమ్మమెకములు) ఈ విధంగా కావ్యమంతా అచ్చతెనుగు శబ్దాలతోనే రచింపబడింది.

## సారంగు తమ్మయ :

సారంగు తమ్మయ రచించిన ప్రసిద్ధ కావ్యం 'వైజయంతీ విలాసం' ఇది నాలుగు అశ్వాసాల కావ్యం. దీనిని రామునికి అంకితమిచ్చాడు. సారంగు తమ్మయ రచంచిన 'వైజయంతీ విలాసం' ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలోని వైష్ణవ సాంప్రదాయాలను, ఆచారాలను ప్రతిబింబింపజేస్తుంది. విశిష్టాద్వైత సిద్ధాంత అనుయాయి అయిన తమ్మయ నారద పురాణాంతర్గతమైన హరిభక్తి సుధోయమునకు 'భక్తి సంజీవని' అనే సంస్కృత వ్యాఖ్య రచించాడు.

## మరింగంటి కవులు :

నల్లగొండ జిల్లాలోని కలగల్లు గ్రామ వాస్తవ్యులైన మరింగంటి కవులు క్రమంగా పాలమూరు, వరంగల్ ప్రాంతాలు సంచరిస్తూ, ఆయా ప్రాంతాలలో పేరు ప్రఖ్యాతులు గడించారు.

జగన్నాథాచార్యులు, సింగరాచార్యులుగా ప్రసిద్ధి గాంచిన మరింగంటి కవులు చక్కని రచనలు చేశారు. మరింగంటి జగన్నాథాచార్యుల వారికి శతావధాన శత లేఖిని సార్వభౌముడనే బిరుదు కలదు. ఇతడు శ్రీరంగ నాథుని ఆదేశం చేత "శ్రీరంగ విలాసము" అనే ప్రబంధమును రచించాడు.

మరింగంటి సింగరాచార్యులు మిర్యాలగూడం తాలూకా వాడపల్లి నృసింహస్వామి ఆలయంలో స్థానాచార్యులుగా ప్రసిద్ధికెక్కినారు.

పొన్నగంటి తెలగన్న మాదిరిగా అచ్చ తెలనుగు కావ్య రచన చేయుటయే కాకుండా తెలుగలో నిరోష్ఠ్య కావ్య రచనకు మార్గదర్శకుడైనాడు.

ఇతడు దశరథరానందన చరిత్ర, "శుద్ధాంధ్రనిరోష్ఠ్య సీతా కళ్యాణము" ఇంకా ద్వ్యర్థి కావ్యాలు త్ర్యర్థి కావ్యాలు రచించాడు.

## కాసె గంగాధర కవి :

ఈతడు కాసె సర్వప్ప తాత. ఈతడు 'గంగాధరయ్య వచనములు' రచించాడు. 'కరుణా కటాక్ష గంగాధరయ్య' అనే మకుటంతో వచనాలు రచించాడు.

## ఏకామ్రనాథుడు :

'ఏకామ్రనాథుడు ప్రతాప చరిత్ర' రచించాడు. ఇది కాకతీయ రాజుల చరిత్రను తెలియజేస్తుంది. ఏక్రామ నాథుడు రచించిన 'ప్రతాపచరిత్రము' తెలుగులో విరచిత మైన మొదటి వచన గ్రంథం.

## కాసె సర్వప్ప :

ఈతడు 'సిద్దేశ్వర చరిత్రము'ను రచించాడు. ఇది

ద్విపదకావ్యం. ఇందులో రెండవ ప్రతాపరుద్రుని చరిత్ర సవిస్తారంగా ఉన్నది. తిక్కన ఓరుగల్లుకు వచ్చి గణపతి దేవుని దర్శించిన వృత్తాంతం కూడా ఈ గ్రంథంలో వివరించబడింది.

పైన పేర్కొన్న కవులే కాకుండా తెలంగాణా ప్రాంతంలో లెక్కకు మిక్కిలిగా కవులు ఉన్నారు.

'సిద్ధరామయ్య' అనే కవి 'ప్రభుదేవరవాక్యం' అనే వచన గ్రంథము రచించాడు. ఈతడే "చిత్కళోద్ధామ శ్రీడరు సిద్ధరామ" అనే మకుటం గల సిద్దరామ శతకం రచించాడు.

మెదక్ జిల్లాలోని కొండాపురం సమీప గ్రామం మారేపల్లి వాస్తవ్యుడైన వేంకట నర్సయ్య "తత్వదీపికా ప్రబోధము" అనే ద్విపద కావ్యం రచించినాడు.

### పట్టమట్ట సోమనాథ సోమయాజి :

సూతసంహిత, బ్రహ్మోత్తరఖండ అనే గ్రంథాలు రచించాడు.

కామినేని మల్లారెడ్డి షట్చక్రవర్తి చరిత్రము, శివధర్మోత్త రము, పద్మపురాణములను రచించి బిక్కనూరు సిద్ధరామేశ్వరస్వామికి అంకితమిచ్చాడు.

నేబతి కృష్ణమాచార్యులు 'రాజనీతి రత్నాకరము'ను రచించి, వికారాబాద్ సమీపంలో గల అనంతగిరి పద్మనాభ స్వామికి అంకితమిచ్చాడు.

'గోపతిలింగకవి' చెన్నబసవపురాణమును ఐదు ఆశ్వాసాల ప్రబంధముగా రచించాడు. ఇతడు వీరశైవ కవిరేణ్యుడు.

పిల్లలమఱ్ఱి వేంకటపతి 'రాజేశ్వర విలాసము'ను రచించాడు. బమ్మెర కేసన, మల్లన అని పిలువబడే జంట కవులు 'దాక్షాయణీ పరిణయము' 'విష్ణుభజనానంద' అనే గ్రంథములను రచించారు.

కుమ్మరి కులమునకు చెందిన పోశెట్టి లింగకవి వీరసంగయ్య దేవచరిత్ర, శంకరదాసయ్య చరిత్రలను రచించాడు.

చిత్రకవి పెద్దన 'లక్షణసార సంగ్రహం' అనే గ్రంథంను రచించాడు. ఈతడు కొల్లాపూరు తాలూకా వెల్లటూరు గ్రామవాసి సురభిమాధరాయలు, ఎలకూచి బాల సరస్వతి, కాకునూరి అప్పకవి, పెనలూరి వెంకట్రావు, అలరపు పేరయలింగకవి, టేకుమళ్ళ రంగశాయి, సింహాద్రి వేంకటాచార్యుడు, లక్ష్మీనరసింహకవి, కర్పూరం కృష్ణమాచార్యులు, దండి విశ్వనాథయ్య, కొటికల వీరరాఘవకవి, పెద సోమభూపాలుడు, సిరిప్రెగడ ధర్మన్న, భాస్కరరాయలు, పోనుగోటి జగన్నాథరాయలు, వేములువాడ సోమ నాథుడు, అత్తలూరి పాపకవి, పైడిమఱ్రి వేంకటపతి, మల్లిఖార్జున సిద్ధయోగి, సింగరాచార్యులు, ముడుంబి వేంకటాచార్యులు, వెన్నకంటి చంద్రశేఖరకవి, సురభి నరసింగరావు మొదలగు ఎందరెందరో ప్రఖ్యాత కవులు ప్రబంధయాగానంతరం తెలుగు సాహిత్యమును సుసంపన్నం చేసిన కవులు.

### తెలంగాణలో వెలసిన భక్తి సాహిత్యం :

తెలంగాణలో శతక ప్రక్రియలో ప్రప్రథమ శతకం 'వృషాధిపశతకం' దీనిని రచించిన తెలంగాణ తొలి తెలుగు కవి పాల్కురికి సోమనాథుడు.

భక్తరామదాసు (కంచెర్ల గోపన్న) రచించిన 'దాశరథీ శతకం' ప్రెగడరాజు నరసింహ కవి 'గుట్టల నరసింహ శతకం' 'శ్రీకృష్ణశతకం', నల్లగొండ జిల్లా ప్రముఖ కవి చిదిరె మఠం వీరభద్రశర్మ పెక్కుభక్తి గ్రంథుములను రచించారు.

రాకమచెర్ల కీర్తనలు, కృష్ణమయ్య వచన కీర్తనలు, రామదాసు గేయ కీర్తనలు, మన్నెంకొండ హనుమద్దాసు, వేపూరు హనుమద్దాసు, చింతపల్లి దున్నఇద్దాసుల కీర్తనలు, తత్వాలు మొదలగునవెన్నో తెలంగాణాలో ప్రబంధ యుగానంతరం వెలసిన భక్తి సాహిత్య రచనలు.

### ముగింపు :

వానమామలై వరదాచార్యులు, కాళోజీ, వట్టికోట ఆళ్వారు, సురవరం ప్రతాపరెడ్డి గారు, దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య, బిరుదరాజు రామరాజు, బి.ఎన్. శాస్త్రి, సినారె, కపిలవాయి లింగమూర్తి మొదలగు తెలంగాణ కవి పండితులు తెలుగు సాహిత్యమును సుసంపన్నం చేశారు.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి.
2. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి.
3. బసవ పురాణం - పాల్కురికి సోమనాథుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
4. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు - ప్రధాన సంపాదకులు, ఆవుల మంజులత, తెలుగు అకాడమి ప్రచురణ.


★★★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పోతన భాగవతం - ఉపమాలంకార సౌందర్యము



- డా॥. జి. శ్రీనివాసరావు

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, తారా ప్రభుత్వ కళాశాల(స్వ), సంగారెడ్డి.

## పరిచయం :

అలంకారములన్నింటికి శిరోమణి ఉపమాలంకారం. అలంకారాలను స్పృశించిన వారెవ్వరూ ఉపమను చెప్పకుండా ఉండలేదు. లాక్షణికులు దీనిని అర్థాలంకారంగానే చెప్పారు. అప్పయదీక్షితుడు చిత్రమీమాంసలో ఇలా అన్నాడు.

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికా భేదాన్
రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విదాం చేత:'
(చూ.రామరాజభూషణుడు:567)

ఒకే నర్తకి వివిధ వేషములు ధరించి నర్తించునట్లు ఉపమాలంకారమే వివిధ అలంకారాలుగా మారుతుందని చెప్పబడింది. అయితే ఉపమాన ప్రాతినిధ్యమున్న అలంకారాలకు కొంత ఉపమతో పోలిక ఉన్ననూ ఇతర అలంకారాలతో ఉపమకు సంబంధం ఉండదు.

లాక్షణికులు పేర్కొన్న ఉపమ నిర్వచనాలు పరిశీలిస్తే

"కార్యబంధములందు ఏదేని ఒక వస్తువును (ఉపమేయము) సాదృశ్యము (ఉపమానము)తో ఉపమించుట 'ఉపమ' అనబడును" (భరతుడు : 450-451)

"ఉపమాయత్ర సాదృశ్య లక్ష్మీరుల్లసతిద్వయో:" (జయదేవుడు:15) ఏ గుణం విషయంలో ఉపమానోపమేయాలకు సామ్యం ఉన్నదో ఆ గుణాన్ని సౌందర్యవంతంగా, సహృదయ రంజకంగా చెప్పినప్పుడు మాత్రమే అది ఉపమా అవుతుందని, కేవలం పోలికను స్పృశించినంత మాత్రాన ఆది ఉపమాలంకారం కాదని దీని భావం.

## లాక్షణికుల వర్గీకరణ :

లాక్షణికులు ఉపమను పలురకాలుగా వర్గీకరించారు. భరతుడు రెండు కోణాలలో ఉపమను వర్గీకరించెను.

1. ఉపమేయ, ఉపమానాల సంఖ్యననుసరించి ఉపమ 4 రకాలు

   1. ఒక ఉపమేయాన్ని ఒక ఉపమానంతో పోల్చుట.
   2. అనేక ఉపమేయాలను ఒక ఉపమానంతో పోల్చుట.
   3. ఒక ఉపమేయాన్ని అనేక ఉపమానాలతో పోల్చుట.
   4. అనేక ఉపమేయాలను అనేక ఉపమానాలతో పోల్చుట.

2. స్వరూప భేదములచే ఉపమ 5 రకాలు.

1. ప్రశంసోపమ-దీనిలో ఉపమానం అతిశయ లేదా ప్రశంసాపూర్వకంగా ఉండును.
2. నిందోపమ-దీనిలో ఉపమానం నిందా పూర్వకంగా ఉంటుంది.
3. కల్పితోపమ-దీనిలో ఉపమానం కవి కల్పితం.
4. సాదృశ్యోపమ-ఒక ఉపమేయానికి కచ్చితంగా ఫలానా ఉపమానమే సరియగు ననుట.
5. కించిత్ సదృశోపమ- దీనిలో సాదృశ్యము సమాసములో ఇముడ్చబడును. కావున ఉపమా వాచకముండదు(భరతుడు: 451)

మమ్మటుడు, జయదేవుడు,విద్యానాథుడు, విద్యాధరుడు వంటి ప్రముఖులు ఉపమను(కొన్ని సూక్ష్మ భేదాలు మినహాయిస్తే) ఈ కింది విధంగా వర్గీకరించారు.

### 1. పూర్ణోపమ

'ఉపమేయ, ఉపమానము, సమాన ధర్మము, ఉప మావాచకము అనే నాలుగు అవయవములు వాచ్యంగా, స్పష్టంగా లక్ష్యములో చెప్పబడితే అది పూర్ణోపమ' (విద్యానాథుడు:430)

పూర్ణోపమ 1.శ్రౌతి 2.ఆర్థి అని రెండు రకాలు

1. శ్రౌతి-సాక్షాత్ సాదృశ్య ప్రతిపాదకములగు వలె, పోలె, మాడ్కి(ఇవ,వత్,వా,యథా)వంటి ఉప మావాచక శబ్దములు ప్రయోగించిన శ్రౌతి యగును. సాదృశ్య వాచక శబ్దము శ్రుతి మాత్రముననే తెలియునది శ్రౌతి (విద్యానాథుడు : 430)
2. ఆర్థి-ధర్మి (ఉపమానం) ద్వారమున సాదృశ్యమున బోధించునట్టి సదృశ్య, నీకాశ, సంకాశాది శబ్దములు ప్రయోగించిన ఆర్థి అగును. సదృశాది శబ్దముల వలన మొదట సదృశమగు వ్యక్తియు, పిమ్మట ఆ వ్యక్తి ద్వారమున సాదృశ్యము తెలియవచ్చుట వలన ఇది అర్థ సాపేక్షము గాన ఆర్థి' (విద్యా నాథుడు : 430-431)

శ్రౌతి, ఆర్థి రెండు రకాలు ఒక్కొక్కటి వాక్యగత, సమాసగత, తద్ధిత గతములనే భేదములు కలిగి ఉం డును. ఈ కారణంగా పూర్ణోపమ ఆరు రకాలు. 1.వాక్యగత పూర్ణశ్రౌతి 2.సమాసగత పూర్ణశ్రౌతి 3.తద్ధితగత పూర్ణశ్రౌతి 4.వాక్యగత పూర్ణ ఆర్థి 5.సమాసగత పూర్ణ ఆర్థి 6.తద్ధితగత పూర్ణ ఆర్థి

### 2. లుప్తోపమ

'ఉపమేయం, ఉపమాన, సమానధర్మ, ఉప మావాచకము లనే నాలిగింటిలో ఒకటిగాని, రెండుగాని, మూడుగాని లోపిస్తే(చెప్పబడకపోతే) అది లుప్తోపమ' (విద్యానాథుడు : 430)

లుప్తోపమ మూడు రకాలుగా ఉంటుంది. అవి. 1.ఏకలుప్త 2.ద్విలుప్త 3.త్రిలుప్త ఉపమలు

ఇవి కాక మరి కొన్ని రకములుగా కూడా ఉపమ ఉండడం కలదు.

1. సర్వవస్తు విషయోపమ : 'ఉపమేయ, ఉపమానాల అవయవి, అవయవములకన్నిటికిని సామ్యం నిరూపింపబడెనేని అది సర్వస్తు విషయోపమ' (విద్యానాథుడు:454)
2. ఏకదేశవర్తి ఉపమ : 'ఉపమేయ ఉపమానముల అవయవి, అవయవములలోని ఏదేనొక అంశం చెప్పబడి, మరియొక అంశము గమ్యముగా ఉం డెనేని అది ఏకదేశవర్తి ఉపమ' (విద్యా నాథుడు : 454)
3. మాలోపమ : 'ఒక ఉపమేయానికి ఒకటికి మించి ఉపమానాలు చెప్పడం మాలోపమ' (మమ్మటుడు : 604)
4. ఉపమా పరంపర : 'ఉపమాలంకారాలను వరుసగా అనేకం వాడడాన్ని ఉపమ పరంపర అంటారు.
5. హీనోపమ లేదా నీచోపమ : ఉపమేయం కన్నా ఉపమానం హీనంగా ఉంటే దాన్ని హీనోపమ అంటారు.
6. కల్పితోపమ : ఒక వస్తువుకు సహజంగా లేని లక్షణాన్ని కల్పించి(ఉన్నట్లుగా ఊహించుకొని) ఆ

వస్తువును ఉపమానంగా గ్రహిస్తే అటువంటి ఉపమను కల్పితోపమ అంటారు.

7. సదృశోపమ : ఒక ఉపమేయాన్ని పోల్చడానికి నిర్ధిష్టమైన ఉపమానం మాత్రమే తగునంటే అది సదృశోపమ
8. కించిత్ సదృశోపమ : సాదృశ్యం సమాసంలో ఇముడ్చబడితే కించిత్ సదృశోపమ
9. రశనోపమ : పూర్వవాక్యాలలో ఉపమేయంగా ఉన్నవి, ఉత్తర వాక్యాలలో ఉపమానాలుగా చెప్ప బడితే దాన్ని రశనోపమ అంటారు. (మమ్మటుడు : 605)

## ఉపమ - పోతన భాగవతంతో అన్వయం

వనమాలియై ఆంధ్ర సాహిత్య బృందావనంలో పారి జాతాలు పూయించిన కవీశ్వరుడు బమ్మెర పోతన. శక్తివంతమైన విభిన్న కవిత్వాభివ్యక్తీకరణ పద్ధతులలో ఆలంకారిక అభివ్యక్తి ఒకటి, అలంకారాలన్నింటిలో సంఖ్యాపరంగాను, ఉపమానాల ఎన్నిక విషయంలో భారతీయ కవులందరూ-అగ్రతాంబూలమిచ్చింది ఉప మాలంకారానికే. అలాగే పోతన కూడా తన భాగవతంలో (1-4, 7-10స్కంధాలు) ఉపమకు అత్యంత ప్రాధాన్య మిచ్చారు. పోతనగారు మొత్తం 566 ఉపమలు ప్రయోగించారు. ఏ ఇతర అలంకారాన్ని విరివిగా వాడలేదు. సంఖ్యాపరంగా ఉపమాలంకారానికి ప్రథమ స్థానం కాగా, ద్వితీయ స్థానం రూపకానిది(265) వీటితో పోలిస్తే ఇతర అలంకారాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయి.

### 1. పూర్ణోపమ-శ్రౌతి

సాధారణంగా 'ఉపమ' అనగానే-దీనిలో ఉపమేయం, ఉపమానం, సమానధర్మం, ఉపమావాచకం అనే నాలుగు అంశాలుటాయి. దీనినే పూర్ణోపమ అంటారు. అందులోను శ్రౌతి ఉపమనే ఎక్కువగా ఉంటుంది. అంటే సమాన ధర్మం వాచ్యంగా, స్పష్టంగా చెప్పబడుతుంది. సాధా రణంగా ఉపమ-ప్రశంసోపమగానే ఉంటుంది. అంటే ఉపమేయం కన్నా ఉపమానం గొప్పదై ఉంటుంది. దీనినే 'ప్రశంసోపమ' అంటారు. ఉపమలో సాధారణంగా ఒక ఉపమేయం, ఒక ఉపమానంగాని లేదా సమాన సంఖ్యలో ఉపమేయం, ఉపమానాలు ఉండటంగాని జరుగుతుంది. ఈ లక్షణాలు ఉన్న ఉపమను సాధారణ ఉపమ (కవుల ఉపమ ప్రయోగాలలో తరచుగా కనిపించేది)గా చెప్పవచ్చు. ఉపమలోని మిగిలిన ఉప విభాగాలు అరుదుగా కనిపిస్తాయి. ఉపమలోని సమాన ధర్మం - రూప,గుణ,క్రియాది రూపాలలో ఉండవచ్చు.

## శ్రీసీతారాముల కళ్యాణ ఘట్టంలో-శ్రీరాముడు

ఒక మున్నూఱు గదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షు చాపంబు బా
లకరీంద్రంబు సులీలమై చెఱకు గోలన్ ద్రుంచు చందంబునన్
సకలోర్వీశులు సూడగా విఱిచె దోశ్శక్తిన్ విదేహ క్షమా
పక గేహంబున సీతకై గుణమణి ప్రస్ఫీతకై లీలతోన్
(భాగ, 9-261)

అని పోతన గారు వర్ణించారు. శ్రీరామ చంద్రుణ్ణి 'బాల కరీంద్రము' తో పోల్చారు. ఎంత చక్కని పోలిక! రాముని బలం, వర్ణం ఏనుగుతో పోల్చడానికి కారణమైనాయి. మిగిలిన వ్యక్తులు వ్యక్తులుగానే ఉన్నారు. కాని రాముడు వీరందరిలో ఏనుగు వలే అత్యంత బలాఢ్యుడని ఈ ఉపమానం సూచిస్తుంది. 'సామజవరగమనా' అంటూ త్యాగయ్య రాముని వర్ణిస్తాడు. అంటే రాముడు నడుస్తుంటే గున్న ఏనుగు నిండుగా, గంభీరంగా నడుస్తున్నట్లుంటుందట. రాముడు విశ్వామిత్రుని వద్ద నుండి, ధనుస్సుకడకు నడుస్తూ వెళ్తున్న దృశ్యం ధనుస్సు 'కరము'తో ఎత్తుతున్న దృశ్యం పోతనగారి హృదయంలో ఏనుగు చెఱుకుగడను పైకెత్తి, విరుస్తున్న దృశ్యాన్ని స్ఫురింపజేశాయి.

శ్యామవర్ణంలో ఉండడం, అత్యంత బలాన్ని కలిగి ఉండడం,నిండుగా నిధానంగా నడవడం, ఎంత పనినైనా సునాయాసంగా చేయడం 'కరము'(చేయి, తొండం)తో వస్తువును ఎత్తడం రామునికి, ఏనుగుకు సమానం. ఇంకొక సమాన లక్షణం కూడా ఉంది. పోతనగారు రాముణ్ణి - 'బాలకరీంద్రము' అన్నాడు. ఆ ఏనుగు ప్రౌఢవయస్సు గలది కాదు. బాలకరి (గున్నయేనుగు),

రాముడు 'బాలగజం' వంటి వాడేగాని ప్రౌఢ ఏనుగు వంటి వాడు కాడన్నమాట. దీని ద్వారా చూడడానికి వయస్సులో చిన్నవాడైనా, ఎందరో ప్రౌఢులు కూడ చేయలేని పనిని చేశాడని చెప్పినట్లైనది. అయితే పోతనగారి ఈ ఉపమా ప్రయోగంలో ఒక విచిత్రమున్నది. పరిమాణంలో చిన్నవాడైన రాముణ్ని అధిక పరిమాణం గల ఏనుగుతో పోల్చుతూ, ఏకకాలంలో పరిమాణం లోనూ, శక్తిలోనూ, గాంభీర్యంలోను అత్యంత గొప్పదైన శివధనుస్సును స్వల్పమైన చెఱుకు గడతో పోల్చడం చూడవచ్చు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, జగన్మాత, అందరూ దేవతల, ఋషుల శక్తితో కూడిన ఆ ధనస్సుతో శివుడు త్రిపురాసురుల్ని సంహరిస్తాడు. అది మూడువందల మంది నెట్టగా సభా మండపానికి కొనిరాబడినది. పోతనగారు దానిని ఇక్కడ 'లలాటోగ్రాక్షుచాపంబు' అంటాడు. 'శివుడు' అనే అర్థంలో ఎన్నో పర్యాయ పదాలున్నా ఇక్కడ 'లలాట-ఉగ్ర-అక్షుడు' అంటాడు. అత్యంత ఉగ్రమైన మూడవకన్ను కలవాని ధనుస్సు అనడం ద్వారా ఆ ధనుస్సు ఎంత ఉగ్రమైనదో స్ఫురింప జేసినట్లయినది. అంతటి ధనుస్సును చెఱకు గడతో పోల్చడమేమిటి అనుకోవచ్చు. అక్కడే పోతన రుచిరార్థ హృదయం అవగతం అవుతుంది. ఇతరులకు శివధనుస్సు భయంకరమైనదే, అది పెద్దదే. అన్యులు గుణసంధానం చేయుటకు అసాధ్యమైనదే కావచ్చు. కాని అది శ్రీరాముడికి మాత్రం చిన్నదే. రాముని బలం ముందు అది స్వల్పమైనది. అది శ్రీరాముడు సాక్షాత్తు నారా యణుడని చెప్పినట్లయినది. రాముడు నారాయణుడు కాబట్టే లోకభీకరమైన శివధనుస్సు, అతని ముందు ఏనుగుకు చెఱకుగడ వలె బలహీనమై తోచింది. శివ ధనుస్సును చెఱకుగడతో పోల్చడం రాముని ఔన్నత్యాన్ని ప్రకటించడానికే కాని, శివధనుస్సును కించపరచడానికి కాదు.

"భక్తుడెందు జనిను బఱతెంతువెనువెంట
గోవు వెంట దగులు కోడెభంగి"(భాగ. 9-118)

భక్తుడెక్కడికి వెళ్తే భగవంతుడక్కడికి వెళ్తాడు. ఎలా? గోవు వెంట కోడె వెళ్ళినట్లు ఎంత చక్కని లోక వ్యవహారం లోని ఉపమానం. కోడె వ్యామోహంతో మంచి చెడులు ఆలోచించకుండా తాను ఎక్కడికి వెళ్తున్నదో తెలియ కుండా, గోవు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తుంది. అట్లే భగవంతుడు కూడా ఏమీ ఆలోచించకుండా భక్తుని వెంట వెళ్తుంటాడు. భక్తులపై గల వాత్సల్యం వలన కోడెకు గోవుపై గల వ్యామోహ తీవ్రత ఇక్కడ ప్రధానం. విష్ణువుకు గల వాత్సల్య తీవ్రతనే ఇక్కడ గమనించాలి.

ఒక సంఘటనను పూర్వపు మరొక సంఘటనతో ఊహించడం కూడా భాగవతంలో చూడవచ్చు.

**2. వ్యతిరేకార్థంలో-ఉపమ**

సనకాదులతో పృథు చక్రవర్తి భాగవతుల మహిమ ఎలాంటిదో తెలుపుతూ ఇలా అంటాడు.

వరమతులార! యెవ్వని నివాసము దీర్ఘపదాంత రంగులై
పరుగిన యట్టి భాగవత పాదజలంబులు సోకవేని త
త్పురుషుడు భూరి సంపదలు బంపిరి పోయిననైన వాని మం
దిరమురగ ప్రకీర్ణ జగతీజము బోలు నటంద్రు కోవిదుల్ (భాగ. 4-612)

సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతాది ఋషులు తీర్థక్షేత్రములు సేవించినవారు, పుణ్య తీర్థక్షేత్రములకే పావనత్వాన్ని ప్రసాదించు వారు, అన్నిటికి మించి వైకుంఠలోక వాసులు, వారు అడుగు పెట్టని ఇల్లు ఎటువంటిదో చెప్పు సందర్భంలో పోతన చక్కని ఉపమానం వాడారు.

**3. పూర్ణోపమ-ఆర్థి**

హరినామ స్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ
సురుచి భ్రాజితమైన మానస సరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ
హరినామ స్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వి తంబయ్యు శ్రీ
కరమై యుండదయోగ్య దుర్మదనదత్ కాకోల గర్తాకృతిన్(భాగ. 1-94)

పూర్ణోపమలోని ఆర్థిలో ఉపమావాచకాలు సదృశ, నీకాశ, సంకాశ, స్ఫూర్తిన్ వంటివి ఉంటూ, ఉపమానం ద్వారా ఉపమేయ స్వభావం తెలియడం ఉంటుంది.

కావ్యంలో-శ్లేషార్థాలు, గుణములు, అలంకారాలు, ధ్వని వంటివి ఎన్ని ఉన్నా, శ్రీహరి నామ సంకీర్తనము, హరికథా ప్రపంచము లేనప్పుడు, ఆ కావ్యము ఎలాంటి శుభాలను ఇవ్వదుకాగా అది కంపుగొట్టే విషయపు మడుగువంటిదని ఉపమిస్తున్నారు పోతనగారు. ముందుగా 'దుర్మదనదత్ కాకోల గర్తము' ఎంత దుర్భరమైనదో, ఏకొంచెము ఆనందాన్ని కూడా ఇవ్వ లేనిదో తెలుస్తుంది. తర్వాత ఆ లక్షణాలే విచిత్రార్థాలున్నా సరే హరినామ స్తుతి లేని కావ్యానికి ఉంటాయని అవగత మవుతుంది. హరినామ స్తుతిలేని కావ్య లక్షణాలు చెప్పకుండా, కాకోల గర్తము యొక్క స్వభావం చెప్పడం ద్వారా ఉపమానమైన కాకోలగర్తము ద్వారా ఉప మేయమైన హరినామ స్తుతి లేని కావ్య లక్షణాలు స్ఫురిస్తాయి. ఉపమావాచకం కూడా 'ఆకృతిన్' అని ఉంది.

అదే విధంగా ఏ ఇతర కావ్య లక్షణాలు అంతగా లేకున్నా సరే, హరినామ స్తుతి చేసే కావ్యం 'సువర్ణాంభోజ హంసావళీ సురుచి భ్రాజితమైన మానవ సరస్ఫూర్తిన్ వెలుగొందు' అంటారు పోతనగారు. బంగారు పద్మాలతో, హంసలతో అత్యంత ప్రకాశమానమైన మానస సరోవరం వంటిది. హరినామ స్తుతి ఉన్నప్పుడే సార్థకమవుతాయని, కావ్యఫలమైన రసానందానుభవాన్నిస్తాయని తెలుస్తుంది. మానస సరోవరం ఎంత పవిత్రము, ప్రశాంతము, ఆనంద దాయకమో ముందు తెలిసిన తరువాత హరినామ స్తుతి సేయు కావ్యలక్షణాలు మనకు స్ఫురిస్తాయి. ఉపమానం ద్వారా ఉపమేయ లక్షణాలు తెలుస్తాయి. కాబట్టి ఇది పూర్ణోపమలోని 'ఆర్థి' కి చెందుతుంది. ఉపమ వాచకం 'స్ఫూర్తిన్' కూడా ఈ విషయాన్నే స్పష్టపరుస్తుంది.

### 4. సర్వవస్తు విషయోపమ

ఉపమేయోపమానాల అవయవి, అవయవముల కన్నింటికీ సామ్యము నిరూపింపబడినచో అది సర్వవస్తు విషయోపమ.

రాజీవాక్షునిచే నొక
రాజీవము భంగి శైలరాజము మెఱసెన్
రాజేంద్ర! మీఁద మధుకర
రాజిక్రియ మేఘరాజి రాజిల్లె గడున్

(భాగ. 10. పూర్వ-921)

కృష్ణుడు పైకెత్తిన పర్వతం పైన నల్లని మేఘాలు గుంపులు గుంపులుగా అలుముకున్నాయి. దానిని ఉపమిస్తూ పోతన గారు పద్మముపై తుమ్మెదలు వ్రాలి నట్లుగా ఉందని వర్ణించెను. పర్వతము, దానిని ఆవహిం చిన మేఘాలు ఉపమేయం కాగా పద్మము తుమ్మెదలు ఉపమానం ఇక్కడ ఉపమేయ ఉపమానాల రెండింటి లోని అంశాలు అవయవి, అవయవ సంబంధాన్ని కలిగి ఉన్నాయి. కావున ఇది సర్వవస్తు విషయోపమ.

### 5. ఏకదేశవివర్తి ఉపమ

ఉపమేయోపమానాల అవయవి, అవయములోని ఏదైనా ఒక అంశం చెప్పబడి, మరియొక అంశము చెప్ప బడకుండా గమ్యముగా ఉండెనేని అది ఏకదేశవివర్తి ఉపమగా చెప్పవచ్చు.

కురుక్షేత్ర యుద్ధానంతరం పాండవుల వంశాన్ని నిర్మూలించదలచి అశ్వత్థామ, బాలురైన ఉపపాండవు లను నిద్రలో ఉండగా చంపుతాడు. తరువాత ఉత్తర గర్భమున పెరుగుతున్న శిశువును చంపగోరి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. దానికి ప్రతిగా అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. శ్రీకృష్ణుని సలహా మేరకు అర్జునుడు రెండింటిని ఉపసంహరించి, అశ్వత్థామను పట్టుకొని పోయే సందర్భంలో ఇట్లస్త్రద్వయంబు నుపసంహరించి ధనంజయుడు ద్రోణనందనుంగూడ నరిగి తఱిమి పట్టుకొని రోషారుణిత లోచనుండై యాజ్ఞికుండు రజ్జువు నంబశువుం గట్టిన చందంబున బంధించి శిబిరంబు కడకుం గొని చని హింసింతునని తిగిచినన్..(భాగ 1-152)

అర్జునుడు, అశ్వత్థామను బంధించి, శిబిరం దగ్గరకు లాగుకొనిపోయాడు, యాజ్ఞికుడు పశువును రజ్జువుతో బంధించినట్లు ఉపమేయం - 1.అర్జునుడు 2.అశ్వత్థామ 3.....4.బంధించుట 5.శిబిరంబుకడకు 6.హింసించుటకు

ఉపమానం-1.యాజ్ఞికుడు 2.పశువు 3.రజ్జువు 4. కట్టుట 5......6.......

ప్రకృతానికి సంబంధించిన కొన్ని అంశాలను చెప్పి మరికొన్ని చెప్పకుండా, వాటిని అప్రకృతంలోని అంశాల ద్వారా గమ్యమానమగునట్లుగా చేయుట, అట్లే ప్రకృతానికి సంబంధించిన కొన్ని అంశాల ద్వారా, అప్రకృతానికి చెందిన కొన్ని గమ్యమానం అగుట ఆ లక్ష్యంలో చూస్తాం. ఉపమేయంలో-అర్జునుడు, అశ్వత్థామను దేనితో బంధించాడో చెప్పబడలేదు. కాని ఉపమానంలో పశువును రజ్జువుతో కట్టినట్లు చెప్పబడెను. కాబట్టి అశ్వత్థామను కూడా రజ్జువుతో బంధించిన విషయం ఉపమానం ద్వారా గమ్యమానం అవుతుంది.

ఉపమేయంలోని-అశ్వత్థామను శిబిరము కడకు, హింసించుటకు తీసుకొని పోతున్నట్లుగా చెప్పి, ఉపమానంలోని పశువును ఎక్కడికి? ఎందుకు? తీసుకొని వెళ్తున్నాడో చెప్పలేదు. వీటిని ఉపమేయంలోని-'శబిరము కడకు', 'హింసించుటకు' అని మాటలను బట్టి ఉపమానంలోని పశువును యాజ్ఞికుడు, యజ్ఞశాలకడకు, వధించుటకు అనే విషయాలు ప్రతీయమానమవుతున్నాయి.

ఉపమేయంలోని కొన్నింటిని వాచ్యంగాను, కొన్నింటిని ప్రతీయమానంగాను, అట్లే ఉపమానంలోని కొన్నిటిని వాచ్యంగాను, కొన్నిటిని ప్రతీయమానంగాను చెప్పడం ఏకదేశవివర్తి ఉపమలో చూస్తాం.

**6. మాలోపమ**

ఒక ఉపమేయానికి, రెండుగాని, అంతకంటే ఎక్కువగాని ఉపమానాలు ప్రయోగించుట మాలోపమ. శ్రీనరసింహస్వామి నఖములు హిరణ్యకశపుని చంపునపుడు ఎన్ని విధములుగా ప్రకాశించినవో చెప్పు సందర్భంలో పోతనగారు మాలోపమును కల్పించారు.

వక్ష కవాటంబు ప్రక్కలు సేయుచో/ఘనకుఠారంబుల కరణినొప్పు
గంభీర హృదయ పంకజము భేదించుచో /గుద్దాలముల భంగి కొమరు మిగులు
ధమనీవితానంబు దగిలి ఖండించుచో /బటుల విత్రంబుల పగది మెఱయు
జఠర విశాలాంత్రజాలంబు ద్రెంచుచో /గ్రకచ సంఘంబుల గరిము జూపు
నంక గతుడైన దైత్యుని ఆగ్రహమున /శస్త్ర చయములనొంపక సంహరించి
యమరు నరసింహు నఖరంబు లతివిచిత్ర / సమరముఖంబులైయుండె జనవరేణ్య(భాగ. 7-297)

హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని వలన అనేక వరాలు పొందాడు. వాటిలో ఒకటి ఆయుధము వలన తన ప్రాణము పోకుండుట. నరసింహస్వామి, హిరణ్యకశిపుని చంపునపుడు బ్రహ్మ ఇచ్చిన వరాలకు భంగం కలుగకుండా జాగ్రత్త పడ్డాడు. ఆయుధములు వాడ కూడదు కాబట్టి, తన నఖములతోనే ఆ రాక్షసుని చంపాడు. అయితే ఒక్కొక్క ఆయుధం ఒక్కొక్క పనికి ఉపయోగపడుతుంది. కావున నరసింహస్వామి నఖములు, హిరణ్యకశిపుని ఒక్కొక్క శరీర అవయవ భాగాన్ని చీల్చునపుడు ఒక్కొక్క ఆయుధము వలె పనిచేశాయి.

శ్రీనరసింహస్వామి -

1. హిరణ్యకశిపుని వక్షస్థలాన్ని బ్రద్ధలు చేయునపుడు గొడ్డళ్ళవలె
2. గుండెను భేదించునపుడు గునపం వలె,
3. రక్తనాళములను త్రెంచునపుడు కొడవళ్ళ వలె,
4. జీర్ణాశయాన్ని త్రెంచునపుడు క్రకచముల (అంపముల) వలె పనిచేశాయని చెప్పడంలో ఉపమేయం శ్రీనరసింహస్వామి నఖములు ఉపమానాలు-1.గొడ్డళ్ళు 2.గునపములు 3.కొడవళ్ళు 4. క్రకచములు కావున ఇది మాలోపమ. ఈ సందర్భంలో మాలోపమ ప్రయోగించుట పోతన శిల్ప దృష్టికి తార్కాణం. తద్వారానే నరసింహస్వామి ఆగ్రహం, వారి నఖముల తీక్షణత అవగత మవుతాయి.

**7. ఉపమా పరంపర**

ఉపమాలంకారాలను వరుసగా అనేకం వాడడాన్ని ఉపమ పరంపర అంటారు.

మెఱుగు చెంగట నున్న మేఘంబు కైవడి /నువిద చెంగట నుండనొప్పువాడు
చంద్రమండల సుధాసారంబు పోలిక /ముఖమును జిఱునవ్వు మొలచువాడు
వల్లీయుతతమాల వసుమతీజము భంగి /బలు విల్లు మూపును బరుగువాడు
నీలనగాగ్రసన్నిహిత భానుని భంగి /ఘనకిరీటము దలుగల్గువాడు
పుండరీక యుగముబోలు కన్నులవాడు /వెడుద యురము వాఁడు విపుల భద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁడొక్కరుఁడునా / కన్నుగవకు నెదురుగానుబడియె (భాగ. 1-14)

ఈ పద్యంలో నాలుగు ఉపమాలంకారాలతో ఒక రూపాన్ని వర్ణించడం జరిగింది. కావున దానిని ఉపమా పరంపర అంటారు.

పోతన గారు మహేశ్వర ధ్యానం చేయునపుడు ఒక రాజ శ్రేష్ఠుడు తన కళ్ళకు కనిపించాడు. అతడే శ్రీరాముడు ఆ శ్రీరాముడు మెరుపు తీగ ప్రక్క మేఘము ఉన్నట్లుగా సీతాదేవి ప్రక్క నిలుచొని ఉన్నాడు. చంద్రమండలంలోని అమృత సారం వలె చిరునవ్వులు చిందిస్తున్నాడు. వృక్షానికి చుట్టుకొన్న తమాల వల్లరి వలె మూపున కోదండం కలవాడు. నల్లని పర్వత శిఖరం మీద సూర్యుడున్నట్లు తన తలపై కిరీటం కలవాడు అంటూ శ్రీరాముని రూపాన్ని వరుసగా నాలుగు ఉపమలతో తనివితీరా వర్ణించాడు.

**8. కల్పితోపమ**

ఒక వస్తువుకు సహజంగా లేని ఒక లక్షణాన్ని కల్పించి (ఉన్నట్లుగా ఉహించుకొని) ఆ వస్తువును ఉపమానంగా గ్రహిస్తే అటువంటి ఉపమను కల్పితోపమ అంటారు.

బలిచక్రవర్తి యజ్ఞవాటికకు వచ్చిన బాలబ్రహ్మణుడు, మెడలో తులసి మాలలు, ఒకచేత కమండలం, ఒకచేత తాటాకు గొడుగు ధరించి చిట్టిపొట్టి అడుగులు వేస్తూ వచ్చిన వామనుని పోతనగారు ఉపమిస్తూ

...కరచరణాద్యవయవంబులు ధరించిన వేదరాశియు నుంబోలె..(భాగ. 8-546) వామనుడు ఉన్నాడనటం పోతన గారి ప్రబల ఊహాశక్తికి నిదర్శనం.

వేదమంత్రాలతో మారుమ్రోగుతున్న యజ్ఞవాటికకు, వేదాలు పరమ లక్ష్యంగా చెప్పే శ్రీమన్నారాయణుడే వామనుని రూపంలో వచ్చాడు. అతడు ఎలా ఉన్నాడు? 'వేదరాశి'కి చేతులు, కాళ్ళు వంటి అవయవాలన్నీ వస్తే ఎలా ఉంటుందో అలా ఉన్నాడట. పోతనగారి అనల్ప కల్పనాశక్తి ఎంతటిదో? వేదమనేది ఒక పుస్తకం కాదు. తపోనిష్ఠులు 'సమాధి' స్థితిలో అనుభవంలోకి తెచ్చుకొన్న, దర్శించిన సత్యజ్ఞాన భావజాలం. ఆ జ్ఞానం నిరాకారం, నిర్గుణం, నిరుపాధికం, అటువంటి జ్ఞానాన్ని సాకారుడైన వామనునితో పోల్చుటకు పొసగదు. ఆ వేదజ్ఞానం ఒక రూపాన్ని ధరించదు. ధరించడం దానికి అసహజం, ధరించే అవకాశం కూడా లేదు. కాని ఒకవేళ ధరిస్తే(ధరించిందని ఊహించుకొంటే) దానిలాగ బాలుడైన వామనుడు ఉన్నాడట. వామనుడు వేదస్వరూపుడని, వేదాలకు లక్ష్యప్రాయైన పరమాత్మ అని పరోక్షంగా పోతనగారు చెప్పినట్లయ్యింది.

**9. కించిత్ సదృశోపమ**

సాదృశ్యము సమాసంలో ఇముడ్చబడితే కించిత్ సదృశోపమ. దీనిలో ఉపమా వాచకం లోపిస్తుంది (సమాసగతం అవుతుంది)

జోజో కమలదళేక్షణ!
జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!
జోజో పల్లవ కరపద!
జోజో పూర్ణేందువదన జోజో యనుచున్
(భాగ. 10.పూర్వ-189)

అప్పుడే పుట్టిన శ్రీకృష్ణుని స్నానం చేయించి, ఊయలలో పరుండబెట్టి, చతుర్దశభువన మోహనమైన సౌందర్యాన్ని తిలకిస్తూ వ్రేపల్లె గోపికలు ఆనందంతో జోల పాట పాడుతున్నారు.

కృష్ణున్ని, కమలదళేక్షణ! మృగరాజమధ్య! పల్లవ కరపద! పూర్ణేందువదన అంటూ పాడుతున్నారు.

కమళదళముల వంటి కన్నులు(చూపులు), సింహము నడుము వంటి నడుము, లేత చిగుళ్ళవంటి చేతులు, పాదాలు పున్నమి నాటి చంద్రుని వంటి ముఖం కృష్ణునికి కలదని వర్ణిస్తున్నారు. అయితే ఈ పద్యంలో ఉపమా వాచకము సమాస గతమై లోపించింది. కావున ఇది కించిత్ సదృశోపమ.

## లుప్తోపమ

ఉపమేయం, ఉపమానం, సమానధర్మం, ఉపమా వాచకములలో ఏదేని ఒకటి గాని, ఏవైనా రెండుగాని, మూడు గాని లోపించుటలుప్తోపమలో ఉంటుంది.

వాచకలుప్త-ఉపమ

బలిచక్రవర్తిని గూర్చి చెబుతూ

...వెలిగెన్ దానవ భర్త శైల శిఖరోద్వేలద్దవాగ్ని ప్రభన్. (భాగ. 8-442) అంటాడు పోతన.

బలి చక్రవర్తి పర్వతశిఖరంపై గల దావాగ్ని కాంతులతో వెలిగాడని చెప్పాడు. ఇక్కడ ఉపమేయం దానవ భర్త. ఉపమానం-శైలశిఖరోద్వేల ద్దవాగ్నిప్రభలు సమాన ధర్మం-వెలుగుట. కాని ఉపమా వాచకం లోపించింది.

ఉపమాన-ధర్మలుప్తోమ, ఉపమాన-వాచక-లుప్తోపమ, ధర్మ-వాచక-లుప్తోపమ మరియు ఉపమాన-ధర్మావాచక లుప్తోపమ. భాగవతంలో లక్ష్యాలు అలభ్యం.

## ఉపయుక్త గ్రంథ సూచిక :


1. జయదేవుడు. 1994. చంద్రాలోక సమున్మేషము.(వ్యా. స్ఫూర్తిశ్రీ), గుంటూరు:వ్యాఖ్యాత. ఆరవ ముద్రణ.
2. పోతన, బమ్మెర. 1994.శ్రీమహాభాగవతం. హైదరాబాదు:పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. ఏడవ ముద్రణ.
3. భరతుడు. 1983. నాట్యశాస్త్రం. (వ్యా. పోణంగి శ్రీరామ అప్పారావు.) హైదరాబాదు: నాట్యమాల ప్రచురణము.
4. మమ్మటుడు. 1995. కావ్యప్రకాశము. (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). హైదరాబాదు: సంస్కృత భాషా ప్రచార సమితి.
5. రామరాజభూషణుడు. 1976. కావ్యాలంకార సంగ్రహం. (నరసభుపాలీయం). (వ్యా. సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి). మచిలీపట్నం, మద్రాస్, సికింద్రాబాద్: ఎం.శేషాచలం మరియు కంపెనీ. ఐదవ ముద్రణ(ప్రథమ ముద్రణ.1945).
6. విద్యానాథుడు. 1972. ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణం(ఆంధ్రానువాదం, చెలమచర్ల రంగాచార్యులు). హైదారాబాదు: శ్రీనివాస పబ్లికేషన్స్. చతుర్థ ముద్రణ.(ప్రథమ ముద్రణ.1944).


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# భారతీయ సంస్కృతిలో పక్షులు - చారిత్రక వైభవం



- డా॥. ఎన్. అంబర్ సింగ్

అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్మూర్.

## పరిచయం :

పశుపక్ష్యాదులను దైవ స్వరూపాలుగా భావించి పూజించడం మన భారతీయ సంప్రదాయం. పక్షులు ప్రకృతి సమతుల్యతా కారకాలు, రైతు నేస్తాలు, పరపరాగ సంపర్క మూలకాలు, కొన్ని అరుదైన వృక్ష జాతుల రక్షణకు కేంద్ర బిందువులు. అలాంటి పక్షులకు మన వేదాల్లో, పురాణాల్లో, ఇతిహాసాల్లో, ఇతర సాహిత్య గ్రంథాలలో మరియు చరిత్ర పుటల్లో సముచిత స్థానం ఇచ్చారు .

మరి నేటి సాంకేతిక జీవన యుగంలో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నో రకాల జాతులు అంతరించి పోయినవి. కనీసం వున్న వాటినైనా కాపాడి, భవిష్యత్తరాలకు వాటి గొప్పదనాన్ని, ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైన వుంది. ఆ విషయాన్ని గుర్తు చేయడంలో భాగంగానే, ఈ అంశాన్ని మీ ముందుకు తీసుకువస్తున్నాను.

## ఆవశ్యకత :

అరుదైన పక్షి జాతులతో మమేకమై వెలిగిన మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను గుర్తు చేసి, కనుమరుగవుతున్న పక్షిజాల పరిరక్షణ బాధ్యతను తెలియచేసి, పక్షులు ప్రకృతి సమతుల్యతా కారకాలనే విషయం పై అవగాహన కల్పించి, నేటి సాంకేతికతతో పరుగు పెడుతున్న యువతకు, ప్రకృతి ప్రేమను ఆస్వాదింపజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఆవశ్యకత అని చెప్పవచ్చు.

## విషయం :

జైన మత స్థాపకుడు, మరుదేవి పుత్రుడు, మొదటి తీర్థంకరుడు అయిన వృషభ నాథుడికి సుమంగళకు జన్మించిన పుత్రుడు భరతుడు, చక్రరత్న అనే ఆయుధం భరతుడి బలం. అఖండ భారత నిర్మాత అనే కీర్తి ఆయన సొంతం. భరతుడి నుండి ఉద్భవించింది భరతవర్షము1. అందుకే భారతదేశం అనే పేరు మన వశం.

**శ్లోకం :**

దక్షిణమ్ యత్సముద్రస్య హిమాద్రేశ్చైవ ఉత్తరమ్ ఎ
వర్షం తద్ భారతం నామ భారతీయత్ర సన్తతి ఎఎ

**మూలం** : పరాశర మహర్షి - విష్ణు పురాణం (అంశం: 2, అధ్యాయం: 3, శ్లోకం: 81)

ఉత్తరాన హిమాలయాలు ఆదిగా కలిగి, దక్షిణాన ఇందు సరోవరం(హిందూ మహా సముద్రం) వరకు

విస్తరించి ఉన్న ప్రదేశం భారతము అని, ఆ ప్రాంతపు సంతతి, భారతీయులు2 అనే పేరుతో పిలువబడు తున్నది.

### భారతీయ సంస్కృతి :

సంస్కృతి ఒక జాతి విశిష్టతను, ఉన్నతిని చక్కగా తెలియజేస్తుంది. సంప్రదాయము, ఆధ్యాత్మికత, భౌతిక విషయాల సమాహారం సంస్కృతి. తరాలు మారు తుంటాయి. మారిన తరాలనుండి ఆ తర్వాత తరాలకు అందించే వారసత్వ సంపద సంస్కృతి. ధర్మం, న్యాయం పట్ల మన భారతీయ సంస్కృతి కొన్ని నిబద్ధతలను పాటించింది. ప్రజలు చేసిన అనేక ప్రయత్నాలు, అనుసరించిన పద్ధతులవల్లే సంస్కృతి ఒక సనాతన ధర్మంగా పరిఢవిల్లింది. భారతీయులు అనేక భాషలు మాట్లాడతారు. కళారీతులు, ఆహార అలవాట్లు వేష ధారణ, భిన్న మతాలు, కులాలు కల్గి ఉన్నారు. ఇది భారతీయ సంస్కృతి భౌతిక లక్షణము. మన సంస్కృతి - వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులకు ఆలవాలం. ఆధ్యాత్మికతకు సంగీత సాహిత్యాలు, లలిత కళలు చక్కటి భూమికలు. మన నాగరికత, సామాన్య జీవన విధానం, సంప్రదాయం ఇవన్నీ కూడా భారతీయ సంస్కృతికి ఆధారమైన భారతీయ తత్వాన్ని, భారతీయుల ఐకమత్యాన్ని తెలియజేస్తాయి.

### భారతీయ సంస్కృతిలో పక్షులు - చారిత్రక వైభవం:

మన భారతీయ సంస్కృతిలో ఉదయం మేలుకొలుపు దగ్గరనుండి మనం చేసే ప్రతీ పుణ్య వచనము వరకూ, చివరకు స్వర్గస్తులైన పితృ దేవతలకు చేసే శాంతి కార్యా లలో కూడా పక్షులు మనతో మమేకమై వున్నాయి.

**కోడి :**

కోడి కూతకు మన భారతీయ జీవనంలో గొప్ప ప్రాధాన్యత వుంది. నేడు కనిపిస్తున్న గడియారాలు , స్మార్ట్ ఫోన్ లు, స్మార్ట్ వాచీలు, అలారమ్ లు లేని సమయంలో మన పూర్వీకులు కోడి కూతతో మేల్కొని , ప్రాతః కాల వందనాలు చేసి, నిత్య కృత్యాలలో నిమగ్నం అయ్యేవారు. కోడి బ్రాహ్మీ ముహూర్తంలో మొదటి కూత కూస్తుంది. అక్కడి నుండి అది కూతలు కూస్తూనే వుంటుంది. ఆ శబ్దమే మన పూర్వీకులకి మేలుకొలుపు గీతం. ఆ ముహూర్తమే వారి ఆరోగ్యానికీ , విజ్ఞానానికీ ఆయుష్షుకు బలం చేకూర్చిందంటే ఏమాత్రం అతిశయోక్తి లేదు.

దీనిని గురించి సైంటిఫిక్ గా చెప్తే "న్యూరో సైంటిస్టుల అధ్యయనం మేరకు ఒక వ్యక్తి యొక్క ఆలోచన శక్తి, వేకువజామున మేల్కొన్నట్లయితే ఆ ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో మేలుకుంటే వ్యక్తి యొక్క మెదడులో సృజనాత్మక శక్తి పైకి లేస్తుందని, అది రెట్టింపు అవుతుంద,ని ఆ సమయంలో లేచిన వ్యక్తుల యొక్క మానసిక స్థితి సానుకూలంగా, అద్భుతంగా ఉంటుంది. దీనికి ప్రతీకగానే కోడిని జ్ఞానానికి గుర్తుగా చెప్తారు. అందుకే సాక్షాత్తూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, తన ధ్వజంపై కోడి గుర్తును3 ధరింపజేశారు.

**కాకి :**

భారతీయ పురాణాలలో కాకులకు ప్రాధాన్యత కలదు. ఒకానొక సమయంలో యముడు, రావణుడికి భయపడి కాకి రూపాన్ని ధరించి4 కాకులకు గొప్ప వరాలిచ్చాడు. యముడు ప్రాణులన్నింటికీ రోగాలను కలిగించేవాడు కనుక, తానే స్వయంగా కాకి రూపాన్ని ధరించినందువల్ల ఆనాటి నుంచి కాకులకు సాధారణంగా రోగాలేవీ రావన్నాడు. అవి చిరాయువులై ఉంటాయని కాకులకు వరమిచ్చాడు. యమలోకంలో నరక బాధలను భరించే వారి బంధువులు అలా మరణించిన వారికి సమర్పించే పిండాలను కాకులు తిన్నప్పుడే నరక లోకంలోని వారికి తృప్తి కలుగుతుందన్నాడు. యముడు స్వయంగా వాయసాలకు (కాకులకు) ఈ వరాలిచ్చినందువల్లనే ఈ నాటికీ పితృకర్మల విషయంలో కాకులకు పిండాలు పెడుతున్నారు.

ఈ సంస్కృతినే ఇప్పటికీ మనం పాటిస్తూ వస్తున్నాం. మన పూర్వీకులకు పిండ ప్రదానం చేయడంలో కాకులకే పెద్ద పేట వేస్తున్నాం. మన భారతీయ సంస్కృతిలో ఈ కాకిని శని దేవుడు వాహనంగా చేసుకొని , గొప్పగా పూజలందుకుంటున్నాడు. ప్రఖ్యాత దేవాలయం 'శని

శింగ్నా పూర్, మహారాష్ట్ర'లో కలదు. సైంటిఫిక్ గా చెబితే కాకుల్ని natural scavengers అంటారు. ఎందుకంటే అవి పురుగుల్ని తిని పరిసరాల్ని శుభ్రముగా ఉంచుతాయి. వెయ్యి రకాల పురుగుల్ని, గింజల్ని తింటాయి. జీవన సమతుల్యం చేస్తాయి.

**రామ చిలుక :**

మన ఆచారాల్లో చిలుకతో జోస్యం చెప్పించు కుంటాము. ఎవరైనా ముద్దుగా మాట్లాడితే చిలుక పలుకులు అంటాము. చిలుక కొరికిన పండు దొరకడం ఒక అదృష్టంగా భావిస్తాం. ఆ పండ్లను తిని వాటి భాగాలను అక్కడక్కడా వేయడం వల్ల, పండ్ల చెట్లు విస్తరించడానికి చాలా ఎక్కువగా ఉపయోగపడతాయి. దీని వల్ల జను లకు ఆరోగ్యాన్ని పెంచే అమృత మాయమైన పళ్ళు లభిస్తాయి. చరిత్రల్లో కొన్ని వేల మంది రాజులు చిలుకను రాయబారిగా కూడా వాడటం జరిగినది. సూర్య పుత్రిక తపతికి సంవరణుడికి మధ్య ప్రేమ రాయబారం5 నెర వేర్చినది. రామాయణంలో సీతమ్మ వారికి చేదోడు వాదోడుగా వుండి రామ శబద్ధాన్ని నిరంతరం పలుకతూ వుండడం వల్ల, సాక్షాత్తూ సీతమ్మే సంబర పడి నువ్వు ఇకనుండి రామ చిలుక గా పేరు తెచ్చుకుంటావు అని వరమిచ్చిందట. అలా రామచిలుక కు మన సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానం వుంది

**కోకిల :**

కోకిల అంటేనే వసంత మాసం. ప్రకృతి అంతా పచ్చ చీర కట్టుకున్నట్టు నూతనమైన తేజస్సుతో కాంతివంత మవుతుంది. కొత్త సంవత్సరం వచ్చిందనే విషయాన్ని , కోకిల కూసే కుహూ కుహూ రాగాలతో కనిపెట్టి, వసంత మాసంలో అడుగుపెట్టి పది మంది తో కలిసి ఉగాది పచ్చడి సేవిస్తాం. జీవిత పరమార్థం ఇదే అని తెలుసుకొని ఆస్వాదిస్తాం.

**కోకిల వ్రతం :**

కోకిలా వ్రతాన్ని మొదట పార్వతీ దేవి, శివున్ని భర్తగా పొందటానికి చేసింది. ఈ వ్రత సందర్భంగా సతీ దేవిని మరియు శివుడిని ఆరాధిస్తారు. ఈ వ్రతానికి సంబంధిం చిన కథ ప్రకారం దక్షుడు శివుడిని అవమానించినప్పుడు సతీదేవి తనలో తాను దహనమైపోతుంది. అలా మరణిం చిన ఆమె కోయిల రూపంలో పది వేల సంవత్సరాలు గడిపిన తర్వాతనే పార్వతిగా జన్మించి శివున్ని వివాహం చేసుకొంది. కోకిల వ్రత సంకల్ప మంత్రంగా "మమ ధనధాన్య సహిత సౌభాగ్య ప్రాప్తయే శివతుష్టయే చ కోకిలావ్రతమహం కరిష్యే" అని స్మరిస్తూ 'ఆషాఢ శుద్ధ పౌర్ణమి' మొదలు తెలక పిండితో ప్రతిరోజు కోకిల ప్రతిమను తయారుచేసుకొని, నెలరోజులపాటు దానిని పూజించాలి. ఈ వ్రతానికి సంబంధించిన వివరాలు తెలుసుకుని, నియమబద్ధంగా ఆచరించడం వలన ఆశించిన ప్రయోజనం లభిస్తుందని పురాణాలు చెబు తున్నాయి. సైంటిఫిక్ గా చెబితే సీతాకోకచిలుకలు, సాలె పురుగులు, చిమ్మటలు, ఈగలు, ఇతర కీటకాలు మరియు గొంగళి పురుగులు మొదలయిన వాటిని తిని జీవన సమతుల్యం చేసి ప్రకృతిని కాపాడుతుంది .

**పాలపిట్ట :**

నీలం, పసుపు రంగుల కలబోతలో ఉండే పాలపిట్ట చూసేందుకు ఎంతో అందంగా ఉంటుంది. పాలపిట్ట మనశ్శాంతికి, ప్రశాంతతకు, కార్యసిద్ధికి సంకేతంగా భావిస్తారు. చాలామంది ఈ పక్షిని పరమేశ్వరుడి స్వరూపంగా భావిస్తుంటారు. అందుకే దసరా పండుగ రోజు పాలపిట్టను చూస్తే అన్ని శుభాలే జరుగుతాయని నమ్ముతుంటారు. త్రేతా యుగంలో రావణాసురుడితో శ్రీరాముడు యుద్ధానికి బయలుదేరినప్పుడు విజయ దశమి రోజున పాలపిట్ట ఎదురుగా కనిపిస్తుంది. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో రాముడు విజయం సాధిస్తాడు. అజ్ఞాత వాసానికి ముందు పాండవులు జమ్మి చెట్టు మీద దాచిన ఆయుధాలను ఇంద్రుడు పాలపిట్ట రూపంలో కాపలా కాశాడట. అంతేకాదు పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలను ముగించుకుని తిరుగు ప్రయాణమై తమ రాజ్యానికి వెళ్తున్న సమయంలో వారికి పాలపిట్ట దర్శనమిచ్చింది. అప్పటి నుంచి వారి కష్టాలు తొలగిపోయాయి. కురుక్షేత్ర సంగ్రామంలో విజయం సాధించడంతో పాటు పోగొట్టుకున్న రాజ్యాన్ని తిరిగి పొందారు. పాలపిట్ట కనిపించినప్పటి నుంచి పాండవులు

ఏం చేసినా విజయాలే కలిగాయంట. అందుకే విజయ దశమి రోజు సాయంత్రం జమ్మి పూజ తర్వాత ప్రజలు పాలపిట్ట దర్శనం కోసం ఊరి చివరకు, పంట పొలాలకు తండోపతండాలుగా వెళ్తుంటారు. పాలపిట్ట దర్శనం అనంతరం ఆనందంగా ఇళ్లకు చేరుకుంటారు. అయితే పాల పిట్ట ఉత్తర దిక్కు నుంచి ఎదురైతే ఇంకా మంచి దని, శుభాలు కలుగుతాయని చెబుతుంటారు. అదే దక్షిణం దిక్కు నుంచి వస్తే అశుభానికి సంకేతమని కూడా ప్రచారంలో ఉంది. పురాణాలు, సాంస్కృతిక పరంగా పాలపిట్టకు ఇంతటి ప్రాధాన్యం ఉంది కాబట్టే దీన్ని మన రాష్ట్ర పక్షిగా గుర్తించి గౌరవం ఇచ్చుకున్నాం. సైంటిఫిక్ గా చెబితే ఇది ఆహారంగా కప్పలు, చిన్న పాములు, మిడతలు, కీచురాళ్ళు వంటి వాటిని వేటాడి తిని జీవన సమతుల్యతను కాపాడతాయి.

**పావురము :**

పావురాలు దాదాపు 26 మైళ్ల దూరంలో ఉన్నవాటిని కూడా గుర్తిస్తాయి. అందుకే యుద్ధాల్లో శత్రు సైన్యాలను గుర్తించేందుకు పావురాలను ఉపయోగించేవారు. అంతే కాదు, వీటికి ఏకాగ్రత ఎక్కువ. ఎలాంటి దారిలోనయినా అయోమయానికి గురికాకుండా వెళ్లిపోగలవు. అందుకే సందేశాలను వీటితో పంపించేవారు. మన చుట్టాలకు, బంధువులకు ఉత్తరములు పంపుటకు గానీ, ఒక రాజ్యపు రాయబారానికి లేదా శాంతి సమావేశ విశేషాల కోసము గానీ సందేశము చేరవేయుటకు పావురమును ఉప యోగించేవారు. అమర్ నాథ్ శివాలయంలో పావురాలను ప్రత్యేకంగా పూజించే సంప్రదాయంలో మన సంస్కృతిలో భాగమే8. సైంటిఫిక్‌గా చెబితే ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే పసిగట్టి మనుష్యులకు ఒక సూచన ఇవ్వగలవు.

**పిచ్చుక :**

ఒక ఊరిలో పిచ్చుక కనిపిస్తే ఆ ఊరు పచ్చగా ఉన్నట్లు శాస్త్రీయపరంగా ఓ అంచనా. పక్షులు కనిపిస్తున్నా యంటే ఆ ఊరిలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లు. పంటలు బాగా పండుతున్నట్లు. అన్నింటికీ మించి ప్రకృతి నేస్తం పిచ్చుక. జీవ వైవిధ్యానికి ప్రతీక. పంట చేలల్లో రైతన్నలకు ఎదురుపడే ప్రాణులు. వాటికి ఆహారం అందించేందుకు తన ఇంటి చూరుకు వరి కంకులు కట్టేంత ప్రేమ రైతుకు ఉండేదంటే ఆశ్చర్యమేమీ లేదు. పిచ్చుక చిన్నదే ఐనా చాలాతెలివైనది. గొప్ప ఇంజనీరు. తన గూటిని ఎంత అందగా, భద్రంగా కట్టుకుందో చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ''పిచ్చుకంత లేవు. ఎందుకలా ఎగురుతావు?'' అని పల్లెటూరి ప్రజల ఊతపదం. సాధారణంగా పిచ్చుకలు ఇంటి కప్పులక్రింద, పూర్వం రోజులలో పెంకులు అడుగు భాగంలో, పూరిళ్ల వరండాల్లో చూరుక్రిందా గూళ్లు నిర్మించుకునేవి. పల్లెప్రాంతాల్లో పూర్వం ఉండే దిగుడు బావులలోకి వేలాడుతున్న చెట్లపై కట్టుకునే గూళ్లు చాలా అద్భుతంగా ఉండేవి. ఇవి పెద్ద సివిలింజనీర్లు. ఇప్పటికీ మరణించిన మన పూర్వీకులకు నైవేద్యం పెడతాం. ఆ సమయంలో అందరూ వాడే మాట ఒక్కటే 'పిట్టకు వెట్టుడు'. ఆ పిట్ట మన కళ్ల ముందు ఆడుతూ పాడుతూ అటూ యిటూ తిరిగే 'పిచ్చుక'నే. సైంటిఫిక్‌గా చెబితే ఇది పంటపొలాలపై దాడి చేసే చిన్న చిన్న పురుగులు, క్రిమికీటకాలు తిని రైతుకు సాయ పడుతుంది.

**నెమలి :**

కృష్ణుడు అంటే మనకి గుర్తుకు వచ్చేది తల పైన ఉండే నెమలి పింఛం. కోరికలు లేని పవిత్రమైన ప్రాణి నెమలి. నెమలి అశ్రు ధార కూడా పరమ పవిత్రమైనదే. అందుకే కృష్ణుడు తలపై నెమలీక9 ధరిస్తాడు. అత్యంత పవిత్రమైన జీవి కనుకే మన దేశానికి జాతీయ పక్షిగా ప్రకటించబడింది. పదహారు వేల మంది గోపికలు ఉన్నా కూడా శ్రీ కృష్ణుడు అత్యంత పవిత్రుడు. వారి మధ్య ఉన్నది ఒక పవిత్రమైన చెలిమి మాత్రమే అని చెప్పడానికి నిదర్శనము ఈ నెమలి పింఛం. సూర పద్మాసురుడికి, కుమార స్వామికి జరిగిన యుద్ధంలో అసురుడు ఓడిపోయి ఒక మామిడి చెట్టుగా మారతాడు. ఆ చెట్టును కుమార స్వామి రెండు భాగాలుగా ఖండి స్తాడు. ఇక ఓటమి గ్రహించి, తన పశ్చాతాపాన్ని ప్రకటించి, మీ సేవ చేసుకునే భాగ్యాన్ని ఇమ్మంటాడు. అప్పుడు కుమారస్వామి ఖండించిన ఆ రెండు భాగాలను ఒకటి

నెమలి గాను, మరొకటి కోడిగాను మార్చి సేవ భాగ్యాన్ని కలిగిస్తాడు. అందుకే కుమారస్వామి, నెమలి వాహన ధారుడయ్యాడు. తన ధ్వజం పైన కోడిని గుర్తుగా స్వీకరించాడు .

**గుడ్ల గూబ :**

గుడ్లగూబ యొక్క విలక్షణమైన ముఖం, పెద్దగా ఉన్న కళ్లు, ఛాతి, ప్రతిధ్వనించే కూత కారణంగా అనేక మూఢ నమ్మకాలతో సంబంధం కలిగి ఉండి, మంత్రవిద్య మరియు చేతబడిలో ఉపయోగించడం మూలాన ఇది కనిపిస్తే అరిష్టం అని ఒక అపనమ్మకం ప్రజలలో నాటుకు పోయింది. కానీ ఇది మానవ జాతికి చాలా ఉపయోగకరమైనది. సైంటిఫిక్ గా చెబితే ఇది పొలముల్లో ఎక్కువగా తిరుగుతూ పంట పొలములను నాశనం చేసే ఎలుకలను, పంది కొక్కులను, మిడతలను ఆహారంగా స్వీకరించి పంటను రక్షిస్తుంది. భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. ఆ వ్యవసాయాన్ని రక్షించి, ధాన్యం అనే శ్రేష్టమైన సంపదను, మన ఇల్లు చేరేలా చేస్తున్నది గుడ్ల గూబ. అట్లాగే మనం దైవంగా కొలిచే లక్ష్మీ దేవి కూడా సంపదకు నిలయం. భక్తితో కొలిచిన వారికి సంపదలను ఇస్తుంది. ఇక్కడ గుడ్ల గూబ కూడా అడగకుండానే మన సంపద ఇంటికి రావడానికి సహాయ పడుతుంది. దీనికి ప్రతీకగానే సాక్షాత్తూ లక్ష్మీ దేవి, గుడ్లగూబను వాహనంగా స్వీకరించింది.

**హంస :**

హంస ఒక అందమైన పక్షి. తెల్లగా, అందంగా, బాతు ఆకారానికి దగ్గరగా ఉంటుందని ఊహ. భారతదేశంలో హంసలకొక ప్రత్యేక స్థానం ఉంది. వేదాల నుంచి నల దమయంతుల చరిత్ర వంటి కావ్యాల వరకు హంసను గురించి ప్రస్తావించాయి. వేద కాలంలో హంసలు గ్రీష్మ ఋతువులో హిమాలయాలలోని మానస సరోవరం సరస్సుకి తరలి వచ్చేవి. హంసకు గల ప్రత్యేకత చాలా అద్భుతము. అది పాలను, నీళ్లను వేరుచేసే సామర్థ్యం కలిగినది. అంటే పాలు నీరు కలిసిన మిశ్రమంలో నుండి పాలను మాత్రమే తాగి, నీటిని పాత్రలో మిగులుస్తుంది. ఇలా సాక్షాత్తూ వేదములలో హంసల గూర్చి చాలా గొప్పగా వర్ణించారంటే దాని విశిష్టత ఎంత ఘనమైనదో తెలుస్తుంది. వేదాలలో అత్యున్నత స్థాయికి చేరిన వారిని 'పరమహంస' అని అంటారు. కాబట్టే సకల శాస్త్రముల ఆదిదేవత , చదువుల తల్లి సరస్వతీ మాతకు మరియు మనుష్యుల నుదుటిపై రహస్యమైన రాతలు రాసే బ్రహ్మ దేవుడికీ ఈ హంసయే వాహనము.

**చకోర పక్షులు :**

సృష్టిలో పవిత్ర, దైవిక సంబంధ అద్భుత పునీతమైన పక్షి 'చకోరం'. చకోర పక్షిని తెలుగు పలుకుబడిలో ''చాతక పక్షి'' అని అంటారు. పక్షి అరుపు ఒక సంగీత ధ్వనిలా ఉంటుందనే అర్థంతో ''చక్రవాక పక్షి''గా పిలుస్తారు. దీని పేరుతో 'చక్రవాకరాగం' కూడా సంగీతంలో వుంది. చకోర పక్షుల ప్రత్యేక గొప్పదనం ఏమిటంటే- ఎంతటి దాహం వేసినా ప్రకృతి నది నీటినీ, నిర్మలమైన సముద్రపు నీటినీ, భూమిపై చేరిన వాన నీటినీ ముట్టదు. కేవలం కాలుష్యం లేని మేఘాలనుంచి వచ్చే పవిత్ర వాన నీటి చుక్కల కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. అందుకే మన భారతీయ సాహితీ కవులు, తమ గ్రంథాలలో చకోరాల గురించి వర్ణిస్తూ , మంచి కవి సమయం పాటించారు. చకోర పక్షి ''ఆకాశ, వాయు మండలాలు దాటుకుని వెళ్ళి, వెన్నెల లోని ఉష్ణాన్ని మాత్రమే తీసుకుని జీవించే అత్యద్భుత మైన పక్షిగా'' ఊహించారు.

**గరుడ :**

గరుడుడు తన తల్లి కోసం అక్షరాలా అమృతం సాధించడానికి చూపించిన తెగువ, సాహసం, ఏకాగ్రత, ధైర్యం - ఇవన్నీ శ్రీ మహా విష్ణువును ఆకట్టుకున్నాయి. అందుకే అతను అమృతం తాగకుండా కూడా అమరుడు అవుతాడనే వరం ఇచ్చాడు. తన సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించాడు. దీనికున్న సూక్ష్మ గ్రాహక శక్తి వల్ల చరిత్ర పుటలలో ఒక ప్రత్యేకత ను కలిగి ఉంది. అందువల్ల రాజులు దీనిని వేటలో ఉన్నప్పుడు గానీ, యుద్ధములకు వెళ్ళే పుడు గానీ, విజయ యాత్రల్లో విహరించేటపుడు గానీ ఈ గరుడ పక్షిని ఒక దిక్సూచిగా ఉపయోగించేవారు. శత్రువుల రహస్యాలు ఛేదించే ఒక గూఢ చారిగా ఉపయోగపడేది.

**ఉప సంహారం :**

ఈ విధంగా మహర్షులు, మహా కవులు మన భారతీయ సంస్కృతి సాహిత్యాలలో మన చుట్టూ కనిపించే పక్షులకు మహెూన్నత స్థానం కల్పించారు. సాక్షాత్తూ దేవతలే ఆయా పక్షులను వాహనాలుగా స్వీకరించి వాటి గొప్పదనాన్ని ఇనుమడింపజేశారు. కాబట్టి నేటి యువత ఈ విషయాన్ని గుర్తించి, చుట్టూ ఉన్న ప్రకృతి తో, ప్రకృతిలో ఉన్న పక్షులతో మమేకమవ్వాలి. తమ తమ ఇళ్ళల్లో అరుదైన పక్షులను పెంచడం లేదా కనీసం ఒక ఆవాస స్థానాన్ని కల్పించడం ఒక అలవాటుగా చేసు కోవాలి. సెల్ టవర్ల ద్వారా విడుదలయ్యే అసాధారణమైన రేడియేషన్‌ను, నిబంధనలకు అనుగుణంగా తగ్గించేలా, ఆయా కంపెనీలకు ఆదేశాలివ్వాలని అధికారులను కోరాలి. 'అతి సర్వత్రా వర్జయేత్' అనే విషయాన్ని గుర్తుంచు కొని, ప్రకృతికి ప్రమాదం కలుగకుండా సాంకేతిక అభివృద్ధిని సాధించాలని, సామాజిక మాధ్యమాల (Social Media%) ద్వారా అందరికీ అవగాహనను కల్పించాలి. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే పక్షుల గొప్పదనం పైన, పక్షుల ప్రాముఖ్యతపైన పాఠ్యాంశాలు ప్రవేశపెట్టి, అవగాహన కల్పించేలా, పక్షులను సంరక్షించే వారిని గుర్తించి 'పక్షి మిత్ర' అనే అవార్డును ఇచ్చి గౌరవించేలా ప్రభుత్వానికి విన్నవించాలి.

**ఆధార గ్రంథాలు :**


1. భారతీయ సంస్కృతి - ఒక పరిశీలన : ఆచార్య బి. ఎస్. ఎల్. హనుమంత రావు
2. శ్రీ మద్భాగవతము : బమ్మెర పోతన
3. మహా భారతము : వేదవ్యాస మహర్షి
4. ఋగ్వేదం : పరాశర మహర్షి
5. అథర్వణ వేదం : పరాశర మహర్షి
6. రామాయణం : వాల్మీకి మహర్షి
7. బ్రహ్మ పురాణం : వేదవ్యాస మహర్షి
8. బ్రహ్మ వైవర్త పురాణం : వేదవ్యాస మహర్షి
9. విష్ణు పురాణం : వేదవ్యాస మహర్షి
10. గణపతి మూల మంత్ర పురాణం : డా. అరుణ్ కుమార శర్మ


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# “నీలి మేఘాలు” పుట్టుక

## తెలుగు స్త్రీవాద కవిత్వ విప్లవంపై మూల కారణ విశ్లేషణ



- డా॥. కె. ఈశ్వరమ్మ

సహాయాచార్యులు, దొడ్ల కౌసల్యమ్మ మహిళా కళాశాల, నెల్లూరు.

**విషయ సంగ్రహం (Abstract) :**

1993లో ప్రచురితమైన ‘నీలి మేఘాలు’ కవితా సంకలనం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక అసాధారణమైన సంఘటన. ఈ పరిశోధనా పత్రం, ఈ సంకలన ఆవిర్భావాన్ని సాంప్రదాయ సాహిత్య విమర్శ పద్ధతులకు బదులుగా, ‘మూల కారణ విశ్లేషణ’ (Root Cause Analysis - RCA) అనే విశ్లేషణాత్మక చట్రాన్ని ఉపయోగించి పరిశోధిస్తుంది. ఈ కవితా సంకలనం ఎందుకు ఆ నిర్దిష్ట చారిత్రక సమయంలో అంత రాడికల్, దేహ-కేంద్రీకృత, ప్రత్యక్ష స్వరంతో వెలువడిందో ఈ పత్రం అన్వేషిస్తుంది. RCA పద్ధతిలోని దశలను అనుసరిస్తూ, ఈ పరిశోధన తక్షణ కారణాల (ఉదా: స్త్రీవాద చైతన్యం) నుండి, అంతర్లీన కారణాల (ఉదా: ప్రధాన స్రవంతి సాహిత్యంలోని వివక్ష) ద్వారా, చివరికి అట్టడుగున ఉన్న అసలైన మూల కారణం వైపు పయనిస్తుంది. తెలుగు సాహిత్య సమాజంలో లోతుగా పాతుకుపోయిన వ్యవస్థీకృత పితృస్వామ్యం (Systemic Patriarchy) దాని బహుముఖ రూపాలే (సాంస్కృతిక, సాహిత్య, భాషా పరమైన) ‘నీలి మేఘాలు’ వంటి ఒక విప్లవాత్మక ప్రతిచర్యకు జన్మనిచ్చిన అసలైన మూల కారణమని ఈ పరిశోధన నిర్ధారిస్తుంది.

**కీలక పదాలు (Keywords) :**

నీలి మేఘాలు, మూల కారణ విశ్లేషణ (RCA), స్త్రీవాద కవిత్వం, తెలుగు సాహిత్యం, వ్యవస్థీకృత పితృస్వామ్యం, దేహ రాజకీయాలు (Body Politics), ఓల్గా, భాషాపరమైన ధిక్కారం, స్త్రీవాద సౌందర్యశాస్త్రం.

### 1. పరిచయం :

### తెలుగు కవిత్వంలో ఒక చారిత్రాత్మక మెరుపు :

1993లో ఓల్గా సంపాదకత్వంలో వెలువడిన ‘నీలి మేఘాలు’ సంకలనం, తెలుగు సాహిత్య సౌందర్యాన్ని, నైతిక ప్రమాణాలను, వ్యక్తీకరణ పరిధులను శాశ్వతంగా మార్చివేసిన ఒక చారిత్రాత్మక సంఘటన. అది కేవలం ఒక పుస్తకం కాదుబీ అది ఒక ఉద్యమం, ఒక ప్రకటన, అప్పటివరకు అణచివేయబడిన గొంతుకల నుండి వెల్లువెత్తిన ఒక సామూహిక ఆక్రందన. ఈ కవితలు స్త్రీ శరీరాన్ని, దాని అనుభవాలను మునుపెన్నడూ లేని విధంగా పచ్చిగా, నిర్భయంగా ఆవిష్కరించాయి. ఈ సంఘటనను కేవలం ఒక సాహిత్య పరిణామంగా చూడటం దాని ప్రాముఖ్యాన్ని తగ్గించడమే అవుతుంది. అందువల్ల, ఈ పరిశోధన ఒక భిన్నమైన ప్రశ్నను సంధిస్తుంది: ఎందుకు? ఈ రకమైన తీవ్రమైన, ప్రత్యక్ష,

మరియు ఆగ్రహంతో కూడిన కవిత్వం ఆ నిర్దిష్ట సమయంలోనే ఎందుకు ఆవిర్భవించింది? దాని పైపైన కారణాల వెనుక ఉన్న అసలైన, లోతైన మూలాలు ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనడానికి, ఈ పరిశోధనా పత్రం 'మూల కారణ విశ్లేషణ' (Root Cause Analysis - RCA) అనే పద్ధతిని అవలంబిస్తుంది. ఈ పద్ధతి, ఒక సంఘటన లక్షణాల నుండి దాని అసలు కారణాల వైపు ఒక క్రమబద్ధమైన ప్రయాణాన్ని అందిస్తుంది. 'నీలి మేఘాలు' అనే సంఘటనను నిర్వచించడం ద్వారా ప్రారంభించి, తక్షణ, అంతర్లీన, చివరికి మౌలిక కారణాలను శోధిస్తూ, ఈ పత్రం ఆ కవితా విస్ఫోటనం వెనుక ఉన్న వ్యవస్థాగత డైనమిక్స్‌ను విడమరచి చెబుతుంది.

## 2. పరిశోధనా పద్ధతి (Research Methodology):

ఈ పరిశోధన ఒక గుణాత్మక, విశ్లేషణాత్మక అధ్యయనం. దీనికి ప్రధాన సాధనంగా 'మూల కారణ విశ్లేషణ (RCA)'ను ఉపయోగించడం జరిగింది. =జూ అనేది ఒక సమస్య పునరావృతం కాకుండా నిరోధించడానికి దాని అసలైన మూలాలను గుర్తించి, పరిష్కరించడానికి ఉపయోగించే ఒక నిర్మాణాత్మక పద్ధతి. దీనిని ఒక సాహిత్య, సామాజిక దృగ్విషయానికి వర్తింపజేయడం ద్వారా, మనం కేవలం 'ఏమి జరిగింది' అని కాకుండా, 'అది ఎందుకు జరిగింది' అనే లోతైన ప్రశ్నకు సమాధానం కనుగొనవచ్చు.

ఈ పరిశోధన RCA లోని క్రింది దశలను అనుసరిస్తుంది:

**1. సంఘటనను నిర్వచించడం** : 'నీలి మేఘాలు' ప్రచురణ మరియు దాని తక్షణ ప్రభావాన్ని స్పష్టంగా నిర్వచించడం.

**2. తక్షణ కారణాలను గుర్తించడం (The First-Why)** : సంఘటనకు దారితీసిన ప్రత్యక్ష, స్పష్టమైన కారణాలను గుర్తించడం.

**3. అంతర్లీన కారణాలను శోధించడం (The Second-Why)** : ఆ తక్షణ కారణాల వెనుక ఉన్న లోతైన, మధ్యస్థ స్థాయి కారణాలను అన్వేషించడం.

**4. మూల కారణాలను కనుక్కోవడం (The Final-Why)** : అన్ని కారణాలకు మూలంగా ఉన్న ప్రాథమిక, వ్యవస్థాగత సమస్య(ల)ను గుర్తించడం.

ప్రాథమిక ఆధారంగా 'నీలి మేఘాలు' కవితా సంకలనం, మరియు ద్వితీయ ఆధారాలుగా దానిపై వెలువడిన విమర్శనా వ్యాసాలు (ముఖ్యంగా 'భూమిక' పత్రికలోని చర్చలు), కాత్యాయని విద్మహే వంటి వారి విశ్లేషణలు, మరియు సిమోన్ డి బ్యూవా, కేట్ మిల్లెట్ వంటి వారి స్త్రీవాద సిద్ధాంతాలు ఉపయోగించబడ్డాయి.

## 3. RCA <ŠXø 1: సంఘటనను నిర్వచించడం - 'నీలి మేఘాలు' దృగ్విషయం

మన విశ్లేషణకు కేంద్ర బిందువు 1993లో జరిగిన 'నీలి మేఘాలు' ప్రచురణ. ఈ సంఘటన ప్రత్యేక లక్షణాలు :

శ్రీ **అపూర్వమైన వస్తువు** : ఋతుస్రావం ('ముట్టు'), ప్రసవం ('లేబర్ రూం స్టేట్‌మెంట్'), గర్భస్రావం ('అబార్షన్ స్టేట్‌మెంట్'), లైంగిక హింస ('బట్టబయలు'), వంటింటి చాకిరీ ('వంటిల్లు'), స్త్రీ లైంగిక వాంఛలు వంటి అంశాలను ఎటువంటి సంకోచం, అలంకారికత లేకుండా నేరుగా చర్చించడం.

శ్రీ **తీవ్రమైన భావోద్వేగం** : ఈ కవితలలోని స్వరం ప్రేమ, జాలి లేదా సున్నితత్వం కాదు. అది ప్రధానంగా ఆగ్రహం, అసహ్యం, ధిక్కారం, మరియు తిరుగుబాటుతో నిండి ఉంది.

శ్రీ **వ్యవస్థపై ప్రత్యక్ష దాడి** : ఈ కవితలు వ్యక్తిగత బాధలను చెప్పి ఆగిపోలేదు. ఆ బాధలకు కారణమైన కుటుంబం, వివాహం, మతం, మరియు మొత్తం పితృస్వామ్య వ్యవస్థపై నేరుగా, నిర్మొహమాటంగా దాడి చేశాయి.

శ్రీ **తక్షణ మరియు తీవ్రమైన వివాదం** : ప్రచురితమైన వెంటనే, ఈ సంకలనం తీవ్రమైన విమర్శలను, దాడులను ఎదుర్కొంది. దీనిని 'అశ్లీలం'గా, 'పురుష ద్వేషం'గా,

మరియు 'కవిత్వం కానిది'గా ముద్ర వేశారు.

**కాబట్టి, మన విశ్లేషించాల్సిన సంఘటన :** '1993లో, తెలుగు సమాజంలో తీవ్రమైన వివాదాన్ని, సాహిత్య చర్చను రేకెత్తించిన, అపూర్వమైన రీతిలో దేహ-కేంద్రీకృత, ఆగ్రహపూరిత స్త్రీవాద కవితా సంకలనం ఆవిర్భవించడం.'

## 4. RCA దశ 2 : తక్షణ కారణాలు - మొదటి 'ఎందుకు?'

శ్రీ ప్రశ్న : 'నీలి మేఘాలు' వంటి సంకలనం ఎందుకు ప్రచురితమైంది?

**1. స్త్రీవాద ఉద్యమాల ప్రత్యక్ష ప్రభావం :** 1980లలో ఆంధ్రప్రదేశ్‌లో బలపడిన స్త్రీవాద బృందాలు, సంఘాలు (స్త్రీ శక్తి సంఘటన్ వంటివి) ఒక కొత్త రాజకీయ చైతన్యాన్ని రగిలించాయి. ఈ ఉద్యమాలలో పనిచేసిన ఓల్గా, విమల వంటి కవయిత్రులు తమ రాజకీయ అనుభవాలను సాహిత్య వ్యక్తీకరణగా మార్చారు.

**2. ప్రధాన స్రవంతి తిరస్కరణ :** ఈ రకమైన పచ్చి, రాడికల్ కవితలను ప్రచురించడానికి అప్పటి ప్రధాన స్రవంతి సాహిత్య పత్రికలు మరియు సంపాదకులు సిద్ధంగా లేరు. వారి ప్రమాణాల ప్రకారం ఇది 'కవిత్వం' కాదు. ఈ తిరస్కరణ, తమకంటూ ఒక స్వంత వేదికను నిర్మించుకోవాలనే అవసరాన్ని సృష్టించింది.

**3. ఒక సామూహిక గొంతుక అవసరం :** విడివిడిగా రాస్తున్న అనేక మంది స్త్రీవాద కవయిత్రుల స్వరాలను ఒకచోట చేర్చి, ఒక సామూహిక శక్తిగా ప్రదర్శించాలనే సంపాదకుల (ఓల్గా) స్పృహాపూర్వక నిర్ణయం దీనికి మరో తక్షణ కారణం.

## 5. RCA దశ 3 : అంతర్లీన కారణాలు - రెండవ 'ఎందుకు?'

శ్రీ ప్రశ్న : పైన చెప్పిన తక్షణ కారణాలు (ఉద్యమ ప్రభావం, తిరస్కరణ, సామూహిక గొంతుక అవసరం) ఎందుకు తలెత్తాయి?

ఈ ప్రశ్నకు సమాధానం కోసం ప్రతి తక్షణ కారణాన్ని మరింత లోతుగా శోధిద్దాం.

### శ్రీ 5.1 స్త్రీవాద ఉద్యమాలు ఎందుకు అంతగా బలపడాల్సి వచ్చింది?

**శ్రీ ఇతర ఉద్యమాల వైఫల్యం :** అంతకు ముందున్న అభ్యుదయ, విప్లవ సాహిత్యోద్యమాలు 'వర్గ పోరాటం' అనే ఏకైక అజెండాకు కట్టుబడి ఉన్నాయి. అవి స్త్రీల అణచివేతను ఒక ద్వితీయ సమస్యగా, వర్గ వ్యవస్థలో ఒక ఉప-ఉత్పత్తిగా మాత్రమే చూశాయి. 'వంటింటి చాకిరీ' , లైంగిక హింస, పునరుత్పత్తి హక్కులు వంటి లింగ-నిర్దిష్ట సమస్యలకు వారి సిద్ధాంతాలలో, ఆచరణలో సరైన స్థానం లభించలేదు. ఈ సైద్ధాంతిక వెలితి (Ideological Vacuum), స్త్రీలకు తమ సమస్యల గురించి తామే మాట్లాడుకోవాల్సిన అవసరాన్ని సృష్టించింది.

**శ్రీ పెరుగుతున్న హింస మరియు ప్రభుత్వ వైఫల్యం :** సమాజంలో వరకట్న హత్యలు, అత్యాచారాలు వంటి హింసాత్మక ఘటనలు పెరుగుతున్నా, చట్టం మరియు న్యాయ వ్యవస్థలు బాధితులకు అండగా నిలవడంలో విఫలమవుతున్నాయనే భావన బలపడింది. ఈ వ్యవస్థాగత వైఫల్యం, స్త్రీలను తమ రక్షణ కోసం, న్యాయం కోసం తామే పోరాడాలని ప్రేరేపించింది.

### శ్రీ 5.2 ప్రధాన స్రవంతి సాహిత్యం ఈ కవితలను ఎందుకు తిరస్కరించింది?

**శ్రీ సాహిత్య పితృస్వామ్యం (Literary Patriarchy):** తెలుగు సాహిత్య రంగంలో ప్రమాణాలను నిర్దేశించే అధికారం (Gatekeeping Power) దాదాపు పూర్తిగా పురుషుల చేతిలో ఉంది. వారి దృక్కోణంలో, కవిత్వం 'లలితంగా,' 'ధ్వని ప్రధానంగా,' 'పరోక్షంగా' ఉండాలి. స్త్రీల ఆగ్రహం, వారి శారీరక అనుభవాల ప్రత్యక్ష వర్ణన వారి 'సౌందర్య ప్రమాణాలకు' సరిపోలేదు. ఇది కేవలం అభిరుచికి సంబంధించిన విషయం కాదు, అధికారం మరియు నియంత్రణకు సంబంధించిన విషయం. ఏది సాహిత్యం, ఏది కాదు అని నిర్దేశించే అధికారాన్ని వారు కలిగి ఉన్నారు.

**శ్రీ 'అశ్లీలత' పేరుతో నియంత్రణ :** స్త్రీ శరీరం గురించి

బహిరంగంగా మాట్లాడటాన్ని 'అశ్లీలత'గా ముద్రవేయడం అనేది స్త్రీల గొంతుకను అణచివేయడానికి పితృస్వామ్యం ఉపయోగించే ఒక పురాతన ఆయుధం. వారి రాతలను నైతికంగా కించపరచడం ద్వారా, వాటి సాహిత్య విలువను ప్రశ్నించడం సులభమైంది.

### శ్రీ 5.3 సామూహిక గొంతుక ఎందుకు అవసరమైంది?

**శ్రీ విడిగా ఉంటే బలహీనత** : విడివిడిగా వినిపించే స్వరాలను తేలికగా అణచివేయవచ్చని, వ్యక్తిగత ఆక్రందనలుగా కొట్టిపారేయవచ్చని స్త్రీవాద రచయిత్రులు గ్రహించారు. కానీ, అనేక గొంతుకలు ఏకమై ఒకే వేదికపై నుండి మాట్లాడినప్పుడు, అది వ్యక్తిగత సమస్య కాదని, అదొక సామూహిక, రాజకీయ సమస్య అని ప్రకటించినట్లు అవుతుంది. "నీలి మేఘాలు" ఈ వ్యూహాన్ని విజయవంతంగా అమలు చేసింది. అది ఒక వ్యక్తి ఆవేదన కాదు, ఒక తరం స్త్రీల సామూహిక ప్రకటన.

## 6. RCA దశ 4 : అసలైన మూల కారణం(లు) - చివరి 'ఎందుకు?'

శ్రీ ప్రశ్న : సాహిత్య పితృస్వామ్యం, ఇతర ఉద్యమాల వైఫల్యం, మరియు వ్యవస్థాగత హింస ఎందుకు సమాజంలో అంత లోతుగా పాతుకుపోయి ఉన్నాయి? వీటన్నిటి వెనుక ఉన్న అసలైన మూలం ఏమిటి? ఈ ప్రశ్న మనల్ని 'నీలి మేఘాలు' ఆవిర్భావానికి దారితీసిన అసలైన, ప్రాథమిక కారణానికి తీసుకువెళ్తుంది.

**మూల కారణం : వ్యవస్థీకృత పితృస్వామ్యం (Systemic Patriarchy)** : 'నీలి మేఘాలు' అన్ని కారణాలకు మూలం తెలుగు సమాజం దాని సంస్థల అణువణువునా నిండి ఉన్న పితృస్వామ్య భావజాలం నిర్మాణం. ఇది ఒకే రూపంలో కాకుండా బహుముఖ రూపాలలో పనిచేస్తుంది, 'నీలి మేఘాలు' ఈ అన్ని రూపాలపై ఏకకాలంలో దాడి చేసింది.

### శ్రీ 6.1 సాంస్కృతిక మరియు సామాజిక పితృస్వామ్యం (Control over the Female Body) :

పితృస్వామ్యానికి కేంద్రం స్త్రీ శరీరంపై నియంత్రణ. స్త్రీ శరీరాన్ని మరియు దాని సహజ ప్రక్రియలను (ఋతుస్రావం, ప్రసవం) 'అపవిత్రం'గా 'సిగ్గుపడాల్సినవి'గా రహస్యంగా ఉంచాల్సినవిగా సంస్కృతి నిర్దేశించింది. ఇదే మూల కారణం కాబట్టే, 'నీలి మేఘాలు' ప్రతిచర్య కూడా శరీరాన్నే తన పోరాట క్షేత్రంగా ఎంచుకుంది. కొండేపూడి నిర్మల 'లేబర్ రూం స్టేట్‌మెంట్'లో ప్రసవాన్ని, ఘంటసాల నిర్మల 'ముట్టు' లో ఋతుస్రావాన్ని బహిరంగపరచడం అనేది ఈ సాంస్కృతిక నియంత్రణపై ప్రత్యక్ష ధిక్కార ప్రకటన.

### శ్రీ 6.2 భాషాపరమైన పితృస్వామ్యం (Linguistic Patriarchy) :

భాష తటస్థమైనది కాదు. అది అధికార సంబంధాలను ప్రతిబింబిస్తుంది. తెలుగు భాష మరియు దానిలోని సాహిత్య ప్రయోగాలు పురుషుల అనుభవాలకు, దృక్కోణాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయి. స్త్రీల ఆగ్రహాన్ని, హింస వల్ల కలిగే మానసిక క్షోభను, లేదా శారీరక వాస్తవాలను వ్యక్తీకరించడానికి సిద్ధంగా ఉన్న భాష లేదు. ఈ భాషాపరమైన దారిద్ర్యమే 'నీలి మేఘాలు' కవితలు ఎందుకు అంత పచ్చిగా, సూటిగా, 'అకవితాత్మకంగా' ఉన్నాయో వివరిస్తుంది. కవయిత్రులు తమ అనుభవాలకు అద్దం పట్టే కొత్త భాషను, కొత్త పదబంధాలను ('పైటని తగిలెయ్యాలి') సృష్టించుకోవలసి వచ్చింది. ఇది కేవలం కవిత్వం రాయడం కాదు, భాషనే విముక్తి చేసుకునే ప్రయత్నం.

### శ్రీ 6.3 సంస్థాగత పితృస్వామ్యం (Institutional Patriarchy) :

కుటుంబం, వివాహం వంటి సంస్థలు స్త్రీ అణచివేతకు కేంద్రాలుగా పనిచేస్తాయని స్త్రీవాదం వాదిస్తుంది. ఈ సంస్థలను పవిత్రమైనవిగా కీర్తించడం ద్వారా పితృస్వామ్యం తనను తాను కాపాడుకుంటుంది. ఈ సంస్థల పవిత్రత అనే భావనే ఒక మూల కారణం కాబట్టి, విమల 'వంటిల్లు' కవిత వంటింటిని ఒక సామ్రాజ్యంగా, ఒక జైలుగా చిత్రించింది. ఇది కుటుంబం అనే సంస్థపై

చేసిన ఒక సైద్ధాంతిక దాడి. వివాహ బంధంలోని ప్రేమరాహిత్యాన్ని, శ్రమ దోపిడీని బయటపెట్టడం ద్వారా, ఈ కవితలు పితృస్వామ్యం యొక్క మూల స్తంభాలను కదిలించాయి.

### శ్రీ 6.4 సాహిత్య పితృస్వామ్యం (Literary Patriarchy as a symptom of Systemic Patriarchy):

సాహిత్య రంగంలో కనిపించిన వివక్ష, ప్రధాన స్రవంతి తిరస్కరణ అనేవి విస్తృత సమాజంలో ఉన్న పితృస్వామ్యానికి కేవలం ప్రతిబింబాలు. ఏది గొప్ప సాహిత్యమో, ఏది ¿±<Ã' s¥+#ûç ¥ÖD²\ T(Canon Formation) కూడా ఈ అధికార నిర్మాణంలో భాగమే. ఈ సాహిత్య నియంతృత్వమే 'నీలి మేఘాలు' తనకంటూ ఒక సొంత సౌందర్య శాస్త్రాన్ని (Feminist Aesthetics) నిర్మించుకోవడానికి కారణమైంది. ఈ కొత్త సౌందర్య శాస్త్రం ప్రకారం, అనుభవాన్ని నిజాయితీగా, నిర్భయంగా చెప్పడమే అసలైన అందంబీ ఆగ్రహం కూడా ఒక ముఖ్యమైన రసమే.

### ముగింపు :

విశ్లేషణ నుండి వచ్చిన ఫలితాలు మూల కారణ విశ్లేషణ (RCA) పద్ధతి ద్వారా ఈ అంశాన్ని పరిశీలించినప్పుడు, 'నీలి మేఘాలు' కేవలం కొందరు స్త్రీల ఆగ్రహం నుండి పుట్టిన ఆకస్మిక పరిణామం కాదని స్పష్టమవుతుంది. అది ఒక చారిత్రక అనివార్యత.

శ్రీ సంఘటన (Event): 'నీలి మేఘాలు' ప్రచురణ.

శ్రీ తక్షణ కారణాలు (Proximal Causes) : స్త్రీవాద ఉద్యమాలు, ప్రధాన స్రవంతి తిరస్కరణ.

శ్రీ అంతర్లీన కారణాలు (Underlying Causes) : ఇతర ఉద్యమాల వైఫల్యం, సాహిత్య రంగంలో పురుషాధిపత్యం, వ్యవస్థీకృత హింస.

శ్రీ మూల కారణం (Root Cause) : సమాజం యొక్క అన్ని రంగాలలో (కుటుంబం, సంస్కృతి, భాష, సాహిత్యం) లోతుగా వేళ్లూనుకున్న వ్యవస్థీకృత పితృస్వామ్యం. తుది విశ్లేషణలో, 'నీలి మేఘాలు' అనేది పితృస్వామ్య సమాజమనే వ్యాధి యొక్క అత్యంత స్పష్టమైన లక్షణం (symptom). వైద్యుడు లక్షణాలను చూసి వ్యాధి మూలాలను కనుక్కున్నట్లు, మనం 'నీలి మేఘాలు'లోని ఆగ్రహాన్ని, దేహ-కేంద్రీకృత వ్యక్తీకరణను చూసి, దాని వెనుక ఉన్న పితృస్వామ్య అణచివేత అనే అసలైన వ్యాధిని నిర్ధారించవచ్చు. ఆ కవయిత్రులు తమ కవిత్వంతో పితృస్వామ్యం యొక్క ప్రతి మూల కారణంపై గురిపెట్టి దాడి చేశారు. అందువల్ల, 'నీలి మేఘాలు' ఒక సాహిత్య సంకలనం మాత్రమే కాదు, అది పితృస్వామ్య సమాజంపై జరిపిన ఒక లోతైన, బహుముఖ సైద్ధాంతిక, మరియు విప్లవాత్మక దాడి. RCA పద్ధతి ఈ సంక్లిష్ట సంబంధాన్ని ఒక స్పష్టమైన, తార్కిక చట్రంలో ఆవిష్కరించడానికి మనకు సహాయపడింది.

### ఆధార గ్రంథాలు (References) :


1. ఓల్గా (సం.). (1993). నీలి మేఘాలు. హైదరాబాద్: స్వేచ్ఛా సాహితీ.
2. కాత్యాయని విద్మహే. (2009). ఆధునిక తెలుగు సాహిత్యం - స్త్రీవాద దృక్పథం. హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌస్.
3. సజయ, కె. (2005). స్త్రీవాద రాజకీయాలు, సాహిత్యం. హైదరాబాద్: మహిళా చేతన.
4. జయప్రభ. (1988). యశోధరా ఈ వగపెందుకే?. విజయవాడ: నవసాహితి బుక్ హౌస్.
5. విమల. (1990). అడవి ఉప్పొంగిన రాత్రి.
6. శిలాలోలిత. (1995). బట్టబయలు.

7. zý²Z(2000). The Woman Unbound: A Postscript to Neeli Meghalu%µµ. Indian Literature, Sahitya Akademi. Vol. 44, No. 5, pp. 156-162.

8. Beauvoir, Simone de. (1949). The Second Sex. (Translated by H. M. Parshley). New York: Alfred A. Knopf.

9. Butler, Judith. (1990). Gender Trouble: Feminism and the Subversion of Identity. New York: Routledge.

10. Chakravarti, Uma. (2003). Gendering Caste: Through a Feminist Lens. Kolkata: Stree.

11. Millett, Kate. (1970). Sexual Politics. Garden City, NY: Doubleday.

12. Narayana Rao, Velcheru. (2003). The Politics of Telugu Literature. In Literary Cultures in History: Reconstructions from South Asia, edited by Sheldon Pollock. Berkeley: University of California Press.

13. Spivak, Gayatri Chakravorty. (1988). Can the Subaltern Speak. In Marxism and the Interpretation of Culture. Edited by Cary Nelson and Lawrence Grossberg. Urbana: University of Illinois Press.

14. Tague, T. (2013). Making the Case for the 5 Whys Method. Quality Progress, 46(3), 18-23. (Reference for RCA methodology).

★★★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి – జాషువ బాపూజీ



– డా॥. సి. నర్సింహులు
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, డా॥ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం), జడ్చర్ల, మహబూబునగరు.

1857 సంవత్సరములో సిపాయిల తిరుగుబాటుతో భారత స్వాతంత్ర్యోద్యము ఉధృతమైంది. ఎవరికి నచ్చిన పద్ధతిలో వారు ఉద్యమాలు చేస్తున్నారు. దేశములో వున్న కవులు, రచయితలు వారి వారి భాషలలో ఉద్యమ కవిత్వాలు, కావ్యాలు, పత్రికా సంపాదకీయాలు, దేశ నాయకులు జీవిత చరిత్రలు రాసి యువకులను చైతన్య పరుస్తున్నారు. ప్రతి ఒక వ్యక్తికి దేశభక్తిని నూరి పోస్తున్నారు. అట్లే తెలుగు భాషలో కూడ దేశభక్తి కవిత్వం వచ్చింది. జాతీయోద్యమంపై కవులు పద్యాలు, గేయాలు రాశారు. కొందరు కవులు కవిత్వం రాస్తూ, ఉద్యమ చైతన్యాన్ని కలిగిస్తూ స్వయంగా ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారు. కొందరు కవులు ఉద్యమాలలో పాల్గొన్న జాతీయ నాయకుల ఉపన్యాసాలను, ఉద్యమలక్ష్యాలను కవిత్వ రూపంలో, వ్యాసాల రూపంలో రాశారు. గాంధీజీ సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమం. శాసనోల్లంఘనోద్యమం, విదేశి వస్తుబహిష్కరణోద్యమం మొదలైనవి గాక, చంపారణ్ సత్యాగ్రహం, రౌలట్ సత్యాగ్రహం, ఖిలాపత్ ఉద్యమం, జలియన్ వాలాబాగ్ హత్యాకాండ, చౌరీచౌర హింసాకాండపై గాంధీజీ నాయకత్వంలో జాతీయ నాయకులు ఉద్యమాలలో పాల్గొన్నారు. దండి ఉప్పు సత్యాగ్రహం జరిగింది. క్విట్ ఇండియా ఉద్యమం వంటివి బ్రిటీషువాళ్ళ గుండెల్లో రైళ్ళు పరుగెత్తించాయి.

"వందేమాతర" ఉద్యమం సందర్భంగా బెంగాల్ నుండి మద్రాసువరకు తన ఉపన్యాసాలతో ప్రజలను చైతన్య పరుస్తూ వెళ్ళుచున్న బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరంలో 5 రోజులు ఉపన్యసించారు. బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరంలో ప్రసంగించిన చౌరస్తాను "పాల్ చౌకు" పేరుతో పిలుస్తున్నారు. పాల్ బెంగాలిలో ప్రసంగిస్తే చిలకమర్తి లక్ష్మీ నరసింహరావుగారు. తెలుగులో చెప్పేవారు. 5 రోజులు బ్రిటీషు వారి దుర్మార్గాలు, దురాగతాలు ప్రసంగంలో చెప్పిన సారాంశాన్ని ఒక పద్యంలో చెప్పారు. అది....

భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేక దూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి

ఈ పద్యంలో చిలకమర్తిగారు ఆంగ్లేయులు భారతీయులను ఏ విధంగా దోచుకుంటున్నారో సరళంగా ప్రజలకు అర్థమయ్యే ఉపమానాన్ని తీసుకొని చెప్పారు. గోదావరి తీరంలో చెప్పిన ఈ పద్యం. ప్రచారం లేకుండానే

కృష్ణాతీరం గూడ దాటింది. తెలుగు ప్రజలను, కవులను, యువకులను ఆలోజింపజేసింది. ప్రతి ఒక్కరికిని ఉద్యమాల్లో పాల్గొనేటట్లు చేసింది. కవులకు కవితా వస్తువైంది.

భరతమాతను జాషువా ఆరాధించి, అభిమానించి, గౌరవించినంతగా ఏ కవి ఆరాధించలేదని చెప్పవచ్చు. భరతమాత గొప్పదనాన్ని హృదయపూర్వకంగా జాషువా వర్ణించిన పద్యం. నిత్యనూతనమైనది. అది....

సగర మాంధాతాదిషట్చక్రవర్తుల
యంక సీమను నిల్పినట్టి సాధ్వి
కమలనాభుని వేణుగాన సుధాంబుధి
వోలలాడిన పరిపూత దేహ
కాళిదాసది సత్కవికుమారులగాంచి
కీర్తినొందిన పెద్ద గేస్తురాలు
బుద్ధాది మునిజనంబుల దపంబున
మోదభాష్పముల్ విడిచిన భక్తురాలు
సింధు గంగానదీ క్షీరమెపుడు
గురుని బిడ్డల బోసించు కొనుచునున్న
పచ్చిబాలింతరాలు మా భరతమాత
మాతలకు మాత సకల సంవత్సమేత

ఈ పద్యంలో జాషువ చూపిన మాతృత్వం తరతరాలుగా భారతీయులను ఐక్యమత్యంగా వుండునట్లు చేసింది. అదే దేశభక్తి స్ఫూర్తితో వచ్చిన గొప్ప ఖండ కావ్యము గుఱ్ఱం జాషువాగారి "బాపూజీ".

1948 జనవరి 30 నాడు, సాయంకాలము 5 గంటలకు ఎర్రరోటలో వున్న గాంధీని గాడ్సె చంపాడు. గాంధీజీ హత్యతో దేశమే కాదు యావద్ప్రపంచమంతా కన్నీరు పెట్టింది. అనేక ఉద్యమాలు చేసి దేశానికి అహింసా యుధముతో పోరాడి స్వాతంత్ర్యాన్ని సమకూర్చి పెట్టిన బాపూజీని గూర్చి అతడు చేసిన జాతీయోద్యమాలను గుర్తు చేసుకుంటూ ఉద్యమస్ఫూర్తితో చేసిన రచన "బాపూజీ".

'బాపూజీ' చిన్నఖండకాక్యము. కావ్యారంభంలో పూర్వ కవులు యిష్టదేవతాస్తుతి సేస్తె, జాషువా గాంధీనే దేవతగా స్తుతి చేశాడు. అది....

ఎవడీయర్ధదిగంబరేశ్వరుడు మాయిండ్లం
ప్రవేశింపనం
చవమానంబుగ చర్చలాడగ బకింగ్హామ సౌధమున్
ద్రొక్కిహైం
దవ జాతీయతలీను మేల్పిలక నాట్యంబాడ శ్రీ జార్జి
భూ
ధవునింటన్ ఫలహారముల్ సలుపు తాతన్ గాంధి
నర్చించెదన్

సూటు, బూటు లేని సగము దిగంబరుడు మా యిండ్లకు రావడమేమిటని భావించుచున్న బ్రిటీషువారు బ్రిటీషు రాజప్రాసాదమైన బకింగ్హమ్ ప్యాలెస్కు వెళ్ళి 3వ జార్జి గారితో కలిసి ఫలహారము చేసిన హిందూ సాంప్రదాయమైన పిలకతో వున్న గాంధిని అర్చిస్తాను అన్నాడు జాషువ. ఇక్కడ జాషువాగారు గాంధిని దేవునిగా భావించి ప్రారంభపద్యంలో స్తుతిస్తూ రాశాడు. ముందు కవులు వినాయక స్తుతితోనో, సరస్వతి స్తుతితోనో లేక ఆ కవి వారికిష్టమైన దేవుని స్తుతిస్తూ రాసే సాంప్రదాయాన్ని తొలగించి వారి స్థానములో ప్రత్యక్ష దైవముగా గాంధీని భావించి స్తుతి చేశాడు.

గాంధి భారతదేశానికి ఎంత విలువైన సంపదో తెలుపుతూ....

భరత వర్షంబీను వజ్రాల ధనరాశి
తూకంబునకు పెచ్చు తూగువాడు
మూడుమూర్తుల దయాభూతి ప్రత్యంగాన
తాండవించెడు పవిత్ర స్వరూపి
పదివేల యేండ్లలోపల ధరాదేవత
కనియెఱుంగని జగన్మునివరుండు
అనుగుదమ్ములు కోరుకొను స్వరాజ్యార్థమై
పస్తుండి శుష్కించు పండుముసలి
గోచిపాత గట్టుకొని జాతిమానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామితప్రదాత గాంధీతాత

భరతమాతనే కాదు, ధరాదేవత అనగా యావత్ ప్రపంచములో 10వేల యేండ్లనుండి యిటువంటి

మహానుభావుడు పుట్టలేదు. స్వరాజ్యసాధన కొరకు తను ఉపవాసముండి తన శరీరాన్ని శుష్కంప జేసుకున్నాడు. కాని ఎవరినీ యిబ్బంది పెట్టలేదు. విశ్వము ఐకమత్యంలో ఉండాలని, కోరుకున్న వక్తి గాంధి. బ్రిటీషువారు చేస్తున్న దోపిడి దౌర్జన్యాలకు భయపడుతున్న భారతీయులకు ధైర్యము చెప్పిన గాంధి..

విమత భూపతుల దోపిడిగుందు జాతిలో
దీపంబు బెట్టిన దినకరుండు
మానవత్వమును భూమండలంబున నెల్ల
చాటిన యాచార్య చక్రవర్తి
సత్యాగ్రహంబను శస్త్రచాలన విద్య
భువికి దెచ్చిన మహాపురుషమౌళి
నిమ్నజాతుల కంటి నీరంబు దుడిచి యా
శ్వాసించు నిరుపేద బాంధవుండు
పండ్లునూరుచున్న బహుమతంబులలోన
సహనవిద్య నేర్పు సాధకుండు
భార్యబిడ్డలున్న ప్రత్యక్ష దైవంబు
కామిత్ర ప్రదాత, గాంధి తాత

ప్రపంచం ఆశ్చర్యపడేటట్లు కొత్త ఆయుధాన్ని కనుటొన్నాడు. ఈ ఆయుధం ప్రయోగించడం వల్ల ప్రయోజనమేమిటంటే శత్రుత్వము చచ్చి, శత్రువు మిత్రుడవుతాడు. అదే 'సత్యాగ్రహంబు'. ఈ ఆయుధంతోనే బ్రిటీషు సామ్రాజ్యాధికారాన్ని ఎదిరించి పేదవారి బాధను తొలగించి, మత సామరస్యానికి సహనాన్ని సాధన చేయమన్న ప్రత్యక్ష దైవము గాంధి.

భారతస్వాతంత్రోద్యమంలో పాల్గొనుచున్న జాతీయ నాయకులు గాంధి ఉద్యమాన్ని సమర్థించారు. అతని ఆజ్ఞను శిరసావహించారు వారు.

లాలా లజపతిరాయ్, మో
తీలాల్ నెహురూ, తిలక్కు దేశాయి, పటేల్
మాళవ్య ప్రభృతి ప్రముఖులు
మౌళిందాలిచిరి గాంధి మహితోద్యమమున్.

విదేశి వస్తు బహిష్కరణ ఉద్యమములో భారతీయులకు ధైర్యము చెప్పి, వారి మనస్సులో స్వాతంత్ర్య బీజములు నాటి చెరసాల అంటే భయాన్ని పోగొట్టాడు. ఆ విషయం జాషువ మాటల్లో....

సత్యాగ్రహ స్వర్ణశంఖంబు పూరించి
స్వాతంత్ర్య సమర బీజములు నాటి
సీమబట్టలు ధరించెడు పుట్టుభోగికి
చేనేత మగ్గాలు చేతికిచ్చి
దొరలచేజిక్కిన భరత సామ్రాజ్యంబు
సుపవాసముల చేత నూచియూచి
స్వీయదేశీయ సిపాయి ఖైదియౌట
గౌరవంబను సుద్దిగట్టి జేసి
పొదలు మంచుకొండ మొదలు సేతువుదాక
భారతంబువెంట బరుగులెత్త
జడుపుగిడుపులేని శాంతి పటాలంబు
సిద్ధపరచె ధర్మబద్ధుడగుచు.

గాంధీజి మాటను ప్రతియొక్కరు, ఆబాలగోపాలము శిరసావహించారు. ఇంతగొప్పవాణ్ణి సీమదొరలు ఏమి చేయలేరన్నారు జాషువా.

ముసలమ్మమొదలు పసిపాపవరకు ఖ
ద్దరు బట్ట నెమ్మేనదాల్చినారు
పాలకుండాదిగా బంట్రౌతు వరకు గాం
ధీటోపి ధరియించి తిరిగినారు
ధనికుండువోలే ముద్దకులేని పేదయు
కడగి సన్నని నూలు వడికినారు
ఆస్థికుండును వీరనాస్తికుండును గూడ
బాపూజి కంజలి బట్టినారు
గాంధి నామకంబు గాంధి సందేశంబు
మారుమూలలందు మారుమ్రోగె
ఖండపంచకంబును గౌగిలించినవాని
సీమశక్తులేమి చేయగలవు.

బ్రిటీషు ప్రభుత్వము ఉప్పుపై పన్నువిధించి భారతీయులను కష్టాలపాలు చేయుచున్న సమయంలో గాంధి "ఉప్పు సత్యాగ్రహాన్ని" పాటించి "దండి సత్యాగ్రహము" పేరుతో ఉద్యమాన్ని నడిపించుచు అరేబియ సముద్రానికి పోయినప్పుడు గాంధీని గౌరవించి

సముద్రుడే చేతులు జోడించాడట. మరి సీమదొరలు ఏం చేయలేరు అని జాషువా...

ఉప్పు సత్యాగ్రహంబున కుత్సహించి
కఱ్ఱమోపున జలధికి గదలు నాడు
శాంతగంభీర భంగహస్తములు సాచి
యంజలి ఘటించె బాపూజి కబ్ధిరాజు

సీమ ప్రభుత్వాన్ని వణికించిన గాంధి పరాక్రమము జాషువ మాటల్లో....

ప్రొద్దుగ్రుంకని సామ్రాజ్యభూతి గలిగి
సీమరాజుల చిరకాల సింహపీఠి
నొక్కముసలయ్యయుఱ్ఱూతలూచసాగె
ఆత్మశక్త్యున్నతులకు ప్రాయంబులేదు.

బ్రిటీషు రాజమందిరములో కూడ గొప్పగా గౌరవము పొంది భారతదేశ ప్రజల కష్టాలు తొలగించడానికి పుట్టిన ఋషిశ్రేష్టుడని ప్రపంచ దేశాలు పొగిడాయి.

చెప్పులకాళ్ళతో జని సీమనృపాలుని సౌధసీమలో
గొప్పగ గౌరవింపబడి కూరిచినాడు యశస్సు జాతికిన్
దుప్పటి దుడ్డుకఱ్ఱగల తోరపు వృద్ధుడు గాంధి, యిండియా
తిప్పలు తీర్పబుట్టిన యతీర్వరుడనుచు నుతించె దేశముల్.

భారతదేశానికి స్వాతంత్ర్యమునిస్తామని ఇంగ్లాండు రాజు మూడవ జార్జి గాంధీని తేనీటి విందుకు లండన్ రాజ్యప్రాసాదానికి ఆహ్వానించి గౌరవించారు. అతడే కాదు, పాశ్చాత్యదేశ ప్రభువులందరు గాంధి గొప్పదనానికి ఆశ్చర్యచకితులైనారు. బాపూజీ పొందిన గౌరవాన్ని జాషువా మాటల్లో..

తేనీటివిందు కాహ్వానించి పూజించి
చరితార్థుడైపోయె జార్జిరాజు
సలహ నెపమున చెలిమికాండ్రై వారు
రాష్ట్రపాలురు వయిస్రాయి వరులు
ఇండియా ముని కోర్కె నీడేర్పుడను మాట
గలిపినారమెరికా ఖండ ప్రజలు
దరిసెనంబొకమారు దయచేయుడని మెచ్చి
ప్రణుతించి నారక్ష రాజవరులు
ఘనతకెక్కిన పాశ్చాత్య ఖండమెల్ల
ప్రేమతో గాంధిమూర్తి ముద్రించుకొనియె
జాతిజనకుని విఖ్యాతి దలప
నరనరంబున గర్వంబు మెరిసిపోవు

గాంధి భారతదేశంబులో పుట్టినందుకు మనకు గర్వకారణము.

చివరగా గాంధి మరణమును గూర్చి దేశమేకాదు, ప్రపంచమే శోకసముద్రములో మునిగిపోయింది.

స్వాతంత్ర్యమొచ్చి ఆ ఆనందము అనుభవించక ముందే గాంధి మరణవార్త వినవలసివచ్చింది.

అవతరించిన స్వరాజ్య ప్రాజ్యబాలిక
కక్కటా! ముకుపచ్చలారలేదు
సకుటుంబముగ వీడి చనుచున్న తెలిరాజు
నిజసీమలో కాలు నిలువలేదు
హస్తినాపురిమీద హైందవ ధ్వజమెత్తి
నిండుగా యేడాది నిండలేదు
స్వాతంత్ర్య ఘన మహోత్సవ జయధ్వానంబు
మార్మోత లూరూర మాయలేదు
సింహపీఠిక నధివసించిన యనుంగ
మనుమలం జూచుకొనుచు నమంద హర్ష
పులకిత స్వాంతుడగు దొడ్డముసలివాడు
మాయమయ్యెనె? లోకాల గాయమగుచు.

1947 ఆగష్టు 15 నాడు స్వాతంత్ర్యమొస్తే 1948 జనవరి 30 నాడు గాంధీని కడతేర్చారు. యేడాది పూర్తి గాకముందే గాంధి వెళ్ళిపోయాడని ప్రపంచమే బాధ పడింది. మరణించిన గాంధీని వివిధ మతములవారు భావించిన విధమును జాషువా హృదయ స్పందనలో....

అచ్చపుగ్రైస్తవుడనుచు నంజలి బట్టిరిక్రైస్తవోత్తముల్
పొచ్చెములేని బౌద్ధుడని పూజలొనర్చిరి బౌద్ధభిక్షుకుల్
మచ్చరకించి మా ముసలమానని పల్కె దురుష్క లోకముల్
అచ్చమహాత్ముడన్ననుడి కర్హుడు గాంధి ఫకీరు డెంతయున్

వివిధ మతములవారు, ఆస్తికులు, నాస్తికులు అందరూ యేమన్నగాని, యితడు మహాత్ముడన్నాడు జాషువగారు. భారత జాతీయ స్వాతంత్రోద్యమములో దేశములో ఎందరో నాయకులు వివిధ పద్ధతుల ద్వారా స్వాతంత్ర్య సమరములో పాల్గొన్నప్పటికీ ప్రపంచప్రజల మసను చూరగొని అహింసాయుధముతో సత్యాగ్రహ పోరాటంతో భారతప్రజల చిరకాల వాంఛితమైన స్వాతంత్ర్యమును తెచ్చిన మన జాతిపిత మహాత్మ బాపూజీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ "స్వాతంత్రోద్యమ స్ఫూర్తి - జాషువా బాపూజీ"ని ముగిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు :**


1. బాపూజీ - గుఱ్ఱం జాషువా
2. సాహిత్యంలో వస్తు శిల్పాలు - త్రిపురనేని మధుసూధనరావు
3. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య
4. చిలకమర్తి జీవితం సాహిత్యం - డా॥ ముక్తేవి భారతి


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జానపద విజ్ఞానంలో అద్భుత కళల ప్రదర్శన



- డా॥. గజ్జెల ప్రమీల

తెలుగు అధ్యాపకురాలు & శాఖాధిపతి, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

తెలుగు వారికి అపూర్వమైన జానపద కళా వారసత్వ ముంది. జానపద కళా సాహిత్యము ద్వారా జాతి సంస్కృతి తెలుస్తుంది. ఒక జాతి నిర్మాణానికి అవసరమైన ఆకారాలు జానపద కళలు అందిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి సంస్కృతీ వారసత్వాన్ని కాపాడుకోవడం మన బాధ్యత. జానపద ప్రదర్శన కళలకు తెలుగు భూమి పండిన పంట పొలం వంటిది. ఎన్నో రకాల జానపద ప్రదర్శన కళలు తెలుగు నేలను సుసంపన్నం చేశాయి. శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని అందించినవి జానపద ప్రదర్శన కళలే.

జానపద ప్రదర్శన కళలు రెండు రకాలుగా మనకు కనిపిస్తాయి. సర్వ జానపద కళలు, వృత్తి జానపద కళలు అని వీటిని రెండు రకాలుగా విభజించడానికి వీలుంది. తెలుగు జానపద కళలలో ఎక్కువగా ఒక కులం వారు వారికి జీవనోపాధినిచ్చే వృత్తిగా స్వీకరించిన కళాకారులు ప్రదర్శించే కళలే ఎక్కువగా మనకు కనిపిస్తాయి. భారతదేశంలోని చాలా రాష్ట్రాలలో చాలా భాషా ప్రాంతా లలో ఉండే జానపద కళలలో ఎక్కువగా ఉన్నవి వృత్తి జానపద కళలే. తెలుగు జానపద కళలలో ఎక్కువగా ఉ న్నవి వృత్తి జానపద కళారూపాలు. ఒగ్గుకథ, పంబ కథ, ఆసాది కథ, బైండ్ల కథ, కొమ్ముల కథ, పాండవకథ, రుంజకథ వంటి కళాకారులు అన్నీ కూడా ఒక కులం వారికి వృత్తిగా ఉన్న కళారూపాలే. ఇలా కాక వృత్తిగా కాకుండా ఊరి వారిచే వినోదాన్ని అందించే కళా రూపాలుగా ఉన్నవి కొన్ని ఉన్నాయి ఉదాహరణలు కొన్ని ఇక్కడ చూడవచ్చు. కోలాటం, చెక్కభజన, పండరిభజన, సెల్ భజన కొన్ని జానపద నాటక ప్రక్రియలు వృత్తి కళారూపాలు కావు. ఒక గ్రామంలోని ఏ కులం వారైనా అందరూ కలసి అనుకొని అన్నింటినీ తయారు చేసుకొని వారి వినోదార్ధం వారు ఈ కళా రూపాలను ప్రదర్శించు కుంటారు. ఇందులో ప్రదర్శించేవారు కూడా వారి వినోదార్ధమే ప్రదరిస్తున్నారు. కాని వారికి అలాగే చూడడం చూచే వారికి వినోదం. వీటిని సర్వజానపద కళలు అని పిలవవచ్చు. పై చెప్పినవి వృత్తి జానపద కళలు. అందువల్ల ఇక్కడ సర్వ జానపద కళలు, వృత్తి జానపద కళలు అనే రెండు రకాల వర్గీకరణలు వచ్చాయి.

జానపద విజ్ఞానం చాలా విశాలమైంది జీవితానికి, సంస్కృతికి సంబంధించిన అన్ని విషయాలనూ తనలో ఇముడ్చుకోగలిగినంత విస్తృత పరిధి గలది. జానపద విజ్ఞానం జానపద ప్రామాణిక నిఘంటువు (Standard

Directory of Folklore) దీనికి 21 నిర్వచనాలు కనిపిస్తాయి. విద్వాంసులు విభిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడం జరిగింది. అలన్ డండెస్ ఈ విషయాన్నే దృష్టిలో ఉంచుకొని ఒక పట్టిక తయారుచేసి దానిలో ఉండేవన్ని కలిపితే జానపద విజ్ఞానమవుతుందని చెప్పారు. (The study of Folklore, 1965) జాన్ హెరాల్డ్ బ్రున్ వాన్జ్ ఇచ్చిన నిర్వచనం (The study of American Folklore, 1963) అన్నింటికన్న సమంజసమైనదిగా కనిపిస్తుంది. ఈ నిర్వచనం ప్రకారం జానపద విజ్ఞానమంటే మౌఖికంగా గాని రూఢాత్మకంగా గాని ఏదైనా జన సమూహంలో వివిధ రూపాలతో సాంప్రదాయకంగా ప్రసారమయ్యే సాంస్కృతిక సంబంధమైన విషయాలు!! ఈ నిర్వచనం వల్ల జానపద విజ్ఞానమంటే ఏమిటి అనే విషయాన్ని శాస్త్రబద్ధంగా ప్రతిపాదించడానికి వీలవు తుంది.

జానపద కళారూపాలు చాలా ప్రాచీనమైనవి. 2000 సంవత్సరాల సాంఘీక చరిత్ర ఆంధ్రజాతికి ఉందని ఎంతో గర్వంగా చెప్పవచ్చు. మానవుడు మాట నేర్చిన తరుణం లోనే పాట నేర్చి వుంటాడు. ప్రకృతిని చూసినప్పుడే తన మనో ఫలకంపై చిత్రాలను గీసుకొని వుంటాడు. వీటిని ప్రదర్శించినపుడు వాటిని చూడటానికి ప్రేక్షకులు ఏర్పడి నపుడు ఇది జానపదుల ప్రదర్శనా కళారూపం అవుతుంది. ఈ కళలన్నింటిపై విజయనగర రాజులు, కాకతీయ రాజులు, రెడ్డి రాజులు, తంజావూరు నాయక రాజులు విశేష ఆదరణ చూపారు. ఆనాటి జానపద కళలను గురించి పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర లోను, భీమేశ్వర పురాణంలోను, తిక్కన భారతంలోను, శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర లాంటి అనేక గ్రంథాలలో జానపద కళారూపాలను గురించి వివరించారు. ఇవి అనేక ప్రాంతాలలో అనేక రకాలుగా వున్నాయి. వీటిలో గొరవయ్యలు, పులివేషాలు, కీలుగుర్రం, కోలాటం, చెక్క భజన, డప్పుల నృత్యం ఇవేకాకుండా ఈ జానపద కళల్లో కొన్ని అద్భుత కళలుగా ప్రదర్శింపబడుతున్నవి వాటిలో కొన్నింటి గురించి తెలుసుకుందాము. అవి 1. మోడీలు, 2. సాధనసూరులు, 3. వీర విద్యావంతులు, 4. జంతర పెట్టెలు, 5. కాటి పాపలు కళారూపాలన్ని జాతరలు, తిరునాళ్ళు, ఉత్సవాలు, పండుగలు మొదలైన సాంఘీకాచార సందర్భాల్లో వినోదాత్మకంగా ప్రదర్శింపబడే కళారూపాలు. కళ కళ కోసమే కాకుండా సమాజ మనుగడకు దోహద పడుతున్నాయి.

### జానపద కళ - నిర్వచనం :

లోకంలో ఉన్న విద్యలన్నిటి రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. అది కళలు (Arts) శాస్త్రాలు (Sciences). ఈ రెండూ మనకు పుట్టుకతో వచ్చేవి కావు. ప్రయత్నపూర్వకంగా అభ్యసించి సాధించదగ్గవి.

కళ అనే మాట ఆంగ్లంలో 'ఆర్ట్' అనే శబ్దానికి సమానార్థక పదం. బుద్ధి సూక్ష్మతని ఉపయోగించి మనుష్యుడు కల్పించేది కళ. ఈ కళ భావనాశక్తిని రేకెత్తి స్తుంది. "మనస్సులో ఏర్పడ్డ దృశ్యాన్ని సృష్టించే ప్రయత్నమే కళ అంటే సరిపోతుంది". ఈ కళని రేఖారూపంలోనో, వర్ణరూపంలోనో లేదా ధ్వని, హావ, భావ, లయాత్మక, చలన రూపంలోనో అభివ్యక్తం చేయడం జరుగుతుంది.

మానవునికి ఉపయోగాన్ని చేకూర్చడంతో పాటు అతనికి ఒక విధమైన ఉల్లాసాన్ని, తృప్తిని కల్గించేది కళ. సౌందర్యం, ఆనందం వాటి కలయికే జానపద కళ.

### జానపద అద్భుతక కళలు - ప్రదర్శన :

కళలన్నింటిలో ప్రదర్శనా కళలకు ఎక్కువ ఆదరణ లభించడానికి కారణం పూర్తిగా మనిషి మనస్సును ఆకర్షించి తనవైపు మరల్చుకొని స్పర్శేంద్రియాలకు జ్ఞానేంద్రియాలకు ఉల్లాసాన్ని వినోదాన్ని ప్రశాంతతను ప్రసాదించే శక్తి సామర్థ్యాలను కలిగి ఉండటమే ఈ జానపద అద్భుత కళల యొక్క ప్రత్యేకత. వీటిలో కొన్నింటిని పరిచయం చేస్తాను.

### మోడీలు :

వీరు గ్రామాలలో వీరికి తెలిసిన కొన్ని కనికట్టు విద్యల్ని ప్రదర్శిస్తారు. సాయంకాలం లేదా రాత్రి వేళల్లో ఈ ఆటను ఆడుతారు. వీటిని ఎక్కువగా "పెద్దిడి గోల్ల" అనే కులవం వారు ఆడుతారు. ఈతెగ వారి ప్రదర్శన అంటే ఎక్కువ మంది జానపదులు అతి ఉత్సాహాన్ని కనబరుస్తారు.

బండరాయిని నడిపించడం ఇసుకను బొరుగులు చేయడం, వేపాకును తేళ్ళుగాను మారుస్తారు. ఒక్కొక్క సారి వీళ్ళ మధ్య పోటీలు ఏర్పడుతాయి. అలాంటప్పుడు ఒకిరికి మంచి ఒకరు తమ గారడి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. శార్దులం ముగ్గువేసి అందులో నుంచి పులిని పుట్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తారు. ఇవన్నీ నిజంగా కనిపించినప్పటికీ అన్ని అశాశ్వితమైనవి.

## సాధనాశూరులు :

సంచార కళాకారులు సాధనాసూరులు పద్మశాలీలను పొగుడుచు వీరు ప్రదర్శనలను నిర్వహిస్తారు. పద్మశాలీల కోరిక మేరకు గ్రామాలలో వీరు ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు. సాధనాశూరులు పగటిపూట ప్రజలందరు ఎక్కువగా ఎక్కడ గుమిగూడి వుంటారో అక్కడ వీరి ప్రదర్శనను ప్రారంభిస్తారు. ఒకరకంగా సాధనాశూరులు కళా ప్రదర్శన ఇంద్రజాలిక విద్య, గారడి, కణికట్టు విద్యలతో వీరి ప్రదర్శన సాగుతుంది. కళ్ళెదుటే ఆశ్చర్య చకితుల్ని చేసే ప్రదర్శనలు చేయడం సాధనాశూరులకు వెన్నతోపెట్టిన విద్య. సాహసమైన, గగుర్పాటును కలిగించే కనికట్టులను వీరు చేస్తారు. ఒక వ్యక్తి రొమ్ముపై తాము తయారుచేసిన ప్రత్యేకమైన ఆకును అతికిస్తారు. ప్రేక్షకుల లోంచి ఎవరో ఒకరిని పిలిచి తుపాకి ఇచ్చి రొమ్ముపై గురిచూసి కాల్చమంటారు. అలా కాల్చిన తరువాత ఆశ్చర్యకరంగా ఆ గుండు తని రొమ్ములోకి దూసుకు పోకుండా రొమ్ముపైనున్న ఆకును తాకి ఎలాంటి గాయం చేయకుండానే క్రింద పడిపోతుంది. అదేవిధంగా సాధనా శూరులు చేతులకు ఏవో ఆకు పసరలు పూసుకొని చేతులలో ఉన్న ఆ పసరు ప్రభావంతో రెండు రేకు ప్లేట్లు ఎగిరించి అవి పరస్పరం కొట్టుకొనేలా చేసి తిరిగి వెనక్కి వచ్చేలా చేస్తారు. ప్రజలు తమ కళ్ళముందు అది ఎలా జరిగింది అన్న విషయాన్ని ఆలోచించినా కనుక్కోలేనంత కనికట్టును సాధనాశూరులు చేస్తారు.

## కాటి పాపలు :

కాటి పాపల వాళ్ళు మాల కులానికి చెందిన ఆశ్రిత కులం. వీరు శవాలను పూడ్చడం, కాల్చడం లాంటి పనులతో పాటుగా యాచకవృత్తిని అవలంభిస్తూ వుంటారు. కాటిపాపలకు మంత్ర తంత్ర విద్యలు వస్తాయని ప్రజలు నమ్ముతారు. శాంభవి అమ్మవారిని పూజించేవారు. తమ జోలెలో నుంచి పసుపు కుంకుమలతో అలంకరించిన ఆ బొమ్మను తీసి మొక్కిన తరువాత ప్రజలముందు తమ విద్యను ప్రదర్శిస్తారు. ఇంద్రజాల ప్రదర్శనలో వీరు ఎంతో నైపుణ్యాన్ని కలిగినవారు. చేతిలో ఎముకతో అమ్మవారి బొమ్మను ఓం ఓం మహాంకాళి, శాంభవీ, అని తాకి అప్పటికపుడు పాముల్ని, తేళ్ళను, ఎలకల్ని వీరు చూపిస్తారు. ఇనుప ఊచల్ని, మేకుల్ని నొసట నుంచి సృష్టిస్తారు. నోట్లో పాములు, తేళ్ళతో సయ్యాటలాడిస్తారు. ఎవరికి ఆపాయం చేయకుండా ఇంటింటికి తిరుగుతూ యాచకులై జీవనం సాగించే కాటిపాపలు ఆపురూప కళాకారులు. స్మశానాలకు కాపలాకాయడం ఊరికి కాపలా కాయడం వంటి పనులు వీరు ఏనాడో వదిలేసిన తమ ఇంద్రజాల విద్యలను మాత్రం కాపాడుకుంటూ వస్తున్నారు.

## జానపద కళల ప్రయోజనం :

గాలి, నీరు, వెలుతురు, ఆహారం ఇవి ఏ విధంగా మానవుడు భౌతికంగా జీవించడానికి అవసరమో అదే విధంగా సంగీతం, సాహిత్యం, కళ అనేవి అతడు మానసికంగా ఉల్లాసంగాను ఉండటానికి అంతే అవసరం. జీవితం కేవలం కడుపు నింపుకునే పోరాటం కాదు. అది కళా సృష్టిని ప్రసాదించే ఒక వరం. మనసుకు ఉల్లాసాన్ని కల్గింపజేయటమే ఈ జానపద కళల పరమార్థం. ఈ ఉల్లాసం మనిసిని నాలుగు కాలాల పాటు సుఖమయంగా ఉండటానికి దోహదం చేస్తుంది. ఒక కళాదృష్టిని కళా సృష్టిని నిర్మిస్తుంది. ఇలా ఏర్పడ్డ కళలు హావ భావాలను ప్రదర్శించే కళలుగాను, కేవలం సౌందర్యాన్ని వీక్షించే కళలుగానూ రూపుదిద్దుకున్నాయి.

జానపద కళలు మానవునికి ఆనందానుభూతిని ఇస్తాయి. హృదయాన్ని విశాలం చేస్తాయి. వీటి ధ్యేయం మానసిక ప్రశాంతత నింపడం.

## ముగింపు :

జానపద కళలను వ్యష్టి నృత్యాలు, సమిష్టి నృత్యాలు, కథాగానాలు, స్త్రీల కళారూపాలు వీధి నాటకాలు,

జంతువుల కళారూపాలు, ఈ విధంగా వర్గీకరించినప్పటికీ ఈ జానపద కళల్లో అద్భుతమైన ఆశ్చర్యాన్ని కలిగించే కళలున్నాయి. ఉదా : సాధనా శూరులు, మోడీలు, కాటి పాపలు, జంతర పెట్టె, వీర విద్యావంతులు, కత్తిసాము, కర్రసాము ఈ విధంగా అబ్బురపరచే కళలన్నీ అణగారి పోతున్నాయి. అందువలన మృగ్యమై పోతున్న ఈ కళలను కళాకారులను సమాజానికి ఉపయోగపడే విధంగా అందరూ కలిసి చరిత్ర, సంస్కృతి, కళలను బ్రతికించే ప్రయత్నం చేయమని కోరుచున్నాను. అదేవిధంగా "జానపద విజ్ఞానంలో అద్భుత కళల ప్రదర్శన - సంరక్షణ అనే అంశంపైన వ్రాసిన ఈ వ్యాసం భావితరాలకు ఉపయోగపడే విధంగా గ్రంధస్తం చెయాల్యని సంకల్పించాను.

అన్ని జానపద కళారూపాలను అంతరించిపోకుండా జానపద కళారీతుల పునరుద్ధరణకై ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని విద్యా సంస్థలలోను, కళాకారులచే ప్రదర్శనలు చేయించాలి. కళారీతుల గురించి చెప్పడానికి అన్ని విద్యాసంస్థలలో బోధన సిబ్బందిని నియమించాలి. కళలు సజీవంగా బ్రతికి ఉండాలి అంటే ముందుగా కళాకారులు బ్రతకడానికి వారికి జీవనభృతికి ఏర్పాటు చేయాలి. కళాకారుల బిడ్డలకు విద్య, ఉద్యోగం, సౌకర్యాలను కల్పించాలి. ప్రతి మండల స్థాయిలో ఒక కళాక్షేత్రం నిర్మించాలి. అన్ని రకాలైన కళలు ప్రదర్శనలు చేయించాలి. అపుడే చరిత్ర, సంస్కృతి, కళలు పరిరక్షింపబడతాయి. అందులో భాగంగానే జానపద విజ్ఞానంలో అద్భుత కళలు కూడా పరిరక్షింపబడతాయి.

**ఆధార గ్రంథాలు :**


1. డా॥. ఆనందన్, కొళ్ళాగుంట, (1999) జానపద కళారూపాలు, లావణ్య శిల్ప పబ్లికేషన్స్, తిరుపతి.
2. ఆచార్య కృష్ణారెడ్డి, చిగిచర్ల (2012) తెలుగు జానపద కళారూపాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. ప్రతాపరెడ్డి సురవరం (1975), ఆంధ్రుల సాంఘిక చరిత్ర - లాంజ్మన్ ప్రచురణలు, హైదరాబాద్.
4. డా॥. సుబ్బారావు తంగినాల, (2012) జానపద సాహిత్యం - వీర గాథలు - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
5. డా॥. సుందరం ఆర్వీయస్ (1983), ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్ర విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పాలమూరి ఓల్గా - డిండి నది



- చల్లా మాలతీదేవి
తెలుగు ఉపన్యాసకురాలు

మన భారతీయ సంస్కృతిలో నదులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నదుల పట్ల పవిత్రమైన, పూజనీయమైన భావన కలిగి వుండటం మన ప్రత్యేకత. తాగు, సాగునీటి లభ్యతల కారణంగా ఎన్నో గొప్ప గొప్ప ప్రాచీన నాగరికత సంస్కృతులకు జన్మస్థలాలుగా నిలిచాయి మన జీవనదులు. సింధు, గంగ, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, కావేరి, మంజీర మొదలైన నదులు మన ప్రాచీన నాగరికత సంస్కృతులకు ఆలవాలంగా ఉన్నాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన గొప్ప నాగరికతలన్నీ నదీ పరివాహక ప్రాంతాలలోనే విలసిల్లాయి. ఈ కోవలోనే మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవహించే దుందుభీ నది చేరుతుంది. డా॥. కపిలవాయి లింగమూర్తి గారు తమ చారిత్రక వ్యాసాలలో దుందుభీ నదిని పాలమూరి ఓల్గాగా పేర్కొన్నారు. రష్యా దేశపు జాతీయ నదియైన ఓల్గా నది యూరప్ ఖండంలోనే పెద్దది. అది రష్యాలోని ఎన్నో ప్రాచీన నాగరికత సంస్కృతులకు కేంద్రంగా విలసిల్లింది. అలాగే పాలమూరు జిల్లాలో ప్రవహించే దుందుభీనది ప్రాచీన నాగరికత సంస్కృతులకు ప్రసిద్ధి చెందినదని నిరూపించే ప్రయత్నం చేశారు ఈయన.

నది అంటే కేవలం రెండు దరుల మధ్య ప్రవహించే నీరు మాత్రమే కాదు. నదిని గురించి అధ్యయనం చేయడం అంటే అది ప్రవహించే కొన్ని వందలు లేదా వేల కిలోమీటర్ల వరకు దాని చుట్టూ ఆవరించి వున్న ప్రాకృతిక, భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక విశేషాలను అధ్యయనం చేయడమే అవుతుంది. పాలమూరులో దుందుభీనది ప్రవహించే 95 మైళ్ల వరకు దాని వెంట అల్లుకొని ఉన్న ప్రకృతి విశేషాలను, మానవజాతి వికాసాలను కపిలవాయి వారి చారిత్రక వ్యాసాలు ఆధారంగా విశ్లేషించడమే ఈ పత్రము యొక్క ఉద్దేశ్యం.

దుందుభి నదికి అసలు పేరు డిండి. దీనికి 'దుందుభి', 'చిలకల వాగు', 'వాలుకా నది', 'మీనాంబరి' అని వేర్వేరు చోట్ల వేర్వేరు పేర్లున్నాయి. డిండి నది తీరంలో వెలసిన దుందుభీశ్వరుని పేర డిండికి దుందుభి అని పేరొచ్చింది. ఈ డిండి నది షాబాదుకు ఉత్తరంగా బాలాఘాట్ కొండలలో పుట్టి పాలమూరు గుండా 95 మైళ్ళు ప్రవహించి ఏలేశ్వరానికి ఈశాన్య భాగంగా కొంత దూరంలో ఉన్న దొమ్మర్లగొంది అనే లోయలో దూకి కృష్ణానదిలో సంగమిస్తుంది. స్కాందపురాణంలోని శ్రీశైల ఖండం గిరిప్రదక్షిణ కల్పంలో దుందుభినది ప్రస్తావన ఉన్నది. అలాగే అమరావతిలోని వేమరెడ్డి శాసనంలో...

"దండెన గోవ బ్రహ్మదండి కృష్ణ వేణ్ణా గోదావరీ
మహానది తటద్వయ తన్మధ్య దేశ దత్తానేకాగ్రహార"

అని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు గుర్తించినారు. 'దెందు', యే 'దింది'కి దుందుభి అనేది మరొక పేరు.

**దుందుభీనదీ తీర నాగరికత :**

ప్రాచీన మానవ నాగరికత గుహల నుండి నదీ తీరాలకు అభ్యుదయం చెందిన విషయం అందరికీ విదితమే. డిండినది తీరంలో ప్రాచీన మానవ ఆవాసాలు ఉన్నట్లు దొరికిన పురావస్తు ఆధారాల వలన తెలుస్తుంది. అచ్చంపేట తాలూకాలోని మన్ననూరు, అమరాబాదు ప్రాంతాలలో ఆదిమ మానవ నివాసాలనదగిన "దారులు గుహలు" చాలా వున్నాయి. అక్కడ వారు వాడిన శిలా పరికరాలు కూడా లభించాయి.

క్రీ.పూ. 3వ శతాబ్దం నాటికి చెందిన 'సిస్థు'లు అనబడే 'రాకాసి గూళ్ళు' అనగా ప్రాచీన మానవుల సమాధులు చాలా బయటపడ్డాయి. ఇలాంటి రాకాసి గూళ్ళు సిరసివాడ, పాపకల్లు, రావిపాకుల వద్ద వందల సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడ ఒకచోట 40 ఎకరాల విస్తీర్ణంలో రాకాసి గూళ్ళు విస్తరించి ఉండటాన్ని బట్టి డిండి నదీ తీరంలో ప్రాచీన మానవ జనసాంద్రత ఎంత ఎక్కువగా నివసించి ఉన్నదో తెలుస్తుంది.

**నదీతీర రాజ్యాలు :**

నదీ తీరాలలో నివాసాలేర్పరచుకున్న ప్రాచీన మానవులు నాగరికత వికాసాన్ని సాధించిన క్రమంలో నగరాలను నిర్మించుకుని అక్కడ నుండి రాజ్యాలను విస్తరించుకున్నారు. దుందుభీ నదీ తీరంలో వెలసిన రాజ్యాలలో ప్రధానమైనవి నాగవంశం, శాతవాహనులు, ఇక్ష్వాకులు, చాళుక్యులు మొదలైన వారివి ఉన్నవి. కపిలవాయి వారి అభిమతం ప్రకారం పాలమూరును పరిపాలించిన మొదటిరాజు వంశం నాగవంశం. వీరు మొదట తక్షశిల వాసులు. జనమే జయుని సర్పయాగంలో భాగంగా కొంతమంది నాగులు దక్షినా పథానికి వలస వచ్చి.. పాలమూరులోని నేటి తక్షశిల గ్రామం వద్ద నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ తక్షశిల గ్రామవే పాలమూరులోని అతి పురాతనమైన మొట్టమొదటి గ్రామం.

వీరు కాలక్రమేణా విస్తరించి ఈ ప్రాంతానికి పరిపాలకులుగా ఎదిగారు. ఆనాడు ఈ నాగులతో పాలమూరే కాక తెలంగాణా ప్రాంతం అంతా నిండిపోయి బౌద్ధయుగం నాటికి ఈ ప్రాంతం నాగభూమి అని పిలువబడిందని బౌద్ధ వ్మాయ ద్వారా తెలుపబడింది. నాగవంశం వారిలోని స్కంద విశాఖుడు అనే రాజు పేరనే నేటి కర్నూలు మరియు నాగర్‌కర్నూలు అని ఏర్పడినట్లు వీరు అభిప్రాయపడ్డారు. నాగులు పరిపాలనలో నాగర్ కర్నూలు తాలూకాలోని నాగవరం, నాగపురం, నాగదేవుని పల్లె, కొండనాగుల గవినాగుల, వంటి సర్పవాచకాలు గల గ్రామాలు ఏర్పడి నేటికి అవి అస్తిత్వంలో ఉన్నాయని అంటారు కపిలవాయి వారు.

నాగులు తర్వాత శాతవాహనులు, ఇక్ష్వాకులు, చోళులు, చాళుక్యులు పరిపాలించినారు. చాళుక్యులకంటే ముందు ఈ ప్రాంతాన్ని చోళులు పరిపాలించారు. వారు తమిళ దేశీయులు, తెలంగాణాలోకి కాలుపెట్టి నేటి మహబూబ్‌నగర్‌లోని కోడూరును స్థాపించుకొని అక్కడి నుండి విస్తరించి పాలకులుగా ఎదిగారని లింగమూర్తి గారి అభిమతం.

**సుప్రసిద్ధ దేవాలయాలు :**

మానవునిలో ఆదిమకాలం నుండి దేవుని యెడల భయభక్తులు ఉన్నాయి. వారు నాగరికతాభివృద్ధిని సాధించి నగరాలను, రాజ్యాలను నిర్మించుకున్నప్పుడు వారిలోని మత విశ్వాసాలను చాటుకునేందుకు దేవాలయాలను నిర్మించుకున్నారు. దుందుభీ నది తీరంలో వెలసిన క్షేత్రాలు, దేవాలయాలలోకెల్ల అతి ప్రాచీనమైనది ఏదో చెప్పలేకపోవచ్చుకాని ఈ పుణ్య నదీ తీరంలో అనేక ప్రసిద్ధ దేవళాలు నిర్మించబడ్డాయి. అవి ప్రాచీన మానవుల మత విశ్వాసాలకు సజీవ సాక్ష్యాలుగా నేటికీ నిలిచి యున్నాయి. చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఏలేశ్వరాలయం దుందుభీనది కృష్ణానదిలో సంగమించే చోట ఉన్నది. ఏలేశ్వరానికి ఈశాన్య దిశలో ఏకాదశ తీర్థాలున్నట్లు స్కాందపురాణంలోని తీర్థఖండంలో "ఆదౌ పరశురామేశం - ద్వితీయం దుందుభీశ్వరం" అని పేర్లు చెప్పబడ్డాయి. దుందుభీశ్వరం వద్దే దుందుభీశ్వరుడి శివాలయం ఉంది. డిండి నదిగా పిలవబడే ఈ నదికి ఈ ఆలయం వలననే దుందుభీ అనే పేరు వచ్చింది.

నల్లమల అడవులు మహబూబ్‌నగర్‌లోని అచ్చంపేట, అమరాబాదు మండలాలలో విస్తరించి ఉన్నాయి. నల్ల మలలో వెలసిన శ్రీశైలం ఎంతో ప్రసిద్ధి చెంది శైవక్షేత్రం. ఈ క్షేత్రానికి ఉన్న నాలుగు ద్వారాలలో పశ్చిమ ఉత్తర ద్వారాలు మహబూబ్ నగర్‌లోనే ఉన్నాయి. కాబట్టి శ్రీశైలం భూమిలో ఈ జిల్లాకు ఒక ప్రత్యేక స్థానమున్నది. శివుడు పరుశవేదికగా కొలువైయున్న మీనాంబరం ఆలయం జడ్చర్లకు సమీపాన డిండి నది తీరాన ఉన్నది. జడ్చర్లకు సమీపంలో "గొల్లత్తగుళ్ళు" అని పిలవ బడే జైన దేవాలయాలు ఉన్నాయి. గంగాపురంలో చాళు క్యుల నాటి చెన్నకేశవుని ఆలయం వుంది.

కపిలవాయి వారి చారిత్రక వ్యాసాలలో కొన్ని వ్యాసాలు పేర్ల అధ్యయనం దిశగా కొనసాగినాయని చెప్పవచ్చు. ఆయన ఈ వ్యాసాలలో స్థలనామకారుడుగా కన్పిస్తారు. దుందుభినది విశేషాలను గురించి వ్రాసిన వ్యాసాలలో పేర్ల అధ్యయానికి సంబంధించి ప్రధానంగా రెండు విభాగాలు స్పష్టమౌతున్నాయి. అందులో మొదటిది నదులు మరియు ప్రవాహాల అధ్యయనం. దుందుభీ నదికి 'డిండి', 'మీనాంబరి', 'చిలకలవాగు', 'వాలుకనది' అనే పేర్లు ఎలా వచ్చాయో అనే విషయాలను ఆ పదాల అర్థాలు, మూలాలను వివరిస్తూ వాటికి తగిన శాసన, సాహిత్య, చారిత్రక ఆధారాలను చూపించారు.

ఇక రెండవ అధ్యయన విభాగం స్థలనామాల లేదా భౌగోళిక నామాల అధ్యయనం. పాలమూరు జిల్లాలోని కొన్ని ప్రాచీన స్థల నామాలను నిర్ణయించడంలో, వాటి అర్థాలను, మూలాలను, ప్రాచీనతను, చరిత్రలో వాటి ఉనికిని నిర్ధారించటంలోనూ అవసరమైన చారిత్రక, శాసన, సాహిత్య ఆధారాలను చూపించే ప్రయత్నం చాలా మట్టుకు చేశారీయన. కొన్ని సందర్భాలలో స్థానిక నివాసితుల ఇంటర్వ్యూలను, పౌరాణిక కథాంశాలను ఆధారాలుగా చూపించారు. తక్షశిల, కోడూరు స్థలనామాల విషయంలో ఈ పద్ధతినే అనుసరించారు. పాలమూరు లోని మొదటి ప్రాచీన గ్రామం 'తక్షశిల' అని, పాల మూరును మొదట పరిపాలించినది నాగవంశం వారని చెప్పారు.

ఈ నాగులు జనమేజయుని సర్పయాగం కారణాల ఉత్తరాపదంలోని తక్షశిల నుండి వలస వచ్చి నేటి తక్కశిల ప్రాంతంలోని నివాసాలను ఏర్పాటు చేసుకొని, అనేక ప్రాంతాలకు విస్తరించి, అభ్యుదయాన్ని సాధించి పాలమూరి పాలకులుగా ఎదిగారని చెప్పారు. కాని ఎక్కడా చారిత్రక, శాసన ఆధారాలను పేర్కొనలేదు. కేవలం మహాభారతంలోని కథాంశాలను ఆధారంగా పేర్కొ నడం జరిగింది. అలాగే కోడూరు స్థలనామం విషయాని కొస్తే అది పాలమూరులోని రెండవ ప్రాచీన గ్రామమని, తమిళనాడులోని కోడూరు నుండి ఇక్కడికి వలస వచ్చి స్థిరపడి కాలక్రమేణా తెలంగాణాను పరిపాలించారని, వారే తెలంగాణను పరిపాలించిన తెలుగు చోళ రాజులని పేర్కొ న్నారు. పాలమూరిలోని ప్రాచీన స్థలనామాల అధ్యయనం ద్వారా వాటి మూలాలను, ప్రాచీనతను, చరిత్రలో, సాహిత్యంలో వాటి ఉనికిని నిరూపిస్తూ తమ జిల్లా ప్రాచీన చరిత్రను, సంస్కృతిని పరిరక్షించి, తెలంగాణా చరిత్ర, సంస్కృతిలో దానిని మరింత ఇనుమడింపజేయాలనే తపన, కృషి, పట్టుదల ఎంతైనా శ్లాఘించదగినది, ఆదర్శ ప్రాయమైనది.

ఎన్నో చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక విశేషాలను కలిగి ఉన్న దుందుభీ నది పాలమూరు చరిత్రలో ప్రజల జీవితాలలో చాలా ప్రాధాన్యతను కల్గి ఉన్నది. కవుల కలాలలో, గళాలలో అది ప్రతిధ్వనిస్తూనే ఉంది. గంగా పురం హనుమచ్ఛాస్త్రి గారు దుందుభి నదిపై ఒక గేయా కావ్యాన్ని, ఒక ఖండ కావ్యాన్ని రచించారు. ఈ కావ్యాలలో ఆయన దుందుభీ నదిని దుందుభీ మాతగా అభి వర్ణించారు. ఉన్నత విద్యలోని డిగ్రీ తృతీయ సంవత్సరం ద్వితీయ భాష తెలుగు వాచకానికి 'సాహితీ దుందుభీ' అని పేరును నిర్ణయించడం అనేది తెలంగాణా రాష్ట్రవ్యాప్తంగా దుందుభీ నదికి ఉన్నత స్థానం కల్పించ బడింది అనడానికి నిదర్శనం.

**ఆధార గ్రంథాలు :**

1. కపిలవాయి సాహిత్య ప్రస్థానం - కపిలవాయి అశోక్‌బాబు. 2. సాహిత్య వ్యాసాలు

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి మాతంగి దివిటి – స్త్రీ దృక్కోణం

– డా॥. బి. తేజోవాణి

ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

'మాతంగి దివిటి' ఆచార్య సమతా దేశమానే ఆత్మ కథ. కర్ణాటక రాష్ట్ర సాహిత్య చరిత్రలో మొదటి దళిత స్త్రీ ఆత్మకథ. ఈ ఆత్మకథలో దళితులు ముఖ్యంగా మాదిగలు అనుభవిస్తున్న వర్ణనాతీతమైన కష్టనష్టాలు, కన్నీళ్ళు కడగండ్లు, అవమానాలు అవరోధాలు లెక్కకు మించి ఉన్నాయి. వాటన్నిటినీ అధిగమించి సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేకమైన ఉన్నతస్థానాన్ని పొందిన ఒక మాదిగ కుటుంబ నేపథ్యం 'మాతంగి దివిటి'లో ఉంది.

'మాతంగి దివిటి' మూలం కన్నడభాష బెంగళూరు విశ్వవిద్యాలయం, సోషియాలజీ విభాగంలో పనిచేస్తున్న ఆచార్య సమతా దేశమానే తాను ఎదిగిన తీరు తెన్నులను ఆత్మకథ రూపంలో వెలువరించారు. అదే విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేస్తున్న ప్రొఫెసర్ కొలకలూరి ఆశాజ్యోతి తెలుగులో అనువాద చేశారు. వ్యాసభారతాన్ని నన్నయ ఏవిధంగా మూలకథకు భంగం కలగకుండా, స్వతంత్ర రచన చేశారో ఆచార్య ఆశాజ్యోతి గారు కూడా "మాతంగి దివిటి" తెలుగు భాషలోకి అను వదించారు.

మాతంగి అనేమాట 'మాతంగ మహర్షి' నుండి వచ్చిందనే అభిప్రాయం ఉంది. మాతంగ మహర్షి వారసులే మాదిగలు అని ప్రచారంలో ఉంది.

ఆచార్య సమతా దేశమానే మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు. కనుకనే మాతంగి అనే పదాన్ని ప్రయోగించి ఉండవచ్చు. దివిటి అనే పదానికి తెలుగులో 'కాగడ' అనే అర్థం ఉంది. కాగడ అంటే మండుతున్న దీపం. చీకట్లను పారద్రోలి వెలుగులు నింపడానికి దివిటి లేదా కాగడ ఉపయోగిస్తారు.

పేదరికం అనే అంధకారంలో మగ్గుతున్న బాబూరావ్ కుటుంబానికి వెలుగును తీసుకు వచ్చిన మాతంగి దివిటి రత్నమ్మ. ఆమె గొప్పదనం చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

బాబూరావ్, రత్నమ్మ దంపతులు కలబురిగిలోని ఒక మురికివాడలో నివసిస్తున్నారు. వారికి ఎనిమిది మంది సంతానం. బాబూరావ్ ప్రగతిశీల వాది, ఆలోచనాపరుడు, సామ్యవాది.

తన పెద్దకుమార్తె విజయదశమినాడు పుట్టినందున విజయానికి గుర్తుగా విజయలక్ష్మి అని పేరు పెట్టాడు. వెస్ట్‌బెంగాల్ సమాజ సేవకుడు అజయ్ ఘోష్ పేద బలహీన వర్గాల పక్షపాతి, దేశభక్తుడు ఆయనకు గుర్తుగా కుమారునికి అజయ్‌ఘోష్ అనేపేరు పెట్టాడు.

కారల్‌మార్క్స్, లెనిన్, స్టాలిన్, అబ్రహాం లింకన్, మార్టిన్ లూథర్‌కింగ్ మొదలైన వారి భావాలను

అధ్యయనం చేస్తూ సమతావాదం, సామ్యవాదం, సహ జీవనం, సౌభ్రాతృత్వం వంటి లక్షణాలతో ప్రతిఒక్కరూ సమానంగా బతకాలనీ, ధనిక పేద, స్త్రీ పురుష వంటి బేధాలు ఉండరాదనీ, దేశంలోని సంపద అందరికీ సమానంగా పంచబడాలి అనే దృఢమైన సంకల్పం కలవాడు కనుక బాబూరావ్ తన మూడవ కూతురికి 'సమతా' అనేపేరు పెట్టాడు.

బాబూరావ్ కుటుంబం ఎంత సామ్యవాద భావాలు కలిగినప్పటికీ సనాతన ధర్మాన్ని కూడా పాటించినట్లు తెలుస్తుంది. వాళ్ళు ఇంటి పరిసర ప్రాంతాల్లో నిరంతరం నాగుపాములు తిరిగుతుండేవి. దీన్ని చూస్తున్న రత్నమ్మ నా కడుపులో పెరుగుతున్నది. అమ్మాయి అయినా అబ్బాయి అయినా తన పేరు పెట్టుకుంటానని రత్నమ్మ నాగదేవతకు మొక్కు కోవడంతో పుట్టిన కూతురికి 'నాగరత్న' అని నామకరణం చేశారు.

సమతా దేశమానే కుటుంబంలోని వారు అందరూ డాక్టలుగా, లాయర్లుగా, ప్రొఫెసర్లుగా స్థిరపడ్డారంటే దాని వెనుక స్త్రీమూర్తి రత్నమ్మ కృషి ఎంతగానో ఉంది.

కుటుంబ పోషణలో భర్త బాబూరావ్ కష్టానికి తోడుగా నిలబడాలని చిన్నపాటి వ్యాపారాన్ని మొదలు పెట్టింది. మార్కెట్‌కు వెళ్ళి చీర చెంగునిండా మామిడి పండ్లు తెచ్చి, తన ఇంటి ముందున్న వేపచెట్టు కింద అమ్మడానికి కూర్చుంది. కేవలం ఒక గంటలో తెచ్చిన మామిడి పండ్లన్నీ అయిపోయాయి. తన పెట్టుబడి కన్నా ఆదాయం ఎక్కువ వచ్చింది. దీంతో ఆర్థికంగా ఆ కుటుంబం కొంత నిల దొక్కుకుంది.

సీజన్ వారిగా వచ్చే పండ్లతో పాటు ఆకు కూరలు, కూరగాయలు అమ్మడం ప్రారంభించింది. కేవలం ఐదారు సంవత్సరాల్లో కూరగాయలు అమ్మే రత్నమ్మా పేరు "కూరగాయల రత్నమ్మ"గా స్థిరపడి పోయిందంటే ఆమె కమిట్‌మెంట్ ఎటువంటిదో తెలుస్తుంది.

రత్నమ్మ ముందుచూపు కలిగిన మనిషి. దార్శనికు రాలు. తాను సంపాదించిన డబ్బులో ప్రతిరోజూ కొంత ధనాన్ని బ్యాంకులో జమచేయడం ప్రారంభించింధి.

ఇంటికి దీపం ఇల్లాలు అన్నట్టు బాబూరావ్ కుటుంబా నికి రత్నమ్మ ఒక 'దివిటి'లాగా మారిపోయింది. తనకు వచ్చిన ఆదాయాన్ని ఏమాత్రం వృధాచేయకుండా ఇంటికి అవసరమైన కంచు, ఇత్తడి అల్యూమినియం వంటి పాత్రలు కొనడం ప్రారంభించింది. ఇంటికి కావలసిన కనీస సౌకర్యాలు అన్నీ ఒక్కొక్కటిగా సమకూర్చుకొని తన కుటుంబం యొక్క స్థానాన్ని మునుపటి కంటే ఎక్కువగా నిలబెట్టింది.

బాబూరావ్ మొదటి కూతరు డా॥ విజయలక్ష్మి దేశమానే దేశంలో ప్రఖ్యాతి చెదిన క్యాన్సర్ సర్జన్. ప్రఖ్యాత కిద్వాయ్ ఆసుపత్రికి డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఈమె ఒక సందర్భంలో మేము పాత చెప్పులు రిపేరు చేసే మాదిగ సమాజం వారు. మా సామాజిక వర్గం వారు పాత చెప్పులు రిపేరు చేస్తే నేను ఆపరేషన్ థియేటర్‌లో చెడి పోయిన మానవ శరీరంలోని క్యాన్సర్ గడ్డలను రిపేరు చేస్తానని చెప్పుకొన్నది. డా॥ విజయలక్ష్మి దేశమానే ఈ స్థాయికి రావడానికి తన తల్లి రత్నమ్మే కారణం. డా॥ విజయలక్ష్మికి హుబ్లీలోని కర్ణాటక మెడికల్ కాలేజీల్లో ఎం.బి.బి.ఎస్.కి సీటు వస్తే ఫీజు కట్టడానికి తన మంగళ సూత్రాన్ని అమ్మివేసి తనబిడ్డ ఎదుగుదల కోరుకున్న మహనీయురాలు రత్నమ్మ.

దేశమానే కుటుంబంలో అందరికీ నిర్భయత్వం, నిష్క ళంకమైన మనస్తత్వం అన్నీ రత్నమ్మ నుండే వచ్చాయని, అమ్మంటే మా ఇంటి 'దివిటి' అని సమతా దేశమానే గుర్తుచేసుకుంటారు.

రత్నమ్మ తన బిడ్డలను కంటికి రెప్పలాగా కాపాడింది. ఉన్నత చదువులు చెప్పించింది. ఎంతో ధైర్యవంతురాలు అయినప్పటికీ సున్నితమైన మనస్సు కలది. తన బిడ్డలకు ఎటువంటి ఆటంకం రాకూడదని తాపత్రయ పడేది.

కూతురు ఇందుమతిని ప్రఖ్యాత బొంబాయి ఐఐటిలో పిహెచ్.డి చేయిస్తోంది. ఒకరోజు ముంబైలో వరదలు వచ్చి ముంబై మునిగిపోతుందని టి.వి.లో వార్తలు చెపుతుండగా చూసి, తన కూతురు ఇందుమతిని తలచుకుని ఒక్కసారిగా నేలకూలి పోయింది. దీన్నిబట్టి అమ్మ మనస్సు ఎటువంటిదో అర్థంచేసుకోవచ్చు. అక్కడ

దెబ్బతిన్న ఆరోగ్యం కాలక్రమంలో క్షీణించి, దేశమానే కుటుంబంలో వెలుగులు నింపిన రత్నమ్మ అనే మాతంగి దివిటి, 22 సెప్టెంబర్ 2005 నాడు ఈ లోకానికి శాశ్వతంగా దూరం అయింది.

ఒక స్త్రీ తాను విద్యావంతురాలు కానప్పటికీ తన సంతానం ఉన్నతమైన స్థానాల్లో నిలబడాలనే బలమైన కోరిక కలిగి, మురికివాడల నుండి నాగరికతవైపు తన పిల్లలను నడిపించి, ఈనాడు దేశం గర్వించే స్థాయికి తీసుకువెళ్ళిన రత్నమ్మ నిజంగా ఒక అపురూప రత్నమే. రత్నమ్మే లేకుంటే ఈ రోజు డా॥ విజయలక్ష్మి దేశమానే పద్మశ్రీ అవార్డుతో సత్కరింపబడేది కాదు. తన పిల్లలు ప్రొఫెసర్లుగా డాక్టర్లుగా రాణించేవారు కాదు.

**ఆధార గ్రంథాలు :**


1. వాలు కుర్చీ ఆత్మకథ - ప్రొ॥ కె. వెంకటరెడ్డి, తిరుపతి
2. స్త్రీవాద వ్యాసాలు - ప్రొ॥ కె. కుసుమ కుమారి, తిరుపతి
3. మాతంగి దివిటి - ప్రొ॥ కొలకనూరి ఆశాజ్యోతి.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# అనువాద సాహిత్యం - సామాజిక చిత్రణ



- డా॥. ఇండ్ల సంధ్య

సహాయ ఆచార్యులు, తారా ప్రభుత్వ కళాశాల (స్వ) సంగారెడ్డి.

## పరిచయం

అనువాద సాహిత్యం అనేది ఒక భాషలో రచించిన రచనను మరో భాషలోకి అనువదించి, ఆ కవిత్వం, కథ, నాటకం, నవల, ఆలోచనల తత్వాన్ని ఇతర భాషాభిమానులకు చేరవేయడమే కాకుండా, సమాజాన్ని విశ్లేషించడానికీ, మార్గనిర్దేశనం చేయడానికీ ఒక అద్భుతమైన సాధనం.

## అనువాద సాహిత్య లక్షణాలు

**భాషా మధ్య సింధు** : భిన్న భాషల మధ్య ఒక వంతెనగా పనిచేస్తుంది. సాంస్కృతిక పరస్పర సహకారం: ఒక దేశం లేదా ప్రాంతపు సంస్కృతి మరో సంస్కృతికి చేరుతుంది.పారభాషిక భావాలను రీచేయడం: అనువాదం ద్వారా మరెన్నో భిన్న మానవ అనుభవాలను సమాజానికి పరిచయం చేయడం.

## సమాజిక చిత్రణలో అనువాద సాహిత్యం పాత్ర

### 1. విభిన్న వర్గాల జీవనశైలుల పరిచయం

అనువాద రచనలు సామాజిక అసమానతలు, వర్ణ వ్యవస్థ, ఆర్థిక స్థితిగతులు, పీడిత వర్గాల జీవన పరిస్థితులను వెలికి తీస్తాయి.

**ఉదాహరణకు** : బంగ్లా రచయిత బిభూతిభూషణ్ బందోపాధ్యాయ రచన పథేర్ పాంచాలి ని తెలుగులోకి అనువదించడం ద్వారా పల్లె జీవనవిధానం మనకు చేరుతుంది.

### 2. సామాజిక మార్పులకు ప్రేరణ

అనువాద రచనలు వలస పాలన, జాతి వివక్ష, లింగ సమానత్వం, కార్మిక సమస్యలు వంటి అంశాలను చర్చిస్తాయి.

**ఉదాహరణ** : నైజీరియన్ రచయిత చినువాఅచీబే నవల Things Fall Apart అనువాదం ద్వారా ఆధునిక సామాజిక విచ్ఛిన్నతపై చర్చ జరగడం.

### 3. దళిత మరియు శ్రమజీవుల అభివ్యక్తి

మరాఠీ నుండి అనువదించిన ఉమా చక్రవర్తి వంటి రచయితల రచనలు దళితుల ఆత్మచిత్రణను తెలుగులోనూ ప్రతిబింబించాయి.

### 4. నాగరికతల తాత్విక ప్రతిబింబం

అనేక పాశ్చాత్య తత్వశాస్త్ర, సాహిత్య గ్రంథాల అనువాదం భారత సమాజంలో ఆలోచనా వికాసానికి దోహదపడింది.

**ఉదాహరణ :** రూసో, కార్ల్ మార్క్స్, ఫ్రాయిడ్ రచనల అనువాదాలు.

అనువాద సాహిత్యం - తెలుగు సందర్భంలోతెలుగు భాషలో అనేక జాతీయ, అంతర్జాతీయ రచనలు అనువాద రూపంలో అందుబాటులోకి వచ్చాయి:ముంపు ప్రాంతాల జీవితాన్ని ప్రతిబింబించే మహాశ్వేతా దేవి రచనలు.రష్యన్ రచయితల రచనలు (టోల్స్టాయ్, దోస్తోయెవ్స్కీ) తెలుగులోకి అనువదించి సామాజిక చైతన్యాన్ని కలిగించాయి.కాకిమునయ్య శాస్త్రి, దాశరథి కృష్ణమాచార్యులు వంటి వారు అనేక అనువాదాలు చేశారనిచెప్పవచ్చు.

## సామాజిక అంశాల ప్రతిబింబం - ఉదాహరణలు

మూల రచన- అనువాద రచన - సామాజిక అంశం

బిభూతిభూషణ్ - పథేర్ పాంచాలి రవీంద్ర లాల్ అనువాద పల్లె జీవితం, పేదరికం

చినువాఅచీబే - Things Fall Apart అనువాద రూపం వలస పాలన, సంప్రదాయ సంస్కృతి

మహాశ్వేతా దేవి కథలు తెలుగులో అనువాదం దళిత సమస్యలు, ఆదివాసి జీవితం

మాక్సిమ్ గోర్కీ - మదర్ 'తల్లి' తెలుగులో కార్మిక ఉద్యమం

1. అనువాద సాహిత్యం అనగాఒక భాషలో రాసిన రచనను మరో భాషలోకి అర్థాన్ని, భావాన్ని దెబ్బ తీయకుండా అనువదించటం.భాషా, సాంస్కృతిక పరస్పర సంబంధానికి వేదికగాచెప్పవచ్చును.
2. సమాజిక చిత్రణనుసమాజంలో వున్న వర్గాల జీవన శైలులు, సమస్యలు, ఆచారాలు, విభేదాలు, మార్పులు మొదలైనవి సాహిత్యంలో ప్రతిబింబిం చడమే.
3. అనువాద సాహిత్యంలో సమాజిక చిత్రణ లక్షణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

   వలస పాలన, వర్గ పోరాటం, మహిళల హక్కులు, దళితుల సమస్యలు, కార్మికుల శ్రమ జీవితం

   ప్రాంతీయ జీవన శైలులు - పల్లె జీవితం, ఆదివాసి జీవితం

   సామాజిక మార్పు - చైతన్యానికి దోహదపడే పాత్ర
4. ముఖ్యమైన అనువాద రచనలు - సమాజిక చిత్రణతో

| రచన | రచయిత | అనువాదం | చిత్రిత సామాజిక అంశం |
|---|---|---|---|
| పథేర్ పాంచాలి | బిభూతిభూషణ్ | తెలుగులో అనువాదం | పేద ప్రజల జీవితం, గ్రామీణ జీవనదైన్యం |
| మదర్ (తల్లి) | మాక్సిమ్ గోర్కీ | తర్జుమగావించబడినది | దాశరథి కార్మికుల ఉద్యమం, సామాజిక న్యాయం |
| మల్లా (కథ) | మహాశ్వేతా దేవి | తెలుగులో అనువాదం | దళితుల ఆత్మగౌరవం, న్యాయ పోరాటం |
| Things Fall Apart- | చినువాఅచీబే | అనువాదం | వలస పాలన వల్ల నాశనమైన స్థానిక సమాజాలు |

5. అనువాద రచయితల పాత్ర (తెలుగు నేపథ్యం)

కాకి మునయ్య శాస్త్రి - పాశ్చాత్య సాహిత్యం అనువాదంలో నైపుణ్యం,దాశరథి కృష్ణమాచార్యులు - సోషలిస్ట్ భావజాలాన్ని అనువాదం ద్వారా పరిచయం చేశారు.

అనువాదం ద్వారా ధార్మిక, నైతిక జీవనవిధానానికి దోహదపడతాయి.

జయదేవ్, రవీంద్రలాల్ - అనేక భారతీయ భాషల రచనల అనువాదకులు

6. అనువాద సాహిత్యం వల్ల సమాజానికి లభించిన లాభాలుకొకొల్లలనేచెప్పవచ్చును.

విభిన్న జీవనవిధానాల పట్ల అవగాహన, సామాజిక స్పృహ, చైతన్యం ,నూతన ఆలోచనా విధానాలు, న్యాయ పోరాటాలకు సాహిత్య మద్దతు, మానవతా విలువలకు స్థిరత్వంకనిపిస్తుంది.

1. అనువాద సాహిత్యం ద్వారా సమాజంపై చూపబడే మూడు ప్రధాన అంశాలు
2. మాక్సిమ్ గోర్కీ రచించిన "మదర్" కథ అనువాద రూపంలో ఎలా సమాజాన్ని ప్రతిబింబిస్తుందనే విషయాన్నితెలుపుతాయి.
3. ఈ అనువాద రచనలు సామాజిక మార్పుకు ఎలా దోహద పడతాయి అనే అంశాలను కూడా తెలియపరుచును..

అంతేకాకుండా పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలు అనేక ప్రయోజనాలనిచ్చినా, అవి సమగ్రత లోపించాయి. ఆధునిక విమర్శలు వాటిలోని పరిమితులను, సంస్కృతి గత వక్రీకరణలను, భావ వికృతీ కరణలను ఎత్తి చూపుతున్నాయి. భవిష్యత్తు అనువాద పరిశోధనల్లో సంస్కృతుల మధ్య సమానత, స్థానికతకు ప్రాధాన్యత, అనువాదకుని స్వతంత్రత అనే అంశాలు కీలకంగా మారుతున్నాయి.

ఇక్కడ అనువాద సాహిత్యం పై ఆధారపడిన లేదా అనువాద ప్రక్రియను వివరిస్తూ రచించబడిన కొన్ని ప్రధాన రచనలు (తెలుగులోను, ఇతర భాషలనుండి తెలుగులోకి అనువదించినవీ, అనువాద తత్త్వం/విమర్శపై

అనువాద సాహిత్యం పై ప్రముఖ రచనలను మనం గమనించవచ్చును. తెలుగు భాషలో అనువాద తత్త్వంపై మనకు కనిపించే రచనలు ఈ క్రింద మనం చూడ వచ్చును.

1. అనువాద తత్వం - డా. బొమ్మకంటి సత్య నారాయణ

   అనువాద ప్రక్రియ, దాని సాహిత్యపర ప్రభావం, సాంకేతిక అంశాలపై విశ్లేషణ.

2. అనువాదం : సిద్ధాంతం - స్వరూపం - డా. చలపతి రావు

   అనువాద సాహిత్యం యొక్క భావతాత్త్విక విశ్లేషణ.

3. అనువాద సాహిత్యం - కోన రఘుపతి రావు

   అనువాదం చరిత్ర, పద్ధతులు, ఉదాహరణలతో కూడిన రచన.

4. తెలుగులో అనువాద సాహిత్యం - మల్లెల మల్లేశం

   తెలుగు భాషలో వివిధ కాలాల్లో జరిగిన అనువాద చలనం విశ్లేషణ.

5. అనువాద కవిత్వం - విమర్శ - వేటూరి ప్రసాదరావు

ఇతర భాషల కవిత్వాన్ని తెలుగులోకి అనువదించడంలో ఏర్పడే కవిత్వరూప మార్పులపై పరిశీలన. ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించబడిన ప్రముఖ రచనలు ఇవిసమాజిక చిత్రణతో కూడినవి అని చెప్ప వచ్చును.

| **మూల రచన** | **రచయిత** | **తెలుగులోకి అనువాదం చేసిన వారు** | **ప్రధాన అంశాలు** |
|---|---|---|---|
| 1. Pather Panchali | బిభూతిభూష | రవీంద్రలాల్ ఙ్బందోపాధ్యాయ్ | గ్రామీణ పేదరికం, వాస్తవికత |
| 2. Mother (తల్లి) | మాక్సిమ్ గోర్కీ | దాశరథి కృష్ణమాచార్యులు | కార్మికుల పోరాటం |
| 3. Things Fall Apart | చినువాఅచీబే | అనేక తెలుగు అనువాదాలు | వలస పాలన, స్థానిక నాగరికత |
| 4. జీవితానుభవాలు | మహాశ్వేతా దేవి | రచన గ్రూప్ | దళితుల, ఆదివాసుల జీవితం |

| | | | |
|---|---|---|---|
| 5. Godan (దానం) | మున్షీ ప్రేమ్‌చంద్ | ఆచార్య ఎనుగుల వీరస్వామయ్య | రైతుల దయనీయ స్థితి |

ఆంగ్లంలో అనువాద సాహిత్యంపై ఉన్నఈ ప్రామాణిక గ్రంథాలలోమనంచూడవచ్చును.

1. "The Translator's Invisibility's - Lawrence Venuti
   పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలపై ఆధునిక విమర్శ.
2. "After Babel" - George Steiner
   అనువాద భాషాశాస్త్రం మరియు తాత్వికతపై క్లాసికల్ గ్రంథం.
3. "Translation Studies" - Susan Bassnett
   అనువాద పరిశోధనలకు పునాది వేసిన రచన

ఈ గ్రంథాలు అనువాద సాహిత్య పునాదులను, దాని సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను విశదంగా తెలియ జేస్తాయి. విద్యార్థులకు ప్రాజెక్టు పని, థీసిస్, పరిశోధన కోణంలో వీటి అధ్యయనం ఎంతో ఉపయోగకరం

పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలు అనేవి అనువాదాన్ని శాస్త్రీయంగా, తాత్వికంగా, భాషాశాస్త్రం మరియు సాహిత్య విమర్శల పరంగా అధ్యయనం చేయడానికి రూపుదిద్దుకున్న ధోరణులు. ఇవి తరచుగా వలసకాల ప్రభావం, సాంస్కృతిక అధిపత్యం, భాషా శుద్ధి వంటి అంశాల చుట్టూ తిరుగుతూ విమర్శకుల విమర్శకు లోనయ్యాయి.

## ప్రధాన పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలు:

| సిద్ధాంతం | ప్రముఖ వ్యక్తులు | ముఖ్య భావన |
|---|---|---|
| విశ్వాసనిష్ట అనువాదం (Faithful/Literal Translation) | సిసెరో, హెరోడ్ | మూల రచయిత భావానికి శ్రద్ధతో అనుగుణంగా ఉండాలి |
| సహజీకరణ (Domestication) | లారెన్స్ వెన్యూటీ (Venuti) | అనువాదం స్వదేశ భాషాభిమానులకు అనుకూలంగా మారాలి |
| వినిమయం/సాంస్కృతీకరణ (Cultural Turn) | Susan Bassnett, André Lefevere | భాషకంటే ముందు సంస్కృతిని అనువదించాలి |
| పదచలనం (Skopos Theory) | Hans Vermeer | అనువాద లక్ష్యం ఆధారంగా భిన్న పద్ధతులు అవలంభించడం వల్ల |
| పరభాషావాదం (Foreignization) | లారెన్స్ వెన్యూటీ | మూలభాష తత్వాన్ని తక్కువగా మార్చకుండా ఉండగలగాలి. |

ఆధునిక విమర్శను తీసుకున్నట్లైతే ఈ క్రింది ముఖ్య అంశాలపై దృష్టి కేంద్రీకరించవచ్చును. అవి

**1. వలస ప్రభావం :**

పాశ్చాత్య సిద్ధాంతాలు పాశ్చాత్య భాషల ఆధిపత్యాన్ని ప్రతిబింబించాయి. స్థానిక సంస్కృతులను చిన్నగా చూపే ధోరణి కనిపిస్తుంది.

**ఉదాహరణ** : అనేక పాశ్చాత్య అనువాదాలు భారతీయ భావాలను మారుస్తూ తమ అభిప్రాయాలను మిశ్రమం చేశారు.

**2. సాహిత్యకారుని స్వతంత్రతపై ప్రభావం :**

మూల రచయిత భావాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చి అనువాదకుని సృజనాత్మకతను నిర్లక్ష్యం చేయడం.

**3. భాషా కేంద్రితత్వం :**

అనేక పాశ్చాత్య సిద్ధాంతాలు భాషను మాత్రమే ఆధారంగా తీసుకొని అనువాదాన్ని నిర్వచించాయి. కానీ అనువాదం భాషతో పాటు సంస్కృతుల మధ్య సంబంధాన్ని ప్రతిబింబించాలి.

**4. విమర్శాత్మక వాదనలు - Lawrence Venuti:**

అతని గ్రంథం "The Translator's Invisibility" లో పాశ్చాత్య ప్రచురణా విధానాలు అనువాదకుని పాత్రను మింగేసే విధంగా ఉంటాయని వాదించాడు.

అనువాదకుడు "అదృశ్యుడైపోవడం" అనేది సాహిత్యానికి హానికరం అని పేర్కొన్నాడు.

**ఆధునిక భారతీయ విమర్శకుల స్పందనలు :**

కామలా దాస్, గురుశరణ్ సింగ్, జ్ఞానపీఠ గ్రహీతలు - పాశ్చాత్య సిద్ధాంతాలను ఉపయోగించినా, స్థానిక పద్ధతులతో మిళితం చేశారు.

అనువాదం ఒక వ్యాఖ్యాన ప్రక్రియ, అభిప్రాయ మార్పిడి మాత్రమే కాకుండా విమర్శాత్మక కృషి అని అభిప్రాయపడారు.

పాశ్చాత్య "Skopos Theory"కి సమాంతరంగా భారతీయ "నవ్యం + అనువాద్యంగా" అనే భావన అభివృద్ధి చెందింది.

1. "The Translator's Invisibility" - Lawrence Venuti
   పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలపై ఆధునిక విమర్శ.
2. "After Babel" - George Steiner
   అనువాద భాషాశాస్త్రం మరియు తాత్వికతపై క్లాసికల్ గ్రంథం.
3. "Translation Studies" - Susan Bassnett
   అనువాద పరిశోధనలకు పునాది వేసిన రచన

ఈ గ్రంథాలు అనువాద సాహిత్య పునాదులను, దాని సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను విశదంగా తెలియజేస్తాయి. విద్యార్థులకు ప్రాజెక్టు పని, థీసిస్, పరిశోధన కోణంలో వీటి అధ్యయనం ఎంతో ఉపయోగకరం ప్రధాన పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలు ఈ విధంగా ఉన్నాయి.

| సిద్ధాంతం | ప్రముఖ వ్యక్తులు | ముఖ్య భావన |
|---|---|---|
| విశ్వాసనిష్ట అనువాదం (Faithful/Literal Translation) | సిసెరో, హెరోడ్ | మూల రచయిత భావానికి శ్రద్ధతో అనుగుణంగా ఉండాలి. |
| సహజీకరణ (Domestication) | లారెన్స్ వెన్యూటీ (Venuti) | అనువాదం స్వదేశ భాషాభిమానులకు అనుకూలంగా మారాలి. |
| వినిమయం/సాంస్కృతీకరణ (Cultural Turn) | Susan Bassnett, André Lefevere | భాషకంటే ముందు సంస్కృతిని అనువదించాలి. |
| పదచలనం (Skopos Theory) | Hans Vermeer | అనువాద లక్ష్యం ఆధారంగా భిన్న పద్ధతులు |
| పరభాషావాదం (Foreignization) | లారెన్స్ వెన్యూటీ | మూలభాష తత్వాన్ని తక్కువగా మార్చకుండా ఉండాలి. |

**ముగింపు :**

పాశ్చాత్య అనువాద సిద్ధాంతాలు అనేవి అనువాదాన్ని శాస్త్రీయంగా, తాత్వికంగా, భాషాశాస్త్రం మరియు సాహిత్య విమర్శల పరంగా అధ్యయనం చేయడానికి రూపుదిద్దుకున్న ధోరణులు. ఇవి తరచుగా వలసకాల ప్రభావం, సాంస్కృతిక అధిపత్యం, భాషా శుద్ధి వంటి అంశాల చుట్టూ తిరుగుతూ విమర్శకుల విమర్శకు లోనయ్యాయి.

అనువాద సాహిత్యం ఒక సామాజిక దర్పణంలా పనిచేస్తుంది. ఇది భిన్న భాషల, భిన్న సమాజాల మధ్య సహనాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనం. అనువాదం వల్లే మనం ఇతర ప్రాంతాల సమాజిక పరిస్థితులను అవగతం చేసుకోగలుగుతాము. అందువల్ల, అనువాద సాహిత్యాన్ని కేవలం భాషాంతర మార్పుగా కాకుండా, సమాజాంతర బంధాన్ని పెంపొందించే శక్తిగా భావించాలి.

**సూచిత గ్రంథాలు / గ్రంథసూచి :**


1. The Translator's Invisibility - Lawrence Venuti
2. Translation Studies - Susan Bassnett
3. After Babel - George Steiner
4. Translation, History & Culture - André Lefevere
5. Decolonising the Mind - NgugiwaThiong'o
6. భారతీయ అనువాదవాదాలు డా. ఎం. సత్యనారాయణ (తెలుగు)
7. "అనువాద తత్వం" - బొమ్మకంటిసత్యనారాయ%ఉష్ర
8. "సామాజిక సాహిత్యం" - అచ్చెంపేట జగన్నాథ రెడ్డి
9. "అనువాదం - సిద్ధాంతాలు & దృక్పథాలు" - డా. చలపతి రావు
10. "మహాశ్వేతాదేవి కథలు - అనువాద సంపుటి" రచన కలెక్టివ్
11. "మార్క్సిజం మరియు సాహిత్యం" - టెరిఈగిల్టన్
12. "సాహిత్య అనువాద పరిచయం" - రవీంద్రలాల్


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఆచార్య విస్తాలి శంకరరావు 'తడి ఆరని బ్రతుకులు' కథానిక సామాజిక జీవన చిత్రణ



- డా॥. కె. వి. పద్మావతి దేవి

తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంభం, ప్రకాశం జిల్లా.

సామాజిక జీవనంలో మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. మనిషి తన రోజువారి పనుల్లో భాగంగా సంఘటనలతో పాటు కొత్త కొత్త వ్యక్తులను చూస్తూ, కలుస్తూ ఉంటారు. కొందరు దేన్నీ సీరియస్ గా పట్టించుకోరు చూసి చూడనట్లుగా వెళ్లిపోతుంటారు. మరికొందరు ఆ సంఘటనను చూసి చలించిపోతారు సందర్భానికి తగినట్లుగా తాము చేయగలిగిన సహాయం చేస్తారు. అలాంటి సామాజిక భావనలు పాఠకుడిలో కలిగించడం కోసం సానుకూల దృక్పథంతో వచ్చిన సంకలనమే ఈ తడియారని బ్రతుకులు కథా జీవన చిత్రాలు. మానవ జీవితానికి సంబంధించిన ఒక చిన్న సంఘటనను తీసుకొని చెప్పే సమగ్రమైన భావ చిత్రం ఈ కథానిక. ఏ రచయిత అయినా వారి జీవన గమనంలో చూసిన, ఎదురైన వారి పరిసరాల్లో జరుగుతున్న సంఘటనల నేపథ్యం నుంచి కథానికలను రూపొందిస్తారు. ఆ కోవలోని వారే ఆచార్య విస్తాలి శంకరరావు.

## కథా రచయిత ఆచార్య విస్తాలి శంకరరావు పరిచయం :

వీరు మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలలో విశేష కృషి చేసి, ప్రసిద్ధు లుగా పేరు గాంచారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో సాహిత్య సృజన చేస్తున్న సాహితీవేత్తగా కనిపిస్తారు. వందల కొద్దీ పరిశోధనలు చేస్తూ,నేటి పరిశోధక విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు.ఆచార్య విస్తాలి శంకర రావు 'తడి ఆరని బ్రతుకులు' జీవన కథా చిత్రాలు పేరుతో కథా సంకలనం , 'చెమట చుక్కనై పరిమళిస్తా' కవితా సంకలనం, 'నా ఊరు' దీర్ఘ కవిత, 'టీనేజ్' నాటిక, 'ఇసుక రేణువులు' నవల మొదలకు సృజనాత్మక రచనలు చేశారు.బాధిత సామాజికవర్గ నేపథ్యంలో నుండి వస్తువును స్వీకరించి,'తడి ఆరని బ్రతుకులు' జీవన చిత్రాలు కథలుగా మార్చారు.

## 'తడి ఆరని బ్రతుకులు' కథా సంపుటి పరిచయం:

ఈ సంపుటిని తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం వారు ఆగస్టు 2021 న ప్రచురించారు. ఇందులో మొత్తం 15 కథానికలు ఉన్నాయి. వీటిలో 'తడి ఆరని బ్రతుకులు', 'మూడు తరాలు', అనే కథలు మదరాసు బ్రతుకులు, చెన్నపురి కథలు అనే కథా సంకలనాలలో

ప్రచురితమైనాయి. ఈ సంకలనంలో వచ్చిన ప్రతి కథ వాస్తవ సంఘటనలకు దగ్గరగా మన కళ్ళ ముందు జరిగిన సన్నివేశంలా అనిపిస్తాయి. ఈ కథలు చదివే పాఠకుణ్ణి ఆలోచింపచేస్తాయి. జనబాహుళ్యంలో నిత్యం ఎదురయ్యే వివిధ సందర్భాలను, సంఘటనలను కథలుగా మలచి చక్కని కథనంతో అందించారు. ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, శాఖాధ్యక్షులు, సుప్రసిద్ధ సినీ గేయ రచయితలు, మరియు సాహిత్య సాంస్కృతిక అభిమానులు 'తడి ఆరని బ్రతుకులు'కథ సంకలనాకి ముందుమాట రాసి ఈ సంకలనాన్ని మరింత పరిపుష్టం చేశారు.ఈ సంపుటికి శీర్షిక'తడి ఆరని బ్రతుకులు' ఈ కథనే ప్రస్తుత పరిశోధనా వ్యాసంగా గ్రహించడమైనది.

**తడి ఆరని బ్రతుకులు కథా సారాంశం :**

ఈ కథలో ప్రధాన పాత్రధారి మాల కొండయ్య. ఈయన పూర్వపు నెల్లూరు జిల్లా తరువాత ప్రకాశం జిల్లాకుచెందిన కనిగిరి ప్రాంతంలో జీవించేవారు. ఎన్నో ఏళ్లకు ముందు అనేక కుటుంబాలు జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకుని తడి ఆరని బ్రతుకులతో మద్రాసు నగరానికి వలస వచ్చారు. అలా వచ్చిన వారిలో తొలితరం వాడు మాల కొండయ్య. ఒకప్పుడు ఆంధ్రదేశంలో పంటలు పండక ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతూ నీటి వసతులు లేక, రాకపోక సౌకర్యాలు లేక, అక్షర జ్ఞానాన్ని అందుకోలేక, ధనవంతుల నుండి దాస్య విముక్తి కావాలని భావించి నగరానికి పోయి ఏదో పని చేసుకుంటూ బ్రతుకుదామని కనిగిరి, కందుకూరు, పామూరు, ఉదయగిరి, కావలి, మార్కాపురం, పొదిలి, దర్శి ఇలా అనేక ప్రాంతాల నుండి తమ ఊర్లను విడిచి తెలుగు ప్రజలు ఆనాటి రాజధాని అయిన మద్రాసు నగరానికి చేరుకున్నారు. కాలక్రమంలో వారే నగరంలో పారిశుద్ధ్య కార్మికులుగా మారి జీవనం సాగిస్తుంటారు. ప్రముఖ నగరంలో జీవిస్తున్నా... అక్షర జ్ఞానం లేక చేసే వృత్తిని మర్చిపోవడానికి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి నమ్ముకున్న వారిని నట్టేట వదిలి వెళ్లిన విగత జీవులే ఈ పారిశుద్ధ్య కార్మికులు.

అక్కడి తెలుగు ప్రజల మురికివాడల జీవితం ఎన్నో ఆటుపోట్లతో, జబ్బులతో, చావులతో ఉంటుంది. ఈ సందర్భంలో మాల కొండయ్య తన జీవితం అతి జాగ్రత్తగా నెట్టుకొస్తూనే తన కొడుకు ఓబులేసు జీవితం తన లాగా ఉండకూడదని కష్టపడి చదివిస్తాడు. పీహెచ్ డి డిగ్రీ చదువులో అత్యంత ప్రతిభ కనపర్చినందుకు ఓబులేసుకు లండన్ లో జరిగే అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో పాల్గొని ప్రసంగించే అవకాశం అందిపుచ్చుకుంటాడు. ఈ సందర్భంలోమాల కొండయ్య టీబీ వ్యాధి ముదిరి చనిపోతాడు. సరిగ్గా అదే సమయంలో కొడుకు ఓబులేసు లండన్ అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో ఉపన్యాసం ఉండడం ఈ కథలో కీలక సందర్భం. ఓవైపు మాల కొండయ్య అంత్యక్రియలు మరోవైపు ఓబులేసు పేదల జీవితాలు డబ్బు లేని కారణంగా ఆర్థికంగా ,వృత్తి కారణంగా సామాజిక అణిచివేత ప్రభుత్వాలు వారి శ్రమను ఎలా దోపిడీ చేస్తున్నాయో సవివరంగా వివరిస్తూ ఉంటాడు. అదే సమయంలో ఓబులేసు ప్రసంగం పూర్తవుతుంది మాల కొండయ్య అంత్యక్రియలు పూర్తి అవుతాయి. అంతా నిశ్శబ్దం తో కథ ముగుస్తుంది.

**కథానాయకుడు మాలకొండయ్య జీవన ప్రస్థానం:**

ఈ తడి ఆరని బ్రతుకులు కథలో మాలకొండయ్య కనిగిరి, కందుకూరు, కావలి ప్రాంతాల నుండి వలస వెళ్లిన అనేక మందికి పని కల్పించి వారిని పారిశుద్ధ్య కార్మికులుగా ఉపాధి కల్పించిన ఘనత మాల కొండయ్యది. తెలుగు ప్రాంతాల నుండి తమిళ ప్రాంతాలైన మదరాసు నగరానికి వలస వెళ్లిన వాళ్లు వచ్చిరాని తమిళం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుండి పట్టణ నగర ప్రాంతాలలో ఉండే పరిస్థితులకు అలవాటు పడుతుంటారు.వీరిలో ఎక్కువమంది (కామరాజు) ఆర్ కె నగర్ లో నివాసాలు ఏర్పాటు చేసుకొనిజీవిస్తుంటారు. అది మద్రాసు నగరంలో నడిబొడ్డున ఉన్నప్పటికీ నాగరికత అభివృద్ధి ఫలాలు ఆ నగరానికి చేరనే లేదు. అందుకే నగరంలో ఉన్న దీవి గాని దీవిగా మిగిలింది. ఇలాగే తెలుగు వారు ఉండే అనేక ప్రాంతాలు దీవులు లాగా ఇరుకు సందులు, మురికి కాలువలు, ఈగలు, దోమలు, అంటువ్యాధులతో ఉంటుంది.

మాలకొండయ్య కు 30 సంవత్సరాలుగా పారిశుద్ధ్య పనులు చేయడంలో అనుభవం ఉంది. వృత్తిని గౌరవంగా భావించేవాడు. కార్మికులందరితో మంచిగా ఉంటూ నాయకుడుగా ఉండేవాడు. అక్షరజ్ఞానం అంతగా లేక పోయినా తమిళ భాషను చక్కగా మాట్లాడేవాడు. కార్మికుల బాధలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేసే వాడు. అధికారులకు నమ్మిన బంటులా ఉండేవాడు. అధికారుల మెప్పు కోసం పారిశుద్ధ్య పనులు చేసి ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా జబ్బు చేసి చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకుంటాడు. ఎంత పని చేసినా కుటుంబ అవసరాల గురించి తగిన జాగ్రత్తలు తీసు కుంటాడు. తనలాగా తన కొడుకు ఓబులేసు ఈ పాడు పనులు చేయకుండా కొడుకును మద్రాసు విశ్వవిద్యా లయంలో పీహెచ్డీ చదివిస్తాడు. అందరికీ ఆదర్శంగా నిలుస్తాడు.

## కథలో తెలుగువారి సామాజిక ఆర్థిక స్థితిగతులు విశ్లేషణ :

వాస్తవానికి ఇది కథ అయినా తెలుగు ప్రాంతాల నుండి బ్రతకడం కోసం మద్రాసు నగరానికి వచ్చిన వారి జీవితాలు అప్పటికి ఇప్పటికీ ఎలాగ ఉన్నాయో ఈ కథ చదివితే స్పష్టంగా అర్థమవుతుంది. అక్కడి మనుషుల దీనగాథలను రచయిత స్వయంగా చూసి చలించిపోయి ఈ కథ రాసినట్టుగా తెలుస్తుంది. వారు చేస్తున్న పనులకు తగ్గట్టే వారు నివసిస్తున్న ప్రాంతాలు కూడా అలాగే ఉన్నాయి. మురికి కాలువ గట్ల మీద ఉన్న వారి ఆరోగ్యాలు ఎలా ఉంటాయో, వారి అలవాట్లు ఎలా ఉంటాయో, వారి ఆటలు ఏ విధంగా ఉంటాయో, వారి పిలుపులు ఎలా పిలుచుకుంటారో ఈ కథ చదివితే స్పష్టంగా ఓ సినిమా చూస్తున్నట్లుగా ఉంటుంది.

సామాజిక జీవితంలో ఎక్కడ ఆత్మగౌరవం అన్న మాటే కనిపించదు. అది పెద్ద నగరమే అయినా నాగరిక సమాజం నడిబొడ్డున ఉన్నా ఆ నాగరికత ప్రభావం వీరి మీద ఏ మాత్రం కనిపించదు. వీరి సామాజిక జీవితం చాలా దుర్భరంగా ఉంటుంది. నగర శివారు ప్రాంతాలలో పెద్ద పెద్ద గుంటలు, చెత్తకుప్పలతో నిండిన నిరుపయోగ స్థలాలలో, ఆకులతో, డబ్బా రేకులతో, అట్టలతో గుడిసెలుగా నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తుంటారు. ఆ ప్రాంతాలలో తాగునీటి సౌకర్యంగానీ, విద్యుత్ సౌకర్యంగానీ ఏమీ ఉండవు. మురికి నీరు నిరంతరం వాళ్ళ నివాసాల గుండా ప్రవహిస్తూ ఉంటుంది. తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట ఇలా ప్రతిదానికి వెతుక్కో వాల్సిందే. ఈగలు, దోమలు, కుక్కలు వారి ప్రియ నేస్తాలు. నగరాన్ని శుభ్రం చేయడం వారి విధి. కానీ వారి ఉండే పరిసరాలన్నీ మురికి కూపాలు గానే ఉంటాయి.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతారు. కానీ వారు ఉండే పరిసరాలు, వారి జీవితాలు, వారి కుటుంబాలు అన్ని అపరిశుభ్రంగానే ఉంటాయి. వీళ్ళని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. అందుకే రచయిత జాషువా గారి "అప్పు పడ్డది సుమీ భరతావని వీని సేవకున్" అనే మాటను గుర్తు చేస్తారు.

ఇక ఆర్థిక స్థితిగతుల సంగతి గమనిస్తే చాలా దుర్భరంగా ఉంటాయి. చిన్నచిన్న అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ఉంటారు. చాలీచాలని కూలి డబ్బులతో రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో కుటుంబాలని నెట్టుకొస్తుంటారు. కొంతమంది రోజువారి కూలికి రోడ్లు ఊడ్చే పని చేస్తారు. కార్పోరేషన్ లో చిన్న చిన్న కొలువులు చేస్తూ ఆ కొలువులు శాశ్వతం అవుతాయని ఆశతో కాలం వెళ్ళబుచ్చుతుంటారు. ఆడవాళ్లు ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ వారు పని చేసే ఇళ్లల్లో మిగిలిన అన్నాన్ని తెచ్చుకుని తింటూ కాలం సాగదీస్తుంటారు. తిండికి డబ్బు లేకపోయినా అప్పు తెచ్చుకుని మద్యం సేవిస్తుంటారు. ఆ తరువాత డబ్బు కోసం ఎటువంటి పనులు చేయడా నికి అయినా వెనుకాడరు. వారి జీవితాలతో డబ్బు ఎప్పుడూ దోబూచులాడుతూనే ఉంటుంది. వీటన్నింటికీ ప్రధాన కారణం పేదరికం అని ఆర్థిక శాస్త్రంలో పీహెచ్ డీ చేస్తున్న మాలకొండయ్య కొడుకు ఓబులేసు ఆవేదనతో అర్థం చేసుకుంటాడు.

మాలకొండయ్య అనారోగ్యంతో నెల రోజులు నుండి మద్రాసు టీబి హస్పిటల్ లో ఉండి చనిపోయినప్పుడు కొడుకు కూడా దగ్గర ఉండడు. ఆ సందర్భంలో

మాలకొండయ్య తమ్ముడు పెంచలయ్య అన్న అంతిమ యాత్రకు అవసరమైన డబ్బు కోసం వడ్డీల వాళ్ళ వాకిళ్ళ వైపు బావురుమంటూ తొంగి చూస్తాడు. పరిస్థితిని గమ నించిన వడ్డీ వ్యాపారి ఆర్ముగం ఎన్నప్ప ఇప్పిడి వస్తివి మా యన్న మాల కొండయ్య పూడిసినాడప్ప కొంచెం పణం వేణుమాప్ప అప్పడియా ఎన్నాచి? టీబి అయ్యా అయ్యో! ఎన్న కడవులే సరే ప్పా! ఎవల పణం వేణుమ్ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఆయురం 1000 రూపాయి వేణుం స్వామి ప్రాణం కు రంభ టైట్ గా ఉందప్ప. మాల కొండయ్య ఎనక్కు రొంబ నమ్మ కస్తుడు. మాదిరి సరే నూరుకు పత్తు రువా ఇంట్రెస్ట్ కు ఏడుత్తుకో. చేసేది లేక తెల్ల కాగితం మీద సంతకం పెట్టి డబ్బుతో ఇంటికి చేరాడు పెంచలయ్య. ఆ సమయంలో పెంచలయ్యకు వడ్డీ గురించి ఆలోచించే పరిస్థితి లేదు. ఇలాంటి అవసరాలకు ఎంత వడ్డీ అయినా తీసుకోవడం అక్కడ వారికి మామూలే అన్ని బ్రతుకులు వడ్డీ బ్రతుకులే.

మాలకొండయ్య కుమారుడు ఓబులేసు లండన్లో అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో లండన్ విశ్వవిద్యాలయం వేదికపై మనిషి-డబ్బు అనే అంశంపై ప్రసంగములో మనిషి పేదరికానికి సంబంధించి అనేక కీలక అంశాలు ప్రస్తావించారు. మనిషి జీవితంలో డబ్బు ఎంత కీలక మైందో తన తండ్రి జీవితమే ప్రత్యక్ష సాక్ష్యం అంటాడు. తిండి కావాలంటే డబ్బు ,బట్ట కావాలంటే డబ్బు, గూడు కావాలంటే డబ్బు, సరైన చదువులు చదువుకోవాలన్న డబ్బు కావాలి. ఇలా డబ్బు వారి జీవితాలను ఎలా మార్చి వేస్తుందో అనేక కోణాలలో విశ్లేషణ చేస్తాడు. నేడు మనిషి యంత్రం అయితే డబ్బు ఇందనంగా మారింది. వీరి జీవితాలలో నిజమైన సామాజిక సాంస్కృతిక నాగరికత అభివృద్ధి జరిగినప్పుడే దేశంలో పేదల జీవితాల్లో వెలుగులు వెదజల్లుతాయి అని అంటాడు.

## కథలో పారిశుధ్య కార్మికుల అమానవీయ సంఘటనలు సామాజిక దృక్కోణం :

కామ రాజర్ నగర్ మద్రాసు నగరం నడిబొడ్డున ఉన్న ఆ నాగరికపు అభివృద్ధి ఫలాలు రుచులు వీరుండే నగరానికి చేరవు. ఈ కె ఆర్ నగర్లో ఇరుకు సందుల్లో, మురికి కాలువ గట్టున, ఈగలతో, దోమలతో అంటు వ్యాధులతో సహజీవనం చేస్తూ జీవిస్తుంటారు. ఈ కథలో ప్రధాన పాత్రధారుడు మాలకొండయ్య. వీరి బంధువులు చులై, కోరుకుపేట, వాషర్ మెన్ పేట రిప్లికేన్, రామ్ నగర్, ద్వారకానగర్, కిల్పకం, సైదాపేట, వలసరవాకం, పెరంబూర్ మొదలగు ప్రాంతాలలో నివసించే తెలుగు పరిశుద్ధ్య కార్మికులు అందరూ కె.అర్ నగర్ లోనే మాల కొండయ్య సహకారంతో నివాసాలు ఏర్పాటు చేసు కుంటారు.

ఆంధ్ర ప్రాంతంలో కరువు కాటకాల వల్ల బ్రతుకు తెరువు కోసం బ్రతుకుదామని మద్రాసు పట్టణానికి వలస పోయిన తెలుగు కుటుంబాలు ప్రారంభంలో పారిశు ద్ధ్య కార్మికులుగా పనిలో కుదిరి క్రమక్రమంగా దానిలో ఇరుక్కుపోతారు. ఇక ఆ పని నుండి బయటపడలేక, బయటకు వచ్చి బ్రతకలేక ఆ పనులు చేస్తూనే మగ్గిపోతూ కూడా తప్పని పరిస్థితులలో అదే వృత్తిగా స్వీకరించి జీవితాల్ని కొనసాగిస్తుంటారు.

“ప్రతిరోజు కార్పోరేషన్ వీధులను శుభ్రం చేయడం వీధులలో బస్టాండ్లలో ఎవరైనా మలమూత్ర విసర్జన చేస్తే ఆ అశుద్ధాన్ని పోగుచేసి బుట్టలతో సేకరించి చెత్త కుప్పతో కలిపి ఎద్దుల బండ్ల తోనూ తోపుడు బండ్ల తోనూ మూడు చక్రాల సైకిల్ బండ్ల తోనూ నిర్ణయించిన ప్రాంతానికి చేర్చడం వీరి ప్రధాన వృత్తి”. ఇది వారి రోజు వారి జీవితం. చెత్త కుప్ప తీసుకు వెళ్లే బండి (విజల్) ఈల రెండు రోజులు వీధులలో వినిపించకపోతే ఇల్లాలి ఎదురు చూపులు ఎలాంటివో గమనించవచ్చు. ఇలాంటి జీవనాన్ని గడిపే వీరు చిన్న వయసులోనే టీబి, క్యాన్సర్ మొదలైన వ్యాధులు ప్రబలి తనువులు చాలించిన జీవితాలు ఎన్నో. ఈ పని చేసేవారు ఎవరైనా చనిపోతే ఆ పనిని వారి వారసులకు ఇచ్చేవారు. నిరక్షరాస్యత రాజ్యమేలే వీరి జీవితాలకు ఇంతకన్నా మరో మార్గం కనిపించదు. ఒకరి మలమూత్రాలను మరొకరు శుద్ధి చేయడం ఎంత దుర్భరమైన జీవితమో గమనించాలి. ఈ భూమి మీద ప్రతి ఒక్కరూ ఒకేలాగా పుడతారు కానీ జీవితాలు ఎలా ఉండాలనేది డబ్బు నిర్ణయిస్తుంటుంది.”

ఈ విధంగా అమానవీయమైన పరిస్థితుల్లో అమాన వీయమైన వృత్తులను పారంపర్యంగా చేస్తూ జీవితాల్ని జీవించడం సామాజిక దోపిడీ అవుతుంది. కేవలం పేదరికం ఆధారంగా కొన్ని కుటుంబాలు తరతరాలుగా ఇలాంటి నీచ వృత్తులను చేయడం వలన అంటు వ్యాధులు ప్రబలి ఒకరి నుండి మరోకరికి చోకి అర్థాం తరంగా జీవితాన్ని ముగిస్తుంటారు.సమాజంలో ఇలాంటి సందర్భాలు , సంఘటనలు ఎక్కడ ఉన్నా తీవ్రంగా ఖండించాలి. మనుషులు మనుషుల మలమూత్రాలను తీసే నీచమైన వృత్తిని నిషేధించాలి. ఇది ఈ కథ ద్వారా మనకు అవగతం అవుతున్న ఓ గొప్ప సామాజిక దృక్కోణం.

**ముగింపు :**

వలసకూలీల, పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు ఎలా ఉంటాయో ఈ కథ కళ్ళకు గట్టినట్లుగా చూపిస్తుంది. వారిపట్ల సానుకూల దృక్పధాన్ని పాఠకుడికి కలిగిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునిక ప్రక్రియలు - ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు
2. తడియారని బ్రతుకులు కథల సంపుటి - ఆచార్య విస్తాలి శంకర్ రావు

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# సినారె సినిమా పాటలు - సామాజిక స్పృహ

- డా॥. సైదులు ఖేతావత్
సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతాఫల్ మండి.

## పరిచయం :

ఈ రంగుల ప్రపంచంలో తనదైన శైలీలో పాటలను రచించి, సినీ జగత్తులో తన పేరును చిరస్థాయిగా సువర్ణాక్ష రాలతో లిఖించుకున్నారు. సినీ వినీలాకాశంలో ఎందరో సినీగేయ రచయితలు ఉన్న సినారే రూటే సపరేటు అన్నట్లు సాగింది. పద్యం నుండి పాట దాకా, గేయం నుండి గజల్స్ దాకా, కావ్యాల నుండి ఖండికల దాకా వారి సాహిత్య రచన కొనసాగింది. అక్షరాలనన్నింటిని తన కలంలో నింపుకొని సినిమాపాటకు ప్రాణంపోసిన సాహితీ పిపాసి సినారె. ఈయన పాట నాలుగు దశాబ్దాలపాటు తెలుగు చిత్రసీమను ఆవిష్కరించిననిది. తెలుగు సినిమా గేయ సాహిత్యంలో శిఖరాగ్రస్థుడిగా వెలుగొందిన సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె), కేవలం కళాత్మకతకే పరిమితమైన కవి మాత్రమేకాదు. సమాజాన్నిప్రస్ఫుటంగా ప్రతిబింబించిన గొప్ప సామాజిక సాహితీవేత్త.

## సామాజిక స్పృహ :

సామాజిక స్పృహ అంటే సమాజంలో ఉన్న అన్యాయాలు, అసమానతలు, ప్రజల జీవన పరిస్థితులు, వారి భావజాలం, దురావస్థలు వంటి అంశాలను తెలియ జేసేదే సామాజిక స్పృహ. కవిత్వం, కథలు, పాటలలో ఈ అంశాలు గోచరిస్తాయి. సినారె పాటలు మానవతా విలువలకి ప్రతీకలుగా నిలిచాయి. ఆయన రాసిన గీతాల్లో భావోద్వేగాలే కాదు, సామాజిక స్పృహ ప్రతిబింబిస్తుంది. ఆయన పాటల్లో సామాజిక సమస్యలు, స్త్రీల సమస్యలు, దేశభక్తి, శ్రామిక జీవనం, దారిద్ర్యం, అన్యాయం వంటి అంశాలపై వాడియైనా అక్షర తూటాలను ఎక్కు పెట్టి నాడు. ఈ క్రమంలో ఆయన కవిత్వంలో సమాజానికి సామాజిక స్పృహకు సంబందించిన అనేకా%శీ%శాలు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## దేశభక్తి :

రాయప్రోలు సుబ్బారావు రచించిన "ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని" అనే దేశభక్తి గేయంలోని నాలుగుపాదాలు తీసుకుని "అమెరికా అబ్బాయి" సినిమాలో దేశభక్తి పాట రాశారు సినారె. ముందు తనను తాను ప్రేమించుకుంటూ చుట్టూరా సమాజాన్ని, మాతృదేశాన్ని ప్రేమించాలి. దేశం కోసం నేను చేయవలసిన కర్తవ్యం ఏమిటి అని ఆలోచించాలి. దేశం కోసం తన వంతు పాత్రను పోషించాలని సినారె గొప్ప సందేశాన్ని ఈపాటలో ఇచ్చాడు.

## వరకట్నం :

"వరకట్నం" సినిమాలో 'ఇదేనా మన సాంప్రదాయం ఇదేనా'.. అనే పాటలో వరకట్న సమస్యల గురించి వివరించారు. నేటి సమాజంలో వరకట్నం సమస్య సమాజాన్ని ఎలా పట్టిపీడిస్తుందో, ఎందరు ఆడపడుచులు ఈ విష కోరల్లో చిక్కుకొని తనువులు చాలించుకుంటున్నారో

తెలుపుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు ఈరొంపిలో నుండి బయటపడలేక,సమస్యల వలయంలో ఎలా చిక్కు కుంటున్నారని, ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎన్ని చట్టాలు శాసనాలు చేసినా సమాజంలో మార్పు రావడంలేదని ఈ పాట ద్వారా సూచిస్తాడు.

### స్త్రీల సామాజిక స్థితి - విముక్తి ఆకాంక్ష :

నారీ మానవతా భావనను '20వ శతాబ్దం' సినిమాలో 'అమ్మను మించి దైవమున్నదా..' అనే పాట రాసితల్లి ప్రతిరూపాన్ని పూజిస్తూ, స్త్రీని దైవంగా ప్రశంసించాడు. అయితే ఇక్కడ చిత్రీకరించిన స్త్రీ చిత్రం కాకుండా అమ్మా మనోగతాన్ని ఆవిష్కరించింది ఈపాట. ప్రతి తల్లి తమ పిల్లల పట్ల ప్రేమను రాగలు ఉండాలని,శారీరక లోపం ఉన్నంత మాత్రాన వారిని దూరం చేయొద్దని సమాజంలో గౌరవంగా బ్రతికేటట్లు చూడాలని ప్రేమించు సినిమాలో కంటేనే అమ్మ అని అంటే ఎలా కరుణించే ప్రతి దేవత అమ్మేకదా .... అంటూ ఆలోచింపజేసే అద్భుతమైన పాట రాశారు.

### జాతి ఐక్యత :

తల్లా పెళ్ళామా చిత్రంలో 'తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది.. ' అనే పాటలో ప్రాంతాలు వేరైనా మనమంతా ఒక్కటేనని వక్కానించి చెప్పాడు సినారె. యాసలు వేరైనా తెలుగు భాష అంత ఒక్కటే ప్రాంతీయ భేదాలు ఉండరాదని తెలుగు వారంతా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి నడవాలని సూచించాడు.

'మానవుడు దానవుడు' సినిమాలో "అణువణువు వెలసిన ఓ దేవా" పాట జాతికి గ్రహణం పట్టిన వేళలో మాతృభూమి దాస్య శృంకలాలు నుండి విముక్తి గావించిన వేళ స్వాతంత్ర సమరంలో ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలు పణంగా పెట్టి భారత స్వతంత్ర కాంక్షను తీర్చారు. ఈ జాతినంతటిని ఒక తాటిపై నడిపి జాతికి గొప్ప బహుమానాన్ని అందించారు. ఇదే విషయాన్ని సినారె తన పాటలో చెబుతూ జాతి ఐక్యతచాటారు. అదేవిధంగా "కోడలు దిద్దిన కాపురం" సినిమాలో నీ ధర్మం నీ సంఘం నీ దేశం మరువద్దు.... అనేపాట ద్వారా ఈ దేశంలో జాతిని ఒక తాటిమీద నిలబెట్టడానికి ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను భారత స్వాతంత్ర యజ్ఞంలో సమిదలై పోయినారని కొనియాడారు. వారిని మరువద్దని, సత్యం కోసం సతినే అమ్మినదెవరని ప్రశ్నిస్తూనే హరిశ్చంద్రుడని చెప్పిస్తాడు. తండ్రికి ఇచ్చిన మాట కోసం శ్రీరాముడు అడవికి వెళ్ళాడని కావున ఆడిన మాట తప్పొద్దని సూచిస్తాడు. అన్న సేవలో అంకితమైన లక్ష్మణున్ని ప్రస్తావిస్తూనే, అన్నదమ్ములు ఎప్పుడూ కలిసిమెలిసి ఉండాలని అప్పుడే రక్త సంబంధాలు బలపడతాయని సూచిస్తాడు. పతియే దైవమని తరించిన సీతమ్మను ఉదాహరిస్తూ పుణ్య మూర్తులను అనుసరించడమే ధర్మమని అంటాడు. ఈ సంఘానికి చాపకూడుతో సమతను పెంచిన పల్నాటి బ్రహ్మనాయుడు, మేడిపండు లాంటి సంఘం గుట్టును విప్పిన వేమన్న, వితంతువు జీవితాల్లో వెలుగులు నింపిన కందుకూరి, తెలుగుజాతిని ప్రజల భాషతో తీర్చిదిద్దిన గురజాడ వంటి వారిని సంఘసంస్కర్తలని పాటతోఎలుగెత్తి చాటాడు. జాతి ఐక్యంగా ఉండాలంటే మనుషులంతా సమతామమత భావనలతో మెలగాలని చెప్పడమే కవి ఉద్దేశ్యం.

### కుల మతాలు :

మట్టిలో మాణిక్యం సినిమాలో సినారె రచించినటువంటి పాట "రిమ్ జిమ్ రిమ్ జిమ్ హైదరాబాద్/ రిక్షా వాలా జిందాబాద్"... ఒక తలపై రూమీ టోపీ.. ఒక తలపై గాంధీ టోపీ.. క్యా భాయ్ అంటాడు ఏమోయ్ అంటా డొకడుకు... కులం మతాలు భాషలు వేరైనా మనమంతా భాయి భాయి...అన్నారు . హైదరాబాద్ పట్టణం అనేక భాషలకు, కులమతాలకు, ప్రాంతీయ భేదాలకు తావు లేకుండాఇక్కడ వచ్చిన వారందరిని అక్కున చేర్చుకున్నది. జీవనోపాధి కోసం ఇక్కడ అనేక అవకాశాల కోసం వచ్చిన వాళ్ళు చాలామంది ఉన్నారు. అన్ని సంస్కృతులకు నిలయంగా వెలుగొందుతుంది మన హైదరాబాద్ అని కవి భావన. ఒకరికి తిన్న తిండి అరగక బాధపడుతుంటారు. మరొకరికి తినడానికి తిండి దొరకదు. డబ్బున్న వారికి పట్టు వస్త్రాలు ఉన్నా నిద్ర పట్టక జీవిస్తుంటారు. పేదవాడు కటిక నేల పైన పడుకున్నా హాయిగా నిద్ర

పోతుంటాడు. కొందరేమో అద్దాలమేడలో నివసిస్తే మరికొందరేమో ఫుట్పాతులపై చెట్ల కింద,మురుగునీటి గుంటల పక్కన చిన్న చిన్న పూరి గుడిసెల్లో జీవితాన్ని వెళ్లదీస్తున్నారని ఈ హెచ్చుతగ్గులు పోయే కాలం ఎప్పుడొస్తుందో అని కవి ఆలోచింప చేస్తాడు. సమ సమాజం కోసం కవి పడుతున్న ఆవేదన మనం అర్థం చేసుకోవచ్చు.

## స్నేహబంధం :

బాలమిత్రుల కథ సినిమాలోని పాటతో గొప్ప సందేశాన్నిచ్చాడు. 'గున్న మామిడి కొమ్మమీద గూళ్ళు రెండున్నాయి....' అనే పాటలో ఒక కామాందు కొడుకుకు ఒక పాలేరు కొడుకు మధ్య స్నేహబంధాన్ని చాలా బాగా చెప్పాడు. చెడ్డవాడి స్నేహం ఉదయం పూట నీడలాగా అంతకంతకు తగ్గుతూపోతుందని. మంచి వాడితో స్నేహం సాయంకాలం నీడలాగా క్రమక్రమంగా పెరుగుతూ పోతుందని చెప్పాడు. కల్మషం లేని స్నేహానికి సంపద, కులమత భేదాలు అడ్డు రావని, హెచ్చుతగ్గులు ఉండవని సినారె తెలియజేశారు.

## భాషా శైలీ :

సినారె పాటల్లోని భాష చాలా విభిన్నంగా ఉంటుంది. కొత్తనైన పద బంధాలు, సమాసాలు, గ్రామీణ పదజాలం, సాదాసీదా శైలి ద్వారా సామాన్య ప్రజల హృదయాల్లోకి పయనిస్తుంది. సామాజిక సందేశాలను అర్థమయ్యేలా, హృదయాలను కదిలించేలా వారి పాటల ప్రవాహం వెండి తెరపై సాగింది. నూతన ధ్వనితో రచించడం ఆయన ప్రత్యేకత.

## సినారె పాటల సామాజిక విస్తృతి :

సినారె గీతాలు సామాజిక చైతన్యానికి దారితీశాయి. విద్యార్థి ఉద్యమాల్లో, సాంస్కృతిక సమాజాల్లో సభ్య సమాజానికి ఈ గీతాలు ప్రేరణగా నిలిచాయి. రాజకీయంగా కాకపోయినా, ప్రజానాయకత్వ ధ్వనులు పలికిన పాటలు ఆయన్ని సమాజంలో మార్పు కోరిన కవిగా నిలిపాయి.

## ముగింపు :

సినారె మూడు వేలకు పైగా గేయరచన చేసి సినీ ప్రపంచానికి అందించి మణిమయ మకుటంగా నిలిచారు. ఆయన కేవలం గేయ రచయిత మాత్రమే కాదు. వాటికి జీవం పోసి శాశ్వతత్వం కలిగించాడు . సినీ ప్రేమికులకు ఆయన పాటలు వీనుల విందును కలిగిస్తాయి. సినారె ఒక సామాజిక తాత్వికుడు, భావప్రధాన కవి శిరోమణి. ఆయన పాటలు సంగీతానికే పరిమితం కాకుండా, సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయి. ఈ పాటల ద్వారా సినారె గారు సామాజిక స్పృహను ప్రేరేపిస్తూ, తెలుగు సినిమాకు ఒక మానవీయ దృక్పథాన్ని అందించారని సినీ గేయ రచయితగా తెలుగు వారిగుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## మూల గ్రంథాలు :


1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు ప్రయోగములు
2. సినారె సినీగీతాలు
3. సినారె టివి ఇంటర్వ్యూలు / పగలే వెన్నెల / ఈటివి / సాక్షి


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# దిలావర్ కథల్లో స్త్రీ పాత్రల చిత్రణ

- డా॥. ఎన్. విద్యాప్రవీణ

తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్.ఆర్.ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ.

**వ్యాస సంగ్రహం :**

సమకాలీన సమాజంలో అన్ని రంగాల్లో స్త్రీ ముందంజ వేస్తున్నప్పటికీ పురుషాధిక్యత ఇంకా కొనసాగడం వల్ల స్త్రీ స్వేచ్ఛకు భంగం కలుగుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలో కుటుంబంలో స్త్రీ జీవితంలో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమకాలీన కథా రచయితలు స్త్రీ జీవితంలోని వివిధ పార్శ్వాలను కథల్లో ప్రతిఫలింప చేయడంలో ముందున్నాడు. దిలావర్ అధ్యాపకుడు కాబట్టి పాత వాసనలు, కనిపించకుండా పాత్రలకు ప్రాణం పోశారు. నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట ప్రకాశంలో జీవనపోరాటం చేసినవాళ్ళ రక్తమాంసాలతో, రాగద్వేషాలతో మంచి చెడులతో, సామాజిక స్వభావంతో దిలావర్ కథలలోని పాత్రకు తమను తాము ఆవిష్కరించుకుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతిపాత్రా గుంపులోనో విడి విడి గానో జీవన పోరాటం చేస్తూ కనిపిస్తుంది. మంచివో చెడ్డవో పాత్రలు ఆయా భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తాయి. దిలావర్ ఎక్కువ సంఖ్యలో ఎక్కువ స్త్రీ పాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. మైథిలి, లిజీ, జహీరా, ఫాతిమా, కరుణ, పూలమ్మ, పద్మ, ఘాస్లీ, మోథి, జరీనా, చంద్రమ్మ వీటిల్లో చాలా పాత్రలు ఆదర్శవంతమైన పాత్రలే. అలాంటి స్త్రీ పాత్రలను పరిచయం చేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు :**

స్వేచ్ఛ, సరోగసి, కట్టుబాట్లు, భావోద్వేగం, తోఫా, క్షోభ, బుర్కా, పురుషాధిక్యత.

**ప్రవేశిక :**

ముస్లిం జీవనానికి, సంస్కృతికి అద్దంపట్టే కథ దిలావర్ రాసిన 'తోఫా' జహీరా ముఖ్య పాత్ర వహిస్తుంది. ఈమె భర్త హనీఫ్, భర్త ప్రేమతో కానుక ఇస్తానన్నపుడు జహీరా తనకు బంగారు నగలు కానీ బెనారస్ చీరలు కానీ వద్దని జీవితాంతం బందీయై ఊపిరాడనివ్వని బురఖా నుండి స్వేచ్ఛను కలిగించమని వేడుకుంటుంది. అయితే ఆమె భర్త ఆ కోరికను నిరాకరించడంతో దిగులుపడుతుంది. ఇలా ఏ మతంలోనైనా స్త్రీకి ప్రతిబంధకాలు ఏర్పడటాన్ని ఈకథ సూచిస్తుంది.

ఈ కథలో జహీరా ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తుంది. ముస్లిం సామాజిక వర్గంలో ముస్లిం స్త్రీలపై ఉండే వివక్ష నుండి బయటపడాలని చూస్తుంది. కానీ భర్త నిరాకరించడంతో ఆ నల్లటి బురఖాలోనే మగ్గి

పోతుంది. అందమైన వెన్నెలలాంటి ఆడవాళ్ళు చీకటి బుర్ఖాల్లో మగ్గడం జహీరాకు ఏమాత్రం ఇష్టం ఉండదు.

మండిపోతున్న ఎండల్లో ఊపిరాడకుండా బుర్ఖా బిగించుకుని ఒళ్ళంతా చెమటతో చిత్తడి చిత్తడి అవుతుంటే ఉక్కిరి బిక్కిరవుతూ బస్సులో ప్రయాణం చెయ్యడం ఎంత నరకయాతనో అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. అక్కడికక్కడే బుర్ఖాను ముక్కలు ముక్కలుగా చించి పారేయాలన్నంత కసి ఉంటుంది జహీరాకు. కానీ ఏదో బలహీనత ఆమెను నిస్సహాయురాయుల్ని చేస్తుంది. ఈ బుర్ఖాల్లోనే ముస్లిం అమ్మాయి అందమంతా అడవిగాచిన వెన్నెలలా అయిపోతుంది. "బుర్ఖా వేసుకోగానే రాహువు మింగిన చందమామలా అయింది జహీరా" ( మచ్చు బొమ్మ - దిలావర్ - పుట - 84)

తమ అందాన్ని నల్లటి ఆ బుర్ఖాలు రాహువులాగా కన్పించకుండా చీకటి మయం చేస్తున్నాడన్న భావనలో ఉండిపోతుంది.

ముస్లిం యువకులు జీన్స్ ప్యాంట్లు టీషర్ట్లు, రేబాన్ కళ్ళజోళ్ళు ధరించి సినిమా హీరోలా ఉంటుంటే, వారి పక్కన అప్పుడే తారులో ముంచి తీసినట్లుగా నల్లటి బుర్ఖాల్లో బిక్కుబిక్కుమంటూ నిర్జీవంగా ఉంటున్నారు యువతులు. ఎందుకీ వివక్ష శీలానికి ఆడా మగా తేడా ఏమిటి? ఆడవాళ్ళ అందం బహిర్గతం కావద్దని కట్టడి చేశారు. మరి మగాళ్ళు తమ అందచందాలను బజారు పాలు చేసినా ఫరవాలేదా అని అనుకుంటుంది మనసులో.

జహీరాలో చైతన్యం ఉందికానీ దాన్ని ఎలా ఎప్పుడు బయటకు తీయాలో తెలియదు. ఆ ముస్లిం పెద్దల, కుటుంబ కట్టుబాట్లు బురఖాల వెనుక తమ సంతానం కూడా మగ్గిపోయేలా చేస్తుంది. ఆ ముసుగు నుండి బయటపడే ప్రయత్నం చేసినా భర్త వ్యతిరేకించడంతో నిరాశ, నిస్పృహకు లోనవుతుంది. స్త్రీకి కుటుంబంలో నిరంతరం సమస్యల సుడిగుండాలు ఎదురౌతూనే ఉంటాయి. కుటుంబంలో స్త్రీ ఎప్పుడూ ద్వితీయ శ్రేణి సభ్యురాలే. తల్లిగా, కుమార్తెగా, కోడలిగా అన్ని సందర్భాల లోనూ ఆమె మరొకరి నీడగానే మిగిలిపోతుంది. విద్యాధికురాలైన, ఉద్యోగినైనా చాలాసార్లు ఈ పరిస్థితు లలో మార్పుండదు. అయితే కొన్ని సందర్భాలలో ధైర్యంగా ఇంటి యజమానిగా నిలబడి సమస్యల్ని పరిష్క రించుకున్న స్త్రీలు లేకపోలేదు. ఎక్కువ భాగం స్త్రీలు ఇంటి పనుల్లోనే మగ్గిపోతూ వారికి తెలియకుండానే శ్రమదోపిడీకి గురౌతున్నారు. పైగా అది వారి బాధ్యతగా సమాజం నిర్వచించడం వల్ల స్త్రీలు అమాయకంగా సమస్యల వలయంలో కూరుకుపోతున్నారు.

'పద్మ లేశిపోయింది' కథలో పద్మ ప్రధానపాత్ర దారి. ఇందులో పద్మ భర్త దుబాయ్ వెళ్ళడంతో పిల్లలకు కనీస వైద్య సదుపాయం అందించలేని దయనీయమైన పరిస్థితిలో ఆమెను సరోగసికి ఒప్పుకునేలా చేసింది. దాని ద్వారా దాదాపు మూడు లక్షల అడ్వాన్స్ రాగా ఆ డబ్బుని తనను కనీసం ఇంట్లకు కూడా రానివ్వని అత్తమామలకు అందేలా కిటికీలోంచి పడేస్తుంది. ఆ డబ్బుని అత్త కాలబెట్టాలంటే మామ వాడుకోవాలని చూడటాన్ని వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతుంది.

ఈ కథలో "సరోగసీ" అనే ఒక కొత్త అంశాన్ని వస్తువుగా స్వీకరించి ఊహించని మలుపులతో పద్మ పాత్ర ద్వారా దిలావర్ కథను ముందుకు నడిపాడు. గ్రామాల్లో ఏ స్త్రీకి అయినా వివాహం అయి భర్త దూరంగా ఉన్నా, చనిపోయినా, లేదా వదిలేసినా ఆమెను చులకనగానే చూస్తుంది సమాజం. అలాంటి సమాజంలో బ్రతుకుతున్న పద్మ భర్త దుబాయ్లో ఉంటే సరోగసీ ద్వారా బాబు పుడితే అది అర్థం కాని జనం బరితెగించిన ఆడదిగానే చూస్తుంది. నిజానికి ఆమె చేసిన తప్పు అత్తమామల దగ్గర ఆ విషయాన్ని దాచిపెట్టడమే. చెబితే మాత్రం వారికి ఏం అర్థమవుతుంది. అక్షర జ్ఞానం లేని వారు దానిని ఖచ్చితంగా అపార్థం చేసుకుంటారు. అప్పటికే పీకలలోతు అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాన్ని గట్టెక్కించడం ఎలా? దుబాయ్ పోయిన భర్త డబ్బు పంపడం మానే యడంతో, సరోగసీ ముఠా వలలో పద్మ చిక్కుకుంటుంది. డబ్బు ఆశ కల్పించి ఆమెను ఒప్పుకునేలా ప్రేరేపిస్తుంది. పద్మ తప్పు చేయట్లేదు. ఆడ మగ శరీరాల కలయిక లేకుండా పిల్లలు పుడతారని ఇందులో తప్పు లేదని,

తద్వారా డబ్బు వస్తుంది దానితో తన కుటుంబాన్ని అప్పుల బారి నుండి తొలగించుకోవచ్చని అంగీకరిస్తుంది.

పురుషులకు వీర్యం కౌంటు, తక్కువగా ఉన్నా, స్త్రీలకు అండాలు సరిగా విడుదల కాక పోయినా, లేదా గర్భాశయంలో ఏమైనా సమస్యలు ఉన్నా వారికి పిల్లలు పుట్టే అవకాశం ఉండదు. అలాంటి వారు అద్దె గర్భాలను ఆశ్రయిస్తారు. అది చట్టరీత్యానేరం అయినా కొంతమంది డాక్టర్లు డబ్బుకు ఆశపడి, పేదలను డబ్బుతో మచ్చిక చేసుకుంటారు.

పద్మలేశిపోయింది కథలో పద్మ భర్త లేకుండా రెండవ బిడ్డకు జన్మ ఇవ్వడంతో అత్త మామలతో పాటు ఊరి జనం ఎవరినో ఉంచుకుని బిడ్డను కన్నదనే నిర్ధారణకు వస్తారు. కానీ నిజం తెలిసిన పద్మ వారికి అసలు నిజాన్ని బయటపెట్టి తనపై పడ్డ నిందను తొలగించుకోకుండానే ఆ ఊరు విడిచి ముందు వచ్చిన డబ్బుని అత్తమామలకు కిటికీలోంచి విసిరివేస్తుంది. వాటితోనైనా తన అత్త మామలు, బిడ్డలు అప్పులు లేకుండా జీవితాన్ని తాపీగా నెట్టుకొస్తారని ఆశపడుతుంది. వచ్చిన డబ్బుని కొంతైనా తన స్వప్రయోజనాలకోసం వాడుకోకుండా సమస్తం తన వారికోసం త్యాగం చేసిన పద్మ ఆదర్శవంతురాలు.

గ్రామీణ ప్రాంతాల్లో పనిపటాలేని జనాలు ఉంటారు. వారినే ప్రచారకర్తలు అంటారు. ఎవరెవరు ఎవరింటికి వెళ్తున్నారు. ఎవరెవరు ఎవరితో కలుస్తున్నారు. ఎక్కడ కలుస్తున్నారు, ఉన్నదీ లేనిదీ కల్పించి ఊరంతా రేడియో లాగా ప్రచారం చేస్తారు. వీరికి వేరే పని అంటూ ఏమీ ఉండదు అలా చేస్తేనే వారికి పూటగడుస్తుంది. అలా నిజానిజాలు తెలియకుండానే మసిపూసి మారేడు కాయ చేసే పద్మ మీద కాంపౌండరుకి ముడివేసి ప్రచారం చేస్తారు. పద్మ ఇంటి ఆర్థిక పరిస్థితి గురించి అస్సలు ఎవ్వరూ పట్టించుకోరు, కానీ వారు ఏదైనా తప్పుగా భావించే పనిచేస్తే మాత్రం దాన్ని పలుపలు విధాలుగా ప్రచారం చేసి వారి మీద ఉన్న ఈర్ష్యను, అక్కసును అంతా వెళ్ళబోస్తారు. అలా నిస్సహాయతకు గురైన పాత్రే పద్మది.

"తీజ్" లంబాడీల ఆచార వ్యవహారాలను వారి భాషను, ఆ స్త్రీల హృదయాలను ఆవిష్కరించిన కథ. మంగీలాల్ తన అన్న భార్య అయిన ఘంస్లీని వశబ రుచుకోవడానికి అన్ననే హత్యచేసిన దుర్మార్గమైన ఉదంతాన్ని చిత్రించారు దిలావర్.

తీజ్ బంజారాల పవిత్ర పండుగ. పెండ్లికాని ఆడ పిల్లలు గోధుమలను వెదురు బుట్టలో పోసి వాటిని ఒక మంచె మీద ఉంచి వాటి మీద మధ్యాహ్నం, సాయంత్రం నీరు చల్లుతారు. రోజుకో ముగ్గురు యువతులు చొప్పున మొత్తం తొమ్మిది రోజులు నిష్ఠగా తీజ్‌ని కొనసాగిస్తారు.

ఘంస్లీ అందమైన బంజారా పిల్ల. ఆమెకు తన మేనబావ అయిన చిమ్నాను పెళ్ళి చేసుకోవాలని తీజ్ పండుగ చేసుకుంటుంది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం కానీ మధ్యలో చిమ్నా తమ్ముడు మంగీలాల్ చూపు ఘంస్లీపై పడుతుంది. ఎలాగైనా ఆమెను దక్కించు కోవాలని రాక్షస ప్రయత్నాలెన్ని చేసినా చివరకు చిమ్నానే ఘంస్లీ భర్త అవుతాడు.

కొంత కాలానికి వీరికి సీత్లి (సీత) పుడుతుంది. కరెంటు షాక్‌తో చిమ్నా మరణిస్తాడు. దాంతో మంగీలాల్‌లోని నిద్రాణమైవున్న కోణం లేస్తుంది. వారి కులాచారం ప్రకారం అన్నచనిపోతే అన్న భార్యను తమ్ముడు పెళ్ళి చేసు కుంటాడు. కాబట్టి ఘంస్లీని నేనే పెళ్ళి చేసుకుంటా అని పెద్ద మనుషులకు పీకల దాకా యిప్పసారా , కల్లూ పోయించి సొలాయి ముక్కలు తినిపించి పంచాయితీ పెట్టిస్తాడు. పెద్ద మనుషుల తీర్పుకూ, కులాచారానికి తలొంచక తప్పలేదు ఘంస్లీ. అప్పటి నుండి కాలాన్నే కాదు లోకాన్నే పట్టించుకోవడం మానేస్తుంది ఘంస్లీ. నిర్వేదం నిర్లిప్తతా, మాత్రమే ఆమెకు తోడుగా నిలుస్తాయి. తామరాకు మీద నీటి బొట్టులా అంటీ ముట్టనట్టు ఉండిపోతుంది. ఆమెకు జీవితం మీద చెప్పలేనంత అసహ్యం, విరక్తి కేవలం సీతకోసం బతుకసాగింది. సీతలో చిమ్నాను చూసుకుంటూ జీవించసాగింది.

"అమ్మా నన్ను చంపేసేయ్"లో స్త్రీల వ్యథార్థ జీవితాలను, పసిపాపల నుండి ముసలి వాళ్ళ వరకూ

రోజూ అత్యాచారాలకు గురవుతున్న తీరుని గుండె తడయ్యేలా కరుణ పాత్ర ద్వారా చెప్పించాడు దిలావర్. వివిధ ప్రదేశాల్లో స్త్రీలు ఇంటా బయటా ఎలా లైంగిక హింసకు గురవుతున్నారో వివరించారు.

స్త్రీలపైన ఎన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా నేను నిన్ను చంపుకోను అవసరమైతే భర్తను, అత్తమామలు, మరిదిని ఎదిరించి కూతుర్ని బతికించుకుంటానని కరుణ పాత్ర ద్వారా ఖరాకండీగా చెప్పిస్తాడు.

సమాజంలో జరిగే దారుణాలను కడుపులోని పిండం ద్వారా చెప్పిస్తాడు దిలావర్. నోయిడా గుట్టలుగా పేరుకుపోయిన చిన్నారుల అస్థిపంజరాల గురించి, అభంశుభం తెలియని విద్యార్థినులను అంతా చూస్తుండగా పొడిచిన సైకోగాళ్ళ గురించి, నమ్మించి పార్లర్‌కి తీసుకెళ్ళి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి చంపే మృత్యు క్రీడల్ని, యాసిడ్ దాడులు చేసే క్రూర ప్రేమోన్మాదుల్ని అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధించే కీచకోపాధ్యాయుల్ని ఇబ్రహీంపట్నం అయేషామీరా గురించి నల్లకుంట రమీజాబీ గురించి ఖైర్లాంజీ భయ్యాలాల్ కుటుంబానికి జరిగిన అమానుషం గురించి, కూతుళ్ళనే చెరబట్టిన షెఫీల్డ్, జోసెఫ్ ఫిట్జ్ గురించి, తల్లికి వివరిస్తుంది. అంతెందుకు కరుణ కుటుంబ సభ్యులే కడుపులో ఉంది "ఆడపిల్ల అని తేలగానే ఆ పిండాన్ని చిదిమేయడానికి సర్వ ప్రయత్నాలు మొదలుపెట్టారని చెప్తుంది. ఖండ ఖండాలుగా, ముక్కలు ముక్కలుగా, చిన్న చిన్న మాంసం ముద్దలుగా ఖైమా కొట్టడానికి కత్తులు కటార్లు సిద్ధం చేసుకుంటున్నారు అని తల్లికి వివరిస్తుంది" (చంద్రుడు గియ్యని బొమ్మలు- దిలావర్- పుట-176) అందుకే మగవాళ్ళ ఆలోచనలో మార్పు వచ్చినపుడు మళ్ళీ నీ కడుపులోనే ఆడపిల్లగా పుట్టాలనుంది అని తెలుపుతుంది.

కరుణ ఉన్న భూగోళమంతా గిర్రున తిరుగుతున్నట్టు తిరుగుతూ తిరుగుతూ తగలబడి పోతున్నట్టు తన శరీరం ఎడారిగా విస్తరిస్తున్నట్లు భీకరమైన ఇసుక తుఫాన్లు తనను చుట్టు ముడుతున్నట్లు ప్రళయాలు వచ్చినట్టు కట్టలు తెగిన దుఃఖం కన్నీటి వరదలై పారుతుంది. తన బిడ్డను కాపాడుకోవడానికి తనేం చేయాలి. అవి నిజంగా కడుపులోని పాపమాటలేనా లేక తనలోని ఆలోచనలా? భయాలు అలజడి ఉద్వేగాలు ఈ అంతర్ఘోషకు ప్రతిధ్వనిలా భావించి, ఏమి ఏమైనా తన పాపను కాపాడు కోవాలని దాని కోసం ఎవరినైనా ఎదిరించి నా ప్రాణంలోని ప్రాణాన్ని బతికించుకుంటానని వెర్రిగా కేకలు వేస్తూ అంటుంది కరుణ.

సమాజంలో ఉన్న అమానవీయ సంఘటనలకు ఆమె మనసులో జరిగిన అంతర్గత సంఘర్షణకు, భావోద్వేగాలకు ప్రతిరూపం కరుణ పాత్ర. ఆడపిల్ల పుడితే ఆమె భవిష్యత్తు ఏమిటీ? ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెను పెంచగలమా? బాధ్యతగల తల్లిదండ్రులు ఉన్నారా? అనే కోణంలో భ్రూణ హత్యలు నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. దానికి కరుణ పాత్ర ద్వారా సమాజాన్ని ఎదిరించి తన పాపని కాపాడుకుంటానని చెప్పేలా చేస్తుంది.

"ముక్కుపచ్చ లారని ఏడేళ్ళ బాలికను కొందరు దుండగులు బలవంతంగా ఎత్తుకపోయి మానభంగం చేసి తమ కామ వాంఛను తీర్చుకోవడం మాత్రమే కాకుండా ఆమెను కామ విషయానికి సంబంధించిన యంత్రంగా మార్చిన ఉదంతం ఓల్గా రాసిన "అయోని" కథకు కేంద్ర బిందువు. తప్పై అత్యాచారం జరపబడిన తర్వాత ఆ బాలిక నేను అయోనిగా పుడితే ఎంత బాగుండేది అని వ్యథ చెందుతుంది. వయస్సుని కూడా దృష్టిలో ఉంచుకోక చిన్నారులపై సహితం అత్యాచారాలు జరపడం అనేది సమాజం సిగ్గుపడాల్సిన విషయం" (రచయిత్రుల కథానికలు స్త్రీల సమస్యల చిత్రణ - డా॥జె.అనురాధ - పుట- 104)

అత్యాచారానికి గురౌతున్న స్త్రీల పైన వారు ఎదుర్కొంటున్న సమస్యల పైనా రచయితలు చాలా వైవిధ్య భరితమైన కథలు రాశారు. అత్యాచారాలకు గురైన స్త్రీలు ఎందరో తమ జీవితాన్నే కోల్పోతున్నారు. లైంగిక అత్యాచారానికి గురైన స్త్రీలు సిగ్గుతో ఆత్మహత్య చేసు కుంటున్నారు. ఇదే అత్యాచారం పసిపిల్లలపై జరిగితే వారు మానసిక ఒత్తిడులకు లోనవుతున్నారు.

కొడుకును వంశోద్ధారకుడిగా కూతుర్ని శనిగా భావించే సంస్కృతిలోనికి కూరుకుపోయిన సమాజం గర్భంలోని స్త్రీని అంతమొందించే ప్రయత్నం చేయగలుగుతుంది. దీని వెనుక ఆర్థిక పరిస్థితి ఒక కారణం కావచ్చు. కానీ మన మనస్సులో పేరుకుపోయిన స్త్రీ పట్ల చులకన అనే భావం మహావృక్షమై వేస్తున్న వెర్రితలలకు ఇది సాక్ష్యం. ఆడపిల్లల పెంపకంలో కన్నవారే ఎన్ని అసమానతలకు బీజం వేస్తున్నారో అనేక కథలతో అత్యంత సహజంగా చిత్రించారు. చిన్నతనం నుండే తాను స్త్రీని తనకు పురుషుడితో సమాన హక్కులు జీవితంలో లేవు అనే బలమైన భావజాలం ఆడపిల్లలకు పెంపకంలో ఎలా మెదడులోకి జొప్పించబడుతుందో అనేక కథల్లో చూడగలిగాం.

"మతం ప్రకారం పుత్రుడు పున్నామనరకం నుండి రక్షించేవాడిగా భావించి పుత్రుడికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. వంశోద్ధారణకుడిగా పుత్రుడిని గుర్తించడంతో అతనికి ప్రాధాన్యత పెరిగింది. శాస్త్ర విజ్ఞాన ఆధారంతో గర్భస్థ పిండం ఆడో, మగో తెలుసుకుని తమకు అన వసరం అనుకున్న ఆడపిల్లలను గర్భంలోనే హతమార్చడం ఈనాడు జరుగుతుంది. భౌతిక కారణాలకు మతకారణాలు తోడవడంతో పుత్రుడిపై మోజు పెరిగింది" ( సామాజిక పరిణామంలో స్త్రీ - డి.జి.యస్.ఆర్.సి.హెచ్.మూర్తి - పుట-18)

అమ్మా నన్ను చంపేసేయ్ కథలో కూడా కరుణ సమాజాన్ని బాగా పరీక్షించింది. కుటుంబాన్ని చదివింది. అందరి మనస్తత్వాలు ఎరిగిన కరుణ మనసులో మొదలైన అలజడి కథగా చిత్రించబడింది. అది కూడా గర్భస్థపిండం మాట్లాడినట్లు కథాంశాన్ని కొత్తగా చెప్పాడు దిలావర్. ఇది సమాజంలో ఉన్న ఎంతో మంది కరుణల గుండె గోస. కుటుంబ వత్తిడులకు, సమాజంలోని చిన్న చూపులకు భయపడి బాలిక అని తెలిసిన గర్భస్థ పిండాలను ప్రాణం పోసుకునేలా, ప్రాణం పోసేలా చేయాలి.

## ముగింపు

మహ్మద్ దిలావర్ 'మచ్చుబొమ్మ'(2007), చంద్రుడు గియ్యని బొమ్మలు (2016), కొండా కోనల్లో (2014) కథా సంపుటాలను చిత్రించారు. వీటిలో ఉన్న 42 కథల్లో చాలావరకు నిజ జీవితాలనే కథలుగా మలిచారు. సమాజంలో జరుగుతున్న, జరిగిన అంశాలను, ఘటన లను వస్తువులుగా స్వీకరించి దిలావర్ కథలను రాశారు. అందుకే ఇందులోని స్త్రీ పాత్రలకు ఎక్కడా న్యాయం జరుగలేదు. స్త్రీవాదకోణంలో ఒక పురుషుడు కథలు రాయడం సవాలుతో కూడిన పని. దానిని సునాయాసంగా పూర్తిచేశాడు దిలావర్. స్త్రీని కోరికలు తీర్చే వస్తువుగా, ప్రాణం ఉన్న బొమ్మగా కాకుండా ఆమెను మనసున్న మనిషిగా, గుర్తించాలంటారు. వారికి స్వేచ్ఛ, సమాజంలో గౌరవం, ఉండాలంటారు దిలావర్. స్త్రీలు, పురుషులూ అనే విభజన సాంఘిక విభజనేనని, స్త్రీ,పురుషుల మధ్య సంబంధాలన్నీ, సాంఘీకంగా నిర్మించబడ్డవేనని సోషలిస్టు ఫెమినిస్టులు చెప్పారు. ఆ రకంగా స్త్రీలు, పురుషులతో సమానంగా ఎదిగేలా అవకాశం కల్పించినపుడే మార్పు సాధ్యమవుతుంది. అదే సమయంలో స్త్రీలు కూడా తమ వ్యక్తిత్వాన్ని, విలువలను కాపాడుకునేలా ప్రవర్తించాలని, ఏది మంచో, ఏది చెడో తెలుసుకుని విలువలతో జీవించాలని సందేశమిచ్చారు దిలావర్.

## ఉపయుక్త గ్రంథాలు

1. తెలంగాణ కథ పరామర్శ - డా॥బన్న అయిలయ్య
2. మచ్చుబొమ్మ - దిలావర్
3. రచయిత్రుల కథానికలు స్త్రీల సమస్యల చిత్రణ- డా॥జె.అనురాధ
4. సామాజిక పరిణామంలో స్త్రీ - ఆర్.సి.హెచ్.మూర్తి.
5. చంద్రుడు గియ్యని బొమ్మలు - దిలావర్
6. కొండాకోనల్లో - దిలావర్.

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# భారతదేశంలో గురుకులాల విద్య ఆవిర్భావం



- సింగపంగ ప్రభాకర్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు గవర్నమెంట్ సిటీ కాలేజ్ (స్వ), హైదరాబాద్.

**సారాంశం :**

భారతదేశంలోని గురుకుల విద్యా వ్యవస్థ, వేద సంప్రదాయంలో పుట్టుకొచ్చిన అత్యంత ప్రాచీనమైన సమగ్ర విద్యా విధానాలలో ఒకటి. ఆధునిక విద్యలో ప్రాధాన్యత ఎక్కువగా భౌతిక, సాంకేతిక నైపుణ్యాలపైనే ఉండగా, గురుకుల విద్యలో మానసిక, ఆధ్యాత్మిక, నైతిక వికాసంపై దృష్టి పెట్టబడింది. ఈ పత్రంలో గురుకుల విద్యా వ్యవస్థ ఆవిర్భావం, అభివృద్ధి, పాఠ్యాంశాలు, బోధన పద్ధతులు మరియు తాత్విక ఆధారాలను విశ్లేషించబడింది. వేద కాలంలో మహిళల విద్యా స్థానం, మౌఖిక విద్యా సంప్రదాయం, నలందా, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ప్రాధాన్యత కూడా చర్చించబడింది. ఈ అధ్యయనం తేల్చినది ఏమిటంటే గురుకుల విద్య కేవలం అక్షరజ్ఞానం కాదు, స్వభావ వికాసం, నియంత్రణ, మరియు మోక్ష సాధన పట్ల కృషి.

**కీలక పదాలు :**

గురుకులం, వేద విద్య, మౌఖిక సంప్రదాయం, ఉపనయనం, భారతీయ తత్వశాస్త్రం, నియమశీలత, ధర్మం, ప్రాచీన విశ్వవిద్యాలయాలు

## పరిచయం :

విద్య మానవ సమాజ నిర్మాణానికి, అభివృద్ధికి పునాది. అది మానవునికి "మూడవ కన్ను"గా వర్ణించబడింది. భారతదేశంలో విద్య మతం, తత్వశాస్త్రం, సామాజిక వ్యవస్థలతో విడదీయలేని సంబంధం కలిగి ఉంది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన వేద విద్యా విధానం భారతీయ నాగరికతను మాత్రమే కాక ప్రపంచ ఆలోచనలను కూడా ప్రభావితం చేసింది.

ప్రాచీన సమాజంలో విద్య కేవలం జ్ఞానం బోధించడం మాత్రమే కాదుబీ అది నైతిక విలువలు, జీవన విధానం, ఆధ్యాత్మిక సాధనకు మార్గం. ఈ క్రమంలో గురుకులాల ఆవిర్భావం, వాటి విద్యా విధానం ప్రత్యేకతను పొందాయి.

## వేద విద్యా వ్యవస్థ :

వేద ఋషులు సంపాదించిన జ్ఞానాన్ని ప్రపంచానికి పంచారు. మానవ జీవిత లక్ష్యాలను ధర్మ, అర్థ, కామ, మోక్ష రూపంలో నిర్వచించారు. ఇందులో మోక్షసాధన అత్యున్నతమైనదిగా భావించబడింది. మోక్షానికి మార్గం వేదాధ్యయనం కాబట్టి విద్యలో వేదాలు, వేదాంగాలు ప్రధాన పాత్ర పోషించాయి.

ప్రాచీన కాలంలో రెండు ప్రధాన విద్యా విధానాలు కనిపిస్తాయి -

1. వేద వైదిక విద్యా వ్యవస్థ - సంస్కృత భాష ఆధారంగా.
2. బౌద్ధ విద్యా వ్యవస్థ - పాళీ భాష ఆధారంగా. విద్యావిధానం శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడేలా రూపుదిద్దుకుంది.

## గురుకుల వ్యవస్థ

గురుకులం అనేది గురువు నివాసం చుట్టూ ఏర్పడిన విద్యా కేంద్రం. విద్యార్థులు గురువు వద్దే నివసిస్తూ విద్యను అభ్యసించేవారు. వేదకాలంలో విద్యావిధానం ముఖ్యంగా ఆశ్రమాలలో జరిగింది. ఆనాడు నియత పాఠశాలలు గాని, పాఠ్య ప్రణాళికలు గాని లేవు. శిష్యుడు గురువు దగ్గరే ఉంటూ ఆచరణాత్మక విద్యను గడించే వాడు. గురువు ప్రతి ఒక్కరికి ఆదర్శమూర్తి, బ్రహ్మానంద స్వరూపుడు. గురుకులాల్లో శిష్యుడు గురుకుల వ్యవస్థ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, పవిత్రంగా జీవనం సాగించే వాడు. విద్యార్థుల తల్లిదండ్రులు గురువులపై సంపూర్ణ విశ్వాసంతో ఉండి, పిల్లలను ఆశ్రమాలకు పంపించేవారు. గురుకులాలపై అధికారం, అజమాయిషీలు, జోక్యంగాని ఉండేది కాదు.

- ఉపనయనం ద్వారా విద్యలో ప్రవేశం కలిగేది.
- విద్యార్థులు బ్రహ్మచర్యం పాటిస్తూ క్రమశిక్షణతో జీవించేవారు.
- తల్లిదండ్రులు గురువులపై పూర్తి విశ్వాసం ఉంచేవారు.
- గురుకులం పట్టణాలకు దూరంగా, ప్రకృతి ఒడిలో ఉండేది.

విద్యార్థులు భిక్షాటన చేసి ఆహారం సంపాదించుకునేవారు. సత్యం, ధర్మం, న్యాయం పాటించడమూ, కోపం, లోభం వంటి దుర్గుణాలను నియంత్రించడమూ వారి కర్తవ్యంగా ఉండేది. విద్యా పూర్తయిన తర్వాత గురువుకు గురుదక్షిణ సమర్పించి గృహస్థాశ్రమంలో ప్రవేశించేవారు.

గురుకులాల్లో బ్రాహ్మణ, వైదిక విద్య, హిందూ సాంప్రదాయ విద్యలు నేర్పబడేవి. వేదాలు, వేదాంగాలు, తత్వశాస్త్రం, వ్యాకరణం, భాష, తర్కం, క్షత్రియోచిత విద్యలు, యుద్ధతంత్రం, చదవడం, రాయటం, అంక గణితం బోధించబడేవి. స్త్రీలు కూడా వేదాలు అధ్యయనం చేసేవారు. కాని తర్వాతి కాలంలో స్త్రీలు గృహాలకు పరిమితమయ్యారు. ప్రాథమిస్థాయి విద్యను పొందిన వారిలో కొందరే ఉన్నత విద్య అభ్యసించటానికి వీలు కలిగేది. గురుకుల వ్యవస్థలో విద్యార్థులను మూడు రకాలుగా వర్గీకరించినారు.

## విద్యార్థుల వర్గీకరణ :

1. వసు - 24 సంవత్సరాల వరకు విద్యనభ్యసించినవారు.
2. రుద్ర - 36 సంవత్సరాల వరకు విద్యనభ్యసించినవారు.
3. ఆదిత్య - 48 సంవత్సరాల వరకు విద్యనభ్యసించినవారు.

## పాఠ్యాంశాలు :

గురుకులాలలో బోధించబడిన విషయాలు:

- వేద సాహిత్యం: నాలుగు వేదాలు, వేదాంగాలు, ఉపవేదాలు, ఉపనిషత్తులు.
- భాషలు: సంస్కృత వ్యాకరణం, తర్కశాస్త్రం.
- విజ్ఞాన శాస్త్రాలు: గణితం, జ్యామితి, ఖగోళ శాస్త్రం.
- సామాజిక-రాజకీయ శాస్త్రాలు: అర్థశాస్త్రం, ధర్మశాస్త్రం, రాజనీతిశాస్త్రం.
- యుద్ధ విద్యలు: ధనుర్వేదం, యుద్ధతంత్రం.
- ఆరోగ్యం: ఆయుర్వేదం, యోగా, ధ్యానం.
- కళలు: సంగీతం, నృత్యం, చిత్రకళ.

ఈ విధంగా విద్యా వ్యవస్థ సమగ్రంగా రూపుదిద్దుకుంది.

## బోధనా పద్ధతులు :

- మౌఖిక పద్ధతి (Oral Tradition) : గురువు మంత్రాలను పఠించగా, శిష్యులు పునరావృతం చేసేవారు.

- స్మృతిశక్తి (Memory) : పుస్తకాలు లేనందున విద్యార్థులు శ్రద్ధతో జ్ఞాపకం చేసుకునేవారు.
- తపస్సు మరియు యోగం: జ్ఞానం ఆత్మశుద్ధి ద్వారా పొందబడుతుందని నమ్మకం.
- ప్రయోగాత్మక శిక్షణ: ఆచరణలో విలువల పెంచడం.

## భారతీయ విద్యావేత్తల దృష్టిలో విద్య :

భారతదేశంలో వివిధ కాలాల్లో ఎంతోమంది విద్యావేత్తలు, ఋషులు, సన్యాసులు, తత్త్వవేత్తలు మరియు వివేచనాపరులు జన్మించడం జరిగింది. భారతదేశ విద్యా ఆలోచనాపరులు "విద్యా వ్యవస్థలను" తమ యొక్క జ్ఞానసంపదతో అందమైన రీతిలో తయారు చేశారు. వారంతా ఒక దివ్యమైన శక్తిసంపద లేదా ఒక శక్తి స్వరూపము. ఈ మానవ జీవితాలను కష్టాల నుండి, బాధల నుండి కాపాడుతూ, భవ్యమైన భవిష్యత్ కొరకు, ఆనందం కొరకు సహకరిస్తుందనే నమ్మకాన్ని కలిగి వున్నారు. భారతీయ విద్యాతత్త్వం ప్రకారం అట్టి మానవ జీవితానికి నిజమైన పునాదిని విద్య కలిగిస్తుందని, తద్వారా ప్రస్తుత మానవాళికే కాకుండా రాబోవు తరాలకు 'మంచివిద్య'ను అందించే ప్రయత్నం చేశారు.

భారతదేశంలో ప్రాచీనయుగం నుండి మధ్యయుగం వరకు, మధ్యయుగం నుండి నేటి ఆధునికయుగం వరకు విద్యా వ్యవస్థ ఆయా కాలాలకనుగుణంగా మార్పు చెందుతూ వస్తూ వుంది. విద్యావ్యవస్థలు మరియు తత్త్వశాస్త్రము పరస్పర ఆశ్రితాలుగా, కాలానుగుణంగా మార్పులు చెందుతున్నాయి. కాలాలకు అనుగుణంగా, అప్పటి సామాజిక పరిస్థితులననుసరించి విద్యచేసే పనులను భిన్నమైన రీతులలో నిర్వచిస్తూ వస్తున్నారు. "మార్పు" అనేది అన్ని విషయాలలో అనివార్యం కనుక 'విద్యారంగం' కూడా అట్టి 'మార్పులకు' లోనవుతూ వస్తూ వున్నది.

## ముగింపు :

భారతదేశంలోని గురుకుల విద్యా వ్యవస్థ కేవలం జ్ఞాన ప్రసార పద్ధతి మాత్రమే కాకుండా, మానవుని సంపూర్ణ వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకున్న జీవన విధానం. వేద సంప్రదాయం ఆధారంగా ఏర్పడిన ఈ వ్యవస్థలో విద్యార్థులు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, నైతిక పరంగా శిక్షణ పొందారు. గురుకులాలు క్రమశిక్షణ, భక్తి, ధర్మ బద్ధత, స్వావలంబన వంటి విలువలను పెంపొందించాయి. ఉపనయన పద్ధతి ద్వారా విద్యను పవిత్రమైన ఆచారంగా భావించి, గురువు-శిష్య సంబంధాన్ని బల పరిచారు.

ప్రాచీన భారతదేశంలో నలంద, తక్షశిల, విక్రమశిల వంటి విశ్వవిద్యాలయాలు విద్యా కేంద్రాలుగా నిలిచి పోయాయి. వేద, బౌద్ధ, జైన విద్యా సంప్రదాయాలు విశ్వవ్యాప్తం చెందాయి. మహిళలకు కూడా వేదకాలంలో విద్యలో స్థానం ఉండటం, భారతీయ సమాజం లోని సమగ్రతను, సమానత్వాన్ని సూచిస్తుంది.

ఈ అధ్యయనం ద్వారా స్పష్టమయ్యే అవకాశం ఉంది, గురుకుల విద్యా ఆధునిక విద్యకు కూడా మార్గ దర్శకత్వం చూపుతుంది. ఆధునిక విద్యలో సాంకేతికత, భౌతిక నైపుణ్యాలకు ప్రాధాన్యత పెరిగిన నేటి కాలంలో గురుకుల విద్య ఇచ్చిన నైతిక విలువలు, ఆత్మ నియంత్రణ, ఆధ్యాత్మిక దృక్పథం సమాజానికి సమ తౌల్యం కలిగిస్తాయి. కాబట్టి, గురుకుల విద్య కేవలం గత చరిత్రలో నిలిచిపోకుండా, నేటి తరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలబడాలి.

ఈ పరిశోధన తేల్చినది ఏమిటంటే, గురుకుల విద్య ఆధునిక విద్యకు మార్గదర్శకత్వం చూపగలదు. నేటి కాలంలో భౌతిక, సాంకేతిక విద్యకు ప్రాముఖ్యత పెరిగినా, గురుకుల విద్య ఇచ్చిన నైతిక విలువలు, ఆత్మ నియంత్రణ, ఆధ్యాత్మిక దృక్పథం సమాజానిలో సమతౌల్యం కలిగిస్తాయి.

**సూచన గ్రంథాలు :**


1. ఆల్టేకర్, ఏ.ఎస్. (1944). ఎడ్యుకేషన్ ఇన్ ఏన్షియెంట్ ఇండియా. వారణాసి: నంద్ కిశోర్ బ్రదర్స్.
2. బాషం, ఏ.ఎల్. (1954). ది వండర్ దట్ వాస్ ఇండియా. లండన్: సిడ్విక్ & జాక్సన్.
3. దాస్ గుప్త, సి. (1922). అ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ. క్యాంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్.
4. కేన్, పి.వి. (1930-62). హిస్టరీ ఆఫ్ ధర్మశాస్త్ర. భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.
5. శర్మ, ఆర్.ఎస్. (1990). ఆస్పెక్ట్స్ ఆఫ్ పొలిటికల్ ఐడియాస్ అండ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ ఏన్షియెంట్ ఇండియా. ఢిల్లీ: మోతీలాల్ బనార్సిదాస్.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలంగాణ భాషా సంస్కృతి విశిష్టత

- అప్రుఫ్ జాని షేక్

తెలుగు భాషోపాధ్యాయులు, జడ్.పి.హెచ్.ఎస్, జమీలాపేట, బీబీనగర్, యాదాద్రి భోనగిరి జిల్లా.

నిజాంను దిగంతాలకు తరిమిన చరిత్ర తెలంగాణది. హైదరాబాద్సంస్థానాన్ని దాదాపు రెండు శతాబ్దాలకు పైగా పాలించిన అసఫ్ జాహి వంశాన్నిపొలిమేరలు దాటిచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచింది తెలంగాణ. హైదరాబాద్సంస్థానాన్ని పాలించిన చివరి రాజు ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్. తెలుగు, కన్నడ, మరాఠీ ప్రాతీయ భాషలను అణచివేసి ఉర్దూ భాషకు ప్రాధాన్యం ఇచ్చాడు. విద్య, ఉద్యోగాలలోను ఉర్దూ భాషకేప్రాధాన్యం ఇచ్చాడు. ఈ పరిస్థితిలో ఇతర భాషలు మాతృభాషగా కలిగినవారు ఉర్దూను తప్పనిసరిగా నేర్చుకోవలసి వచ్చింది. ఉర్దూపై వ్యతిరేకతలేకున్నా మాతృ భాష, సంస్కృతుల అణచివేతను వ్యతిరేకిస్తూ ఈ ప్రాంతం ప్రజలు పోరాటం చేశారు. వివిధ సంస్థలు, భాషోద్యమం, గ్రంథాల యోద్యమంతో పాటు ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ నిజాం పాలననువ్యతిరేకించారు.

తెలంగాణ ప్రాంతాన్ని దాదాపు ఆరువందల ఏళ్లు ముస్లిముల పాలనలో ఉంది. మొగలుల దండయాత్ర ఫలితంగా 1687లోకుతుబ్షాహీల గోల్కొండ సామ్రాజ్యం పతనమయిపోయింది. ఆసఫ్ జాహీల రాజ్యం ఇంగ్లీష్లో నిజామ్ డొమినియన్ అని పేరు. 1724లోని ముస్లిం హైదరాబాద్ రాజ్యం, దక్షిణభారతంలో ఎక్కువ కాలం ముస్లిముల పాలనలో ఉండేది. నాటి రాజభాష ఫారసీ, మహబూబలీపాదుషా 1883 కాలం నుంచి ఉర్దూ రాజభాష ప్రాచుర్యంలోకి వచ్చింది.హైదరాబాద్రాజ్యంలో కొన్ని శతాబ్దాలు అరబ్బీ, ఉర్దూ, పార్శీ భాషలు అధికార భాషలుగాపాఠ్య పుస్తకాల భాషలుగా కొనసాగాయి. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకోస్తాంధ్ర భాష తెలంగాణ ప్రజలపై రుద్దబడింది. సమైక్య రాష్ట్రంలో కోస్తాంధ్రకృష్ణ, గుంటూరు జిల్లాల్లో మాట్లాడే భాషను ప్రామాణిక భాషగా గుర్తించారు. పాఠ్య పుస్తకాలల్లో, రేడియో, సినిమా, పత్రికల్లో, టీవీల్లోను ఆ భాషను ప్రవేశపెట్టి తెలంగాణ భాషను గుర్తింపు లేకుండా చేశారు. తెలంగాణ భాషా ప్రాముఖ్యత, భాషలోని యాస, తెలంగాణ భాషా మాండలిక పదప్రయోగం విశిష్టతను తెలపడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

దక్కనుప్రాంతంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న భాష తెలుగు. ప్రాచీన చరిత్ర బౌద్ధ సాహిత్యంపైఆధారపడింది. బుద్ధుని కాలంలోనే తెలంగాణలో బౌద్ధం ఆచరణలో ఉంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి బౌద్ధ సాహిత్యంలోకి వెళ్లింది. తెలుగు మత ప్రచారంలోకివెళ్లింది. తెలుగును 'ఆంధ్ర' లేదా 'అంధక' భాష అని నాటక ప్రయోగార్హం కాదనిభరతుడు పెర్కొన్నాడు. వాత్స్యాయనుడు, కౌటిల్యుడు అంధక భాషను వారిగ్రంథాల్లో ఉప యోగించారు.

శాతవాహనుల నుంచి కాకతీయుల వరకు ఈప్రాతం యొక్క ప్రభావం అన్ని రంగాలలో ఉంది. తెలంగాణ

ముస్లింముల పాలనలో ఈ ప్రభావం తగ్గింది. హైదరాబాద్ ఎపి రాజధాని కావడంతో తెలంగాణ ప్రాంతం తెలుగు వారందరికి కేంద్ర స్థానమైంది. తెలంగాణ ప్రాంతంలోని భాష మాండలికాలను మనం చూడవచ్చు. ఉత్తర తెలంగాణలో మాట్లాడే భాషకు దక్షణ తెలంగాణలో మాట్లాడే భాషలో కూడా చాలా వైవిధ్యత ఉంటుంది. ఉదాహరణకు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్నగర్ జిల్లాల్లో మాట్లాడే భాషలో ఎంతో భేదం కనిపిస్తుంది. కృష్ణా జిల్లాకు దగ్గరగా ఉన్న ఖమ్మం జిల్లాపాలివేంరలో కృష్ణా జిల్లా భాష, మహబూబ్నగర్జిల్లాలో రాయలసీమ భాష ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది.

తెలుగురాష్ట్రాలలో తెలుగు మాట్లాడిన ఏ ప్రాంతం యాస ఆ ప్రాంతానిది. ఆంగ్లవిద్యఒకచోట ఆంగ్లాంధ్రం, లేనిచోట తౌరక్యాంధ్రంగా విస్తరించింది. చాళుక్య సీమలో అభివృద్ధి చెందిన ఊర్లలో ఆంగ్లాంధ్రం వ్యాపించింది. తెలంగాణలో పట్టణాలలోముస్లింలు ఎక్కువగా ఉండటంతో తౌరక్యాంధ్రం వ్యాపించింది. మిగిలిన పట్టణాలలో తెలుగు వెలిగింది.

"నన్నయ, తిక్కనలు స్వర్గము నుండి దిగివచ్చినచో వారు తెలంగాణపు గ్రామీణులలో నెట్టి'తిప్పలు'లేకయే మాటాలాడగలరు. కాని వారు రాజమహేంద్రవరమునో, నెల్లూరునకోవెడలినచో గ్రామీణుల మాటలాడు భాష వారికి కొంత 'ఎరుక' పడకపోవుట యును, వారిమాటలా గ్రామీణులకు 'నెట్టి'తెలియక పోవుటయు సంభవించునని నా నమ్మకము"బిరుదురాజు రామరాజు తెలంగాణ, తెలంగాణేతర భాషకు ఉన్న తేడాను వ్యక్తపరిచాడు. తెలంగాణ భాష గ్రాంథికానికి సన్నిహితం. ఆంధ్ర భాషలో దేశి, జాను తెనుగు వైకృతపద సమూహం ఎక్కువ, నన్నయ, తిక్కన రచనలలో, తెలంగాణ ప్రాచీన రచనలలో వాడుకపదజాలం ఎక్కువ, మద్రాసు, విజయవాడ, రాజమండ్రి నుంచి వెలువడే పత్రికలలోనివ్యావహారిక రచనలు తెలంగాణ పాఠకలోకాన్ని ప్రభావితం చేశాయి.

## తెలంగాణవ్యవహారిక భాషా పలుకుబడి

తెలంగాణలోవ్యవహారంలో 'ట'ప్రత్యయానికి చేర్చి వండుటం, పెట్టుటం, తినుటంవంటి రూపాలుఉన్నాయి. "వండుట" గ్రాంథిక రూపానికి ఒక్క అనుస్వారం మాత్రమే అతుకబడింది. కాని మహబూబ్ నగర్ మాండలికంలో 'ట' ప్రత్యయానికి మారుగా 'క'ప్రత్యయం చేర్చివండుకం, పెట్టుకం, తినుకం అంటారు. విశేష్యాలను కూడా 'నీ' ప్రత్యయం చేర్చిభావార్థం వాడుతారు. రాక రావుకం వచ్చినాడు-వచ్చిండు, పోయినాడు- పోయిండు, తెచ్చినాడు-తెచ్చిండు, వండినాడు-వండిండు వంటి ఉభయ క్రియా రూపాలు వ్యవహారం.

శబ్దాలను, అక్షరాలను హ్రస్వీకరించి తెలంగాణలో మాట్లాడుతారు. వస్తావా -వస్తవా, పోతావా-పోతవా, అనే రూపాలు ఉన్నాయి. అచ్చులకు హల్లులు, హల్లులకు అచ్చులుఅక్కడ- ఇక్కడ శబ్దాలకు హల్లులు చేర్చి గక్కడ గిక్కడ అని ఉచ్చరిస్తారు.తెలంగాణలో పరుష సరళాల పరంగా 'గడప'కు 'కడప'అని 'బొక్క'కు 'పొక్క' అని ప్రయోగిస్తారు. బొక్క శబ్దానికి ఎముక అని అర్థం. బొక్క అంటే రంధ్రం అనివ్యవహారం. తెలంగాణాలో 'తోలుకొని పోవుట' అనేది మనుషులకు ఉపయోగిస్తారు. 'కంచె' అనేమాటకు చేను చుట్టు వేసెడు కంప కోటే కాక బీడు అనే అర్థం.తెలంగాణలో 'తిన్నగా'అనే శబ్దానికి నెమ్మదిగ, మెల్లగ, మనోజ్ఞం అని అర్థాలు.ఇతర ప్రాంతాలలో సూటిగా అని అర్థం.

## పద ప్రయోగాలు

పొడుపు కథకు 'శాస్త్రం', 'తట్లు'అని తెలంగాణలో వ్యవహారం. గుండెకాయ అంటే గొంతుముడి గుండె పిసికటం అంటే గొంతు పిసికటం. బొండిగ అంటే గొంతు. ముచ్చట అంటేసంభాషణ. ముచ్చటించడం అంటే మాట్లాడటం. 'కబుర్లు'అని వాడుక, కబురు ఖబర్శబ్దభవం. చిన్న మేకుకి 'మొల'అని వ్యవహారం. మొలత్రాడులోని 'మొల'కు నడుమని అర్థం.

తెలంగాణేతరులుప్రయోగించిన శబ్దాలు ఇతర ప్రాంతాలలో లేవు. తెలంగాణలో ఈనాటికీ వాడుకలోఉన్నాయి. 'బాగాలు'అంటే పోకలు అని అర్థం. ఇదే తెలంగాణలో ప్రచారం, ఇతరప్రాంతాలలో పోకలనే వక్కలని వ్యవహారం. వక్కలు అంటే తెలంగాణలో ముక్కలని

అర్థం. 'ఉఱుకుట'పరుగెత్తుటకు సాధారణ ప్రయోగం. కొలువు అంటే ఉద్యోగం. "మావానికి కొలువు దొరుకలేదు" అని వ్యవహారం. అధికం అనటానికి 'లావు'శబ్దంఉ పయోగిస్తారు. ''లావు లావు మాట్లాడకు''''లావుగా బలిసిండు''. ఈ అర్థాన్నే'వాటము'శబ్దానికి వాడుతారు.

ఒసగుఅంటే దానం/కట్నం అని అర్థం. దీనికే 'వొసు'అను వికృతరూపం, వివాహాకాలంలోవధూవరులపై నుంచి పైసలు తిప్పి సన్నాయి వాళ్లకు ఇస్తారు. 'ఒస'ఇస్తారు. తన్నుట అంటే కాలుతో తన్నడమని వాడుక. బాల బాలికలను పోరగాడు, పోరినిందార్థంలో వ్యవ హారిస్తారు. ఈ శబ్దానికి తల్లిదండ్రులు లేని వారని విశేషార్థం. బువ్వ అంటే అన్నం అనీ, బోనం అంటే కూడా అన్నమనే అర్థం. ఈశబ్దాన్ని దేవతాపరంగా బోనాలని వ్యవహారం.

కంకులు మక్కజొన్న కంకులు, పచ్చజొన్న కంకులు అని వ్యవహారం. నోటితో కరచి తినుట వల్లకంకి అని వ్యవహారం, పరిమాణార్థంలో కంకెడు అని వాడుక. 'కంకెడంత బువ్వబెట్టవ్వా'అని బిచ్చగాడు వేడుకొంటాడు. కీసర అంటే ఇసుక, కీసర భూమి అంటేఇసుక భూమి. సైసు అంటే సహించు, ఓపిక పట్టు అని అర్థం. 'కొంచెం సైసవయ్యా' అని ప్రయోగం.తెలంగాణ వారిలో సైసే గుణం ఎక్కువ అని అంటారు.

శ్రీనాథుని కాలం నుంచి తెలుగులో పారసీ పదాలు ప్రవేశించాయి. తెలంగాణలో ఉర్దూతో కలిసిన భాష తౌరక్యాంధ్రమని కొందరి వాదన.హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకే కాని గ్రామీణ ప్రాంతాలకు లేదు. తెలుగు దేశమంతా ముస్లింముల పాలనలో ఉండగా ఉర్దూ భాషా పదాలు వ్యాపించాయి.

## భాషపై బిరుదురాజు రామరాజు అభిప్రాయం

''తెలంగాణము పల్లెపట్టులందుకన్న ఉత్తర సర్కారులందే నేను ఉర్దూ మాటల నెక్కువగా వింటిని, కాని అవి ఉర్దూ మాటలని వారికి తెలియదు. ఇంకొక విశేషమేమన తురకల పాలనమునుండి బయట బడిన ఆయా ప్రాంతములందు (సర్కారులు) వారి చెంత నిలిచిపోయిన ఉర్దూపదములను అపార్థములందును వాడుచుందురు'' అని బిరుదురాజు రామరాజు అభిప్రాయం. తెలంగాణ తెలుగులో పారసీ శబ్దాలు ఉన్నాయి. కీస అంటే జేబు అని అర్థం.

## తెలంగాణ యాసలో శబ్దప్రయోగం

తెలంగాణలో తూకాల శబ్దాలలో ఇతర ప్రాంత శబ్దాలు కొన్ని పోలినను పరిమాణంలో కొంతవిభేద ముంది. ఎడమ చేయికి -పురచేయి, రొడ్డ చేయి, తొంటచేయి అని ఇతర ప్రాంతాలలోవ్యవహారం. చొక్కాకు 'అంగీ'అని వాడుక. బరిబాత అంటే నగ్నం అని అర్థం. బట్టబాతలోని బాతయే ఇందులో చేరింది. ప్రాణం అంటే ఆరోగ్యం. 'నా ప్రాణం బాగాలేదు'అని వాడుక. పుల్ల అంటే పుడుక 'పానకంలో పుడక వలె' - 'కట్టె పుల్ల వలెసన్నగా'అని ప్రయోగం. అమడాల బిడ్డలు అంటే 'కవల పిల్లలు'అని అర్థం.ముస్లింల పాలనతో తెలుగు అభివృద్ధి కుంటు బడింది. ప్రాచీన లక్షణాలు తెలంగాణభాషలో కని పిస్తాయి. తెలంగాణలో కళ్ళు అని, కండ్లు అని వాడుక. కన్నుకన్నులుగా, కన్నులు కళ్ళుగా మారాయి.

నల్లగొండ జిల్లా మాండలికంలో 'ఇన్ని దినాల'నుంచి అర్థంలో ఇన్ని దినాల గోలె అనిఅంటారు. ఇది సమయాన్ని తెలిపే పదాల మీద వస్తుంది. సమయ వాచకాల మీద వస్తుంది. కోలెన్ అనే ప్రాచీన ప్రత్యయం. 'పిన్ననాటం గోలె' నన్నయ వాడారు. అంటేచిన్ననాటి నుంచని అర్థం. ప్రాచీన పదాలు తెలంగాణ మాండలికంలో ఉన్నాయి. కుర్కాసు అంటే పొయ్యిలో సగం కాలిన కర్ర. ఎక్కువగా కట్టెల పొయ్యిని వాడే వారు కాబట్టి అప్పటి సంస్కృతిని చెప్పుతుంది. కురకచ్చు పదం గ్రామీణులు వాడుకలో కురకాసుగా మారిపోయింది.

## పోతన పదప్రయోగం

పోతన'ఉరుకు' అనే పదం ఎక్కువగా ప్రయోగిం చారు. కొన్ని పదాలు తీసివేసి దీర్ఘమైనపదాలను వాడటం ఉంది. ఆంధ్ర ప్రాంతంలో పరుగెత్తు అనే పదం అలా వచ్చిందే.పరుగెత్తు పదం కన్నా ఉరుకు ఏక క్రియాపదం. ఉరుకు అనే పదాన్ని వాడకపోతే భాషనుంచే పోతుంది. భాష అభివృద్ధి చెందినచోట కొత్త పదాలు అనేకం కనిపిస్తాయి.ఒక్కొక్కసారి పాత పదాలు వాడకం ఉండదు.

ప్రజలు నివసించే వాతావరణ, రాజకీయపరిస్థితుల వలన పదాలు చేరుతాయి. తెలంగాణాలో 600 ఏళ్ళ ముస్లింముల పాలన సాగింది. ఉర్దూ ప్రభావం తెలుగుపై పడింది. కోస్తాలో ఆంగ్ల ప్రభావంతెలుగుపై ఉంది.

## తెలంగాణపై ఆంధ్ర భాష పెత్తనం

"ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నుంచి ఒక ప్రామాణిక భాషను భాషా శాస్త్రవేత్తలు తీసుకొనివచ్చితెలంగాణ ప్రాంతంలోని భాష అంత ప్రామాణికం కాదని ఇక్కడి వాళ్లకే ఒక అనుమానం వచ్చేటట్లు చేసినారు. మొదట్లోనే నాలుగు ప్రాంతాల్లోని ముఖ్యమైన వాడుకపదాలతో ప్రామాణిక భాషను రూపొందించినట్లయితే ఒక ప్రాంత భాష పట్ల మరొకరికి ద్వేష భావాలు ఉండేవికావు" అని రవ్వా శ్రీహరి అభిప్రాయం. తెలంగాణలోని దాశరథి, సి. నారాయణరెడ్డి వంటి వారు ఇంటిలో మాట్లాడే భాష ఒక తీరు,రాసేప్పుడు ఆంధ్రపత్రికలలో ప్రచురించబడి వారికి కూడా అర్థం కావాలనేఉద్దేశంతో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలో ఉండే భాషవలె రాశారు.

## తెలంగాణ సంస్కృతి

ఒకజాతి, ఒక దేశం భౌతికంగా, మానసికంగా దైనందిన జీవితంలోను, శాశ్వతంగాజీవితంలోనూ సాధించిన ప్రగతికి మూల్యాలే నాగరికత లేదా సంస్కృతి. భారతీయసంస్కృతి భౌతిక, మానసిక ఆధ్యాత్మిక ప్రగతి త్రివిక్రమరూపం. భౌతిక సంస్కృతికాలక్రమంలో జాతి ప్రగతికి అనుగుణంగా మారుతుంది. కట్టు, బొట్టు, జుట్టు, ఆహారవిహారాలు, గృహోపకరణాలు, పనిముట్లు, సంఘ వ్యవస్థ, వృత్తులు, వనరులుకాలక్రమంలో మారుతాయి. మానసిక ప్రగతిలోని సంస్కృతి ఆ జాతి విశ్వాసాలు, అభిరుచులు, ఆహార వ్యవహారాలు, నీతి నియమాలు, లలిత కళలు వంటివి తొందరగామారవు.

## తెలంగాణ భాషలోనిమమకారం

తెలంగాణలో గ్రామీణసంస్కృతి పిలుపులోనే కని పిస్తుంది. అవ్వ, అక్క, అన్న, మామ, అయ్యా వంటి సంభోదనలు ఎదుటివారిలో నెనరు పుట్టిస్తాయి. ఊరిలోని ఒక వ్యక్తికి ఊరంతాతెలుసు. ఊరిలో ఏ వేడుక జరిగినా ఊరంతా తెలుస్తుంది. గ్రామంలో రైతు జీవన విధానమే గొప్ప సంస్కృతి. అన్ని వృత్తుల వారి జీవన విధానం సంస్కృతిలో ఒక భాగమే.

"హైదరాబాద్లోసంగీత విద్వాంసుడు త్యాగరాజు, రామదాసు కీర్తనలు పాడినా శ్రోతలుస్పందించరు. సినిమా పాటలు పాడమని అడుగుతారు. గొప్ప నృత్యం చేసినా చవకబారునృత్యం చేయమని అడుగుతారు. నాలుగు వందల సంవత్సరాల పూర్వం నిర్మించిన హైదరా బాద్ మొట్ట మొదటి నుంచి తెలుగువారి సంస్కృతికి కేంద్రం కాకపోవడమే.ఇక్కడి స్థానికుల ఆచారాలు, జీవన విధానాలు భిన్నంగా ఉండటమే. గజల్, ముషాయిరాలతో ఉన్న పరిచయం శాస్త్రీయ కర్ణాటక సంగీత నృత్యాలతో లేకపోవడం. అసఫ్జాహీలు, మొగలులు తెలుగును రూపుమాపి పారసీ, ఉర్దూ భాషలను ప్రవేశపెట్టారు"అని ఉడయవర్లు అభిప్రాయం.

ఒక ప్రాంతంలోని వర్ణాతాపశీలుల స్థితిగతులు, సామాజిక ప్రభావంతో పరంపరగాఆచరిస్తున్న సంప్ర దాయాలే సంస్కృతి.భారతీయ సంస్కృతిలో ఒక పార్శ్వమే తెలుగుసంస్కృతి. వేయేళ్ల రాజవంశాలపాలనలో కుల వృత్తులు, మతం, పండుగలు, ఆచారాలు, సంగీతం-సాహిత్యం, కళలు ప్రవృత్తులు తెలుగువారి జీవనంలో మార్పులు ప్రవేశించాయి. తరాల సంప్రదాయాలు కాలగర్భంలో కలిశాయి.

## తెలంగాణ సంస్కృతి - ప్రత్యేకత

తెలంగాణను కాకతీయుల పతనం తర్వాత స్వాతంత్ర్యం వచ్చేదాక 6 శతాబ్దాలు బహమనీలు, కుతుబ్షాహీలు, అసఫ్ జాహీలు పాలించారు. తెలంగాణ లోని ఆనాటి 9 జిల్లాల్లో 7 జిల్లాలకు ఇతర రాష్ట్రాలు సరిహద్దుగా ఉన్నాయి. నిజామాబాద్, అదిలాబాద్జిల్లాలకు మహారాష్ట్ర, మెదక్, రంగారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాలకు కర్ణాటక, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు మధ్యప్రదేశ్ సరిహద్దులు ఉన్నాయి. అందుకే ఆయారాష్ట్రాలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. హైదరాబాద్కుఏ రాష్ట్రాలతో సరిహద్దు లేవు. పాలనకు కేంద్ర బిందువుగా భిన్న సంస్కృతి ప్రతిబింబిస్తుంది.వరంగల్, నల్గొండ జిల్లాలకు

ఏ రాష్ట్రాల సరిహద్దులులేకపోవడంతో ముస్లిముల పాలనతో ఇస్లాం సంస్కృతి కొంత ప్రభావం చుపించ గలిగింది. భిన్నసంస్కృతిని మేళవించుకొని ప్రత్యేకమైన సంస్కృతిని తెలంగాణ సంతరించుకొంది.తెలంగాణ సంస్కృతి విశిష్టమైనది. ప్రత్యేక అస్తిత్వం కలిగింది. కాలగమనంలోఆంధ్రసంస్కృతిలో భాగంగా పేర్కొని, నష్టపరిచినప్పటికీ ఈ సందర్భంలో తెలంగాణసంస్కృతి పునరుజ్జీవనం పొందుతున్నది. కొత్త చూపుతో, అన్వేషణతో తనఅస్తిత్వాన్ని తిరిగి నిర్మించుకుటుంది. విస్మరణకు, వక్రీకరణకు, అణచివేతకుగురైనా స్థానిక సంస్కృతీ రూపాల్ని సమీకరంచుకుంటూ కొత్తగా వ్యక్తీకరించు కుంటున్నదని నందిని సిధారెడ్డి గారి అభిప్రాయం. భౌగోళికంగా అనుకూలతలు, వనరులు ఉన్న ప్రాంతం కావటంతో స్థానికంగా ఎంతో చరిత్ర, నాగరికత, సంస్కృతి వెలుగొందాయి.

కతుబ్షాహీల కాలంలో సూఫీ తత్వానికి ప్రజాదరణ లభించింది. రామదాసు నిర్మించిన భద్రాచలం రామా లయానికి తానీషా మాన్యం ఇచ్చి సామరస్యాన్ని చాటు కున్నారు. హిందూముస్లింలు మతసామరస్యాన్ని పాటిం చారు. హైదరాబాద్లో బోనాల జాతరలో ముస్లిములు పాల్గొంటారు. ముస్లింల ఉత్సవాల్లో, ఉర్సుల్లో హిందువులు పాల్గొంటారు, రాజకీయ కారణాల వలన మత ఘర్షణలు చెలరేగితే పరస్పరం ఆశ్రయం పొందు తారు. ఇది తెలంగాణాలోని మత సామరస్యానికి తార్కాణం.

తెలంగాణలోప్రాచీన తెలుగు సంస్కృతి ఉంది. ఫ్యూడల్ సంస్కృతి ఎక్కువగా కనిపిస్తుంది.తెలంగాణ ప్రజా సాహిత్యానికి పునాది. లిఖిత సంప్రదాయంలో సాహిత్యం తరతరాలమౌఖిక సంప్రదాయానికీ, ప్రజల భాషా సంస్కృతులకు దూరమైన పండిత వర్గానికి పరిమిత మైనప్పుడు దేశీయ ఛందస్సులో ప్రజల భాషలో రచనలు చేశాడు పాల్కురికిసోమన. ఆయన ప్రజా సాహిత్యానికి పెట్టిన ఒరవడి తెలంగాణలో తర్వాత కవులకువర్తించింది. గౌరన రచించినహరిశ్చంద్రోపాఖ్యానం ద్విపదలోనే వెలువడటం తెలంగాణలో ప్రజా సాహిత్య రూపాల కొనసాగింపునకు ఉదాహరణ.

## భాషా వైరుధ్యాల సంగమం తెలంగాణ

విభిన్న భౌగోళిక పరిస్థితులు, సామాజిక, రాజకీయ వాతావరణాలు ఉన్న తెలంగాణకుప్రత్యేకించిన సంస్కృతి ఉంది. వైరుధ్యాల సంగమంగా ఉండటమే తెలంగాణ ప్రత్యేకత. జానపదుల సంస్కృతే దీనికి మంచిఉదాహరణ. వేయేళ్ల క్రితం గ్రంథాలలోప్రస్తావించిన కాకిపడగలు, గుర్రపు వారు ఉపయోగించిన ఇత్తడి వస్తు సంకేతాలు కనపడుతాయి. పదిహేను వందల ఏళ్ల క్రితం ఉన్న రాక్షస గుళ్ల సంస్కృతి కొనసాగుతుంది. మహబూబ్నగర్ జిల్లాలో చనిపోయిన వారి గోరీలపై చుట్టూరా చిన్నచిన్న రాళ్లను ఉంచుతారు. తెలంగాణలో గ్రామదేవతలను పేరుతో ఉప్పలమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ పండుగలు గ్రామీణులు పెద్ద ఎత్తున చేస్తారు.

తెలంగాణలోహిందువులు ముస్లింములు, క్రైస్తవులను సంస్కృతిలో కలుపుకుంటారు. ముస్లింముల మోహారం (పీర్లపండుగ)ను హిందువులు కూడా జరుపుకుంటారు. అంతేకాక ముస్లిందర్గాలకు వెళ్లి మొక్కులు చెల్లించు కుంటున్నారు. ఇది ముస్లిం పాలన ప్రభావం.పుట్టిన రోజు పండుగలను క్రైస్తవ సంస్కృతి ప్రకారం కేకు కట్ చేసిక్యాండిల్స్ ఆర్పివేసి జరపుకుంటారు. ఇది పాశ్చాత్య సంస్కృతి ప్రభావం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణకు ప్రత్యేక సంస్కృతితో అధికారిక ప్రాచుర్యం దక్కలేదు.బతుకమ్మ పండుగ ప్రారంభం, సద్దుల బతుకమ్మ, దసరా వ్యవహారం లోని పేర్లను పితృఅమవాస్య, దుర్గాష్టమి, నవరాత్రులు, విజయదశమి అని వ్యవహరించేవారు. ఆదిమకాలం నుంచి ఆధునిక కాలం వరకు తెలంగాణ అస్తిత్వాన్ని, ప్రత్యేకత ఔన్నత్యాన్నికలిగి ఉంది. పురాణాలు, మహా భారతంలోనూ అశ్మకరాజులు ఈ ప్రాంతం వారే. శాతవాహనులనుంచి అసఫ్ జాహీల వరకు పాలించారు.

## ఆదినుంచి తెలంగాణ భాషా ప్రత్యేకమే

శాతవాహనుల నుంచి ఆంధ్రప్రదేశ్ చరిత్రను పరిశీలిస్తే మొదటి నుంచి తెలంగాణ ప్రత్యేకప్రాంతంగానే

రాజవంశాల పాలనలో ఉండి. 3000 సంవత్సరాల పరిపాలనలో 800 యేళ్లలోమాత్రమే తెలంగాణ ఆంధ్ర, రాయలసీమ, కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల రాజ వంశీయుల పాలనలో కలిసి ఉంది. 2000 యేండ్లకు పైగా తెలంగాణ ప్రత్యేక భూభాగంగా ఉంది.అందుకే తెలంగాణ భాష, సంస్కృతి ఇతర ప్రాంతాల కంటే భిన్నంగా ఉంది. 'ఒక పరిపాలన కాలం ఆ ప్రాంతపు సంస్కృతిని శాసిస్తుంది' పాలకుల సంస్కృతిలో భాగంగా పాలితులు ఉంటారు. శాతవాహనుల నుంచి కుతుబ్షాహీల వరకు తెలంగాణలో మత, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సంబంధ ప్రజాజీవన వ్యవస్థలో పెద్ద మార్పులేదు. ఆయా కాలాల్లోరాజులు ఆదరించిన మతానికి అనుగుణంగా కళలు సంప్రదాయ సాహిత్యం ఆవిర్భ వించాయి. సామాన్య ప్రజల జీవన సంస్కృతి దీనిలో ప్రతిఫలించలేదు.

## ముగింపు

ఆదిమకాలం నుంచి ఒక ప్రత్యేక అస్తిత్వం కలిగిన ప్రాంతం తెలంగాణ. రాజకియంగా, ఆర్థికంగా, సామాజికంగా, భాషా పరంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రత్యేకం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ భాషా సాహిత్యాలకు ఎంతో ప్రాముఖ్యం లబిస్తూ ఉంది. కాని ఆంగ్ల భాష ప్రభావంతో అంతకంటే మరింతగా భాషకు నష్టం కూడా వాటిల్లుతుంది. ఎంతో గొప్ప చారిత్రక వారసత్వం కలిగిన ఈ భాష సంస్కృతి నాలుగు కాలాల పాటు వర్దిల్లాలంటే ప్రతి వ్యక్తి ఈ తెలంగాణ భాష సాహిత్యాలను ఉపయోగించాలి. ఈ భాషా సంపదను సజీవంగా వచ్చే తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది.

## ఉపయుక్తగ్రంథాలు

1. 'భాష ఆధునిక దృక్పథం' - ఫోరంకి దక్షిణామూర్తి
2. 'అభిన వాచార్వకం' - శ్రీ గొడవర్తి సూర్యనారాయణ
3. మావూరి ముచ్చట్లు - పి.యశోదారెడ్డి
4. 'తెలంగాణ చరిత్ర' జి.వెంకటరామారావు, ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాద్.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గూడ అంజయ్య రాసిన బీరుపూరి కథ సామాజిక విశ్లేషణ

- పి. మృదుల



తెలుగు అధ్యాపకురాలు, ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

పరిశోధక విద్యార్థి, భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ & టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్శిటీ (బి.ఎస్.టి.ఐ.యు), గౌనివారిపల్లె, గోరంట్ల, అనంతపురం జిల్లా.

"గూడ అంజయ్య" రాసిన ఈ కథ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపథ్యం నుంచి పుట్టింది. ఈ కథా ఛాయలు కూడా కాంచనపల్లి చిన్న వెంకట రామా రావు రాసిన కథా సంపుటి అయిన "మా ఊళ్లో కూడానా" అనే కథాసంపుటికి చాలా దగ్గరగా ఉంది. ఇక బీరూపూరి కథను పరిశీలించినట్టయితే ఇందులో కథానాయకుడు "బీరుపూరి" ఈరవ్వ వండిపెట్టిన జొన్న గట్క ఎత్తుక పోవడంతో కథ ప్రారంభమవుతుంది. అప్పటికే వరుసగా మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. ఆ గ్రామం లోని ప్రజలంతా ఎవ్వరు కూడా పొలం పనులకు వెళ్ల ట్లేదు. పొలాల నుంచి మొక్కజొన్న కంకులను తెచ్చుకొని తింటున్నారు. బీర్పురి గాడు ఈరవ్వ వండిన జొన్నగట్క కుండను ఎత్తుకుపోయాడు. దొంగ, దొంగ.... అంటూ అరుసుకుంటూ వెళ్ళింది ఆమె. వాస్తవానికి బీర్పురి గాడు దొంగ కాదు. ఒంటరివాడు. ఏకాకి జీవితం గడిపేవాడు. జొన్న గట్కా ఎత్తుకుపోతున్న బీర్పూర్ గాడిని దుబ్బయ్య పట్టుకొని కొట్టిండు. ఆ గ్రామంలో అందరూ కూడా వ్యవసాయం చేసుకొని దొర దగ్గర వెట్టి చేస్తూ బ్రతుకీడు స్తున్న మాల మాదిగలే అధిక శాతం గా ఉన్నారు. అవునులే తెలంగాణ రైతంగ సాయుధ పోరాటం కాలంలో వెట్టి చేసేది మాల మాదిగలే కదా ! బీర్పురి గాడిది గంగ అవతల గ్రామం అంటే గంగా నది అవతల గ్రామం అని కాదు ఇక్కడ అర్థం తెలంగాణలో గోదావరి నదిని గంగా నదితో పోలుస్తుంటారు. ఈ బీర్పురి గాడిది గోదావరి నది అవతల బీర్పూర్ పక్కన ఉన్న గ్రామం . బీర్పూర్ గాడు ఆరు సంవత్సరాల వయసులో చదువుకు వెళ్లాడు. కానీ ఆనాటి వెట్టి వల్ల చదువు సాగలేకపోయింది . ఈ వెట్టి ని ఆనాటి సాంఘిక దురాచారంగా చెప్పుకోవచ్చు.

ఇప్పుడు బీర్పురి గాడి జీవితంలోకి తొంగి చూద్దాం. బీర్పూరి గాడి తండ్రి పేరు ఎల్లయ్య. ఈ ఎల్లయ్య తండ్రి పేరు మల్లయ్య ఇతను ఎల్లయ్య పెళ్లి కోసం ఆ ఊరు జమిందార్ ఆయన గోపాల్ రావు దగ్గర 600 రూపాయలు అప్పు చేశాడు. ఆయన బతికినంత కాలం గోపాలరావు దొర దగ్గర వెట్టి చేసి చనిపోయాడు. దొర మాత్రం వడ్డీ మీద వడ్డీ లేస్తూ దాన్ని రెట్టింపు చేయ సాగాడు. దాన్నే పడుగు, అని నాగు అని కూడా అంటారు. తెలంగాణలోని

చాలా వరకు మాల మాదిగల ప్రజానికం ఈ పడుగు, నాగు వడ్డీలకు బలైపోయినటువంటి వారే అయితే రచయిత ఈ కథను కళ్ళకు కట్టినట్టు చూపించడంలో సిద్ధహస్తుడయ్యాడు. ఒకరోజు మల్లయ్యకు జ్వరం వచ్చింది. దొర గడికి వెళ్లలేకపోయాడు. దొర మనుషులు వచ్చి మల్లయ్య ను తీసుకెళ్లారు. అప్పటికే మల్లయ్య మూడు రోజులుగా తిండి తినలేదు. పైగా చాలా నీరసంగా ఉన్నాడు. ఏరా మల్లయ్య నీకు బలుపు వచ్చింది రా! పనికి మూడు రోజుల నుంచి రావడం లేదు రా! వ్యవసాయం పనులు ఎవరు చేయాలిరా కార్తె పోతే కార్తె వస్తాది రా! ముండా కొడకా! అంటూ తిట్టాడు. మల్లయ్య నీ కాల్మొక్త బాంచన్ దొర అంటూ దొర కాళ్లపై పడ్డాడు. దొర కనికరించలేదు. మీ మాల మాదిగలకు ఏమైందిరా నోరు లెగుస్తున్నాయి ముండాకొడుకుల్లారా అంటూ తిట్టసాగాడు. దొర కరుణించక పోగా మల్లయ్య వీపు పైన పెద్ద రాతిబండను ఉంచాడు. ఈ విషయం మల్లయ్య భార్య అయిన రామపోసు కు తెలిసింది. ఆమె వచ్చి దొర కాళ్ళ వేళ్ళబడింది అయినా దొర కనికరించలేదు. వీపుపై ఉన్న బండను మోయలేక మల్లయ్య కింద పడిపోయి ప్రాణాలు వదిలాడు. దొరకు అత్యంత అనుంగు అనుచారుడైన రామలింగు ఈ విషయాన్ని దొరకు చేరవేశాడు. మల్లయ్య గాడి ప్రాణం పోయిందిరా! పోనీలే బోడి ప్రాణం పోయింది. ఆ శవాన్ని తీసి పారేయండి అంటూ హుంకరించాడు కనికరం లేకుండా. మల్లయ్య భార్య రామ పోసు గుండెలు బాదుకుంటూ భర్త శవాన్ని గూడేనికి తీసుకువెళ్ళింది. అంత్యక్రియలు జరిపించారు. మూడు రోజులు కూడా కాలేదు అంతలో జాగీర్దార్ అయినా గోపాలరావు దొర రామలింగును పిలిపించుకొని అరే మల్లయ్య చచ్చి మూడు రోజులు అయింది రా. వాని భార్యవి పుస్తెలు తెగినాయి. దాని అమ్మ మొగుడు తీరుస్తాడా దాని మొగుడు చేసిన బాకీ అంటూ ఎగర సాగాడు. రామలింగు కలగజేసుకొని దొర మల్లయ్యకు ఇల్లు వాకిలి తప్ప ఏమీ లేదు. వాళ్ల బాకీ తీరిపోయింది అనుకుంటా ఎక్కడ తీరింది రా లుచ్చా కొడకా! ఇంకా 300 రూపాయలు మిగిలే ఉన్నాయి. దాన్ని కచేరీకి తీసుకురా ! రా అంటూ పురమాయించాడు దొర. రామలింగు గూడెంలోకి అడుగుపెట్టగానే మాల మాదిగ జాతీయులంత దండాలు దొర, దండాలు దొర పెద్దవారు మీరు ఏదో పనిమీద వచ్చి ఉంటారు. మీరు ఊరికే రారు. అంటూ వచ్చిన పని గురించి అడిగారు. మల్లయ్య గాడి పెళ్ళాం రామ పోసు ను దొర కచేరి కి రమ్మన్నాడు అందుకోసం వచ్చానని చావు కబురు చల్లగా తెలియజేశారు. ఆమె భర్త చనిపోయి మూడు రోజులు కూడా కాలేదు. అలా ఎలా కచేరి కి వస్తుందండి మా ఆచారం ప్రకారం అని నిలదీశారు రామలింగు ను. దొర పురమాయించాడు నేను వచ్చాను. పదండి వెళ్దాం రామ పోసు ఇంటికి అని బయలుదేరారు అందరు కలిసి. రామపోసు రామపోసు అని పిలిచారు, లోపలి నుండి ఏడుపులు వినిపించాయి. ఆమె ఎంతటికీ పలకకపోగా బీర్పురి గాడు బయటికి వచ్చి వెళ్లి విషయం తన తల్లికి చెప్పాడు. ఆమె బయటకు వచ్చి రామలింగును అడిగింది. విషయం అంత చెప్పాడు. రామలింగు ముగ్గురు కలిసి దొర కచేరికి వెళ్లారు. ఆమె ముఖం చూస్తే శవంలాగా కనిపిస్తుంది. దొర కలుగ చేసుకుని . పోయినోడు పోయినాడు అది శివలీల నే బజారు ముండ. ఏడవడం ఆపి నీ భర్త చేసిన అప్పు 300 అలాగే ఉంది. దాన్ని కట్టు అని నిలదీశాడు. దొర నా దగ్గర ఏం లేదు పాడు పడిపోయిన గుడిసె తప్ప. నీ దగ్గర ఏం లేక పోవడం ఏందే నీ కొడుకు ఉన్నాడుగా వాడిని రేపటి నుంచి పనిలో కి పంపు బర్ల కాడ పెండ కలు ఎత్తుతాడు, బర్లు కాస్తాడు అని హుంకరించాడు. వాడు చిన్న పిల్లగాడు దొర చదువుకుంటున్నాడు. వాడి ఎముకలు కూడా బలంగా లేవు. వాళ్ల నాన్న అప్పును నేను తీరుస్తాను. నీ ఇల్లు గడప వాకిలి ఊడ్చి నేను సేవ చేస్తాను అని బదులు ఇచ్చింది. నీవు ఎవరికి కావాలి. మగవాడు అయితే పుట్లు పుట్లు దాన్యం పండించి ఇస్తాడు. ఆడంగి ముండ నీకు నా కచేరిలో పని లేదు. మర్యాదగా చెప్తున్నాను రేపటి నుంచి వాడిని పనిలోకి పంపు అని గద్దించాడు.

చేసేదేమి లేక రామ పోసు, బీర్పురి గాడు ఇంటి ముఖం పట్టారు.

తెల్లవారంగానే ఆ గూడెంలో గుసగుసలు వినిపించ సాగాయి. రామపోసు, బీర్పురి గాడు గంగను దాటి అవతలికి వెళ్లారు. ఈ మాట ఆ నోట, ఈ నోట దొరగాడి చెవిలో పడింది. దొరగాడు అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. రామపోసు బీర్పురి గాడిని వెతకడానికి మనుషులను పంపాడు. కానీ 20 సంవత్సరాలు కావచ్చింది రామపోసు గాని బీర్పూరి గాడు గాని దొరకలేదు. 20 సంవత్సరాల తర్వాత నల్లగా అజాను బావుడిలా ఉన్న ఒక వింత మనిషి ఆ గూడెం లోకి ప్రవేశించాడు. కానీ అతడే బీర్పురి గాడు అని ఆ గూడెం ప్రజలకు తెలియదు పాపం. ఆ గూడెం లోని గోపాలరావు దొరగాడి అరాచకాలు అలాగే కొన సాగుతున్నాయి. ఒకరోజు గోపాల్ రావు దొరగాడి ఇంట్లో రెండు తులాల బంగారు గొలుసు పోయింది. వాడి భార్య ఐన కనకమ్మ ఆ దొంగతనాన్ని పని వాళ్ళ మీద వేసింది. పని వాళ్లు మిమ్మల్ని నమ్ముకుని బతుకుతున్నాం మీ బాంచన్ మీ కాల్ మొక్కుతాం ఈ దొంగతనంలో మాకేమి సంబంధం లేదు అని చెప్పారు. కానీ ఆ గొలుసు మాత్రం కనకమ్మ దగ్గరే ఉండిపోయింది ఆ విషయం గోపాలరావుకి తెలుసు. ఎలాగైనా దొంగతనాన్ని సైడ్ ట్రాక్ చేయాలనే ఉద్దేశంతో హవల్దారును పిలిపించాడు. రామలింగు వెళ్లి హవల్దారును తీసుకొచ్చాడు.

గూడెంలోకి ప్రవేశించిన బీర్పురి గాడు నల్లగా బీముడి వలె అజానుబాహుడు వలె ఉండేవాడు. అతి తక్కువ కాలంలో అందరి మనసులను చూరగొన్నాడు. వాడికి పిల్లలు అంటే చాలా ఇష్టం. పసిపిల్లలు తనని పట్టి గిచ్చే వారు, కొట్టేవారు అయినా ఏమీ అనేవాడు కాదు. నోరు ఎత్తి ఏనాడు కూడా మాట్లాడేవాడు కాదు. ఆకలైతే ఇంటి ముందు వచ్చి నిలబడే వాడు. అది గమనించే ఆ ఊరి జనాలు వాడికి అన్నం పెట్టేవారు. పెట్టనట్లయితే అన్నం గిన్నెలను ఎత్తుకుపోయి తినేవాడు. ఇప్పుడు దొరకన్ను ఆ ఊరికి కొత్తగా వచ్చిన పిచ్చివాడైన బీర్పురి గాడి పైన పడింది. రామలింగు హవల్దారును పిలిపించగా దొర గోపాలరావు తన అనుమానాన్ని బీర్పురి గాడి పైన నెట్టి వేశాడు. హవల్దార్ వెళ్లి బీర్పురి గాడిని చిత్రహింసలకు గురి చేసి దొర కచేరి కి పట్టుకు వచ్చాడు. దొంగతనం చేసావా అంటే నోరు మెదపడు, చింత బరికల తోని రక్తం వచ్చేటట్టు చితకబాదారు. ఐనా లబోదిబోమంటున్నాడు తప్ప ఒక్క మాట కూడా మాట్లాడాడు. రక్తం వచ్చినా గాయాల పైన కారం చల్లాడు హవల్దార్ .ఆ నొప్పిని భరించ లేక ఊరి బయట ఉన్న తాటిమాను తొర్రలో గొలుసు పెట్టానని చెప్పాడు. దొర హుకుం జారీ చేశాడు. గుండు గీయించి గాడిదపై ఊరేగిస్తూ తాటి మాను దగ్గరకు తీసుకువెళ్లారు. నిచ్చెన తెప్పించి బీర్పురి గాడిని ఎక్కించారు. నిచ్చెన పైకి లాక్కున్నాడు. బీర్పురి గాడు చెట్టు ఎక్కి ఎంతకు దిగలేదు.

చెట్టు ఎక్కిన బీర్పూరి గాడు దొరను తిట్టడం ప్రారంభించాడు. దొర చేసిన దురాగతాలను, దౌర్జన్యాలను, హింసను తిడుతూ ఉంటే ఆ మాటలు విన్న జనాల హృదయం రగిలిపోయింది. ఇంతలో దొర భార్య ఐన కనకమ్మ అక్కడికి వచ్చింది. కనకమ్మ మెడలో పోయిన రెండు తులాల గొలుసును లచ్చమ్మ చూసింది. ఆ గొలుసు దొరసాని మెడలో ఉందని చెప్పింది. జనాలలో అగ్రహా వేషాలు పెల్లుబికాయి. దొర భార్యను దొర అనుచరులను గూడెం జనాలు చావ కొట్టారు. ఇంతటితో ఆ గూడేనికి గోపాల్ రావు దొర పీడ విరగడయింది. ఆ ఊరి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించిన బీర్పురి గాడు అంటే ఆ గూడెం ప్రజలకు వల్ల మాలిన అభిమానం కలిగింది. అంతటితో దొరతనం ఆ గూడెంలో మంట కలిసి పోయింది.

## కథలోని పాత్రలు :

ఈరవ్వ, లసుమవ్వ దుబ్బయ్య, మల్లిగాడు, గోపాల రావు దొర, రామపోసు, రాజుగాడు, గుడ్డి పోసిగాడు, సుంకరోడు, ఇస్తారిగాడు, నారాయణ పటేల్, కొంగలోడు, రామలింగు, ఎల్లయ్య, మల్లయ్య, మొదలైన పాత్రలు.

## కథా విశ్లేషణ :

ఈ కథలో ప్రధాన అంశం" వెట్టి".

వెట్టిని ఆధారంగా చేసుకొని ఈ కథను రూపొందించారు గూడా అంజయ్య. తెలంగాణ రైతంగ సాయుధ పోరాట నేపథ్యంలో వెట్టి వ్యధలు మనకు బాగా తెలుసు.

కానీ భారతదేశానికి స్వతంత్రం సిద్ధించాక 1980 వరకు కూడా తెలంగాణ పల్లెల్లో వెట్టి విస్తృతంగా ఉం డేది. నందమూరి తారక రామారావు గారు కరణాలను, పటేళ్లను, పట్వారీ లను రద్దు చేశాక వెట్టి దాదాపు అంతరించిపోయిందని చెప్పాలి. ఇక కథా విశ్లేషణకి వస్తే పటేల్, పట్వారి, రైత్వారి, జమిందారి, జాగిర్దారీ వ్యవస్థ లకు పెట్టింది పేరు తెలంగాణ ప్రాంతం. ఆ గూడెం యొక్క జాగీర్ గోపాలరావు డబ్బులు ఇచ్చి ఆ డబ్బుల పైన వడ్డీని భారీగా విధిస్తూ తరతరాలు వెట్టి లో బానిసగా పనిచేయడం తెలంగాణ ప్రాంతంలో ఒకప్పుడు సర్వ సాధారణం. ఇక్కడ ఆ గూడెం దొర కూడా అదే తంతును కొనసాగించాడు. ఎప్పుడైతే కమ్యూనిస్టు విప్లవ సిద్ధాం తాలు, విప్లవ భావజాలం పెల్లుబికిందో అప్పటినుండి సామాన్య జనాల్లో చైతన్యం వెల్లు విరిసింది. తెలంగాణ ప్రజానికం ముఖ్యంగా నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ లాంటి ఉత్తర తెలంగాణా ప్రాంతాలు ఈ వెట్టి వ్యవస్థకు లోనయ్యాయి. అత్యంత దుర్మార్గమైన విషయం ఏమిటంటే వీరికి మానవత్వమే ఉండేది కాదు. అమానుషంగా జ్వరం వచ్చిన వ్యక్తి పైన బండలు మోయించి పైశాచికానందాన్ని పొందారు. ఆర్థికంగా హీనస్థితిలో ఉన్నటువంటి మాల, మాదిగలు ఎక్కువగా వెట్టి అనే ఈ సాంఘిక దురాచరానికి గురయ్యారు. నారాయణరావు పటేల్ చెప్పినా కూడా గోపాలరావు అనే పటేల్ వినలేదు. అంటే అక్కడక్కడ ఈ దొరలలో కూడా మానవతా ఛాయలు కనిపిస్తున్నాయి. కానీ అతి తక్కువ. ఈ కథలో బీర్పురి గాడు ఘట్క, సంకటి ఎత్తు కెళ్లడం ఆనాటి ఆకలి కేకలకు సాంకేతంగా కనిపిస్తుంది. ఈరవ్వ మంచితనం ,లసుమవ్వ మానవత్వం, మల్లిగాడు లాంటి మనసున్న పాత్రలు కథ ను చదివే ప్రేక్షకులను ఆకట్టు కుంటాయి. సుంకరోడు, ఇస్తారోడు వంటి అమాయక పాత్రలను సృష్టించడంలో గూడ అంజయ్య తనకు తానే సాటిగా నిలిచాడు. ఈ కథలో కొంగరోని పాత్ర ప్రత్యేకంగా మలిచిన తీరు వైవిద్య భరితంగా ఉంది. చివరికి కొడుకు చదువు ఆగమవుతుందనే ఉద్దేశంతో కథానాయకురాలు ఐన రామపోసు కొడుకును తీసుకొని గంగను దాటి వెళ్ళిపోతుంది. 20 సంవత్సరాల తర్వాత బీర్పురి గాడు అదే గూడేనికి రావడం కొసమెరుపు. అయితే ఈ కథలో రామపోసు ఏమైంది అన్న విషయం రచయిత తెలియ జేయలేదు. బహుశా 20 సంవత్సరాల తర్వాత ఆమె చనిపోయి ఉండవచ్చు అని ప్రేక్షకులు అర్థం చేసుకోవాలి. ఇకనుంచి కథ అంతా కూడా పిచ్చివాడైన బీర్పురి గాడి మీదనే నడుస్తుంది. దొర ఇంట్లో రెండు తులాల బంగారు నగలు దోపిడీకి గురయ్యాయని కనకమ్మ కట్టు కథ అల్లి దొరను రెచ్చగొడుతుంది. ఈ దొంగతనంతో తమకేమి సంబంధంలేని ఈరవ్వ, లసుమవ్వ, దుబ్బమ్మ, పాత్ర లను మలిచిన విధానం అమోఘం. ముఖ్యంగా లచ్చమ్మ పాత్ర ద్వారా దొరల దురాగతాలను ఎండగట్టించి చెప్పిం చడంలో గూడ అంజయ్య తనకు తానే సాటిగా నిలి చాడు. లచ్చమ్మ మాటలను తాళలేకే ఈ దొంగతనం నేపథ్యాన్ని అమాయకుడైన బీర్పురి గాడి వైపు మళ్ళిం చాడు కుట్రపూరితంగా గోపాల్ రావు.

బీర్పురి గాడిని హవల్దార్ వచ్చి గొడ్డును చితకబాదినట్టు చితక్క బాదుతుంటే, గూడెం జనాలు కన్నీటి పర్యంత మయ్యారు. ఏమి చెయ్యలేని తమ అసహాయ తను అసహ్యించుకున్నారు. తాటి చెట్టు పైన రెండు తులాల బంగారు గొలుసు దాచాను అని ఆ దెబ్బలకు తాళలేక అబద్ధం చెప్పినప్పుడు ఎవరూ నమ్మలేదు. బీర్పురి గాడి పైన అందరికీ నమ్మకం ఉంది వాడు దొంగ కాదని. ఆ దెబ్బలకు తాళలేక దొంగతనం తన పైన వేసుకున్నాడని. ఈ దొంగతనం తెలుసుకోగానే దొర గుండు కొట్టించి గాడిద పైన ఊరేగిస్తూ తాటి చెట్టు దగ్గరకు వెళ్ళగా తాటి చెట్టు ఎక్కిన బీర్పూరి గాడు దొరను తూలనాడడం చూసి అక్కడి గూడెం ప్రజలకు చైతన్యం వచ్చింది. అంతలో దొర భార్య కనకమ్మ మెడలో పోయిన రెండు తులాల బంగారు గోలుసు కనిపించింది. అదే విషయాన్ని లచ్చవ్వ చెప్పడంతో ప్రజలు పట్టరాని ఆగ్రహంతో దొర మీద, దొర పరివారం మీద తిరగబడ్డరు. ఇంతటితో ఆ గూడానికి పట్టిన దొర పీడ విరగడయింది.

**కథా వస్తువు :**

"వెట్టి" ప్రధానంగా కథా వస్తువుగా కనిపిస్తుంది .

స్వతంత్రం సిద్ధించాక ఈ దురాచారం ఏ రూపంలో ఉండకూడదు అని రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది కూడా. 78 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో అక్కడక్కడా ఈ వెట్టి దురాచారం ఇంకా ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ఈ దురాచారం ఏ రూపంలో ఉన్నా దాన్ని అంతమొందించాలి.

**కథా నిర్మాణం - శైలి :**

కథ ఆద్యంతం తెలంగాణ యాస, మాండలికాలతో, పలుకుబళ్ళతో, సామెతలతో, ఆమెతలతో విందు భోజనంగా కథ సాగుతుంది. ఆనాటి దురాచారాలు, దుర్మార్గాలు, దోపిడీ వర్గాలు, భూస్వామ్య వ్యవస్థలు, అగ్రవర్ణాలు సాగించిన అమానవీయమైన, హేయమైన దుశ్చర్యను ఆనాటి ఆకలి పరిస్థితులను, సామాజిక నేపథ్యాన్ని ఈ కథ ప్రతిబింబిస్తుంది. నాకు తెలిసి ఈ కథా సంపుటి ద్వారానే గూడ అంజయ్య భారతదేశ కథకులలో పేరెన్నిక గన్నవాడిగా ఎదిగాడు అనిపిస్తుంది. ఈ కథను నిర్మించిన విధానం , కథ, కథా పద్ధతి ఒకదానికొకటి సంబంధం ఉన్న విధం వర్ణనాతీతం. రామపోసు కొడుకుని తీసుకొని వెళ్ళిపోయాక 20 సంవత్సరాల తర్వాత అదే కొడుకు అదే గూడేనికి బీరు పూరి పేరుతో రావడం విచిత్రం. అయినా ఆ గూడెంలోని ప్రజలు ఎవ్వరు కూడా చిన్ననాటి ఆరు సంవత్సరాల బీర్పురి గాడిని గుర్తించకపోవడం కొస మెరుపు. కథను ఆధ్యంతం రక్తి కట్టించి నడిపించాడు. 20 సంవత్సరాల తర్వాత తల్లి ఏమైందో కథకుడు చెప్పలేదు. పాఠకులు ఊహించుకోవాలి తల్లి చనిపోయి ఉంటది అని. అదేవిధంగా కథలోని మాల మాదిగల వ్యథలను వర్ణించిన విధానం వర్ణనాతీతం. కథలోని ఇతర పాత్రల యొక్క మానవీయ కోణం అత్యద్భుతం.

**పాద సూచికలు :**

1. మా ఊళ్లో కూడా నా - కాంచనపల్లి చిన వెంకట రామారావు.
2. దళిత కథలు - గూడ అంజయ్య.
3. కథా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తిరుపతి కథలు - జలవనరుల పరిచయం



- పి. నాగరాజు

పరిశోధక విద్యార్థి,
తెలుగు శాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.

పర్యవేక్షకులు :

- ఆచార్య జర్రా అప్పారావు

తెలుగు ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**ఉపోద్ఘాతం :**

తిరుపతి ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా భాసిల్లే తిరుపతికి రోజు వేలాది భక్తులు తరలివచ్చి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని వెళ్తుంటారు. పూర్వం వందమంది ఉంటే గాని తిరుమలకి భక్తులు వెళ్లేవారు కారు. అలాంటిది మెల్లగా వంద మంది నుండి వందలాదిమందికి వేలాదిమంది ఇంకా చెప్పాలంటే నేడు లక్షల మంది భక్తులు రోజు తిరుపతికి వెళుతుంటారు. అంతటి మహత్తరమైన తిరుమల తిరుపతికి సంబంధించిన విషయాలను కథలుగా అందించిన రచయిత ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి. అన్ని తిరుపతి కథల్ని మూడు సంపుటాలుగా విభజించారు. 1. తిరుపతి కథలు, 2. తిరుమల కథలు, 3. తిరుమల తిరుపతి కథలు. ఒక్కో సంపుటంలో 36 కథలను పొందుపరిచారు. ఈ కథల్లో స్థానిక అంశాలు సాహిత్యం జానపద విజ్ఞానం పురాణాలు వంటి విషయాలను చాలా విపులంగా వివరణాత్మకంగా అందించారు. రచయిత అనుభవాలు అనుభూతులు కూడా ఈ కథలకు కొంత తోడ్పడ్డాయి. తిరుపతిలో పుట్టి పెరిగిన రచయిత, శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని 108 కథా పుష్పాలతో అర్పించినట్లుగా కథా సంపుటం ప్రారంభంలో చెప్పుకున్నారు. ఇంతటి విశిష్టమైన ఈ కథా సంపుటంలో జల వనరులైన నదులు చెరువుల బావులు గురించి ప్రస్తావించిన కథలను ఈ పరిశోధనా వ్యాసంలో పరిచయం చేసి వివరిస్తున్నాను.

సకల జీవరాశికి ప్రాణాధారం నీరు. నీరు లేకుండా మనిషి మనుగడను, నాగరికతను ఊహించడం కష్టమే. భూమిని సస్యశ్యామలం చేసి, జీవచైతన్యాన్ని నింపి, విశ్వాంతరాళంలోని ఇతర గ్రహాల కంటే భూమిని విభిన్నంగానూ, విశిష్టంగానూ ఉంచుతున్నది నీరే. ఆర్థిక ప్రగతితో పాటు మానవుని నీటి అవసరాలు కూడా నానాటికి పెరిగిపోతున్నాయి. త్రాగటానికి, గృహావసరాలకు, భూమిని సాగుచేసి ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసుకోవడానికి, విద్యుదుత్పాదనకు, పారిశ్రామికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు, చేపల పెంపకానికి నౌకాయానానికి, ఇంకనూ మరెన్నో ప్రయోజనాలకు మానవ జీవితంలో అడుగడుగునా నీటి అవసరం ఉంటూనే ఉంది. ఇంతటి విశిష్టతను కలిగిన నీటికి ఆలవాలమైన నదులను పరిరక్షిస్తూ చెరువులు బావులను తవ్వించి వాటిని పరిరక్షించిన ఆనాటి రాజులు ప్రజలకు అందించారు. తిరుపతి పరిసరాలలో అలాగే తిరుమలలో ఉన్న

జల వనరులును గురించి తరుపతి కథల్లో చాలాచోట్ల విపులంగానూ కొన్నిచోట్ల సంక్షిప్తంగాను ప్రస్తావించబడింది.

**స్వర్ణముఖి కథ :**

"తిరుపతి కథల్లో మొట్టమొదటి కథ స్వర్ణముఖి. ఈ కథలో స్వర్ణముకి నది పుట్టిన ప్రదేశము చారిత్రక ఆధారాలు వంటివి చాలా విపులంగా కథలోని పాత్రల ద్వారా వివరించారు రచయిత."

"ఒకప్పుడు స్వర్ణముఖి తిరుపతి కొండని ఆనుకుని ప్రవహించేది.... వర్షాల మూలంగా వేల సంవత్సరాలు కొండమట్టి రాళ్ళు దొర్లి పడటంతో స్వర్ణముఖి నది పక్కకు వేయబడింది. అలా 5 కిలోమీటర్ల వరకు జరిగిపోయింది" అని చెబుతూనే స్వర్ణముకి నది పుట్టుక, పరీవాహక ప్రాంతం, నది ఒడ్డునున్న పుణ్యక్షేత్రాలు, ప్రముఖ ఊర్లు, సముద్రంలో కలిసే చోటును ఒక మ్యాప్ ద్వారా వివరిస్తారు. ఈ నది చంద్రగిరి కొండల్లో అగస్త్యాచల సమీపంలో అంటే పి.కొత్తకోట పక్కనుండే ఆదినేపల్లి గ్రామంలో పుట్టింది. స్వర్ణముఖి పుట్టిన చోటు నుండి కొంతదూరం పయనిస్తూనే, చంద్రగిరి, శ్రీనివాస మంగాపురాల దగ్గర కళ్యాణి, భీమా ఉపనదులను కలుపుకుంటూ తొండవాడ అగస్త్యేశ్వర ఆలయం ముందు సంగమిస్తుంది. అక్కడ త్రివేణి సంగమం అవుతుంది.

స్వర్ణముఖి నది శానంభట్ల, పైడిపల్లి, గొల్లపల్లి, చిగురువాడ, యోగుల మల్లవరం, తిరుచానూరు, జియ్యరుపాళెం, శ్రీకాళహస్తి నాయుడుపేట మీదుగా ప్రవహించి, వాకాడు చేరుకుని అక్కడినుండి సిద్దవరం సమీపంలో బంగాళాఖాతంలో కలుస్తుంది అని వివరిస్తారు. ఇది భౌగోళిక పరమైన వివరణ. అగస్త్యుడి తపస్సు కారణంగా ఇక్కడ స్వర్ణముకి నది పుట్టిందని పురాణ కథను రచయిత ఈ సందర్భంగా వివరిస్తాడు. స్వర్ణముఖి నదిలోని ఇసుక రేణువులు బంగారంలా మెరుస్తాయి కాబట్టి దీనికి స్వర్ణముకి అనే పేరొచ్చిందంటారు. అలాగే స్వర్ణముఖికి ఉన్న ఇతర పేర్లు గురించి వివరిస్తూ, దీనిని మొగిలేరు అని, కేతకీ నది అని, హేమముఖరీ అని, అష్టాపద ముఖరీ, కాంచన ముఖరీ, కనకముఖరీ, పొన్ముఖరీ అనే పేర్లు కూడా ఉన్నాయని రచయిత వివరిస్తారు.

స్వర్ణముఖి నది మధ్యలో కొన్ని బావులు ఉన్నాయి. తిరుపతి ప్రజల తాగునీటి కోసం స్వర్ణముఖి నదిలో బావులు తవ్వి సిమెంట్ వరలతో కాంక్రీట్ వేసి కట్టారు. శ్రీనివాస మంగాపురం దగ్గర ఉండే ఉపనదైన కళ్యాణి నదిలోని బావుల నుండి నీళ్లను గొట్టాల ద్వారా రిజర్వాయరుకు తరలించి తాగునీటి సౌకర్యం కల్పించేవారు. 1976లో కళ్యాణి నదిపై డ్యామ్ కట్టి ఆ నీటిని తిరుపతికి తెచ్చేవారు. తిరుమలలో నీటి ఎద్దడి ఏర్పడటంతో కళ్యాణి నది నీళ్లను గొట్టాల ద్వారా శ్రీవారి మెట్టు గుండా తిరుమలకు తరలిస్తున్నారు. తిరుపతికి నీటి అవసరాన్ని తెలుగు గంగ ద్వారా తీరుస్తున్నారని రచయిత ఈ స్వర్ణముఖి నది ప్రాధాన్యాన్ని వివరిస్తారు. అలాగే పొన్న కాలువ గురించి కూడా ఈ కథలో ప్రస్తావించారు. (తిరుపతి కథలు, స్వర్ణముఖి, పుటలు.. 17 నుండి 26 వరకు)

**తిరుపతి చెరువుల కథ :**

తిరుపతి చుట్టుపక్కల ఉన్న చెరువుల గురించి ఈ కథలో చాలా విస్తారంగా వివరించారు. తిరుపతిలో పెద్ద చెరువు రైల్వేస్టేషన్‌కు పడమటి వైపు నేడున్న పళని టాకీస్కు పక్కన ఉండేది. ఇక్కడున్న రైల్వేగేట్‌కు రాయల చెరువు గేటు అనే పేరు ఇప్పటికీ ఉంది. కానీ ఇప్పుడు ఆ చెరువు లేదు. చిత్తూరు జిల్లాలో చెప్పుకోదగ్గ అతిపెద్ద చెరువు రాయల చెరువు. ఈ చెరువు కట్టమీద నుండే రహదారులపై భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఇంత పెద్ద చెరువుకు రాయలవారు ఏలే కాలంలో పెద్ద ఆనకట్టను రెండు కొండల మధ్య నిర్మించారు. అందుకని ఈ చెరువుకు కూడా రాయల చెరువు అనే పేరొచ్చింది. ఇంతకుముందు చెప్పిన రాయల చెరువు కన్నా ఇది చాలా పదింతల పెద్దది. ఈ రాయల చెరువు వర్షం పడి నిండితే పెద్ద డ్యాంను తలపిస్తుంది. వందల సంవత్సరాల ముందున్న సాంకేతిక పరిజ్ఞానం మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ చెరువు కట్టను పెద్దపెద్ద బండరాళ్లతో మట్టిపోసి నిర్మించారు. చెరువు నుండి బయటికెళ్ళే

తూము ఏడు అంతస్థుల రాతి స్తంభ మంటపాలతో రూపొందించారని అంటారు. ప్రస్తుతం అన్నీ పూడిపోయి మూడు మంటపాలు మాత్రమే కనిపిస్తున్నాయి.

ఇలా తిరుపతిలోని చెరువులు గురించి చెబుతూ, తాళ్లపాక చెరువు, అవిలాల చెరువు, కైకాల చెరువు, పేరూరు చెరువు, ఓలేరు చెరువు, చింతలచేను చెరువు, అక్కారంపల్లి చెరువు, వినాయక్ సాగర్ చెరువు (లింగాలమ్మ చెరువు) మంగళం చెరువు, అన్నా సామి పల్లి చెరువు, వెంకటాపురం చెరువు, రేణిగుంటలో ఉన్న చెరువులు తనపల్లి చెరువు, కుంట్రపాకం చెరువు, తిరుచానూరు చెరువు, పాడిపేట చెరువు, మల్లంగుంట చెరువు, రామానుజ పల్లి చెరువు, కాయం చెరువు వంటి చెరువులు గురించి ఈ కతలో వివరించారు. (తిరుపతి చెరువులు... తిరుపతి కథలు, పుట 161-172)

## తిరుపతి నీటి గుంటల కథ :

ముందు కథలో తిరుపతి చెరువులు గురించి వివరించిన రచయిత ఈ కథలో తిరుపతి నీటి గుంటల గురించి వివరించారు. తిరుపతిలో ఒకప్పుడు నీటి గుంటలకు కొదవేలేదు. తాతయ్య గుంట గురించి మొట్టమొదటిగా ఇందులో చెప్పారు. ఈ నీటి గుంట వెనుక మల్లయ్య గుంట కట్ట పైన తిరుపతి గంగమ్మ వెలిసి పూజలందు కొంటోంది. తాతయ్య కుంటను తిరుమల తాతాచార్యులు అనే వైష్ణవ ప్రచారకుడు తవ్వించాడు అని నీటి వెనకాతల ఉన్న చరిత్ర మొత్తం చెప్తారు. అలాగే గంగమ్మ గుడి ఉన్న మల్లయ్య గుంట గురించి కూడా వివరిస్తారు. క్రీ.శ. 1464లో సాళువ మల్లయ్య దేవ మహారాజు శ్రీవారి ఆలయం ముందు వేయికాళ్ల మంటపాన్ని నిర్మించాడని అంటారు. ఆయన తిరుపతిలో తాతయ్య గుంటకు పడమర వైపు నీటిగుంటను తవ్వించాడని అందుకే దీనికి మల్లయ్య గుంట అనే పేరొచ్చిందంటారు. దీని వెనుక ఉన్న మరో ఐతిహాన్ని కూడా రచయిత ఈ సందర్భంగా వివరించారు.

ఆ తర్వాత కొర్లగుంట గురించి, మురికినేని గుంట, బొమ్మగుంట, రామచంద్రగుంట, మంచినీళ్ల గుంట (నరసింహ తీర్థం), చిన్నగుంట, సింగాలగుంట, తిరుచానూరు మార్గంలో ఉన్న తెల్లగుంట, రేణిగుంట సమీపంలో ఉన్న పూలవాని గుంట, దానికి దగ్గరలో ఉన్న కొరమేను గుంట, తిరుపతిలో బందల దొడ్డిగుంట, మంగళం సమీపంలో చెన్నాయగుంట, తిరుపతి నుండి పెద్దరాయల చెరువుకు వెళ్లే దారిలో ఉన్న చుట్టగుంట, శ్రీపురం కాలనీకి పాలిటెక్నిక్ కళాశాలకు సమీపంలో ఉన్న పాచిగుంట, ఇలా తిరుపతి చుట్టుపక్కల ఉన్న నీటి గుంటల గురించి చాలా వివరంగా వివరిస్తూ చివరలో ఇవన్నీ తిరుపతిలోని నీటి గుంటలన్నింటినీ గుంటనక్కల్లాంటి కబ్జాదారులు ఆక్రమించుకుని వాటి ఉనికి లేకుండా చేసేశారని వాపోతాడు రచయిత. (తిరుపతి నీటి గుంటలు.. తిరుపతి కథలు పుటలు 173-183)

## తిరుపతి దగుడు బావులు - కశం కాలువలు - నీటి బుగ్గలు కథ :

ముందు కథలో తిరుపతిలో నీటి గుంటలు గురించి విపులంగా వివరించిన రచయిత ఈ కతలో తిరుపతిలోని దిగుడు బావులు కశం కాలువలు నీటి బుగ్గల గురించి వివరించారు. "తిరుపతిలో అంకాళమ్మ గుడి ముందు పెద్ద దిగుడుబావి శిల్ప శోభితంగా ఉండేది. బావులను కూడా రాతి కట్టడాలతో కట్టడం విశేషమే. వీటిని కళాత్మక బావులనొచ్చు. తిరుపతిలో ఇలా ఎన్నో దిగుడు బావులు చూడముచ్చటగా ఆనాటి రాజులు చేత నిర్మించబడ్డాయి.". ఇది అత్యంత ప్రాచీనమైనది. అయితే అక్కడ ఒక సినిమా థియేటర్ కడుతూ దానిని పూడ్చేశారని రచయిత తన బాల్యాన్ని గుర్తు చేసుకుంటారు ఇక్కడ. గోవిందరాజస్వామి గుడి వెనకాతల నాలుగు కాళ్ల మంటపం దగ్గర అద్భుతమైన రాతి కట్టడంతో కూడిన దిగుడు బావి ఉంది. ఇది కూడా తిరుపతి చరిత్రలో అపురూపమైంది. అయితే నేటికీ ఇది నిలిచే ఉంది.

ప్రస్తుత దేవస్థానం పరిపాలనా భవనం ముందు శ్రీ గోవిందరాజస్వామి హైస్కూల్ ఉంది. ఇందులో కూడా రాతి కట్టడంతో శిల్ప శోభితమైన దిగుడుబావి మొన్నటి దాకా ఉండేది. అయితే ఈ దిగుడుబావిలో పాఠశాల విద్యార్థులు పడిపోతారనే ఉద్దేశ్యంతో దానిని పూడ్చేశారు. తిరుపతిలో బైరాగి పట్టెడలో కూడా పెద్ద దిగుడు బావి

ఉండేది. ఇది కూడా రాతి స్తంభాలతో శిల్ప శోభితంగా ఉండేది. "ఆనాడు తిరుమల తిరుపతి ఆలయ పాలకులైన మహంతులు, తిరుపతిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన దశావతరాలు గుళ్ళు కట్టాలని నిర్ణయించారు. దానికోసం నేడున్న శ్రీ పద్మావతి మహిళా కళాశాల ప్రాంగణాన్ని నిర్ణయించారు. అక్కడే శిల్పుల చేత అద్భుతమైన రాతి స్తంభాలతో బహుళ అంతస్తులతో శిల్పశోభితమైన దిగుడు బావిని రూపొందించారు. అదే ప్రాంగణంలో మరో దిగుడుబావిని కూడా నిర్మించారు. ఈ ఆలయం పూర్తవ్వక ముందే మహంతులు నుండి అధికారం మారిపోవడంతో ఈ దిగుడుబావులను గాలికొదిలేశారు. అలాగే "అలిపిరిలో వందలాది సంవత్సరాలకు ముందు మెట్ల ప్రారంభంలో ఎడమ వైపు ఒక చూడముచ్చటైన రాతితో నిర్మించిన దిగుడు బావి ఉంది. ఇది ఇటీవలే పాడు పడిపోయింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కూడా చిత్తూరు రోడ్డు పక్కన ఒక దిగుడు బావి ఉంది. దీనిని మహంతులు నిర్మించారు. ఈ దిగుడు బావి నీళ్ల కొన్ని సంవత్సరాల ముందు వరకు యూనివర్శిటీ అవసరాలు తీర్చేది. నేడు ఇది ఎండిపోయి వెలవెలబోతోంది.

తిరుపతిలోని అలిపిరి నుండి తిరుమలకు వెళ్లే దారిలో ఎన్నో గుంటల్లాంటి బావులున్నాయి. ఇక్కడే చుక్కల పర్వతంలోని గాలిగోపురం వెనుక అక్కడున్న అంగళ్ళకు ముందు రాతితో నిర్మించిన అత్యంత ప్రాచీన దిగుడు బావి ఉంది. అలాగే నడక మార్గమధ్యలో ఏడో మైలు దాటుకొంటూనే ముగ్గు బావి కూడా ఉంది. ఇక్కడ బైరాగులు తపస్సు చేసుకుంటుంటారు. ఇక తిరుమలలో కూడా అనేక బావులుండేవి. తిరుపతి కపిలతీర్థం మార్గంలో జలపాత సెలయేరును ఆనుకొని మంగలోళ్ళ బావి ఉండేది. ఇది ఇప్పుడ రోడ్డుకు ఆనుకుని ఉందని దేవస్థానం వారు పూడ్చేశారు. తిరుపతి తీర్థకట్ట వీధిలో తోటలో ఒక రాతి కట్టడమైన దిగుడు బావి ఉండేది. తిరుపతి శ్రీ కోదండ రామాలయంలో కూడా ఒక దిగుడుబావి ఉంది. తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దేవాలయంలో ఉద్యానవనంలో ఒక దిగుడుబావి ఉంది. ఇవన్నీ యాత్రికులకు తాగునీటి వసతులను కల్పించడానికి నిర్మించినవి.

"దిగుడు బావులే కాదు కశం కాలువలు కూడా ఆనాటి యాత్రికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి" అని చెబుతూ తిరుచానూరు పంచమికి స్వర్ణముకి నది ఒడ్డు నుండే కశం కాలువకి వెళ్లి వచ్చేవారని గుర్తు చేసుకుంటారు. అలాగే ఇంకొక కశం కాలువ దురాక్రమణకు గురైపోయిందని అనుకుంటారు. తిరుపతికి మొదట వచ్చే ప్రధాన కూడలి అయిన రామానుజ సర్కిల్‌కు మురికి కాలువలైపోయాయి. రాయల చెరువు రోడ్డులో అవిలాల గ్రామం ఉంది. అక్కడ మజ్జిక కాలువ ఉంది. అవిలాల చెరువుకువేదాంతపురం అగ్రహారం దగ్గర కూడా ఒక కశం కాలువ ఉండేది. చంద్రపేటను ఆనుకుని ఉండే భాగ్య నగరంలో కూడా అతి పెద్ద కశం కాలువ ఉండేది. తిరుపతి తిరుచానూరుకు మధ్యలో ఉండే ఒకే ఒక మలుపులో అంటే తనపల్లికి వెళ్లే దారిలో ఒక కశం కాలువా ఉండేది. చుట్టుగుంట రామాపురంలో కూడా కశం కాలువ ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి.

"ఇలా ఎన్నో కశం కాలువలు ఆనాడు పంట పొలాలకు పారి తిరుపతిని సస్యశ్యామలం చేశాయి. బావుల్లో గుంట్లో నీటిమట్టాలు పెంచాయి. తిరుపతికి బహుదూరాల నుండి వచ్చి యాత్రికులకు నీటి వసతులు కల్పించాయి. అలాంటి కశం కాలువలు కబ్జాదారుల వల్ల కాలగర్భంలో కలిసిపోయాయి" అని రచయిత వాపోయాడు.

గోవిందరాజస్వామి గుడిలో నీటి బుగ్గలు ఉండేవి. 30 ఏళ్ల నుండి వీటి ప్రాభవం కోల్పోవడం ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం గోవిందరాజస్వామికి బుగ్గ ఉత్సవం జరగడం ఆనవాయితీ. గోవిందరాజస్వామి గుళ్ళో ఒక నీటి బుగ్గ వెలుపల అంటే నేడు లేపాక్షి ఎంపోరియం ఉన్నచోట రెండో నీటి బుగ్గా ఉండేవి అని వాటి గురించి చెప్తూ అవి ఎలా కనుమరుగైపోయాయో మననం చేసుకుంటూ, "తిరుపతి పుణ్యభూమి అనే ఆభరణంపై పొదిగిన మణులు మాణిక్యాలు, నీలాలు, పచ్చలు, కెంపులు, వజ్రాలే చెరువులు గుంటలు దిగుడు బావులు కష్టం కాలువలు, నీటి బుగ్గలు, కోనేరులు. వీటితో మిలమిలా మెరిసిన తిరుపతి నేడు ఇవి కనుమరుగైపోతుండడంతో వెలవెల పోతోంది" అని రచయిత

వాపోతాడు. (తిరుపతి దిగుడు బావులు - కళం కాలువలు - నీటి బుగ్గలు - తిరుపతి కథలు - పుట 184-192)

**ముగింపు :**

ఒక్క క్రతువు సేయ దక్కు పుణ్యము కంటె
చెరువునొకటి ద్రవ్య శ్రేష్ఠతరము,
ఒక తటాక ఖననమొసగు పుణ్యము కంటె
పడిన గండి, బూడ్చ బహుసుకృతము
(ఆంధ్రమహాభారతం)

ఒక యజ్ఞం చేయటం కంటే ఒక తటాక నిర్మాణం గొప్పదని, దానికంటే చెరువు గట్టుకు పడిన గండిని పూడ్చటం వల్ల మరింత పుణ్యఫలం కలుగుతుందని మహాభారతంలో ప్రవచించబడింది. అలాంటి ప్రవచనాల ప్రభావం వల్ల ప్రాచీన కాలంలో రాజులు, వదాన్యులు, ఎన్నో చెరువులను త్రవ్వించి వాటి నిర్వహణకు మాన్యం పేరిట అవసరమైన భూమిని, నిధులను సమకూర్చి పెట్టారు. ఈ విధంగా గండి చెరువు గ్రామ సామాజిక జీవనంలో ఎంతో గౌరవ స్థానాన్ని పొంది ఉండేవి. గుడి జనానికి శాంతిని, ఆనందాన్ని ప్రసాదిస్తే చెరువు ఆహారాన్ని, సౌభాగ్యాన్ని కలుగజేస్తుందని నమ్మేవారు. ఎక్కడైనా చెరువుకు గండిపడితే, ఊరు ఊరంతా తరలి వచ్చి గండిని పూడ్చేవారు. కాని, ఈనాడు అలా వచ్చేవారేరి? ఆనాడు ప్రజల దాహార్తిని తీర్చిన దిగుడు బావులను చెరువులను కాలువలను నగరాభివృద్ధి పేరుతో ఎక్కడికి అక్కడ పూడ్చేస్తున్నారు. వాటి విలువలను భవిష్యత్ తరాలకు తెలియకుండా చేస్తున్నారు. తిరుపతి చుట్టు ప్రక్కల ఉన్న జల వనరులను చాలా ఓపికగా చాలా వివరణాత్మకంగా ఈ కథా సంపుటిలో రచయిత అందించారు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. వీరయ్య చెరుకూరి, జల వనరులు, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, హైదరాబాద్, 2012.
2. శ్రీనివాసులరెడ్డి పేట, తిరుపతి కథలు, ఎమ్మెస్కో ప్రచురణ, హైదరాబాద్, 2021.
3. సీతారామాచార్యులు బి., శబ్దరత్నాకరము, ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీస్, న్యూఢిల్లీ, 1988.
4. సుబ్రహ్మణ్యం జి.వి., (సంపా.), కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, టీటీడి ప్రచురణ, 2013.

★★★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి కథలు - కుటుంబ జీవన చిత్రణ



- పల్లపు పవన్ కుమార్

పరిశోధకులు, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్టణం.

**ఉపోద్ఘాతం :**

విలువలు అనేవి తరతరాలుగా కుటుంబ వారసత్వ సంపదగా స్వీకరించబడుతూ కొనసాగాలి. పెద్దలంటే గౌరవం బాధ్యత పిల్లలకు ఉండాలి అలాగే సంతానాన్ని తీర్చిదిద్ది వారిని సంఘ బాటలో సవ్యంగా పయనింపజేసే విధి కన్నవారిది. అలాగే బంధుమిత్రులను పరిసర వాసులను కలుపుకొని వెళుతూ ఓ ఉత్తమ జీవనాన్ని సంతృప్తికరంగా గడపడం ఎంతో అవసరం. అందుకే బంధాలు ఎప్పుడు స్వచ్ఛమైనవి. వాటిని నిలుపుకోవటం, కాపాడుకోవడం ప్రధాన విధి. ఒకప్పుడు సమిష్టి కుటుంబాలు మూడు, నాలుగు తరాలను ఒకే ఇంటి నీడలో కలిపి బతికేలా ఉండేవి. పిల్ల తరాలకు ప్రత్యేకించి ఏమీ నేర్పనవసరం లేకుండానే విలువలను జీవితంలో భాగం చేసుకునే వైనాలుండేవి. అక్కడ ఆనందాలు, బాధ్యతలు, బాధలు, ఓదార్పులు, తీర్పులు, ఆచరణలు వంటివి అందరూ కలిసి పంచుకునేవారు. అందుకే లోటు, అసంతృప్తులు, తప్పులు పెద్దగా దొర్లేవి కావు. కానీ కాలంతో పాటు వచ్చిన పరిణామాలు చిరు కుటుంబాలను పెద్ద కుటుంబాల స్థానంలో వెలసి ఇలా చేశాయి. అలాగే విశాల హృదయాలు కాస్త సంకోచించి స్వార్థం అనేదాన్ని కలుపుకొని మార్పులు తెచ్చాయి. అవి రక్త సంబంధాలను కూడా ఆర్థిక కోణంలో చూస్తూ రూపాయి కున్న విలువ వ్యక్తులకు లేవనే తత్వాలను పెంచి పోషించాయి. దీంతో హక్కులకు ఎగబడుతున్న సంతానాలు కౌటుంబిక విధులను గాలికి వదిలాయి.

ఆధునిక కుటుంబ జీవనాల అస్తవ్యస్థల్ని గమనిస్తూ ఉన్న సాహితీకారులు తమ వంతు ప్రయత్నాలు చేశారు. అత్యుత్తమం ఏదో, అధమం ఏదో నిస్సంకోచంగా తెలియజేయడానికి కథా ప్రక్రియను వినియోగించు కున్నారు. అటువంటి మార్గంలోనే వెళ్లి నేటి సమాజానికి ఏం కావాలో ఆ రకమైన విలువల ప్రభోదాన్ని రచయిత చేయడం మెచ్చుకోదగినది. కన్నవారి బాధ్యతల్ని మరచే తనయులు తమ రెక్కలు సవరించుకొని ఎదిగిపోతున్నారు. అలాగే కొందరు పెద్దలు కొన్ని తప్పులు చేయడం చూస్తే వారు తర్వాత తరాలకు ఏం నేర్పుతున్నారో తెలియడం లేదు. మనిషికి మనిషికి ఉన్న రక్తసంబంధాల మధ్య రూపాయి చేరింది. అది సరికాని దారుల్లోనికి, పయ నింపచేయడం వంటివి కుటుంబానుబంధాలకు బీటలు వేస్తుంది. అలాంటి దృక్పథాలు విలువలనెరగనివి. వాటిని తెలిపే కథలు కొన్ని బాధ్యతలు విలువలెలా ఉండాలో ఉదహరించి చూపే కథలు కొన్ని ఇక్కడి కథలలో కనిపించాయి.

**నాయనమ్మగారి ఊరు :**

ఈ కథ 'తెన్నేటి కతలు' కథల సంపుటిలోనిది. ఈ కథను 'తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి' రాసారు.

**కథా సంగ్రహం :**

సుధ, కిరణ్ దంపతులు. తమ కొడుకు చింటూతో పాటు పట్నంలో ఉంటారు. చింటూ పట్టు పట్టడంతో వేసవి సెలవులకు తల్లిదండ్రులు ఉండే సరిపల్లెకు బయలుదేరుతారు. వెంకన్న దంపతులు ఆనందిస్తారు. కిరణ్ చెల్లెలు శ్రీనిధి, ఆమె భర్త తేజ వారి పిల్లలైన వరుణ్, కోమలితోపాటు అక్కడికి చేరుకుంటారు. నానమ్మ చేతి వంటలు, తన ఈడు పిల్లలతో మాటలు, ఆటలు, తాతయ్య కథలు, పొలాలకు వెళ్లడం అన్నీ గమనించటం నేర్చుకోవటం చింటూకి నచ్చుతాయి. పనిచేసే సత్తియ్యని పాముకరిస్తే తన తాత వెంకన్న ధైర్యం చెప్పి వైద్యం చేయించడం, పని వారిని కూడా తమతోపాటు సమానంగా చూడటం, కులమతాలకు అతీతంగా ఆదర్శ వంత రచ్చబండ తీర్పులు ఇవ్వడం గమనిస్తాడు. రెండు రోజుల తర్వాత సుధ, కిరణ్, తేజ ఊరెళ్ళిపోతారు. సెలవులు ముగిసాక పిల్లలు వారి వారి ఇళ్ళకు వెళ్తారు. పల్లె నుండి తిరిగి వచ్చాక చింటూలో బాగా మార్పు వస్తుంది. తన తోటి విద్యార్థి చదువుకై తను దాచుకున్న డబ్బును అందించడం, విలువలతో ప్రవర్తించడం వంటివి చేస్తాడు. సుధ కొడుకు గురించి ఆశ్చర్యపోతుండగా, కిరణ్ పల్లెలోని తన అమ్మానాన్నల వద్ద ఉండి రావటం వలన మంచి వ్యక్తిత్వం అలవడిందని అంటాడు.

**విశ్లేషణ :**

కుటుంబాల్లో పెద్దల మార్గదర్శకత పిల్లల గుణశీల వికాసం, విలువలను పెంపొందించేలా చేయగలదని ఈ కథ నిరూపించింది. వయసురీత్యా, అనుభవరీత్యా లోకజ్ఞాన పరులైన బామ్మ, తాతలు వృద్ధులైనా వారి మాటలు చద్దన్న మూటలు. వాటి రుచినెరిగే తరాలలో మంచి చెడుల విచక్ష నలవడుతుంది. ఆధునిక కాలంలో పిల్ల తరాలు పట్టణాల్లో వృద్ధతరాలు పల్లెల్లో ఉండి పోతున్నాయి. ఈ దూరాలు తరాల వారధిని కూల్చేయడమే కాకుండా అందాల్సిన నైతికత, బంధాల గ్రాహ్యతలు పిల్లలకు అందవు. అందుకే తప్పనిసరై దూరంగా ఉండాల్సి వచ్చిన సెలవల్లోనూ, ఖాళీ సమయాల్లోనూ అవ్వ తాతలు, అత్తమామలు, పెద్దమ్మ పెదనాన్నలతో కలిసి వారి పిల్లలతో కలిసి మనగలగాలి. అక్కడ ఆట పాటలైనా, పొలాలు, పరిసరాలైనా రచ్చబండలైనా, జీవన విధానాలైనా విషయజ్ఞానాన్ని అందిస్తాయి. శారీరక, మానసిక సామర్థ్యాలు, స్పందనలు, మానవత్వం, మానవ సంబంధాల వంటివి అలవడగలవని కథ సోదాహరణ యుక్తంగా తెలిపింది. అందుకే తరాల మధ్య సంధానత అవసరం. అది మార్గదర్శకతతో కూడినదై లోక గ్రాహ్యత, ఆత్మీయ, అనుబంధాలనూ పెంపొందించేదిగా ఉం టుందని తెలియజేసింది.

మనిషి పుట్టుకతోనే దేన్నీ నేర్చుకుని జన్మించడు. అనుసరణ, అనుకరణ అనేవి తనవారి నుండి, చుట్టు పక్కల నుండి స్వీకరిస్తాడు. తద్వారా అన్నింటినీ నేర్చు కుంటూ ఎదుగుతాడు. ఒక వయసు వచ్చేసరికి పరిణితి, అవగాహనలను పొందగలడు. అవన్నీ అతడిని వ్యక్తిగా ఎలా ఉండాలో, కుటుంబ బాధ్యతల్నెలా స్వీకరించాలో, సమాజంలో తనదైన స్థానాన్ని దక్కించుకొని పదిమందికి ఎలా సాయపడాలో నేర్పుతాయి. అప్పుడే జీవన సార్థకత, సాఫల్యం చేకూరి సంపూర్ణ మనిషిగా, తృప్తిగా ఉండే దారిని పొందగలడు. అదే దారిని తన తర్వాత వారికి బాటగా ఏర్పరచగలడు. అన్నీ ఆకళింపు చేసుకోగల చిరుప్రాయంలో చింటూ తన నానమ్మ గారి ఊరెళ్ళాడు. అక్కడ నానమ్మ, తాతయ్యలు చెప్పిన కథలు, వివరించిన విశేషాలు ఉపయుక్తమైనవి. అప్పటిదాకా అల్లరి చిల్లరి బాలుడైన చింటూ ఏం నేర్చి ఎలా మారాడో, కారకులెవరో చింటూ తండ్రి అయిన కిరణ్ తన భార్యతో చెబుతున్న మాటల ద్వారా రచయిత వ్యక్తపరిచాడు. పసివారికి అందాల్సిన విలువల సారాల అవసరాన్ని, మార్గాన్ని సూచించారు.

"సుధా వాడిది నేర్చుకునే వయసు. వాడికి మా అమ్మ నాన్నలు చాలా విషయాలు నేర్పారు. మా నాన్నగారికి ఉన్న మంచి పేరు, నాయకత్వం, సమర్థత, దానగుణం, సాయపడే తత్వం నీకు తెలియనివి కావు. మన చింటూగాడు తాతయ్యను ఇన్స్పిరేషన్గా తీసుకున్నాడు. అందుకే వాడు చాలా మంచి విషయాలు నేర్చుకున్నాడు

ఇప్పుడు వాడి స్కూల్లో వాడే హీరో"

పెద్దల నుండి పిల్లలకు ప్రేరణ ఎలా లభించి విలువలు నేర్వగలరో తెలుస్తోంది. ఈ మాటలు చూస్తే ఓ కుర్రాడు తన తండ్రి వద్ద కన్నా తాతయ్య వద్ద చదువుతోనూ, దగ్గరతనంతోనూ వ్యవహరిస్తాడని అర్థం చేసుకోవచ్చు. మనవడు, తాతల అనుబంధం ఎప్పుడూ పెద్దవారి అడుగుజాడల్లో పిల్లవాడు అనేలా ఉంటాయి. ఆ బంధానికి అడ్డువేయక వృద్ధతరంతో మనవల తరాన్ని కలిపి ఉంచాలి. నేటి జీవన విధానాన్ని చూస్తే చిన్న కుటుంబాలే గానీ, సమిష్టి కుటుంబాలు లేవు. తండ్రి ఉద్యోగం, తల్లి ఉద్యోగం లేదా ఇంటి పనుల్లో పిల్లలు బడి చదువుల్లో అనేలా ఒక్కొక్కరు ఒక్కో దిక్కు అవుతున్నారు. తాతయ్య మామ్మలు ఇంట ఉంటే మనవడి, మనవరాలి ఆలనాపాలనలో సంస్కారం, విలువలు వంటబట్టే విధంగా వ్యవహరిస్తారు. కేవలం పిల్లలకు అనే కాకుండా పెద్దవారు కూడా వృద్ధ తరం నుండి ఎన్నో నేర్చుకోవలసి ఉంటుంది. 'పల్లెటూర్లో ఏం తోస్తుంది?' 'కుదురుతుందంటారా' అంటూ ఇష్టం లేకుండా పయనమైన సుధా అత్తమామలతో కొంత ముభావంగా ఉంది. సత్తియ్యని తమతో పాటు భోజనానికి కూర్చోనివ్వడాన్ని తప్పు పట్టి అహంకరించింది. అదే ఊరు నుండి తిరిగొచ్చాక మార్పు చింటూ లోనే కాకుండా సుధా కూడా మారింది. 'చదువు లేని మనుషుల వద్ద ఏమి ఉంటుందిలే' అని సుధలా అనుకునే కోడళ్లే అధికం. ఆ చిన్న చూపుతగదని ప్రాంతాల్నో, మనుషులనో, అంతరాలనో చూసి అంచనా వేయకూడదని వ్యక్తిత్వాలను తెలుసుకొని గౌరవించాలని తెలుసుకోవాలి. సుధా మనసు మబ్బులు తాలగడం, కుటుంబ విలువల్ని ఆమె పెద్దలైనా అత్తమామల నుండి గ్రహించినట్లు అలాంటి వారి మార్పుని ఆశించారని తెలుస్తోంది. పెద్దల వద్ద మెలిగినప్పుడే అత్తమామలు అమ్మానాన్నల వంటి వారేనన్న ఆత్మీయత తెలుసొస్తుంది. ఆడపడుచు, వదినల సఖ్యతలు, బావా బావమరుదుల స్నేహాలు వంటివి కుటుంబ పటిష్టతలకు నిదర్శనం ఇవన్నీ సుధా, కిరణ్ చవిచూసారు. పైగా ఈసారి సెలవులకు నేనే ముందుగా సరిపల్లె వెళతానని సుధచే పలికించి సమిష్టి కుటుంబ మాధుర్యాన్ని ఒక్కసారి చూస్తే వదలని చెప్పే ఉద్దేశాన్ని కనబరిచారు. వీలైనంతగా అందుబాటులో తరచూ రాకపోకలతో బాధ్యతలు చూపడం బంధాలను నిలుపుకోవడం చేయగలిగితే కుటుంబ వ్యవస్థ కలకాలం వర్ధిల్ల గలదనే సందేశాన్ని కూడా కథలో మిళితం చేసి ఆలోచింపజేశారు.

బంధాలు అస్తవ్యస్తమై రక్త సంబంధాలు బహుదూరపు పరిస్థితుల్లో మిగిలిపోతుండడం కుటుంబాలకు మంచిది కాదు. పిల్లలకు ఏమీ నేర్పలేని బతుకులో పరిగెడుతూ మూలాలు మరిచిపోతున్నాం. కనీసం పిల్లల్ని వృద్ధ తరంతో కలిపి ఉంచితే వారెన్నో మంచి విషయాలు తెలుసుకోగలరు. పాఠాల్లో లేనివి ఎప్పుడూ జీవిత పాఠాల్లో ఉంటాయి. అవన్నీ జీవన పుట్టలను నిండుగా ఉంచగలవు. క్రమశిక్షణ సమయపాలన విలువలు అనేవి ఎప్పుడూ పిల్ల తరాలకు పాకేలా ఉండాలి. ఆ అవకాశం లేని చోట తరానికి తరానికి బంధాలు బాధ్యతలు కూడా బలహీనమైపోతుంటాయి. అదే 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే సూత్రంపై పనిచేసే సమిష్టి కుటుంబ తరాలు పరిపుష్టంగా ఉండగలవు. ఆదర్శాలైన, సంస్కరణలైనా, విశాలతలైనా, శ్రమ జీవనాలైనా పెద్దవారు నుండి వారసత్వంగా లభింపజేసే కుటుంబ సారాలు ఎప్పుడు ఉన్నతమైనవి. వాటిని మరచిపోయి మనుషులు మనసులు బహుదూరాలవుతున్న నవీన తరుణాలు చూస్తున్నాం. ఎవరికి వారే ఉన్నప్పుడు నష్టపోయేది కుటుంబాలే. ఈ సత్యం తెలిపిన కథ ఓ కుటుంబం ఎలా ఉంటే వ్యక్తిత్వాలు తీర్చిదిద్దబడగలవో కళ్ళ ముందుంచింది. వీటన్నింటిని సమాహారమైన కథతో నాయనమ్మ గారి ఊరెళ్ళమని ఆదేశించినట్లుంది.

## పరిచయం :

ఈ కథ 'సింహతలాటం' కథా సంపుటి లోనిది. ఈ కథను 'తెన్నేటి లక్ష్మీనరసింహ మూర్తి' రాసారు. ఏప్రిల్ 29వ తేదీ, 2021 సంచికలో 'వెలుగు జ్యోతి' పత్రిక ఈ కథను ముద్రించింది.

**కథా సంగ్రహం :**

నరసింహం, శ్రీను అన్నదమ్ములు. అన్న వ్యవసాయ

దారుడు కాగా తమ్ముడు విద్యాసంస్థలకు అధిపతి. పెళ్లీడుకొచ్చిన శ్రీను కూతురు జానకికి ఎన్నో సంబంధాలు వస్తాయి. వాటిలో అబ్బాయి విదేశీ ఉద్యోగి కనుక బెజవాడ సంబంధం శ్రీనుకి, అతని భార్య వానికి అన్ని విధాలా నచ్చుతుంది. అమ్మాయిని అంత దూరం పంపడం పట్ల ఇష్టపడని నరసింహం బంధాలు అందు బాటులో ఉంటే బాగోగులకు ఇబ్బంది ఉండదని తమ్ముడితో చర్చిస్తాడు. జానకి పెద్దలందరి నిర్ణయం ఏదైతే దానికే కట్టుబడతానని అంటుంది. పెళ్లిళ్ల పేరయ్య మాత్రం జానకి జాతకం చూసిన తన గురువుగారు విదేశీయానం లేదన్నాడని గుర్తు చేస్తాడు. కానీ జాతకాలు మాత్రం బాగానే కలిసాయని సెలవిస్తాడు. బెజవాడ సంబంధం వారు పెళ్లిచూపులు, మాటలకు తొందర పెడతారు. కానీ వారి బంధువుల మరణవార్త వలన కొంతకాలం ఆగి వస్తామని తెలియజేస్తారు. దీంతో అన్ని విచారించేందుకు తగిన సమయం దొరికిందన్న నర సింహం మాటతో అందరూ ఏకీభవిస్తారు.

**విశ్లేషణ :**

కుటుంబ విలువలు పాటించబడితే ఆ ఇంట బంధాల బలీయత స్పష్టంగా కనిపిస్తుంది. అన్నదమ్ముల అనుబంధాలు, పెద్దలు మాటకు విలువిచ్చే పిల్లలు ఉన్నప్పుడు ఏం నిర్ణయమైనా ఒకటికి పది సార్లు ఆలోచించి తీసుకోబడుతుంది. ఎవరికివారుగా ఉంటూ రక్త సంబంధాలకు విలువ ఇవ్వని ఈ కాలంలో ఇటు వంటి కథలు ఎంతో అవసరం. పూర్వం సమిష్టి కుటుం బాలలో ప్రతిదీ ఓ విలువల ప్రాతిపదిక కలగలిసిన తనా లతో జరుగుతుండేది. ఇప్పుడు ఆ సమిష్టి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు తప్పనివయ్యాయి. కానీ ఎవరు ఎక్కడున్నా ఒకరిపై ఒకరికి ప్రేమ ఆప్యాయతలు ఉంటే పరస్పర సంబంధాలు బాగుంటాయి, కుటుంబ రక్త సంబంధాల్లో సోదర బంధం గొప్పది. ఇరువురికి పెళ్ళిళ్ళై వారి వారి కుటుంబాలలో వేర్వేరు చోట్ల ఉన్న ఒకరి మాటకు మరొకరు ముఖ్యతని ఇచ్చుకోవడం కుటుంబ ధర్మాల్లో ఒకటి. కూతురు పెళ్లి సంబంధం పెళ్లి పిలుపు, కుటుంబ పెద్ద అయిన అన్న నుండి వెళ్లాలని తమ్ముడు ఆశించాలి అది సాంప్రదాయం. అలాగే తమ్ముడి కూతురు పెళ్లికి తానే పెద్దగా మంచి చెడుల విచారింపులతో ముందుకెళ్లడంలో అన్నగారి శ్రద్ధ ప్రస్ఫుటం కావాలి.

'నేను', నా ఇల్లు, నా భార్యాబిడ్డలు అని గీతలు గీచుకొని అన్నదమ్ములు సొంతవారిలా కాకుండా బంధువు లుగా, పరిచయస్తుల్లా మెలగడం నాగరికత అను కుంటున్న రోజులివి. అలాంటి వారికి ఎవరెక్కడున్నా ఆత్మీయతలు అనేవి మధ్య ఉంటే ఒకే మాట, ఒకే ప్రాణం అనేలా ఉండవచ్చు అనేది అర్థం కావాలి. అలాగే విదేశీ సంబంధమని శ్రీను వాళ్ళు ఉత్సాహపడినా అంత దూరం పంపి కూతుర్ని వదిలి ఉండగలవా? అని నర సింహం అనడంలో నిర్ణయాల్లో తొందరపడితే బంధాలు దూరం కాకూడదని అనుభవం ఉంది.' పిల్లకి ఏదైనా సమస్య వస్తే వెంటనే దగ్గరకు వెళ్ళగలగాలి. దేశం కానీ దేశం పంపితే ఇవన్నీ జరుగుతాయా' అని చెప్పడంలో ఆడపిల్లకి పెళ్లి చేసిన ఆమె బలం, బలగం పుట్టిల్లే. పుట్టింటి అండ ఆమె బాగు, భవిష్యత్తుకి ఉండాలని అర్థం. ఏ కష్టం వచ్చినా, ఆనందం వచ్చినా పంచుకునే వారు పక్కనే ఉండాలి. అంతేగాని గొప్పలకు విదేశీ సంబంధాలు అని వెళితే కొన్ని సంకటాలు రావచ్చని ముందుచూపు సరైన నిర్ణయానికి అవసరం. అది కూడా వైవాహిక బంధాలు కలుపుకునే ముందు 'అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు' చూడాలని అంటుంటారు. అవన్నీ పెద్దలు గమనించి సరిపడే సంబంధాన్ని ఆడ పిల్లలకు భద్రత, భరోసా అనేవి పుట్టింటి, అత్తింటి ఉమ్మడి బాధ్యతగా నిర్వర్తించాలి. అంతేగాని విదేశీ సంబం ధాలు అని ఎంతో కట్నాలు పోసి పెళ్లిళ్లు చేస్తే అక్కడకు వెళ్లిన ఆడపిల్లలు కొందరు నరక ద్వారాలు చూస్తారు. అటువంటి నమ్మక ద్రోహాలు వివాహాల పేరుతో జరుగుతున్నాయి. దేశం కానీ దేశంలో మన అనే ఆసరా లేక కట్టుకున్న వాడి దాష్టీకాలకు బలైపోతున్న ఆడపిల్లల యదార్థ బతుకులు ఉన్నాయి. అందుకే ముందు గనక విచారించాల్సిన విధి వైవాహిక బంధాలు కుదర్చడంలో పెద్దలదేనని గుర్తు చేశారని గ్రహించవచ్చు. అందుకే నిశిత పరిశీలననేది పెద్దలకుండటం కుటుంబ విలువల్లో భాగమని తెలియపరిచారు.

ఇదే కథలో జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం పెళ్లి. కనుక దాని విషయంలో యువత ఎలాంటి కుటుంబ విలువలు పాటించాలో తెలియపరిచారు. నేటి రోజుల్లో 'నా పెళ్లి', 'నా ఇష్టం' అనే స్వతంత్ర భావజాలం కుటుంబాల్లోని యువతరంలో నెలకొంది. ఇది ఆధునిక మాయాజాలం, స్వేచ్ఛ కావచ్చు, ఆకర్షణలు కావచ్చు, కాల మార్పులు కావచ్చు. కాకుంటే అవి ఒక్కోసారి తొందరపాటు తనానికో, అపసవ్య నిర్ణయానికో దారి తీయవచ్చు. ముఖ్యంగా 'ప్రేమ' అనేది ప్రవేశించి పెళ్లిపై ప్రభావాలను చూపడం సాధారణమైంది. ప్రేమించడం తప్పు కాదు. కానీ సరైన వాడిని ఎంపిక చేసుకోలేక ఒక్కోసారి మోసపు ఉచ్చుల్లో చిక్కుకోవచ్చు. అనుభవ లేమి, సరైనదేదో నిర్ణయించుకోలేని అమాయకత్వానికి గురి చేయడం జరుగుతుంది. వయసు తొందర్లో కుటుంబ పెద్దలకు అతీతమైన దారిలోనికి మరలుస్తుంది. అలాంటి తప్పిదాలు చోటు చేసుకుంటే జీవితకాల శిక్షలు పడే అవకాశాలు నిండుగా ఉంటాయి. అందుకే జానకి పాత్ర ఒదిగిన తీరుని కుటుంబ విలువల్లో భాగం చేయడం గమనార్హం.

ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలకు అత్యుత్తమ జీవితాన్ని ఇవ్వాలని తపిస్తారు. దాన్ని సంతానాలు కూడా గుర్తిస్తాయి. కానీ తాము కోరుకున్నది పెద్దలు అంగీకరించరేమోనని సంశయాలతో ప్రేమ పెళ్లి విషయంలో తప్పటడుగులు వేస్తుంటారు. అలా అని పెద్దలు చూసే సంబంధాలు అన్ని సవ్యం అని చెప్పలేము. కానీ ఏ కష్టం వచ్చినా తన వారి అండ అనేది ప్రేమ వివాహాల్లో కొంత తక్కువ అనే చెప్పాలి. అలాంటి భద్రత ఆడపిల్లలకు అందించే కుటుంబ అండని కోల్పోకూడదనే ఉద్దేశ్యం రచయితకు ఉందనిపించింది.

'పెదనాన్నా, నాన్న, అమ్మ చిన్నప్పటినుంచి నాకు ఏది మంచో? ఏది కావాలో? సమయానికి సమకూర్చారు. అలాంటిది నా పెళ్లి విషయంలో ఇంకెంత జాగ్రత్తగా ఆలోచిస్తారో చెప్పండి? ఒకవేళ వాళ్ళు ఏ పొరపాటు పడినా మీరు ఉన్నారు కదా పెదనాన్నా' అంటూ పెద్దల నిర్ణయాలు పట్ల పూర్తి సంతృప్తిని ప్రకటించిన జానకి మాటలు నేటి తరానికి అవసరం. ఎప్పుడు, ఏది, ఎలా నిశ్చయించడానికి తగినదో పెద్దలకు తెలుసు. వారు పిల్లల ప్రేమలకు వ్యతిరేకం కాదు. వారి అతి జాగ్రత్తని తప్పుగా అర్థం చేసుకునే యువత పెళ్లిళ్ల విషయంలో కన్న వారిని కష్టపెడుతున్నారు. కానీ జానకి ఎంతో చదువుకున్న అమ్మాయి అయినా సహనశీలి పెద్దలంటే గౌరవం కలది. కౌటుంబిక విలువలు ఎంత ముఖ్యమో తెలిసిన వ్యక్తిత్వాలు పెద్దలను నొప్పించవు. తమ మంచి వారికి తెలుసుననే నిశ్చింతని ప్రదర్శిస్తూ బంధాలను ఉన్నతంగా ఇనుమడింపచేసుకుంటారు.

కుటుంబం అంటేనే ఆ ఇంట ఉండే సభ్యులందరి మధ్య ప్రేమ పరస్పర అనురాగాలు ఉండాలి. భార్యాబిడ్డల విలువను గుర్తించే ఇంటి పెద్దకు వారి సహకారం లభిస్తే ఆ ఇల్లు స్వర్గధామం అవుతుంది. 'నా మనోధైర్యం మా ఆవిడ అయితే, నా సంకల్పానికి శ్రీకారం మా అమ్మాయే' అన్నట్టి శ్రీను ఓ ఉత్తమ భర్త. అలాగే అత్యుత్తమ తండ్రి. ఏది అందిస్తే అదే తిరిగి వస్తుంది కనుక శ్రీను అందించిన ఆత్మీయతలే అతనికి తిరిగి తనవారి నుండి అందాయి. పెద్దవాడైన అన్న మాటని జవదాటని తమ్ముడుగా ఒక్కోసారి దానికి భిన్నమైన నడతతో ఉన్నా తిరిగి సరిచేసుకునే తత్వం సోదర బంధాన్ని ఒక మెట్టు ఎక్కించేదే అలాగే విలువలపై కట్టిన కుటుంబ పునాదిపై అనుబంధాల పొదరిల్లు ఎప్పటికీ చెక్కుచెదరనిది. ఇప్పటి కుటుంబాలలోని బీటలు విలువలు లేని తనాలకు నెలవులు. అలాంటి వారికి అన్యోన్యత, అనురాగాలు అలముకున్న ఇంటిని పరిచయం చేసే ఉద్దేశ్యమే ఇటువంటి కథల పుట్టుకకు కారణమని తెలియవచ్చింది.

**ఆధార గ్రంథాలు :**


1. సింహతలాటం - కథల సంపుటి - తెన్నేటి లక్ష్మీ నరసింహం
2. రథాయాత్ర - కథల సంపుటి - తెన్నేటి లక్ష్మీ నరసింహం
3. తెన్నేటి - కథల సంపుటి - తెన్నేటి లక్ష్మీ నరసింహం
4. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు భాషా శాస్త్ర వికాసానికి ఆచార్య నాయని కృష్ణకుమారి సేవలు



- గొడిపేరు సురేష్
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ, విక్రమ
సింహపురి విశ్వవిద్యాలయం.

- డా॥. ఈశ్వరమ్మ
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ
దొడ్ల కౌశల్యమ్మ మహిళా కళాశాల
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం



## విషయ సంగ్రహం (Abstract) :

ఈ పరిశోధనా పత్రం, ఆచార్య నాయని కృష్ణకుమారి (1930-2016) తెలుగు భాషకు చేసిన మౌలికమైన, శాస్త్రీయమైన సేవలను విశ్లేషిస్తుంది. ఆమెను కేవలం ఒక సాహిత్యవేత్తగా కాకుండా, ఆధునిక తెలుగు భాషా శాస్త్ర రంగంలో ఒక మార్గదర్శకురాలిగా ఈ పత్రం ప్రతిపాదిస్తుంది. ఆమె కృషి ప్రధానంగా మూడు భాషాశాస్త్ర విభాగాలలో కేంద్రీకృతమై ఉంది: (1) జానపద భాషాశాస్త్రం (Folkloristic Linguistics): ఆమె 'తెలుగు జానపద గేయ గాథలు' (1974) నుండి నిర్మించిన "మౌఖిక భాషా నిధి" ప్రాముఖ్యత, దాని ద్వారా మాండలికాలను గ్రంథికరించడం (2) సామాజిక భాషాశాస్త్రం (Sociolinguistics) : ఆమె జానపద సేకరణ మరియు 'అగ్నిపుత్రి' (1978) వంటి సృజనాత్మక రచనల ద్వారా స్త్రీవాద పదజాల పరిభాషను ఎలా నిర్మించారు. (3) అనువర్తిత భాషాశాస్త్రం (Applied Linguistics) : 'పరిశోధన', 'తెలుగు భాషా చరిత్ర' వంటి గ్రంథాల ద్వారా పాఠ్యాంశాన్ని వచనాన్ని (academic prose) నిర్మించడం మరియు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా భాషా ప్రణాళికను (language planning) ఆచరణలో పెట్టడం. ఆమె పరిశోధన, తెలుగు భాష యొక్క సరిహద్దులను పునర్నిర్వచించడమే కాకుండా, భవిష్యత్ పరిశోధనకు అవసరమైన పద్ధతిశాస్త్ర ఉపకరణాలను (methodological tools) అందించిందని ఈ పత్రం నిర్ధారిస్తుంది.

## ముఖ్య పదాలు (Keywords) :

నాయని కృష్ణకుమారి, తెలుగు భాషా శాస్త్రం, పరిశోధన (పద్ధతిశాస్త్రం), జానపద భాషాశాస్త్రం, సామాజిక భాషాశాస్త్రం, అనువర్తిత భాషాశాస్త్రం, మౌఖిక భాషా నిధి, మాండలిక విజ్ఞానం, స్త్రీవాద భాషాశాస్త్రం, భాషా ప్రణాళిక.

## 1. పరిచయం

### 1.1. నేపథ్యం :

20వ శతాబ్దపు మధ్యకాలంలో, తెలుగు భాషా అధ్యయనం ప్రధానంగా చారిత్రక భాషాశాస్త్రం మరియు వ్యాకరణ సూత్రాలకే పరిమితమై ఉండేది. భాష యొక్క జీవమైన, సామాజిక రూపమైన మాండలికాలు, ప్రజల

వాడుక భాష విద్యాపరంగా చిన్నచూపుకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో, ఆచార్య నాయని కృష్ణకుమారి ప్రవేశం, తెలుగు భాషా అధ్యయనానికి ఒక నూతన, శాస్త్రీయ దిశను చూపింది.

**1.2. పరిశోధన ఉద్దేశ్యం :**

ఈ పరిశోధన యొక్క ముఖ్య ఉద్దేశ్యం, ఆచార్య కృష్ణకుమారిని ఒక బహుముఖ భాషా శాస్త్రవేత్తగా ఆమె చేసిన సేవలను శాస్త్రీయంగా విశ్లేషించడం. జానపద, సామాజిక, మరియు అనువర్తిత భాషాశాస్త్ర రంగాలలో ఆమె ఎలా కొత్త పుంతలు తొక్కారో సోదాహరణంగా నిరూపించడం ఈ పత్రం యొక్క లక్ష్యం.

## 2. జానపద భాషాశాస్త్రం (Folkloristic Linguistics) :

**ఒక మౌఖిక భాషా నిధి నిర్మాణం :**

ఇది ఆమె చేసిన అత్యంత మౌలికమైన భాషాశాస్త్ర సేవ. ఆమె జానపద సేకరణను కేవలం సాహిత్య సేకరణగా కాకుండా, ఒక క్రమబద్ధమైన "మౌఖిక భాషా నిధి"

**1. ధ్వనిశాస్త్ర గ్రంథికరణ :**

ఆమె 'తెలుగు జానపద గేయ గాథలు' కోసం సేకరించిన తెలంగాణ జానపద గేయాలలో, ప్రామాణిక భాషలోని ఓష్ఠ్య స్పర్శరహిత ధ్వని /వ/ తరచుగా ఓష్ఠ్య స్పర్శ ధ్వని (బరి) మారడం (ఉదా : వాన > బాన) స్పష్టంగా కనిపిస్తుంది (కృష్ణకుమారి, 1974, పే. 45). ఇది కేవలం ఉచ్చారణ దోషం కాదు, ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని క్రమబద్ధమైన ధ్వని పరిణామం (systematic phonological rule). ఆమె సేకరణ ఈ నియమానికి సహజమైన వాతావరణంలో ఆధారంగా నిలుస్తుంది.

**2. ప్రాంతీయ అచ్చుల ఉచ్చారణ :**

ఆమె సేకరణలోని పాటలలో కొన్ని ప్రాంతాలలో 'ఎ' కారం 'య' కారంగా పలకడం (ఉదా: చెయ్యి > చెయి) వంటి సూక్ష్మమైన ఉచ్చారణ భేదాలు భద్రపరచబడ్డాయి (కృష్ణకుమారి, 1974, పరిశీలన). ఇది మాండలికాల మధ్య ఉన్న సూక్ష్మ ధ్వని భేదాలను (subtle phonetic variations) అధ్యయనం చేయడానికి ఉపయోగ పడుతుంది.

**3. పదనిర్మాణ శాస్త్ర వైవిధ్యం :**

ప్రామాణిక భాషలో "వెళ్తున్నాడు" అనే క్రియ, ఆమె దాఖలు చేసిన తెలంగాణ పాటలలో "పోతాండు," "వెళ్తాండడు" వంటి రూపాలలో కనిపిస్తుంది (కృష్ణ కుమారి, 1974, పే. 112). ఇది తెలుగు క్రియారూపాల వైవిధ్యాన్ని, ముఖ్యంగా సహాయక క్రియల (auxiliary verbs) వాడకంలో ఉన్న ప్రాంతీయ భేదాలను అధ్యయనం చేయడానికి ఒక ఆధారం.

**4. విభక్తి ప్రత్యయాల భేదం :**

ప్రామాణిక భాషలోని 'చేత' ప్రత్యయానికి బదులుగా, ఆమె సేకరించిన జానపద భాషలో 'తోని' అనే ప్రత్యయం వాడకం (ఉదా: రామునిచేత > రామునితోని) స్పష్టంగా కనిపిస్తుంది (కృష్ణకుమారి, 1974, పే. 89). ఇది కారక విభక్తి (case markers) వాడకంలో ఉన్న మాండలిక వైవిధ్యాన్ని సూచిస్తుంది.

**5. వృత్తి-సంబంధిత పదకోశం :**

చేనేత కార్మికులు వాడే 'పడుగు,' 'పేక,' 'అచ్చు,' 'కండె' వంటి పారిభాషిక పదజాలం ఆమె సేకరణ ద్వారా భద్రపరచబడింది (కృష్ణకుమారి, 1974, పే. 215). ఇది ఒక నిర్దిష్ట వృత్తి సమూహం యొక్క ప్రత్యేకమైన భాషా ప్రపంచాన్ని (specialized occupational lexicon), వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని భద్రపరుస్తుంది.

**6. గృహ సంబంధిత పదజాలం :**

'అంబలి,' 'సంకటి,' 'గంజి' వంటి ఆహార పదార్థాలకు, 'రోకలి,' 'తిరగలి' వంటి పనిముట్లకు సంబంధించిన స్వచ్ఛమైన తెలుగు పదాలు ఆమె సేకరణలో భాగం (కృష్ణకుమారి, 1974, పల్లె పదాలు విభాగం). ఆధునిక జీవన విధానంలో వాడుకలోంచి కనుమరుగవుతున్న దేశీయ పదజాలాన్ని (native vocabulary) పరిరక్షించడం దీని ప్రాముఖ్యత.

**7. సంస్కృతి-నిర్దిష్ట పద అంశాలు :**

ఆమె విశ్లేషించిన 'బతుకమ్మ,' 'బొడ్డెమ్మ,' 'సీమంతం' e+{ ì | ¥'\ T ½e\ + | ¥'\ T ¿±e\ú అవి వాటితో ముడిపడి ఉన్న మొత్తం సాంస్కృతిక ఆచారాలను సూచిస్తాయి (కృష్ణకుమారి, 1974, పే. 178). ఈ పదాలు, భాషకు మరియు సంస్కృతికి మధ్య ఉన్న విడదీయరాని సంబంధాన్ని (Sapir-Whorf hypothesis) అధ్యయనం చేయడానికి ఉపయోగపడతాయి.

**8. జాతీయాల పరిరక్షణ :**

ఆమె జానపద గేయాలలో "కడుపులో చల్ల కదల కుండా," "గుండె చెరువవడం," "నోట్లో మట్టి కొట్టుట" వంటి శక్తివంతమైన జాతీయాలు, వాటి అసలైన వాడుకలో నిక్షిప్తమై ఉన్నాయి (కృష్ణకుమారి, 1974, జాతీయాల విభాగం). జాతీయాలు ఒక భాష యొక్క సృజనాత్మకతకు, భావ వ్యక్తీకరణ సామర్థ్యానికి ప్రతీకలు. ఆమె సేకరణ ఈ భాషా సంపదకు ఒక నిధి.

**9. వాక్య నిర్మాణంలో భేదాలు :**

జానపద గేయాలలో తరచుగా వాక్య నిర్మాణం సరళంగా, పునరావృతమయ్యే పద్ధతిలో ఉంటుంది. "వచ్చెనమ్మా వచ్చెను, సీతమ్మ తల్లి వచ్చెను" వంటి పునరుక్తి వాక్యాలు మౌఖిక సంప్రదాయంలోని వాక్య నిర్మాణ శైలిని (syntax of orality) చూపుతాయి.

**10. సంభాషణా శైలుల గ్రంథికరణ :**

ఆమె సేకరించిన అత్తాకోడళ్ల పాటలు, తల్లికూతుళ్ల పాటలలోని సంభాషణలు ఆనాటి సామాజిక సంబంధాలను, సంభాషణా శైలులను (conversational styles) ప్రతిబింబిస్తాయి.

## 3. సామాజిక భాషాశాస్త్రం (Sociolinguistics) :

భాష, లింగం మరియు అధికారం ఆమె కృషి, భాషకు మరియు సామాజిక నిర్మాణాలకు మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేసే సామాజిక భాషాశాస్త్రానికి ఒక అద్భుతమైన విశ్లేషణ

**1. లింగ-ఆధారిత పదజాల క్షేత్రాలు :**

ఆమె 'తెలుగు జానపద గేయ గాథలు'లో (1974) సేకరించిన పురుషుల వీరగాథలు మరియు స్త్రీల పాటల మధ్య పదజాల క్షేత్రాలలో స్పష్టమైన విభజన కనిపిస్తుంది. ఇది స్త్రీ పురుషుల సామాజిక ప్రపంచాలు వేర్వేరుగా ఉండటం వల్ల, వారి భాషా ప్రపంచాలు కూడా వేర్వేరుగా ఎలా నిర్మించబడతాయో చూపిస్తుంది.

**2. సంబోధన రూపాలు :**

జానపద పాటలలో, భార్య భర్తను నేరుగా పేరు పెట్టి పిలవకుండా, "మా వారు," "ఓ చందమామ" వంటి పరోక్ష సంబోధనలను ఉపయోగించడం నాటి సామాజిక కట్టుబాట్లను సూచిస్తుంది (కృష్ణకుమారి, 1974, పే. 155). ఇది భాషలోని గౌరవ సూచకాల (honorifics) ద్వారా సామాజిక అంతరాలను, అధికార సంబంధాలను ఎలా ప్రదర్శిస్తారో చూపిస్తుంది.

**3. క్రియాశీలక vs. నిష్క్రియాత్మక వాక్యాలు :**

ఆమె విశ్లేషణ ప్రకారం, వీరగాథలలో పురుషుడు కర్తగా (Active) ఉంటే, స్త్రీల పాటలలో తరచుగా స్త్రీ కర్మగా (Passive) ఉంటుంది. వివరణ: ఇది భాషా నిర్మాణం ద్వారా స్త్రీల నిష్క్రియాత్మక పాత్రను (passive role) సమాజం ఎలా నిర్మిస్తుందో, బలపరుస్తుందో వివరిస్తుంది.

**4. అధికార భాష :**

వీరగాథలలోని పురుషుల భాష ఆదేశాలతో నిండి ఉంటే, స్త్రీల పాటల భాష విన్నపాలు, విలాపాలతో నిండి ఉంటుంది. ఇది భాషా వినియోగం ద్వారా సామాజిక అధికారాన్ని (social power) ఎలా ప్రదర్శిస్తారో, నిలబెట్టుకుంటారో చూపిస్తుంది.

**5. ప్రశ్నల సరళి :**

స్త్రీల పాటలలోని ప్రశ్నలు తరచుగా సమాధానం ఆశించని ఆవేదనాభరితమైన ప్రశ్నలుగా (rhetorical questions) ఉంటాయి. వివరణ: ఇది వారి నిస్సహాయతను, తమ వాదనను వినిపించే అవకాశం లేక పోవడాన్ని భాషాపరంగా సూచిస్తుంది.

**6.'అగ్నిపుత్రి'లో అర్థ పునర్నిర్మాణం :**

ఆమె తన ప్రఖ్యాత కవితా సంకలనం 'అగ్నిపుత్రి' (1978) లో, 'అగ్ని' అనే పదం యొక్క సాంప్రదాయ

అర్థాలైన 'పవిత్రత,' 'శుద్ధి'లను దాటి, దానికి 'తిరుగుబాటు,' 'శక్తి,' 'అస్తిత్వం' అనే కొత్త అర్థాలను ఆపాదించారు (కృష్ణకుమారి, 1978, పే. 10). ఇది ఒక పదం యొక్క అర్థ క్షేత్రాన్ని (semantic field) అర్థవంతమైన చేతన పూర్వకంగా విస్తరించి, స్త్రీవాద పదజాల పరిభాషను ఎలా నిర్మించవచ్చో చూపిస్తుంది.

**7. "గడప" ప్రతీకను మార్చడం :**

'అగ్నిపుత్రి'లోనే (1978), 'గడప'ను స్త్రీకి ఒక పరిమితిగా కాకుండా, స్వేచ్ఛ వైపు మొదటి అడుగుగా, ఒక "ఆరంభ రేఖ"గా పునర్నిర్వచించారు (కృష్ణకుమారి, 1978, పే. 25). ఇది భాషలోని ప్రతీకలను తీసుకొని, వాటి అర్థాన్ని తలక్రిందులు చేయడం ద్వారా (symbolic inversion) పితృస్వామ్య భావజాలాన్ని సవాలు చేయడం.

**8. శారీరక భాష :**

ఆమె 'అగ్నిపుత్రి' (1978) కవిత్వంలో, స్త్రీ శరీరాన్ని కేవలం సౌందర్య వస్తువుగా కాకుండా, కోరికలు, అనుభూతులు ఉన్న ఒక క్రియాశీలక అస్తిత్వంగా వర్ణించారు. ఇది స్త్రీ శారీరక అనుభవాలకు (corporeal experience) భాషలో ఒక స్థానాన్ని కల్పించడం.

**9. ధిక్కార స్వరం :**

ఆమె కవిత్వంలోని "మేమెవ్వరం?", "మా బతుకులింతేనా?" వంటి సూటి ప్రశ్నలు పితృస్వామ్య వ్యవస్థను, దాని నియమాలను నేరుగా ప్రశ్నిస్తాయి (కృష్ణకుమారి, 1978, పే. 42). ఇది భాషను నిరసన సాధనంగా (language as a tool of protest) ఉపయోగించడం.

**10. కోడ్ - స్విచ్చింగ్ (Code-Switching) :**

ఆమె 'ఆయాతా' కథలలోని ఆధునిక స్త్రీ పాత్రలు, ఆఫీసులో, ఇంట్లో, స్నేహితులతో మాట్లాడేటప్పుడు తమ భాషను మార్చడం ద్వారా, తమ బహుళ గుర్తింపులను ప్రదర్శిస్తాయి.

**వివరణ :**

ఇది ఆధునిక సమాజంలోని బహుళ సామాజిక పాత్రల మధ్య ఒక వ్యక్తి తన అస్తిత్వాన్ని భాష ద్వారా ఎలా నిర్మించుకుంటాడో చూపిస్తుంది.

## 4. అనువర్తిత భాషాశాస్త్రం (Applied Linguistics) :

భాషా ప్రణాళిక మరియు బోధన ఆమె పాండిత్యం కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాలేదు; ఆమె దానిని బోధన మరియు భాషా ప్రణాళికకు అనువర్తింపజేశారు.

**1. పద్ధతిశాస్త్ర నిర్మాణం ('పరిశోధన') :**

ఆమె 'పరిశోధన' వ్యాస సంకలనంలో, పరిశోధనకు "విషయ నిర్ధారణ" (Topic Selection) ఎలా చేయాలో, దాని పరిధిని ఎలా నిర్ణించుకోవాలో శాస్త్రీయంగా వివరించారు (కృష్ణకుమారి, పరిశోధన).ఇది పరిశోధనను ఒక క్రమబద్ధమైన, శాస్త్రీయ ప్రక్రియగా మార్చే ప్రయత్నం.

**2. ఆధార సేకరణ మార్గదర్శకాలు :**

అదే గ్రంథంలో, "ప్రాథమిక మరియు ద్వితీయ శ్రేణి ఆధారాలు" (Primary and Secondary Sources) మధ్య తేడాను, వాటిని ఎలా సేకరించాలో వివరించారు. వివరణ: ఇది పరిశోధనలో, ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వడం.

**3. సిద్ధాంత గ్రంథ నిర్మాణం :**

'పరిశోధన'లోనే, ఒక పరిశోధనా గ్రంథాన్ని అధ్యాయాలుగా ఎలా విభజించాలి, పీఠిక, విషయ విశ్లేషణ, ముగింపు ఎలా రాయాలో ఒక నమూనాను అందించారు.

**4.క్షేత్రస్థాయి పరిశోధన యొక్క ప్రాముఖ్యత :**

'పరిశోధన'లో, జానపద విజ్ఞానంలో క్షేత్రస్థాయి పరిశోధన యొక్క ప్రాముఖ్యతను, అందులో పాటించవలసిన మెళకువలను తన అనుభవంతో వివరించారు. వివరణ: ఇది భాషను దాని సహజ వాతావరణంలో అధ్యయనం చేయడమే సరైన పద్ధతి అని నొక్కి చెప్పడం.

**5. 'తెలుగు భాషా చరిత్ర'లో శాస్త్రీయ స్పష్టత :**

ఆమె 'తెలుగు భాషా చరిత్ర' గ్రంథంలో, భాషాశాస్త్రంలోని 'తాలవ్యీకరణ' (Palatalization) వంటి ధ్వని పరిణామ సూత్రాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా సోదాహరణంగా వివరించారు ( పే. 67).

**వివరణ :**

ఇది సంక్లిష్టమైన శాస్త్రీయ భావనలను బోధనా శాస్త్ర

(pedagogy) అవసరాలకు అనుగుణంగా సరళీకరించడం.

**6. పాఠ్యపుస్తక నిర్మాణం :**

'తెలుగు జానపద విజ్ఞానం: సమాజం, సంస్కృతి, సాహిత్యం' అనే పాఠ్యపుస్తకాన్ని రచించి, జానపద విజ్ఞానాన్ని ఒక ప్రామాణిక విద్యా విభాగంగా మార్చారు. ఇది జ్ఞానాన్ని ప్రజాస్వామికీకరించడం (democratization of knowledge) మరియు కొత్త అధ్యయన రంగాలకు పునాది వేయడం.

**7. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా :**

తన పదవీకాలంలో (1996-1999), ఆమె అంతరించిపోతున్న గిరిజన భాషలైన చెంచు, కోయ, గోండి వంటి వాటి పదకోశాలను సేకరించి, నిఘంటువులను రూపొందించే ప్రాజెక్టులను ప్రోత్సహించారు.

**8. స్థితి ప్రణాళిక (Status Planning) :**

తన పరిపాలనా హోదాలో, జానపద విజ్ఞానాన్ని, తులనాత్మక సాహిత్యాన్ని విశ్వవిద్యాలయ సిలబస్‌లో ముఖ్యమైన విభాగాలుగా చేర్చడం ద్వారా, వాటి "స్థితిని" (status) పెంచారు. ఇది నిర్లక్ష్యం చేయబడిన భాషా సాహిత్య రూపాలకు విద్యాపరమైన, సంస్థాగతమైన గుర్తింపును తీసుకురావడం.

**9. నిఘంటు నిర్మాణ ప్రోత్సాహం :**

ఆమె జానపద పదకోశ సేకరణ, భవిష్యత్తులో మాండలిక నిఘంటువులు, వృత్తిపదకోశాల తయారీకి పరోక్షంగా పునాది వేసింది.

**10. సంస్థాగత నిర్మాణం :**

తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద మరియు గిరిజన విజ్ఞాన పీఠాన్ని బలోపేతం చేసి, నిర్లక్ష్యం చేయబడిన భాషా మరియు సాహిత్య రూపాల అధ్యయనానికి ఒక శాశ్వత వేదికను కల్పించారు.

**ముగింపు :**

ఆచార్య నాయని కృష్ణకుమారి తెలుగు భాషా అధ్యయనానికి ఒక ఆధునిక, శాస్త్రీయ దృక్పథాన్ని అందించిన మార్గదర్శకురాలు. ఆమె ఒక జానపద భాషావేత్తగా అంతరించిపోతున్న పదజాలాన్ని పరిరక్షించారు; ఒక సామాజిక భాషావేత్తగా భాషలోని అధికార సంబంధాలను విశ్లేషించారు. స్త్రీవాద భాషావేత్తగా భాష యొక్క అర్థ సరిహద్దులను చెరిపివేశారు. ఒక అనువర్తిత భాషావేత్తగా పాండిత్య భాషను ప్రజాస్వామికీకరించి, భాషా ప్రణాళికకు దోహదపడ్డారు.

## ఆధార గ్రంథాలు (References)

**ప్రాథమిక ఆధారాలు :**

1. కృష్ణకుమారి, నాయని. (1974). తెలుగు జానపద గేయ గాథలు. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
2. కృష్ణకుమారి, నాయని. (1978). అగ్నిపుత్రి. సికింద్రాబాద్: యువభారతి.
3. కృష్ణకుమారి, నాయని. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమీ. (ప్రచురణ సంవత్సరం నిర్ధారించుకోవాలి).
4. కృష్ణకుమారి, నాయని. (1977). పరిశీలన.
5. కృష్ణకుమారి, నాయని. పరిశోధన (వ్యాస సంకలనం).

**ద్వితీయ శ్రేణి ఆధారాలు :**

1. రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపద గేయ సాహిత్యము. హైదరాబాద్.
2. భద్రిరాజు కృష్ణమూర్తి.తెలుగు భాషా చరిత్ర.
3. చేకూరి రామారావు (చేరా). తెలుగులో వాక్యం.
4. సత్యవతి, కె. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ధోరణులు.

★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# వాడ్రేవు చినవీరభద్రుడు మొదటి పని గంట వేళ కథలో సామాజిక జీవన చిత్రణ



- కొత్తకోట శ్రీనివాసరావు
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ, ఆంధ్ర
విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.

పర్యవేక్షకులు :
- డా॥. రమావత్ కుసుమ కుమారి
తెలుగు అధ్యాపకురాలు
డా॥ వి.యస్. కృష్ణా డిగ్రీ ప్రభుత్వ
కళాశాల , విశాఖపట్నం



## రచయిత పరిచయం :

వాడ్రేవు చినవీరభద్రుడు గారు 1962 మార్చి 28వ తేదీన తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) రాజవొమ్మంగి మండలంలో ఒక చిన్న గిరిజన పల్లె 'శరభవరం'లో జన్మించారు. తల్లిదండ్రులు సత్యవతి, విశ్వేశ్వర వెంకట చలపతి.

చినవీరభద్రుడు గారు సాహిత్యలోకంలో మంచి కవిగా, రచయితగా, అనువాదకుడిగా, వక్తగా, విమర్శకుడిగా, చిత్రకారుడిగా తనదైన ముద్ర వేశారు. సాహిత్య రచనలో కేవలం ఒక ప్రక్రియకు మాత్రమే పరిమితం అవ్వాలన్న ఆలోచన లేకుండా విస్తృతమైన జీవితాను భవాల్ని తన సృజనతో విస్తృతమైన సాహిత్య ప్రక్రియల ద్వారా తెలియజేశారు.

ఈయన 40కి పైగా పుస్తకాలు రాశారు. వాటిలో వివిధ పత్రికలలో కథలు, ఒక నవల, మూడు యాత్రా చరిత్రలు, ఒక కథా సంకలనం, ఏడు కవితా సంపుటాలు, ఒక కవితా సంకలనం, మూడు బాలల వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, ఏడు వ్యాస సంపుటాలు, ఒక వ్యాస సంకలనం, పదహారు అనువాద పుస్తకాలు ఉన్నాయి. వీటితో పాటు వివిధ పత్రికలలో కాలమ్స్ కూడా రాశారు.

## మొదటి పనిగంట వేళ :

ఈ కథ మొదటిసారి రెండు వేలులో వార్త దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. తరువాత రెండు వేల ఇరవై మూడు మార్చిలో ఎమెస్కో ప్రచురించిన 'వాడ్రేవు చినవీరభద్రుడు కథలు' కథాసంపుటంలో ఓ కథగా ప్రచురించడమైనది.

## కథాసంగ్రహం :

కనక సుందరం ప్రజాపాలనలో అత్యవసర సర్వీసులకు చెందిన ఓ కార్యాలయంలో ఉద్యోగి. అతను చదివిన చదువు సంగతేమో గాని ఆఫీసులో అతని తెలివితేటలకు తగిన పని అప్పగించబడింది. ఈ అంశం తన కొలీగ్స్‌తో పాటు పై అధికారుల్ని కూడా బాగా ఆకట్టుకొంటుంది. ఇతను తెలివితేటలలో ఎంత గొప్పవాడంటే తను చూస్తున్న ఫైళ్ళకు సంబంధించిన విషయాలలో తమషాకి తనే ఏదన్నా అబ్జెక్షన్స్ లేదా సందేహాలు లేవనెత్తుతాడు. వాటికి అవసరమైన క్లారి

ఫికేషన్స్ కోసం పై అధికారులు ప్రభుత్వం నుండి రాబట్టడానికి ప్రయత్నిస్తే, ఆ సందేహాలు ఎంతదూరం ప్రయాణించినా వాటికి పరిష్కారాలు చెప్పగలిగేవారు కనిపించడం అసాధ్యం. తిరిగి పై అధికారులు సందేహాల నివృత్తికి కనకసుందరాన్నే బతిమలాడేవాళ్లు. అదే కొలీగ్స్ అయితే కనకసుందరాన్ని ప్రాధేయపడవలసిందే. ఇలాంటి తెలివితేటలు కలిగిన కనకసుందరం సీటుకి ఓ క్లిష్టమైన సమస్య పరిష్కార బాధ్యత అప్పగించబడుతుంది. ఆ క్లిష్టమైన సమస్య ఏమిటంటే పై అధికారికి ఓ సామాన్యుడు ప్రజాఫిర్యాదు (పబ్లిక్ గ్రీవెన్స్)గా రాసిన ఓ పోస్టుకార్డు ఈ కనకసుందరానికి ఎండార్స్ చేయబడుతుంది. ఆ కార్డులో రాయబడ్డ ఫిర్యాదు సారాంశాన్ని అతను చదువుతాడు. ఆ కార్యాలయంలో ఎంతోమంది ఉద్యోగులుంటే అధికారి దానిని తనకే ఎందుకు పంపించాడా అని కనక సుందరం ఆలోచిస్తుంటాడు. ఆఫీసులో ఎన్నో ప్రభుత్వ సంబంధమైన సర్క్యులర్లలోని సందేహాల్ని గమనించి, పై అధికారులకు ఎన్నో విధాలుగా నోటు రాసే కనకసుందరం ఈ ఫిర్యాదును ఎలా పరిష్కరించాలా అన్న విషయాన్ని పక్కన పెట్టి దానిలోని సమస్య పరిష్కారం గురించి ఆలోచించకుండా దాని నుంచి ఎలా తప్పించుకోవాలా? అని తీవ్రంగా ఆలోచిస్తుంటాడు. తనతో పని చేసే కార్యాలయ సిబ్బందంతా ఆఫీస్‌లో ప్రశాంతంగా పని ప్రారంభిస్తుంటే (అదే మొదటి గంట సమయంలో) కనకసుందరం మాత్రం ఆఫీస్‌లోని అడుగుపెట్టిన వెంటనే ఆ ఫిర్యాదుకార్డునే చూస్తూ ఏమీ పట్టించుకోకుండా దాని పరిష్కారం నుంచి తప్పించుకొనే మార్గం గురించి ఆలో చిస్తుంటాడు. అదే విషయాన్ని అలా ఆలోచిస్తూ చిన్న నిద్రలోకి జారుకుంటాడు. ఆ విషయానికి సంబంధించే ఓ కల కూడా కంటాడు. కలలో ఆ ఫిర్యాదు పరిష్కార బాధ్యత నుంచి తప్పించుకున్నట్లు, కల కని ఆనంద పడతాడు. చివరికి అది కల అని తెలిసి అశాంతికి లోనవు తుండడంతో కథ ముగుస్తుంది.

**కథాసమీక్ష :**

ఈ కథలో రచయిత ప్రజోపయోగకరమైన సామాజి కాంశాన్ని ఇతివృత్తంగా స్వీకరించారు. ముఖ్యంగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార మార్గంలో జరిగే అలసత్వాన్ని రచయిత ఇతివృత్తంగా తీసుకొన్నారు. దానికి ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగుల మనస్తత్వాలు, కొంతమంది అధికారుల ప్రవర్తనలు, కార్యాలయాల వాతావరణాన్ని జోడించి ఈ సామాజిక కథ రాశారు. కథలో ముఖ్యపాత్ర కనక సుందరం. ప్రభుత్వ ఉద్యోగులకు ఓ మోడల్ అని చెప్పవచ్చు. రచయిత ముఖ్య పాత్ర పేరుని మూడు నాలుగు విధాలుగా రాయడం కనిపిస్తుంది. ఒక చోట కనకసుందరం లేదంటే కాదంబరం, మరో చోట కరుణా కరం, కోదండరామం, కిరీటి, ధనుంజయం... ఇలా రకరకాల పేర్లు పెట్టడం చూస్తే ప్రభుత్వ ఉద్యోగులలో నున్న ఎన్నో కులాలకు, మతాలకు సంబంధించిన వారన్నమాట.

ఎందుకంటే ప్రభుత్వ ఉద్యోగులలో అలసత్వం ప్రదర్శించేవారు కానీ, అవినీతి చేసేవారు కానీ భారతదేశం లోని అన్ని కులాలలో మరియు అన్ని మతాలలో ఉన్నా రని చెప్పడం రచయిత ఉద్దేశం. ఈ రెండు అంశాలకు ఏ కులం, ఏ మతం అతీతం కాదు. కనకసుందరం స్వభావం, తెలివితేటలు ఎలాంటివో రచయిత వివరిం చిన తీరు ఇలా ఉంది. కనకసుందరం ఈ మహా ప్రభుత్వ యంత్రాంగాన్ని అతనే నడుపుతున్నట్లు భావించు కొంటుంటాడు. నిజానికీ భావన సమాజంలో కొంతమంది ఉద్యోగులలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉద్యోగానికి సంబంధించి పెద్దగా సర్వీసు లేకపోయినా, చిన్న వయస్సు లోనే సహోద్యోగులకంటే ఎక్కువగానే తెలివితేటలు ప్రదర్శిస్తుంటాడు. చిన్నవయస్సులోనే ప్రజల వ్యవహారాల్ని పట్టించుకొన్నట్లుగా, ప్రజల క్షేమం కోరుతున్నట్లుగా, ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వ అభిప్రాయాల్ని విప్పి, విరిచి, అనుగుణంగా మార్చి రాయడంలో కనకసుందరం సంపాదించుకొన్న ప్రావీణ్యం అతని సహోద్యోగులతో పాటు, పై అధికారుల్నీ ఆశ్చర్యా నికి గురి చేస్తుంటుంది. కొన్ని రకాల క్లిష్ట సమస్యలకు అతని దగ్గర తగిన పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయం కలుగుతుంది. ఇంత గొప్ప తెలివితేటలు (లిటిగెంట్

వ్యవహారాలు) కలిగిన కనకసుందరానికి దొరగిలిన కాయ పండబోతున్నప్పుడు ఎక్కడ నుంచో ప్రవేశించిన సూక్ష్మ క్రిమిలా ఆఫీసుకు వచ్చిన ఓ ప్రజాఫిర్యాదు గురించి ముందడుగు వేయడానికి కనకసుందరం జంకుతుంటాడు. పైగా ఆ ఫిర్యాదు పరిష్కారం బాధ్యత నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. ఆ ఫిర్యాదు రూపంలో వచ్చిన కార్డు ఎవరు రాశారు? అది వాళ్ల ఆఫీసుకు సంబంధించిందేనా? దానిని తనకు ఎండార్స్ చేసిన అధికారి ఆ ఫిర్యాదు పూర్తిగా అర్థం చేసుకొన్నారా? ఆఫీసులో ఎంతోమంది ఉద్యోగులుంటే ఫిర్యాదు పరిష్కారం గురించి తనకే ఎందుకు పంపాలి అని ఆలోచిస్తుంటాడు. ఆ ఆలోచనల్లోనే మరో ముందడుగు కూడా వేస్తాడు. అదేమిటంటే ఫిర్యాదు రాయబడ్డ ఆ కార్డును చించిపడేశో లేదా బుట్టదాఖలు చేసో ఆ ఫిర్యాదునసలు ఎండార్స్ చేయబడలేదని వాదిస్తే లేదా బుకాయిస్తే జరిగే పరిణామాల గురించి కూడా ఆలోచిస్తుంటాడు తప్ప, పరిష్కారం గురించి మాత్రం ఆలోచించడు.

కథారచయిత చినవీరభద్రుడుగారు ఈ కథలోని కనకసుందరం పాత్ర ద్వారా నేటి సమాజంలో కొంతమంది బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనలు, ఆలోచనలు ఎలా ఉంటాయో, బాధ్యతారాహిత్యం ఎలా ఉంటుందో తెలియజేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం సాధారణ పాలనాపరమైన కార్యాలయాలతో బాటు ప్రజలకు అత్యవసర సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఇంటికి అవసరమైన కొళాయి కనెక్షన్స్ చేయడం గురించి, కరెంట్ కనెక్షన్స్ ఇవ్వడం, మీటర్లు బిగించడం, ఇంటి పన్ను వసూలు, రేషన్ కార్డు మంజూరు, జనన-మరణ ధృవీకరణ పత్రాలు ఇచ్చేవి మొదలైన ప్రజోపయోగ కార్యక్రమాలు అందించే కార్యాలయాలున్నాయి. నిజానికి అవి అత్యవసర సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలే కాని ఇందులో పనిచేసే కొంతమంది అవినీతి - అలసత్వ అధికారుల వల్ల ప్రజలకు అవసరమైన వెంటనే సేవలందించే పరిస్థితి ఉండదు. ఎవరైనాసరే కొన్ని రోజులు ఆ పనుల చుట్టూ తిరగాల్సిందే. లంచాలు ఇవ్వందే పనులు జరగవు అన్న విషయం అందరికీ తెలిసిందే. ఇలాంటి పరిస్థితి మన భారతదేశంలోని ఏ రాష్ట్రంలోనైనా జరిగే తంతు ఇది. ఎందుకంటే మనదేశంలో లంచగొండి ఉద్యోగులు సమయం గురించి, కాలం విలువ గురించి పట్టించుకోరు. కారణం వాళ్ళ లంచగొండితనం ముందు సమయం కనిపించదు. లంచాలముందు సమయం విలువ చాలా చిన్నదన్నమాట. కథ ప్రారంభంలోనే రచయిత ఈ విషయం గురించి చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి. "అన్ని కార్యాలయాల్లోలానే అక్కడ కూడా (ముఖ్యపాత్ర కనకసుందరం పనిచేసే ప్రభుత్వ కార్యాలయమన్నమాట) పదకొండు గంటల నుంచి సాయంకాలం దాకా ప్రజలు మూగుతుంటారు. వాళ్ళెందుకు అక్కడకు చేరుతారో ఎవరికీ అర్థం కాదు. వాళ్ళతో ఎవరన్నా మాట్లాడుతారో లేదో, అసలు వాళ్ళ సమస్య ఏదో? ఎవరన్నా అడుగుతారో లేదో కాని వాళ్ళలో కొంతమంది ప్రతిరోజూ హాజరవుతుంటారు. తెలీనివాళ్ళకి వాళ్ళలో ఎవరు బయటివారో, ఎవరు ఆఫీసు సిబ్బందో ఎంచడం సాధ్యం కాదు" అని చెప్పడాన్ని బట్టి పై విషయం అర్థమవుతుంది. ఇక్కడ కార్యాలయానికి పనికోసం వచ్చేవారు సాధారణ ప్రజలూ కావచ్చు లేదా వాళ్ళ తరపున ఏదో కొంత 'ఫీజు' తీసుకొని పనిచేసే ఏజెంట్లూ కావచ్చు.

పైన పేర్కొన్న రీతిలో లంచగొండి ఉద్యోగుల విషయం అలా ఉంటే మరికొంతమంది ఉద్యోగుల ఆలోచనలు మరోలా ఉంటాయి. వీళ్ళు ఆఫీసుల్లో పనులు చేయడం వల్లనే నగరాల్లో సిటీ బస్సులు నడుస్తున్నాయనుకుంటారు. వీళ్ళ వల్లే మెట్రోపాలిటిన్ వాటర్ పైపుల్లో నీళ్ళు ప్రవహిస్తున్నాయనుకుంటారు వీళ్ళ వల్లే నెలకోసారి ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ళన్నీ దుమ్ముదులపబడతాయనుకొంటారు. ఇలా దేశంలో ప్రజల అవసరాలన్నీ వీళ్ళవల్లే తీరుతున్నాయనుకుంటారు. నిజానికి ఇవాళ ప్రభుత్వ కార్యాలయాల్లో బంట్రోతులు కాకుండా అధికార్లు కానీ, గుమస్తాలు కానీ సెలెక్షన్ కమీషన్లలో పోటీ పరీక్షలు రాసి విజయం సాధించినవాళ్ళే. ప్రభుత్వ ఉద్యోగులంతా నూటికి నూరుశాతం తమకున్న

తెలివితేటలతో సమాజంలో పోటీపరీక్షలు ఎదుర్కొని ఎన్నిక కాబడ్డవాళ్ళనని చెప్పవచ్చు. అయితే వాళ్ళలో కొంతమంది ఉద్యోగులు సంపాదనలో వాళ్ళు పడ్డ శ్రమని మర్చిపోయి ఉద్యోగంలో చేరగానే తామే తెలివిగా వ్యవహరించే వాళ్ళమని, తమ వల్లే దేశంలో అన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్న భావనతో ఉంటారని రచయిత తెలియజేయడం నూటికి నూరుశాతం నిజం. ఈ తరహా భావాలు గల వ్యక్తులకు నిదర్శనంగా రచయిత కథలో ముఖ్యపాత్ర కనకసుందరాన్ని, అతని ఆలోచనల్ని పాఠకులకు పరిచయం చేశారు. ఇలాంటి కనకసుందరాలు ప్రభుత్వ కార్యాలయంలో ఒక్కరో లేదా కొందరో ఉంటూనే ఉంటుంటారు. వీళ్ళ ఆలోచనలు ముందుకెళ్తుంటాయి. కానీ వీళ్ళ పనిమాత్రం ముందడుగు వేయదు. ఆఫీసులో అడుగుపెట్టిన చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు ఉదయాన్నే 'మొదటి పనిగంట వేళ' వాళ్ళకు అప్పగించబడ్డ బాధ్యత ఉద్యోగ సంబంధమైన కార్య క్రమాల్లో మునిగిపోతారు. గ్రీవెన్స్‌సెల్స్‌లో పనిచేసే కనకసుందరం లాంటి ఉద్యోగులు వచ్చిన గ్రీవెన్స్‌ని పరిష్కరించడం మాని, వాటి నుండి తప్పించుకొనే మార్గాన్ని అన్వేషిస్తుంటారు. అదే సమయంలో రచయిత మరో అంశం గురించి ప్రస్తావిస్తున్నారు. "ప్రభుత్వ కార్యాలయాల్లో ఆఫీసర్, అసిస్టెంట్ తొందరగా మాట్లాడు కోరు. అందువల్ల వాళ్ళ అంతరంగాలు అంతా తేలికగా బయటపడవు.

వాళ్ళ వాళ్ళ స్థాయిల్లో వాళ్ళు గొప్పగా భావించు కొంటుంటారు. ఆఫీసర్ పిలవంది నేను ఎందుకు మాట్లాడాలిలే అని అసిస్టెంట్ ఆలోచిస్తే, అసిస్టెంట్ నా దగ్గరకు వచ్చి అడగకుండా నేను ఎందుకు దీని గురించి ప్రస్తావించాలిలే అని అధికారి అనుకొంటుంటారు. ఈ పద్ధతి మన భారతదేశంలోని చాలా ప్రభుత్వ కార్యా లయాల్లో ఉంటుందని చెప్పవచ్చు. ఇలాంటి అంత రంగాలు పనికోసం వచ్చిన వ్యక్తుల మీద ఏదోరకంగా ప్రభావం చూపుతుంటాయి. ఆఫీసర్ ఎంతవాడైతే అతని అంతరంగం అంతా మరోవిధంగా ఉంటుంది" అని రచయిత చెప్పడాన్ని బట్టి కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల తీరు ఎలా ఉంటుందీ, అది ప్రజాబాహుళ్యాన్ని ఎలాంటి ఇబ్బందులకి గురి చేస్తుందో అర్థమవుతుంది. అలాగే ఒక ఫిర్యాదు పరిష్కారంలో ఆఫీసు అసిస్టెంట్ ముందుగా చొరవ తీసుకొని పై అధికారిని సంప్రదిస్తే పరిస్థితి ఫిర్యాదుదారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పవచ్చు. అలాకాకుండా ఫిర్యాదు ఏమిటి? అనే విషయంలో ఆలోచించకుండా, దాని పరిష్కారం గురించి చొరవ తీసుకోకుండా ఇలాంటి ఆలోచనలు చేస్తూ సమయం గడిపేవారు కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేస్తున్నారు.

కథా రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు గారు ప్రభుత్వం ఉద్యోగ సంబంధంగా నిర్వహించే అత్యున్నత పోటీ పరీక్షలలో నెగ్గి ప్రతిభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిగా ఉద్యోగం, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆయా సమయాలలో ప్రభుత్వ కార్యాలయాలలో తన పరిశీలనలో కనిపించిన అంశాలు కొన్ని కథలలో చిత్రించారు. అలాంటి అంశమే ఈ కథలో కూడా ఒకటి చిత్రించారు. ముఖ్యంగా ఏదైనా ఫిర్యాదు పరిష్కారంలో అధికారుల ఆలోచనలు ఎలా ఉంటాయి. ఆఫీసు అసిస్టెంట్ పద్ధతులు ఎలా ఉం టాయన్నది పరిశీలించి, ఆ పరిశీలనకు ఈ కథలో అక్షర రూపం కల్పించారు. ప్రజోపయోగ కార్యక్రమాలలో ప్రజల ఫిర్యాదులు పరిష్కరించవలసిన కొంతమంది అధి కారులూ, ఉద్యోగులు చేసే పనులూ, ఆలోచనలూ ఎలా ఉంటాయో తెలియజేసిన ఈ కథ చెప్పుకోదగ్గ సామాజిక విలువలున్న కథగా పేర్కొనవచ్చు. ఈ కథ రెండు వేల సంవత్సరంలో రాయబడింది. అప్పటికీ, ఇప్పటి పరిస్థితికి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల పరంగా కొంత మార్పు కనిపిస్తుంది. కారణం ఇటీవల కాలంలో మన ప్రభుత్వాలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విషయంలో వేగం పెంచి, లంచగొండితనం తగ్గించడానికి ఎన్నో మార్గాల్ని అన్వేషిస్తూ ముందుకెళ్తుంది. అయినా లంచగొండితనం లంచగొండి తనంగానే ఉంది. ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెరగలేదు. ఫిర్యాదులు ఫిర్యాదులుగానే ఉంటున్నాయి. బహుశా భారతదేశంలో లంచగొండితనం తగ్గాలన్నా, ప్రజా

ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెరగాలన్నా ప్రజల్లో మార్పులు రావాలి. సమస్త అనర్థాలూ రూపుమాయాలంటే ప్రజల్లో చైతన్యం రావాలి. అలా చైతన్యం రావాలన్న కాంక్షతో రచయిత ఈ సామాజిక కథ రాశారు.

**ఆధార గ్రంథాలు :**

1) ప్రశ్న భూమి కథా సంకలనం - వాడ్రేవు చినవీరభద్రుడు
2) కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3) విమర్శిని - ఆచార్య కొలకలూరి ఇనాక్

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# సామాజిక సమస్యలపై సమర శంఖారావం - అలిశెట్టి ప్రభాకర్



- చీరబోయిన తిరుపతి

జె.ఆర్.ఎఫ్., తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ అప్పుడప్పుడే స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నకాలం. అంటే 20వ శతాబ్దపు మధ్య భాగం. 1954 జనవరి 12వ తేదీన కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల పట్టణంలో అంగడిబజారు ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఓ పేద దంపతుల ప్రేమ చిహ్నంగా అలిశెట్టి చినరాజం, లక్ష్మీ దంపతులకు అలిశెట్టి ప్రభాకర్ జన్మించాడు. ఈ దంపతులకు ఏడుగురు కూతుళ్ళు, ఇద్దరు కుమారులు. ఈ తొమ్మిది మంది సంతానంలో ప్రభాకర్ ఐదవ వాడు. చిన రాజం. పరిశ్రమల శాఖలో పని చేస్తూ ఆకస్మాత్తుగా చనిపోయే నాటికి ప్రభాకర్ పదకొండు సంవత్సరాలు. ఇద్దరు కుమారులలో ప్రభాకర్ పెద్దవాడు కావడం వల్ల కుటుంబ భారమంతా తనపై పడింది.

అలిశెట్టి ప్రభాకర్ తన జీవితంలో ఆదర్శాలకు, ఆడంబరాలకు తావివ్వలేదు. కట్నకానుకల జోలికి పోకుండా 1978లో జగిత్యాల మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ పేదింటి అమ్మాయి అయిన భాగ్య'ను తన సోదరి వివాహంతో పాటే వివాహమాడాడు. అక్షరజ్ఞానం లేని అమాయకురాలు భాగ్య. వీరిద్దరి ప్రేమకు గుర్తుగా ఇద్దరు కుమారులు, సంగ్రామ్, సాకేత్. విప్లవానికి గుర్తుగా తన కుమారునికి పోరు, యుద్ధం అని అర్థం వచ్చే 'సంగ్రామ్' అనే పేరు పెట్టాడు..

1978లో ప్రచురించిన "ఎర్రపావురాలు", 1980 లోని "మంటల జెండాలు" కవితా సంపుటాలలోని కొన్ని కవితలకు చిత్రాలను వేసి, 1985లో "రక్తరేఖ"గా సాహిత్య లోకంలోకి తీసుకువచ్చారు. 1990వ సంవత్సరంలో 'సంక్షోభ గీతం"ను 24 వచన కవితలతో వెలువరించాడు. ఈ సంక్షోభ గీతానికి రాసుకున్న ముఖ చిత్రంలో "సంగ్రామ గీతం" అని వుంటే బాగుంటుందని చెప్పుకున్నాడు. సిగరెట్ తాగే అలవాట్టుతో తన ఆరోగ్యాలను పాడు చేసుకున్నాడు. అనారోగ్యంతో బాధ పడుతూ కూడా తన తుది శ్వాస విడిచే వరకు కవిత్వం రాశాడు. అలా చివరి వరకు రాసుకున్న కవిత్వాన్ని "విరసం" సభ్యులు కలిసి అలిశెట్టి మరణానంతరం 1994 జనవరిలో తన ప్రథమ వర్థంతి సందర్భంగా 'మరణం నా చివరి చరణం కాదు" అనే పేరుతో కవిత సంపుటాన్ని వెలువరించారు.

"ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం" 'అన్న కోటేషన్' చదివినప్పుడు బహుశా శ్రీశ్రీ ఈ కవిని ఉద్దేశించి అన్నారేమో అన్న సందేహం కలగక

మానదు. అతను ఒక కవిత్వపిపాసి, తన కవితలతో మానవ జాతిని జాగృతం చేయాలని నిరంతరం తపిస్తూ ఉండేవాడు. తన కవితాదాహం పూర్తిగా తీరకముందే ఆనారోగ్య సమస్యలతో అనంత లోకాలకి వెళ్ళిపోయి, తన కవిత్వాలను జ్ఞాపకంగా మనకి వదిలేసి వెళ్ళిన అతనే అఅశెట్టి ప్రభాకర్,

మొదట ఆర్టిస్ట్‌గా ఎదిగాడు. ప్రారంభంలో పత్రికలకు పండుగలు, ప్రకృతి, నటీనటుల బొమ్మలు వేసేవారు. తర్వాత జగిత్యాలలో 1974లో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో వచ్చిన 'పరిష్కారం' అచ్చయిన మొదటి కవిత. జీవిక కోసం జగిత్యాలలో స్టూడియో పూర్ణిమ(1976), కరీంనగర్ లో స్టూడియో శిల్పి (1979), హైదరాబాద్లో పూర్ణిమ చిత్రలేఖ (1983) ఏర్పాటు. జీవిక కోసం ఫోటో గ్రాఫర్, జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. ఏనాడూ సంపాదన కోసం ఆరాటపడలేదు. తన కళ ప్రజల కోసమే అని చివరి వరకు నమ్మాడు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఆరేళ్ళ పాటు సీరియల్‌గా "సిటీలైఫ్" పేరుతో హైదరాబాద్ నగరంపై రాసిన మినీ కవితలతో ప్రఖ్యాతి పొందాడు. సామాజిక చైతన్యమే ధ్యేయంగా కవిత్వం రాశాడు. తన కవిత్యంతో పాఠకుల్లో ఆలోచనాదృక్పధాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన అతికొద్ది మంది కవుల్లో అలిశెట్టి ఒకడు.

"సిద్ధాంత గ్రంధాల సారమేది వడ బొయ్యకున్నా
సిద్ధార్థుడు వదిలి వెళ్ళిన ఈ రాజమ్మీది నెత్తుటి ధారల్ని కడిగేందుకు
కవిత్వం నాకవసరమైన ఆయుధమైంది"
(రక్తరేఖ. 1989. చివరి అట్ట)

అని అన్నాడు అలిశెట్టి ప్రభాకర్.

అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య ప్రస్థానం తన పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే ప్రారంభమైంది. జగిత్యాలలోని "సాహితీ మిత్ర దీప్తి" అనే సాహితీ సంస్థతో సాహితీ లోకానికి కవిగా పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వివిధ పత్రికలలో, ప్రత్యేక సంచికలలో తరచు పాఠకులను పలకరించేవాడు. సమాజంలోని కుళ్ళును ప్రజానీకానికి తెలియజెయ్యాలని, వారిలో చైతన్యం తీసుకురావాలని నిరంతరం తపన పడేవాడు..

"సాహితీ మిత్ర దీప్తి" ఆహ్వానం మేరకు వచ్చే కవితలను చూసి విసుగు చెంది (మెప్పుకోసం మాత్రమే రాస్తున్నారన్న ఉద్దేశ్యంతో) సమాజం కోసం, ప్రజల కష్ట నష్టాల గురించి కవిత్యం రాయాలనే ఉద్దేశ్యంతో "జగిత్యాల జైత్ర యాత్ర "స్ఫూర్తితో చిన్న చిన్న పదాలతో కవితలు అల్లడం మొదలు పెట్టాడు.

"అక్షరమక్షరం అనలమై మండుతున్నప్పుడు
సమీకరించి, సైన్యం లా రూపొందించిన కృషి ఫలితమే
ఈ కవితా చిత్రాలు
రక్తరేఖలతో నిర్మించిన దృశ్యాలే ఈ కవితా చిత్రాలు"
(రక్తరేఖ 1989 రెండవ ముద్రణలోని ముందు మాట)

ప్రభాకర్ రూపొందించిన ఈ కవితా చిత్రాలను ప్రదర్శన యోగ్యంగా తీర్చిదిద్ది వివిధ కళాశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో ఇంకా పలు చోట్ల తన చిత్రాలను ప్రదర్శించినాడు. కవిత్వాన్ని ప్రాణ వాయువుగా మార్చి తన కవితా చిత్ర ప్రదర్శనలతో ఈ సమాజాన్ని అంగుళం మేరకైనా కదిలించగలనని నిరూపించినాడు.

కవిత్వం, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ, ఈమూడు రంగాల్లో అసమాన ప్రతిభ కనబరిచిన సృజన శీలి అలిశెట్టి ప్రభాకర్. ఆయనది సిసలైన తెలంగాణ ఆత్మ, కల్లా కపటం లేని తత్త్వం. సమ సమాజమే ఆశయం. ధనికు లకు, పేదలకు మధ్య వర్గపోరుకు ఉపకరించే కవిత్వాన్ని ఆయన పదునైన చురకలతో ఆవిష్కరించి

**ఆకలి**

ఆకలి మండి పోతున్నప్పుడు
ఎదుట
ఎంతటి మనోహర దృశ్యమున్నా
దగ్ధమై పోవాల్సిందే
ఆకల్ని

నిగ్రహిస్తున్న కొద్దీ
కడుపులో పేగుల్ని
కత్తిరిస్తున్న బాధే
ఆకలి
పూటకో దరిద్రున్ని వేపుకు తిని
అది ఉమ్మేసే తొక్కలే
అసంఖ్యాకపు అస్థి పంజరాలు"

అన్న ప్రభాకర్ కుటుంబం ఆకలితోనే అలమటించిందని నేను నిష్కర్షగా ప్రకటిస్తున్నాను.

"తను శవమై
ఒకరి వశమై
తనువు పుండై
ఒకడికి పండై
ఎప్పుడూ ఎడారై
ఎందరికో ఒయాసిస్సై"

అంటూ సెక్స్ వర్కర్ల దయనీయ స్థితి గురించి ఆయన రాసిన కవిత సుప్రసిద్ధమైనది. వేశ్యల గురించి ప్రస్తావన వచ్చిన అనేక సందర్భాలలో అనేక మందిచే ఉదహరింపబడిన కవిత.

అసలు సిసలైన కవిత్వానికి చిరునామా అలిశెట్టి ప్రభాకర్. అట్టడుగు వర్గాల జీవితాలే ఆలంబనగా, సమాజంలోని అంతరాల దొంతరలను కూల్చేస్తేనే బడుగుల జీవితాలు బాగుపడతాయనే నమ్మికతో చివరి వరకు అక్షరయుద్ధం చేసిన కవితా ప్రభాకరుడు అలిశెట్టి ప్రభాకర్.

చల్లని వెన్నెల పుష్పాల సౌరభాలు, మంచు చల్లదనము, మలయ మారుతాలు, ఆహ్లాదము, సెలయేర్ల గలగలలు ఇలా మొదలైన వర్ణనలు పూర్వ రచనల్లో కనిపిస్తాయి. కానీ కష్ట జీవుల్లో చైతనాన్ని తీసుకురావడం కొరకే జగిత్యాల జైత్రయాత్ర స్ఫూర్తితో ముందుకు సాగిన కవితాయోధుడు ఆలిశెట్టి ప్రభాకర్. ఆవార్డుల కోసమో, ఇస్త్రీ నలక్కుండా విప్లవ సందేశాన్ని అందించే మేధావుల కోనమో కవిత్వంలోనూ, జీవితంలోనూ ద్వంద్వ ప్రమాణాలను అవలంభించే దౌర్భాగ్యుల కోసమో కాకుండా సామాన్య బడుగుల కోసమే నా కవిత్వం అని,

"మరణం నా చివరి చరణం కాదు
మౌనం నా చితాభస్మం కాదు
నిర్విరామంగా నిత్యనూతనంగా
కాలం అంచున చిగురించే
నెత్తుటి ఊహను నేను" అని ప్రకటించుకొని అసలు సిసలైన కవిత్వానికి చిరునామాగా నిలిచిన కవి అలిశెట్టి ప్రభాకర్, సమాజంలోని అంతరాల దొంతరలను కూల్చేస్తేనే బడుగుల జీవితాలు బాగుపడతాయనే నమ్మకంతో తన కవితాశరాన్ని సామాజిక అసమానతలపై సంధించాడు.

భాగ్యతో పంచుకున్న జీవితాన్ని మరణం నా చివరి చరణం కాదు" లో భాగ్యలక్ష్మి శీర్షికతో కవితను రాసుకున్నాడు.

"నాకు బెర్నాడ్ షాలు, షేక్ స్పియర్‌లూ తెలియదు.
తనకు గుడిపాటి వెంకటాచలం, గురజాడ తెలియదు.
ఇద్దరం ఉత్తపిచ్చివాళ్ళం-కాని
అడుగంటిన కిరసనాయిలు స్టవ్‌తో/ అన్నం ఎట్లా
ఉడికించాలో తనకు తెలుసు.
దగ్గు తెరల నెత్తుటి రెపరెపల ఊపిరి తిత్తుల్లో
కవిత్వమెట్లా రాజేయాలో నాకు తెలుసు
ఇద్దరం కలిసి ఒక కలగా / కలగాపులగంగా
కలిసిపోయిన రోజుల్లో
తులతూగే ఐశ్వర్యమో/ తులం బంగారమో కావాలని
ఏనాడూ ప్రాధేయపడలేదు" అని తమ అపురూప దాంపత్యాన్ని నిర్వచించినాడు.

"ఎన్నెన్ని గాయపడిన ఉదయాల్ని
సంకలనంగా కూర్చినా/ ఎవరెవరి
బాధామయ గాథల్ని/ ఈ కలంతో
జాలువార్చినా/ మిత్రుడా
నిరంతరం సూర్యుడే నా ముఖ చిత్రం" అని అనడంలో సమాజంలో వున్న వర్గకసితో విప్లవానికీ, చైతనానికీ ప్రతీక అయిన సూర్యుడే తన ముఖ చిత్రమనే తిరుగుబాటు తత్వాన్ని చూస్తే సమాజాన్ని చైతన్య పరచడం కనిపిస్తుంది.

రోజూ కొన్ని వాక్యాలైనా రాయనిదే ఆరోజు భోజనం చేసే అధికారం తనకు లేదని ప్రేంచంద్ గారన్నట్లు ప్రభాకర్ కూడా నిత్యవిద్యార్థిగా మారి ప్రతిరోజు కవిత్వాన్ని రాసేవాడు.

"జగిత్యాల పిలుస్తోంది.

జైత్రయాత్ర నన్ను కలవరపెడుతుంది" అన్న అలిశెట్టి ప్రభాకర్ అమరుడు.

అతని సాహిత్యం సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను ఎప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంటుంది. నిలదీస్తూనే ఉంటుంది.

అలిశెట్టి సుఃఖ సంతోషాలతో బతుకుతున్న రోజుల్లో ఒక్కసారిగా తన ఊపరితిత్తులలో మాయదారి క్షయరోగం రాజుకుంది. మందులు కొనుక్కోలేని నిర్భాగ్యస్థితిలో నగరంలో బ్రతికాడు. వేళకు మందులు వాడని క్రమశిక్షణ రాహితం వల్ల తన శరీరంలోని రోగనిరోధక శక్తి సన్నగిల్లి 6 నెలల్లో తగ్గాల్సిన వ్యాధి 10 ఏళ్లుగా అంచలంచెలుగా ముదిరి ఊపిరితిత్తులను పాడుచేసింది. ఎన్నోసార్లు చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్తే, అక్కడ జాయిన్ అయిన తర్వాత "నాకు ఆసుపత్రి నచ్చలేదు. నా "సిటీలైఫ్" లేకుండా నేను బ్రతకలేను" అని అక్కడ నుండి తిరిగివచ్చే వాడు. అలా అలిశెట్టికి కవిత్వంపై వున్న మక్కువనే ఆరోగ్యాన్ని పాడు చేసింది.

"క్యాన్సర్ వ్యవస్థ ఐతేనేమి / క్షయగ్రస్త వ్యవస్థ ఐతేనేమి,
అది మరణశాసనం రాసిన మరు క్షణం నుంచి,
మీరు ఒక స్వప్నాన్ని నిదురపోనివ్వలేదు,
ఒక క్షణాన్ని వృథా కనివ్వలేదు"
(మ.నా.చి.కా.వరవరరావు ముందుమాట)

వ్యాధి వచ్చిందని తెలిసినప్పటికి, వెరవని మనిషిలా, చనిపోతానని తెలిసికూడా నిరాశ పడని శక్తిలా నిలిచి, క్షణం కూడా వృథా పోనివ్వకుండా చనిపోవడానికి సరిగ్గా 5 రోజుల ముందు రాసుకున్న తన వ్యక్తిగత కవిత్వం అందరికీ కృతజ్ఞతలు చెపుతున్నట్లు, మిత్రులను, భార్యను గుర్తు చేసుకున్నాడు.

"ఎడతెరిపి లేని దగ్గు అడుగు కదపనివ్వని ఆయాసం,
రక్తం ముద్దలుగా పడుతున్న రోజులో నేను కవిత్వాన్ని
నిర్లక్ష్యం చేయలేదు" అని "సిటీలైఫ్" ముందు మాటలో చెప్పుకున్నాడు. తన చావుకు ముందు ఆయన ప్రతిరోజు రాస్తున్న "సిటీలైఫ్"లో తనకు మృత్యువు సమీపించిందని, సూచనగా--

"తెర వెనుక మృత్యువు లీలగా కదలాడినట్లు
తెరలు తెరలుగా దగ్గు గుండెల్ని పిండేస్తుంది' అని చెప్పుకున్నాడు.

సమాజంలో అన్ని వర్గాలు సమానమని భావించిన అలిశెట్టి ప్రభాకర్ కూడా తన చావు పుట్టుకల మధ్య సమానత్వాన్ని ప్రదర్శించి, 1993 జనవరి 12వ తేదీ అర్థరాత్రి తుది శ్వాసను విడిచాడు.

సమాజాన్ని చైతన్యపరుస్తూ, పాలకుల గుండెల్లో తూటాలాంటి మాటలను పిడిబాకులుగా దించి, ప్రజలందరూ సమానమనే దృష్టితో చూసిన అలిశెట్టి, తన చావు పుట్టుకలు కూడా సమాన తేదీలోనే జరగడం విశేషం. విప్లవ కవులు ఎందరో వున్నప్పటికీ జనం నాడిని పట్టుకొని వారి గుండెలకు హత్తుకునేలా కవిత్వం రాసి, చిరకాలం ప్రజల నాలుకలపై నిల్చిన అభ్యుదయ మానవీయ కవి అలిశెట్టి ప్రభాకర్.

విప్లవ కవిత్వమే ఊపిరిగా బ్రతికే నేను. ఉద్యమాలతో మమేకమై పోలేకున్న ఉద్యమ దిశని సూచించే దిక్సూచిగా జీవిస్తున్నాని తన 'రక్తరేఖ' చివరి మాటల్లో చెప్పుకున్నప్పటికి ఒక దశాబ్దం పాటు 'విరసం' లో సభ్యుడిగా వున్నాడు. ప్రత్యక్షంగా ఉద్యమాలలో అలిశెట్టి పాల్గొనకపోయిన పరోక్షంగా ముందుండి నడిపించాడు. ఆ సమయంలో పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేయడానికి చూశారు.

"ఏ క్షణం లోనైనా ఎదురు కాల్పుల్లో
మరణించేందుకు నేను అర్హుణ్నే"
(మ.న.చి.కా.పుట60)

జగిత్యాల జైత్రయాత్ర ఉద్యను స్ఫూర్తితో 'ఎర్ర పావురాలు" జీవితాకాశంలోకి ఎగరేసి యువకుల్లో,

స్త్రీలల్లో, శ్రామిక జీవుల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి తన ఉద్యమ పంథాను చూపాడు.

"దోపిడి వట వృక్షాన్ని నేల కూల్చే సైనికుల సారధ్యం నేను
ఈ దీర్ఘకాలిక యుద్ధ వ్యూహంలో పీడితుడే నా అస్త్రం అణ్వస్త్రం
శత్రువు నా పాదధూళి" అని అనడంలో ఉద్యమా కారుడిగా తనవంతు బాధ్యతను, తాను నిర్వర్తించినట్లు కనిపిస్తాడు. ఉద్యమంపై నిర్భంధం పెరిగిన క్రమంలో తనపై వచ్చే నిర్భంధానికి వేరవక విప్లవ వృక్షంగా నిల్చి తన కలాన్ని మరింత పదునెక్కించిన సైనికుడు అలిశెట్టి అని 'వరవరరావు' అన్నారు. జైత్రయాత్ర సందర్భంలో ప్రజలు దోషులను ఎదురిస్తున్న క్రమంలో తన కవితలతో ప్రజలలో చైతన్యం రగిల్చినప్పుడు అనాటి ప్రభుత్వం పోలీసుల చేత ప్రజలను, అలిశెట్టిని నానా హింసలకు గురిచేసింది.

"గొంతు కోస్తే
పాట ఆగిపోదు, అది
ముక్తకంఠం
గొలుసు లేస్తే
పోరు నిలువదు, ఇది
ప్రజా యుద్ధం"

"జైత్రయాత్ర సమయంలో అలిశెట్టి గొంతుపై కాలేసి నులిపినప్పుడు ఆక్రోశంతో మీరు నన్నేం చేసిన నా కవిత ప్రవాహం ఆగిపోదు.

పోలీసులు, ఉద్యమకారులను, అణిచివేస్తున్నప్పుడు అలిశెట్టికి సన్నిహితులైన వారు, తనని పలకరించిన వారు ఒక్కొక్కరుగా తర్వాత రోజే భూటకపు ఎన్కౌంటర్లో చనిపోతే ఏన్నో నిద్రలేని రాత్రులను గడిపాడు.

"దేశం పోగొట్టుకున్న గర్భకోశం నుంచే
మళ్ళీ నేనొక వీరున్ని కలగనాలి
దిక్కులు కూలిన దుఃఖం నుంచే
మళ్ళీ నేనొక వీరున్ని కలగనాలి" అని అనడంలో తన తోటి ఉద్యమకారులను పోగొట్టుకున్నందుకు తానేం బాధపడ్డాడో తెలుస్తుంది. విప్లవ ఉద్యమం ప్రతి మలుపులో తనపై ఎంత నిర్భందం అమలైనా ఉద్యమ పక్షపాతిగానే చివరి వరకు జీవించి తన కలాన్ని మరింత పదునెక్కించిన, సామాజిక యోధుడు అలిశెట్టి ప్రభాకర్.

## ముగింపు :

కష్టజీవుల బ్రతుకుల్ని సీరాలో నింపి అక్షరాలతో అగ్గి పుట్టించినోడు, కలంతో కవాతు చేసినోడు, అలిశెట్టి ప్రభాకర్. పెన్సిల్‌తో బొమ్మ లేసినా, పెన్నుతో కవిత్వం రాసిన అది ప్రజాపక్షమే. పాలకులను ప్రశ్నించడం అన్యాయాన్ని ఎదురించడం, సుత్తి లేకుండా సూటిగా చెప్పడం అలిశెట్టి మాదిరి మరొకరికి సాధ్యం కాదేమో. కలాన్ని కత్తిగా చేసి సమాజన్ని సిజేరియన్ చేసి వ్యవస్థ కుళ్ళును కడిగిన కవి అలిశెట్టి. పొట్టి కవితల గట్టి కవి అలిశెట్టి జయంతి, వర్ధంతి ఒకే రోజు కావడం యాదృచ్ఛికం. జగిత్యాల జైత్రయాత్ర ప్రభావంతో విప్లవ కవిత్వాన్ని ఆయుధంగా ఎంచుకున్నాడు. ఎంతో పెద్దపెద్ద విషయాలను చిన్నగా చెప్పడం అలవాటు చేసుకున్నాడు అలిశెట్టి. అవే అలిశెట్టి కవితలైనవి, ఆయుధాలైనవి. అలిశెట్టి అక్షరం మండుతున్న అగ్నికణం. అతని కవిత్వం ఓ పాశుపతాస్త్రం. సామాన్యుని కష్టాలే ఆయన కలం, కవిత వస్తువులు. కష్టజీవి కన్నీళ్ళే ఆ పెన్నుకు ఇంకు చుక్కలు. తెలంగాణ సాహితీవనంలో పూచిన ఎర్ర మందారం అలిశెట్టి. సరళమైన పదాలు, రక్తం ఉడికించే మాటలతో మరఫిరంగిలాంటి కవితలెన్నో రాశాడు. వ్యంగ్యం, పదును, విమర్శ, సామాజిక స్పృహ లాంటివన్నీ అలిశెట్టి చురకలో కనిపిస్తాయి. దుర్మార్గం, నియంతృత్వం రాజ్యమేలుతున్న తెలంగాణలో మన ఇళ్లల్లో గోడలకు వుండవలసిన ఫోటోకాదు అలిశెట్టిది, ప్రతి తెలంగాణోడి గుండెల్లో ఉండవలసిన ఇమేజ్ అది.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1) తిరుమల రావు, జయధీర్, (సంపా)- 2013 "అలిశెట్టి ప్రభాకర్ కవిత" - హైదరాబాద్, నవతెలంగాణ ప్రింటర్స్

2) ప్రభాకర్, అలిశెట్టి - 1994, మరణం నా చివరి చరణం కాదు" హైదరాబాద్ "విరసం"

3) ప్రభాకర్, అలిశెట్టి- 1985, రక్తరేఖ-కవితా చిత్రాలు,హైదరాబాద్ ,హైదరాబాద్ ప్రింటర్స్

4) నాగేంద్ర శర్మ, సంకేపల్లి 2004 (హరివిల్లు వ్యాస సంపుటి) కరీంనగర్ సత్యనారాయణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

5) ప్రభాకర్, అలిశెట్టి 2014 - "అక్షర నక్షత్రం మీద" (కవితా చిత్రాలు) జగిత్యాల/ హైదరాబాద్ అలిశెట్టి మిత్రులు


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# దివ్యాంగ స్త్రీల కథలు - చైతన్యం



- పుప్పాల రూపులు
పరిశోధకులు, తెలుగుశాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రి అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**ఉపోద్ఘాతం :**

సాధారణ స్త్రీలనే బలహీనులుగా ఎంచి ఇబ్బంది పెట్టే సమాజం దివ్యాంగ స్త్రీల విషయంలో మరింత చులకనని చూపుతారు. ఏదో ఒక విధంగా ఆటంకాలు, అడ్డంకులు, అన్యాయాలు, దౌర్జన్యాలు, మోసాలు జరిగే అవకాశాలు వీరికి ఎక్కువ. అంతే కాకుండా స్త్రీ సహజ సమస్యలపై తిరగబడి వాటిని నిర్మూలించుకోగల సత్తా అవసరం. అలాగే వారిలో కలిగే చైతన్యం ఇతరులలోనూ కదలికను తెస్తే బాగుంటుంది. చదువో, ఉద్యోగమో, పోరాటమో, ఎదురొడ్డి నిలిచే క్రమంలో ఇటువంటి స్త్రీలలో నూతనుత్తే జాలు నింపుకోవలసిన వైనాలతో ఉంటాయి. సాధారణ దివ్యాంగుల్లో పురుషులకు కాక స్త్రీలకు మాత్రమే ఎదురై భయపెట్టే, కృంగదీసే విషయాలుంటాయి. వాటిని దాటి అనుకున్నది నెరవేర్చుకునేలా కదలాలన్న చైతన్యాన్ని పొందాలి. ఈ తరహా కథలు కొన్ని ప్రస్తుత కథా సంకలనాల్లో కనిపించాయి.

**లచ్చిమి:**

**పరిచయం:**

ఈ కథను పిట్టల శ్రీనివాస్ రాశారు. ఇది వేముల ఎల్లయ్య, శంకర్ సంపంగిల సంపాదకత్వంలో వెలువడిన మేము సైతం కథా సంకలనంలో ప్రచురితమైనది. ఇది దివ్యాంగులకు సంబంధించిన కథాసంకలనం.

**కథా సంగ్రహం :**

నల్గొండకు దగ్గర్లోని మాడ్గుల పల్లెలో లక్ష్మి అనే అమ్మాయి ఉంటుంది. అంటరానివారన్న ఆంక్షలు వల్ల రెండో తరగతి వరకే చదువుకొని దొర ఏర్పాటు చేసిన బడిలో చేరి పై చదువులు చదవలేకపోతుంది. ఇంట్లోనే ఉంటూ తల్లిదండ్రులతోపాటు వ్యవసాయంలో సాయ పడుతుండేది. యుక్త వయసుకు వచ్చిన ఆమెపై దొర కొడుకు ఓరోజు అత్యాచారం చేసి విషయం బయటకు పోకుండా ఆమె నాలుకను కోసి వెళ్లిపోతాడు. తనకు జరిగిన అన్యాయానికి చెప్పుకోలేక ఇంటికి వెళ్లలేక నల్గొండ రైల్వే స్టేషన్కి చేరుతుంది. జ్వరంతో తిండి లేక మూల పడున్న ఆమెని పోలీసు వాడు బయటికి వెళ్ళగొడతాడు. అక్కడే ఒక చెట్టు కిందకు చేరిన ఆమెను ఓ కాలులేని బిచ్చగాడు ఆదరిస్తాడు. అక్కడున్న వికలాంగ భిక్షకులతో పాటు కలిసి ఉండేది. క్యాంటీన్ రాజు సాయంతో ఆసుపత్రిలో చికిత్సను పొందుతుంది. గొంతుకి అమర్చిన ఒక పరికరంతో ఆమె మాటల్ని వినిపించగల సాంకేతికతనే అందుకుంటుంది. లాయర్ ని కలిసి దొరబిడ్డని కోర్టుకిడు

స్తుంది. నోరులేనిదన్న ధైర్యంతో తననేం చేయలేదన్న అతడిని ఖంగు తినిపిస్తూ శిక్ష పడేలా చేస్తుంది. తనకు సాయపడిన వికలాంగులకు తనతో పాటు తన ఊరికి తీసుకెళ్తుంది. వ్యవసాయం చేసుకుంటూ వారికి వైద్యాలు చేయించి కష్టంలో ఉన్న వారికి అండగా నిలుస్తుంది.

**విశ్లేషణ :**

అన్యాయానికి, అంగవైకల్యానికి గురైన యువతి ఎలాంటి చైతన్యంతో న్యాయాన్ని గెలిచిందో ఈ కథ వివరించింది. పెద్ద కులజులు, సంపన్నులు అయినవారు బడుగులపై జరిపే దాష్టికాల విషయంలో పోరాటాన్ని స్ఫూర్తి చూపిన యువతి తెగువకు అభినందనలు దక్కుతాయి. తనను ఏమీ చేయలేరనే అహంకారాలకు కాలం చెల్లిందంటూ న్యాయపోరాట తీర్పులో జవాబు చెప్పిన ఆ స్థైర్యం కొనియాడదగింది. ఈ సమాజంలో అంతరాలన్నవి అడుగడుగునా కనిపించేవిగా ఉంటున్నాయి. వీటిని అడ్డం పెట్టుకుని ఉన్నవాడు లేనివాడిపై జరుపుతున్న దౌర్జన్యాలు అన్ని ఇన్ని కావు. నిరక్షరాస్యులని ఎదిరించలేని బడుగు జీవులనే నిర్లక్ష్యాలు, అన్యాయాలకు తెగబడతాయి. అందులోనూ ఆడదానిపై ప్రతాపం చూపే మదాంధులకు కొదవలేదు. అగ్రవర్గాలు ఏం చేసినా చెల్లిపోతుందనే పొగరుకి కొన్ని దారుణాలు ప్రత్యక్ష సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ, పెత్తందారుల డబ్బు, అధికారులు, ఉన్నవారి చేతిలో పడి నలిగిపోతున్న జీవితాలున్నాయి. తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధైర్యంతో రెచ్చిపోయే దొర బిడ్డ వంటివారు ఉన్నారు. కానీ లక్ష్మిలా అలాంటి వారిని శిక్షించే తెగువ చూపులేని అమాయకులు ఉన్నారు. అటువంటి వారిలో స్ఫూర్తిని రగులుస్తూ లచ్చిమి ఎంతటి చైతన్యపరురాలో చూపుతూ ఆమె సాగించిన న్యాయ పోరాటపు విజయాన్ని ముందుంచారు. అవిటితనం అనే లోపాలని అధిగమిస్తూ ఆమె చూపిన ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం ఎనలేనిది. అన్యాయం జరిగిందని కన్నీరు కారుస్తూ పెదవి విప్పలేని దీనులున్నారు. వారికి, ఆత్మహత్యలకు పాల్పడే యువతులకు ధైర్యాన్ని నూరి పోస్తూ సాగిన ఈ కథ దాష్టీకంపై తిరగబడాలన్న మార్గతనిచ్చింది.

కష్టమన్నది వచ్చినప్పుడు దారీతెన్నూ కనిపించదు. పైగా మానాన్ని కోల్పోయిన అభాగ్యులు, నిరక్షరాస్యులు ఏం చేయాలో తెలియని వారవుతున్నారు. కానీ అప్పటికప్పుడు వారిపై జరిగిన దారుణం స్పందించాల్సిన సమాజం, పెత్తందారుల ముందు చేతులు కట్టుకుంటే ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు మరింతగా బాధిస్తాయి. కానీ కాలం గడిచిన న్యాయమనే ఆయుధంతో దుర్మార్గుల పీచమణిచే పట్టును చూపితే దానికో ఫలితం ఉంటుంది. అది ఆడపిల్ల కదా, అంగవైకల్యం ఉన్నదే కదా, నన్నేం చేయలేదులే అనే నిర్లక్ష్యాలను నేలకూలుస్తుంది. ఆడది తలుచుకుంటే చేయలేనిది ఏదీ లేదనీ పోరాటం ఆమెదయినప్పుడు విజయమూ ఆమెదే. తక్కువ కులాల వారిని గుడికీ, బడికీ దూరం చేసిన వారే ఆమెపై పడి కోరికలు తీర్చుకుంటే అలాంటి వారి దృక్పథాలెలాంటివో తెలుస్తోంది. అటువంటి దొరబిడ్డల పీచమణిచెందుకు సిద్ధమైతే కత్తి వారి మెడ మీద పెట్టవచ్చు. దేనికి పనికిరాని, విసిరి కొట్టబడిన బడుగుల జీవితాలను నాశనం చేస్తే ఊరుకునే రోజులకు కాలం చెల్లింది. భయం, పిరికితనాన్ని నూరి పోస్తే తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియని విధంగా అంతరాలు శాసిస్తున్నాయి. ఒకవేళ నోరు తెరిచిన బలహీనుల వెంట నిలిచే వారు లేరు. అధికారమున్న పోలీసులు లచ్చిమి బాధని అర్థం చేసుకోక ఆమెను లాఠీలతో తరిమి కొట్టారు. చిరు ఆశ్రయాన్ని సహించలేని కర్కశులకు కరుణ లేనప్పుడు ఏ దారిలో వెళ్తే తాను అనుకున్నది చేయగలుగుతుందో ఆ మార్గాన్వేషణ చేయాలి. చట్టం అనేది రాజ్యాంగం ఇచ్చిన వరం. దాని సాయంతో ప్రతిఘటిస్తూ వాస్తవాన్ని తెలుపుతూ సాక్షిభూతంగా నిలబడి పోరాడితే ఎంతటి వారైనా గెలుపొందవచ్చు అని లక్ష్మీద్వారా నిరూపించి చూపించారు. స్వీయ చైతన్యాన్ని పూని తనకు అనుకూల వనరులను సృష్టించుకుని బరిలో దిగితే ఎదురుగా ఎంతటి బలవంతుడున్నా తోక ముడవక తప్పదు.

సమాజాన్ని పరికించి చూస్తే బడుగు వర్గాలకు అన్యాయం ఏదో ఒక విధంగా పైవర్గాల వారి నుండి జరుగుతూనే ఉంది. అందులోనూ ఆడపిల్లల పరిస్థితి

మరీ ఘోరం. తరతరాలుగా దోచుకోవడం మాత్రమే అలవాటుగా మార్చుకొని చివరికి మానాన్ని విడవని నీచులు స్త్రీత్వాన్ని తప్ప ఆమెలోని ఆదిశక్తిని ఎరుగరు. 'తన అవతారం, తన బట్టలు, తన తెగిన నాలుక రగుతం... గియన్నీ సూస్తే అమ్మష్ట ఆయన బత్కుతరా...! ఊరెల్లకు బొయ్యి ఎవలకు జెప్పాలే... ఎట్ల జెప్పాలే... ఊరంతా దొరోల్ల రాజ్యమేనయ...' అంటూ కుమిలిపోయే లక్ష్మమ్మలు కథలోనే కాదు, మారుమూలల్లో అడుగడుక్కి ఉన్నారు. కానీ 'నాకు నేనుగా అన్యాయం ఎదిరించాలి' అంటూ దీక్ష పూనే లక్ష్మమ్మలు ఎందరో ఉంటారు!? 'మూగ పీనుగ నన్నేం పీక్తదిలే' అనుకునే దౌర్జన్యకారుల గర్వమణి చినప్పుడు బలవంతుల కాళ్లు వెనక్కి తగ్గగలవు. అక్షరాలను నేర్వకున్నా ఊరిలో తనకి రచ్చబండలు న్యాయం చేయలేవని తలచేవారు కోర్టులున్నాయని మరచి నోరు నొక్కుకుంటున్నారు. ఇంట గెలిచే అవకాశాలు బలవంతుల కాళ్ళ కింద అణచబడినప్పుడు రచ్చ గెలిచే ధ్యేయాన్ని ఆత్మవిశ్వాసంతో అందిపుచ్చుకోవాలి.

Scheduled caste of schedule tribes prevention of atrocities act 1989 also called SC ST act as can be understood by the name itself is an app to prevent atrocities against people belonging to schedule the caste and schedule tribes the act also introduce special quotes and exclusive special quotes to run strikes after people (reference byjus.com English title schedule caste of sched-ule tribes (prevention of atrocities amendment act 2018)

లచ్చిమిని వికలాంగురాలను చేసేలా శారీరక దౌర్జన్యానికి దిగడం, బాల్యంలో ఆమె చదువుకి కులపర ఆటంకం కలిగించడం వంటివి ఈ చట్టానికి వర్తిస్తాయి. అలాగే ఆమెపై జరిగిన అత్యాచారం నిర్భయ చట్టం 2013 ద్వారా నిందితుడికి కఠిన శిక్షణ విధించగలరు. కానీ బడుగు, పేద ప్రజలకు ఇలాంటి చట్టాలపై తగిన అవగాహనలు లేక మౌనాన్ని పూనుతున్నారు. ఎదురు తిరుగుతున్నారని తెలియగానే వారిని భయపెట్టి అణచివేస్తున్నారు. లేదా చిన్నపాటి మొత్తాలను చేతిలో పెట్టి తప్పించుకుంటున్నారు. నిరక్షరాస్యత, అసహ్యతలు ఉన్న బలహీనులు కనులు తెరవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దొరబిడ్డ వంటి వారిని తప్పించే డబ్బు, అధికారాలు, మంది బలం పేదలపాలిట న్యాయాలకు అడ్డు అవుతున్నాయి. కానీ సరైన దిశలో అన్ని దారులు మూసి తప్పించుకోలేని విధంగా చర్యలు ఉంటే లక్ష్మీలా చట్టం, న్యాయాల ద్వారా పోరాటాలతో స్ఫూర్తిదాయకంగా నిలవచ్చు. ఈ ఉద్దేశ్యంతో బాధితులో చైతన్యం కలిగిస్తే వారికి సత్వర న్యాయం జరుగుతుందని రచయిత భావించి ఉండొచ్చు.

అలాగే వైకల్యం ఉన్నదని అన్యాయానికి ఎదురు ఉంటే శక్తి లేదని అనుకోనవసరం లేదు. నేటి సాంకేతికతలో మాటలు రానివారైనా వారి గొంతు ధ్వనులను మాటలుగా మార్చి వినిపించవచ్చు. అలాగే అంధులు, మానసిక వైకల్యం, బదిర వంటి వికలాంగత్వం ఉన్నవారికి తగిలిన పరిజ్ఞానాలతో జరిగింది రాబట్టే విజ్ఞానం అందుబాటులో ఉంది. అలాగే ఏ పోరాటానికైనా ఎంత అవసరమో మంది బలమూ ముఖ్యమే. అందులోనూ కథలోని దొరబిడ్డ వంటి వారే కొమ్ములు ఒంచడానికి గుంపు బలమే అవసరం. లక్ష్మికి రాజు, లాయర్, వికలాంగ సోదరులు ఒక సంస్థగా కదిలి అండగా నిలిచారు. అలాగే పలు సంస్థలు, స్త్రీవాదులు మీడియా వంటివి బాధితుల తరపు బలగాలై కదులుతున్న ఆధునిక కాలం ఇది. అందుకే ఎక్కడ అన్యాయం జరిగినా వైకల్యాలు ఉన్న బలహీనులైన గళం విప్పి పిడికిలి బిగించే కదలికతో న్యాయాన్ని అందుకోగలరని గ్రహింప చేశారు.

## తుది పయనం - తొలి విజయం:

**పరిచయం :**

ఈ కథను డా॥ నాగరాజు అసిలేటి రాశారు. ఇది డా॥ నాగరాజు అసిలేటి ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన 'మేము సైతం' కథాసంకలనంతో ప్రచురితమైనది. ఇది దివ్యాంగుల కథలకు సంబంధించిన కథా సంకలనం.

**కథ సంగ్రహం:**

కథానాయకుడు, రామకృష్ణ బాల్యస్నేహితులు. ఇద్దరు ఒకే చోట పని చేస్తూ ఒకే ప్రాంతంలోని వేరువేరు బహుళ అంతస్తుల్లో నివసిస్తుండేవారు. కథానాయకుడు ఉండే

చోట మీనాక్షి అనే ఓ మూగ, బధిర యువతి వాళ్ళ ఇల్లు ఉండేది. ఆమెతో రోజు ఆమె తల్లి, తండ్రి, అన్న ఏదో ఒక విషయంలో గొడవ పడుతూ, తిడుతూ, కొడుతూ ఉండేవారు. ఓ రోజు మీనాక్షి ఉత్తరం రాసిపెట్టి ఇంటి నుండి వెళ్లిపోతుంది. తన కాళ్లపై తాను నిలబడే దారి వెతుక్కుంటూ అక్కడ ఉండలేనని అందులో రాసి ఉం టుంది. ఓసారి కథానాయకుడు రామకృష్ణ ఉద్యోగ పని నిమిత్తం హైదరాబాద్ వెళ్తారు. అక్కడ రైల్వే స్టేషన్లో మీనాక్షి కనిపిస్తుంది. తాను బి.ఎడ్ చదివి డేఫ్ అండ్ డేమ్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాను అని చెప్తుంది. ఆమె అంటే ఇష్టపడిన రామకృష్ణ ఆమెని పెళ్లాడుతాడు.

**విశ్లేషణ :**

దివ్యాంగ స్త్రీలలో చైతన్యాన్ని సూచిస్తున్న ఈ కథనం ఎంతో మార్గదర్శకంగా ఉంది. ఆడదంటే మామూలుగానే అలుసు. అందులోనూ అంగవైకల్యం ఉన్న ఆడపిల్లలు అంటే కన్నవారికి కూడా అలుసే. అనుక్షణం అదో హింస, అయినా నా కాళ్ళపై నిలబడేందుకు వైకల్యంతోపాటు ఎవరితోనైనా పోరాడగలను అనుకుంటే అక్కడ చైతన్యం ఉందని లెక్క. అభిమానాన్ని దెబ్బతీస్తూ నీ బతుకుకి చదువు ఎందుకు? ఉద్యోగం ఎందుకు? అంటూ మనసుపై కొడితే ఆ సమ్మెట పోట్లకు దూరంగా వెళ్లాలి. అయిన వారే అర్థం చేసుకోనప్పుడు ఎవరైతే ఏ సంస్థ అయితే వెలుగుని అందించగలదో ఆ గొడుగు కిందకు చేరాల్సి ఉంటుంది. అనాథ అనిపించుకున్న, అసాధ్యు రాలై సాధించిందనే మాట విన్నప్పుడు ఆ కష్ట ఫలితం గర్వంతో ఉప్పొంగేలా చేస్తుంది. ప్రతి ఒక్కరికి కుటుంబం ఒక బలం. స్నేహితులు ఓ ధైర్యం. అదే వికలాంగులకైతే కుటుంబం బలాన్ని, ధైర్యాన్ని అందిస్తూ వెన్ను తట్టాలి. వెన్ను కూల్చేలా ప్రవర్తించకూడదు. మీనాక్షికి వినబడదు, కనపడదు కానీ ఆమెలో చదువుకోవాలని ఆశ నూతన పరిజ్ఞానంపై పట్టు సాధించాలనే జిజ్ఞాస రెండు ఉన్నాయి. ఆమె తెలివిని, తాపత్రయాన్ని ప్రోత్సహించని వారు ఇంట్లోనే ఉంటే అవి ఆమెకు పెద్ద సమస్య. ఆమె పై చదువుకి, శిక్షణకి డబ్బు దండగ అనే భావనతో పాటు వికలాంగురాలు అంటే ఒక మూలన పడి ఉండాలన్న పెత్తనమే కనిపిస్తోంది. ఆమె చదువుకై పట్టిన పంతాన్ని ఈసడించి తిప్పి కొట్టడంలో వైకల్యం ఉన్నది. మనపై ఆధారపడింది మనమేమన్నా వాళ్ళకి మనమే దిక్కు అనే అహంభావం తప్ప బాధ్యతయుతం లేదు. అలాంటప్పుడు ఆ ఇంటిని వీడి తన దారిలో వెళ్లాలనుకున్న మీనాక్షిలో ఒక వీరనారినే చూడగలం. ఆమె యుద్ధం ఆమె వైకల్యం తోనూ, రక్త సంబంధీకులతోనూ కావడంతో ఆమె పోరాటంలో ఆత్మవిశ్వాసంతో పాటు, ఒక గేయాన్ని ప్రస్తావింపజేశారు.

కనబడని, వినబడని వైకల్యం అంటే ముందున్నవి చూడలేరు. ఎవరేం చెప్పినా వినలేరు. కానీ బ్రెయిలీ లిపి ద్వారా అక్షరజ్ఞానం పొందే తెలివి ఎవరిని పట్టించుకోక తన కోరుకున్న గమ్యాన్ని చేరడమనే పట్టుదల ఉంటే ఆ వైకల్యాలు తోక ముడుస్తాయి. మీనాక్షి ఆమె గమ్యాన్ని నిర్దేశించుకుంది. 'నా కాళ్ళ మీద నేను నిలబడటానికి నా దారి నేను చూసుకుంటా నా వ్యక్తిత్వాన్ని నా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా నా అన్న మీరే ప్రదర్శించారు కాబట్టి ఈ నిర్ణయం' అని తెగేసి చెప్పింది. ఆమె పోరాటం ఆమె లక్ష్యానికి అడ్డొచ్చే వారెవరైనా వారిపైనే నని చెప్పడంలోనూ ఆత్మాభిమానమే ఉంది. ఒకనాటి స్త్రీలు వంటింటి కుందేళ్లు. అప్పటి వికలాంగులు తెగువ చూపలేక 4 గోడల చీకటి బతుకులో మగ్గిపోయారు. కానీ ఆధునిక స్త్రీకి తన అవసరాలు తెలుసు, అవకాశాలు తెలుసు. ఏ దారిలో వెళ్తే తాను అభివృద్ధి చెంది వెలుగు చూడగలదో తెలుసు. వేటికి వెరవక తాను అనుకున్నది సాధించడానికి కొన్ని సంస్థల తోడ్పాటు ఉంటుందని తెలుసు. ఇక వారెవరి కోసమో ఆగనవసరం లేదు. ఎవరి దయ, దాక్షిణ్యాల మీద ఆధారపడినవసరం అంతకన్నా లేదు. నేనుగా నిలబడాలి నేనుగా ఎదగాలి అనే నిర్ణయానికి తగిన కృషి ఉంటే చాలు. దీనికి తోడు వికలాంగ శరణాలయాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు అందించే ఆసరాని సంపాదించడం ఈ రోజుల్లో అంత కష్టమైన పని కాదు. అక్కడ చదువు చెప్పించే అవకాశంలుంటాయి. అలాగే చదువు రానివారు ఏ ఉపాధి శిక్షణ పొంది

సొంతంగా నిలబడవచ్చు. తగిన పెట్టుబడులు రాయితీలు పొంది తనకు వచ్చిన పనితో, నచ్చిన జీవితంతో మరో నలుగురికి ఉపాధిని కల్పించను వచ్చు. రిజర్వేషన్లు, చట్టాలు, హక్కులు వినియోగించుకునే వివేకం ఉన్నప్పుడు దివ్యాంగులు తాము అనుకున్నది సాధించగలరు. బిఈడి చేసి వికలాంగుల పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా చేరిన మీనాక్షి వ్యక్తులతోనూ, పరిస్థితులతోనూ పోరాడి గెలిచింది. ఆమెలోని చైతన్యం ఆమెను ముందుకు నడిపిందని చెప్పడంలో రచయిత అందించిన తర్వాత మరెందరికో మార్గదర్శకం అయ్యేలా కనిపించింది.

ఒక వికలాంగురాలు ఆత్మవిశ్వాసమే ఊపిరిగా కదిలిన ఆమె అనుకున్న గమనం వైపు వేసే అడుగులు భారమైనవే అయినా వాటిని అర్థం చేసుకుంటే ఆమె ఆ ఇంటికి వెలుగు అవుతుంది. మీనాక్షి ఇంట్లోని వారు దాన్ని గ్రహించని గుడ్డివారయ్యారు. ఆమె నిశ్చయాన్ని వినలేని బధిరత్వం వారిది. కానీ రామకృష్ణ వంటి వారికి అలాంటి చైతన్యాన్ని ఇష్టపడే పెద్ద మనసు ఉంటుంది. వైకల్యం పెళ్లికి అడ్డురాదంటూ చేయందించి తోడుగా నిలిచే విశాల హృదయం ఉంటుంది. యువతలో ఇలాంటి కదలిక ఉంటే దివ్యాంగుల జీవితాలు సంపూర్ణం కాగలవు. ఆమె చైతన్యాన్ని తెగ నరకాలన్న వారి నుండి తుది పయనమై ఆమెదైన ఉన్నత జీవనాన్ని చేరి తొలి విజయాన్ని అందుకుంది. ఇలాంటి విజయాలు అందుకునే అవగాహనలను అందిస్తూ ఎవరేమన్నా నీ దారిలో నీవు కదలి నిరూపించుకోవాలనే ఆకాంక్షకి ఈ కథ చైతన్య శిఖరం అని గ్రహించాను. స్త్రీ అబల కాదు సబల అనే సాధారణ జనులు అనడం ఆధునిక కాలంలో ఒక ముందడుగు. అదే మాట ఒక దివ్యంగురాలు అంటే అది పది అడుగుల లెక్కగా అభివర్ణించే దిశలో ఆలోచింప చేశారనిపించింది.

**ఆధార గ్రంథాలు :**


1. మేముసైతం కథా సంకలనం: సంపాదకులు -డా. నాగరాజు అసిలేటి.
2. అవిటి కథలు (వికలాంగుల బతుకు చిత్రణ): సంపాదకులు -వేముల ఎలయ్య, శంకర్ సంపంగి
3. కథా శిల్పం: వల్లంపాటి వెంకట సుబ్బయ్య


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# మానస బాంధవ్యం – విచ్ఛిన్న వివాహాలు



- రాధమ్మ బురుసు

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, వేమన పురం, కడప.

## వ్యాస సంగ్రహం :

అనంతపురం జిల్లాలో పుట్టి పెరిగి చిన్నప్పటినుండి తెలుగు సాహిత్యం పట్ల ప్రత్యేక అభిమానాన్ని పెంచుకొని సాహితీ లోకంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న శ్రీమతి పి.షహనాజ్ బేగం గారు రచయిత్రిగా మూడు కథా సంపుటాలు, మానస బాంధవ్యవ్యం అనే చక్కటి నవల పాఠకులకు అందజేశారు. నేటి సమాజంలో వివాహ వ్యవస్థ బీటలు వారుతోందనే ఆందోళన ఈ నవలలో కనబడుతుంది. ప్రేమకు త్యాగానికి చిహ్నం ఐన స్త్రీ మూర్తి ఇంటిని నందనవనంగా మార్చగలదు. నిలువెల్లా స్వార్థం, ద్వేషం, అహం నింపుకున్న స్త్రీ తనతో పాటు తన కుటుంబంలోని ఆనందాలని దహించి వేయగలదని చక్కగా పాత్రల ద్వారా చెప్పారు. వివాహం అనేది రెండు మనసుల, మనుషుల కలయికే కాదు రెండు కుటుంబాల కలయిక. వివాహానంతరం తల్లిదండ్రులు పిల్లల జీవితాల్లో ఎక్కువ కల్పించుకోరాదని, వీలైతే తల్లి దండ్రులు బాధ్యతగా తమ పిల్లల వైవాహిక జీవితాన్ని సుస్థిరం చేసుకునేలా సహకరించాలి, కానీ ద్వేషపూరిత సలహాలతో పిల్లల వివాహ జీవితాన్ని విచ్ఛిన్నం చేయ రాదని హితవు పలికారు. ఈ నవల లో ప్రధాన పాత్రలు సిద్ధార్థ, వసుంధర, ప్రియా కిరణ్,స్వాతి, సౌమ్య వీరందరూ భిన్న మనస్తత్వం గలవారు. నవల అంతటా కనిపించే మాతృమూర్తి వసుంధర. భార్యాభర్తలు తీసుకునే ఏ నిర్ణయం అయినా కుటుంబానికి హానిచేసేలా ఉం డరాదు. నిర్ణయం ఒకరిదైనా,ఆ ప్రభావం కుటుంబంలో అందరి మీద పడుతుంది. ముఖ్యంగా వారి సంతానం మీద ఆ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని పాత్రల ద్వారా రచయిత్రి చక్కగా చెప్పించారు.

**Key words :** శ్రీమతి పి. షహనాజ్ బేగం, మానస బాంధవ్యం, సాహితీ లోకం, విచ్ఛిన్నం, మాతృమూర్తి, వివాహ వ్యవస్థ, అనంతపురం.

## ఉపోద్ఘాతం :

మానస బాంధవ్యం నవల ఏక బిగిన పాటకులచే చదివించ గల నవల. కారణం నవలోని సంఘటనలు మన ఇంట్లోనో, మన అనుభవంలోనో జరిగినట్లు ఆగు పడతాయి. కుటుంబం అంటే కేవలం వ్యక్తులు కలిసి జీవించడం కాదు వారిమధ్య మానసిక బాంధవ్యము ఉండాలి. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య ఈ బాంధవ్యము ఉంటే ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా జీవితం చివరిదాకా కలిసి నడవగలుగుతారు. కుటుంబం అన్నాక

చిన్న, పెద్ద గొడవలు, అపార్థాలు రావడం సహజం కానీ వాటిని దాటగలగాలి కానీ చిన్న, చిన్న కారణాల కే విడాకుల దాకా వెళ్లడం అవివేకం.అని ఆధునిక స్త్రీ అన్ని రంగాల్లో పురుషుడితోపాటు దూసుకుపోతున్నట్లే కుటుంబాన్ని తీర్చిదిద్దుకోవడంలో నైపుణ్యం ప్రదర్శిం చాలని రాగద్వేషాలతో దాంపత్య జీవితం దూరం చేసు కునే స్త్రీ పురుషులు ఇద్దరికీ సుఖసంతోషాలు ఉండవని నవలలో చక్కగా చెప్పారు. దంపతులలో సర్దుకుపోయే మనస్తత్వం ఉంటే వివాహ బంధం పటిష్టమవుతుంది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతటి ఉన్నత శిఖరాలు అధిరోహించినా దాంపత్య జీవితం విఫలమైతే ఆ విజయాలు ఏవి స్త్రీకి కానీ పురుషుడికి కానీ సంతృప్తిని ఇవ్వవని చక్కగా సందేశం ఇచ్చారు.

మానస బాంధవ్యం నవలలో విభిన్న మనస్తత్వాలు గల దంపతుల మనస్తత్వాన్ని చూడవచ్చు.

**ఆదర్శ స్త్రీ మూర్తి వసుంధర - భర్త :**

నవలలో కథానాయకుడు అనదగ్గ సిద్ధార్థ తల్లి వసుంధర వసుంధర భర్త నవలలో ప్రత్యక్షంగా మనకు కనపడడు కానీ పురుషాధిక్య సమాజానికి ప్రతీక లాంటివాడు. భార్య అంటే బానిసలాగా భావించి ఏరోజు బాధ్యతగా ప్రవర్తించలేదు. ఇల్లు చేరినప్పటి నుండి కుమారున్న ప్రేమగా దగ్గరగా పిలుచుకోవడం పక్కన పెడితే ఎప్పుడూ కోపంగా ఉండేవాడు.సంపాదనలో ఇంటిలోకి చిల్లి గవ్వ ఇచ్చేవాడు కాదు. వ్యసన పరుడు. ఈ పరిస్థితి ల్లో సిద్ధార్థ తండ్రి ప్రమాదవశాత్తు అను కోకుండా మరణిస్తాడు. అప్పటిదాకా భర్త ప్రేమ అంటే తెలియని వసుంధర తన కుమారుని కోసమే జీవితం అనుకొని జీవిస్తుంది. భర్త మరణాంతరం భర్త ఉద్యోగం చేసుకుంటూ తన కుమారుడిని చక్కగా చదివించుకుంది. చిన్నప్పటినుండి తండ్రి పెట్టే బాధలను ను చూసిన సిద్ధార్థ చక్కగా చదువుకొని, తన తండ్రి లాగా భార్యని ఇబ్బంది పెట్టకుండా ప్రేమగా చూసుకోవాలని,అలాగే తల్లిచేయి ఎప్పుడు విడవకూడదు అనే భావాలు తనకు తెలియ కుండానే తనతో పాటు పెరిగి పెద్దయ్యాయి.

వసుంధర విషయానికి వస్తే ప్రేమ మూర్తి కరుణామయి.తన భర్త పెట్టే బాధలన్నీ భరించింది కుమారుడి కోసమే. భర్త మరణాంతరం తల్లిగా తండ్రిగా తనే మారి కుమారుని ఉత్తమంగా తీర్చిదిద్దింది.చదువు అందం మంచితనం కలబోసిన తన కొడుకు ప్రియా అనే అమ్మాయిని ఇష్టపడ్డాడని తెలుసుకొని పెళ్లంటే నూరేళ్ల ప్రయాణం ఆ ప్రయాణం సంతోషంగా సాగాలంటే భార్యాభర్తల మధ్య అనురాగం ఎంతో ముఖ్యం.ఇష్టపడిన వారితో వివాహం స్వర్గం లాగా ఉంటుందని తన కుమారుని జీవితం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లాలని, సగటు తల్లిగా ఆలోచించి ప్రియ వాళ్ళ కుటుంబం ఆర్థికంగా ఉన్నతులైన తల్లిదండ్రులను ఒప్పించి ప్రియాను కోడలుగా తీసుకువచ్చింది. వసుంధరకు ప్రియ కోడలు అయిన కూతురు లాగా ఆదరించింది. ఈ భావనతోనే ప్రియకు మానసిక జబ్బు ఉందని తెలిసిన తర్వాత ఇంకా జాగ్రత్తగా చూసు కోవాలనుకుంటుంది. కానీ ప్రియ అత్తగారి ప్రేమను అర్థం చేసుకోవడం అటుంచి అవకాశం దొరికినప్పుడల్లా అవమానించేది.

కుటుంబాన్ని నిలబెట్టాల్సిన పెద్దరికంలో తనున్నానని పరిస్థితులను చక్కబెట్టడానికి తన ప్రయత్నం తాను చేసింది. వసుంధర మంచితనం ప్రియ మూర?త్వం ముందు ఓడిపోయింది. కుమారుడికి విడాకులు అయినాక పిల్లలను కలవడానికి కోర్టుకు వెళ్ళినప్పుడు చివరి ప్రయత్నంగా ప్రియకు నచ్చ చెప్పాలని చూసింది.ఈ సందర్భంలోనే వసుంధర మాటలు నేటి యువతకు చక్కటి సందేశం అని చెప్పవచ్చు. స్త్రీకి కుటుంబాన్ని విచ్చిన్నం చేసే ఆత్మాభిమానం ఆత్మాభిమానం కాదని ఆత్మస్థైర్యం అంతకంటే కాదని, అది అహంభావమని "నా జీవితం నా ఇష్టం అన్నట్టు" దంపతులలో ఒకరు ప్రవర్తించిన వారి దాంపత్యం వికటించడమే కాకుండా పిల్లల భవిష్యత్తు. ప్రశ్నార్థకంగా మారుతుందని, మానసికంగా ఎదగని వారు మాత్రమే నా జీవితం నా ఇష్టం అనుకుంటారు. దాంపత్యం అంటే సర్దుబాటని, భార్య భర్తల బంధం అంటే మానసిక బంధం. రెండు కుటుంబాల కలయిక అని, స్త్రీకి ఉన్న ఆత్మస్థైర్యం

కుటుంబాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టాలే కానీ పాతాళంలోకి నెట్ట రాదని, నీకు ఇష్టమైతే ఎప్పటికీ మా ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయని చివరి ప్రయత్నంలో ప్రియకు నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తుంది వసుంధర. ప్రియలో ఎటువంటి మార్పు రాక పోయేసరికి కళ్ళముందే కుమారుడు వేదన భరితుడై తిరుగుతుంటే భరించలేక, తన సోదరుని కుమార్తె సౌమ్యతో సిద్ధార్థక వివాహం చేస్తుంది. వాళ్ళిద్దరూ సంతోషంగా గడపడానికి తన వంతు తోడ్పాటున అందిస్తూ, ప్రియని మర్చిపోలేక సౌమ్యను ఆదరించలేక సతమవుతమవుతున్న కుమారుడిని ఓదార్చుతూ సౌమ్య కు నచ్చచెప్పుతూ, వీరిద్దరికీ పుట్టిన ఇద్దరు పిల్లలతో శేష జీవితం వెళ్లబుచ్చుతుంది వసుంధర.ఈ నవలలో వసుంధర సంపూర్ణమైన స్త్రీ మూర్తి. ప్రతి దశలో తన బాధ్యతను చక్కగా నెరవేర్చిన శాంతమూర్తి.

### సిద్ధార్థ -ప్రియ దాంపత్యం :

నవలకు కథానాయకుడిగా సిద్ధార్థ ను చెప్పు కుంటాము. సిద్ధార్థ వసుంధర ఏకైక సంతానం సుగుణ సంపన్నుడు. తన తండ్రిని చూసి ఎలా పురుషుడు ఎలా ఉండకూడదో తెలుసుకున్నాడు.ప్రియను ప్రేమించి,పెళ్లి చేసుకున్నాడు. కానీ ప్రియ మాత్రం ప్రేమ ఉన్న లేకున్నా పరిస్థితులు ప్రభావం వలన సిధార్థ ను వివాహం ఆడాల్సి వచ్చింది. మొదట్లో సిద్ధార్థ ప్రియ దాంపత్యం అన్యోన్యంగా ఉన్న ప్రియకు గల మానసిక జబ్బు వలన కావచ్చు, తల్లిదండ్రుల ప్రభావం వలన కావచ్చు తనకు సహజంగా అబ్బిన అసూయ ద్వేషా ల వలన కావచ్చు కారణం ఏదైనా సిద్ధార్థ ప్రియాల మధ్య విభేదాలు మొదలయ్యాయి. ప్రియా ఎంత అహంకారంగా ప్రవర్తించిన సిద్ధార్థ ప్రియ మీద గల ప్రేమతో ఎక్కువగా ఆలోచించేవాడు కాదు.అదీ కాక అప్పటికే తనకు ముద్దులు మూటగట్టే ఇద్దరు కవల పిల్లలు కు తండ్రి కావడంతో పసిపిల్లల నువ్వుల మధ్యలో అవి చిన్నవిగా అనిపించేవి. ఎంత సర్దుకున్నా ప్రియా ప్రవర్తన రోజు రోజుకు వికృతి రూపం దాలుస్తోంది.దానికి ప్రియా తల్లిదండ్రులు అగ్నికు ఆజ్యం పోసేవారు. ప్రియ తండ్రి చెప్పుడు మాటలు విని సిద్ధార్థను విదేశాలకు వెళ్తే బాగా సంపాదించవచ్చని సిద్ధార్థ కు పోరు పెట్టింది. కానీ సిద్ధార్థకు తల్లిని వదిలి ఎక్కడికి వెళ్లాలని లేదు అది కాక ఎవరి మీద ఆధారపడి బతికే మనస్తత్వం సిద్ధార్థక లేదు.ఈ కారణంతో ప్రియతో ఏకీభవించలేకపోయాడు. ప్రియా దీనిని జీ ర్ణించుకోలేకపోయింది. చిన్నపిల్లల్ని వదిలేసి ఉద్యోగం చేస్తానని మొండికేసింది అంగీకరించక తప్పింది కాదు. సిద్ధార్థకు ప్రియ మీద ఉన్న అనురాగంతో అన్ని సహించ గలిగాడు కానీ తన తల్లి అనారోగ్యం తో ఆసుపత్రిలో ఉన్న తన తల్లిని ప్రియా పట్టించుకోకపోవడం సిద్ధార్థ కు చాలా వేదన కలిగించింది.తన తల్లి ఆరోగ్యం కుదుటపడ్డాక ఇంటికి చేరుకున్న ప్రియ ను చూసి కోపంతో పొమ్మన్నాడు. ఆవేశంలో అప్పుడు గడప దాటిన ప్రియా తరువాత తిరిగి చూడలేదు. సిద్ధార్థ తర్వాత వెళ్లి ప్రియ ను బతిమాలిన ఫలితం లేకుండా పోయింది. పైగా ప్రియా తల్లిదండ్రులు ప్రభావం వలన సిద్ధార్థను శత్రువు లాగా భావించింది. కనీసం పిల్లలు కూడా సిద్ధార్థ ను ద్వేషించే లాగా తయారు చేసింది ప్రియా. కుటుంబానికి సుఖసంతోషాలను పిల్లలకు తండ్రి ప్రేమను లేకుండా చేసింది. వసుంధర ప్రియకు మంచి విషయాలు చెప్పిన సిద్ధార్థ మీద కోపం, తనకున్న అహం మూలాన ఏది మనసుకు తీసుకోక తన దాంపత్య జీవితాన్ని తనే నాశనం చేసుకుంది. ఇందులో ప్రియ తల్లిదండ్రులు ప్రధాన పాత్రను పోషించి కుమార్తె జీవితాన్ని చేతులారా పాడు చేశారు. ప్రియ సిద్ధార్థ జీవితంలో నుంచి చట్టప్రకారం విడాకులు తీసుకుని బయటకు వెళ్లిన మనసులో నుండి మాత్రం తీసివేయలేకపోయాడు. విడాకుల అనంతరం కూడా తిరిగి కలుసుకోవడానికి శాయ శక్తుల ప్రయత్నం చేసి, విఫలమయ్యాడు. రెండవ పెళ్లి కి సిద్ధం అవు తున్నాడు అని తెలిస్తే అయినా ప్రియ తిరిగి తన జీవితం లోకి వస్తుందనే ప్రయత్నం చేసి సౌమ్యను వివాహ మాడాడు.ఈ ప్రయత్నం విఫలం కావడం ఒకటైతే ప్రియా కాక సౌమ్య తన జీవితంలోకి అడుగు పెట్టింది. సౌమ్యను ఆదరించలేక ప్రియను మర్చిపోలేక నరకయాతన అనుభవించాడు సిద్ధార్థ.

సిద్ధార్థ స్నేహితుడు కిరణ్ మరణించాక కిరణ్ భార్య

స్వాతి కొడుకును వేరే వాళ్లకు దత్తత ఇచ్చి రెండో వివాహం చేసుకున్నప్పుడు ఏమిటి ఈ లోకం వీళ్ళు అసలు మనుషులేనా? వీళ్ళకి హృదయమంటూ ఉందా ఎంత సులభంగా జీవిత భాగస్వామిని మర్చిపోగలరు. జీవించిన కొంతకాలం అయినా ఆ జ్ఞాపకాలు ఎలా మర్చిపోయి జీవితంలోకి ఇంకొక వ్యక్తిని ఆహ్వానించగలిగింది.స్వాతి అది కుమార్ మీద తప్పు చేసి మరి ఇంకో వివాహం చేసుకుని శక్తి అంతెలా వచ్చిందని చాలా బాధపడ్డాడు తను మాత్రం ప్రియాతి జీవించండి కొంతకాలం అయినా అవే జ్ఞాపకాలతో జీవితాన్ని ముందుకు సాదిస్తున్నాడు ఇక్కడ సిద్దార్ధ్ పేరుతో ఏర్పరచుకున్నా మానసిక బంధం కిరణ్తో స్వాతి ఏర్పర్చుకోలేకపోవడం మనం గమనించవచ్చు ప్రియ తో పాటు కార్యక్రమం అయినా పిల్లలు కూడా సిద్ధార్థమే ద్వేషించడం మొదలుపెట్టారు. దూరమైన పిల్లలైనా దగ్గర అవుతారు అనుకున్నా సిద్దార్ధ ఆశ కూడా అడియాస అయిపోయింది.

ఆ తర్వాత సిద్ధార్థ తన జీవితంలో విడిపోయిన జంటను చూసినప్పుడు విలవిల్లాడిపోయేవాడు అదే పనిగా వారి దగ్గరకు వెళ్లి విడిపోవడం మంచిది కాదని తర్వాత బాహ్యంగా ఆనందంగా కనిపించిన లోలో న ఏదో తెలియని మానసిక క్షోభ కు గురవుతారని చెప్పే వాడు. జీవితంలో రాజీ పడాలని సర్దుబాటు ఉండాలని లేకుంటే తన జీవితం లాగే అయిపోతుందని ఉద్బోధ చేసేవాడు.

### సౌమ్య పాత్ర స్వభావం :

నవలలో సౌమ్య పాత్ర పాఠకులకు కరుణ రసాన్ని కలిగిస్తుంది. సౌమ్య ప్రియా స్థానంలో సిద్దార్ధ జీవితంలోకి మాత్రమే ప్రవేశించింది మనసులోకి కాదు. వివాహానంతరం సిద్ధార్థ సౌమ్యను భార్యగా ఆదరించలేదు. అయినా సౌమ్య ఓర్పుతో నేర్పుతో తన వివాహానికి సార్థకత కల్పించుకోవాలని సిద్ధార్థకు అన్ని అవసరాలు దగ్గర ఉండి ఎంతో ప్రేమతో తీర్చేది. స్త్రీ సహజమైన అసూయ సౌమ్యకు ఉంది. ప్రియ తో పోల్చుకుంటే సౌమ్య అన్ని విధాల గుణవంతురాలైన భర్త మనసులో ప్రియ స్థానాన్ని భర్తీ చేయలేకపోతున్నానని సౌమ్య బాధపడేది.

తన భర్త మనసులో మరొక స్త్రీ ఉందని తెలిసినా, సహనంతో తన భర్తను మార్చుకోవాలనుకున్న సౌమ్యకు సిద్ధార్థ అంటే ఎనలేని అభిమానం. ఏ స్త్రీ కూడా పరాయి స్త్రీని తలుచుకుంటూ బాధపడుతున్న భర్తను ఊరడించే ప్రయత్నం చేయదు. కానీ సౌమ్యత వివాహానికి ఇచ్చిన విలువ, సంస్కారవంతమైన హృదయం చేత భర్త బాధ పడుతున్న సమయంలో భర్తను ఆనందపరచడానికి శాయశక్తుల ప్రయత్నించేది. ఇక్కడ సౌమ్య జీవితం అన్యాయమైనట్టు పాఠకులకు కనిపించిన సౌమ్య మాత్రం తన భర్త ఎప్పటికైనా మారతాడుఅని భావించేది.

సిద్ధార్థ మనసు ఎప్పటికీ మారదని సౌమ్య కు రూఢీ అయిన, కుటుంబం పట్ల తన బాధ్యతను ఎక్కడా మరువ లేదు. ఇక్కడ స్త్రీ సహజనేజమైన సర్దుకు పోవడం మొదలు పెట్టింది. సౌమ్య జీవితం చూసి లోకానికి వడ్డించిన విస్తరి. ఇద్దరు పిల్లలు ఏ లోటు లేకుండా చూసుకునే భర్త, ఆదరించే అత్త ఇంతకన్నా ఆడపిల్లకు మెట్టినింట్లో ఏమి కావాలి అంటుంది లోకం. కానీ భర్త మనసులో స్థానం లేనప్పుడు ఇవన్నీ వ్యర్థమే స్త్రీకి. ఈ అసంతృప్తి సౌమ్య మనసులోతులో ఉంది కానీ ఏ రోజు ఆ అసంతృప్తిని బయట పెట్టలేదు.

సౌమ్య జీవితం చదివిన పాఠకులకు పాత భావాలతో మెలిగే స్త్రీగా కనబడిన తమ వివాహం ఏ పరిస్థితుల్లో అయినా,భర్త మనసులో చోటు ఉన్నా లేకపోయినా తన మనసు నిండా భర్తే ఉన్నాడు కనుక ఆ వివాహ బంధానికి విలువని ఇచ్చింది. తన కు చేతనయినంతగా కుటుంబాన్ని తీర్చిదిద్దింది. భర్త మనసులో స్థానం అటు ఉంచితే, తల్లిగా, భార్యగా, కోడలిగా, తన బాధ్యతను సౌమ్య చక్కగా నెరవేర్చింది.

### కిరణ్ స్వాతిల దాంపత్యం :

మానస బాంధవ్యం నవలలో మరొక జంట కిరణ్ స్వాతి. కిరణ్ సిద్ధార్థ బాల్య స్నేహితులు.ఏ బాధ కలిగిన సిద్ధార్థ కిరణ్ కి చెప్పి స్వాంతన పొందేవాడు. కిరణ్, స్వాతి లది పెద్దలు కుదిర్చిన వివాహం. వివాహానంతరం స్వాతిని కిరణ్ తనతో పాటు తెచ్చుకోక వాళ్ళ అమ్మ వాళ్ళతో వదిలి సిటీకి వస్తాడు. కిరణ్ తోడుబుట్టువులు ప్రవర్తనతో స్వాతి

విసిగిపోతుంది. వివాహానంతరం తన భార్య తనతో ఉండాలని కిరణ్ ఆలోచించలేదు.ఇద్దరు మధ్య మానసిక బంధం ఏర్పడడానికి ఎక్కడ అవకాశం లభించలేదు. ప్రమాదవశాత్తు కిరణ్ మరణించడంతో తన భర్త ఉద్యోగం చేసుకుంటూ కిరణ్‌కు, తనకు పుట్టిన కుమారుడుని చూసుకుంటున్న ఎంతో కాలం ఇలాంటి జీవితాన్ని గడప లేని అనుకుని తన కుమారున్ని దూరం బంధువు లకు భక్తి ఇచ్చి మరీ వేరే వ్యక్తిని వివాహం చేసుకుంటుంది స్వాతి. తమ మనవడుని దత్తత చేయడం తెలిసిన ఏమీ చేయలేని స్థితి కిరణ్ తల్లిదండ్రులది.ఎందుకంటే వయసు మీద పడిన కిరణ్ తల్లిదండ్రులు తమ బతుకే భారమైన పక్షంలో మనవన్ని ఎలా పెంచగలుగుతారు అందుకే బాధ కలిగిన తమ మనవడు ఎక్కడున్నా సంతోషంగా ఉంటే చాలని సమాధానపడతారు. స్నేహితుని కుమారుడిని ఆ స్థితిలో సూచి సిద్ధార్థ చాలా బాధపడతాడు.

**ముగింపు :**

సమాజానికి పట్టుకొమ్మ కుటుంబం. కుటుంబ వ్యవస్థను ముందుకు నడిపించేది వివాహం. వివాహం అనేది ప్రతి వ్యక్తి జీవితంలో ప్రధానమైన ఘట్టం. వేరువేరు కుటుంబ నేపథ్యాల నుండి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒకే గూటిలో ప్రేమానురాగాలతో జీవిస్తూ సమాజానికి మంచి పౌరులను అందించాలంటే మొదట వారి మధ్య మానసిక బంధం బలంగా ఉండాలి. ఈ బంధం భార్యా భర్తల మధ్య ఉంటే జీవితం నందనవనం అవుతుంది. భార్యాభర్తలు భౌతికంగా కలిసి ఉండటం కాకుండా మానసికంగా ఒకరికొకరు అన్నట్టు జీవించాలి. అలా ఉంటే విభేదాలు వచ్చినా సమసి పోతాయి. అలా కాక ఈర్ష ద్వేషమహంకారం నింపుకొని భార్యాభర్తలు నువ్వెంత అంటే నువ్వెంత అనే ఇజాలకు పోతే కుటుంబం అంతా నష్టపోతుంది. సర్దుబాటు అనేది వివాహానికి ప్రాథమిక సూత్రం. ఇద్దరి మధ్య సర్దుబాటు ఉండాలి. చేతులు కలిస్తేనే చప్పట్లు అవుతాయి వివాహ బంధంలో ఎవరు ఎక్కువ తక్కువ లేవు. సంసారం అనే రథానికి రెండు చక్రాలు భార్యాభర్తలు. వివాహం ఇచ్చిన మౌలానికి తల్లిదండ్రులు కారణం అవుతున్నారు. తమ అనుభవాన్ని జోడించి పిల్లలకు సంసార సూత్రాలు వర్ణించాల్సిన తల్లిదండ్రులు పిల్లలకి ఈర్ష్యా, ద్వేషాలు పెంచి తమ పిల్లల వైవాహిక బంధానికి వారే ఆటంకం కలిగిస్తున్నారు. కుటుంబంలో ఒకరు తీసుకునే అనాలోచిత నిర్ణయం యొక్క ప్రభావం కుటుంబం మొత్తం మీద చూపుతుంది. మానస బాంధవ్యం నవలలో ప్రియా పాత్ర చూస్తే ఈ విషయం స్పష్టంగా పాఠకులకు అర్థం అవుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. మానవ సంబంధ బాంధవ్యం పి.సహనాజ్ బేగం

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# డి.కె.చదువులబాబు గారి బాలల కథలు – సాహాజికత

- యం. శైలజ



పరిశోధక విద్యార్థిని,
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీపద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం,
తిరుపతి.

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

పర్యవేక్షకులు,
తెలుగు శాఖాధ్యక్షులు,
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీపద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం, తిరుపతి.



కథానిక అంటే "పరిమాణంలో చిన్నది; రసవంతంగా సాగేది; దైనందిన జీవితానికి దగ్గరగా వుండేది; అందరినీ అలరించేది; ఎక్కడా వెసులుబాటులేకుండా చిక్కనైన రచనాపాటవంతో ఆద్యంతమూ పాఠకుణ్ణి ఆకట్టుకుని ఆసక్తితో చివరిదాకా చదివించేది; తరువాత అతని ఆలోచనలకు పనికల్పించి పదికాలాలపాటు జ్ఞాపకం వుండిపోయేది"[1]. ఇతర సాహిత్య ప్రక్రియల అన్నింటికన్నా కథకు ఆదరణ ఎక్కువ. "ఒక రకమైన ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, కొన్ని పాత్రలు, ఆ పాత్రలకు చక్కని పోషణ, వస్తువిన్యాసవైశిష్ట్యం, ఏదైనా ఒక జీవితసత్యాన్ని ప్రతిపాదించడం, అన్నింటినీ మించి వస్త్వైక్యం వుండి వినోదమో, విజ్ఞానమో, వికాసమో కలిగించగల చిన్నకథ 'కథానిక' "[2]. కథ చెప్పాలనే కుతూహలం, వినాలనే ఆసక్తి మనిషికి సహజసిద్ధమైనవి. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం సాధించని పరమార్థం ఒకటి కథానిక సాధించింది. కొన్ని కథలు ఉపదేశాత్మకంగా ఉంటాయి. ఒక్కొక్క కథ మనసులో నిద్రాణమై వున్న శక్తులను వెలికితీస్తుంది. కొన్ని కథలు మనస్సును మేల్కొల్పుతాయి. ఒక కథ కడుపుబ్బా నవ్విస్తుంది. ఈ విధంగా కథలు పాఠకులలో రసానుభూతిని కల్గిస్తాయి. ఈ కథాప్రపంచంలో విశిష్టమైన గుర్తింపుతో బాలల కథలు కన్పిస్తాయి.

నేటి బాలలే రేపటి పౌరులు. ఉత్తమ పౌరులు సమాజానికి ఎంతో అవసరం. జీవితంలో బాల్యం అత్యంత ప్రముఖ దశ. ఆ దశలో పిల్లల మదిలో ముద్రించబడిన వ్యక్తులు, సన్నివేశాలు, సంఘటనలు వారి జీవిత దశలో ప్రభావితమైన ఆలోచనా సరళికి బీజం వేస్తాయి. అందుకే విద్యార్థి దశలో నేర్చుకొనే క్రమంలో ఆసక్తిని రేకెత్తించే అంశాలకు ఆకర్షితులవుతారు. కథలు పిల్లల పెరుగుదలకు, వారి మానసిక వికాసానికి దోహద పడతాయి. రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకూ కూడా తెలుగులోగిళ్ళు సాయంత్రపు వేళల్లో కథల ప్రపంచంలో మునిగితేలుతుండేవి. నేడు పట్టణీకరణ, ఆధునికతలవైపు మోజు, దృశ్య అంతర్జాల మాధ్యమాలతో సాంకేతికతను అరచేతిలో వుంచుకుని ఒకరినొకరు మాట్లాడుకొనే సమయాన్నే కోల్పోయారు. నేటి ఆధునికకాలంలో పిల్లలకు విడమరచి, విపులంగా ఏదైనా అంశాన్ని చెప్పే సహన శీలులు తక్కువయ్యారు.

1. కథలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, నిశ్చల

స్వభావాన్ని పెంపొందించడమే కాకుండా భాషను నేర్చుకోవడంలోను దోహదపడతాయి. కడప జిల్లాలోని కమలాపురం మండలం పెద్దచెప్పలిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డి.కె.చదువులబాబు తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన కడప జిల్లాకు చెందిన బాలసాహితీవేత్త. ఈయన రచనా ప్రస్థానానికి 1986 ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివే సమయంలోనే బీజం పడింది. అప్పుడు ఆయన రాసిన 'బల్లి తన పాటేరుగదు' కథను బొమ్మరిల్లు పత్రికలో ప్రచురించారు. అలా తొలికథ ప్రచురణ ప్రోత్సాహంతో మొదలైన రచనా ప్రస్థానం 40 సంవత్సరాలపాటు నిరంతరాయంగా సాగింది. నేడు జాతీయ స్థాయిలో తెలుగు విభాగంలో ఉత్తమ బాలసాహిత్య రచయితగా స్థానం లభించింది. ఇప్పటివరకు సుమారుగా 700 పైగా బాలల కథలు రాశారు. 'బాలల కథలు, విజయ రహస్యం, చిన్నారి మనసు, కరాళకథలు, మాయావిసనకర్ర, దేశభక్తి, వజ్రాల వాన' వంటి అనేక బాలకథా సంపుటాలు వెలువరించారు. 50 పైగా బాలగేయాలు రాశారు. 50 సాహిత్య వ్యాసాలు, 100 కవితలు, 'చిన్నారిమనసు, నవలోకం, ఆకుపచ్చ ఆయుధం', తదితర నాటకాలు కూడా రాశారు. 'శిల్ప సుందరి, కామరూపిణి' అనే బాలనవలలు రచించారు. ఆయన రాసిన 'వజ్రాలవాన' కథా సంపుటికి 2023 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మకమైన కేంద్రసాహిత్య అకాడమి బాలసాహిత్య పురస్కారం లభించింది. ఇప్పటికీ ఆయన నిరంతరాయంగా రచనలు చేస్తూవున్నారు.

2. "పిల్లల మనసులో ఈర్ష్య, అసూయలు తలెత్తితే వెంటనే తుంచేయాలి. అపుడే వాళ్ళు ఆరోగ్యకర వాతావరణంలో పెరుగుతారు. చిన్నప్పటి నుంచి నైతిక విలువలతో పెంచితే రేపటిరోజున వాళ్ళు మంచి పౌరులుగా ఎదుగుతారు"[3]. మంచి చెడు విచక్షణాశక్తి, ఇతరులకు సహాయపడాలనే గుణాలను చిన్నప్పటినుంచి పిల్లలు అలవరచుకోవాలి. 'బహుమతి' కథాసంపుటిలోని 'మిడత మంచితనం' కథ అలాంటిదే. మిడత జింకతో స్నేహం చేయాలని వస్తే నల్లగావుందని జింక అవమానిస్తుంది. ఒకరోజు వేటగాడు జింకకు బాణం గురిపెడుతుంటే, వేటగాడి ముఖం మీదకు ఒక్క ఉదుటున దూకి మిడత భయపెట్టింది. దానితో బాణం గురి తప్పింది. జింక పారిపోయింది. రెండవసారి పులి మెల్లగా అడుగులు వేస్తూ జింక దగ్గరకొస్తుండగా, మిడత దాని స్నేహితులబృందం ఒక్కసారిగా పులిమీదకు దాడిచేయగా పులిగాండ్రించింది. ఆ అరుపుతో జింక తప్పించుకొంది. అంటే మిడత జింకతో స్నేహం ఆశించి వస్తే గర్వంతో హేళన చేసింది. కానీ, అవేవి మనసులో పెట్టుకోకుండా జింక ప్రాణాలు కాపాడింది మిడత. మంచి మనసుకు మించిన అందం ఎక్కడాలేదు. ఈ కథ ద్వారా సమాజంలో మనుషుల మధ్య స్నేహం, పరస్పర సహకారం వుండాలి. ముఖ్యంగా పిల్లలు పాఠశాల దశనుండే స్నేహ, సహకారగుణాలు అలవరచుకోవాలని రచయిత తెలియజేశాడు. ఆపదలు వచ్చినప్పుడు "కష్టాలలో ఆదుకొనేవాడు నిజమైన స్నేహితుడు"[4]. స్నేహానికి రంగు, రూపు, పేద, ధనిక తేడాలు లేవు. ఒకరిపై ఒకరికి ఉండే ప్రేమాను బంధమే వారిమధ్య స్నేహబంధం. ఏ సాధనాసంపత్తి లేకపోయినా బుద్ధిమంతులు పరస్పర స్నేహంతో మేలు పొందుతారు.

జీవితంలో గెలుపు-ఓటమిలు సహజం. ఏదైనా సాధించాలంటే పట్టుదలతో, సహనంతో, సాధించాలి. దీనికి సంబంధించిన 'బహుమతి' కథల సంపుటిలోని 'విజయ రహస్యం' కథ. ఈ కథలో తిలక్ అనే 10వ తరగతి విద్యార్థికి పట్టుదలతో ఎలా చదవాలో మోహన్‌రావుగారు చెప్పారు. నీళ్ళలో వున్నప్పుడు గాలి పీల్చుకోవడం అనే లక్ష్యం తప్ప మరేదీ గుర్తుపెట్టుకోక, లక్ష్యంపై మాత్రమే ఏకాగ్రత నిలిపి తపనతో ప్రయత్నించాలి. అదే విజయ రహస్యం. థామస్ ఎడిసన్ ఎలక్ట్రిక్ బల్బులోని కార్బన్ ఫిలమెంటును తయారుచేసే ప్రయత్నంలో దాదాపు 12000సార్లు ప్రయోగాలు చేసి అపజయాన్ని పొందుతూ చివరికి కనిపెట్టగలిగాడు. అపజయం అనేది మనం పోతున్న మార్గం సరైనదికాదు, దారిమార్చుకోమని చెబుతుంది కానీ సాధించాలనే కోరికతో రగిలిపోయేవారికి అపజయం తాత్కాలికమే అవుతుంది. "శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది"[5]. విజయం

సాధించాలంటే పట్టుదల, సహనం కలిగివుండాలని రచయిత తెలియజేశారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అని వేమన అన్నారు. విజయం సాధించిన వారు రాత్రికి రాత్రే ఆ స్థాయికి చేరలేదు. పనిపట్ల అంకితభావం, ఏకాగ్రతతో గెలుపును పొందేదాక అలుపెరుగక ప్రయత్నం చేస్తే నెమ్మదిగా జయాన్ని పొందుతారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల విజయాన్ని అందిస్తాయి.

3. ఏ అవయవం పనిచేయకుండా సోమరిగా తిని కూర్చుంటే శరీరం, ఆరోగ్యం రెండూ పాడవుతాయి. అలాగే పౌరులు సోమరులైతే సమాజం కూడా పాడవుతుంది. అలాంటిదే 'వజ్రాలవాన' కథ. ప్రజలందరి శ్రేయస్సుకోరి అమరసేనుడు అనే రాజు ఒక మహర్షిదగ్గర ప్రతి పౌరునికి తన రాజ్యంలో వజ్రాలవాన కురిసేలా వరం కోరుకొన్నాడు. దాని పర్యవసానం రాజ్యంలో ఎవరూ పనిచేయకుండా ఎవరి శక్తికొలదీ వారు వజ్రాలను తెచ్చి, ఇళ్ళు నింపు కొన్నారు. కానీ రైతులు పంటలు పండించక, అన్ని వృత్తుల వాళ్ళూ వాళ్ళ పనులు మానుకుని సోమరిపోతులైనారు. కష్టపడటం మానివేశారు. సైనికులు కూడా విధులు నిర్వహించక పోవటంతో యుద్ధం ముంచుకొచ్చింది. కరువు వచ్చింది. అయితే జీవుల ప్రాణాలను నీరు, ఆహారం మాత్రమే కాపాడగలవు. వాటిని సమకూర్చే వర్షం చినుకులు వజ్రాలకంటే విలువైనవని రాజు తెలుసు కున్నాడు. ఆ వరాన్ని వెనక్కు తీసుకోమని మహర్షిని ప్రార్థించాడు. శరీరంలో అన్ని అవయవాలు దేనిపని అది సక్రమంగా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. ఈ కథ ద్వారా అన్ని వృత్తులవారు ఎవరిపనివారు చేయాలి. రైతులు పంటలు పండించాలి. సైనికులు, ఉద్యోగులు వారి విధులను నిర్వర్తించాలి. సోమరితనం విడనాడి ఎవరి విధులు వారు నిర్వర్తిస్తే ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని రచయిత తెలియజేశారు. "ఆయాచితంగా వచ్చిన ధనం మేలు చేయదు. కీడు చేస్తుంది"[6]. శ్రమకు మించిన సంపద లేదు అని రచయిత తెలియజేశాడు.

4. కష్టేఫలి అన్నారు పెద్దలు. కష్టపడి చెమట చిందిస్తే ప్రతిఫలం ఖచ్చితంగా వుంటుంది. శ్రమ పడకుండా సులభంగా మన దగ్గరికి ఏదీరాదు. ఇలాంటిదే 'దాచిన విత్తనాలు' కథ. ఇందులో నారాయణ చదువుకోడు. పెద్ద వాడైనా కష్టపడి ఏ పనీ చేయకుండా, ఏదో ఒక రకంగా డబ్బులు సంపాదిస్తానని డాబులు చేప్పేవాడు. ఒకనాడు తన మేనమామ మాధవయ్య వచ్చి ఇచ్చిన విత్తనాల్లో సగం విత్తనాలు చిన్నకుండలో దాచమని, మిగిలిన సగం విత్తనాలు కుండీలో నాటమని, రోజూ నీరుపోయమని చెప్పాడు. కొంత కాలం తర్వాత చూస్తే కుండలో దాచిన విత్తనాలు అలాగే వున్నాయి. కుండీలో నాటిన విత్తనాలు మొలకెత్తి పూలను ఇచ్చాయి. ఈ కథలో రచయిత మంచి ఆలోచనలు విత్తనాల వంటివి. విత్తనాలను నాటితే పూలు, కూరగాయలు, పండ్లు మొదలైన రూపాలలో మంచి ఫలితాలనిస్తాయి. దాచివుంచితే ఆలాగే వుండి పోతాయి. అదేవిధంగా ఆలోచనలను అమలుపరిస్తే ఫలితముంటుంది. తనలోనే వుంచుకొంటే ప్రయోజనం లేకుండా పోతాయి. ఆచరించని ఆలోచనలకు అర్థం లేదు. మంచి ఆలోచనలను శ్రద్ధగా, ప్రణాళిక ప్రకారం అమలు చేస్తే ఫలితముంటుంది. ఏ పనీ చేయక స్తబ్ధంగా వుంటే ప్రయోజనం లేదని తెలియజేశారు.

## ముగింపు

సమాజంలో బాలలు చదవడం, వినడం వరకు మాత్రమే కాకుండా, కథలోని పాత్రలు, అవి చేసే ప్రయత్నాలు, పొందే విజయాలు తెలుసుకొని ప్రేరేపితు లవ్వాలి. తాము కూడా అద్భుత ప్రయత్నాలు, సాహసాలు చేసి విజయాలు పొందాలి. క్రమంగా వాటివల్ల వారిలో సమస్యలకు స్పందించే గుణం అలవడి, పరిష్కారదిశగా ఆలోచిస్తారు. బాలసాహిత్యం మంచి విషయాలు పిల్లల మనసులో బలంగా నాటుకుపోవాలి. వారిలోని అంతర్గత శక్తులను బయటకి తీసి మనోవికాసాన్ని కలిగించాలి. శ్రమ, పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి మూల స్తంబాలు అని పిల్లలు ఈ కథల ద్వారా గ్రహిస్తారు. చదువుల బాబు గారు రాసిన కథలను చదవడం ద్వారా పిల్లలు చిన్ననాటి నుండే నైతికవిలువలను అలవరచుకుని, పెద్దయ్యాక సమాజాన్ని ఉన్నతకోణంలోనే చూస్తారు.

పిల్లలను మంచిదారిలో నడిపించాలంటే బాలసాహిత్యం ఒక మంచి మార్గం. బాలలను దేశాభ్యున్నతికి అనుకూలంగా తీర్చిదిద్దటంలో మంచి సమాజాన్ని రూపొందించటంలో బాలసాహిత్యం ప్రముఖపాత్ర వహిస్తుంది. అందుచేతే బాలలకథా రచయితలు మంచి మంచి కథలను బాలల కోసం రాస్తున్నారు.

## పాదసూచికలు

1. తెలుగు కథానిక - సత్యనారాయణమూర్తి. పోలాప్రగడ పుట-2 తెలుగు అకాడమి ప్రచురణ.
2. కథావాఙ్మయము - దక్షిణామూర్తి.పోరంకి - పుట-9-ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ - తెలుగు సాహిత్య అకాడమి - హైదరాబాదు.
3. విశాఖ సంస్కృతి - ఉత్తమ బాలల కథలు సంకలనం - 2022. సన్యాసిరావు. శిరేల - పుట - 69, విశాఖసంస్కృతి ప్రచురణ, విశాఖపట్నం.
4. ఈసఫ్ నీతి కథలు - డా॥ ప్రకాశరావు.పి.యస్. - పుట - 16. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
5. పసిడిమొగ్గలు (మంగళం ట్రెండ్స్ బడిప్లిలలు కథలు) కిట్టన్న. నెమలేటి - పుట.28, విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి - చిత్తూరు జిల్లా - జూలై 2020.
6. మహామాయగాడు - పిల్లల నీతి కథలు - వియోగి - పుట-7, శ్రీకృష్ణ పబ్లికేషన్స్, కర్నూలు.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు - స్త్రీ పురుష సంబంధాలు - వర్గ వైరుధ్యాలు



- గోలె పుష్ప

జె.ఆర్.ఎఫ్., శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి 1959లో వరంగల్ జిల్లాలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. ఇరవై ఏడు సంవత్సరాలు గోదావరిఖనిలో బొగ్గుగనుల్లో ఉద్యోగం చేశాడు. కత రచనలో ప్రవేశించి సాహిత్య ప్రపంచంలో చర్చలకవకాశం ఇచ్చిన మంచి కథను రాశాడు.

అతని కథలు రెండు రకాలుగా వుంటాయి. 1. ఉత్తర తెలంగాణ ఉద్యమచిత్రం నేపథ్యంగా సాగినవి. ఇది ప్రజా పోరాటాలు తెచ్చిన పరిస్థితులకు ప్రతిస్పందన లనదగిన కథలు, 2. వర్తమాన సామాజిక పరిణామ క్రమంలో విచ్ఛిన్నమవుతున్న మానవీయ విలువలు, మానవ సంబంధాల చిత్రణ. ఈ రెండు తరమా కథల్లోనూ గోచరించే ఒక ప్రత్యేక గుణం. కథా వస్తువుకు సంబంధించిన రచయిత చైతన్యం.

రఘోత్తమరెడ్డి గారు తాను రాయాలనుకున్న కథను చాలా లోతుగా చూస్తారనీ, మానవ సంబంధాల్లో, విలువల్లో ఉద్యమాలు తీసుకువస్తున్న ఘర్షణను సంక్లిష్టంగా, ప్రతిభావంతంగా చిత్రిస్తారు. ప్రొ॥ జి. హర గోపాల్ గారు అన్నారు.

సదాశ్రోతగా ఉండి తనను కదిలించిన జీవిత శకలాలను వస్తువులుగా చేసుకొని కథలు రాయడమే తెలిసిన మనిషి అని కాశీపట్నం రామారావు గారు అన్నారు.

చా.సో. రావిశాస్త్రి, కా.రాల నుంచి కొత్త కథల్ని ఆశించే అవకాశాన్ని పోగొట్టుకుని దిగులుగా ఉన్న నాలాంటి కథాభిమానుల్లో ఆశ రగిలించిన కొద్దిమంది యువ రచయితల్లో రఘోత్తమరెడ్డి ముఖ్యుడు అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు అన్నారు.

తను కోరుకుంటున్న అచ్చమైన, సృజనాత్మకమైన కళాత్మకమైన జీవితం కోసం, మనుషుల కోసం, విలువల కోసం పరితపించే మనిషి అని అల్లం రాజయ్య గారు అన్నారు.

భూగర్భంలో పొరలుపొరలుగా అల్లుకున్న బొగ్గుట్ట లను చెమ్మాసుతో తోడినట్టే, మానవ సంబంధాలలో పొరలు పొరలుగా విస్తరించిన అనేక ఉద్వేగాలను రఘోత్తమరెడ్డి, తన కలంతో తవ్వి కథలు కుప్పలు పోసి పెట్టాడు అని ప్రేమతో ఎన్.వేణుగోపాల్ గారు అన్నారు. అందులో అతిశయోక్తి ఏమీలేదు. తమ్మేటి రఘోత్తమరెడ్డి ఒక భారతీయ రచయిత మరియు టెర్రస్ గార్డెనింగ్ ఔత్సాహికుడు. తెలుగు వంటకాలు మరియు తోటపని, ముఖ్యంగా పైకప్పు తోటపనిపై తన పుస్తకాలకు ప్రసిద్ధి చెందారు. అతను టెర్రస్ గార్డెనింగ్ యొక్క ప్రమోటర్ కూడా మరియు అతని అభిరుచి మరియు నైపుణ్యాన్ని చర్చిస్తూ వివిధ మీడియా సంస్థలలో కనిపించాడు.

| కథలు | పత్రికలు | పత్రిక అవధి | ప్రచురణ తేది |
|---|---|---|---|
| 1. ఉరి | ఆంధ్రజ్యోతి (దీపావళి) | వార్షిక | 1992-11-10 |
| 2. ఒక్కటైతే | సృజన | మాసం | 1981-12-01 |
| 3. ఓ పిల్లి కథ | ప్రజాసాహితి | మాసం | 1984-03-10 |
| 4. ఓ మెరుపు మెరిసింది | స్వాతి | మాసం | 1985-09-01 |
| 5. చావువిందు | ఆంధ్రజ్యోతి (దీపావళి) | వార్షిక | 1992-11-10 |
| 6. దిక్కారం | సృజన | మాసం | 1981-05-01 |
| 7. నీళ్ళతగువు | సృజన | మాసం | 1982-05-01 |
| 8. పగలూరేయి శ్రమపడుతున్నా | ప్రజాసాహితి | మాసం | 1984-06 |
| 9. పనిపిల్ల | ఆంధ్రజ్యోతి (దీపావళి) | వార్షిక | 1994-05-10 |
| 10. ప్రయోగం | అరుణతార | మాసం | 1984-05-10 |

**రచనలు :**

**తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల విశ్లేషణ :**

ఇతను తన రచనల ద్వారా సామాజిక విషయాలపై విమర్శనాత్మక దృక్పథాన్ని అందిస్తారు. అతని కథలు, సమాజంలోని వివిధ వర్గాల జీవన శైలిని, సమస్యలను, ఆలోచనలను ప్రతిబింబిస్తాయి.

**విశ్లేషణకు ఉపయోగపడే కొన్ని అంశాలు :**

**సామాజిక విమర్శ** : తమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లో సామాజిక సమస్యలైన ఒత్తిడిలేని చదువులు, ఆధునిక జీవనశైలిలోని మార్పులు వంటివి చర్చించబడ్డాయి.

**ప్రశ్నించే ధోరణి** : పాఠకులు ఆలోచించే విధంగా, సమాజంలోని కొన్ని అలవాట్లను, దృక్పథాలను ప్రశ్నించేలా ఆయన కథలు ఉంటాయి.

**మానవ సంబంధాలు** : అంతేకాకుండా, మానవ సంబంధాలలోని, సంక్లిష్టతను, వ్యక్తుల మధ్య జరిగే సంభాషణలను కూడా విశ్లేషిస్తారు.

**వాస్తవిక చిత్రణ** : ఆయన కథలు వాస్తవ జీవితంలోని సంఘటనలను వ్యక్తులను, వారి భావాలను నిజాయితీగా చిత్రించే ప్రయత్నం చేస్తాయి.

**భాషాశైలి** : అతని రచనా శైలి సరళంగా, స్పష్టంగా ఉంటుంది. అదే సమయంలో పాఠకులను ఆలోచింప జేస్తుంది.

**జీవనతత్వం** : తమ్మేటి రఘోత్తమరెడ్డి కోట్స్‌లో జీవన సత్యం గురించిన ఆయన అభిప్రాయాలు స్పష్టంగా కని పిస్తాయి. కొద్దిగా బతకడానికి కొద్దిగా చాలు, విలాసంగా బతకడానికి ఏమి సరిపోవు.

పనిపిల్ల కథలో మహేంద్ర అనే పాత్ర నిత్యం తన భార్యతో ఘర్షణ పడుతూ కారనాలు అన్వేషించే మార్గంలో పయనిస్తుంది. ఇందులో భాగంగా భార్యకోసం పనిపిల్లను వెతకడానికి మహేంద్ర స్నేహితుని ఊరికి వెళ్ళాడు అదే విధంగా "జాడ కథలో".

తెలంగాణలోని సర్వసాధారణమైన పరిస్థితులలో మాదిరిగానే సుజాత అనే గృహిణి పోలీసులు మాయం చేసిన తమ్ముణ్ని వెతుక్కుంటూ వెళుతుంది. ఈ ప్రయాణంలో ఆమె తన భర్త మధుసూదన్‌తో తన కెదురవు తున్న సంఘర్షణను నెమరువేసుకుంటూ తనకు భర్తకు తన తమ్ముడికి మధ్య వున్న వైరుధ్యాలను, శత్రుత్వాన్ని విశ్లేషించుకుంటూ వెళ్తుంది.

పనిపిల్ల కథలో మహేంద్ర తన భార్యతో సంఘర్షణకు, వర్గపోరాట రూపం ఇవ్వడానికి పూనుకున్నారు. తనకు, తన భార్యకు మధ్య శత్రువైరుధ్యమే తప్ప మిత్ర వైరుధ్యము లేదని స్పష్టంగా తనను తాను సమర్థించు కుంటాడు. దీనివల్ల రచయిత రఘోత్తమరెడ్డి పనిపిల్ల కథలోని మహేంద్ర పాత్రను బలపరుస్తూ వచ్చిన విషయం స్పష్టంగా అర్థమవుతుంది. మహేంద్ర లోపాలను, చిత్రీ కరించడంలోను మహేంద్ర భావజాలపరంగా ఎదిగే క్రమాన్ని ఎత్తిచూపడంలోను రచయితకు దృష్టిలేదని కథనం చదువుతూ వెళ్ళి పాఠకులకు అర్థమవుతుంది. మహేంద్రలో పరస్పర విర్ధ భావాల మధ్య సంఘర్షణ జరుగుతున్నట్లుగా కథ నడుస్తుంది. కానీ మహేంద్ర వివిధ సందర్భాలలో ప్రకటించే నిర్ణయాలను బట్టి ఆ పాత్రను పూర్తి చైతన్యం పొందిన పాత్రగానే రఘోత్తమరెడ్డి మలిచినట్లు అర్థమవుతుంది. ఈ దృష్ట్యా పనిపిల్ల కథ స్త్రీవాద వ్యతిరేకమైనదే.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రచన చావు విందు కథను చదివితే రచయిత పనిపిల్ల కథలో ఎవరి వైపు ఉన్నాడో స్పష్టంగా తెలుస్తుంది. చావు విందు కథలో తన భూముల ఆక్రమణకు భూస్వామి పడే ఆవేదనకు ఆ కుటుంబ పరిస్థితి కళ్ళక కట్టినట్లు చిత్రీకరించారు. బాధితుల పక్షాన తెలంగాణ ఉద్యమాల పక్షాన ఉండే వారందరు రచయిత భూస్వాములను బలపరుస్తున్నట్లు పాఠకులు ఎక్కడా అర్థం చేసుకోరు. దీనినిబట్టి శిల్ప నైపుణ్యం, కథనం నడిపంచిన తీరు ఎంత అద్భుతం అయిందో అర్థం అవుతుంది. ఇదే దృక్కోణంతో చూస్తే పనిపిల్ల కథలో రచయిత వినియోగదారుని వస్తువులపై మక్కువ చూపే మహేంద్ర భార్యను దోపిడీ చేసే వర్గానికి చెందిన స్త్రీగా స్పష్టమైన అవగాహనతోనే చిత్రీకరించారని అనిపిస్తుంది. 'జాడ' కథ విషయానికివస్తే 'వాన్ని ఇక ఈ జన్మకు చూడగలుగుతానో లేదో? ఇప్పుడు వాడెక్కడున్నాడో?" అని తమ్ముడి కోసం వెతుకుంటూ వెళ్ళే సుజాత పూర్తి చైతన్యం పొందిన స్త్రీలా కనిపిస్తుంది. తన భర్త మధు సూధన్‌తో తనకు పొత్తు కుదరకపోవడాన్ని కూడా ఆమె విశ్లేషించుకుంటుంది. ఇద్దరి మధ్య గొడవలు, అసంతృప్తిలు ముదిరిపోయి ఇద్దరి మధ్య దూరం పెరిగి పోవడాన్ని కూడా ఆమె అర్థం చేసుకుంటుంది. అరెస్ట్ అయిన తమ్ముడు బతికున్నాడో లేడో అని మధనపడుతూ అతని జాడకోసం బయలుదేరిన సుజాత నిజానికి పూర్తిగా విప్లవ ఉద్యమాల వైపు వున్న స్త్రీ కాదు. అట్లాగే ఆమె భర్త మధుసూధన్ విప్లవ వ్యతిరేకి. ఇదే సమయంలో సుజాత తమ్ముడు అజ్ఞాత ఉద్యమకారుడు.

ఈ స్థితిలో సుజాత తనకు అత్యంత ప్రియమైన తమ్ముడి కోసం సాధారణ స్త్రీల లాగే మధనపడుతుంది. తమ్ముడి జాడ కోసం అనేక కష్టనష్టాలకుపడ్డు, ముందుకు సాగుతుంది. ఇదే సమయంలో సుజాత ఎక్కడికి వెళ్లిందో అనే తపనతో ఆమె భర్త కూడా ఆమె వెనకే ఆమెను వెతుక్కుంటూ బయలుదేరుతాడు. దీన్ని బట్టి మధుసూధన్, సుజాతలు ఒకే వర్గానికి చెందినవారని, ఒక చైతన్యస్థాయి కలవారని అర్థం చేసుకోవచ్చు. అయితే సర్వసాధారణంగా కుటుంబంలో స్త్రీ, పురుషుల మధ్య వుండే వైరుధ్యాలే ఈ రెండు పాత్రల మధ్య ఉన్నాయి. అయితే ఈ కథలో రచయిత స్త్రీ వాద వ్యతిరేకిగా ఎక్కడ కనిపించదు. పరిస్థితిని నిస్పక్షపాతంగా వివరించే అభివృద్ధి కర్త, అభ్యుద రచయితగా తమ్మేటి రఘోత్తమరెడ్డిని నిర్ధారించవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. తెలంగాణ సాహిత్య వికాసం - కె. శ్రీనివాస్ - తెలంగాణ ప్రచురణలు, హైదరాబాద్, డిసెంబర్, 2015.
2. తెలుగు ప్రగతిశీల కథ సాహిత్యం - డా॥. కాలువ మల్లయ్య, 1993.
3. తెలుగు వైజ్ఞానిక మాస పత్రికలు.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు సాహితీ కెరటం సురవరం



- గౌరెడ్డి పవిత్ర
అలంపూర్, తెలంగాణ

## పరిచయం :

తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలోని బోరవెల్లి గ్రామంలో అమ్మమ్మగారింట్లో ప్రతాప రెడ్డి గారు 1896వ సంవత్సరం మే నెల 28న జన్మించారు. వారి తల్లిదండ్రులు రంగమ్మ, నారాయణరెడ్డి గార్లు. తండ్రే ఆద్యగురువు. దీనితోపాటు స్థానిక ఉపాధ్యాయులు తెలుగు, సంస్కృతం నేర్పారు. పినతండ్రి రామకృష్ణారెడ్డి గారి ప్రోద్బలంతోకర్నూలు చేరి అక్కడ హైస్కూలు చదువు పూర్తి చేశారు. తర్వాత హైదరాబాదు నిజాం కళాశాలలో మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎ., తర్వాత బి. ఎల్ కూడ ఉత్తీర్ణులయ్యారు. చిన్నప్పటి నుండి తెలుగు, సంస్కృత భాషలపై మక్కువతోబి.ఎ.లో సంస్కృతం ద్వితీయ భాషగా చదివారు. మద్రాసులో ఉండగానే వివిధ పత్రికలకు వ్యాసాలు పంపేవారు అవిముద్రితమైనాయి. మద్రాసు నుండి 'లా' డిగ్రీతో తిరిగి వచ్చిన తరువాత పినతండ్రి గారి ప్రోత్సాహంతో న్యాయవాద వృత్తిని చేపట్ట వలసి వచ్చింది.కాని దానిపై మనసు పెట్టలేదు. ఇంతలో ఆయన హైదరాబాద్ కొత్వాల్ (ఇప్పటి పోలీస్ కమిషనర్)గా ఉన్న రాజబహద్దురువేంకటరామా రెడ్డి గారిని కలుసుకోవాల్సి వచ్చింది. ఆ సమావేశంలో ప్రతాప రెడ్డి గారిని కొత్వాల్ గారు హైదరాబాదులో ఉన్నరెడ్డి విద్యార్థి వసతి గృహ కార్యదర్శిగా నియమించారు. ఈ వసతి గృహాన్ని కొత్వాల్ గారే బీద విద్యార్థుల సౌకర్యార్థం 1918లోప్రారంభించారు.

సురవరం ప్రతాప రెడ్డి గారు గ్రంథాలయోద్యమంలో చురుకుగా పాల్గొని ప్రముఖ పాత్రవహించారు. తాళపత్ర గ్రంథాలను పరిష్కరించడంలోను, ఎన్నో పుస్తకాల ప్రచురణలోను ఆయన విశేష కృషి చేశారు. శ్రీకృష్ణదేవ రాయంధ్రభాషా నిలయానికి అనేక గ్రంథాలు సేకరించారు. ఆయన వద్ద ఉన్న స్వంత గ్రంథాలయంలో సింహభాగంహైదరాబాదు (కేంద్ర) విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు బహూకరించగా అది ఇప్పటికీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పరిశోధకులకు ఉపయోగ పడుచున్నది. గోలకొండ పత్రిక స్థాపకుడిగా పాత్రికేయుడుగా, సంపాదకుడిగా సురవరంసేవచేశారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనతో తొలి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును సొంతం చేసుకున్న ప్రతిభావంతుడు సురవరం గారు. హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం, హిందువుల పండుగలు, గోలకొండ కవుల సంచిక, రామాయణ విశేషములు వంటి ఎన్నో గ్రంథాలను రాశారు. ఆయన రచించిన 40 పైగా రచనలలోముఖ్యమైనవి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'. (ఇది కేంద్ర సాహిత్య అకాడమి, అవార్డుఅందుకున్న

మొదటి తెలుగు భాషా గ్రంథం) రామాయణ విశేషములు, హిందువుల పండగలు, హైందవ ధర్మ వీరులు మొదలైనవి.ఆయన బహుభాషావేత్త, తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ, పెర్షియన్ భాషలలో ప్రావీణ్యం ఉంది. తమిళం, కన్నడంకూడ తెలుసు. హైదరాబాదు శాసనసభకు ఎం.ఎల్.ఎ.గా వనపర్తి నియోజకవర్గం నుండి 1952 లో ఎన్నికైనారు.

## సురవరంతెలుగు భాషా సేవ :

కుల, మత, ప్రాంతీయ, వర్గభేదాలు లేకుండా తెలుగు ప్రజలందరి అభివృద్ధికి కృషి చేయుట.ఆ రోజులలో తెలుగు భాష, సంస్కృతి, తెలుగు ప్రజల దుర్భర పరిస్థితిని గురించి ఈ నాటి ప్రజలు తెలుసుకోవడం ఎంతో అవసరం. తెలుగు మాతృభాషగా వున్న ప్రజలు జనాభా నూటికి 80 మంది వున్నా తెలుగు భాషకు ఆదరణ మృగ్యం. తెలుగుబోధించే పాఠశాలలు దాదాపు లేవనే చెప్పాలి. రాజభాష ఉర్దూ, ప్రభుత్వ కార్య కలాపాలు, లావాదేవీలు అన్నీ ఆ భాషలోనేజరిగేవి. ప్రభుత్వం తరపున తెలుగు పాఠశాలలు లేకపోగా స్థానికులు పాఠశాలలు స్థాపించుకోవాలనుకున్నా ప్రభుత్వసహకారం ఉండేది కాదు. దీనితోతెలుగువారికి తమ భాషంటే ఒక విధమైన ఉదాసీనత, ఉపేక్షాభావం నెలకొన్నది. ఉర్దూతోప్రభుత్వమెప్పుపొందవచ్చుననే భావన ఉండేది. అందుచేత తెలుగు వారు కూడ ఉర్దూలో మాట్లాడడానికి ప్రయత్నించడం,ఉర్దూ పత్రికను చేతపట్టుకోవడం, ముస్లింల మాదిరి టోపీ, వేషం ఒక భ్రమగా తయారయింది.ఈ పరిస్థితులను నిశితంగా గమనించిన ప్రతాప రెడ్డి గారు, ఎంతో మనోవ్యధ చెంది, దీనికి విరుగుడు పత్రికా నిర్వహణద్వారానే సాధ్యమన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చి, గోలకొండపత్రికను ప్రారంభించారు. పత్రికను ప్రారంభించిన తొలిరోజులలో ప్రతాప రెడ్డి గారి సంపాదకుడిగా, విలేకరిగా, కంపోజర్, గుమాస్తాగా చివరికి తపాల బిళ్ళలను అంటించి పత్రికను పోస్టు చేయ్యడం వరకు అన్నీ తానే చేయవలసి వచ్చేది. ఆ రోజులలో రచయితలు గాని పత్రికా విలేకరులుగాని ఏ కొద్దిమందో ఉండేవారు. ఒకవేళ ఉన్నా అనుభవం అంతగా ఉండేది కాదు. పత్రికా విలేకరులుగా పనిచేయడానికి తను స్వయంగా పని నేర్పించేవారు. పత్రికకు ఎవరు వ్యాసాలు వ్రాయనప్పుడు తానే చిత్రగుప్త, భావ కవి, వెర్రిమంగళప్ప, యుగపతి, సింహాయిత్యాదికలంపేర్లతో వ్రాసి ప్రచురించేవారు. ఆయన దాదాపు 1500లుపైగా సంపాదకీయాలు, వ్యాసాలు వ్రాశారు. మహిళా రచయితలను ప్రోత్సహించడానికి చాలా ప్రయత్నించేవారు. ఒకసారి ఆయనే ఒక కలం పేరుతో 'స్త్రీలకు సంపూర్ణస్వేచ్ఛ మిధ్యావాదము'' అనే వ్యాసాన్ని వ్రాసి ప్రచురించారు. దానితో చాలమంది స్త్రీలు ఆగ్రహంతో వ్యాసాన్ని ఖండిస్తూ వ్రాస్తేవాటినన్నింటిని గోలకొండ పత్రికలో ప్రచురించారు. కొంతకాలం తురువాత ఇందుకు తానేకారకుడనని అసలు సంగతి వెల్లడించారు. 22 సంవత్సరాలకు పైగా గోలకొండ పత్రిక తెలుగు ప్రజల భాషాభివృద్ధికి, సాంఘిక పునరుజ్జీవనానికి, నిజాం పాలననువిమర్శిస్తూ ప్రముఖ పాత్రను పోసింది, విజయం సాధించిందనే చెప్పాలి. బాధ్యతాయుతమైన, ప్రజాక్షేమం కోరే సంపాదకత్వం, నిర్దిష్టమైన భావాలు, ప్రజానురంజకమైనవ్రాతలు, విధానాలు సంఘాన్ని ఏవిధంగా ప్రభావితంచేయగలవో చెప్పడానికి 'గోలకొండ పత్రిక ఒక ఉదాహరణ, మార్గదర్శి సురవరం ప్రతాప రెడ్డి గారు తెలుగు ప్రజలదరికీ ఒకే రాష్ట్రం 'విశాలంధ్ర' ఉండాలని ఆకాంక్షించారు. 1930లో జోగిపేటలోజరిగిన 'నిజాం ఆంధ్రమహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. తెలంగాణ ఆంధ్రోద్యమము' అనే పుస్తకం వ్రాసిప్రచురించారు. కాని చివరకు 'ఆంధ్రప్రదేశ్ ఏర్పడినా ఆయన చూడలేక పోయారు.

తెలంగాణలోని తెలుగు పత్రికా ప్రపంచంలో గోలకొండ పత్రిక' ఒక నూతనోధ్యాయం. దానిలో వెలుబుచ్చిన భావాలు ప్రజలలోవిశ్వాసం, ప్రభుత్వానికి కలవరం కలిగించాయన్నది నిర్వివాదాంశం. ప్రజలుగాని, ప్రభుత్వం గాని దాన్ని మరువలేదు.సాంఘిక చరిత్రకారుడిగా, రచయితగా కవిగా సురవరం ప్రతాప రెడ్డి అన్నీతానై గోలకొండ పత్రికను నడుపుతున్నప్పటికీ, తన పుస్తకం రచనా వ్యాసంగాన్ని కూడకొనసాగించారు. ఆయన ముఖ్య రచనలన్నీ ఈ సమయంలోనే జరిగాయి.

ఆయనకు పూర్వకవులరచనలతోను, తాళపత్ర గ్రంథాల తోను విపుల పరిచయం ఉంది. దానికితోడు బహుభాషా వేత్త కాబట్టి ఆయన రచనా ప్రపంచం బహువిస్తారం. తెలుగు సాహిత్య శాఖలలో ఆయన రాయనిది లేదు. ఆయన సృష్టిలో సాహిత్య విమర్శ, పద్యకవిత్వం, కథలు, నాటకాలు, నవలలు, జీవిత చరిత్రలు, చారిత్రక, పరిశోధక గ్రంథాలెన్నో వచ్చాయి. పత్రికా సంపాదకునిగా ఆయన వ్రాసిన సంపాదకీయాలు, ఎన్నోపుస్తకాలకు సమకూర్చిన పీఠికలు ఉన్నాయి. అన్నిటినీ మించి ఆయన గొప్ప వక్త, రాష్ట్రంలోను, ఇతర ప్రదేశాలలోను లెక్కలేనన్ని ఉపన్యాసాలు ఇచ్చారు. ఆయన ప్రథమ రచనలు శుద్ధ గ్రాంధికంలోనే జరిగినా, కాలానుగుణంగా వ్యవహారశైలికి మార్చుకున్నారు. కొన్ని రచనలలో తెలంగాణ వైవిధ్యం కూడా చూపించారు.

## ఆంధ్రుల సాంఘిక చరిత్ర :

సురవరం ప్రతాప రెడ్డి గారి రచనలన్నీ ఒక ఎత్తయితే, ఆంధ్రుల సాంఘిక చరిత్ర మరొకటి అని పలువురి విమర్శకులు భావిస్తారు. ఆయన రచనలలో తల మానికమైనదంటారు. ఈ రచన 1949 సం.లో ప్రచురింప బడి తెలుగు వారి చరిత్ర సాహిత్యంలో ఒక క్రొత్తమలుపుకు నాంది పలికింది. అంతవరకుచరిత్ర రచన రాజులకు, రాణులకు, వారి రాజ్యాలకు, వాటి మధ్య యుద్ధాలకు పరిమితమై ఉండేది. ఈ పుస్తకంలో రెడ్డిగారు.తూర్పు చాళుక్య యుగం మొదలు 1907 సం.వరకు, అంటే ఇంచు మించు వెయ్యి సంవత్సరాలలో సామాన్య ప్రజలు ఎలా జీవించారో వారి ఆహారము, దుస్తులు, అలం కరణములు, ఆటలు, పాటలు,ఆచారములు జీవితాన్ని గురించి వివరించారు. విద్యాంసుల, చరిత్రకారులు ప్రశంసలకు పాత్రమయింది.ఆంధ్రుల సాంఘిక చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ వారి 1955 సంవత్సరంలో పురస్కారం లభించింది. ఇట్టి అపూర్వ గౌరవం పొందిన ప్రథమ తెలుగు భాషా గ్రంథమిది. ఈ పుస్తకం సివిల్ సర్వీసెస్ పరీక్షలకు పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడింది.

## హిందువుల పండుగలు :

నిజాం గారి సందేహ నివృత్తికోసం, కొత్వాల్ రాజ బహద్దురు వేంకటరామారెడ్డి గారి అజ్ఞమేరకు ఈ పుస్తకాన్ని ప్రతాప రెడ్డి గారు రచించారు. మనము పండుగలను ఎందుకు జరుపుకుంటున్నామో, దానివెనుకున్న శాస్త్రీయ, ఆధ్యాత్మిక,సామాజిక ప్రయోజనము లేమిటో మనలో చాలమందికి తెలియదు. రెడ్డి గారు అనేక శాస్త్రీయ, పౌరాణికగ్రంథాలనుపరిశోధించి 55 పండుగల, వ్రతములు, ఉత్సవములను కారణాలతో వివరించారు.ఈ గ్రంథానికి మనదేశపూర్వాధ్యక్షులు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు పరిచయ వ్యాక్యాలు వ్రాశారు. ఇది 1931 సం.లోప్రచురితమైంది.

## గోలకొండ కవుల సంచిక :

ముడుంబై వేంకటరాఘవాచార్యులు అనే బ్రిటిషాంధ్ర లోని తెలుగు పండితుడు గోలకొండ పత్రిక 9వ సంవత్స రాది సంచికకుపంపిన ఒక వ్యాసంలో "నిజాం రాష్ట్ర మందు ఆంధ్ర కవులు పూజ్యము" అని వ్రాశారు. దానికి దీటుగా ప్రతాపరెడ్డి గారు ఇచ్చినగట్టి జవాబు "గోలకొండ కవుల సంచిక" రెడ్డిగారు ఎంతో శ్రమించి పలువురి సహాయ, సహకారములతో తెలంగాణలోని354 మంది ఆధునిక సంస్కృతాంధ్ర కవులను, 183 పూర్వాంధ్ర కవుల రచనలతోను వెలువరించి, తెలంగాణలోని తెలుగుసాహితీ సౌరభాన్ని గుబాళింపజేశారు. 'గోలకొండ కవుల సంచిక" ప్రామాణిక గ్రంథం అయింది.

## రామాయణ విశేషములు :

వాల్మీకి రామాయణాన్ని చారిత్రాత్మక పరంగా విశ్లేషించి వ్రాసినది ఈ పుస్తకం. రామాయణం క్రీ.పూ. 2500 నాటిదని ప్రతాప రెడ్డి గారు నిర్ణయించారు. గ్రీసు, తదితర పాశ్చాత్య దేశాలలో క్రీ.పూ. 200 సం? నాటికి రామా యణం వ్యాపించిందని,గ్రీకు రచయిత హొమర్ తన "ఇలియర్"ను క్రీ.పూ. 830 ప్రాంతాల రచించి ఉండ వచ్చునని, ఆ రచనకు ప్రేరణ వాల్మీకిరామాయణమేనని ప్రతాప రెడ్డి గారి అభిప్రాయం. రామాయణ కాలం నాటి సాంఘికాచారములు, కుల వ్యవస్థ, ప్రజలఆహారం, దుస్తులు, అలవాట్లు మొదలైనవి కూడ ప్రస్తావించ

బడ్డాయి. ఈ గ్రంథం 1939వ సంవత్సరంలో ప్రచురణ అయ్యింది.

**రాజ బహద్దురు వెంకటరామారెడ్డి జీవిత చరిత్ర:**

హైదరాబాదు నగర కొత్వాల్ నియమించబడినఅధ్య హిందువు రాజా బహదూర్ వేంకట రామారెడ్డి గారు. కొత్వాల్ గారి విశిష్టసేవలను ఆయన అకుంచిత కార్యదీక్ష, నిరాడంబరత, సేవాదృక్పథం ద్వారా సామాన్య ప్రజల మన్ననలను, నిజాము నవాబులుగారి మన్ననలను పొందిన వివరాలను ఈ జీవిత చరిత్రలో రచించారు.

**మొగలాయి కథలు :**

నిజాం కాలంనాటి సంఘంలోని రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులకు అద్దం పట్టే కథల సమాహారం మొదలాయి కథలు అనే గ్రంథం బహుళ ప్రజాదరణ పొందింది.

**ముగింపు :**

దురదృష్టవశాత్తు తన 57వఏట 25-8-1953న స్వర్గస్తులైనారు. ఈ రోజుకీ ప్రతాప రెడ్డి గారి జీవితంపై, రచనలపై నేటికీ పుస్తకాలు వస్తూనే ఉన్నాయి. ఆయన రచనలలోని అనేక ముఖ్య విషయాలను వివిధ రచయితలు తమ రచనలలో ప్రస్తావిస్తున్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఆయన పుస్తకాలను పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించారు. హైస్కూలు, కళాశాలల పుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చారు. ఇలా ఈ నాటికీ ఆయనమన మధ్య నిలిచి పోతున్నారు.తన జీవితాంతం ప్రతాపరెడ్డిగారు తెలుగు ప్రజలకు, సమాజానికి చేసిన నిస్వార్థ సేవలు, సాధించిన ఆశయాలు, విజయాలకు గుర్తింపుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు హైదరాబాదు హుసేన్ సాగర్ టాంక్ బండుపై ఏర్పాటు చేసిన ఆంధ్రుల చరిత్రలోని మహనీయులు విగ్రహాల సరసన ప్రతాపరెడ్డి గారి విగ్రహాన్ని కూడ ఏర్పాటు చేశారు. ఇదిగాక మహబూబ్ నగర్, పనపర్తి, గద్వాల, ఇటిక్యాల వంటి ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు ఆవిష్కరింప బడ్డాయి. సికిందరాబాదులోని టెలికాంభవనానికి ప్రతాప రెడ్డి పేరు పెట్టారు. ఈ మధ్య కాలంలో హైదరాబాద్లోగలతెలుగు యూనివర్సిటీకిసురవరం ప్రతాపరెడ్డి గారి పేరు పెట్టడం జరిగింది.

**ఆధార గ్రంధాలు :**


1. తెలంగాణ వైతాళికుడు - శ్రీసురవరం ప్రతాపరెడ్డి (వ్యాసం)బొమ్మా రెడ్డి రామి రెడ్డి
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
3. హిందువుల పండుగలు- సురవరం ప్రతాపరెడ్డి


★★★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గ్రామదేవతలు - విశిష్టతలు



- కె. రంగనాయకులు
పరిశోధక విద్యార్థి
కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక
విశ్వవిద్యాలయం, మైసూరు.

- ఆచార్య ఎం. రామనాథం నాయుడు
తెలుగు శాఖాధ్యక్షులు
కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక
విశ్వవిద్యాలయం, మైసూరు.



**వ్యాస సంగ్రహం :**

'గ్రామదేవతలు - విశిష్టతలు' అనే అంశంలో గ్రామాల లోని జనాలు అంటువ్యాధులు, ప్రకృతిలోని వైపరీత్యాల వలన వచ్చే వ్యాధులు, అకాల మరణాల వల్ల భయ భ్రాంతులకు గురయ్యేవారు. ప్రజలందరూ చాలా ఆవేదనకు గురి అయ్యి, ఈ ఘటనలకు ఏదో తమకు తెలియని అదృశ్య శక్తుల ప్రేమయం ఉందని నమ్మేవారు. ఆ శక్తులను ఎలాగైనా వశపరచుకొని తమను తాము కాపాడుకోవాలని సంకల్పించారు. ఇదే కోవలోనే ఉద్భ వించిన శక్తివంతమైన గ్రామదేవతలను ఆరాధించడం ఆరంభించారు. తద్వారా మనస్సును తన ఆధీనంలో ఉంచుకోవటం ఆత్మారాధన, మాతృదేవతారాధన, పితృ దేవతారాధన లాంటివి ప్రజల హృదయాలలో పదిల పరచుకొని వీటిని ఆరాధించేవారు. ఈ కోవలోనే దేవతా రాధనలో గ్రామదేవతల విశిష్టతను నా పరిశోధన పత్రంలో వివరిస్తున్నాను.

**కీలక పదాలు :**

గ్రామదేవతలు - పోలేరమ్మ, మద్దమ్మ, మారెమ్మ, యల్లమ్మ, రాములమ్మ, పెద్దమ్మ, సంకులమ్మ, సవారమ్మ, కొల్లాపురమ్మ మరియు భక్తుల నమ్మకాలు.

**పరిచయం :**

ప్రజలు చనిపోయిన తర్వాత తమ ఆత్మ శరీరాన్ని విడిచి ఏదో రాయాలోనో, చెట్టులోనో చేరి ఉంటుందని భావించేవారు. తమ ఆత్మలకు అవసరమైన ఆహారాన్ని, వస్తువులు, రాళ్ళు, రప్పలను చెట్లను అవసరమైన వాటిని అందించేవారు. ఇలా చేయడం ద్వార ఆత్మలు శాంతిస్తా యని నమ్మేవారు. అంతేకాక భక్తిశ్రద్ధలతో ఆరాధించేవారు. ఇలా ఆరాధించడం ద్వారా ఆత్మలు శాంతిస్తాయని ఎలాంటి ఆపదలు కలుగజేయవని నమ్మేవారు.

మానవుని జీవితంలో చనిపోయిన తర్వాత పితృదేవతా రాధన, మాతృదేవతారాధన జరిగింది. తల్లి, తండ్రులు చనిపోయినప్పుడు వారి ఆత్మ ఏ పశుపక్షాదులలోను చేరుతుందని నమ్మకంతో భయభక్తులతో పూజించేవారు. మాతృదేవతారాధనలో స్త్రీ శక్తులను నమ్మి పూజించేవారు. వీళ్ళలో ఏదో శక్తి ఉందని వాటిద్వారా తమను కాపాడు కోవచ్చునని దేవతారాధన కొనసాగించారు.

దేవతారాధన పూర్వం నుంచి నేటివరకు కొనసాగు తోంది. సంఘంలో మనిషి శరీరంతో పాటు ఆత్మ వుందని, ఆ ఆత్మ చెప్పినట్లు నడుచుకోవటం మనకు తెలిసిన విషయమే. మనిషిని మంచి మార్గంలో నడిపించడానికి,

శరీరాన్ని అదుపులో ఉంచుకోవడానికి మనిషి తెలిసిన అదృశ్య శక్తిని మనిషి ముందు నిలిపింది. ఆ అదృశ్యశక్తిని దైవంగా భావించడం జరిగింది.

పూర్వం మనిషి తమ దైనందిన కార్యక్రమాలలో అదృశ్యశక్తిని ఏదో ఒక వస్తువు రూపంలో మలచుకొని, భయభక్తులతో పూజిస్తూ, ధ్యానిస్తూ ఉండేవారని మనకు గత చరిత్రల వలన తెలుస్తుంది. గ్రామాలలో నివసిస్తూ వస్తున్న ప్రజలు తమకు తెలిసిన అదృశ్యశక్తులను కొలిచేవారు. చిన్న చిన్న గూడెంలలో ఉన్న ప్రజలు ఇంకా ఒక అడుగు ముందుకేసి చెట్లను, రాళ్లను, రప్పలను పూజిస్తూ వస్తున్నారు.

'గ్రామదేవతలు' పైన పరిశోధన చేసేటప్పుడు కొన్ని వాస్తవాలు, నమ్మకాలు బయట పడడం జరిగింది. గ్రామదేవతలుగా కొలుస్తున్న కొందరు, తమకు తెలిసిన విషయములను ప్రస్తావించడం జరిగింది. గ్రామదేవతలు గ్రామానికి ఏ ఆపదలు రాకుండా ఊరి పొలిమేరలలో కాపలా కాస్తూంటారని, ప్రజలకు అంటువ్యాధులనుంచి ప్రకృతి వైపరీత్యాలనుంచి ఈ గ్రామదేవతలు కాపాడు తారని ప్రజలకు నమ్మకం.

గ్రామదేవతలు వారి మహిమలు, శక్తుల గురించి కొంచెం తెలుసుకుందాం

1. పోలేరమ్మ - గోస్పాడు - నంద్యాల
2. మారెమ్మ - గద్దెరాళ్ళ - దేవనకొండ
3. రాములమ్మ - బంటనహాల్ - చిప్పగిరి
4. సవారమ్మ - బేతంచర్ల - డోన్

**1. పోలేరమ్మ అవ్వ :**

పోలేరమ్మ అంటేనే మనందరికి గుర్తుకొచ్చేది శ్రీ వీర బ్రహ్మేంద్రస్వాముల వారి చరిత్ర చదివితే తెలుస్తుంది. బ్రహ్మయ్య స్వాముల వారు ఓ పోలేరమ్మా! బీడి అంటించుకోవాలి నిప్పు ఇటు తీసుకురా! అంటేనే పోలేరమ్మ దేవి ప్రత్యక్షమై నిప్పు తెచ్చి ఇచ్చిందని మనకు చరిత్ర చదివితే తెలుస్తుంది. పిలిస్తే పలికే దేవతగా పోలేరమ్మ దేవత.

పోలేరమ్మ ఆలయాలు చాలా ప్రాంతాలలో నిర్మించడం జరిగింది. ఒక్కో ప్రాంతంలో వెలిసిన పోలేరమ్మ దేవతకు ఒక్కొక్క చరిత్ర వుంది. కర్నూలు జిల్లా నంద్యాల తాలూక గోస్పాడు గ్రామంలో కొలువైన శ్రీ పోలేరమ్మ దేవత గురించి వివరించడం జరుగుతుంది.

నంద్యాల తాలూకా గోస్పాడు గ్రామంలోని గంగమ్మ వీధిలో పోలేరమ్మ దేవత దేవాలయం వుంది. రెండు, మూడు వందల సంవత్సరాల క్రితం అంతగా జన సంచారం లేని రోజులలో పూర్వీకులు భక్తిశ్రద్ధలతో ఒక చిన్న రాతి విగ్రహాన్ని కొలువుచేసి విశేషంగా పూజలు చేసేవారు. కాలక్రమంలో జనాలలో నాగరికత పెరిగి దేవాలయాన్ని పూర్తిగా కొత్తగా తీర్చిదిద్దారు. ఇదే గోస్పాడు గ్రామానికి చెందిన ముక్కమళ్ళ వీరారెడ్డి కుమారుడు అయిన భాస్కరరెడ్డి 1998వ సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీన దేవాలయాన్ని నిర్మాణం చేశారు. ఆళ్ళగడ్డ దేవతా విగ్రహాల తయారికి అడ్డా. అక్కడినుంచి శ్రీ పోలేరమ్మ దేవతా విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్టించడం జరిగింది. పూజా కార్యక్రమాలు జరిపి, భజన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ దేవాలయ పూజారి తనం రెడ్డిగారిదే. ముక్కమళ్ళ రెడ్డిగారి కుటుంబం బాగా ఎదగడం జరిగింది. తద్వారా తమకున్న పొలంలో దేవతకు (4) నాలుగు ఎకరాలు భూమిని ఇనాముగా ఇచ్చారు.

దేవాలయపు అభివృద్ధి పనులు జరపాలంటే ఆ దేవత యొక్క ఇనాము భూమిద్వారా వచ్చిన ఆదాయంతో గుడి పనులు చేయడం జరుపుతున్నారు. అమ్మవారికి అవసర మైన ఆభరణాలు వగైరా ముక్కమళ్ళ కుటుంబం వారే చూసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున శ్రీ పోలేరమ్మ దేవతారాధన కార్యక్రమం జరుపు కోవడం ఆనవాయితీ. ఈ గ్రామంలోని వారికి కులభేదాల పట్టింపులు లేవు. గ్రామంలోని అన్ని కులాలవారు కుంభాలను మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుబడులను సమర్పించుకొని భోజన కార్యక్రమాలను ముగించడం జరుగుతుంది. గ్రామ ప్రజలంతా ఇలా చేయడం ద్వారా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా చల్లగా దీవించ బడతారని ప్రతీతి.

**2. మారెమ్మ అవ్వ – గద్దెరాళ్ళ :**

కర్నూలు జిల్లా, దేవనకొండ మండలం, గద్దెరాళ్ళ గ్రామంలో శ్రీశ్రీ మారెమ్మ అవ్వ దేవత వెలసింది. ఈమె గద్దెరాళ్ళ మారెమ్మ దేవతగా ప్రజల నోళ్ళలో నానుతుంది. ఈ దేవత జాతరను సంవత్సరం విడిచిన తర్వాత మరు సటి సంవత్సరం జరుపుకుంటున్నారు. అంటే ప్రతి సంవత్సరం ఈ జాతరను జరుపుకోరన్నమాట. ఈ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఈ దేవత పేరు మారుమ్రోగు తుంది.

గద్దెరాళ్ళ గ్రామంలో సుమారు 100 గృహాలతో 600 దాకా ప్రజలు నివశిస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన గద్దెరాళ్ళ మారెమ్మ అవ్వ పూజారి వంశానికి చెందిన దాసరి యంకమ్మ చెప్పిన వివరాల ప్రకారం కరిడికొండ గ్రామం దగ్గర ప్రస్తుతమున్న గద్దెరాళ్ళ మారెమ్మ అవ్వ దేవతా మూర్తిగా పూజలందుకొంటున్నది. ఆ విగ్రహమును చూసినవారిని ఇట్లే ఆకర్షిస్తుంది. చుట్టూ గ్రామాలైన కొత్తపేట, కరిడికొండ, కుంకునూరు, కరివేముల గ్రామాల ప్రజలు గద్దెరాళ్ళ మారెమ్మ విగ్రహానికి విశేష పూజలు చేసి, బాజాభజంత్రీలతో ముందుకు కదపడానికి ప్రయత్నించగా ఎంతకూ ఆ విగ్రహమును కదపలేక పోయేసరికి ప్రజలకు ఏమి చేయాలో దిక్కు తోచలేదు. పలువురు ప్రజలంతా తలో ఒక మాట మాట్లాడు కుంటున్నారు. ఇంతలోనే అక్కడికి వచ్చిన దాసరి ఈరమ్మ పచ్చి బాలింతరాలు. ఇంటిలో పసిబిడ్డను వదలి విగ్రహాన్ని చూడడానికి వచ్చింది. గద్దెరాళ్ళ గ్రామంలో దాసరి రామయ్య మిగతా కుటుంబ సభ్యులు దాసరి ఈదెమ్మను వెతకడానికి వచ్చి చూడగా అప్పటికే ఈదెమ్మను మారెమ్మ దేవత పైనిండి మాట్లాడుతున్నది. నేను మీ దగ్గరకు వస్తాను. నన్ను తీసుకుపోండి అని అన్నది.

గ్రామ ప్రజలంతా మారెమ్మ దేవతా విగ్రహాన్ని ఊరేగిం పుగా వస్తూ ఊరి వాకిలి వద్దకు వస్తే గ్రామ ప్రజలంతా ఊరి బయటే విగ్రహ ప్రతిష్ఠ చేయండని చెబితే ఊరిమధ్యకు వచ్చిన దేవతను ఇక్కడైనా స్థిరంగా ఉం టావా అని పైనిండిన ఈదెమ్మను అడగగా లేదు దాసరి రామయ్య వారి దగ్గరే ఉంటానని చెప్పింది. ఆ మాటలు విన్న దాసరి రామయ్యకు పూనకం వచ్చిన ఈదెమ్మకు మధ్య చిన్నపాటి వాదోపవాదనలు చోటుచేసుకొన్నాయి. మేము చాలా బీదవారము నీకు పూజచేయడానికి ఊది బత్తీలు కూడా తెచ్చే స్థితిలో లేము అని దాసరి రామయ్య అనగా అక్కడ వేపకొమ్మలను తెంచి వాటిని ఊదిబత్తీల కట్టగా చేసి అంటించు అన్నది మారెమ్మ పూనకం వచ్చిన ఈదెమ్మ. ఆ సంఘటనను చూసి అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు.

అప్పటినుంచి అందరూ ఆమెకు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేయడం ఆరంభించారు. అప్పటికప్పుడు ఆ దేవతా విగ్రహానికి చిన్నపాటి గుడిని నిర్మించారు. ప్రస్తుతమున్న విగ్రహము కరిడికొండ దగ్గర లభించిన విగ్రహమే నేటికి పూజింపబడుతున్నది. అక్కడ పుట్టకూడా పెరిగింది. ఈ విషయం పలు ప్రాంతాలకు పాకగా ప్రజలు తండోపతండాలుగా వచ్చి ప్రతి మంగళ, శు క్రవారాలలో విశేషంగా పూజలు చేసి మొక్కులు తీర్చు కుంటున్నారు. అమ్మవారు చాలామంది స్త్రీలలో పూనకం వచ్చి అనేక విషయాలు చెప్పగా అవి నిజమవడంతో గద్దెరాళ్ళ మారెమ్మను కొలవడంలో కులమతభేదాలు లేవు.

అమ్మవారి అనుగ్రహంతో తమ కోరికలు నెరవేరిన వారు తమ మొక్కుబడులు దేవర, కనుగుడ్లు, కోరమీసాలు, కాలిమెట్టెలు, తాళిబొట్టు, చీరలు, ఊయలలు ఇవన్నీ బంగారం లేదా వెండి సామాగ్రితో చేయించి అమ్మ ఆశీస్సులను పొందుతున్నారు. ఇంకా కిరీటం, గాజులు, దండలు, ముక్కెర, గొలుసులు వగైరా సామాగ్రితో అమ్మవారిని అలంకరింపబడి భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

**3. శ్రీశ్రీరాములమ్మ అవ్వ : బంటనహాల్ గ్రామం :**

కర్నూలు జిల్లా, చిప్పగిరి మండలం, బంటనహాల్ గ్రామంలో కొలువైనది. శ్రీరాములమ్మ అవ్వ గుడి ఊరికి తూర్పుదిక్కున ఊరిబయట ఉంది. అవ్వ గురించి గ్రామ ప్రజలకు ఏమి తెలుసో తెలియదో కానీ, ఆ గ్రామంలోని బోయకులానికి చెందిన అన్నదమ్ములు రామన్న, లక్ష్మన్న అనే అన్నదమ్ములకు కల్గిన సంతానం రామన్న

కుమారుడు సుంకన్న, లక్ష్మన్న కుమారుడు రంగయ్యలు తరచుగా ఈ విషయం చెప్పేవారు. ఇది నేను విన్నది అక్షర రూపంలో పొందుపరుస్తున్నాను.

బంటనహాల్ గ్రామంలో నివాసం ఉండే ఒక అవదూతనో లేదా సత్యమంతుడో ఏమి అనాలో తెలియదు కానీ షేక్షావలి అనే స్వామి గ్రామంలో పగలు తిరిగి రాత్రికి ఊరిబయట ఉండే చావడిలో నిదు రిస్తుంటాడు అంట. చావడి ముందు రాములమ్మ అవ్వ గుడి ఉంది. రామన్న ఈయనని గ్రామంలో పంత రామన్న అని పిలిచేవారు. ఈ రామన్న షేక్షావలి తాత వెంబడి తిరుగుతుండేవాడని, ఒకరోజు జోరున వాన పడుతుంటే వానలోనే ఊళ్ళో నుంచి ఊరి చావడిలోకి బయలు దేరారు. షేక్షావలి తాత పంత రామన్నను ఇంటికి పోరా నా వెనక రావద్దు అన్నాడట. ఎంత చెప్పిన వినకుండా అలాగే షేక్షావలి తాత వెనకాలే పోయి చావడిలో ఇద్దరు కూర్చున్నారట. నులకమంచంమీద షేక్షావలి తాత కూర్చొన్నాడట. నేలమీద రామన్న కూర్చున్నాడట. బాగా వాన పడుతుండగా షేక్షావలి తాత బెంగ చిలిమి తాగేందుకు సిద్ధమయ్యాడట. ఒరేయ్ రామన్న చిలిమి అంటించుకునేందుకు అగ్గి లేదే ఎలా రా అన్నాడట. వానవస్తుంది కదా తాత ఎట్లా తెచ్చేది అగ్గిపెట్టెను అన్నాడట రామన్న. సరేలే నిప్పును తెప్పిస్తాను నువ్వు భయపడొద్దని షేక్షావలి తాత పెద్దగా ఒసేయ్ రాములమ్మ నిప్పు తీసుకురా చిలిమి అంటించుకోవాలన్నాడట. అంతవరకు రామన్న మంచం పక్కన పడుకొన్నాడు, మెల్లగా మంచం కిందకు జరిగాడట. అంతలోనే రాములమ్మ పచ్చకోకతో గాజులతో ఘల్లుఘల్లున శబ్దంతో అరచేతిలో నిప్పును తీసుకొని బయటినుంచి చావడిలోకి వచ్చి షేక్షావలి తాత బెంగ చిలిమికి అంటించి కనిపించ కుండా మాయమైందని. అది చూచి భయభ్రాంతి చెందిన పంత రామన్న షేక్షావలి తాతకు చెప్పాపెట్టకుండా చావడి లోంచి ఒకే పరుగుతో ఊళ్ళోని ఇంటికి వచ్చి భయంతో ఇంట్లోని వారికి ఈ విషయమంతా పూసగుచ్చినట్లు వివరించాడట. అప్పటినుంచి రాములమ్మ నిజస్వరూపం తెలుసుకొన్నవారు ఆమెను పూజించడానికి గ్రామ ప్రజలంతా సిద్ధమయ్యారని రామన్న కుమారుడు సుంకన్న, లక్ష్మన్న కుమారుడు రంగయ్యలు ఈ కథనం వినిపించారు.

కాలక్రమంలో రాములమ్మ అవ్వ గుడి శిథిలావస్తకు చేరింది. గుడిని పునఃనిర్మించాలని నేను (అనగా కె.రంగ నాయకులు) సంకల్పించి నా తల్లిదండ్రులు అయిన కె.లక్ష్మిదేవి, కె. పెద్ద ఆంజనేయులు దగ్గర చెప్పాను. వాళ్ళు గుడిని ఒకరిచేత నిర్మాణం కాకూడదని ఊళ్ళోని గ్రామ ప్రజల సహకారంతో నిర్మించాలన్నారు. ఇందుకు చందాలతో రాములమ్మ అవ్వ గుడి నిర్మాణం చేయడ మైనది. ఇందుకోసం గుడి నిర్మాణానికి సహకరించిన కీర్తిశేషులు బి.శివమ్మ, బి.సుంకప్ప గార్ల కుమారుడు బి.సత్యన్న గారు మరియు గ్రామ ప్రజల సహకారం మరువరానిది. రాములమ్మ అవ్వకు ప్రతి మంగళవారం, శుక్రవారం పూజాకార్యక్రమములను నిర్వహిస్తున్నారు.

**4. సవారమ్మ దేవత – బేతంచర్ల గ్రామం & మండలం :**

కర్నూలు జిల్లా బేతంచర్ల గ్రామం & మండలంలో వెలసిన అమ్మవారు శ్రీ సవారమ్మ దేవత. ఈవెం మహిమాన్వితురాలని గ్రామ ప్రజలంతా చెప్పుకోవడం జరుగుతుంది.

పూర్వం చాలా కాలం క్రితం కర్నూలు పెద్దేటిగడ్డ (తుంగభద్రానది) నుండి బేతంచర్లకు కొందరు వస్తుండగా వారిలో ఒకరికి అమ్మవారు (సవారమ్మ) పూనకం వచ్చి నేను సవారమ్మ దేవతను నన్ను మీ ఊళ్ళో ప్రతిష్ఠించి కొలవండి. మిమ్ములను నేను కాపాడుతానని పలికిందట. అప్పటికి వారు ఒక చిన్నపాటి గుడిని మట్టితో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించేవారు. ఆనాడు పూజారులు హరిజనులు (మాదిగవారు) ఉండేవారు. కాలక్రమంలో పూజరికం బోయ బొద్దులన్నకు అప్పగించడం జరిగింది. బొద్దులన్నకు సవారమ్మ దేవత కలలో వచ్చి నీవు నాకు సేవచేయి నీవు బాగుపడుతావని చెప్పిందట. ఈయనకు బేతంచర్ల గ్రామ నివాసి బుగ్గల నాగభూషణం రెడ్డిగారు సహాయకులుగా చేదోడు వాదోడుగా ఉన్నారు.

శ్రీ సవారమ్మ దేవత చాలా మహిమాన్వితురాలని చెప్తున్నారు. అందులో కొన్ని ప్రస్తావించడం జరుగుతుంది. బేతంచర్ల గ్రామంలో బోయకులస్థుడొకడు అమ్మవారి

ఆలయములోకి రాత్రిపూట దూరి అమ్మవారి కనుగుడ్లు, కోరమీసాలు దొంగతనం చేసి అమ్ముకోవడం జరిగిన నెలరోజుల లోపు ఆ వ్యక్తి మరణించాడు. ఈ సంఘటనను గ్రహించిన గ్రామ ప్రజలు అమ్మవారిని ఇంకా విశేషంగా పూజించడం జరిగింది. ఇంకొక విషయం ఏమంటే బ్రిటీష్ వీరి కాలంలో రైలు మార్గం నిర్మిం చుటకు ప్రణాళికలో భాగంగా గుడిని పడగొట్టి రైలుమార్గం నిర్మించ తలపెట్టగా గుడిని కూలగొట్టడానికి కూలీలు వస్తే వాళ్ళు రక్తం కక్కి సొమ్మసిల్లి పడిపోవడం జరిగిందని చెప్తున్నారు. అంతలోనే రంగాపురానికి చెందిన ఒక స్త్రీకి సవారమ్మ దేవత పూనకం వచ్చి దేవాలయాన్ని తరలిస్తే అందరూ చనిపోతారని, కాసేపట్లో కాంట్రాక్టర్ రక్తం కక్కుతూ ఇక్కడికి వస్తాడని, ఇదే జరిగి తీరుతుందని చెప్పడం జరిగింది. అంతలోనే కాంట్రాాక్టర్ ఏడుస్తూ, రక్తం కక్కుతూ దేవాలయం దగ్గరకు రాగా గమనించిన వారందరూ రైల్వేలైనును అక్కడి నుంచి ఉత్తరం వైపుకు మార్చడం జరిగింది. అప్పటినుంచి సవారమ్మ దేవతను భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకుంటూ పూజాకార్యక్రమాలు చేయడం జరుగుతుంది.

## ముగింపు :

కర్నూలు జిల్లాలోని దేవాలయాలు, దేవుళ్ళు, దేవతల చరిత్రలు తరచి చూస్తే వారి మహిమాన్వితం. ప్రజల యొక్క నమ్మకాలు, ఆచారాలు, సాంప్రదాయాలు, ఇప్పటికీ జనవ్యవహారంలో భక్తిశ్రద్ధలు మనకు ఇట్లే అర్థమవుతుంది. ప్రజలు కొలిచే గ్రామీణ దేవతలు వారి నుండి రక్షణ పొందుతున్నామనే భావనే నేటికి బలపడి దేవతలను విశేషంగా పూజలు చేసి కొలుస్తున్నారు. నేను జరిపిన పర్యటనలలో ప్రజలు చెప్తున్నట్లు వారి నమ్మకాలు వారు పొందిన అనుభవాలను నా పరిశోధన పత్రంలో పొందుపరిచాను.

## ఆధార గ్రంథాలు :

1) క్షేత్ర పర్యటనలు

2) గ్రామదేవతలు - సవ్వప్పగారి ఈరన్న

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం - కార్యదర్శుల కృషి



- బి. లింగరాజు

పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్, తెలంగాణ రాష్ట్రం.

## సంక్షిప్త పరిచయం:

నిజాం రాజ్యంలో ఒక మహోద్యమానికి శాశ్వత చిహ్నంగా నిలిచి తెలుగు భాషాభివృద్ధికి, సంస్కృతి అభ్యుదయానికి ముఖ్య కేంద్రంగా విలసిల్లిన మహాసంస్థ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం. 1901 సెప్టెంబర్ 1 వ తేదీన ఆవిర్భావించిన ఈ గ్రంథాలయం 124 సంవత్సరాలు పూర్తిచేసుకుని 125 వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. నాటి నుంచి నేటి వరకు చైతన్యవంతంగా ముందుకు సాగుతుందంటే దానివెనుక ఎందరో మహానుభావుల నిస్వార్థ సేవ ఎనలేనిది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపన నాటి నుంచి నేటి వరకు, అనేక మంది మహనీయులు తమ జీవితాలను పణంగాపెట్టి భాషానిలయం అభివృద్ధి కోసం పాటుపడ్డారు. వారి తోడ్పాటుతోనే శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం దినదిన ప్రవర్ధమానంగా వృద్ధి చెందిందని అనడంలో అతిశయోక్తి లేదు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ఇంత సుదీర్ఘకాలం తన ఉనికిని కాపాడుకోవడానికి చేయూత నిచ్చిన మహనీయుల జీవితాలను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**కీలక పదాలు** : 1. రావిచెట్టు రంగారావు 2. ఎం.ఎల్. నరసింహారావు 3. మాడపాటి హనుమంతరావు 4. ఆది రాజు వీరభద్రరావు 5. టి.ఉడయవర్లు

## శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం - కార్యదర్శుల కృషి :

### 1. రావిచెట్టు రంగారావు :

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపనలో ప్రథమ స్మరణీయులు రావిచెట్టు రంగారావు. భాషాభిమానం మిక్కిలిగాగల రంగారావు హైదరాబాదులో ఉన్న భాషావిషయక సంస్థలన్నిటిలో సభ్యత్వం తీసుకున్నారు. కొన్ని సంస్థలకు ఆర్థిక సహాయం చేశారు. 1897లో కొందరు మహారాష్ట్ర మిత్రులతో కలిసి దేశంలో మరేచోట లేని సంస్కృత భాండాగారాన్ని 'శ్రీ శంకర భగవత్పూజ్య పాద గీర్వాణ రత్న మంజుష' అనే పేరున సొంతంగా ఏర్పాటు చేశారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి, సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఇంతే గాకుండా ఈ గ్రంథాలయానికి చెందిన రెండువేల రూపాయల నిలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు.

రాజధాని నగరమైన హైదరాబాదులో తెలుగేతర భాషల గ్రంథాలయాలెన్నో ఉన్నా, ఒక్క తెలుగు గ్రంథాలయం కూడా లేకపోవడం అనే పెద్ద లోటును రంగారావు ముందుగా గ్రహించారు. ఈలోగా మునగాల రాజా నాయని వెంకట రంగారావు బహద్దూర్, వారి మంత్రి కొమర్రాజు లక్ష్మణరావు హైదరాబాద్ నగర సందర్శనకు రావటంతో రావిచెట్టు రంగారావుకు వారితో స్నేహం కుదిరింది. పండితోత్తముడు, మహాపరిశోధకుడైన కొమర్రాజు లక్ష్మణరావు సలహాను అనుసరించి తెలుగు భాషావికాసానికి కృషిచేయవచ్చునని రావిచెట్టు రంగారావు భావించారు. ఈ తరుణంలో విజయనగర సామ్రాజ్య సాహిత్య వైభవాన్ని కళ్ళకు కడుతూ తాజాగా రాబర్ట్ సీవెల్ రచించిన 'ఫార్గాటన్ ఎంపైర్' అనే ఆంగ్ల గ్రంథం వచ్చింది. దానిని ఈ మూర్తిత్రయం చదివి శ్రీకృష్ణదేవరాయల భాషాసేవకు, వారి కవితాశక్తికి, వారి ఆస్థానంలోని అష్టదిగ్గజాల కవితా సృజనకు ఉప్పొంగిపోవడం జరిగింది. ఈ ప్రభావంతో కొత్తగా వారు నెలకొల్ప సంకల్పించిన తెలుగు గ్రంథాలయానికి శ్రీకృష్ణదేవరాయల పేరును పెట్టాలని నిర్ణయించుకున్నారు. అట్లా ఇప్పటికి నూటా ఇరవై నాలుగు సంవత్సరాల క్రితం నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' రాంకోఠీలో గల తన బంగ్లాలో రావిచెట్టు రంగారావు స్థాపించారు.

ఈ గ్రంథాలయానికి తొలి అధ్యక్షుడిగా రాజా నాయని వెంకట రంగారావు బహద్దూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. ఎన్నికైన మరునాటి నుంచే రంగారావు తెలుగు గ్రంథాలయ ఆవశ్యకతను తెలుగు ప్రజానీకానికి వివరించి చెబుతూ మంచి గ్రంథాల సేకరణకు ఉపక్రమించారు. "రంగారావు ప్రతీరోజు ఉదయాన్నే స్నేహితులు, బంధువుల ఇండ్లకు వెళ్ళి భాషానిలయం లక్ష్యాలను తెలిపి వారిని సభ్యులుగా చేర్చేవారు. మొహమాటం లేకుండా సభ్యత్వ రుసుము వసూలు చేసేవారు. రంగారావుతోపాటు ఆయన పనివారు సైతం భాషానిలయం సభ్యులను వియ్యాలవారిని పిలిచినట్టుగా సమావేశాలకు తీసుకొచ్చేవారు. నల్గొండలోని దండంపల్లిలో వందల ఎకరాల సాగుభూమి, వరంగల్ జిల్లా ములుగులో వతన్దారీ, వ్యవసాయ భూములతో పాటు మున్సబ్దార్, జాగీర్దార్, వతన్దార్ వంటి బిరుదాలు ఉన్నప్పటికీ రంగారావు భాషాసేవకుడిగానే ప్రవర్తించారు. మాతృభాషా వికాసానికి ఒక స్వచ్ఛంద సేవకుడిగా కృషిచేశారు. తెలుగు మాట్లాడటాన్ని తక్కువగా భావించే వారికి మాతృభాషా పరిరక్షణావశ్యకతను వివరించడం, తెలుగులో మంచి పుస్తకాలు లేవని వెక్కిరించేవారికి భాషానిలయం నుండి పుస్తకాలు పంపించి చదువ మనడం రంగారావు నిత్యకృత్యాల్లో ఒకటి. గుమాస్తాకు తోడ్పడి రోజువారీ లెక్కలను రాయించడం, భాషా సమావేశాలు నిర్వహించడం ఆయన దినచర్య. భాషా నిలయానికి రంగారావు కార్యదర్శిగానూ, కార్యవర్గ సభ్యుడిగానూ, గణకుడుగానూ, గుమాస్తాగానూ, గ్రంథాధ్యక్షుడుగానూ చివరకు భృత్యుడుగానూ సేవలందించేవారు"

రంగారావు ఎందరో దాతల వద్దకు వెళ్ళి చందాలు వసూలు చేసి, ఆరువందల రూపాయలు నిలువ చేశారు. అప్పుడు కార్యదర్శిగా ఉన్న రంగారావు కోశాధికారిగా ఉన్నందున ఆ డబ్బుకు మామూలు వడ్డీ ఇచ్చేవారు. అయితే మద్రాస్ లో విదేశీయుల 'ఆర్బత్ నాట్ కంపెనీ'లో డబ్బుపెడితే వడ్డీ ఎక్కువ వస్తుందని భావించి అందులో గ్రంథాలయం సొమ్ము పెట్టారు. దురదృష్ట వశాత్తు ఆ కంపెనీ దివాలా తీయడంలో దాచిన సొమ్ము దయ్యాల పాలైనట్టు మొత్తం పోయింది. అయినా కూడా అధైర్యపడకుండా రంగారావు గ్రంథాలయానికి తెప్పించే పత్రికలను మాన్పించలేదు. గ్రంథాల కొనుగోలుకు వెనుకకుపోలేదు. తెలుగులో మంచి గ్రంథాలు లేవనే అసంతృప్తి వాదుల ఇంటికి మంచి గ్రంథాలను పంపించి చదివించేవారు. మాతృభాష పట్ల వారికి మమకారం పెరగడానికి దోహదం చేసేవారు. భాషానిలయంలో కేవలం హిందువులనే కాకుండా మహమ్మదీయులను, క్రైస్తవులను, ఇతర మతస్థుల వారిని కూడా సభ్యులుగా చేర్చుకున్నారు. భాషానిలయంలో మత విషయాల ఊసు లేకుండా కేవలం భాషా విషయాలే చర్చించేవారు.

ఇట్లా కేవలం కార్యదర్శి, కోశాధికారిగానే గాకుండా

రంగారావు భాషా నిలయంలో ఉపదేశకుడిగా, లేఖరిగా, ఒక్కొక్కసారి సేవకుడు తానై అన్ని పనులు ఒక్క చేతి మీదుగా చేసేవారు. అందరినీ భాషానిలయం అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే తలంపుతో రంగారావు ఐదేండ్లు కార్యదర్శిగా ఉంది తర్వాత 1907లో ఆ పదవికి రాజీనామా ఇచ్చి మరొకరికి ఆ బాధ్యత అప్పగించాలని కాంక్షించారు. అయినా భాషానిలయం అభివృద్ధికి తన చేయూత సదా ఉంటుందని హామీ ఇచ్చారు. అయినా కూడా రంగారావునే కార్యదర్శిగా సభ్యులందరు ఎన్ను కున్నారు. కాని దానికి రంగారావు ససేమిరా అంగీకరించ లేదు. అయితే చివరికి కోశాధికారిగా మాత్రం కొనసాగ డానికి వారు అంగీకరించారు. "భాషానిలయం కార్య దర్శిగా రంగారావు తప్పుకున్న తర్వాత సైతం ఏదైనా సభ ఏర్పాటు చేస్తే, తమ ఇంట్లో నౌకర్లను వెంట బెట్టుకుని, రెండుమూడు గంటల ముందే వెళ్ళి పనులన్నీ పురమాయించేవారు. ఆ తర్వాత వారే కార్యదర్శిని పిలిపించేవారు. అట్లా ఉండేది వారి పనితీరు."

భాషానిలయం అభివృద్ధికి, పాఠకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని రంగారావు ఏ నిర్ణయమైనా తీసుకునే వారు. కాబట్టి ఆయన మాటే వేదంలా ఉండేది. భాషా నిలయానికి పత్రికలు, కొత్త గ్రంథాలు తెప్పించినంత మాత్రాన మాతృ భాషాభివృద్ధి జరగదని భావించి భాషా నిలయానికి అనుబంధంగా ఒక పాఠశాలను నెలకొల్పి, క్రొత్త పద్ధతిలో చరిత్ర, భూగోళం, గణితం మొదలైనవి తెలుగులోనే బోధించాలని ఆలోచన చేశారు. దానికి సభ్యులు అంగీకరించారు. దానితో పది, పన్నెండు మంది విద్యార్థులతో ఒక పాఠశాల ప్రారంభించారు. కాని సభ్యులు చేసిన వాగ్దానాలు కేవలం వాగ్దానాలుగా మిగ లడంతో పాఠశాల నిర్వహణకు రంగారావు చొరవ తీసుకుని, చందాలకోసం తిరగవలసి వచ్చింది. విద్యార్థు లకు పలకలు, బలపాలు, పుస్తకాలు కొనిచ్చారు. అయినా కూడా ఆ పాఠశాల కేవలం 14 నెలలు మాత్రమే నడిచి మూతపడిపోయింది. ఈ విధంగా దాదాపు ఐదేండ్లపాటు వారు కార్యదర్శిగా ఉండి భాషానిలయం అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు.

**2. ఎం. ఎల్. నరసింహారావు :**

గాంధేయవాది, స్వాతంత్ర సమరయోధుడు, సాహిత్య మూర్తి, వాటిని మించిన గ్రంథాలయోద్యమకారుడు అయిన ఎం.ఎల్. నరసింహారావు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం కార్యదర్శిగా దాని విస్తరణ వికాసాలకు అవిశ్రాంతంగా పాటుపడిన మహనీయుడు. ఐదు దశాబ్దాల సుదీర్ఘకాలం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయానికి పర్యాయపదంగా, సంస్కృతాంధ్ర పండితు లకు, పరిశోధకులకు, కవులకు, కళాకారులకు, సంఘ సేవా పరాయణులకు, రాజనీతిజ్ఞులకు ఇంకా మరెందరికో సుపరిచితుడై నోట్లో నాలుకైన నిత్య కృషీవలుడు ఆయన. ఈయన పూర్తి పేరు మాదిరాజు లక్ష్మీనరసింహారావు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం వికాసానికి తొలి అరవై నాలుగేండ్లలో ఇరవై తొమ్మిది మంది కార్యదర్శులు కృషి చేశారు. 1965 నుంచి 2015 నవంబర్ మాసం దాకా ఏబై సంవత్సరాలు భాషానిలయం కార్యదర్శిగా ఒక్క చేయి మీదుగా అమృత్యోత్సవం, నవ శతాబ్ది ఉత్సవం, శతజయంతి ఉత్సవం, శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవాలు, నూతన భవన నిర్మాణం మొదలైన అనేక కార్యక్రమాలు నిర్వహించిన దార్శనికుడు ఎం.ఎల్. నరసింహారావు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో కవి సమ్మేళనాలు, ప్రముఖుల సాహిత్య ఉ పన్యాసాలు, గ్రంథావిష్కరణలు, సాహితీసదస్సులు, భాషానిలయం వార్షికోత్సవ సభలు మొదలైన అనేక సాహిత్య కార్యక్రమాలను ఆయన ఘనంగా నిర్వ హించారు. నాడు వారి చేతులమీదుగా సన్మానం పొందని అసలు సిసలు సాహితీవేత్తలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే లేరంటే అతిశయోక్తి కాదు.

ఎం. ఎల్. నరసింహారావు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా ఉన్నంత కాలం (1965 - 2015) ఆయన ఏ ఉద్యోగ పదవిలో ఉన్నా గ్రంథాలయ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతూ అంకితభావంతో సేవ చేశారు. కాలక్రమేణా హైదరాబాద్ నగరంలో ఆంధ్ర సారస్వత పరిషత్ (తెలంగాణ సారస్వత పరిషత్), రవీంద్రభారతి, సుందరయ్య విజ్ఞానకేంద్రం, హైదరాబాద్

నగర కేంద్ర గ్రంథాలయం వంటివి ఏర్పడి సభలూ సమావేశాలకు వేదికగా మారాయి. తర్వాత శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం పరిసర ప్రాంతాలన్నీ నిత్యం రద్దీగా వుండే వ్యాపార కేంద్రాలుగా తయారైన తర్వాత మెల్లమెల్లగా తన పూర్వ వైభవాన్ని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం కోల్పోతున్న దశలో ఎం. ఎల్. నరసింహారావు భాషానిలయం కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించి, భాషా నిలయానికి పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలను వెంటనే ప్రారంభించారు.

దానికి అనుగుణంగా ఆయా సాహిత్య సంస్థలతో కలిసి సంయుక్తంగా సాహితీ కార్యక్రమాలకు ఉచితంగా భాషానిలయాన్ని వేదిక చేసి తరచు సాహిత్యసభలను జరపడం ప్రారంభించారు. సుప్రసిద్ధ సాహితీవేత్తలనే గాక అప్పుడప్పుడే వెలుగులోకి వస్తున్న రచయితలను, కవులను ఆహ్వానించి భాషానిలయంలో ఉపన్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొన్ని సాహితీ సంస్థలకు నెలనెలా తమ కార్యకర్తల సమావేశాలను జరుపుకోడానికి తమ ప్రాంగణాన్ని పునఃప్రతిష్టించడానికి చర్యలు చేపడుతూనే వివిధ రచయితలు, కవులు, సాహితీవేత్తల నుంచి గ్రంథాలను సేకరించారు. మరికొన్ని గ్రంథాలను కొనుగోలు చేసి భాషానిలయం గ్రంథాలయాన్ని సుసంపన్నం చేశారు. గ్రంథాలయంలో కాలగమనంలో చెదురుమదురుగా పడిపోయిన పుస్తకాలను ఒక క్రమ పద్ధతిలో వ్యవస్థీకరించారు. వీటన్నిటితో పాటు నరసింహారావు మరో ముఖ్యమైన, చిరస్మరణీయమైన భాషా నిలయం ఆధునీకరణ కార్యక్రమానికి నాంది పలికారు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నెలకొల్పి 75 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని పెద్దఎత్తున వజ్రోత్సవాలను జరిపారు. నాటి ముఖ్యమంత్రిని, తదితర ప్రముఖులను ఆహ్వానించి భాషా నిలయం చరిత్రను, దాని సేవలను గురించి తెలియపరిచి దానిని పునరుద్ధరించవలసిన చారిత్రక అవసరాన్ని నొక్కి చెప్పారు. అంతేగాక భాషానిలయం పునరుద్ధరణకు సానుకూల నిర్ణయం తీసుకునేటట్లు చేయడంలోనూబీ ఈ ప్రయత్నంలో సాహిత్యాభిమాని, స్వయంగా సాహితీ వేత్త అయిన ఐ. ఎ. ఎస్. అధికారి కె. వి. రమణాచారిని భాగస్వాములను చేసి, నూతన భవన నిర్మాణాన్ని సాకారం చేయడంలో ఎం. ఎల్. నరసింహారావు కృషి, పట్టుదల ఎనలేనివి.

ఒకసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ నుంచి ఆంధ్ర సారస్వత పరిషత్ (తెలంగాణ సారస్వత పరిషత్) సొంతస్థలాన్ని పొందటంలో కె. వి. రమణాచారి అందించిన చొరవను ఎం. ఎల్. నరసింహారావు తెలుసుకొని, కె. వి. రమణాచారి వంటి అధికారి అండ దండలుంటే శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం కూడా కళకళలాడుతుందని భావించి ఎం.ఎల్. నరసింహారావు రమణాచారిని కలిశారు. ఆ సమయంలో కె.వి. రమణాచారితో మీరు సహకరిస్తే భాషానిలయం శతజయంతి వేడుకలు ఘనంగా జరుగుతాయని ఎం.ఎల్. నరసింహారావు అనడంతో "నావల్ల మీకు ఏదైనా మేలు జరుగుతుందంటే... అలాగే చేద్దాం" అన్నారు కె.వి.రమణాచారి.

కె.వి. రమణాచారి చొరవ ఫలితంగా శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం శతజయంతి ఉత్సవాల్లో స్వయంగా నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. భాషానిలయం చరిత్రను తెలుసుకొని నూతన భవన నిర్మాణం కొరకు 30 లక్షల గ్రాంట్ మంజూరు చేశారు. తర్వాత రాజా రాంమోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ వారు రూ. 25 లక్షలు మంజూరు చేశారు. భాషానిలయం కార్యదర్శి ఎం. ఎల్. నరసింహారావు కృషి వల్ల రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి జి. సంజీవరెడ్డి తన పార్లమెంటు సభ్యుడి నిధుల నుంచి రూ. 10 లక్షలు, ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి అధ్యక్షత లోని తెలంగాణ ప్రాంతీయ కమిటి నుంచి రూ. 5 లక్షలు లభించాయి. దీనితో అన్ని హంగులతో కూడిన ఆధునిక భవన నిర్మాణం జరిగింది.

భాషానిలయంలో సాహిత్య సభలు, సమావేశాలు అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడం, నాలుగు అంతస్తులు గల నూతన భవన నిర్మాణం, పాత వాటికి తోడుగా కొత్త పుస్తకాలను గ్రంథాలయానికి సమకూర్చడం,

వీటితోపాటు ఈ కొత్త భవనంలో ఒక అంతస్థును పూర్తిగా సాహితీమూర్తుల ఫొటోలతో ఒక గేలరీని ఏర్పాటు చేయడం మొదలైనవి నరసింహారావు భాషానిలయం అభివృద్ధికి, సాహిత్యసేవకు ప్రత్యక్ష నిదర్శనాలు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నిత్యకల్యాణం పచ్చతోరణంగా కళకళలాడాలనేది ఆయన నిత్యతపన. అందుకోసం ఎం.ఎల్. నరసింహారావు శ్రమించిన తీరు శ్లాఘనీయమైంది. ఇతరులకు ఆదర్శప్రాయమైంది.

### 3. మాడపాటి హనుమంతరావు :

తెలంగాణలో ఆంధ్రోద్యమ నిర్మాణానికి, గ్రంథాల యోద్యమ వ్యాప్తికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికీ ఎంతో కృషి చేసిన మహనీయుడు మాడపాటి హనుమంతరావు. ఆయన ఏ ఉద్యమాన్ని చేపట్టినా, ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా ఆయన ఎంతో పట్టుదల, కార్యదీక్ష, నిజాయితీతో నిర్వహించి విజయం సాధించేవారు. ఆంధ్రజన సంఘము, ఆంధ్రమహాసభ మొదలైన సంస్థలను స్థాపించి వార్షిక మహాసభలు, మహిళాసభలు నిర్వహించి తెలంగాణలో జాగృతిని, రాజకీయ చైతన్యాన్ని కలిగించడానికి ఆయన చేసిన కృషి చారిత్రాత్మకమైంది.

మొదట వరంగల్ లో ఉన్న హనుమంతరావు తర్వాత హైదరాబాదుకు వచ్చి నివాసం ఏర్పరచుకోగానే శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయంతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నారు. భాషానిలయంలోని తెలుగు, సంస్కృత పురాణ, వేదాంత గ్రంథాలతోపాటు ఆధునిక కావ్యాలు, నాటకాలు, కథలు, నవలలు, సాహిత్య విమర్శ, విజ్ఞాన శాస్త్ర గ్రంథాలన్నీ చదివారు. భాషానిలయంలో నిర్వహించే కవిపండితులు, సంగీత నాటక కళాకారుల ప్రసంగాలు, గోష్ఠి కార్యక్రమాలకు వారు క్రమంగా హాజరయ్యేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువతీ యువకులను ప్రేరేపించడానికి వీలుగా ఏర్పాటుచేసే తెలుగు ప్రముఖుల జయంతులు, వర్ధంతి కార్యక్రమాలు, పండితుల సత్కారాలు, గోష్ఠి కార్యక్రమాలతో ఎంతగానో స్ఫూర్తి పొందారు. తరువాత 1912లో భాషానిలయం సభ్యులుగా చేరిన హనుమంతరావు 1914 -15లో వారు భాషా నిలయం కార్యదర్శిగా, 1957 - 58 వరకు ఉపాధ్యక్షులుగా కొనసాగటమే గాక భాషా నిలయం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

మాడపాటి హనుమంతరావు కార్యదర్శి పదవిని చేపట్టగానే శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి సొంతభవన నిర్మాణం చేయాలని నిర్ణయించారు. వారి సంకల్పానికి తగినట్లుగానే దాతలు కూడా లభ్యమైనారు. భాషా నిలయం వ్యవస్థాపకులలో ఒకరైన రావిచెట్టు రంగారావు సతీమణి శ్రీమతి లక్ష్మీనరసమ్మ తన భర్త రంగారావు స్మృతిచిహ్నంగా మందిర నిర్మాణానికి 3000 రూపాయలు విరాళంగా అందించారు. దీనితో శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయానికి సొంత భవన నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. నూతన భవనం కోసం శ్రీమతి లక్ష్మీనరసమ్మ ఇంకా కొంత ధనం ఇవ్వటానికి అంగీకరించారు కాని, అంతలోనే దురదృష్టం కొద్దీ వారు మరణించి నారు. అయినా నిరుత్సాహం చెందక హనుమంతరావు ముందడుగువేసి అనేకమంది దగ్గర చందాలు వసూలు చేసి భాషానిలయానికి నూతన భవనం నిర్మించారు.

దీనికి ప్రముఖ సాహిత్య విమర్శకుడు, కవి అయిన కట్టమంచి రామలింగారెడ్డి 1921 సెప్టెంబర్ 30వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఈ భవనం నేటి ఆధునిక భవన స్థానంలో ఉండేది. అంతేగాక భాషానిలయం నిర్వహించిన మొదటి ఉత్సవమైన రజతోత్సవం, స్వర్ణోత్సవం, వజ్రోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడంలో మాడపాటి వారి పాత్ర మరువరానిది.

### 4. ఆదిరాజు వీరభద్రరావు :

నిజాం రాజ్యంలో తెలుగు భాషకు, సంస్కృతికి ఆదరణ లేని రోజులలో, తెలుగు భాష అభివృద్ధి కొరకు, తెలుగు సంస్కృతీ పునరుజ్జీవనం కోసం కృషి చేసిన మహనీయుడు ఆదిరాజు వీరభద్రరావు. తెలుగు చరిత్ర పరిశోధనలో, మాతృభాషాభివృద్ధిలో నిమగ్నుడై, తెలంగాణ ప్రాంతంలో చరిత్రగర్భంలో మరుగున పడిపోయిన అనేక నూతనాంశాలను వెలికి తీసి, తెలుగు జాతి చరిత్రకు మహోపకారం చేసిన మహామనీషి వీరభద్ర రావు.

1901 సెప్టెంబర్ 1వ తేదీన జరిగిన శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషా నిలయం స్థాపన సమావేశానికి హాజరైన అతిథులకు పిన్నవయస్కుడైన ఆదిరాజు వీరభద్రరావు తాంబూలాలు అందించడమే గాక, రావిచెట్టు రంగారావు ఆదేశానుసారం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం గ్రంథ పాలకుడిగా పని చేశారు. "వారే భాషా నిలయం తొలి లైబ్రేరియన్ అని శ్రీ తిరుమల రామచంద్ర ఆదిరాజు వారి భాషా సారస్వత సేవను గూర్చి వివరిస్తూ రాశారు." రావిచెట్టు రంగారావు 1910లో అకాలంగా మరణిం చడంతో ఆదిరాజు వీరభద్రరావుకు భాషానిలయం బాధ్యత మరింత పెరిగింది.

దీనితో ఆయన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో దాదాపు అరవై సంవత్సరాల కంటే ఎక్కువ కాలం సభ్యులుగా వుండి భాషానిలయం పురోభివృద్ధికి అపారమైన కృషి చేశారు. 1927లో వారు కార్యదర్శిగా ఉన్నప్పుడు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం రజతోత్సవం జరిగింది. ఈ సందర్భంలో ప్రచురించిన రజతోత్సవ ప్రత్యేక సంచికకు వీరభద్రరావు సంపాద కులుగా ఉండి సర్వాంగ సుందరంగా దానిని ప్రచు రించారు. తరువాత అనేక సంవత్సరాలు భాషానిలయం కార్యవర్గ సభ్యులుగా భాషానిలయం స్వర్ణోత్సవాలలో వారు నిర్వహించిన పాత్ర గొప్పది. స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక ప్రచురణలో వీరు అందించిన సహాయ సహ కారాలు మరువరానివి.

అంతేగాక ఆంధ్ర సారస్వత పరిషత్తు, విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశ సమితి, గోల్కొండ పత్రిక మొదలైన పలు సంస్థలు, పత్రికల నిర్వహణలో వీరభద్రరావు ముఖ్య పాత్ర పోషించారు. నాడు దక్కన్ రేడియోగా వ్యవహారంలో ఉన్న హైదరా బాద్ రేడియో కేంద్రం నుంచి తొలి తెలుగు ప్రసంగం చేసిన కీర్తి వీరభద్రరావుకే దక్కింది. 150 ప్రసంగాలు ఆకాశవాణి నుంచి ప్రసారమైనాయి. సురవరం ప్రతాపరెడ్డి. ఖండవల్లి లక్ష్మీరంజన, కొమర్రాజు లక్ష్మణరావు మొదలైన ప్రసిద్ధ పరిశోధకులకు సహాయకులుగా ఉండి పెక్కు చారిత్రక వ్యాసాలు, పరిశోధన గ్రంథాలు రచించారు. ఆదిరాజు వీరభద్రరావు రావిచెట్టు రంగారావు మరణించిన తరువాత వారి జీవితచరిత్ర రచించారు. అదే ఆయన రచించిన తొలి గ్రంథం.

ఈ విధంగా భాషా నిలయం అభివృద్ధి కొరకు, మాతృభాష అభివృద్ధి కొరకు, తెలుగు సంస్కృతీ వికాసం కొరకు కృషి చేసిన ఆదిరాజు వీరభద్రరావుకి "శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయంలో 1962 సంవత్సరంలో వీరి చిత్రపటావిష్కరణ, డా. ఎం. చెన్నారెడ్డిగారి అధ్యక్షత వహించగా ఈ తైలవర్ణ చిత్రపటాన్ని ఆంధ్ర పితామహులు ఆవిష్కరించినారు. 1972 జూలైలో శ్రీ వీరభద్రరావుగారికి భాషా నిలయంలో జరిగిన ఘన సన్మానం చిరస్మర ణీయం. ఇదే వారు హాజరైన చివరి సభ", వీరు 1973లో పరమపదించారు.

**5. టి. ఉడయవర్లు :**

ఆంధ్రజ్యోతి దిన, వార పత్రికలలో, జ్యోతిచిత్ర సినీ వారపత్రిక, ఆంధ్రప్రభ దినపత్రిక వార్తా విభాగాలలో సుమారు ఐదు దశాబ్దాలు వివిధ హోదాలలో పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ టి. ఉడయవర్లు. వీరు జర్నలిస్టుగా, సాంస్కృతిక వ్యవహారాల విషయంలో దీక్షాదక్షతలు గల వ్రాయసకారుడిగా సమకాలీన తెలుగు పత్రికా రచనలో ఉడయవర్లు అసమాన ప్రతిభా విశేషాలు సాధించారు.

వీరు వందలు, వేల సంఖ్యలో వ్యాసాలు, ఇంటర్వ్యూలు, సమీక్షలు రాశారు. ఒక నాయకుని వ్యక్తిత్వాన్ని విభజించడంలో, విశ్లేషించడంలో, వివరించడంలోనే గాకుండా ఎంతగానో గౌరవించబడ్డ సమస్త జీవితాన్ని అంతగానే చదివించే భాషా నైపుణ్యం, శైలీ మాధుర్యం, వాక్య నిర్మాణ దక్షత కలగలిపి రచన చేసే సిద్ధహస్తుడు టి. ఉడయవర్లు. మన తెలుగు సినిమా రంగంపై, దాని సమస్యలపై, దాని తీరుతెన్నులపై, దాని క్రమపురోగతిపై ఉడయవర్లు ఒక అథారిటీ. సినీరంగంపై ఆయన అసంఖ్యామైన వ్యాసాలు రాశారు. అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల దగ్గర నుంచి బాలల చలన చిత్రోత్సవాల వరకు, అక్కినేని దగ్గర నుంచి ఎన్.టి.ఆర్. దగ్గర నుంచి నిన్నమొన్నటి కళాకారుల వరకు ఆయన ఎందరిని గురించో పాఠకులకు కొత్త విషయాలు తెలియ జేశారు..

వృత్తిరీత్యా అవసరమైన థరోనెస్ మాత్రమే కాకుండా తెలుగు సంస్కృతి పట్ల అపారమైన మమకారం, అనురాగం వీరి రచనలలో కనిపిస్తాయి. మన సంస్కృతి, కళలకు సంబంధించిన వీరి రచించిన 'లోకాలోకనం' అనే వ్యాస సంకలనానికి 1991వ సంవత్సరపు 'సాహితీ పురస్కారాన్ని' పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అందించి సత్కరించింది. వీరు ప్రచురించిన చలన చిత్రాలకు సంబంధించిన 'తారాతోరణం' అనే వ్యాస సంకలనానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే 'నంది అవార్డు'లభించింది. తెలుగు భాషకు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2007 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషాసంఘం వారు 'భాషా విశిష్ట పురస్కారం' ప్రదానం చేసింది. చరిత్ర ప్రసిద్ధమైన హైదరాబాద్ నగర స్థాపన జరిగి 400 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కాలమ్ పెట్టి యేడాది పాటు ప్రతీ రోజు హైదరాబాద్ నగరంలోని నిర్మాణాలు, నగరాన్ని పాలించిన రాజులు, ఆ తర్వాత ప్రజాపాలకుల గురించి, ఇక్కడి పండుగలు పబ్బాలు సంస్కృతి గురించి ఆంధ్రజ్యోతిలో రాసిన సచిత్ర వ్యాసాలతో 'నమస్తే హైదరాబాద్' గ్రంథం 1996లో వెలువరించగా, ఈ గ్రంథాన్ని నాటి దేశ ప్రధాని పి.వి. నరసింహారావు ఆవిష్కరించారు.

ఇవి గాకుండా ఆంధ్రజ్యోతి ప్రచురించిన విశేషమైన సచిత్ర గ్రంథం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ'లో కొన్ని అధ్యాయాలు రచించడంతో పాటు దానికోసం రాష్ట్రమంతా పర్యటించి ఎంతో సమాచారాన్ని సేకరించి ఫొటోలు తీశారు. 1993లో ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు సప్తతిలో ప్రవేశించిన సందర్భంగా మిత్రుడు - భగీరథతో కలిసి 'నిత్య నూతన కథానాయకుడు' అనే గ్రంథాన్ని రచించారు. 2012లో 'పత్రికారంగంలో తెలుగు ప్రముఖులు' అనే గ్రంథాన్ని వెలువరించారు. 2015లో తెలంగాణ ముద్దుబిడ్డ 'జె. వి. నర్సింగరావు జీవిత చరిత్ర' రచించారు. పలువురు దివంగత ప్రముఖులకు నివాళిగా 'తీపిగురుతులు' అనే గ్రంథాన్ని వెలువరించారు. ప్రతి తెలుగువాడు తెలుసుకోవలసిన, పరిరక్షించుకోవలసిన తెలుగు సంస్కృతి, కళల సర్వస్వం - 'దేశభాషలందు తెలుగు లెస్స' అనే ప్రతిష్టాత్మకమైన గ్రంథానికి రూపకల్పన చేసి వ్యాసాలన్నింటిని రాశారు. అంతేగాక దాదాపు 30 ప్రత్యేక సంచికలు సంపాదకత్వం వహించారు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి సుమారు అర్ధ శతాబ్దిపాటు కార్యదర్శిగా భాషానిలయానికి సేవ చేసిన ఎం. ఎల్. నరసింహారావు తరువాత టి. ఉడయవర్లు భాషానిలయం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. వీరు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అంతే స్థాయిలో అనేక సాహిత్య, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి భాషానిలయం అభివృద్ధి కోసం ఎంతగానో పాటుపడుతున్నారు. భాషానిలయం కార్యదర్శిగా వీరు ఉచ్ఛ్వాస, నిశ్వాసాలతో తెలుగు భాషాభివృద్ధికి, సంస్కృతీ వికాసానికి కృషి చేస్తున్న మహోన్నత వ్యక్తి.

భాషానిలయం ప్రచురించిన 'మన ఎమ్మెల్', 'దాశరథి స్మృతి', 'నీరాజనం' 'బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములు' 'శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక పంచశతాబ్ది ఉత్సవ ప్రత్యేక సంచిక', 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం 118వ స్థాపన దినోత్సవ ప్రత్యేక సంచిక' మొదలైన సంచికలకు సంపాదకత్వం వహించారు. అంతేగాక భాషానిలయం ప్రచురించిన 'హైదరాబాద్ రాష్ట్ర ప్రథమ ప్రజా ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణరావు జీవిత చరిత్ర', 'మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర', 'రావిచెట్టు రంగారావు జీవిత సంగ్రహం' అనే పుస్తకాలను స్వయంగా రచించారు. వీటితో పాటు తెలంగాణ చారిత్రక, తెలుగు భాషా విశేషాలు కలిగిన స్వాతంత్ర్య సమరయోధులు నూతి శంకరరావు, కేశరాజు చంద్ర ప్రకాశరావుల ఇంటర్వ్యూలను వీరు అక్షరబద్ధం చేశారు. వీటిని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం చిరు పుస్తక రూపంలో ప్రచురించింది. ఈ విధంగా శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం అభివృద్ధికి, తెలుగు భాష అభ్యున్నతికి వీరు చేస్తున్న కృషి ఎనలేనిది.

**ముగింపు :**

124 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నిర్వహణలో కార్య దర్శులతో పాటు అధ్యక్షుల,ఉపాధ్యక్షుల కృషి కూడా అధికంగా ఉంది. కొండా వెంకట రంగారెడ్డి, అక్కినేపల్లి జానకి రామారావు, మాటేటి రామప్ప తదితరులు నిరం తరం భాషానిలయం అభివృద్ధికి పాటుపడ్డారు. అదే విధంగా భాషానిలయం మీద అభిమానంతో కొందరు ప్రముఖులు విశేషమైన తోడ్పాటును అందించారు. అందులో కొమరరాజు వెంకట లక్ష్మణరావు, రాజా పార్థ సారథి అప్పారావు, రావిచెట్టు లక్ష్మీనరసమ్మ తదితరులు ఉన్నారు. భాషానిలయం అభివృద్ధికి, విస్తరణ వికాసాలకు కృషిచేసిన మహనీయులు ఎంతోమంది ఉన్నారు. కరణం రామ చంద్రరావు, అవ్వా సత్యనారాయణ రావు, పప్పు సోమసుందరం, ధర్మవరం గోపాలచార్యులు, రాజా మొదలియార్, సింగం పెరుమాళ్ళు నాయుడు, పింగళి కోదండ రామరెడ్డి, వేలూరి రంగధామ నాయుడు, సురవరం ప్రతాపరెడ్డి, ఇల్లిందల సీతా రామారావు, శ్రీమతి రంగమ్మ ఓబులరెడ్డి, వల్లూరి సూర్య నారాయణ రావు, బిరుదురాజు రామరాజు, కాళోజీ నారాయణ రావు, పర్సా వెంకటేశ్వరరావు, సూరి భగవంతం, డా.పి.వి. రమణయ్య, వెల్దుర్తి మాణిక్యరావు, ఎన్ వెంకటేశం, కొమరగి సీతారామారావు, జొన్నలగడ్డ శోభనాద్రి శాస్త్రి, నాంపల్లి గౌరీశంకర్ వర్మ, పాలడుగు వెంకట రామశర్మ, వారణాసి సుబ్బారావు, పెద్ది నరసయ్య, కస్తూరి కిషన్ రావు, రావాడ సత్యనారాయణ, బిదురు వెంకట శేషయ్య, బి. విశ్వనాథం, వరహాల భీమయ్య, కలువకొలను వెంకటరామయ్య, కె.వి. భూపాలరావు, పోతుకూచి సాంబశివరావు మొదలైనవారు అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం అభివృద్ధికి కృషి చేశారు. తద్వారా తెలుగు సాహిత్య అభివృద్ధికి వీరు విశిష్టమైన సేవలు అందిం చడమే గాక భాషానిలయం నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ చరిత్రలో మహిళలు వహించిన పాత్ర కూడా గణనీయమైంది. భాషా నిలయం నిర్వహించిన రజతోత్సవం, స్వర్ణోత్సవం, వజ్రోత్సవం, అమృతోత్సవం, నవ దశాబ్ది ఉత్సవం, శత జయంతి ఉత్సవం, శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవం, 118 వ స్థాపన దినోత్సవాల్లో ఏర్పాటు చేయబడిన సదస్సుల్లో, కవి సమ్మేళనాల్లో విదుషీ మణులు, కవయిత్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇల్లిందల సరస్వతీ దేవి, సత్తిరాజు రాజ్య లక్ష్మీదేవి, బూర్గుల అనంత లక్ష్మీదేవి, భారతీ రత్నాకరాంబ, రంగ నాయకమ్మ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, సంగం లక్ష్మీ బాయి, ఇల్లిందల సుజాత, ఎల్లాప్రగడ సీతాకుమారి, పురం రుక్మిణమ్మ, తడకమళ్ల ఆండాళ్లమ్మ (బేతవోలు రాణి), నందగిరి ఇందిరాదేవి, కనకవల్లి అమ్మాళ్, దుల్లా శారదాదేవి, ఎ. శ్యామలాదేవి, ఇ. వసుమతీరెడ్డి, కొండా శకుంతలాదేవి, ఎం. వి. విజయలక్ష్మి, బొజ్జం లక్ష్మీ నరసమ్మ, పందిటి సత్యవతీబాయి మొదలైన వారు కార్యకర్తలుగా, పోషకులుగా వికాస విస్తరణలకు సేవ లందించారు. ఈ విధంగా ఎంతోమంది మహనీయులు, ఎందరో మహానుభావులు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం అభివృద్ధికి, తెలుగు భాషా సాహిత్యాలకు, సంస్కృతి సంప్రదాయాలకు ఎంతగానో కృషి చేశారు.

**ఆధార గ్రంథాలు :**


1. అంజయ్య, పుట్టపాక. (1996). నూరేండ్ల ఆంధ్ర భాషానిలయం రాజ రాజ నరేంద్ర భాషానిలయం. హనుమకొండ. వరంగల్లు: రాజ రాజనరేంద్ర భాషానిలయం ప్రచురణ.
2. ఉడయవర్లు, టి. (సం.) (2009). శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవ సంచిక. హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ప్రచురణ.
3. ఉడయవర్లు, టి. (2021). మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర. హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రచురణ.

4. ఉడయవర్లు, టి. (2021). రావిచెట్టు రంగారావు జీవిత సంగ్రహం. హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రచురణ.
5. ఉడయవర్లు, టి. (2022), బూర్గుల రామకృష్ణారావు సచిత్ర సంక్షిప్త జీవితం, హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రచురణ.
6. జితేంద్రబాబు, కె. (2005). నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు, మొదటి సంపుటి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి ప్రచురణ.
7. జితేంద్రబాబు, కె. (2005). నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు, రెండవ సంపుటి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి ప్రచురణ.
8. నరసింహశాస్త్రి, మైలవరపు. (2022). శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రవర్ధమాన చరిత్ర, హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రచురణ.
9. నరసింహారావు, ఎం.ఎల్. (సం.) (1975). శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం అమృతోత్సవ సంచిక. హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ప్రచురణ.
10. నరసింహారావు, ఎం.ఎల్. (సం.) (2002). శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం శతాబ్ది ఉత్సవ సంచిక. హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ప్రచురణ.
11. నారాయణరావు, కోదాటి. (సం.) (1963). శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం వజ్రోత్సవ సంచిక. హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రచురణ.
12. ప్రతాపరెడ్డి, సురవరం. (సం.)(1927). శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం రజతోత్సవ సంచిక, హైదరాబాద్: శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ప్రచురణ.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# సంఘ సంస్కరణలో వేగుచుక్క వీరేశలింగం



- డా॥. ఎన్. ఎం. తారకేశ్వర్

ఆంధ్రోపన్యాసకులు, శ్రీసాయి డిగ్రీ కళాశాల, గుత్తి, అనంతపురం జిల్లా.

## సంస్కరణలో వీరేశలింగం :

భారతీయ సమాజాన్ని జైన బౌద్ధాలు ఒక కదుపు కుదిపి మార్పును తెచ్చాయి. అయినా మరికొనిన శతాబ్దాలు గడిచేసరికి గుప్తుల కాలంలో జరిగిన పునరజ్జీవన ప్రక్రియకు దారితీసింది. కావ్య పురాణ ఇతిహాస రచనా వికాసం జరిగింది. ఇలా జరిగిన మార్పులకు పునరుజ్జీవనానికి భాషే మూలమైంది. ఏ మార్పు అయినా రావాలంటే ప్రజల ఆలోచనలో మార్పు రావాలి. దాని ద్వారా మనస్తత్వాలలో మార్పు కలగాలి. అలా మనస్తత్వాలలో మార్పును కలిగించగలిగేది, మనసును కదిలించే సాహిత్యమే. సాహిత్యానికి కదలిక భాష ద్వారా, వివిధ సాహిత్య ప్రక్రియల ద్వారా వస్తుంది. ఇలా పందొమ్మిదవ శతాబ్దం వరకు భారతదేశంలో జరిగిన, కలిగిన మార్పంతా ఒక సంకుచిత పరిధిలో జరిగింది. అందుకు మన తెలుగుసీమ కూడా అపవాదమేమీకాదు.

అయితే 9వ శతాబ్దంలో ఆంగ్లేయుల పరిపాలన భారతదేశంలో స్థిరపడిన తరువాత అనేక కారణాల వలన విద్యావంతులు ఆంగ్ల విద్యను నేర్చుకున్నారు. దేశంలో సంస్కరణోద్యమాలు తలెత్తాయి. ఆ సంస్కరణోద్యమాలు భారతీయ రక్తంలోనే సంస్కరణ సంప్రదాయం యిమిడి ఉంది. సరిగా ఇలాంటి నేపథ్యంలో వీరేశలింగం ఉద్భవించాడు. 19వ శతాబ్దం ప్రారంభం సంస్కరణోద్యమాల తొలి అడుగు. ఇది 1800 నుండి 1870 వరకు అంటే వీరేశలింగం యువకుడై రంగం మీద కాలిడే వరకు కొనసాగింది. అటు తరువాత తన ముందు వారు బీజప్రాయంగా వేసిన సంస్కరణ వృక్షాన్ని వీరేశలింగం మహావృక్షం చేసి పువ్వులు పూయించి, కాయలు కాయించరు. వీరేశలింగం సంస్కరణోద్యమం మూడు విభాలుగా ఉన్నది. మొదటది భాషా సంస్కరణ, రెండవది స్త్రీలను అభివృద్ధి పథం వైపు ప్రయాణం చేయించటం, మూడవది నీతికి సంబంధించినది.

ఇందులో మత, ధర్మ, కర్తవ్య నిర్వహణ వంటి ప్రజాప్రవర్తనకు సంబంధించిన విషయాలన్నీ ఉన్నాయి. ఈ మూడు రకాలైన సంస్కరణలకు ఆయన స్పష్టమైన రూపాన్ని ఇచ్చాడు. ఈ భావాలు ప్రబలశక్తి లభిస్తుంది. ఇతరులలో అస్పష్టంగా ఉన్న భావాలకు ఒక నిర్దిష్టమైన దిశను కలిగించటానికి వ్యూహాన్ని రచించాడు. అందుకు మాధ్యమం భాషేనని గ్రహించాడాయన. ఈ భాష ద్వారా భావాలు అందరికీ చేరాలంటే అందులోనూ అసలు విద్యలేని వారికి, అల్ప విద్యావంతులకు చేరటానికి ఎంత

సులభమైన భాష అయితే అంత మేలు. కానీ ఆ కాలం నాడు భాష చాలా జటిలంగా ఉంది. గొడ్డు గ్రాంధికంగా సంస్కృత భాషా భూయిష్టమై ఉన్నది. పైగా కొందరికి భాష ఎంత కఠినంగా ఉంటే అంత గొప్ప సంస్కార మనుకొనే ఆలోచనలు ఉన్నాయి. ఇలాంటి భాష వలన ప్రయోజనమేనని తనకు తాను ప్రశ్నించుకొని దానికి జవాబులు తానే చెప్పుకొని, భాష అందరికీ తెలిసేటట్లు సులభంగా ఉండాలి. సులభశైలిలో రచించాలనే అభి ప్రాయాన్ని దృఢం చేసుకొన్నాడు. అవసరమైతే విషయా లకు అనుగుణంగా గ్రామ్యాభాష వ్యవహారిక భాషనే వీరేశలింగం ఆ రోజుల్లో గ్రామ్యభాష అనేవారు. సంస్కరణ గురించి తన భావాలు బాహుళ్యంలోకి వ్యాపించటానికి భాష నుంచే మొదలుపెట్టాడు. ఏ సమాజంలోనైనా సగం స్త్రీ. కాబట్టి సమాజ అభ్యుదయానికి మహిళ ప్రగతి ఒక కొలబద్ద. స్త్రీ జాతిని ఉద్ధరించాలని ఆయనకు సంకల్పం కలిగింది. దీనికి పరిష్కారమార్గాన్ని ఆలోచించాడు. సకల అనర్థాలకు మూలం స్త్రీకి విద్య లేకపోవటమేనని, దీనికి పరిష్కారం స్త్రీ విద్యావ్యాప్తి అని ఆయన భావించాడు.

వీరేశలింగం గారి ఆలోచనలు రాజమహేంద్రవరానికే పరిమితం కాలేదు. అది క్రమంగా ఆంధ్రదేశమంతా వ్యాపించింది. ఎందరో విద్యార్థులు, విద్యావంతులు వీరేశలింగం అభిప్రాయాలను తమ జీవితాల్లో ఆచరణలో పెట్టడానికి సిద్ధం అయినారు. సమాజంలో నీతిని ప్రవర్తిల్ల చేయటం, దీనిని సాధించానికి తన భావాలు ప్రకటించ డానికి ఒక బలమైన మాధ్యమం అవసరమని భావించా డాయన. అందుకే 1874 అక్టోబరులో 'వివేకవర్ధిని' పత్రికను స్థాపించాడు. అనేక సద్గుణాలను మనుష్యులు వాటిని పెంచుకొనవలసిన పద్ధతులను గురించి ఆయన 'వివేకవర్ధిని'లో ఎన్నో వ్యాసాలు రాశాడు. ఆ వ్యాసాలు మానవ జీవితంలో ఎంతో ప్రభావితం చేశాయి. కేవలం పత్రికలలో వ్రాతలే గాక, ఆయన మౌఖిక ఉపన్యాసాలలో సంస్కారవంతమై నడవడిక ఉండాలని ఆయన నొక్కి చెప్పటం సంఘంలో వ్యక్తిగత నైతికత మీద ఆయన ప్రజలలో తన భావాలను వ్యాప్తి చేయడం కనిపిస్తుంది.

వ్యక్తిగతమైన నైతిక ప్రవర్తన మీద మతానికి బలమైన ప్రభావం ఉన్నది. మతానికి వ్యక్తి పాటించే అలవాట్లు, ఆచారాలు, ఆలోచనా విధానాల మీద చాలా ప్రభావ మున్నది. అందుకే క్రమంగా ఆయన ఆలోచనలు ప్రజలలో మతాన్ని గురించిన భావాలలో మార్పు తీసుకుని రావాలనే అంశం వైపు మళ్ళాయి. దానిని సాధించాలనే ఆయన బ్రహ్మసమాజం వైపు దృష్టి మరల్చాడు. మతానికి, సమాజానికి అవినాభావం సంబంధం ఉన్నది. సాంఘిక రుగ్మతలన్నింటికీ దురాచారాలన్నింటికి మతపరమైన వివరణ ఒకటి ఉండనే ఉంటూ వచ్చింది. కాబట్టి మతాన్ని సంస్కరించకపోతే సంఘ సంస్కరణ, తద్వారా వ్యక్తిత్వ కుదరదని ఆయన భావించాడు.

మత సంస్కరణ అంటే మతానికి వ్యతిరేకం అనేది నాటి భావన. మతం పేరిట జరిగే దుర్నీతి, అన్యాయాలను మత మౌఢ్యాన్ని తొలగించటమేనని ఆయన అభిప్రాయం. ఉపనిషత్తులు ప్రతిపాదికమైన సిద్ధాంతం బ్రహ్మ సమజానికి మూలం. తెలుగుసీమలో రఘుపతి వెంకటరత్నంనాయుని సహాయంతో బ్రహ్మసమాజాన్ని వీరేశలింగం ఆంధ్రదేశంలో పాదుకొలిపాడు. దానితో ప్రజల్లో ముఖ్యగా యువకుల్లో ఆలోచనలు పెంపొం దాయి.

లంచాలు స్వీకరించటం, సామాన్యులను దగ్గరకు రానివ్వకపోటం మొదలైన లక్షణాలను తూర్పారబట్టాడు. చిత్రపు కామరాజు, పోటూరి శ్రీరాములు వంటి వారు 'వివేకవర్ధిని' సృష్టించిన ప్రచండ ఝంఝూంమారుతంలో ప్రాణాలు కోల్పోయారు. పరవస్తు వెంకటరంగాచార్యులు పునర్వివివాహ సంగ్రహమనే పేరుతో స్త్రీ వివాహం శాస్త్రసమ్మతేమనని 1875లో ఒక చిన్న పుస్తకం వ్రాసి ప్రచురించారు. ఇది ప్రజలలో కొంత అలజడిని సృష్టిం చింది. అప్పటికే స్త్రీ విద్య కోసం తనవంతు కృషి వీరేశ లింగం చేస్తున్నాడు. మొదటి స్త్రీ బాలికా పాఠశాల ధవళేశ్వరంలో ప్రారంభమైనది. తమ అమ్మాయిలను చాలామంద పాఠశాలకు పంపసాగారు. పునర్వివాహ విషయంలో ఏదో ఒకటి చేయాలని ఆయన మీదకు చల్లపల్లి బాపయ్య ఒత్తిడి తెచ్చేవాడు. 1879 ఆగష్టు నెల 3వ తేదీన రాజమండ్రిలో మొట్టమొదటి స్త్రీ పునర్వివాహ

సమర్థన సభ జరిగింది. సభలో సంప్రదాయవాదులకు ఎదురు నిలిచి, తన వాదనను వినిపించాడు వీరేశలింగం. ఆంధ్ర దేశమంతా ఈ విషయంలో ఉడికిపోతుంది. కొంతమంది ఆయనను దైహికంగా బాధించాలని ప్రయత్నించారు. మద్రాసులో స్త్రీ పునర్వివాహ సమర్ధన చేస్తూ ఉపన్యాసం ఇస్తున్న సమయంలో కొంతమంది ఇబ్బంది పెట్టేవారి నుంచి వీరేశలింగాన్ని కాపాడ ప్రయత్నం చేశారు. 'స్త్రీ పునర్వివాహ సమాజం' అనే పేరు పెట్టి అందుకు కృషి చేయటానికి వీరేశలింగం పూను కున్నాడు. మిత్రులైన చల్లపల్లి బాపయ్య, బసవరాజు గవర్రాజు, ఏలూరి లక్ష్మీనరసింహం మొదలైన వారితో సమాజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

విద్యార్థులు మద్దతుగా నిలిచారు. యువకులు ముందుకు వచ్చారు. భారతదేశంలో మొట్టమొదటి వితంతు వివాహం 1856లో వంగదేశంలో జరిగింది. మహదేవ్ గోవింద రనడే వంటి వారి కృషి వల్ల ప్రాంతాలలో అరుదుగా ఇలాంటి వివాహాలు జరుగుతున్నాయి. వితంతు పునర్వివాహ చట్టం 1856లోనే ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషి వల్ల వచ్చింది. ఈ విషయకంగా చెన్నై రాజధానిలో 1880 వరకు ఎటువంటి కార్యక్రమం జరుగలేదు. అదే సమయంలో వీరేశలింగాన్ని కులం నుంచి వెలివేయాలని కొంతమంది ఛాందసులు ప్రయత్నించారు గాని కుదరలేదు. రాజమండ్రిలో 1881 డిసెంబర్ 11వ తేదీన మొదటి వితంతు వివాహం జరిగింది. ఇది దక్షిణాదికే మొదటిది. వితంతు పునర్వివాహాల విషయంలో కొంతమంది ఆర్థికంగా వీరేశలింగాన్ని మోసపుచ్చారు. ఆయోగ్యుల పునర్వివాహాలను ఆయన సమ్మతించలేదు. ఈ వివాహాలను ఎక్కువగా బ్రాహ్మణ, వైశ్య వర్ణాలకే పరిమితం చేశాడు. బలవంతమైన వైధవ్యం ఈ వర్ణాలలోనే ఉంది కనుక. ఆత్మూరి లక్ష్మీనరసింహం వల్ల, కేశవచంద్రసేనుని గ్రంథాల ప్రభావం వల్ల వీరేశలింగం బ్రహ్మసమాజం వైపు నడిపాడు.

జాతయ పునరుజ్జీవనానికి బ్రహ్మ సమాజమే మొదటి కారణం. 1881 లో పండిత శివనాథ శాస్త్రి రాజమండ్రికి వచ్చి ఉత్తేజ పూరిత బ్రహ్మసమాజపు ఉపన్యాసాలు ఇచ్చాడు. వివిధ పనుల ఒత్తిడుల వలన, కారణాల వలన వీరేశలింగం బ్రహ్మమతం తీసుకోలేదు. ఇప్పుడు ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాడు. బ్రహ్మసమాజంలో చేరటానికి ఆయనకు ఎటువంటి అడ్డంకులు లేవు 1905లో పండిత హేమనాథ్ సర్కార్ రాజమండ్రికి వచ్చినప్పుడు తన తండ్రి అబ్దికాన్ని బ్రహ్మసమాజ పద్ధతిలో చేద్దామనుకొంటున్నట్లుగా తాను కూడా బ్రహ్మోగా మారదలచినట్లు చెప్పాడు. ఆ విధంగానే చేశాడు. తరువాత క్రైస్తవులు మొదలైన అన్ని జాతుల వారితో కలిసి సహపంక్తి భోజనం చేశాడు.

బ్రహ్మ సమాజ మార్గంలోకి వెళ్లిన తరువాత వీరేశలింగం అనేక కష్టాలు ఎదుర్కొన్నాడు. వీరేశలింగం భార్య రాజ్యలక్ష్మమ్మ గారు మొదట్లో విగ్రహారాధకురాలే! క్రమంగా విగ్రహారాధనలో నమ్మమం సడలింది. ఆమె ప్రతివారం చుట్టుప్రక్కల ఇళ్ళలలోని స్త్రీలను సమావేశ పరచి ఏకేశ్వరోపాసనను ప్రోత్సహించింది. స్వయంగా దానికి సంబంధించిని కీర్తనలు పాడేది. ఆ రోజుల్లో మద్రాసు, రాజమండ్రిలో తప్ప స్త్రీలకు ప్రత్యేక ప్రార్థనా మందిరాలు ఇంకెక్కడా లేవు, వితంతు శరణాలయంలో వారిని ప్రతి శనివారం వెంట బెట్టుకొని తీసుకొని వెళ్లి ప్రార్థనలో పాల్గొనేటట్లు చేసేది. వీరేశలింగం స్థాపించిన ప్రార్థనా సంఘానికి కొందరు స్త్రీలు, భర్తలకు తెలియకుండా గుప్తదానాలు చేశారు. ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజ శాఖలు ఏర్పడ్డాయి. వీటి ద్వారా సాంఘిక సంస్కరణల వ్యాప్తి జరిగింది. విగ్రహారాధనను ఖండించింది. భగవంతుడు ఒక్కడే అని ప్రచార చేశారు. వర్ణాశ్రమ ధర్మాలు ఖండించారు. ఉపకుల విభజనలు వ్యతిరేకించారు. వేదాలు, బైబిల్ మొదలైన మతగ్రంథాలు నిజం కాదని వాటిలో అద్భుత కృత్యాలను నమ్మరాదని వీరేశలింగం ఉద్ఘాటించారు. అయితే సంప్రదాయవాదులు ఆయనను నాస్తికుడు అన్నారు. అయినా వీరేశలింగం జంకకుండా తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగిపోయాడు. సమాజాన్ని నవయుగ మార్గం వైపు

పయనింపజేశాడు ఆయన ఆరాధన సామూహికమైనది. వీరేశలింగం బీజప్రాయంగా మొదలుపెట్టిన భాషా సంస్కరణోద్యమం, గురజాడ, గిడుగుల ద్వారా వ్యవహారిక భాషోద్యమంగా రూపుచెందింది. గిడుగు దానికి ముందుండి వ్యవహారిక భాషోపయోగానికి ఆయన చివరిరోజుల్లో వీరేశలింగాన్ని ఒప్పించాడు. ఈ విషయాన్ని అంగీకరించటం వల్లనే మొత్తం తెలుగు భాషకు నవ్యాంధ్ర వ్యాకరణం అవసర మని ఆయన భావించాడు. దానికి రచన మొదలుపెట్టి కొంత వ్రాశాడు. ఇంతలోనే ఆయనకు సమయం మించి పోయింది.

**ఆధార గ్రంధాలు :**

1) తెలుగు సాహిత్య - సమీక్ష, రెండవ సంపుటము, డా॥. జి. నాగయ్య.

2) భారతి సాహిత్య మాసపత్రిక, సెప్టెంబర్, 1984.

★★★

Vol. 22 | Issue 9 | September 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# Political Ideas of Kautilya



***- Govinda Raju K***

Research scholar, Department Of Sanskrit, Bangalore University, Bangalore.

**Abstract :**

Kautilya was the Prime Minister of Chandragupta Maurya, the founder of the Mauryan Empire, who defeated the Greek ruler Seleukos and the mighty Nandas whose empire stretched over a large part of eastern India. Political thoughts of Kautilya are summarized in a book he wrote known as the Arthashastra, a Sanskrit name. „Arthashastra can be explained as „Science and art of politics and diplomacy. Kautilya s Arthashastra is magnificent work on ancient political thought which was undoubtedly composed between 3rd -2nd century B.C. In his political and administrative ideas, the focus of attention was the king. Kautilya used power as a tool to control his society as well as his enemies. He aslo believed that it is the king s duty to seek material gain, spiritual good and pleasures. Kautilya thinks that for a king to attain these three goals must create wealth, have armies and should conquer the kingdoms and enlarge the size of his state. He thought that for the smooth functioning of administration and for the welfare of the people, the king had to be acquainted in the four vedas and four sciences of government (Anviksiki, Trayi, Varta and Dandaniti). Kautilya proclaimed that politics was the supreme science and supreme art. In this paper, I have discussed elaborately Kautilya s political ideology.

**Key words :**

Kautilya, Politics, Arthashastra, War, Diplomacy, Mandala theory, State, War, Peace, Dharama,

**Objective of the Study :**

To study the political ideology of Kautilaya and its significance.

**Introduction :**

The Artha[stra is a masterpiece of Kautilya, who was one of India s greatest statesmen and philosopher. One of the eternal classics about arts of war and politics, the Artha[stra was written in the late fourth century BCE. When the Gupta dynasty collapsed in around 550 CE, the book disappeared and it again surfaced in

1904 only, more than 1400 years later. The first English translation, which had been completed in 1909 than it was followed by translations into German, Russian, and other languages in 1915 and the authorship of this book is also a point of contention.Kautilya is also known as Chanakya, and Vishnu Gupta is the other name that has been used to refer to him. The majority of academicians believe that Kautilya (or Chanakya) wrote Artha[stra and that it was written during the time of Chandragupta Maurya, the first Mauryan king (321-297 BCE). There was a significant time when Kautilya s Artha[stra reappeared. Although he was highly renowned for being a kingmaker, his precise thought had been missing. It was a revelation when Artha[stra was published at the beginning of the 20th century. It immediately drew analogies to some of the most notorious political works of the West due to its unrelenting teachings/ideas in the ambit of state making in anera of multi-polar rivalry. Max Weber directly stated that truly radical Machiavelli is expressed in the Artha[stra and it was written at the time when Christ was not even born. Kautilya was referred to as "the first major political realist of the World" by Dr Roger Boesche. Heinrich Zimmer labelled Artha[stra as the „first comprehensive compilation of the timeless laws of politics, commerce, diplomacy, and war in an effort to put it along withthe spectrum of human socio-political philosophy. The precision of its logic, the well-planned responsibilities and actions for the wise ruler are the things that distinguish Artha[stra from other texts. Also, it has been highlighted that Artha[stra may be the first important work on the nature of social and political economics, often known as macroeconomics, ever written. The Artha[stra is a book with enormous historical relevance since it sheds light on the clarity of thinking of one of the greatest political philosophers in the history of Indian civilisation. It might also prove to be a helpful resource for discussions of the current multi-state diplomatic situation. Artha[stra offers a practical guide on how to conquer the territory, how to maintain the boundaries of acquired territory or how to preserve it once conquered. The Artha[stra can be considered as a science and an art of statecraft of politics and administration to the extent that the practitioner must rely on wisdom and experience, guided by the broad principles and prescriptions offered by Kautilya. In this sense, the Artha[stra gives governments a plan on how to defend their own territory, seize other s territory. It includes both the state s domestic and foreign policies.

**Kautilya's political thought :**

- His political thought hovers around the prevalent idea of Kingship,i.e.,monarchy as a political order.
- The safety of their praja and especially women and the property of the subject was uppermost in his thought-process.
- King must abstain from arrogance and should not forget the dharma while enjoying worldly pleasure.
- Elaborate provision of the regulation of dissolution of marriages, desertion, remarriage, protection of dignity and chastity of women etc.
- State control over trade and other occupations and determined the rates of tax, profit and interests.

**Kautilya as political realist :**

- There is no gainsaying that Kautilya helped in the creation of might Mauryan Empire of its time and the credit for it goes to his realistic thinking.
- He was one of the most original thinkers of ancient India.
- His work on Arthashastra is nothing else but a work on political realism where the duty of the king is prescribed in no uncertain terms and go on to the extent to unleash the brutal means in order to defend kingdom.

**Political realism and Kautilya :**

- Relation among states follow the law of the fishes,i.e. Big fishes eats up little fishes.
- All states that border centre states are its enemies.
- States that border them on outside are their friends because enemy s enemies are friends.
- There is no everlasting relations between the states; and
- Right action is a priory rule to maintain the state.

means resorting to morally ambiguous tactics such as espionage, manipulation, or deceit. For Kautilya, the ruler s primary allegiance is to the state, and the state must be preserved by any means necessary. His political thought is heavily focused on the idea of sovereignty, with the ruler being the central authority who must uphold both the dharma (moral order) and artha (material prosperity) of the state. While Kautilya acknowledges the importance of ethics, his pragmatic approach often justifies actions that might be considered unethical in a conventional sense, especially when the welfare of the state is at stake.

**Kautilya's View of Law and Justice :**

Kautilya was not just concerned with the consolidation of power; he also believed in the importance of maintaining justice. In the Arthashastra, Kautilya defines justice as the rule of law that is meant to protect the citizens and maintain the stability of the state. The law, according to Kautilya, should be applied uniformly, and a ruler must not allow personal biases to cloud their judgment. However, Kautilyas view of justice is not based on idealism but rather on the practical need to maintain order. He argues that a ruler should use all means at their disposal—including surveillance, intelligence, and punishment—to ensure that lawbreakers are deterred, and peace is maintained. His legal system emphasizes both deterrence and the rehabilitation of criminals.

**Conclusion :**

Kautilya is one of the most renowned Indian political philosophers. Though, he lived a long time ago, Certain philosophies from his theory are still applicable in modern political frame work. The book, written in Sanskrit elucidates theories and principles of governing a state. Kautilya established an extremely vital imperative - governance, polity, politics and progress have to be linked to the welfare of the people. Covering various topics on administration, politics and economy. It is a book of law and a treatise on running a country which is pertinent even today. His philosophies remain prevalent today in In india.

**References :**


1. Kautilya, Arthashastra, translated by L.N. Rangarajan, Penguin Books, 1992.
2. Kautilya, Chanakya Neeti, translated by R. Shamasastry, Mysore University, 1941.
3. George Modelski, "Kautilya: Foreign Policy and International System in the Ancient Hindu World", The American Political Science Review, Vol. 58, No. 3. (Sep., 1964), pp. 549-560.
4. N.Siva Kumar & U.S. Rao, "Guidelines for Value Based Management in Kautilya s Arthshastra, Journal of Business Ethics, Vol. 15, No. 4 (April 1996), pp 415-423.
5. KaumiliyaC Artha[stram. The Arthasastra of Kautilya. Ed. by R. Shama Sastri, Mysore, Printed at the Government Branch Press, 1909. xxi, 429, 6 p. 23 cm
6. Roger Boesche, "Moderate Machiavelli? Contrasting The Prince with Arthshastra of Kautilya, Critical Horizons, 2002, Vol. 3 Issue 2, p253, 24p


★★★

# SPLTO & K.V.R. Jaya Lakshmi Educational Trust
## Dr. Sarvepalli Radhakrishnan National Prathibha Awards, 2025



ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న శ్రీ మామిడి రాము దంపతులు



ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న శ్రీమతి రాజనాల రాజేశ్వరి దంపతులు



ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న డా॥. మామిడి లింగయ్య

భావవీణ
September 2025

BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253

## SPLTO & K.V.R. Jaya Lakshmi Educational Trust
## Dr. Sarvepalli Radhakrishnan National Prathibha Awards, 2025




ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న
డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న డా॥. బూసి వెంకటస్వామి దంపతులు




ఎస్‌పిఎల్‌టిఓ & కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన భారతరత్న
డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు స్వీకరిస్తున్న డా॥. జి. సైలమ్మ దంపతులు

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com,
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 9494 660 509.